# తాళ్లపాకకవుల పదకవితలు

## భాషాప్రయోగ విశేషాలు




రచన:

**డాక్టర్ వేటూరి-ఆనందమూర్తి**

ఎం. ఏ., పిహెచ్. డి.,

రీడర్, తెలుగుశాఖ - నిజాంకళాశాల



హైదరాబాదు

1976







# తాళ్లపాకకవుల పదకవితలు

## భాషాప్రయోగ విశేషాలు

## (ద్వితీయ భాగము)


రచన

**డాక్టర్ వేటూరి-ఆనందమూర్తి**

ఎం. ఏ., పిహెచ్. డి.,

రీడర్, తెలుగుశాఖ—నిజాం కళాశాల,

ఉస్మానియా విశ్వవిద్యాలయము-హైదరాబాదు.

ప్రభాకర ప్రచురణము

ప్రథమ ముద్రణము - వేయి ప్రతులు.

మే, 1976. నల — వసంతము.

సర్వస్వామ్య సంకలితము.

ఆంధ్రప్రదేశ ప్రభుత్వ ఆర్థిక సహాయముతో ప్రకటితము.

TALLAPAKA KAVULA PADAKAVITALU
BHASHAPRAYOGA VISESHALU (Vol. II)

By, Dr. Veturi Anandamurthy, *M. A., Ph. D.,*
*Reader in Telugu, Nizam College (O. U.)*
Hyderabad, Andhra Pradesh, INDIA.

*Published by,*
Smt. V. CHANDRAKALA
Sri. V. PRABHAKAR

'SRI-NIVAS'
6/2RT (New) Vijayanagar Colony,
HYDERABAD-500028.

*Price* : Rs. 45/-

*Printed at*

CHANDRASEKHARA PRINTING WORKS,
Nampalli—HYDERABAD.

Copies can be had from the Publishers :

"SRI-NIVAS"
6/2RT (New) Vijayanagar Colony,
HYDERABAD—500028.

*and at*
SREE BHARATI ENTERPRISES,
H. No. 4. Housing Board Colony, Lala Pet,
HYDERABAD - 500040.

# మంగళాశంసన

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు

చిరాయుశ్రీ వేటూరి ఆనందమూర్తిగారు తమ పితృపాదులు అఖండ యశోమూర్తులైన ప్రభాకరులు నాందిపాడిన తాళ్ళపాక వాగ్గేయకార రచనా పరిశీలన కృషిని తలపోలము దాకించి ధన్యత గడించుకొన్నారు. అందులో కొంతభాగమును "తాళ్ళపాక కవుల కృతులు– వివిధ సాహితీప్రక్రియలు" అను పేర ఇంతకుముందు ప్రకటించినారు. ఇప్పుడు దానితరువాతి భాగముగా "తాళ్ళపాక కవుల పదకవితలు - భాషాప్రయోగవిశేషాలు" అని పేర్కొని ఈ పుస్తకము వెలువరచుచున్నారు. ఈ రెండునుగలిసి వేయిపుటలు బాగా దాటిన ఉద్గ్రంథాలు రెంటినీ పరిశీలింపగా మూడవభాగముగా ప్రకటింప వలసిన సరకుగూడ ఇంకా మిగిలించుకొన్నారేమో అనిపించును. ఈ రెండవ భాగమందును తాళ్ళపాకవారి రచనలే సర్వంకష ప్రమేయముగా వెలసినవి.

మొదటిభాగమునకు నా ఆశీరూపముగా సంతోషమును తెలుపుకొని యున్నాను. దీనికంత చాలక ఆశీస్సులతోగూడిన మున్నుడి కోరినారు శ్రీ ఆనందమూర్తి. అది నాయందాయనకుగల ప్రేమ విశ్వాసములకు గుర్తు. ఎంతవ్రాసినా చాలదనిపించే యీ రచనకు ఉపోద్ఘాతంగా ఎంత కొంచెం వ్రాస్తే అంత మంచిదనిపించును. ప్రకృత మంతే నేను చేయగలిగినది.

తమ్ముడివలె నన్ను ప్రేమతో మన్నించిన శ్రీ ప్రభాకరశాస్త్రిగారు అచింతితముగా అకాలసిద్ధినందుట, ఆచోటికి ఎంతో దూరమందున్న నన్నీడ్చి తెచ్చి వారి కార్యభారము నా నెత్తినవేసి కొంతకాలము సాగించుట– రెండూ శ్రీ శ్రీనివాసుల అనిర్వాచ్య సంకల్పాలు– పరిణతస్థితప్రజ్ఞామయులు శాస్త్రిగారే "పదేండ్లు విసుగు విరామాలు లేక పనిచేసినా ఈ వాఙ్మయరాశిని పూర్తిగా పైకెత్తగలనా ?" అని సందేహపడుచుండినవారు. వాఙ్మయమును అనేక దృక్కోణములతోచూచి చూపగల శక్త్యుత్సాహాలు వారివి. మితంపచములైనవి నాజ్ఞానుభవాలు. వారు స్వతంత్రముగా పరిశీలించి ప్రకటించిన 'తాళ్ళపాకవారి

గేయరచనము V సంపుటము'నందలి తీరు అవశ్యముగాగాని కొన్నేండ్లు నా చేతి పరిశోధన సాగింది. ఆ పని నేనుద్యోగము మానుకొన్నతర్వాతనైనా అనుక్రమంగా సాగించే ఇప్పటికి సంకీర్తనల మూలమైనా పూర్తియై వెలుగు చూచియుండేది. కాని ఇంకా సగానికించుమించుగా వెలికిరాలేక అది రేకులలోనే దాగియున్నది. అశ్రద్ధ, ఆశ, అసూయ, అసహకారము- మొదలైనవెన్నో ఆ స్థితికి కారణాలు. వాటిజోలి పనిలేదు.

ఈ కైంకర్యమునకు నేను దిగిచూచినప్పుడు మొట్టమొదలు నన్ను ప్రేరేచిన నిర్ణయమొకటే. రేకులలోని మూలమును చదువుకొనుటకనుకూలముగా వ్రాతవింతలను సవరించి ప్రకటించుట. ఆ సంకీర్తనల సాహిత్యము ప్రతిఫలించిన పురాణము, వేదాంతము, సంప్రదాయము. చరిత్ర, భాష, వ్యాకరణము, నుడికారము. ఛందస్సు, గేయలక్షణాలు, కావ్యకళ మొదలైన వొక్కొక్కటి ఒక్కొక్క సముద్రమువంటి విశేషాలు. వాటిగొడవ ఒకవ్యక్తి శక్తికి మించిన బరువు. ఆనందమూర్తిగారి యీ మహాపరిశీలన సమీక్షించువారికి అది కొంతైనా విశదమగును. ఈ నేర్పు, ఓర్పు, పరిశ్రమ, పూర్వాగ్రహ పక్షపాతములసోకు లేనివిషయ విమర్శ- అన్నీ వారి పితృపాదుల మంగళాశాసన శిక్ష పండిన పంటలు.

అనేక విషయాలను సవిస్తరముగా విమర్శించి వివరించిన యిటువంటి గ్రంథమును చదువుకొనేటప్పుడు అందందు కొన్ని భిన్నాభిప్రాయాలు తోచేది సహజం. నాకు స్ఫురించిన అట్టివి అనుక్రమంగా ఇక్కడ కొన్ని సూచిస్తాను. అది భావివిమర్శకులకేమైనా ఉపకరింప గలిగితే తృప్తిపడగలను.

(అ) పుట 85. కృష్ణమాచార్యుని 'దశరథాత్మజరామారామా' అనే నామ భజన సంకీర్తన నడక 'తకధిమితక, తకధిమితకధిమి' అని జతిపలుకులతో సూచింపబడినది. అప్పుడది 14 అక్షరాల 'మిశ్ర' గతియగును జతిపలుకుల మొదటి భాగం కూడా 'తకధిమితకధిమి' అని యుండ దగును. లేకుంటే చతురస్ర జాతి సిద్ధింపదు. ఒక 'ధిమి' లోపించుట అచ్చుకూర్పులోని జారు కాదగును. మరి యీ పాట ఏకతాళమున కంటే ఆదితాళమునకే ఎక్కువ రుచికరముగా ఒదుగును. ఏక తాళము అంగముగా ఆదితాళము అంగిగా నడపుటయే సాంప్రదాయికరుచి.

(అ) పు. 40. 'తివడ-పల్లవి అనునవి' ప్రాచీనకాలమందే ప్రయోగమున నుండినట్లు తోచును. నేడివి ప్రచారమున లేవు'- 'తివడ' త్రిపుటశబ్దభవము. త్రిపుట తాళము నేడూ రసిక ప్రియమై ఎక్కువ ప్రచారమందున్నది. తివడ వేరే తాళమనుకోబనిలేదు. ఇక 'పల్లవి' తాళవిశేషముగా నాడుగాని నేడుగాని కనబడదు. రేకులోనుండెనేని అది వెక్కడపు పొరబాటే అనుకోదగును.

(ఇ) పు. 71. చిన్నన్నను గూర్చి సుబ్బరామదీక్షితులు వ్రాసిన మాటలలో అతడు 'పదకర్త' అని స్పష్టముగా తెలుపలేదు. కాని చిన్నయ్య రచనలని రెండు సంకీర్తనలను సాంప్రదాయిక స్వర తాళములతో ఆయన మనకందిచ్చినాడు. ప్రభాకర శాస్త్రిగారి దృష్టికీవిషయము వచ్చినట్లు లేదు. దీక్షితులు 'అట్లు పేర్కొనుట ప్రమాదఫలితమే అనుకొందును' అంటారు ఆనందమూర్తి. దీక్షితుల మాటనమ్మిన నేను, శ్రీసాంబమూర్తి మొదలైన కొందరి పేర్కోలు "స్థూల" మని వారి భావన. నేనింకా అట్లు భావింపలేను.

(ఈ) పు. 193. "చూడుఁడిందరికి సులభుడు"అనే అన్నమాచార్యుని సంకీర్తన తన వైష్ణవ దీక్షాచార్యుడై అహోబల మఠప్రతిష్ఠాపకుడైన ఆదివణ్ శఠకోపయతీంద్రుని స్తుతియని భావించి, భైరవి, ఆదితాళములలో దానికి నేను వర్ణమెట్టు కుదిర్చి కొంతప్రచారమునకు తెచ్చితిని. అది ఆళ్వార్లలో అగ్రగణ్యులగు నమ్మాళ్వార్లను గూర్చినదిగా ఈ గ్రంథకర్త భావించినారు ఉండవచ్చును. కాని నమ్మాళ్వార్లను విశిష్టముగా సూచించుమాట యేదీ ఆకీర్తనలో కాన రాదు.

(ఉ) పు. 213. "పల్లాండు" పదానికి తమిళులో బహు సంవత్సరములు (పల- ఆండు) అని అర్థము. దీర్ఘాయుస్సని తాత్పర్యము. "కలుగునుగాక" అని ధ్వని సాక్షాత్కరించిన శ్రీమన్నారాయణ మూర్తిని గూర్చి ఆనందపారవశ్యముతో అతని పాదాలకు, అవినాభూతులైన భక్తులకు హృదయమందలి శ్రీదేవికి, చేతులందున్న శంఖచక్రములకు శాశ్వతమైన రక్ష (తిరుక్కాప్పు) కోరి పెరియాళ్వారు చేసిన ప్రార్థనాగీతమున ఈపదము పలుమారువచ్చును. శ్రీవైష్ణవుల నిత్య భగవదారాధనలో కడపటి ప్రార్థనగీతమై యిది వ్యాప్తికి వచ్చినది. పదార్థము తెలియనక్కరలేని దీని భావము "మంగళము".

(ఊ) పు. 276. "పునుగుకాపు" లోని "కాపు" అను పదమునకును

మీది "తిరుక్కాప్పు" వలె తమిళులో "రక్ష" అనునదే అర్థము. కాచిపూయుట చేత వచ్చినది కాదు ఎణ్ణెకాప్పు, మంజల్‌కాప్పు, శందనకాప్పు మొదలైన సాంప్రదాయిక పదములలో దీనిని గమనింపవచ్చును. భగవద్విగ్రహమునకు రక్షను కోరియే ఈ పూతలు సమర్పించుట. తెలుగులో ఇది"కాపుదలగా" పెరిగినది.

(ఋ) పు. 281. శ్రీవైష్ణవ సంప్రదాయములో తిరుపతి యంతే ముఖ్యమైనది అహోబిలక్షేత్రం. ఆకొండమీది పెద్దగహ్వరమంచే అక్కడక్కడ నవనారసింహుల మూర్తులు గలవు. ఆకొండకును వేదాద్రి, గరుడాద్రి మున్నగు పేర్లున్నవి. దశావతారములలో నృసింహరూపము తీవ్రమై భయంకరమైన భావన గలది. ఐనా అసలు స్వరూపం దయామయ మైనది. ప్రహ్లాదుని మీది వాత్సల్యము శ్రీదేవి యందలి ప్రేమా ఆ దయను పోషించి చూపగలవి. వేదాంతదేశికుల భావన యిట్లున్నది:-

"సటాపటల భీషణే సరభసాట్టహాసోద్భటే-స్ఫురత్క్రుధి పరిస్ఫుట
భ్రుకుటికేపి వక్త్రీకృతే
కృపాకపటకేసరిన్ దనుజడి భవత్తస్తనా-సరోజసదృశా దృశా వ్యతి
విషజ్యతే వ్యజ్యతే" (కామాసికాష్టకం. ప 7)

కారడవులలో దూరి కొండమీది ఆ విభిన్న నవనారసింహులను దర్శింపగలిగినా సామాన్యభక్తులు ఆ మూర్తుల తీవ్రతను భావించి భరింపలేరని ప్రహ్లాద లక్ష్మీ సహితమైన సౌమ్యమూర్తి పలుచోట్ల ప్రతిష్ఠగన్నది. క్రింది అహోబలమందు విచ్చేసి యుండునది ఆ మూర్తియేకాని 'ఉగ్ర నరసింహుడు' గాడు. నేటి నిత్యోత్సవాదులన్నీ ఆ వేల్పుకే (ఇది నేను బహుధా విన్నమాటేకాని కన్నది కాదు). ఆ క్షేత్రమందలి ఇతర విశేషములకు బ్రహ్మాండ పురాణమందలిదని చెప్పబడు అహోబలమాహాత్మ్యమును చూడదగును. తాళ్ళపాకవారిది ఈ రెండు క్షేత్రములందును 'భేదములేని భక్తి'.

ఈ సందర్భమున అన్నమాచార్యులు పలుమారు పేర్కొన్న 'సుగ్రీవ నరసింహ'మూర్తి ఒక పెద్ద సమస్య. 'సుగ్రీవ' అను పూర్వపదమే వాడినాడు గనుక అదేదో పారిభాషికపదమే యనిపించునుగాని సాధారణ నరసింహమూర్తి కంఠశోభను వర్ణించునదిగా తోపదు. ఎక్కడ ఏ దేవతయైనా కీర్తనకడపటి చరణములో ముద్రాసిద్ధికై సామాన్యముగా వేంకటాద్రికి రాకతప్పదుగనుక

ఈ దేవత తిరుమలమీద వెలసియుండెనని స్పష్టముగా చెప్పలేము. మరి ఒక కీర్తనలో (11-217) 'తుంగభద్రాతటమున' ఉన్నట్లు చెప్పబడినదిగనుక విజయనగరమందే అన్నమయ్య ఆ మూర్తిని దర్శించి కీర్తించినాడనవలెను. నేను అక్కడివారిని పలువురను విచారించితినిగాని ఫలము లేకపోయినది. నా యెరుకలోని వాఙ్మయములో ఎక్కడా ఆ విశిష్ట మూర్తిపేరు నాకు కానరాలేదు. కిష్కింధాధిపతి సుగ్రీవుడు ప్రతిష్ఠించినట్లు అక్కడ ఆ కాలమున ఒక నారసింహదేవాలయము ఉండినదేమో ! ఆ పాడు పట్టణములోని యెన్నో 'పాడు'లలో ఇదీ ఒకటి కావచ్చును.

(ఙూ) పు 290. హంపిలో మాల్యవంతమున కెదురుగానున్న కొండల యుపత్యకయందు ఒక మంచి చక్కని హనుమద్విగ్రహమున్నది. గుడి చిన్నదైనా మూర్తి పెద్దది; సుమారు పదడుగుల యెత్తు. 'కళసాపురమాంజనేయులు' అని నేటి వ్యవహారము. కళాసాపురం అనే గ్రామం ఆ దేవళం చుట్టుపక్కలనే ఉండినదంటారు. కాని ఆ సూచనలేవీ నేడు కానరావు. ఇరుగు పొరుగూళ్ళవారు ఆ దేవునికి తమ మొక్కులు ఎక్కువగా చెల్లింతురట. ఎవడో భక్తుడు నిత్యపూజచేసి పోవుచుండునట. గొప్ప ప్రభావంకల దేవతయని అక్కడివారి నమ్మిక. ఆ రెండుకొండలపంక్తుల నడుమనున్న ప్రదేశమే శ్రీనాథుడు చూచి మెచ్చిన 'కదళీవన'ము గావచ్చును. నేడట్టిదేమీ లేదు.

(ౘ) పు. 318 'అలర చంచలమైన' అను పాటలోనివన్నీ సమావృత్త పాదాలనేది నరే కాని పాదాని కేడావృత్తాలని లెక్కించడంమాత్రం చింత్యం. ఇది తాళజీవితమైన లయ (మాత్రాసామ్యము)ను అక్షరదృష్టితో చూచుటవల్ల కలిగింది. అప్పటికిన్ని 'ఉయ్యాలా' అనే పాదాంతమగణం ఆరుమాత్రలు గలిగి, మొదటినుండి క్రమంగా నడచివచ్చే ఐదుమాత్రల గణాలధాటితో పొందిక లేక ముగ్గరించును. చతురశ్రమే జీవాతువుగా వెలసే కర్ణాటకపద్ధతిలోని నిబద్ధ ప్రబంధాలలో ఏడు గణములుమాత్రముగల పాదములెందుకు ఉండవు. కనుక ఈ 'ఉయ్యాలా' అనే పదాన్ని 'ఉయ్యా...లా...' అని 'యా'కు మూడు మాత్రలును 'లా'కు ఐదు మాత్రలును ఇచ్చి పొడిగించి ఖండలయను చతురశ్రతను కాపాడుకోవలసి యున్నాము. పాడేటప్పుడు ఊపిరివిడిచి తీసుకొనే సౌకర్యమునకైనా, వాటిరాగ రచనయందలి ఊపు చూపుటకైనా పాట పాదమున కడపటి గణము నిట్లు కురుచపరిచి రచించుట ప్రబంధసాహిత్యములో

సామాన్యము. ఇట్లే "కదిసి సురవరులు" అను పాట రెండవపంక్తిలో 'ఏతావృత్తములే యున్నవి' అనుకొనరాదు. అందలి 'గాను' అనే యేడవ ఆవృత్తమును 'గాను...'గా సాగించుట ఆవశ్యకము. ఇక్కడమాత్రమేకాదు. పాటలన్నిటి యందును అంతోయింతో ఈ ధర్మము కనుగొనవచ్చును. ఇంతేకాదు; అక్షరాల గురు-లఘువుల మాత్రలను "ఏకమాత్రోభవేత్ హ్రస్వః ద్విమాత్రో దీర్ఘ ఉచ్యతే" అనేసూత్రముప్రకారము కొలిచితే పాటంతూనిక చేతికందక దారి తప్పించును. గేయపదములనుండి పుట్టిన జాత్యుపజాతి పద్యముల లక్షణములలో ఈ లోపమే కానవచ్చును. మన సీసపద్యము పరిశీలింపవచ్చును. ఒక వరుసగా ఆరు ఇంద్రగణాలతో ఖండలయనునిర్వహించి కడపటి రెండుసూర్యగణాలత్రిశ్రగతితో కుంటి పాదమును ముగించుమని సీసలాక్షణికుల యాదేశము! కాని ఇంద్రగణములు ఏడింటినినడపి ఎనిమిదవగణముగా ఒక లఘ్వక్షరమును ఐదుమాత్రల విలువతో చేర్చి పెట్టుకొమ్మనుట న్యాయము. "కనకసాపు-రప్రాంత-కదళిక-చాంకర-ద్రాక్షాల-తాఫల-స్తబకములకు..." అన్నట్లు మన ద్విపద, తరువోజ, అక్కర మొదలైనవాటిలోనెల్ల ఈ లయధర్మము గమనింపక అక్షరమాత్రావృష్టితో లక్షణ నిర్ణయము జరిగినది. దీని విస్తరము ప్రకృతమింతచాలును.

(ఔ) పు. 336. 'శోభనమే శోభనమే' అన్న పాటకు వసంతం' అని రాగనిర్దేశమున్నది. దీనిని 'నేటికిని భజనపరులు సంప్రదాయము ననుసరించి' పాడేవారు ఆ రాగమందే పాడుచున్నారా? ఎక్కడిది దాసంప్రదాయం? దాని లోని వసంతరాగ స్వరూపమెట్లు? అల్ప పంచమమా! "మహాసంపూర్ణ భానోన్నతి" గల భట్టుమూర్తి పంచమమా? నిష్పంచమమా!

(ఎ) పు. 359-60. నేను విన్న తెలుగు ఏలల స్వరూపము విళంబ కాలములో 'తకతకిట' అనే ఖండలయతో సౌరాష్ట్రరాగబద్ధమై వినవచ్చునది. ఒక్కొక్క చరణమూ ఆరు ఖండములుగా సాగునది. సస్వరమాత్రావిభాగముగా ఆ రీతి నిక్కడ గుర్తుచేయడం మేలు, విస్తరమైనా

౧. సాసా౹ ధాధా౹ । పాగా౹ మాపా౹
మేడ లెక్కి నిన్ను జూచి

౨. పాధా౹ పామా౹ । పధమా౹ గారీ౹
కూడే నే। యాస తోడ

౩. సారీ౹ పామా౹ గారీని సరిపామా
వాడు దేరి వుస్సు రందు

౪. రీ౹౹౹ పా౹౹౹ । పదమా౹ గారీ౹
రా వెంక టేశ

౫. సారీ౹ పామా౹ । గారీని సరిపామా
యాడ నుంటి లింవాకాను

౬ రీ౹౹౹ సా౹౹౹ । ( ఇక్కడ ఒక ఆవృత్తము విశ్రాంతి )
రా ... తక్కిన అన్ని నుడుగులూ ఇదే దాటిలో.

దేసాళ రాగం నాకు తెలియదు. ఈ రాగానికే అది ప్రాతపేరా? సౌరాష్ట్రమని నేననుకొన్నరాగం కూడా ఇప్పటి విద్వాంసులు పాడే పద్ధతికి కొంచెం భిన్నంగా స్ఫురించవచ్చును. ఇందలి ధైవతస్వరం శుద్ధమూ చతుశ్రుతీ గాక త్రిశ్రుతిగా చెవికెక్కును. 364 పుటలో ఉదాహరించిన తిమ్మభూపాలుని ఏల"కాంభోజి" రాగమనియున్నది ఆ కాంభోజి యెట్టిదో? ఏలపదములో వాని యేర్పాటెట్లో? అందలి "శ్రీ వేంకటేశా" అనేచోటి 'శ్రీ'కారము వెనుకటి గణమునకే చేర్చుకొనవలెనేమో? గేయపదముల బహిరంగోపాంగముల విశ్లేషణ యెంతో జరిగింది గాని ఆసారస్వతమందలి జీవశక్తియైన రాగతాళ రచనను వివరముగా వివేచించి తెలిపే పనికి పూనినవారు, ప్రాచీనులుగాని ఆధునికులు గాని, కానరారు.

(ఏ) పు. 374 "కరగు" ధాతువు "పండు" ధాతువువలె, కరగించు పండించు అనునట్లు 'అంతర్భావితణ్యర్థము'గా ప్రయోగించుటగలదు 'కంసాలి బంగారు కరగినాడు' "రైతు పదిపుట్లు పండినాడు" అను వాడుక రాయలసీమలో నున్నది. "కోటకొండలుగ ధాన్యరాసులు పండువీట సుజనభజనైకవిఖ్యాతి శూద్రజాతి" అన్న ఆముక్తమాల్యద ప్రయోగమున పండును (పండించును) అని పదచ్ఛేదము చేయుటయే ఉచితము. 'పండునట్టివీట' అని సమస్తపదముగా గ్రహించి "కలదు" అని శ్రీ వేదంవారు చేసిన క్రియాధ్యాహారము చింత్యము

(ఐ) పు. 398 "అరుళప్పాడు" తమిళ సాంప్రదాయిక పదము అరుళ్-దయ, పాడు తెలుగుపాటే. పడుధాతువు కృదంతభావనామము. దయ చేయుంచుట-అనుగ్రహింపజేయుట అనియర్థము. అరుళ్ అరళుగా మార్పు ఉచ్చా

రణలోపము. మరి మూడక్షరాల పదములలో-పెపకు చదువు కొరగు ఇత్యాదు లలో-రెండవ లఘ్వక్షరముమీదిది అకారమో ఉకారమో నిశ్చయముగా చెప్ప లేము. అరళు ధాతువు కన్నడమందున్నదిగాని తమిళులో కానరాదు. మరి ఇది శ్రీవైష్ణవద్రావిడుల సంప్రదాయములోని సంకేతపదము. కనుక వికసించు అనే కన్నడార్థముతో 'అరళుపాడు' నిర్వచింపపనిలేదు.

(ఒ) పు. 400 "తిరు = శ్రీయనుటకు వికృతిరూపము" అని ఆనంద మూర్తి విస్పష్టముగా చెప్పినారు. సంతోషం. శుద్ధద్రావిడాభిమానులు దీనికొప్పక పోవచ్చును. అది వేరుమాట. ద్రావిడవైష్ణవులవలెనే ద్రావిడశైవులును సమృద్ధిగా దీనిని వాడుదురు. తిరునీఱు, తిరుత్తణి, తిరువణ్ణామలై ఇత్యాదులు చూడ వచ్చును. ఈ 'తిరు' శైవులకంటె వైష్ణవుల వ్యవహారములో ఒకచుక్క ఎక్కువగా వచ్చును.

(ఓ) పు. 415 "సంతపాకలంజ" అనే నుడికారములోని 'సంతపాక' ఏదో ఊరిపేరుగాని, 'పాక' పేటగాని కానక్కరలేదు. సంతలలో "పాక = కొట్టము" వేసుకొని లంజెతనము చేయుట ఇప్పుడూ లేకపోలేదు. సంతలేకాదు పరషలలో గూడా ఈ వ్యాపారం జరిగేది తెరమరుగు సత్యమే.

ఇట్టి అభిప్రాయచ్ఛాయాభేదాలు మరికొన్నిగలవు. కాని ఇంతటితో విర మింతును. ఇప్పటికే ఈ ఉపోద్ఘాతము పెరిగినది. సాంప్రదాయికమైన విస్తర భయముచేతనైనా దీనిని పెరుగనీయక నిలుపుట న్యాయము.

చి॥ శ్రీ ఆనందమూర్తిగారి యీ విశాల విస్తృత గంభీర పరిశోధన మున్ముందు ఈ వ్యాసంగమునకు చేయిపెట్టువారికి హెచ్చరికయై, మార్గదర్శకమై ఉపకరించుననుట నిస్సందేహము.

ఆయనకు సార్వభౌమమైన నా మంగళాశీస్సులు.

బెంగళూరు<br>5-5-76

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

# అభిప్రాయము

## ఆచార్య డా॥ తిమ్మావజ్ఝల కోదండరామయ్య గారు

మీరు ప్రీతితోపంపిన 'తాళ్లపాక కవుల పద కవితలు-భాషా ప్రయోగవిశేషాలు' అను మీ గ్రంథ మందినది. అందినదే తడవుగా చదువవారకని కడముట్ట ఒక్కబిగిని చదివితిని. చదివితి ననుటకంటె మీ గ్రంథమట్లుగా నాచేత చదివించిన దనుటయే ఒప్పగును. తాళ్ళపాక వారి సంకీర్తన వాఙ్మయము పరిమాణమునను, గుణమునను లోకోత్తరమయినది. సముద్రమంత విస్తారమయిన ఆసంకీర్తన సారస్వత సర్వస్వమును అవలోడనము చేసి పరమార్థ రత్నములను పడయ గలుగుట సామాన్యులకు సాధ్యమగు పనికాదు. ఒక్క గజయీతగానికి మాత్రమే సాధ్యమగునది అది. అట్టి గజయీతగాడుగా మిమ్ము నేను సంభావించుచున్నాను. ఈ పనికి నేర్పు ఎంత అవసరమో దానికంటె ఇనుమిక్కిలిగా ఓర్పు ఎంతో అవసరము. ఆ రెండును మీయందు నిండారగా కలవనుటకు మీ పరిశ్రమ ఫలమైన యీ గ్రంథమే సాక్ష్యము కాగలదు. ఇంతవఱకు నీ విషయమున సమగ్రమయిన, శాస్త్రీయమయిన పరిశీలనము జరుగలేదు. పూజ్యపాదులు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు ఈ విషయమై చేసిన మహాపరిశ్రమ మీ గ్రంథముతో మరింత సమగ్రతను, ప్రామాణ్యమును సంతరించుకొనినది. తాళ్ళపాకవారి సాహిత్య పరిశీలన మనెడి మహాయజ్ఞనిర్వహణము తండ్రి, తనయులయిన మీ యిరువురిచేతనే సాగుట యనునది ఒక అసాధారణ విషయము. అది యట్లుగా సాగవలసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి సంకల్పనమునకు ఒక రూపకల్పనము మాత్రమే అని నాకనిపించును. సమకాలికములగు శాసనములు, అన్నమాచార్య చరిత్రము, తాళ్ళపాకవారి యితర గ్రంథములు, ఈ విషయమై పరిశ్రమించిన యితరుల రచనలు, అభిప్రాయములు, తిరుపతి చరిత్రము, తాళ్ళపాకవారి సంకీర్తనలు-వీని అన్నింటి ఆధారముతో అన్నమాచార్యుల జీవిత వృత్తములకు సంబంధించియు, తిరుమలతిరుపతి ఆలయములలోని ఉత్సవాదులకు సంబంధించియు, క్రొత్తవిషయములు, క్రొత్త ప్రతిపాదనములు, క్రొత్త సిద్ధాంతములు అనేకములు మీ గ్రంథము మూలమున తెలియవచ్చుచున్నవి. శాసనములందు తెలుపబడిన యంశములకు సంకీర్తనములందు సంవాదములు చూపియు, సంకీర్త

నముల యాధారముతో సందిగ్ధాంశములను పరిష్కరించినవి నిశ్చయము చేసియు, ప్రామాణికములగు నాధారములు లభింపమిచే ఇతరవిధముగా చేయబడిన పూర్వ నిర్ణయములను పూర్వపక్షముచేసి సత్యమును స్థాపించియు మీరీ గ్రంథమునందు చేసియున్న చరిత్ర శోధనము ప్రశంస్యము. కృష్ణమాచార్యులకు సంబంధించి మీరు తెలిపిన నూతనాంశములు, తాళ్ళపాకవారి కీర్తనలలో మీరు చూపిన ద్రావిడ పాశురముల ఛాయలు, అనుసరణములు, ఆలయోత్సవముల చరిత్ర వినిశ్చయ పునర్నిర్మాణములు. మీ పరిశోధనకు కలికితురాయిగా నేను పరిగ ణించుచున్నాను. శృంగార సంకీర్తనములందును, అధ్యాత్మ సంకీర్తనము లందును వివిధ శృంగార భేదములను, భక్తిభేదములకు లక్ష్యముల నెన్నిక చేయుట మీ లక్షణశుద్ధికి తార్కాణమై యొప్పుచున్న దనుటలో సందేహములేదు. తాళ్ళపాకవారి దేశిగానము, రాజకీయ సాంఘిక మత పరిస్థితులు పెక్కు నూతన విషయములను తెలుపుచున్నవి. విషయముల వింగడింపు, ఆయాయి విషయము లను ప్రతిపాదించుటలో చూపిన మెలకువలు, కైకొనిన జాగ్రత్తలు, నిర్దుష్ట సుందరమైన భాష మీ పరిశోధనగ్రంథముయొక్క యోగ్యతను పెంచు చున్నవి. భాషాప్రయోగ విశేషములను గూర్చి యిందు మీరు చేసినచర్చ చాల ఆసక్తిదాయకమును, ప్రయోజనకరమును నయి యున్నది. కాని వ్యాకరణాంశ ములకు సంబంధించి చేసిన చర్చలో శబ్దరూపములు, సంధి, సమాసము, కారకము, క్రియలు, తద్ధితములు, కృత్తులు-ఇత్యాదిగా ఒక ఆనుపూర్వితో కూడిన వింగడింపుచేసికొని పరిశీలించి యుండినచో మఱింత సమంజసముగా, శాస్త్రీయముగా నుండి యుండెడిదని నా అభిప్రాయము. అధోజ్ఞాపికలు కొన్ని వలసిన వివరములను అన్నిటిని ఒసగునవిగా లేవు.

ఈ దిగువ కొన్ని యంశములను మీ పరిశీలనమునకై ఉట్టంకించు చున్నాను

1. (పుట 35)...ఈ ధ్యాన (గేయ) సంకీర్తనము వెనుక నమో నమో దయానిధీ! అను మకుటముగల కృష్ణమాచార్యుని వచ నము కానరాకున్నను...కృష్ణమాచార్యుని రచనముగా మనము సంభావింపవచ్చును. వచనసంకీర్తనము నందువలెనే (చూ. వచనము పుట 24) యిందును రామనామ స్తోత్రముతో బాటు రామాయణగాథ తత్త్వవిశేషణములందు స్ఫురించుటను కూడ అతని రచనమే అనుటకు ఒక ప్రమాణముగా గ్రహింపతగును.

2 (పుట 259) మొదలి తిరునాళ్ళకు మొక్కేము మేము - దానిని మొదలి తిరునాళ్ళుగా పఠింపరాదని నా అభిప్రాయము ఇతరత్ర వారే దానిని 'పెండ్లితిరునాళ్ళు'గా పేర్కొనియుండిరి. కనుక ఇట 'మదువె (మొదవె) తిరునాళ్ళు' అని వారు ప్రయోగించి యుందురు. కన్నడమున 'మదువె' అనగా పెండ్లి.

3. (పుట 339) నివ్వాళిపాటలు. తమిళమున 'నీవాళి' అనగా నీవు వర్ధిల్లుము అని అర్థము. అట్లు నీవాళి, నీవాళి' అని మంగళా శాసన పురస్సరముగా పాడు పాటలు నివ్వాళి పాటలు అయి యుండునా ?

4. (పుట 379) జగడించు, గయ్యాళించు-సంస్కృతంబుల కంగ లాదుల కిందుక్కగు అనుసూత్రముచేతనే సిద్ధించును. అద్దాదు లకు-అను సూత్రవిషయముగా గ్రహించి ప్రయోగ విశేషముగా భావింపనక్కఱలేదు

5. (పుట 381) 'ఉందాన' అను ప్రయోగము 'ఉన్నదాన' అనుదాని వికారమని నా తలపు.

6. (పుట. 398) అరళపాడు-అరుళ్‌పాడు-అరుళ్‌పా, అరుట్పా, తమిళమున అరుళ్ అనగా అనుగ్రహము, దయ, భగవదను గ్రహమును అర్థించి పాడు, అట్లు పాడుపాట అని అర్థము.

7. (పుట 399) ఉడయవరు-ఇదియే సరియైన పదము. కలిగిన వారు అని అర్థము. ఉడయనంబి అని ఆపేరినంబికి (ఒడయ నంబి) పేరు. తెలుగున ఆ పదముల వికారములే ఒడయనంబి, ఒడయవరు. తాళ్ళపాకవారు అసలు పదమునే గ్రహించిరి.

8. (పుట 399) చూడుకొడుతనాచారి-చూడి కొడుత్తనాచ్చియార్ అని ద్రావిడ నామము. చూడి అనగా ముడిచి అని అర్థము.

9. (పుట 408) మోరతోపుదనము అనగా మొగ మెత్తి చేసికొనుట, కోపించుట.

10. (పుట 428) అల్లిరము-అల్లెము తమిళశబ్దము. అల్లుడి/వాసము అని అర్థము. వివాహానంతరము అల్లుడు (వరుడు) అత్తవారింట విందులు కుడుచుచు కొన్ని దినములపాటు ఉండుట.

11. (పుట 433) ఉంటవిల్లు-ఉండవిల్లు (ఉండేలు)-పిల్లకాకి కేమి తెలుసు ఉండేలుదెబ్బ. ఉండవిల్లు చిన్న గులకరాతిని (రాతి బెడ్డను) విల్లువంటి సాధనమునందుంచి గురి చూచి కొట్టుట Caterpiller అని దీనికే పేరు. రెండు పంగలుగా ఉన్న కర్రకు తోలుపట్టీ కట్టి ఆ తోలుపట్టీ నడుమ రాతిబెడ్డ నుంచి కొట్టుట. తాళ్ళపాకవారు ఉండలకు మారు సందర్భము ననుసరించి కర్పూరపుటుండలు అనినారు కనుక అది కర్పూరపు టుండలు మాత్రమే చిమ్ము సాధనము కాదు.

12. (పుట 440) కవడు-మాలిన్యము, కపటము. 'వారు కవుడు లేని వారు' అని రాయలసీమలో నేటికిని వ్యవహారము.

13. (పుట 447) గోరుపదము-బసవపురాణములో గోరుపదము-ఇదే అర్థములో కలదు.

14. (పుట 451) తీలు-తీయ్ తమిళపదము. చెరగు, హాని, అపకారము అని అర్థము.

15. (పుట 453) దేహరము-దేవహరము. అగ్రహారము, అగ్రజన్మల నివాసస్థలము. అట్టిదే యిదియు.

16. (పుట 472) వల్లడి వలపుకాదు. వల్లడి ఉపద్రవము అని అర్థము వాడికేంవల్లడి వచ్చింది-అని రాయలసీమలో వ్యవహారము.

17. (పుట 473) వళుకువేయు-తమిళములో 'వళికు' అనగా వివాదము, తగవు. వళిక్కాడు-అనగా వాదించు.

18. (పుట. 479) సూర్యవీధి-తూర్పువీధి ఇట్లనుటకు ప్రమాణమేమి?

ఇంకను వారి పదములు, పదబంధములు, సామెతలు, పరిశీలనార్హ

ములు అనేకములు కలవు. ఈ దిక్కున మీ గ్రంథము కలిగించిన ప్రేరణ చక్కని ఫలితములనే యీయగలదని, వారి భాషాప్రయోగములను గురించి ప్రత్యేక పరిశ్రమ చేయుటకు ప్రోత్సాహకారి అగునని భావింపవచ్చు ననుకొందును.

మధుర
5-5-76.

—తిమ్మావజ్ఝల కోదండరామయ్య

—❀—

# ‘ఆమోదము’

**శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారు**

“సంకీర్తన వాఙ్మయము-పదకవితలు”-అను శీర్షికను డాక్టర్ వేటూరి ఆనందమూర్తి గారు రచించిన సిద్ధాంతగ్రంథము దాదాపు అచ్చుపని పూర్తి అయి బైండింగ్ అయేముందు నాకు పంపి, దానిని చదివి, దానిపైని నా అభిప్రాయమును పంపమని అడగడం, ఏవంవిధ పరిశోధకుల శ్రేణిలో నన్ను ఆయన జ్యేష్ఠసోదరునిగా భావించి గౌరవించడమే అని భావిస్తున్నాను.

అయితే ఆయన గ్రంథమును చదివిన వారి కెవరికైనా, ఆయన పరిశోధనలు తనకు పూర్వగాములైనవారి పరిశోధనలను అధిగమించి ఎంతో ముందుకు పోయినవని తెలియక మానదు. తన సిద్ధాంతములను బలపరచుకొను సందర్భాలలో ఆయన మాదృశుల ఒకరిద్దరి పరిశోధనాంశములను తరుచు ఉద్ధరిస్తూండడం గర్వకారణమైనా, విషయబాహుళ్యములోనను, ఇదంపూర్వ నిశ్చితములు కాని చారిత్రికాంశముల నిరూపణములలోనను ఆయన కృషికి సెభాషని తీరవలె.

ప్రాఙ్నన్నయ యుగము నాటి శాసనముల నుండి గేయము లనదగిన తరువోజల నెత్తిచూపడమూ, 13వ శతాబ్దములో నేటి మూడు తెలుగు సీమల లోను జీవితము కొనసాగించి తొలి తెలుగు వాగ్గేయకారునిగా కృష్ణమాచార్యులను, ఆయన రచించిన సింహగిరి నరహరి వచనములనేకాక, రామ, నృసింహనామావళీ రూపగేయములను కనుగొని చూపడమూ, తాళ్లపాకవారి గేయరచనలలో ఇప్పటికి వెలువడిన సంపుటా లన్నిటినుండి సుమారు 150 దాక్షిణాత్య రాగాలలో ఆ వాగ్గేయకారులు రచించిన అధ్యాత్మ కీర్తనలా, శృంగార కీర్తనలా సంఖ్యా వివరములను పరిశోధించి ప్రకటించడమూ అచ్యుత, సదాశివరాయల పరిపాలనా కాలములో సంగీతప్రియులయిన ఆ రాజులూ, పురందరదాసులూ, తాళ్లపాకకవి యోగులుకలిసి కర్ణాటక సంగీత ప్రాచుర్యమునకువేసిన ప్రాతిపదికలనుగూర్చిచేసిన యూహ, ఈపదముల ప్రచారమునకు ఆనాటి దేవస్థానములందును రాజాస్థానము లందును రాయసభా రంజనులూ, దేవదాసులు పడియుండినపాటును వర్ణింపగల

గడము, అలంకారశాస్త్రములోని నాయికానాయకుల లక్షణములకు ఏయే సంకీర్తనములు ఎట్లు లక్ష్యభూతములైనవో వివరించడము, ఆ సంకీర్తనములద్వారా వానిలోని భాషాప్రయోగవిశేషములనూ, ఆనాటి రాజకీయ, మత, సాంఘిక పరిస్థితులను, కళ్లకుకట్టినట్లుగా చిత్రించిన ఆనందమూర్తిగారి ఈ పరిశోధనా ఫలము సంగీత సాహిత్య దిదృక్షువులకు అమృతోపమానము కాగలదని ఆశిస్తూ, మాసోదరుని పరిశోధనా పిపాస ఇతోధిక సత్ఫలములను అందింపగలుగుగాక అని ఆశీర్వదిస్తున్నాను.

బెంగుళూరు
11 5.76.

బాలాంత్రపు రజనీకాంతరావు

—⁂—

# శుభాశంసనము

శ్రీ మంచాళ జగన్నాథరావుగారు

డా. వేటూరి ఆనందమూర్తిగారు శ్రీ తాళ్ళపాక వంశీయుల రచనలనుమహాసముద్రమును మథించి ఎన్నియో మణులను వెలికితీసి సాహిత్య పిపాసువులకు చూపి సంతోషమును కలిగించుచున్నారు. ఇతోధికముగా ఇట్టిసేవ చేయుటకు సర్వశక్తులను దయచేసి, శ్రీ వేంకటేశ్వరుడు వీరి సాధనకు తోడ్పడుగాక ! అని ఆశీర్వదిస్తున్నాను.

తాళ్ళపాకవారి రచనల యందు ఎన్నియో సంగీత విషయములు దాగి యున్నవి. వీనిని పరిశోధించి స్వరూపములను నిర్ణయించి చూపుటకు ఎంతో పరిశ్రమ, నైపుణ్యము కావలసి యుండును. నాటి సంగీతము దాని స్వభావము ఊహించుకొని అప్పటి సంగీత గ్రంథములను పరిశోధించి రాగములు, తాళములు, గీత రచనా విధానములు సమన్వయించుకొనుట సాధారణ విషయము కాదు. ఇప్పటికి మనకు తెలిసిన ప్రాచీనుల రచనలలో క్షేత్రజ్ఞుల రచనలు కొలదిపాటి సంగీతస్వరూపములతో మిగిలి యున్నవి. తరువాత తలచుకొనవలసినవారు రామదాసులవారు. వీరి రచనల యందును కొంత ప్రాచీనత కనబడు చున్నది. వేదమువలె గురుముఖమున తెలిసికొని అభ్యసింప బడుచున్న సంగీతవిద్యయందు శ్రవ్యసంబంధములైన చిన్నచిన్న మార్పులు జేర్పులు సంభవించుచుండుట కద్దు. చారిత్రికముగా మనకు సన్నిహితులైన శ్రీ త్యాగరాజాది వాగ్గేయకారుల రచనలయందే ఎన్నియో పాఠభేదములు కనబడుచుండుటను గమనించెడి మావంటి వారికే "ప్రాచీనులవి" అని చెప్పకొనబడు సంగీత రచనలయందు సందేహములు కలుగకుండుట ఎట్లు ? గనుక దొరికినంతలో ఒకరాగ స్వరూపమును వీలైనంత మంది రచనలలో పరిశీలించి ఇది ఇట్లే అనుస్యూతముగా వచ్చుచున్నదని అనుకొనుట తప్ప వేరొక మార్గము కానరాదు.

తాళ్ళపాకవారు పాడిన రాగములలో అనేకములు నేడు వాడుకయందు కానరావు. దొరికినంత వరకు క్షేత్రజ్ఞుల పదములలో వాడిన రాగములను,

రామదాసులవారు కీర్తనలలో వాడిన రాగములను చూచినచో కొన్నిరాగములు మాత్రము సుమారు ఐదు, ఆరు వందల ఏండ్లనుండి తమ వ్యక్తిత్వములు నిలుపు కొనుచు వచ్చుచున్నట్లు కనబడు చున్నది తక్కినవి పేర్లేమారిపోయినవో స్వరములపోకడలే మారిపోయినవో చెప్పుట కష్టము తాళములయందు ఇప్పుడు వాడుకలో గల చతురశ్ర త్రిపుట (ఆది), చతురశ్ర రూపకం, ఖండజంపె (కురుజంపె), తిశ్రత్రిపుట(చాపు), తాళములు మాత్రమేగాక ఇంకను మాత్రా చ్ఛందస్సులను ఆధారముగా చేసికొని ప్రస్తరించబడిన తాళములేవో కొన్ని ఆనాడు వాడుకయందుండి యుండవలెను. వానిని ఓపికతో పరిశీలించి కను గొనవలసియుండును. ఉదాహరణకు 'ఏమొకొ - చిగురుట - ధరమున నెరనెర కస్తురి-నిండెను ॥ 'ఇది ఇట్లు పాడినచో పదవిభాగము స్పష్టమై తాళమునందు ఇమిడి సర్దుబాట్లు అవసరము లేక సాగుచున్నది. ఇందు లఘువు మూడు, అను ధృతము ధృతముకలిగి ఆరుక్రియలు ఆవర్తమున వచ్చును. దీనిని చతురశ్ర జాతి రూపకతాళమున పాడినను ఇట్లేవచ్చును. కాని ఘాతల యందు రావలసిన బిగింపులు రావు. పాటయందుగల "కలికి చకోరాక్షికి కడ-కన్నులు-కెంపై తోచిన చెలువం బిప్పుడిదేమో-చింతిం-పరె చెలులు॥" ఈ వాక్యములు పరిశీలించి నచో మూడు, ఒకటి, రెండు అను విభాగముల యందు యత్యక్షరముల కలయికలలోని అనందము తాళమునందుకూడ కలిసివచ్చి ఒక నిండుదనమును పాటకు చేకూర్చుచున్నవి. ఇట్లే ఇంకను పరిశీలించవలసి యున్నది.

"తివడా" అను తాళమునకు 14 మాత్రలు: ఇది ఇప్పుడు హిందుస్థానీ సంగీత పద్ధతియందు వాడుకలో కలదు. దీని మాత్రావిభాగము 14 అక్షరములు. వీరి రచనలందు పేర్కొనబడిన తాళములలో ఇది యొకటి. ఇందలి మాత్రలతో పాటలు సరిచూడవలసి యున్నది. అందరికంటె ప్రాచీనులైన జయదేవులు తన "గీతగోవింద" కావ్యమున మాత్రాఛందస్సులను ఎట్లు వాడిరనగా సంగీత పరి చయముగల వారికి అష్టపది చదువగనే ఇది ఈ తాళమునకు ఒదుగుచున్నదను విషయము స్పష్టముగా తెలిసిపోవును. అట్లే తాళ్ళపాకవారి రచనల యందును, కొన్ని తాళములకు ఒదుగు రచనలు సుస్పష్టముగానే యున్నది. 'ఈతడే-హరుడు ఈతడే యజుడు॥ ఈతనికి యీచేతలెంత ఘన మటుగాన॥' ఇది తిశ్రరూపకము లేక కురుజంపె. ఇట్టి రచనలను - గుర్తించి ఆనందమూర్తిగారు ఈ గ్రంథము నందుదాహరించి యున్నారు. ఇట్లే యింకను మాత్రాచ్ఛందస్సులకు సరియగు తాళ

ములను గుర్తించి నిరూపించవలసి యున్నది. బహుశః ఆనాడు వాడుకయందు గల అనేక తాళములు ప్రత్యేకముగా వ్రాయవలసిన యవసరము లేక వారు రేకులయందుగాని యితరత్రా గాని వానిని వ్రాసియుండక పోవచ్చు. అందరెరిగిన ఒక విషయమును ఇచట ఉదాహరించుచున్నాను. సూత్రములలో చెప్పిన మహత్తర విషయములను అవగాహన చేసుకొను విజ్ఞత ఒకప్పుడు ఈ దేశమున ఉండెడిది. కాని నేడు ఒక సూత్రమునకు, లేక, ఒక వాక్యమునకు అర్థమును తెలుసుకొనుటకు ఎన్నియో భాష్యములు చెప్పుకొనవలసి వచ్చుచున్నది. ఇట్టి జ్ఞానమే ఆనాడుండిన వారట్లు వ్రాయకనే యుందురు. ఇన్ని భాష్యము లుద్భవించినను అర్థభావముల పట్ల వివాదములు విడివడకనే యుండుటయు జరుగుచున్నది.

రాగస్వరూపములు మారుచుండినవని చెప్పుకొంటిమి కదా! స్థాయియందలి స్వరములుపన్నెండు. వీనికి స్థిరమగు రూపములు కల్పించి మేళకర్తలను సృష్టించి కొంచె మించుమించుగా కలిగిన రాగములనన్నిటినీ ఆయా మేళకర్తల జన్యములని చెప్పుకొన్నారు. కాని తిశ్రుతి, రిషభ, ధైవతములు, చ్యుత పంచమ మధ్యమము, చ్యుతమధ్యమపంచమము మొదలగు విచిత్రములైన స్వరముల స్వరూపములు గుర్తించుటకు నేడున్న పద్ధతిలో అవకాశములులేవు కనుక ఇప్పుడున్న పద్ధతియందు అమరని అనేకరాగములు పాడెడువారు లేక నశించినవి. అట్లు నశింపక మిగిలిన రాగములు ఆహిరి, తోడి ముఖారి, భైరవి మొదలైనవి ఇంకను స్వరూపములను పోగొట్టుకొనక నిలిచి యున్నవి. అట్లే ఒక నిర్ణీత పద్ధతిని సాగెడు తాళములు మాత్రమే యిప్పుడు నిలిచియున్నవి. విషమ గతులలో నడచునవియును, ఎక్కువ లఘుధృతములు కలిగినవియు తాళములు వాడుకనుండి తొలగిపోయినవి. అమరసింధు, ఆబాలి, సింధూరతిలక, సామంతము, హెజ్జజి, దేసాళము మొదలగు రాగముల స్వరూపములే గుర్తెరుగ రాకున్నవి. నేడు గల సంగీతస్వరూపము రెండువందలయాభై ఏండ్ల క్రిందటి నుండి రూపులు దిద్దుకొన్నదై యున్నది. ఇప్పటి పద్ధతిలో సరిచూసుకొని పాడుటకు ప్రయత్నించిన పాడి, దేశాక్షి, గుండక్రియ, మంగళకైశికి, మారువ మొదలైనవి యేంతవరకు రక్తినియ్యగలవో తెలియుటలేదు. శ్రీ, మధ్యమావతి, బిలహరి, నీలాంబరి మొదలగు రాగములు యింకను కొంతవరకు రూపములు చెడకుండ నున్నవి. ఇట్లే ఆది, చతురస్ర రూపకము, తిశ్ర త్రిపుట లేక మిశ్ర చాపు మొదలగు తాళములును నిలిచియున్నవి.

తాళ్ళపాకవారి రచనలు దొరికినంతవరకు ఆమూలాగ్రముగా వివిధము లగు కోణములలో పరిశీలించి విభాగముల నేర్పరచి, అతినైపుణ్యముతో తీర్చి, భావిరసపిపాసువులకు సుగమములగు మార్గములనువేసి రూపొందించిన వేటూరి వారి గ్రంథములను, అధ్యయనము చేసి తాళ్ళపాకవారి భక్తి, శృంగార, వైరాగ్యాది భావసంపదలను సంగీత సాహిత్య రచనా వైభవములను వెలికితీసి అందలి యానందమును ఆసక్తి గలవారికి పంచియిత్తుము గాక. అలమేలుమంగా సహితుడగు శ్రీవేంకటేశ్వరుడు ఇట్టి సత్కార్యములు చేయు చిరంజీవులకు ఆశీర్వచన కటాక్షముల నిచ్చుగాక।

మంచాళ జగన్నాథరావు

15-5-1976.

# కృతజ్ఞతలు

నన్ను కని, పెంచి, ప్రేమతో విద్యాబుద్ధులు గఱపి, నా కన్నులు తెరపించిన జననీజనకుల కీనాకృతిని భక్తిపూర్వకముగా నంకితమొనరించుచున్నాను. వారే నాకన్నిట నేడుగడ యైనవారు. నా అంతరంగమున నెలకొని నన్ను గాపాడుచున్నవారు. వారికి నా భక్త్యంజలి

1965 లో పిహెచ్. డి పట్టముకొఱకు ఉస్మానియా విశ్వవిద్యాలయమున సమర్పించిన పరిశోధన సిద్ధాంత గ్రంథమందలి కొంత భాగమును "తాళ్ళపాకకవుల కృతులు-వివిధ సాహితీప్రక్రియలు" అను పేరన 1974.మే, ఆనంద వసంతమున తొలిసంపుటముగా వెలువరించితిని. తాళ్ళపాక గ్రామమున అన్నమాచార్య సంస్మరణివా రేర్పరచినసభలో విద్యామంత్రి గౌ॥శ్రీ మండలి వేంకటకృష్ణారావుగా రా గ్రంథము నావిష్కరించిరి స్వామిపాదముల కంకితమైన ఆ కృతిని దేవస్థానముపక్షమునదేవాదాయశాఖమంత్రి గౌ॥శ్రీరాజా సాగి సూర్యనారాయణరాజుగారు స్వీకరించిరి. నాటి సభకు తిరుపతి దేవస్థాన ధర్మకర్తల మండలి కధ్యక్షులగు శ్రీ చెలికాని అన్నారావుగారు అధ్యక్షత వహించిరి. అప్పుడు వారందరును నాకొసగిన ప్రోత్సాహమే ఇప్పుడీ గ్రంథము- నా సిద్ధాంత వ్యాసమునందలి మఱికొంత భాగము- తాళ్ళపాకకవుల పదకవితలకు సంబంధించినది వెలువడుటకు ప్రధాన హేతువు. వారికి నా కృతజ్ఞతలు. ఇది 1976, మే, నల-వసంతమున వెలువడుచున్నది.

ఈ సందర్భమున ఆర్థికముగా నాక్కొంత తోడ్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారికిని, అచ్చుకు వలసిన కాగితమును సరసమైన ధరకందించిన రాష్ట్రిస్థాయి సంఘమువారికిని, నా పరిశోధనావ్యాసంగమును పర్యవేక్షించిన ఆచార్య శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారికిని, సిద్ధాంతవ్యాసమును ప్రకటించుటకనుమతించిన ఉస్మానియా విశ్వవిద్యాలయాధికారులకును మరల నా కృతజ్ఞతాభివందనము లర్పించుకొనుచున్నాను.

అమూల్యములగు తమ అభిప్రాయముల నొసగియు, ఆశీర్వదించియు

నా యీ కృషిని ప్రోత్సహించిన పండితులకు, ఆచార్యులకు, సహృదయులకు నా కృతజ్ఞతలు.

కోరినంతనే తాళ్ళపాకవారి కవితావృత్తాంతమును సుందరముగా చిత్రించి యొసగిన యువ కళాకారులు, సహృదయులు అయిన శ్రీ సాయికృష్ణగారికి ప్రత్యేకమగు నా కృతజ్ఞతాభివందనములు. కోరినవెంటనే తిరుపతినుండి వలసిన ఛాయాచిత్రములను శ్రమకోర్చి తీయించి పంపిన సోదరులు శ్రీ సింగరాజు సచ్చిదానందంగారికి కృతజ్ఞతలు. కడపజిల్లాలో తాళ్ళపాకవారికి సంబంధించిన సామగ్రిని సేకరించు సందర్భము తోడుపడిన మాన్యశ్రీ పి. యల్. సంజీవ రెడ్డి, కడప కలెక్టరుగారికిని, ఇందు ప్రకటించిన చిత్రములను దీయుటకును, ప్రకటించుటకును దయతో ననుమతించిన ఆ యా దేవస్థానములకు సంబంధించిన కార్యకర్తలకును నా కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నాను.

ఇందు ప్రకటించిన చిత్రముల బ్లాకులను త్వరలోనే సిద్ధముచేసియిచ్చిన డాల్టన్ ప్రెస్‌వారిని, ఈ గ్రంథమునిట్లు ముద్రణలో సుందరముగా తీర్చిదిద్దిన చంద్రశేఖర ప్రింటింగ్‌వర్క్స్ వారిని అభినందించుచున్నాను. ఈ సందర్భమున మాన్యమిత్రులు సర్వశ్రీ రాజన్‌రాజుగారికిని, సోమరాజుగారికిని, ఏ. వి. రావు గారికిని కృతజ్ఞతలు. ప్రెస్ మేనేజరు శ్రీ లీలాకృష్ణరాజుగారిని, జి. ఎల్. ప్రభాకర్, ప్రభృతి కార్మికసోదరులను ప్రత్యేకముగా అభినందించుచున్నాను.

వడివడిగా అచ్చుపని సాగుచుండగా పట్టికలను పదానుక్రమణికలను కూర్చుటలో తోడ్పడిన చిరంజీవులు ప్రభాకరు, ఆదిత్య, విశ్వమోహనులను అభినందించి ఆశీర్వదించుచున్నాను.

హైదరాబాదు,
20-5-1976.

సుధీజన విధేయుఁడు,
**వేటూరి ఆనందమూర్తి.**

# విషయసూచిక

1. ప్రథమాధ్యాయము :

సంకీర్తన వాఙ్మయము—పదకవితలు

కవితావిషయము - 1; అన్నమయ్యకుఁ బూర్వపు దేశి సారస్వతము-7; అనిబంధ పదములు-వచన సంకీర్తన పద్ధతి - 14; వచన సంకీర్తనాచార్యుఁడు - కృష్ణమాచార్యుఁడు—16; నిబంధ కవితాపద్ధతి-40; అన్నమయ్య పురందరదాసు-43 ; హరిదాసకూటము-దాసకూటము-46; నృత్యనాటక శాలలు—సంకీర్తన భాండాగారము-51; తాళ్ళపాకవారి రచనలు-ముద్రణము-53; తాళ్ళపాక వాగ్గేయకారులు - సంకీర్తనల ప్రచారము - 68; తాళ్ళపాకవారి వాగ్గేయరచనలు—నామరూపములు-74; సంకీర్తనపదములు-శిష్టరూపములు—80; శృంగారము-పదరచనలు-82; అవస్థానాయికలు - 95; చతుర్విధ నాయికలు - 102; సంభోగ విప్రలంభములు - 104; సంభోగ ఆభాస-106; విప్రలంభ శృంగారము-108; శృంగార సహకారిణులు - 124; తాళ్ళపాకవారు - క్షేత్రయ్య - 136; ఆధ్యాత్మ సంకీర్తనములు - 142; కల్యాణ గుణములు - 146; పరావ్యూహాది పంచరూపములు-147; పంచాయుధములు-155 భక్తిభేదములు-161; ప్రపత్తి-తదంగములు - 185; పరమాత్ముఁడు భక్తిసులభుఁడు-190; గురుభక్తి-192; తాళ్ళపాకవారి తాత్త్వికత - 195; ఆళ్వారులు-అన్నమాచార్యాదులు-202; ద్రావిడవేదము-ఆంధ్ర వేదాంతము-205.

2. ద్వితీయాధ్యాయము : 218-276

తిరుమల తిరుపతులు-పరిసరములు-218; ఆలయములు-క్షేత్రదైవతములు-228; దిగువతిరుపతి-240; తిరుమల తిరుపతులు-ఆలయోత్సవవిశేషములు-246; కల్యాణోత్సవము-254; మఱికొన్ని యుత్సవములు-సేవలు-262.

3. తృతీయాధ్యాయము : 277-312

తాళ్ళపాకవారు ఆర్జించిన అగ్రహారములు - తిరిగిన దేశములు - కీర్తించిన వేలుపులు - 277 - 312.

4. చతుర్థాధ్యాయము : 313-366

తాళ్ళపాకవారి దేశిగానము - 313., త్రిశ్రచతురశ్రాది గతులు-317.: కొన్ని వింతపదములు-320., బాలగేయములు-327., స్త్రీలపాటలు-334., పారమార్థిక గేయములు-349.,

5. పంచమాధ్యాయము : 367-480

తాళ్ళపాకకవుల భాషాప్రయోగ విశేషములు-367., వ్యాకరణాంశములు-370., ఛందోలంకారవిశేషములు-391., మిశ్రమాండలిక పదజాలము-నానుళ్ళు, పలుకుబళ్ళు, సామెతలు-398., మఱికొన్ని అపూర్వ పద ప్రయోగములు-424.,

6. షష్ఠాధ్యాయము : 481-550

తాళ్ళపాకవారి వాఙ్మయమున ప్రతిబింబించు రాజకీయ మతసాంఘిక పరిస్థితులు : రాజకీయ పరిస్థితులు-481.,

మత పరిస్థితులు-501., పండుగ పబ్బములు-ఉట్లపం
డుగ, తాళ్ళపాకవారు - 506., సాంఘికపరిసితులు-
527., పట్టికలు-545., సింహావలోకనము-550.,

7. పరిశిష్టము : 551-574

తాళ్ళపాకకవులను గూర్చిన చరిత్ర, సంప్రదాయము-
551., ప్రసిద్ధపదానుక్రమణిక-563., కొన్ని ముఖ్యసవ
రణలు-569.



"వితతవృత్తంబుల వేంకటపతికి
శతకంబు కుతుకంబు సమకూరఁజేసె"
(అన్నమా. చరిత్ర. ద్విపద.)

"మును నీనగరిత్రోవ మొగమైనయప్పుడే
ఘనయామ్యమార్గము గట్టువడియె
వొసర నీ తిరుపతి నొకరాత్రి వున్నపుడె
కనలు కాలసూత్రాదిఘాత లెల్లఁ బూడె" (1-12)

నన్ను కని, పెంచి, పెద్దచేసి ప్రేమతో విద్యాబుద్ధులు గఱపిన జననీ జనకులకు

# అంకితము



పితృపాదులు : వేటూరి-ప్రభాకరశాస్త్రిగారు, మాతృశ్రీ : వేటూరి-మహాలక్ష్మమ్మగారు.

# అంజలి

"గురుఁడవు నీవె సుమ్మీ కుమతినైన నాకు
సరవి బ్రహ్మోపదేశము సేసితి
పరమబంధుఁడవైనా పరికింప నీవె సుమ్మీ
పరుస నేఁ జెడకుండ వహించుకొంటివి॥

తల్లివి నీవె సుమ్మీ తగిన విషయాలలో
పల్లదానఁ బడకుండా బ్రదికించితి
అల్లుకొని తోడునీడవైనా నీవెసుమ్మీ
చిల్లరమాయలలోనఁ జెడకుండాఁ జేసితి (వి)॥

దాత(లు) మీరె సుమ్మీ తగు శ్రీ వేంకటనాథు
నా తలఁపులో నిలిపి నమ్మఁజేసితి (రి)
యే తలఁ జూచినా నాకు నేడుగడయు (మీరె)
ఆతల నీతల నన్ను నాదుకొని కాచితి (రి)॥"

ప్రథమాధ్యాయము

# సంకీర్తన వాఙ్మయము

## పద కవితలు

( పుటలు. 1 - 217 )

# సంకీర్తన వాఙ్మయము – పద కవితలు

మన ప్రాచీనలాక్షణికులు కవితా విషయమును గూర్చి ముచ్చటించుచు ఆశు మధుర చిత్ర విస్తరము లనుచతుర్విధ కవితా విశేషములను పేర్కొనినారు. వారువింగడించిన విధమున మన కెఱుకపడియున్న కవితా ప్రక్రియలన్నియు పైన పేర్కొనిన చతుర్విధకవితాశాఖలలో నేదే నొకదానియం దిమిడిపోవుచున్నవి. వారట్లే నిరూపించినారుకూడ. ఈ విభాగమున వారు కవిత్వము యొక్క ఆంతర ప్రకృతికన్న దాని బహిస్స్వరూపమునకే యెక్కువ ప్రాముఖ్యము నిచ్చినట్లు తోఁచును. కాని పాశ్చాత్యభాషాభిజ్ఞులు అట్లుకాక కవితాప్రకృతికే ప్రాముఖ్యమిచ్చి వస్త్వాశ్రయ కవిత (పరాశ్రయ - Objective) యనియు, ఆత్మాశ్రయ కవిత (భావాశ్రయ - Subjective) యనియు, దానిని రెండు విధములుగ పేర్కొనిరి. ఈ వింగడింపున గొంత వాస్తవికత లేకపోలేదు. ఎట్లన – కవితా ప్రాదుర్భావమునకుఁగవి యెట్లుకారకుఁడో అట్లే కవి నుత్తేజపఱచిన ప్రకృతియుఁ గారక మగును. వస్తుతః ప్రకృతి కవీశ్వరుని మనః ఫలకమున వైచిన ముద్ర (Impression) కుత్తేజితుఁడై దానిని వాగ్రూపమున భావావేశముతో నాతఁడు వ్యక్తీకరించుట (Expression)కుఁ జేయుప్రయత్నముననే కవిత యావిర్భవించుచున్నది. అనగా వస్తువు నాశ్రయించిన కవీశ్వరుని భావనయే వాగ్రూపమై కవిత యగు నన్నమాట. అది యట్లేయైనను ఆ భావప్రకటన మొకొక్కమారు వస్తువును కేవల మొక యూతగా మాత్రమే గొని కవీశ్వరుని మానసికభావనయే మిక్కిలిగా ప్రస్ఫుట మగుచున్నరీతి నుండును. దీనిని పురస్కరించుకొనియే పాశ్చాత్యులు కవితావిషయమున ప్రకృతియు భావనయు పరస్పరాశ్రితములగుట నెఱిఁగియు, తత్ప్రకటన సందర్భమున ప్రస్ఫుటముగా గోచరించు నంశమునుబట్టి యెందు కవిభావనకే ప్రాముఖ్యమో దానిని భావాశ్రయకవిత యనియు, మఱి యెందు వస్తువునకే ప్రాముఖ్యమో దానిని వస్త్వాశ్రయకవిత యనియు వింగడించిరి. ఈ విభాగము సమంజసమే.

ఆధునిక మగునీదృష్టితోఁ జూచినపుడు ప్రక్రియా ప్రయోగ వైవిధ్యముగల తెలుఁగుకవితలో వర్ణనాత్మకము లగు నితిహాస పురాణ ప్రబంధాదులును క్షేత్రమాహాత్మ్యాదులును పరాశ్రయకవితావిభాగమునకును, భావనాత్మకములై స్తుతిప్రధానములగు స్తోత్రములు, దండకములు, ఉదాహరణములు,

రగడలు, శతకములు, సంకీర్తనములు మున్నగు కావ్యప్రక్రియ లాత్మాశ్రయ కవితావిభాగమునకును జెందిన వనవచ్చును. ఈ కవితావిభాగములకుఁ జెందిన ఆయా కావ్యప్రక్రియలలోఁగల వైష్ణవవాఙ్మయమును గూర్చి పూర్వము కొంత ముచ్చటించుటయినది[1]. ఇప్పుడిందు ముఖ్యముగా ఆత్మాశ్రయకవితావిభాగమునకుఁ జెందిన కావ్యప్రక్రియ లన్నింటిలోను ప్రముఖమును, వినూత్నమును, పదునైదవ శతాబ్దిమధ్యభాగమున సుప్రసిద్ధవైష్ణవకవు లగుతాళ్ళపాకవారి చేతులలోనే పరిశుద్ధిని బడసినదియును నగు సంకీర్తనవాఙ్మయమును గూర్చి కొంత ముచ్చటింతును. ఆత్మాశ్రయ కవితాస్వరూప మీ సంకీర్తనవాఙ్మయమందే పరాకాష్ఠ నందుకొన్నది.

తాళ్లపాకవారి కాలమున సంకీర్తమునకే 'పద' మనియు వ్యవహారము. దానికే 'గేయ' మనియు నేఁటి వ్యవహారము[2]. "కౄతసంశబ్దనే"- కీర్తించునది కీర్తనము - సమ్యక్కీర్తనము సంకీర్తనము (గీయత ఇతిగీతం), పాడఁబడునది గీతము లేదా గేయము. కాగా అవాఙ్మానసగోచర మగుదివ్యశక్తిని కీర్తించి పాడునది కీర్తనము లేక సంకీర్తనమైనది ఇట్లు గీయమాన మగుకీర్తనమే భక్తుని హృదయమును పరమాత్ముని పాదసన్నిధికిఁ గొంపోవునది. "పదగతౌ" అని అమరము. అందువలన అట్లు తీసికొని పోవునదే 'పద' మనియు రూఢికెక్కినది. ఇట్లు నాఁడు కీర్తనము, పదము అనఁబరగిన రచన సంగీతసాహిత్యముల సమ్మేళనరూపము. ప్రాచీన లాక్షణికు లిందలి సాహిత్యాంశమును 'వాక్' అనియు, సంగీతాంశమును గేయమనియు వ్యవహరించిరి. వీనికే క్రమముగ మాతు, ధాతు సంజ్ఞలు కూడ గలవు. ఇట్లు వాగ్గేయరూప మగుగీతరచన చేయఁగలవారే వాగ్గేయకారులని వారి నిర్వచనము. సంగీతరత్నాకరమున ప్రకీర్ణకాధ్యాయమున వాగ్గేయకారుని లక్షణము నిర్వచించుచు శార్ఙ్గదేవుఁడిట్లు వివరించినాఁడు:

"వాఙ్మాతురుచ్యతే, గేయం ధాతు రిత్యభిధీయతే
వాచం గేయంచ కురుతే యః స వాగ్గేయకారకః"

---

1. చూ. నా గ్రంథము– "తాళ్ళపాకకవుల కృతులు - వివిధసాహితీప్రక్రియలు" ముద్ర-1974, ఆనంద-వసంతము.

2. ఈ నాఁడు గేయ మనుమాటను పాటకుఁ బర్యాయముగా వాడుచున్నారు. కాని ప్రాచీనులు దానిని పాటలోని సంగీతరచనకు మాత్రమే వ్యవహరించిరి.

ఇందు వాక్కు- సాహిత్యముఁగూర్చు -గేయము సంగీతముఁ గూర్చు. సాహిత్యమునకు ప్రాతిపదిక (Fundamental unit) 'పదము'. దాని గుణము భావము. అట్లే సంగీతమునకు ప్రాతిపదిక 'స్వరము'. దీని గుణము నాదము. కనుక భావప్రధాన మగుపదమును (అనఁగా సుప్తిఙ్గన్తమైన దానిని - మాటను = మాతువును) నాదప్రధాన మగుస్వరమును (అనఁగా శరీరమునందలి సప్తధాతువుల సాదృశ్యమున సప్తస్వరముల కేర్పడిన సంజ్ఞగల ధాతువును) గూర్చి-అనఁగా ధాతుమాతువులను గూర్చి గీతమును గూర్పఁగలవాఁడే వాగ్గేయ కారుఁడు. ఇట్లు ధాతుమాతువు లనునుభయసంజ్ఞలతోఁ గూడిన రచన చేయఁగల వాఁడు కావుననే వానికి "ఉభయకారుఁ"డనియు, తదపభ్రంశ రూపముగ 'బయ కారుఁ'డనియు పేరు కలిగినదట. చూ. గోవిందదీక్షితుని సంగీతసుధ - తృతీయ ప్రకరణము.

'మాతూంశ్చ ధాతూ నుభయాన్కరోతి
యస్తం విదుశ్చోభయకారసంజ్ఞం
తమేవలోకా బయకారనామ్నా
పదంత్యపభ్రంశపదేన సర్వే'

దీనినిబట్టి వాగ్గేయకారునకు "బయకారుఁ"డనియు, వాగ్గేయసముదాయ రచనలకు "బయకారము" లనియు వ్యవహార మేర్పడినది. ఈ 'వాగ్గేయకార' పద మునకుఁ బర్యాయమగు 'బయకార' పదము సుమారు 16 వ శతాబ్దమునుండి వ్యవహారమున నున్నట్లుగా శ్రీ రజనీకాంతరావు గారు తమ వాగ్గేయకార చరిత్రము (53 వ పుట) పేర్కొనినారు. అందే వారు లక్షణకారులు పేర్కొన్న వాగ్గేయకార లక్షణము లన్నిటిని గూడ క్రోడీకరించి యున్నారు. తల్లక్షణము లెట్టివన - (చూ. పుటలు 47-55).

| | | |
|---|---|---|
| 1. శబ్దానుశాసన జ్ఞానమ్<br>2. అభిధాన ప్రవీణత | = | సుశబ్దాపశబ్ద వివేచనము. వ్యాకరణ పరిజ్ఞానము. ప్రామాణిక శబ్ద ప్రయోగ పరిజ్ఞానము. |
| 3. ఛన్దః ప్రభేద వేదిత్వమ్ | = | మార్గదేశి ఛందోభేదములనుగూర్చి- అనగా సమ అర్ధసమ విషమాది వృత్తములను గూర్చియు, దేశి రచనలఁ గూర్చియు తెలిసియుండుట. |
| 4. రసభావ పరిజ్ఞానమ్ | = | స్పష్టము. |

5. దేశస్థితిషు చాతురీ = దేశకాలపరిజ్ఞానము, వివిధములగు దేశీయ శయ్యారీతులను గూర్చిన విజ్ఞానము.

6. అశేష భాషా విజ్ఞానమ్ = సంస్కృతము నందును - అష్టవిధ ప్రాకృతము లందును, వివిధ దేశ భాష లందును గల పరిజ్ఞానము.

7. కలాశాస్త్రేషు కౌశలమ్ = స్పష్టము.

8. తూర్యత్రితయ చాతుర్యమ్ = నృత్యగీత వాద్యము లందు నేర్పు.

9. హృద్య శారీర శాలితా = గాత్రమాధుర్య ముండుట.

10. లయతాల కలా జ్ఞానమ్ = ద్రుత మధ్యమాది లయలను గూర్చియు, త్రిపుట రూపకాది తాళములను గూర్చియు తెలిసి యుండుట.

11. అనేక కాకుషు వివేకః = గాన పద్ధతిలోని వివిధములగు యాసల నెరిగియుండుట.

12. ప్రతిభా = స్పష్టము

13. సుభగగేయతా = ప్రసన్నమగు సంగీతరచన చేయఁ గలుగుట

14. దేశీ రాగేష్వభిజ్ఞానమ్ = దేసి రాగాలను గూర్చిన విశేష జ్ఞాన ముండుట.

పై ముఖ్య లక్షణములతోపాటు రోషద్వేష పరిత్యాగము సార్ద్రత్వము, ఉచితజ్ఞత, నూత్నధాతువినిర్మాణశక్తి, ఛాయాపహారములేమి, ప్రబంధేషు ప్రగల్భతా, ద్రుతగీతివినిర్మాణశక్తి, త్రిస్థాన గమక ప్రౌఢిమ-ఆలప్తి నైపుణ్యము, చిత్తైకాగ్రత మొదలగు మఱికొన్ని లక్షణములను గూడ క్రీ॥ శ॥ 13 వ శతాబ్దికిఁ జెందిన శార్ఙ్గదేవుని సంగీతరత్నాకరమునందలివిగా శ్రీ రజనిగారు పేర్కొనినారు.

కావున నప్పటికే అట్టి విశిష్టలక్షణాన్వితు లగువాగ్గేయకారులు మనదేశమం దుండిరనుట రూఢియే- గీర్వాణ భాషలో గీతరచన గావించి, లక్షణకారులకు

బని గల్పించిన 'గీత గోవింద' రచయిత జయదేవుఁడును (12 వ శతాబ్ది), "కృష్ణ కర్ణామృత" కర్త లీలాశుకుఁడును (13వ శతాబ్ది), అట్టి సుప్రసిద్ధ వాగ్గేయకారులే వారి సాహిత్యము నేఁటికిని చెడక యట్లే నిలిచి యున్నది. కాని యప్పటి కింకను ద్రావిడ దేశ భాషలలో నట్టి విశిష్ట గేయ రచనలను వెలయించిన వాగ్గేయకారులెవరేని నుండిరో లేదో కూడ మన కీనాఁడు తెలియవచ్చుట లేదు. ఆ దినములలోనే అనఁగా క్రీ॥ శ॥ 13, 14 శతాబ్దుల నడిమి కాలముననే - ఆంధ్రదేశమున వర్తిల్లినవారును ఆంధ్రులును నగు [1]పాల్కురికి సోమనాథుఁడు, జాయపసేనాని, గోపాలనాయకుఁడు మున్నగువారు గొప్ప రచయితలుగను, అపారమగు సంగీత శాస్త్ర పరిజ్ఞానము గలవారుగను, లక్షణకారులుగను కీర్తింపఁబడినవారున్నారేగాని వారి రచనలేని ఈనాఁడు మనకు లభ్యము కాకున్నవి.

ఇట్లు చూడఁగా క్రీ॥ శ॥ పదునైదవ శతాబ్ది యారంభమున తాళ్లపాకవారుదయించి "సంకీర్తనా పరిశుద్ధి" తో పద రచనకుఁ బూనుకొని లక్ష్యలక్షణ సమన్వయమునకై సంకీర్తనలక్షణమును నిర్వచించువఱకును తెలుఁగున గీత గోవింద కృష్ణకర్ణామృతాదులతోఁ దులఁదూగఁదగిన ప్రసిద్ధ వాగ్గేయ రచనకు ప్రయత్నము జరుగనే లేదేమో అని కూడ ననిపించును. కనుకనే కావచ్చును తాళ్ళపాక అన్నమాచార్యుఁడే పదకవితాపితామహుఁ డనియు, హరికీర్తనాచార్యుఁ

1. పాల్కురికి సోమనాథుఁడు — 13 వ శతాబ్దికిఁ జెందిన సుప్రసిద్ధ వీర శైవ కవి. ఈతఁడు సంగీత శాస్త్రమున నపారమగు వైదుష్యము గలవాఁడుగా గుర్తింపఁబడు చున్నాఁడు. స్వరార్ణవము (లేదా స్వర రాగ సుధారసము) అను సంగీత లక్షణ గ్రంథమును సంస్కృతమున రచించిన సోమనార్యుఁడీతఁడే యగునా? యని పలువురు పరిశోధకుల యభిప్రాయము.

జాయపసేనాని —

13 వ శతాబ్దిలో కాకతీయ గణపతి దేవుని కొలువున గజ సైన్యాధిపతిగా నుండినవాఁడు. నృత్త, గీత, వాద్య, రత్నావళు లనులక్షణగ్రంథములను రచించిన సుప్రసిద్ధ సంగీత నాట్య శాస్త్రవేత్త.

గోపాలనాయకుఁడు—

13 వ శతాబ్ది తుదిభాగమున నుండిన యాంధ్ర వాగ్గేయకారుఁడు. ఉత్తర హిందూ దేశమునకు వెళ్లి అచటి అల్లాఉద్దీన్ ఖిల్జీ ఆస్థానమున ధ్రువాగానపద్ధతిని సభాసదులను మెప్పించి ప్రభు సన్మానమును బడసినవాఁడు.

(చూ. వాగ్గేయకార చరిత్రము—పు-26-30)

డనియు కీర్తింపఁబడినాఁడు. మఱి యంతకుఁబూర్వము పై లాక్షణికులు పేర్కొన్న లక్షణములకు లక్ష్యము లనఁదగిన గేయరచనలేవియును లేకుండెనా యను ప్రశ్నకుఁ జాలినంత సమాధానము దొరుకకున్నది. ఉండియుండినను మాపితృపాదులనినట్లు "అవి యేవో పొడిపొడిగా వెలసిన లఘు రచనలయి యుండునుగాని ప్రఖ్యాతకవు లానుపూర్వితో రచించినవి గావేమో!" అప్పటి జానపదుల వాగ్వ్యవహారమున నలుగుచు, భిన్నములగు దేశివరుసలలో సాగుచుండిన మనోజ్ఞములగు గేయము లందలి మాధుర్యమునకుఁ జొక్కియే కావలెను ప్రాచీన లాక్షణికు లాయా రచనా రీతులలోని ముఖ్య లక్షణములను గ్రంథస్థముఁ గావించుకొనినారు. ఆంధ్రకర్ణా టకములందు ప్రసిద్ధములగు రగడలు, జాజరలు, ధవళములు మున్నగు దేశివరుసలే సంస్కృత (సంగీత) లక్షణగ్రంథములందు రాహడీ, చర్చరీ, పద్ధడీ, ధవ ళము మొదలగు ప్రబంధభేదములుగా రూపొందిన వని యభిజ్ఞు లందురు. అందుకే ఆయా రచనారీతుల ప్రశంసయో, లక్షణమో మాత్రమే మిగిలినదిగాని యప్పట ప్పటి పదకవితలు కర్తృనామాంకములు గలవి మాత్రము కానరాకున్నవి. ఉన్నవేవో వానికి లక్ష్యములుగా నెఱుఁగఁదగినవి జానపదుల వాగ్వ్యవహారమున గొట్టుకవచ్చినవి కొన్ని మాత్రమే యున్నవి. అవి జానపదగేయములే యగుటను బట్టి వాని కాలముగాని, కర్తృత్వముగాని మన కెఱుఁగరాదు.

అందుకే ప్రసిద్ధమగు సంకీర్తన పద రచనా పద్ధతికి అన్నమాచార్యాదులే ఆద్యులని యనుకొనుట ; దాని కొక చక్కని తీరుఁ గల్పించినదియు, దేశమున వ్యాప్తి కల్గించినదియుఁ గూడ మొట్టమొదట వారే. అసంఖ్యాకములుగ నున్న వీరి పదకవితలలోని గౌరవమే తరువాతివారిని జెంది బహుముఖముల వ్యాపించి ఆంధ్ర కళాలక్ష్మి కాధిక్యమును గల్గించినది. వీరి పదరచనలలోని భక్తి శృంగార గానము లనునంశములే క్రమమున రామదాసాదులను జేరి భజన సంప్రదాయ ముగను, క్షేత్రజ్ఞాదుల నాశ్రయించి నాట్యాభినయసంప్రదాయముగను, త్యాగ రాజాదులను బొంది సంగీతసంప్రదాయముగను విస్తృతి నందగల్గినవి.

తాళ్ళపాకవారే యిట్టి సంకీర్తన సంప్రదాయమునకు ప్రారంభకులును, తరువాతివారికి మార్గదర్శకులును అని మన మిపు డనుకొన్నను అంతకు పూర్వము లోకమున వ్యాప్తిలో నుండిన దేశిసారస్వత మెంతయో వారి కా విషయమున చేయూత నిచ్చియుండు ననుట మాత్రము నిర్వివాదాంశము. అందుకే ఇచట ఆ విషయమును గూర్చి యింతక ప్రస్తరించుట అప్రస్తుతము కాజాలదు.

# అన్నమయ్యకుఁ బూర్వపు దేశి సారస్వతము

తెలుఁగువారి దేశి కవిత పదకవిత్వమేగాని పద్యకవిత్వము కాదని విమర్శకు లను మాటలలోఁ గొంత యాథార్థ్యము లేకపోలేదు. పద్యము చదువు కొనుటకును, పదము పాడుకొనుటకును ఉద్దేశింపఁబడినవని వారందురు. తెలుఁగు నందలి దేసిచ్ఛందమును బరిశీలించి చూచినపు డావిషయము మఱింత విస్పష్టము కాగలదు. శ్రీ నిడదవోలు వేంకటరావుగారు ఆంధ్రకవితా పరిణామమును గూర్చి వ్రాయుచు తెలుఁగు కవిత ఏకపదమై,ద్విపదమై,త్రిపదమై,చతుష్పదమై పరిణతిఁ జెందినట్లు కానవచ్చుచున్నదని సూచించిరి[1]. ఈ అభిప్రాయము సమంజసమనియే తోఁచుచున్నది. ద్విపదచ్ఛందము యొక్క పుట్టు పూర్వోత్తరము లెట్టివైనప్పటికి తెలుఁగునందలి దేసిచ్ఛందమున కంతటికి నదియే ప్రాతిపదికమైనట్లు తోఁచును. ఈ ఛందమే తొలుత నేకపదమై కాలక్రమమున నాదిప్రాసను గూర్చుకొని ద్విపదమై, పాదప్రమాణమును రెట్టించుకొని తరువోజపాదమై బహుచిత్రగతు లను వోయినది. ఈ విషయమును బయల్పఱచు శాసనమొకటి యిటీవల బయట పడినది. కడపజిల్లా కమలాపురముతాలూకా తిప్పలూరు శిలాశాసనమిది. లిపిని బట్టి యిది క్రీ॥శ॥ 7 వ శతాబ్ది పూర్వభాగము నాఁటిదై యుండునని శ్రీ కె. ఏ. నీలకంఠశాస్త్రిగారు స్థూలదృష్టిని పేర్కొనఁగా నందలి బార్హస్పత్య మాన కాలమును గుణించి యది క్రీ॥శ॥ 452 సం॥నాఁటిది కాఁదగునని శ్రీ దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డిగారు వివరించినారు.[2] ఇందు శ్రీ రెడ్డిగారు గుర్తించి చూపిన తీరున ద్విపదచ్ఛందము కాననగుచున్నది.

'పుణ్యకుమారున్రి-గణ్యమానున్రు
మఱున్రపిడుమ్ - మద ముదితున్రు
(ఉ)త్తమోత్తముఁడయి-(యుండి)న వాన్రు
త్రిపలియ ప(ట్టు)కా -రేనాన్డు (నే)లు.'

ఇందు యతియు ప్రాసయతియు చెల్లినవి. ఆదిప్రాస కానరాదు. కనుక నిది ద్విపదకును మూలమగు నేకపదమని భావింపవచ్చును. ఇట్టి ఏకపదము నే

---

1. చూ. ఉదాహరణ వాఙ్మయ చరిత్ర - పు - 3.
2. చూ. భారతి - కలగూరగంప - జనవరి 1962 (సం. 39 - సంచి. 1) పుట 87. "తెలుఁగు కవిత్వం ఎప్పటిది" అనువ్యాసము-

తరువాతి కాలమున లాక్షణికులు ప్రాసవిరహిత మగు ద్విపదచ్ఛంద మని తలంచి దానికి విడిగా మంజరీ ద్విపద యని పేరిడియుండవచ్చును. శ్రీ రెడ్డిగారిచ్చిన కాలము సరియగునేని దేసికవిత కనవచ్చిన తొలితెలుఁగుశాసన మిప్పటి కిదియే యగును. ఇట్లే శ్రీ రెడ్డిగారే క్రీ॥శ॥ 6వ శతాబ్దినాఁటికి చెందిన కడప జిల్లా పొట్లదుర్తి-మాలెపాడు శిలాశాసనమున ద్విరదగతి రగడ యుండుటను గుర్తించినారు.

'అణవొతలు రేవణకాలువు-ద్దణకాలు
ఇచ్చిన పన్నస పెన్వాటె- ఇశిరేనికిన్'[1]

ఇఁక క్రీ॥ శ॥ 9 వ శతాబ్ది యందలి చాళుక్య గుణగవిజయాదిత్యుని కాలము నాఁటి అదంకి శాసనములందలి తరువోజలు ప్రసిద్ధములే. అదేకాలమునకుఁ జెందిన నెల్లూరుజిల్లా కందుకూరుగ్రామమునందలి శిలాశాసనమున గుర్తింపనైన శిథిల సీసపద్యము నొకదానిని శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి గారే ప్రకటించినారు.

శ్రీనిరవద్యుణ్డు — సి త్త......సముణ్డు
శివ పద వర - సేవితుణ్డు
ఖిలిణ్డొనతరిపు — బలుణ్డాహవరాధ
రణ్డయోగ్య సిఘను - నుణ్డగణిత
... ... ... ... ... ...
... ... పణ్డరంగు ... ...
... ... ... ... ... ...
గణకెన లాత ప-తుపాతి ......[2]

అటు తర్వాత శాసనాదులందు దేశికవిత పుష్కలముగానే కానవచ్చినది. యుద్ధమల్లుని బెజవాడ శాసనమునందలి మధ్యాక్కరలు ప్రసిద్ధములే. ఇంచుక

---

1. పరిశోధన తొలిసంచిక (ఏప్రియల్ - 1954) పు. 4. లో శ్రీ దేవరపల్లి వారి 'తొలితెలుఁగు శాసనము-దేశికవిత' మరియు, పరిశోధన (అక్టోబర్, నవంబర్ 1954) పుట 56 లో మొదటి గేయ శాసనం శ్రీ దేకుమళ్ళ కామేశ్వరరావుగారి వ్యాసము.
2. చూ. పరిశోధన - తొలి సంచిక ( ఏప్రిల్ 1954 ) పుట - 4.

తర్వాతి కాలమున నన్నయ కూడ మధ్యాక్కరలను వాడి యున్నాఁడు. కాని వీరి మధ్యాక్కరలు దేసితెలుఁగు మధ్యాక్కరలలోని గానానుకూలమగు సంప్రదాయ మును పోషించినట్లు లేదు -
మన ప్రాఁత పాటలలో.

'అంతట రాములవారు - అంగన సీతనుగూడి
సంతసమందుచు వేగ — స్వపురమునకు చనుదెంచ్రి.'

అను పంక్తులందుగల ఛందము అచ్చమగు దేసిమధ్యాక్కర చ్ఛందమే. [1] సరిగా చతుర్థగణ ప్రథమాక్షరమే — మధ్య అక్కరమే - యతిస్థానము గలది. కాని శాసనస్థ మధ్యాక్కరములు-

"స్వస్తి నృపాంకు శాత్య స్తవత్సల సత్యత్రినేత్ర
విస్తర శ్రీ యుద్ధమల్లుఁ డనవద్య విఖ్యాతకీర్తి"

అను రీతిని సమాసభూయిష్ఠములై, మధ్య అక్కరమునగాక పంచమగణ ప్రథమాక్షరమున యతిచెల్లుచు గానానుకూల్యము లోపించినవై యున్నవి. వాని సౌందర్యమునెరిఁగి మరల వానిని శిష్టసాహిత్యమున సరిదిద్ది 'మధ్యాక్కర'గా వాడుకొన్నది సంగీతరసికుఁడును, ప్రబంధపరమేశ్వరుఁడు నగు నెఱ్ఱా ప్రెగ్గడయే.

పైన పేర్కొనిన ద్విపద, తరువోజ, సీస, రగడ, మధ్యాక్కర మున్నగు ఛందములు తెనుఁగున దేసితనముగలవై గానయోగ్యములై ప్రచారమున నున్నట్టివే. వీనిలో ద్విపదను నన్నయ భారతమున వ్రాయకున్నను తద్వికార మనఁదగు తరువోజను గ్రహించెను. అతని భారతమున 'రగడ' రచనలు లేవుకాని నాఁటి చాళుక్యరాజరాజు కోరుమిల్లి శాసనమున భిన్నయతులుగల సంస్కృత రగడ రచన యున్నది. కావున శిష్టసాహిత్యమునఁగూడ నీ తీరురచనల కానాఁడే ప్రవేశము కలిగినదని చెప్పవలసి యుండును.

ఇఁక నన్నిచోడుఁడు దేసికవితను పేర్కొని "దేసి సత్కవుల సంస్తుతి చేసి"యేయున్నాఁడు. అంతేకాదు దేసికవితాశాఖకుఁ జెందిన తన కాలపు గేయ

1. చూ. "తెలుఁగుకవితలోని దేసితనము." శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారి వ్యాసము - తెలుఁగు మెఱుఁగులు.

ఫణితులను గొన్నిటినిగూడ పేర్కొనెను. అతఁడు కుమారసంభవమున ఈశ్వరుని గూర్చిన 'అంకమాలికలు' (3-38, 11-51), కల్లుదించువారి 'గౌడు గీతములు' (6-45), శబరకామినుల 'రోఁకటిఁ గొనిదంచు' పాటలు (6-47), ఉవిదలింపుగపాడు 'నూయలపాటలు'(4-89) మున్నగు వానిని ప్రస్తావించుచు 'వనపాల బాలికలు నవలతికాందోలముల వేడ్కసలుపుచు నాలతు లొగిఁజేసి పాడి'న (4-112) విధమునుగూర్చియు అంకమాలికలను 'పనిగొన సాహుళి ఫలమంజరమునఁ బౌరాళి నాందోళి భైరవి నాట నునుపార నాలతుల్ నూల్కొనఁజేసి' (9-135) పాడిన రీతినిగూర్చియుఁగూడ కొంత వివరించెను. ఇవి యెల్ల నాఁడు ప్రచారమందుండిన దేసివరుసలే. వీనిలో 'అంకమాలికలు' పాడు కొనుటకు వీలుగా నక్షరక్రమమున మాలికారూపమున పాల్కురికి సోమనాధుఁడు రచించిన 'అక్షరాంక మాలిక'లను గద్యపద్యాదులను బోలిన రచనలేమో! ఇఁక నతఁడు పేర్కొన్న ఊయల, దంపుళ్ళ పాటలు నాఁటివి కానరాకున్నను నేఁటికిని ప్రచారమందున్న వరుసలే.

నన్నెచోడుని తర్వాత సమకాలిక సంగీతరచనావిశేషములను గూర్చి విపులాతివిపులముగా ప్రస్తావించినవారిలో పాల్కురికి సోమనాధుఁడు ముఖ్యుఁడు. ఈతని బసవపురాణ ద్విపదల నానాఁడే 'ఏలలవెట్టుచు నింపు సొంపారు శైలిచేఁ గ్రాలుచుఁ' జదివెడివా రట. 'సకల పురాతన చారుగీతములు ప్రకటించి ప్రకటించి పాడెడువా'రట.[1] ఈతఁడు తన కృతులలో నెన్నోతీరులగు దేసి గేయ రచనములను పేర్కొనెను. (చూ. పండితారాధ్య చరిత్ర– పు- 513)

'పదములు తుమ్మెదపదముల్, ప్రభాత
పదములు, పర్వతపదము లానంద
పదములు, శంకర పదముల్, నివాళి
పదములు, వాలేశు పదములు, గొబ్బి
పదములు, వెన్నెల పదములు, సంజ (సెజ్జ)
వర్ణన మఱి గణవర్ణనపదము-లర్ణవఘోష ఘూర్ణిల్లుచు నుండఁ
బాడుచు నాడుచు పరమహర్షమునఁ-గూడి సద్భక్త సంకులమేగుదేర-

ఇవికాక జోలపాటలు, కోలాట పాటలు, చాగుభళాలు మున్నగువానిని గూర్చి కూడ ప్రస్తావించుచు వానివాని తీరుతెన్నులను గొంత వివరించినాఁడు. బసవని పెండ్లిలో-

(1) చూ. పండితారాధ్య చరిత్ర- పు. 433.

'కోలాటమును బాత్రగొండ్లి పేరణియుఁ-గేళిక జోకయు లీల నటింపఁ
బాయక 'చాగు బళా!' యను శబ్ద - మాయతి నాకసం బంది ఘూర్ణిల్ల
నలిరేగి వేణువీణావాద్యవితతు - లులియుచు లీలతో నొక్కట మ్రోయ
నానందగీతంబు లగ్గించువారు- పూని శంకరగీతములు పాడువారు
జతి గీతములమీదఁ జప్పట లిడుచు-నతిశయ శివభక్తి నాడెడువారు'

(బసవ పు- పు. 22)

"పంబిన వివిధ వాద్యంబులుఁ దమ్మ-టంబులు నిస్సహణంబులు సెలఁగ
నందంద చాగుబళా! యంచు నేఁగు - నంది కోలలవారు ముందటిగములు
వేడుకఁ గోలాటమాడెడువారుఁ - గూడలి త్రిపురాంతకుని కొల్చువారు
గెడఁగూడి పసిఁడి గిర్గిట కేళికలను - గడునొప్ప సొన్నలికపురంబువారుఁ
జేరువనాడెడు పేరణి విధము సౌరాష్ట్రనాయకు సంప్రదాయంబు
వేడుకఁ బ్రతిజోక లాడెడువారుఁ-గూడలి సంగయ్య కొలువు నర్తకులు." (బసవ
పు- పు. 29)
"పన్నుగా నుదరంబుఁ బాన్పుగాఁజేసి- మన్ను జోసఱచుచు నవ్వుతఁ బాడు."

(బసవ పు- పు. 68)

ఇట్లే "చుట్టును చప్పటులు పెట్టి గునిసి గునిసి యాడు" వారినిగూర్చియు, "కోయని యార్చుచు కనిసియాడుచు, చాగుభళాయను" వారిని గూర్చియు, "వేడుకతోఁ జిందులాడంగ నుబ్బి కోడంగియాటల గునిసెడి" వారిని గూర్చియు, నీతఁడు పలుతావుల ప్రశంసించెను. ఈతని వివరణను బట్టి శివ మహోత్సవము లలో - నానంద సమయములలో- పాడుకొను "కోలాటపు పాటలే"- "చాగు భళాలే" - ఆనంద పదములనియు, "చప్పట్లు పెట్టి" గునిసి గునిసి యాడు నప్పటి పదములే గొబ్బి పదములనియు, "జోసఱచు" నప్పుడు పాడు పాటలే జోలపాటలనియు తెలియనగును. ఇట్టివే మిగిలిన పాటల స్వరూపములు కూడ నేఁడు దేశమున ప్రచారమున నున్న ఆయా పదములఁ బోలినవే యై యుం డుననఁ దగును. సోమనాధుఁడీ పదములను పేర్కొనుటే గాక ఆయా పాటల లోని వివిధములగు దేశీయసంప్రదాయములను గూడ పేర్కొనుటనుబట్టియు, సంగీతశాస్త్రమునకు సంబంధించిన నాఁటి రాగములు, శ్రుతులు, ఠాయములు, సాళగ తాళగతులు, ఆళతులు మున్నగు సాంకేతికాంశముల నెన్నిటినో పేర్కొ నుటను బట్టియు నాతఁడు సమకాలికమగు దేశీయగానసంపద నెంతో ఉద్ధరించి

పోషించిన వాఁడుగాఁ గనఁబడుచున్నాఁడు. సోమననాఁటి సంగీతసంప్రదాయ మును గూర్చి శ్రీ రజనీ కాంతరావుగారిట్లు వ్రాయుచున్నారు.

"పాల్కురికి సోమనాథుని సంగీత శాస్త్రవైదుష్యము అసాధారణము అయివుండాలి. భారతదేశములోని వివిధ రాజ్యాలలో నెలకొని, అలముకొంటూ వుండిన వివిధ సంగీత పద్ధతులలో సోమనాథునిది ప్రత్యేకించి చెప్పఁదగిన శాఖ అని తోస్తుంది. ఈ శాఖలోని కొన్ని అంశములకు శార్ఙ్గదేవుఁడు మొదలైన సమ కాలిక లక్షణ కర్తల పద్ధతిలోని అంశములతో ఏ కొంత మాత్రమో సాధారణ దృష్ట్యాసామ్యం ఉన్నప్పటికీ విశేషాంశా లెన్నిటినో సోమన పద్ధతి తన కాలపు దేశీయగానసంపద నుండి పుణికి పుచ్చుకున్నట్లు ఊహింపవచ్చు[1]." కావున సోమనాథుని కాలమునకే భారతీయ సంగీతమున మార్గపద్ధతితోపాటు దేశిపద్ధతి కూడ పుష్కలముగా చోటు చేసికొని సంగీతజ్ఞుల దృష్టి నాకర్షించినదనియే చెప్పనగును. కాని మన దురదృష్టమున సోమనాథుఁడు పేర్కొన్న పదప్రక్రియ లలో పెక్కులీనాఁటికి లక్ష్య లక్షణోదాహరణములు లేని వట్టి పట్టికలుగా మాత్రమే మిగిలిపోయినవి. సోమన పేర్కొనిన పదప్రక్రియ లట్లుండగా నాతని అక్షరాంక పంచప్రకారాది గద్యములును, బసవాష్టక గంగోత్పత్తి సద్గురు చెన్న బసవ రగడాదులును సుప్రసిద్ధములగు గేయ కృతులే యనవలెను. వీనిలో గద్య మయములగు నీతని గేయ కృతులే తరువాతి కాలమున వచనసంకీర్తనపద్ధతి యను నొక నూతనపద్ధతికిఁ గూడ దారి తీసినది. సోమనాథుని ఈ రచనల తరువాత చక్రపాణి రంగనాథుని రచనలుగా శ్రీ ప్రభాకరశాస్త్రి గారిచేత[2] నిటీవల ప్రక టింపఁబడిన నయన సమశ్శివాయ రగడలును, కృష్ణమాచార్యుని రచనలుగా నా పరిశీలమున గుర్తింపఁబడిన రామనామ నృసింహనామము[3] లనఁబడు రగడ రచనలు నిట పేర్కొనవలసి యున్నది.[4] వీని తరువాత నాచన సోమనాథుని జాజరపాటయే మనకు నేఁటికి లక్ష్యోదాహరణముగ నించుక మిగిలియున్నది.

---

1. చూ. పరిశోధన. ఆగస్టు - నవంబరు - సంచిక 1955 - పుట 105

2. చూ. రంగనాథుని శివ కవిత్వము T.T.D.O.R.I. Journal.

3. చూ. నా వ్యాసము "పదకవితా ప్రపితామహుఁడు"-కృష్ణమాచార్యులు-భారతి.

4. పోసెట్టి లింగకవిచే నవచోళచరిత్ర ప్రస్తావనలో నాదిమశివకవిస్తుతిలో పాల్కురికి సోమనాథుని పిమ్మట సుప్రసిద్ధ గేయ రచయితగా స్తుతింపబడినట్లు (శ్రీగాల్ల పాటి లక్ష్మయ్యగారి కాలమునకే చెందినవారనియు నేడు దేశమున ఏగంటి వారి పదము

'వీణాగానము వెన్నెల తేట - రాణమీరగా రమణుల పాట
ప్రాణమైన పిన బ్రాహ్మణు వీట - జాణలు మెత్తురు జాజరపాట'

ఈ జాజరపాట ఆతని వసంతవిలాస మనుప్రబంధమందలిదిగా లాక్షణికులు పేర్కొన్న విషయమును శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు వ్రాసి యున్నారు.[1] ఇదియే కవి పేరును కాలము తెలుఁగఁదగిన లభ్యమైన పాటలలో మొదటి (జాజర) పాట

అటు తర్వాత కవిత్రయమున తుదివాఁడగు ఎఱ్ఱాప్రెగ్గడ సంగీతరసికుఁడు. ఈతఁడు తన హరివంశ నృసింహ పురాణములలో "ఆ కళయందు తనకుఁగల గొప్పరసికతనేకాదు, విజ్ఞానమును కూడ విస్తారముగా చూపుకొనెను. దీనికి తోడు ఎఱ్ఱన్న కాశ్రయమిచ్చినప్రభువు ప్రోలయ వేమారెడ్డి నృత్తగీత కళాసల్లీలోపేతోత్సవుఁడు[2]". అట్లే తరువాత పోతన, శ్రీనాథుఁడు మున్నగు కవులు కూడ తమ తమ సంగీతరసికతను ప్రదర్శించుకొనిరి. పోతన్న 'గోవిందు మీఁది పాటలు', "బాలు నంకించి పాడెడు పాటలు" పేర్కొనగా శ్రీనాథుఁడు జాజర లనఁబడు చర్చరీ గీతములను పల్నాటివీరకథలు గల జానపదకథాగేయములను తన రచనలలో విస్తారముగా ప్రశంసించెను. స్వయముగా వానిని ద్విపదలలో వెలయించెను. అంతేకాదు, దేశి గేయరీతులుగల రచనల కాలవాల మనఁదగు "యక్షగాన" పద్ధతినే పేర్కొనెను. మడికి సింగన "చతురలీలల నాడి సంకీర్తనము చేసిన" వైఖరిని ప్రస్తుతించెను. ఆ పిదప తాళ్ళపాకవారికి సమకాలికులును తరువాతి కాలమున వచ్చినవారును నగు ప్రబంధకవు లందరును తమకుఁ గల సంగీత రసి

---

లనియు, తత్త్వములనియు, ఏలలనియు ప్రసిద్ధములగు గేయ రచనలు వారివే యనియు, ఏగంటి నంజేశున కంకితములనియు శ్రీ మల్లంపల్లి శరభయ్యగారు వ్రాసియున్నారు. (చూ. మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారపు బులిటిన్ Vol. 7-1-1954) ఈ లక్ష్మయ్యగారి గేయరచన లేమోగాని, ఏగంటి సిద్ధయ ప్రభృతులవిగా భిన్న కర్తృకములుగా గోచరించు ఏగంటివారి పదములు తత్త్వములు మున్నగు రచనలు తాళ్ళపాకివారి కించుక తరువాతికాలమునకు చెందినవేమో యనిపించును.

1. చూ. నాచన సోముని ఉత్తర హరివంశము పీఠిక.
2. చూ. శ్రీ రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మగారి వ్యాసము "సంగీతము" తెలుఁగు విజ్ఞాన సర్వస్వము 3 వ సం॥పుట 687.

కతతోపాటు ఆ కళయందు తమకుఁగల వైదుష్యమును గూడ వేవిధముల వెల్లడించుకొన్న విషయము వ్యక్తమే.

ఇటుచూడగా అన్నమాచార్యులకుఁ బూర్వమే నూరు నూటయేఁబది యేండ్లకుఁ బైపడిన సంగీత సంప్రదాయ మొకటి మార్గదేశిపద్ధతుల సమ్మేళనముతో సోమనాథుని కాలమునుండియు తెలుఁగునాఁట వర్ధిల్లుచుండిన దనియు, వానినెల్ల నాకళించుకొనియే తాళ్ళపాకవారు "సంకీర్తనా పరిశుద్ధిన్ దగఁజేయఁబూని" లక్ష్యలక్షణములను రచించినాఁ రనియు దెలియఁగలదు.

## అనిబంధపదములు-వచన సంకీర్తన పద్ధతి

తాళ్ళపాకవారి "సంకీర్తన లక్షణమున" సంకీర్తనము లేదా పదము అనఁబడు నీ గేయరచన వృత్త, నిబంధ, అనిబంధ పదములని ముత్తెఱఁగులుగా విభాగింపఁ బడియున్నది. వానిలో వృత్తపదములు సంస్కృత మందలి 'షడ్వింశచ్ఛందోభేదము'ల నుండి యావిర్భవించినవని చెప్పిన పిదప వారు అనిబంధ పదములను "ధరఁ గృష్ణాచార్యాదికపరికల్పిత పదమనియు, "నిబంధ పదమును" 'తాళ్ళపాక అన్నయ గురూక్తిన్ లోకవిఖ్యాతమై జితమాధ్వీకసితా సుధారస రుచిస్ఫీతంబులై చెన్నగు' నది యనియు వివరించుకొనినారు. వీనిలో అనిబంధ నిబంధ పదరచనములని రెండువిధములుగాఁ గల రచనా పద్ధతులలో అనిబంధ పదరచనా విధానమును వచనసంకీర్తన పద్ధతి యనియు, నిబంధ పదరచనా విధానమును పదకవితా పద్ధతి యనియు స్థూలముగా నేఁడు మనము సౌలభ్యము కొఱకై విఙగడించుకొనవచ్చును. వీనిలో పదకవితా పద్ధతి క్రీ॥ శ॥ 15 వ శతాబ్ది నుండియే తాళ్ళపాకకవుల మూలముననే ప్రసిద్ధి నందినట్టిది. వచన సంకీర్తనపద్ధతి అంతకెంతో పూర్వమే వీరశైవకవులచే నారంభింపఁబడి వైష్ణవులగు కృష్ణాచార్యాదులచే పాటింపఁబడి, తాళ్ళపాకవారిచే పోషింపఁబడి వర్ధిల్లి నట్టిది. కావున తొలుత ప్రాచీనమగు నీ వచనసంకీర్తన పద్ధతిని గూర్చియే వివరింతును.

**వచన సంకీర్తన పద్ధతి:—**

ఈ శాఖలో లబ్ధసారస్వతముస వీరశైవ కవియగు పాల్కురికి సోమనాథుని 'గద్య' లనియు "రగడ" లనియుఁ గల గేయరచనలే తొల్తటివి. లయతాళబద్ధములై మాత్రాచ్ఛందమున గల యా రచనలను నాఁడు వారు పాడుకొనుచుండి

నట్లు సంప్రదాయమున్నది. ఇది అంతకును బ్రాచీనమగు కన్నడ వీరశైవ సంప్రదాయము ననుసరించినట్లున్నది. ఇట్లే శంకర వచనములు, కాలజ్ఞాన వచనములు, శివయోగ వచనములు (లేదా కాశికాధీశ్వర వచనములు), భవానీ మనోహరవచనములు మున్నగు శైవవచనరచనలు కొన్ని కానవచ్చుచున్నవి కాని వాని కాలమును గూర్చి కాని, కర్తృత్వమును గూర్చికాని మనకేమియు తెలియరాదు.[1]

ఇటీవల శ్రీహస్నాబాద నాగలింగ శివయోగి యనువారు అక్టోబరు 1963 భారతిలో 'గంగాధరయ్య' వచనము లనునొక వ్యాసమును ప్రకటించిరి. అందు వారు తద్వచన కావ్యకర్త కాసె సర్వప్ప వంశీకులలో 13 వ శతాబ్దికిఁ జెంది "బయకారములు పెక్కు పద్యకావ్యములు నయమున జెప్పిన నాగరీకుఁ" డగు "గంగాధరుఁడే" అని వివరించిరి. వీరుదాహరించిన వచనములలో సంతమునఁ గల 'కరుణించవే కరుణాకటాక్ష గంగాధరయ్యా' అను మకుటములందు గంగాధరుని సంబుద్ధిలో కవి స్వీయనామమును గూడ ముద్రాలంకారమున గూర్చుకొనె నన్నమాట. కాని తెలుఁగున ప్రాచీనులగు వచన రచయితలెవ్వరు నిట్లు మకుటమున స్వీయనామాంక సంబుద్ధులను గూర్చియుండలేదు. ఏమో - తద్వచన కర్త 'గంగాధరుఁ'డను పేరుగలవాఁడగుటయు 'కాసె' యింటిపేరు గలవాఁడగుటయు వ్రాతప్రతియందు స్పష్టోక్తియగునేని వారనినట్లు ఆతఁడు కృష్ణమాచార్యునకు ఇంచుక పూర్వుఁడో సమకాలికుఁడో కాఁదగుననుటకు సందేహములేదు.

అటుతర్వాత వైష్ణవ వచన సంకీర్తన రచయితలలో ప్రప్రథముఁడును, తాళ్ళపాకవారిచేత అనిబంధపదరూప మగుచూర్ణాఖ్యపదమునకుఁ బరికల్పకుఁ డని కీర్తింపఁబడినవాఁడునునగు కృష్ణమాచార్యుఁడే ప్రముఖుఁడు. ఈతఁడు కాకతి రెండవ ప్రతాపరుద్రుని కాలము (క్రీ॥ శ॥ 13 వ శతాబ్ద్యంతము)నకుఁ జెందినవాఁడు. 'సింహగిరి నరహరి నమోనమో దయానిధీ' అను మకుటముతో సింహగిరి నరహరి వచనములనుపేర నాలుగులక్షలకుపైగా రచించి తనిసిన యాతఁ డీధన్యాత్ముఁడు. శైవులయు, కర్ణాటకులయు వచనరచనలు 'వచన శాస్త్రముగా' పేరొందగా వీరి రచనలు 'వచన సంకీర్తనములు'గా ప్రసిద్ధికెక్కినవి. ఈ భక్తి రచనములను కృష్ణమాచార్యుఁడే 'సంకీర్తనము' లనియు, 'ధ్యాన

1. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు తమ వేంకటేశ్వరవచనముల పీఠికలో - "అవి యెల్ల నించుమించుగా బదునాలుగవ శతాబ్దికిఁదరువాతివే కాఁదగు ననుకొందును." అని వ్రాసియున్నారు. (పుట-8)

సంకీర్తనము' లనియు పేర్కొనెను. లభ్యములగు నాతని వచనములనుబట్టి యవి నాఁడు రాగతాళములతో పాడఁబడుచుండినట్లు తెలియుచున్నదేకాని నాఁటి రాగతాళముల నిర్దేశము మన కిపు డెరుగరాదు. 'సంకీర్తన లక్షణము' రచించు నాఁటి కీతాళ్ళపాకవారికే తెలియదేమో ! అందుకే వారు అట్టి రచనలను 'తాళ బంధచ్ఛందోవిరహితమై చూర్ణాఖ్యంబరగు' నని నిర్వచించినారు. కాని యటు తర్వాత పదునైదవ శతాబ్ది తుదిభాగమున వెలసిన తాళ్లపాక పెద తిరుమలాచార్యుని 'వైరాగ్య వచనమాలికాగీతము' లనఁబడు 'వేంకటేశ్వర వచనము' లకు తాళ్లపాకవారే రాగతాళములను నిర్దేశించి రాగి రేకులపైఁ జెక్కించియున్నారు. కావుననే 'కొందఱిచేఁ దచ్చూర్ణంబందముగాఁ దాళగంధియనఁబొగ డొందున్' అని వారే చెప్పుకొనినారు. పూర్వోదాహృత వచన రచనలకన్న తాళ్లపాకవారి వచనము లందు 'తాళ ప్రమాణముగడుఁ జెలువై'యుండుట వాస్తవమేగాని కృష్ణమాచార్య సంకీర్తనములుగూడ తాళగంధి చూర్ణకములే యగుట గ్రంథస్థవిషయమునుఁబట్టి ప్రసిద్ధమే.

ఇట్లు రాగతాళములతోఁగూడి భక్తితోఁ బాడుకొనుటకు వీలగునిట్టి వచన సంకీర్తనములు రచించినవారిలో సుప్రసిద్ధుఁడును, అట్టి వైష్ణవ కవులలో ప్రప్రథముఁడును నగు కృష్ణమాచార్యుని జీవిత రచనలనుగూర్చి యించుక వివరించుట ఆవశ్యకము కాకపోదు.

## వచన సంకీర్తనాచార్యుఁడు - కృష్ణమాచార్యుఁడు

శిఖా, యజ్ఞోపవీతము, కటిసూత్రము, కాషాయవస్త్రము ధరించి, లలాటమున తిరుమణి తిరుచూర్ణములు తీర్చి, దండెయు, చిటితాళంబులను సంధించుకొని ఘుమఘుమ ధ్వనులు మ్రోయఁగా దండెమీటుచు, తాళముగ్గళింపుచు, పంచమవేద శ్రుతులను చాతర్లక్ష సంకీర్తన వాక్పూజలుగా గానముచేసి, సింహాద్రి నారసింహుని పరవశింపఁజేసిన పరమభక్తుఁడు కృష్ణమాచార్యుఁడు.

ఈతని కాలము కాకతీయ చక్రవర్తియైన రెండవ ప్రతాపరుద్రునకు సమకాలమని, ఏకశిలా నగర వృత్తాంతము, ప్రతాపచరిత్రము మున్నగు గ్రంథములనుఁ బట్టి తెలియుచున్నది. అనగా క్రీ॥ శ॥ పదమూఁడవ శతాబ్ది తుదిభాగమన్నమాట. ప్రభువు లీ భక్తసుకవిని మెచ్చి, సన్మానింపగా నా సన్మానములను కూడ నీతఁడు స్వామికే యర్పించుకొనినాఁడట. అట్టి - ఈ మహ

నీయుని జీవితవాహిని తొలుత కొన్ని యొడుదుడుకులకు లోనైనను, కొందఱు భాగవతోత్తముల సంసర్గమున పవిత్రీకృతమై, సరళ మగుభక్తిమార్గములఁ బ్రవహించి ప్రవహించి, తుదకు దయాసముద్రుఁ డగుపరమపురుషుని చేరుకొనినట్లు తెలియుచున్నది.[1]

ఈ పుణ్యాత్ముఁడు వికృతినామ సంవత్సరమున ( 1290 A. D. ) దక్షిణభారత మండలి సంతూరు[2] అను గ్రామమున ఒక వైష్ణవకుటుంబమున జన్మించినట్లును, తదుపరి పదునారేండ్లకు సంకీర్తన రచన కారంభించినట్లును తంజావూరి తాళపత్ర ప్రతిలో నున్నది. కాని నాకడనున్న ఒక తాళపత్ర గ్రంథమం దిట్లున్నది.

"దేవా ! సర్వపరిపూర్ణంబైన మీరు పుట్టించిన జంతురాసులలో నేను మానవుండనై జన్మించి అనేక కర్మంబులు జే...న విస్తారంబులు తేటతెలియక ఏ విధంబునం గానక యుంటినో దేవా నీవు నా మనంబున బాంధవ గోత్రాది వరులను గడిపితివిగాన నీ జపంబునంజేసి తారణనామ సంవత్సర భాద్రపద మాసంబున కృష్ణపక్షము గురువారము దినమందున 14 ఘడియలమీదట శ్రీ మధ్యాంత(?)నే పొడగంటినో దేవా : ప్రహ్లాద నారద పరాశర పుండరీక

1. కృష్ణమాచార్యుని చరిత్రోదంతములు స్వీయచరిత్రాత్మకములైన యాతని వచన సంకీర్తనములను బట్టియే కొంతకొంత గుర్తింప నగుచున్నవి. కాని యిట్టి సంకీర్తన ప్రతు లన్నిటియందువలె కాక, తంజావూరు సరస్వతీ మహలు పుస్తక భాండాగార మందలి "విష్ణునామసంకీర్తనఫలము" ( సంఖ్య 448) అను వచన సంకీర్తన సంచయమున నీతని వృత్తాంతము సమగ్రముగా లిఖింపఁబడి యున్నది. దాని ననుసరించియే పూజ్యులు శ్రీ నిడదవోలు వేంకటరావుగారు అతని జీవితవృత్తాంతమును "కృష్ణమాచార్యులు - ఆంధ్రప్రదేశము" అను వ్యాసమునఁ గొంత వివరించియున్నారు. (చూ. ఆంధ్రప్రదేశ అవతరణ సంచిక-వేంకట్రామా అండ్ కో- పుటలు -151-154.)

2. సంతూరు అను గ్రామము తిరునల్వేలి జిల్లాలో నొకటిగలదు. ఉత్తరార్కాడు కంగుంది డివిజనునందు కూడ నీ గ్రామమొకటి గలదని శ్రీ నిడుదవోలు వేంకటరావు గారు వ్రాసిరి. వీనిలోనేదేని యాతని జన్మస్థానమై యుండవచ్చునని వారు భావించిరి. నా కడనున్న ప్రతిలో సంతూరు సంతనపుర మను పేరున వ్యవహరింపఁబడినది ఈ "సంతూరు" తెలంగాణా మహబూబ్‌నగర్ జిల్లాలోని సంతవూరు కావచ్చునని మా మిత్రులు డా॥ ఎం. కులశేఖరరావుగారు వ్రాసినారు. ఈ యభిప్రాయమే సమంజసమని తోఁచుచున్నది. (చూ. సింహగిరివచనములు. ముద్ర. 1968)

వ్యాసాంబరీష శుకశౌనకాది పరమభాగవతుల పొడగంటినో దేవా ! మీ తిరుమణి తిరుచూర్ణంబులతో ఆడుచుం బాడుచు ఉగ్గళింపుచు మీ తిరునాళ్ళ తిరుమేని యందు అవధరిస్తిరిగాన మా యతిరామానుజా ! దేవా ! నాకు హితుండవు. అనుకూల శత్రుండవుగాక వెనుకటి జన్మంబున పుట్టింపుచు గిట్టింపుచు నరకానం బడద్రోయుచు వేయుచు త్రోయింపుచు పరమాచార విశేష భాగవతుల సమ్మర్దం వల్ల నిన్నెరింగితిగాన అది యెరింగి నన్ను దయజూడవో మా యతి రామానుజ ముని వరందాతారు నారసింహగిరిహరీ నమో నమో !"

ఈ వచనమునుబట్టి తారణవర్షమున నా తిథి వారములకు సమమైన క్రీ॥ శ॥ 1284, ఆగస్టు 31 తేదీనగాని, సెప్టెంబరు 7 వ తేదీనగాని కృష్ణమాచార్యులకు స్వామి దర్శనమైనదని తలఁపవలెను. స్వామి దర్శనమగునప్పటి కాయన వయసు పదునారేండ్లనియు, నప్పటినుండియే ఆయన సంకీర్తన రచన కుపక్రమించినాఁ డనియుఁ గృష్ణమాచార్యుల వచనసంకీర్తనములం దుక్తమైన విషయమే. కావున కృష్ణమాచార్యుల జననము తంజావూరిప్రతినిబట్టి విశదమైనట్లు వికృతిలో కాకపోవచ్చుననియు, స్వామి దర్శనమైన వత్సరము (క్రీ॥ శ॥ 1284) నకుఁ బదునారేండ్ల వెనుక- అనఁగా క్రీ॥ శ॥ 1268 లో కావచ్చుననియుఁ దలంపఁదగునేమో !

వ్యతీపాతయోగంబున పుట్టుకతోడనే అంధుఁడై జన్మించినాఁ డను కారణమున జననీజనకులు దయమాలి యా పిల్లవాని నొక పాడుపడిన కూపమున బడవేసి పోయిరి. అప్పుడు నృసింహస్వామియే కుమారనాముఁ డగు నొక సన్యాసి రూపమున వచ్చి వానిని వెలికిఁ దీసి కాపాడి యొక మఠమునందిడి కొంత కాలము సంరక్షించెను. ఆ పిదప నా బాలుని సింహాచలమునకు చేర్పించెను. సింహాచలమున నుండగా నొకతూరి స్వామివారే తమ కభిషేకించినక్షీరము నొకబాలుని రూపమున వచ్చి కృష్ణమాచార్యుని కిచ్చి వెళ్ళెను. వాని నారగించి కన్నుల కద్దుకొనుటతో నా బాలు డగుకృష్ణమాచార్యునకు పోయినకనులు వచ్చినవి. ఆ రాత్రియే స్వప్నమున స్వామి వరాహరూపమున ప్రత్యక్షమై, తన సన్నిధిని చాతుర్లక్ష సంకీర్తన వాక్పూజలు గావింపుమని యాదేశించెను. ఆయాదేశానుసారమెందరో మహానుభావుల వలెనే బాలుఁ డగుకృష్ణమాచార్యుఁడును తన పదునారవ యేఁట సంకీర్తన రచన కారంభించెను.[1]

---

1. ఈ రచనారంభము పరాభవనామసంవత్సర ఆషాఢ శుద్ధ ద్వాదశినాఁడు (24-6-1306లో)జరిగినట్లు తంజావూరిప్రతియం దున్నది. కృష్ణమాచార్యుఁడు "శఠకోప

తదుపరి కొంతకాలమునకు తన మేనమామ యగు శ్రీరంగాచార్యులు, స్వామి యనుగ్రహమున నీయువకుని గుర్తించి కూతునిచ్చి వివాహము చేయించెను. పెండ్లికి స్వామివారుకూడ వేంచేసిరి. చల్లగా కొంతకాలము సంసారము సాగెను. వారి సాంసారికసౌఖ్యఫలముగా పిదప వారికొక కుమారుఁడుకూడ కలిగెను. కాని దురదృష్టమున నేడవయేఁటనే ఆ కుమారుఁడు పరమపదించెను. భగవల్లీల లేమోగాని ఆపైన కృష్ణమాచార్యుఁడొక ప్రక్క సంకీర్తన వాక్పూజలు గావించుచునే వేశ్యాలోలుఁడుగా నుండుచుండెను. ఇట్లుండగా నొక సందర్భమున సంకీర్తనరచయిత యనియు, పరమభక్తుఁ డనియుఁ ప్రఖ్యాతిఁగాంచిన ఈ కృష్ణమాచార్యుని దర్శనార్థమై పొతకమూరి[1]లోని భాగవతులును, అహోబలేశుని నాట్య వినోదులు నైన సోదరులు (నారాయణయ్య, ఓబళయ్య, అచ్యుతయ్య, అనంతయ్య, లక్ష్మయ్య, చెన్నమయ్యంగారు - అనువారు) ఆర్గురు సుదూరము ప్రయాణించి సింహాచలము చేరుకొనిరి. వా రాయూర కృష్ణమాచార్యుని తిరుమాళిగె కొఱకు వెదకికొనుచు, కాకతాళీయముగ వేశ్యాలోలుఁడై మోహనాంగి యనువారకాంతతో వినోదించుచుండిన కృష్ణమాచార్యునే దరిసి గుర్తింపఁజాలక వివరము లడిగిరి ఆ పుణ్యాత్ముఁడు పడునొకండవ యవతారమనియు, బహుదూరము నుండి దర్శింపవచ్చినా మనియు చెప్పికొనిరి. ఆ పొతకమూరి సోదరులు పరమభాగవతు లనియు, వారు పటము పన్నించి పాడగా స్వామివారానందించెడివా రనియు, కృష్ణమాచార్యుఁడు వారిని గూర్చి వినియేయుండెను. ఇప్పుడు వారి రాక తన్ను గూర్చియేయని తెలిసికొనెను. అట్టి యుత్తములు, భక్తులు అంతదూరము నుండి తనను గూర్చి ఘనముగానెంచి, దర్శనార్థమరుదెంచుటయు, తాను మాత్రము తేనెలోఁబడిన ఈఁగ విధమున నీదుస్థితిలో నుండుటయుఁ దలఁచుకొని పశ్చాత్తప్తుఁడై, మనసు మార్చుకొని తెలివించుకొంచెను. కాని తత్కాలమునకు తన యున్నయునికి వెల్లడి కానీయక శ్రీవారి తిరుమాళిగ చూపింతును రండని తానే మఱియొక తావునకు వెళ్ళి తలయు, మీసములు బోడించుకొని విరాగివేషమూని పరమ భక్తాగ్రగణ్యుఁడగు కృష్ణమాచార్యుఁడుగా సాక్షాత్కరించెను. పొతకమూరిభాగవతులు దండప్రణామము లాచరించిరి. కాని

మానివేదంబు తెనుఁగు గావించి సంసారఖేదంబు"మాన్చినాఁడు. వింత యేమన ఆ ద్రావిడ ప్రబంధకర్త యగుశఠకోపయతియు, పదునారవ యేటనే ప్రజ్ఞాపూర్ణులై, దివ్యప్రబంధ రచన సాగించిరి. దాని ననువదించిన ఈ కృష్ణమాచార్యుఁడును, పిదప 15 వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులును ఇట్లే తమ పదునారవయేఁటనే సంకీర్తనరచనకారంభించుట విశేషము.

1. పొతకమూరు నెల్లూరు జిల్లా దర్శి డివిజను నందున్నది.

కొంతవడికి తాము పూర్వము చూచిన శృంగారపురుషుని యాకృతివిశేషమే వీరిలోను దృగ్గోచరమగుటను గుర్తించి ఆ భాగవతులు తామేదో యపచారము గావించినట్లుగా భావించి, భయాందోళనలకు పాల్పడిరి. పదునొకండవ యవతారమని ప్రసిద్ధిగాంచిన యా మహనీయుని శృంగారలీలలకు తాము తెలియక నంతరాయము కల్గించినామని తటతట దవడలు వాయించుకొని అపచారము మన్నింప వేడికొనిరి. దానితో కృష్ణమాచార్యునిపని యుక్కిరిబిక్కిరై పోయినది. వారి కారణముననే తనలో వైరాగ్యప్రవృత్తి కలిగిన దనియు, తానంతటి యోగ్యుఁడు కాఁడనియు, కృష్ణమాచార్యుఁడు భాగవతులతో చెప్పుకొనెను. పిదప పరస్పర మొకరినొకరు సంభావించుకొనిరి. పటము పన్నించి యహోబలేశుని యాడించెడి పోతకమూరిభాగవతుల నాట్యవినోదమును కృష్ణమాచార్యుఁడును, కృష్ణమాచార్యుని సంకీర్తనములందలి సౌందర్యమును పోతకమూరిభాగవతులును దర్శించియు, వినియు పరస్పర మానందించిరి. ఆ యానందము నక్కడి స్వామి కూడ పసివాఁడై పాలు పంచుకొనెను. పటము పన్నించి పాడిన పోతకమూరి అన్నల పాటలను విని యానందించుటకై నృసింహస్వామియే బాలుఁడై యచటికి వచ్చి చేరెను. పిదప కృష్ణమాచార్యుఁ డాలపింపఁగా నా బాలుఁడానంద తాండవ మొనరించెను. ఇట్లు వారివారి గానములకుఁ జొక్కియాడిన బాలుఁడే పరమపద నివాసుఁడని యెరింగి, యాతని పరవశింపఁజేసిన ఖ్యాతి భాగవతుల దని కృష్ణమాచార్యుఁడును, కృష్ణమాచార్యుని దని భాగవతులును పరస్పరము సంభాషించుకొనిరి. అప్పటికి కృష్ణమాచార్యుఁడు చాతుర్లక్షసంకీర్తనములలో లక్షాయేఁబదివేలింకను వ్రాయవలసి యున్నట్లు వారితో చెప్పుకొనెను. అవియు తరువాత కృష్ణమాచార్యుఁడు పూర్తిగావించియే యుండును. వాని నన్నిటిని కృష్ణమాచార్యుఁడు పాడుచుండఁగా బాలుఁడై వచ్చిన స్వామియే ఘంటము పుచ్చుకొని వ్రాసెడివాఁడట! ఆ కీర్తనములన్నియు నా కాలముననే రాగి రేకులమీఁద కెక్కినట్లుకూడ వార్త మనకు మిగిలియున్నది. [1]వానికొక భండాగారముకూడ సింహాచలమున నుండినట్లు తెలియుచున్నది. ఆ భండాగారపు రేకులుకావు సరిగదా మన దురదృష్టమున నాసంకీర్తనములలో వంద యయినను తిన్నగా మనకు మిగులలేదు. అదియు శాపఫలితమని సింహాచలక్షేత్రమునకు సంబంధించిన కొన్ని కథలున్నవి. ఏమైనను భక్తి సంకీర్తనములను బాడుకొనుచు, మహిమలనెన్నో

1, చూ. ఏకమ్రనాధుని ప్రతాపచరిత్ర.

ప్రదర్శించుచు, నీ మహనీయుఁడు బహుకాలము సింహాచలమందును, కొంతకాల మోరుగల్లు శ్రీరంగములందును జీవయాత్ర సాగించె ననవచ్చును. ఆంధ్రదేశ మందలి వైష్ణవ పుణ్యక్షేత్రముల నన్నిటిని దర్శించినట్లుకూడ నీతఁడే తన వచనములందు పేర్కొన్నాఁడు.

ఆంధ్రదేశమున వచన రచనకు, భజన సంకీర్తన పద్ధతులకు పరమాచార్యుఁడు, ప్రపితామహుఁడు నయినవాఁడు మన మెరిగినంతలో నీకృష్ణమాచార్యుఁడే. "ఓం నమో నారాయణాయః" అనియు 'నమో నమో లక్ష్మీవల్లభా' అనియు, 'అనాథపతి సింహగిరి, నరహరీ నమో నమో దయానిధీః' అనియు, 'మాయతిరామానుజముని వరందాతారు కృష్ణ కువ్వారస్వామి సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ' అనియు, 'పరబ్రహ్మసింహగిరినరహరీ నమోనమో దయానిధీ' అనియు మకుటములుగా స్వామివారి యనంతనామగుణకథలను వచన భావంబున నీతఁడు విన్నపము సేయుచుండెడివాఁడు. ఈ విధమున కృష్ణమాచార్యుఁడు పాడుకొన్న వచనసంకీర్తనములలో విన్నపములుగాను, చూర్ణికలుగాను, గుర్తింపఁదగినవి కొన్ని మాత్రమే మనకు లభించినవి. వానినే కృష్ణమాచార్యుఁడు ధ్యానసంకీర్తనము లనియు(ధ్యానసంకీర్తనములనుటకే దోనసంకీర్తనములని కొన్ని తాళపత్ర ప్రతులందు భ్రష్టరూపము కానవచ్చుచున్నది) నామసంకీర్తనము లనియు, వేదాంతసంకీర్తనము లనియు, కొన్ని కొన్ని వర్గములుగా విభజించుకొనినాఁడు. పదునైదు పదునాలు శతాబ్దులలో వెలసిన తాళ్ళపాక కవీశ్వరులు ఈ కృష్ణమాచార్యునే తమకు మార్గదర్శకుఁడుగను, తాళబంధచ్ఛందోవిరహితమై, చూర్ణాఖ్యం బరగునట్టిపదరచనలకు పరికల్పకుఁడుగను పేర్కొనినారు. ఆతీరు రచనలకేకాక ఇటీవలి నా పరిశీలమున తాళమున కొదుగునవియు, భజనసంకీర్తనము లనఁదగినవియు నయిన వీరి రచనలు మరికొన్ని లభించిన కారణమున తెలుఁగుదేశమున భజనసంకీర్తనపద్ధతులకు కృష్ణమాచార్యుఁడే ప్రపితామహుఁడని పేర్కొననగుచున్నది.

కృష్ణమాచార్యుని కృతులలో నేఁటికి లభ్యములైనవి నాలుగైదువర కున్నవి. వానిలో మొదటిది ప్రసిద్ధమైనది—

**I. వచనసంకీర్తనములు :-** కృష్ణమాచార్యుఁడే వచన సంకీర్తనములను నాలుగులక్షలకుపైగా రచించినట్లు ప్రసిద్ధి. వీనినే అతఁడు వచనములనియు, విన్నపములనియు, సంకీర్తనములనియు, సింహగిరి నరహరి వచనము

లనియు, నామసంకీర్తనములనియు, వేదాంతసంకీర్తనము లనియు, ధ్యాన సంకీర్తనములనియు, పలుదెఱఁగుల పేర్కొనినాఁడు. వీనిని గూర్చియే కావచ్చును 'సంకీర్తన లక్షణ' కారులగు తాళ్ళపాకవారు చూర్ణాఖ్య పదములను వివరించుచు

క. ధరకృష్ణాచార్యాదిక
పరికల్పిత పదము తాళబంధచ్ఛందో
విరహితమై చూర్ణాఖ్యం
బరగు, నది నిరుక్తనామ భాసితమగుచున్.

మఱియుం దచ్చూర్ణవిధం బెట్టిదనిన,

క. ఛందోగణముల నియతిం
బొందక తాళప్రమాణమునఁ గడుఁజెలువై
కొందరిచేఁ దచ్చూర్ణం
బందముగాఁ దాళగంధియనఁ బొగడొందున్.

అని పేర్కొనినారు. వారి లక్షణము ననుసరించి కృష్ణమాచార్యాదులు పరికల్పించిన చూర్ణపదము నిరుక్తనామభాసితమై, *తాళబంధచ్ఛందోవిరహితమై* యొప్పునట్లు తెలియుచున్నది. కాని, తచ్చూర్ణికలే తాళప్రమాణమున గడుఁజెలువై యందముగా తాళగంధియని కూడ బొగడొందునని వారే యందు వివరించినారు. కృష్ణమాచార్యుఁడును దండెయు చిటితాళంబులు సంధించుకొని, పొతకమూరి భాగవతుల సన్నిధిని నారాయణుని నామగుణకథలను ఘుమ ఘుమ ధ్వనులు మ్రోయఁగా దండెమీటుచు, తాళముగ్గడింపుచు, వచనభావంబున విన్నపముగావించినట్లు చెప్పుకొన్నాఁడు. కావున నీతని వచనములును, తాళగంధిచూర్ణములే యనఁ దగును. ఇందు తాళము మాత్రమేకాదు, యమకగమకాంత్యానుప్రాసాది శబ్దాలంకారములు, ఛందోగంధము, చిత్తమా! మనసా! జయవిజయీభవ! మున్నగు సంబుద్ధులు, గీతమును దలపించు గురుప్లుత స్వరములు ప్రతి చరణాంతమున బాడఁదగు పల్లవిని బోలిన పాదనిర్మాణము మొదలగు నంశములన్నియు నీవచన సంకీర్తనములందలి గేయాంశమునే వెల్లడించుచున్నవి. మచ్చున కీవచన భాగములు చూడుఁడు!

"ఒకపరి మిమ్ము నెఱుంగుదుమయ్యా
ఒకపరి మిమ్ము నెఱుంగమయ్యా
జ్ఞానిని చేయుమయా—అ
జ్ఞానిని చేయకుమయ్యా.
పుణ్యంబిది పాపంబిది—స్వర్గంబిది నరకంబిది
అనాచారమిది యాచారంబిది—నిషేధమిది యనిషేధం
బిది........."

ఈ వచనము చక్కఁగా తాళమున కొదిగి గీతమువలె నున్నది.

"విష్ణుభక్తి లేని విద్వాంసుని కంటెను
హరికీర్తనము సేయు నతఁడె కులజుండు
శ్వపచుఁడైన నేమి — ఏ వర్ణంబైన నేమి
ద్విజునికంటె నతఁడె కులజుండు ద్రిష్టించి చూడంగ
విద్వజ్జన భవ్య భూషణము
సింహగిరి నరహరిందలంచిన యతఁడె కులజుండు"

"దేవా! తనువులు మాయ. తలపోసి తలపోసి చెప్పేనంటినా కఱకఱల మోహమిది. ఆశల పాశఁడంబిది. అతుకుల జల్లెడ యిది. తన బ్రతుకు కొఱకు పోరాడి పోరాడి యొరుల చెరిచెడి దుర్గంధపు డొంక యిది... ఇది నాటకము లాడేటి బూటకపు బొమ్మ - అమ్మమ్మా! ఈ బొమ్మ వృత్తముల నెంచి చూచెద నంటినా గామై, పామై గ్రామసూకరమై, చండపిల్లియై, పిల్లినోటి ఎలుకై, పూతై, పూతలాను మీనై కత్తికోతలంబడి చచ్చి చచ్చి పుట్టి పుట్టి......"

"దేవా! అంకిలి యనియెడి తెవులు, ఇంటింటికి ద్రిప్పు. అసత్య కృత్యమే ముప్పు. తనువు ధర్మమున నడిపినదే యొప్పు. అనాధపతి సింహగిరి నరహరి మిమ్ము దలంపనిదే తప్పు."

ఇత్యాది వచనములలో కొంత కొంత ఛందోబంధము శబ్దాలంకారాదులు కాననగుచున్నవి.

" అజ్ఞాన జడిత కర్మములం దగిలి కలంగకా
సుజ్ఞానివై సింహగిరి నరహరిం దగిలి యందే
సుఖివిగమ్మా — చిత్తమా "

అను నీ వచనమున గురుప్లుత స్వరములు పాట పాడు వైఖరిని దెలుపుచు నందలి గేయాంశమునే చాటుచున్నవి. ఇట్లే ' ఓంనమో నారాయణాయ ' అనియు, ' మిమ్ము నెవ్వఁడు నమ్మునే, ఓంనమో నారాయణాయ ' అనియుఁ బదింబదిగా పల్లవి పాటగా వచ్చు నొకవచనమున విస్పష్టముగా నిబంధపద సంప్రదాయమే గోచరించు చున్నది. ఇట్టి *వచనసంకీర్తనములను* పరిశీలించినపుడు రచనా విధానమునందే కాక, భావములందును, భాషయందును కూడ కృష్ణమాచార్యుఁడు తరువాతి సంకీర్తనకారులకెట్లు మార్గము మలచినాఁడో తేటతెల్లము కాఁగలదు. భక్తి మార్గమున పరమపదనివాసుని పరవశింపఁజేసిన ఆ భాగవతోత్తముని వచన సంకీర్తనములను మద్రాసు, తంజావూరు, తిరుపతులలోని, తాళపత్ర ప్రతులను, నాకడ నున్న తాళపత్రగ్రంథమును సంప్రదించి కృష్ణమాచార్యుని వేదాంత సంకీర్తనములను నేను లభ్యమైనంత వరకు సేకరించి పరిష్కరించి, అచ్చునకు సిద్ధపరచి యుంచితిని.[1] మచ్చునకు కొన్ని చూడుఁడు.

" దేవా! శ్రీమన్నారాయణా! పరబ్రహ్మస్వరూపా! అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా! వేదవేదాంతవేద్యా! పురాణ పురుషోత్తమా! పురందరవంద్యా! దేవా! కపటనాటకసూత్రధారీ! మాయావినోదా! అగణిత మహిమావతారా! ఆశ్రితజన మందారా! సకల కల్యాణగుణోన్నతా! సకల జగదంతర్యామీ! శ్రీమద యోధ్యాపురవరాధీశ్వరా! దశరథరాజనందనా! కౌసల్యాగర్భ శుక్తిముక్తాఫలా, భరతాగ్రజా! సౌమిత్రమిత్రా! శత్రువశీకరా! శరణాగత వజ్రపంజరా! కారుణ్య వారాన్నిధీ! భక్తి ముక్తి ఫలప్రదాయకా! శంఖచక్రగదాధరా! కోదండ దీక్షా గురూ! భక్తపరాధీనా! ఇక్ష్వాకు కులతిలకా! రాక్షసకులసంహారా! పక్షీంద్ర వాహనా! దేవాదిదేవా! తాటకీ ప్రాణాపహారా! విశ్వామిత్ర యజ్ఞపాలకా! యజ్ఞ రక్షకా! యజ్ఞస్వరూపా! యజ్ఞభోక్తా! సర్వవ్యాపకా! సురనికర సేవితా! అహల్యా శాపవిమోచనా! పురహర చాపఖండనా! సీతాపతీ! పరశురామ బాహు బలపరాక్రమ

---

1. చూ. తంజావూరి ప్రతి ననుసరించి డా॥ ఎం. కులశేఖరరావుగారు ఇటీవల ప్రకటించిన సింహగిరి నరహరి వచనములు ముద్ర. 1968.

హరణా! పితృవాక్య సత్యప్రతిపాలకా! మారీచమృగవేటకారా! చిత్రకూటాద్రి నిలయా! కాకాసుర విదళనా! విరాధ దైత్యహరణా! సుగ్రీవానుగ్రహా! వాలి నిగ్రహా! మాల్యవంత ప్రవేశా! లవణాబ్ధిగర్వ హల్లకల్లోలా! విభీషణ స్థాపనాచార్యా! దక్షిణ సింధు రాజబంధనా! దీనరక్షకా! ధూమ్రాక్షా! విరూపాక్షా! అతికాయా! మహాకాయా! రావణకుంభకర్ణాది రాక్షసకుల సంహారకా! ఇంద్రజిత్తు తల గుండుగండా! రావణగిరి వజ్రాయుధా! పంక్తికంధర శిరఃపంక్తిఖండనా! విభీషణ రాజ్యస్థాపనాచార్యా! జానకీప్రియా! పుష్పకారూఢా! అనుజ సేవితా! మైథిలీసమేతా! ఆనందమయా! జయజయ రాఘవేశ్వరా! మా యతిరామానుజ ముని పరందాతారు సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ! "-ఇది నామ సంకీర్తనము.

"దేవా ! మీ తిరుమణి తిరుచూర్ణంబులు (మేన ధరించినవారికి
సువర్ణాలంకారములు వికారములు.)
దేవా ! మీ శ్రీపాద తులసియందలి చవి యెరింగినవారు
అమృతాది రుచులు తృణీకరింతురు.
(దేవా ! మీ పాదకమల యుగళమున పరిమళ మెరిగినవారికి
చందన ఘనసార పల్లవములు అసహ్యాములు,)
దేవా ! మీ సౌందర్యము దరిసించిన కన్నుంగవలకు
ఇతరములైన రూపములు చూడ పాపములు,
దేవా ! మీ అసంఖ్యాక పరిమళ కథామృతంబు ఘనతరముగ
గ్రోలిన జనులు ఇతర కథలు నెరుంగరు;
దేవా ! సర్వగంధా ! సకల బాంధవుండవై ఇటువలె నిఖి
లేంద్రియ భోగ్యమై నన్ను రక్షింపవే అనాథపతి
సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ!"

—*ఇది ధ్యాన సంకీర్తనము.*

"దేవా ! చతుర్వింశతి తత్త్వాత్మకమైనది స్థూలతనువు. పదిహేను తత్త్వముల కూటమి సూక్ష్మతనువు. ఈ రెండు తనువుల యుత్పత్తి నాశనములకు కారణమైనది కారణతనువు. ఈ తనుత్రయముం బాపవే పరబ్రహ్మ సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ !"

"దేవా ! తానుగాని దేహమందు తానని దుఃఖపడేది అవిద్యాక్లేశము. దేహాదులందు అభిమానమువలన దుఃఖపడేది అస్మితాక్లేశము. విషయములఁగోరి దుఃఖపడేది రాగక్లేశము. విషయములు దొరుకక దుఃఖపడేది ద్వేషక్లేశము. విషయములందు తగిలి విడువలేక దుఃఖపడేది అభినివేశ క్లేశము. ఈ పంచ క్లేశములఁ జిక్కి నొచ్చినాఁడను. ఈ దుఃఖములఁ ద్రుంపవే పరబ్రహ్మ సింహగిరి నరహరి నమోనమో దయానిధీ !"

*—ఇవి వేదాంత సంకీర్తనములు.*

ఈతని వచన సంకీర్తనము లన్నియు ప్రధానముగా భక్తిని ప్రపంచించునవి. దేవతాంతర మంత్రాంతర సాధనాంతరముల వర్జించి వైకుంఠవాసునే నమ్మి "నీవే తప్పనితఃపరంబెరుగ" నని యర్చించుటే యందలి సందేశము. ఈ వచనములందలి భాషయు వ్యావహారికమై భక్తిభావము నప్రయత్నముగా నమాయకముగా ప్రదర్శించురీతి నుండును. ఆడుతా, పాడుతా, కుమ్మరిసారెవలె తిరుగుతా, మునుగుతా, లేస్తా, అంగడి వేశ్య, అంకిలిసేయకు, వరుషంబులు, అరుహాముగాదు, చదివినన్నేమి, ఆచరించినన్నేమి, వచ్చిని, కలిగిని, మున్నగు పద ప్రయోగములీతనివి తరువాతి సంకీర్తనకారుల రచనలందును విరివిగా కానవచ్చుచున్నవి. పదములేకాదు భావములు సైతము తరువాతి కాలపు ప్రబంధరచయితలును, సంకీర్తనరచయితలును అనుకరించినట్లు తెలియుచున్నది.

"సకల జీవహింసలుచేసి (జంతువుల మేను)లు ఖండించిన లోహమున్ను, వేదశాస్త్ర పురాణంబులు వ్రాసే లోహమున్ను పరుసవేది సోకినంతనే సువర్ణంబైనట్లు"

"దేవా ! అభ్యసింపరానివి రెండు. ఆచార్యకటాక్షం బొక్కటి. అటు మీఁద మీదాసుఁడౌటొక్కటి" - మున్నగు భావములు ఆముక్తమాల్యద - మాలదాసరికథలో కానవచ్చుచున్నవి. ఇట్లే

1. 'శ్రీ వైష్ణవులె పరమ సాధకులు శ్రీ వైష్ణవులె బ్రాహ్మణులు'

2. 'హరిభక్తిలేని విద్వాంసుని కంటెను
హరికీర్తనము సేయునతఁడె కులజుడు,
శ్వపచుఁడైనన్నేమి? ఏ వర్ణంబైననేమి? '

3. 'దేవా ! మీ చరణయుగళసేవకు ఏ కులజుండైననేమి ?'

4. 'దేవా పెద్దతనంబుచేసి మిమ్ము మెప్పించేనంటినా
జాంబవంతుండు మీ సన్నిధినే యున్నాఁడే దేవా
బుద్ధినిసే మెప్పించే నంటినా
విభీషణుఁడు మీ సన్నిధినే యున్నాఁడే దేవా
బంటుతనంబున మిమ్ము మెప్పించే నంటినా
హనుమంతుఁడు మీ సన్నిధినే యున్నాఁడే దేవా
తీర్థంబులాడి మిమ్ము మెప్పించే నంటినా
గంగాభవాని మీ యంగుష్ఠమునందే యున్నదే దేవా!'

ఇత్యాదిగా నున్న వచనములలోని భావములు తాళ్ళపాకవారి సంకీర్తనము లందు బహుధా ప్రస్తుతములైనవి. సామ్యమును పరికింపుఁడు.

1. 'అణురేణు పరిపూర్ణుఁడైన శ్రీ వల్లభుని
ప్రణుతించువారువో బ్రాహ్మణులు ॥
హరినామములనె సంధ్యాది విధు లొనరించు
పరిపూర్ణమతులువో బ్రాహ్మలు
హరిమంత్ర వేదపారాయణులు హరిభక్తి
పరులైనవారు వో బ్రాహ్మలు ॥ (11-3-151)

2. 'కొంచెమును ఘనముఁగనుఁ గొనసేల హరిఁదలఁచు
పంచమహాపాతకుఁడె బ్రాహ్మణోత్తముఁడు ॥
వేదములు చదివియును విముఖుఁడై హరికథలు
నాదరించని సోమయాజికంటె
ఏదియునులేని కులహీనుఁడైనను విష్ణు
పాదసేవకుఁడువో బ్రాహ్మణోత్తముఁడు ॥
పరమమగు వేదాంత పఠన దొరికియు సదా
హరిఁదలఁచలేని సన్యాసికంటె
మఱిగి పసురముఁదినెడి మాలయైనను వాఁడె
పరమాత్ముఁ గొలిచినను బ్రాహ్మణోత్తముఁడు ॥'
(11-3-117)

3. 'ఏ కులజుఁడైననేమి యెవ్వరైననేమి
ఆకడ నాతఁడె హరినెరిఁగినవాఁడు ॥' (5-195)

4. 'రామరామ రామకృష్ణ రాజీవలోచన నీకు
దీమువంటి బంటన నేతేజమునాది ॥'
వారిధిదాటి మెప్పించ వాయుజుఁడనేగాను
సారె జవుల మెప్పించ శబరిగాను.
బిరాన సీతనిచ్చి మెప్పించ జనకుండగాను
యే రీతి మెప్పింతు నన్ను నెట్లు గాచేవో ॥
ఘనమైన మోచి మెప్పించ గరుడుండనేగాను
కొన గామసుఖమియ్య గోపికంగాను
వినుతించి మెప్పించ వెయినోళ్ల భోగిగాను
నిను నెట్లు మెప్పింతు ననుగాచే దెట్లో ॥
నవ్వుచుఁ బాడి మెప్పించ నారదుఁడనేగాను
అవ్వల ప్రాణమియ్య జటాయువుంగాను
యివ్వల శ్రీ వేంకటేశ నీకే ఇటు శరణంటి
అవ్వల నా తెరువేదో రక్షించే దెట్లో' ॥

ఈ తుది యుదాహరణమే తరువాత పట్నం సుబ్రహ్మణ్య అయ్యవారి 'పరిదానమిచ్చితే పాలింతువేమో' అను ప్రసిద్ధమగు బిలహరి రాగకృతిగా రూపొందినవి.

ఇట్లు గానానుయోగ్యము లగుకృష్ణమాచార్యుని వచనసంకీర్తనములే ఆంధ్ర మందలి వచనసంకీర్తనవాఙ్మయశాఖ కాదికృతులనియు; కృష్ణమాచార్యుఁడే సంకీర్తనపరమాచార్యుఁ డనియు తెల్లమగుచున్నది.

**2. తులసీ మాహాత్మ్యము** : కృష్ణమాచార్యునికృతు లని తెలియ వచ్చినవానిలో నీ 'తులసీ మాహాత్మ్య' మింకొక లఘుకృతి. ఏతన్మాహాత్మ్యమును కృష్ణమాచార్యుఁడు సంకీర్తనరూపమున రచించెను. ఈ వృత్తాంతము మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమందలి "శ్రీ కృష్ణమాచార్య సంకీర్తనములు" అను 206 సంఖ్యగల తాళపత్ర ప్రతిలో చివరఁగల "తులసీ మాహా

త్మ్యము" అను గ్రంథభాగమునుబట్టి తెలియుచున్నది. కృష్ణమాచార్యుఁడు ఓరుగంటిలో నొక పతివ్రతా గృహంబున కేగిన సమయమున నేకపత్నీవ్రతుండగు నా యింటి యజమాని తమ యాతిథ్యమును గొనుఁడని వేఁడఁగా, కృష్ణమాచార్యుఁడు బృందావనమును దర్శించిగాని భుజింపననెను. అప్పుడా బ్రాహ్మణుఁడు బృందావనతులసీమహాత్మ్యమును వినిపింపుఁడని కోరఁగా కృష్ణమాచారుఁ డాగాథను, సంకీర్తనరూపమున గానము చేసెనట. ఆయన గానము చేసిన సందర్భమున నా మార్గమున బోవుచుండిన స్త్రీలు మువ్వురిలో నొకామె సంకీర్తన విందమనెనట. రెండవయామె- ఆఁగి సావధానముగ విందమనెనట. మూఁడవయామె 'ఈ సంకీర్తనలకేమి. ఈ మాటలకేమి పోతాము ర'మ్మనెనట. పిదప సంకీర్తన విందమన్న వనిత రాజుకొడుకై జన్మించెనట. ఆఁగి విందమన్న వనిత చక్రవర్తిగా జన్మించి సకలభోగము లనుభవించెనట. వలదు పోతాము రమ్మన్న వనిత బహుజన్మలు పందిగా జన్మించెనట. ఈ వృత్తాంతము తులసీమాహాత్మ్య సంకీర్తన గాథకు ఫల శ్రుతిగా నం దీయఁబడినది. (ఈ ఫల శ్రుతియే కృష్ణమాచార్యుని వచన సంకీర్తనముల తుదను గూడ కొన్ని తాళపత్రముల ందీయఁబడినది) ఏమైనను తులసీమాహాత్మ్యమును వర్ణించు నీ గాథ సుప్రసిద్ధమైనదిగా తోఁచుచున్నది. ఆంధ్రవనితల నోములందును, వ్రతములందును ప్రముఖ స్థానము వహించి భూలోకమందలి కల్పక మనిపేర్వడసి ఇంటింట వెలసిన తులసీమహిమయే ఇందలి ఇతివృత్తము. తెలుఁగుదేశమున తులసిమీఁద పాటలు కూడ కొన్ని గలవు. అందేవేని ఈతని రచనలగునోయేమో!

" నిశిసమయమందు తులసీ దరిసెనము చేసినవారికి శిశుహత్య, స్త్రీహత్య. గోహత్య, మొదలైన పాతకంబులు పోవును. తులసికి కంపఁగట్టి రక్షణ చేసిన వారికి వేయిసంవత్సరంబులు సాయుజ్యపదంబు గలుగును. తులసికి కోట వేయించి కొమ్మలు దీర్చిన పుణ్యాత్ములకు అశ్వమేధఫలంబులు గలుగును. తులసికి దీపంబెత్తినవారికి సూర్య చంద్ర లోకంబులు గలుగును...... తులసీ బృందావనములకు అలికి ముగ్గుదీర్చి సాయంకాలమందు దీపంబెత్తిన స్త్రీలకు శాశ్వతముగా అయిదువతనంబు గలుగును. సరిలేని పుణ్యము కలిగి సంతోషంబున నుందురు దేవా! అంతమందు తులసీదళోదక మిచ్చిన దేహము పవిత్రవంతమై సద్గతి గలుగును దేవా! తులసీ మాహాత్మ్యము పఠియించిన వారికి కొన్ని జన్మాదులు గడచిపోగాను, శాశ్వతముగా కైలాస సన్నిధానంబు గలుగును. తులసీ

వనమందున్న దళముదెచ్చి శిరస్సున ధరించినవారికి త్వరితంబుగ ఆదిత్యపురంబు గలుగును. ప్రొద్దుననే లేచి తులసీదరిసెనము చేసినవారికి సర్వపాపంబులు తొలగును." ఇత్యాదిగా వర్ణితమైన తులసీమహాత్మ్యగాథను కృష్ణమాచార్యుఁడు సంకీర్తనములుగా గానము చేసెనట. మఱి యది వచన సంకీర్తనమో, లేక గేయ సంకీర్తనమో : ఏమైనను ఇది యాతని రెండవ కృతి.

కృష్ణమాచార్యుఁడు వచనసంకీర్తన రచయితగా మాత్రమే నేఁటిదనుక లోకమునకు పరిచితుఁడు. కాని ఇటీవల నాపరిశీలనమున గుర్తింపనైన యాతని రచనలు మఱి రెండుమూడింటిని బట్టి చూడఁగా వచనసంకీర్తనపద్ధతికి మాత్రమేకాక, ధ్యాన (గేయ) సంకీర్తన పద్ధతికిని ఆతఁడే పరమాచార్యుఁడుగా పేర్కొనఁదగియున్నాఁడు. ఆతని తరువాతనే పదునైదవ శతాబ్దిలో తాళ్లపాక కవులు, తమకుఁ బూర్వముండిన ఇట్టి వచనసంకీర్తనములను, ధ్యాన (గేయ) సంకీర్తనములను, జానపదగేయ చ్ఛందోరీతులను, దాక్షిణాత్యోత్తరాహ సంగీత సంప్రదాయములను, నాట్య పద్ధతులను, సర్వమును బరిశీలించి సమన్వయ దృష్టితో నిబంధపదరచనల కారంభించి యాంధ్రమున సంకీర్తనపదరచనాప్రక్రియ కొక సమగ్ర సుస్వరూపమును గల్పించి, దానిని సుస్థిరపరచుటకై సంకీర్తన లక్షణము నొకదానిని రచించి, తరువాతి వాగ్గేయకారుల కెల్లరకును మార్గదర్శకులయినారు. తాళ్లపాకవారు నిర్మించిన సుప్రసిద్ధపదరచనా సౌధమునకు పునాదులువేసిన వారిలో కృష్ణమాచార్యుఁడు ప్రముఖుఁ డనవచ్చును.

గేయచ్ఛందమున గానానుకూలము లగు కృష్ణమాచార్యుని ధ్యాన సంకీర్తనములలో నూతనముగా నేఁడు లభ్యములైనవి, గేయమాలిక లనఁదగినవిమూడు రచనలు గలవు. అవియే నృసింహనామాలు, రామనామాలు, రామనామ సంకీర్తనము అనునవి. ఈ మూడు లఘుకృతులును కలసి కృష్ణమాచార్యుని వచన (నామ) సంకీర్తనము లొకటిరెండింటితోఁ గూడ "రామ నామాలు" (రామస్తోత్రము)" అను పేరున తంజావూరు సరస్వతీమహలు పుస్తక భాండాగారమున Tag సంఖ్య 28లో కలగాపులగముగా కలసిపోయినపత్రములలో కానవచ్చు చున్నవి.[1]

1. 1958 సంవత్సరము వేసఁగి నెలవలలో అన్నమాచార్యుని ద్విపద రామాయణమును గూర్చియు, వారి రామాయణసంకీర్తనములను గూర్చియు పరిశీలింపఁగోరి తంజావూరు వెళ్ళితిని. అచ్చటి రామాయణరచనలను జూచు సందర్భమున అక్కడి విద్వాం

**3. నృసింహ నామాలు :-** కృష్ణమార్యుని లఘుకృతులలో నిది మూఁడవది. లభ్యము.

ఇది నృసింహ స్తోత్రము. ధ్యాన (గేయ) సంకీర్తనము. 'శ్రీ నృసింహ' అని ప్రతిపాదాంతమున నుండుటచేత నీ కృతికి నృసింహనామము లనిపేరైనది. రగడలవలెనే రెండేసి పాదములు ప్రాసచేత బంధింపఁబడి, ప్రతిపాదమున రెండేసి యావృత్తములతరువాత యతి చెల్లుచు వెలసిన దేశిగేయరచన మిది. తురగవల్గనజాతిరగడకు చెందినది. మాత్రాచ్ఛందస్సు ననుసరించి రెండేసి పాదములకు

తకిట1తకిట తకిట2తకిట తకిట3తకిట తకిట4తకిట
తకిట5తకిట తకిట6తకిట తకిట7తకిట తకిట8తకిట

అని ఎనిమిది యావృత్తములున్నవి. ఇవి త్రిశ్రజాతి- ఆదితాళమున కొచుగు రచన. ఇట్లు నృసింహ నామాంతములై నాల్గేసి యావృత్తములతోఁగూడిన పాదము లిందు ఏఁబది యున్నవి. అటుపై స్తోత్రము ద్రుతగతి ననుసరించి పాదమున రెండవ, నాలుగవ యావృత్తములందు 'శ్రీ నృసింహ-శ్రీ నృసింహ' అను సంబుద్ధులు రెట్టించివచ్చి, నాల్గేసి యావృత్తములుగల పాదములు ఏ పాదమున కాపాదము ప్రాసయతిచేతఁ గూర్పఁబడినవి విడిగా నై యున్నవి. దాని యాద్యంత స్వరూపము లెరుగుటకీ పంక్తులు మచ్చుకు చూడుఁడు.

*ఆరంభము :*

"శ్రీ కరంజ భూరుహాఖ్యఁ జెలఁగి వెలయు శ్రీ నృసింహ
భీకరావతార ధీర పృథులవక్ష శ్రీ నృసింహ
వేఁడినట్టి ఫలములిచ్చు వినుత కీర్తి శ్రీ నృసింహ
... ... ... ... ...
వేదరాశి తుదన వెలుగు విశ్వభర్త శ్రీ నృసింహ
ఆదిదేవ నీ చరిత్ర మద్భుతంబు శ్రీ నృసింహ

---

సులు శ్రీ సుందరశర్మగా రన్నిటితోపాటు ఈ "రామనామము" లను ప్రతినిగూడ నా ముందుంచిరి. అందలి కీర్తనలు కృష్ణమాచార్యుని రచన లగుటను గుర్తించి వారికా విషయమును వెల్లడించి, పిదప మూల్యమిచ్చి 11-7-58 లో వానికి వ్రాతప్రతులను నేను తెప్పించుకొంటిని.

వాఁడిసురల కమృత మిడఁగవలసి సొలసి శ్రీ నృసింహ
పోఁడిమిగను నీవు పూవుబోణివైన శ్రీ నృసింహ
నిండుమది పవిత్రులందు నిలచియున్న శ్రీ నృసింహ
పుండరీక పత్రనేత్ర భూత భక్త శ్రీ నృసింహ"

*అంతము :*

"తపము నీవె శ్రీనృసింహ జపము నీవె శ్రీనృసింహ
నీడ వీవె శ్రీనృసింహ తోడు నీవె శ్రీనృసింహ
హితుఁడవీవె శ్రీ నృసింహ మతివి నీవె శ్రీ నృసింహ
గతివి నీవె శ్రీనృసింహ పతివి నీవె శ్రీనృసింహ
జయము నీవె శ్రీనృసింహ ప్రియము నీవె శ్రీనృసింహ।"

*అనంతరము:—*

"ఇది పూర్వభాగ సంకీర్తనము దో (ధ్యా) న సంకీర్తనము. ఇది పరమ రహస్యము. ఇది పంచమ (హా) వేదంబు. ఈ సంకీర్తన నిత్యకృత్యంబు. ఎవ్వరు వ్రాయుదురు- ఎవ్వరు చదువుదురు- అట్టివారలకు ఆయురారోగ్యైశ్వర్య ములు గలుగును. ఆపదోద్ధారకా! అఖిల మంత్ర రాజాధిపా! పరమపురుషా! పరం జ్యోతీ! మా యతిరామానుజ ముని (పరం) దాతారు అనాథపతి సింహగిరి కృష్ణ కువ్వారు సామి సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ!."

అను వచనముతో నీ కృతి ముగియుచున్నది. ఇందలి తుది వచనమునుబట్టి ఇది కృష్ణమాచార్యుని కృతిగా గుర్తింపనగుచున్నది. ఇట్టిదే మరియొక లఘుకృతి-

**4. రామనామ కీర్తనము :** లభ్యములగు కృష్ణమాచార్య కృతు ఆలో నిది నాలుగవది.

పైన పేర్కొన్న నృసింహనామము అను రచనవలెనే రామనామ మహిమ మును వెల్లడించు ధ్యాన (గేయ) సంకీర్తనమిది. ఇందు ప్రతిపాదాంతమునందు 'రామనామము' అని వచ్చుచుండును. రెండేసి పాదములు ప్రాసచేత కూర్పఁబడి ప్రతిపాదమున రెండావృత్తముల తరవాత యతి చెల్లుచుండును. ఇదియు వృషభ గమన మనురగడజాతికి చెందినది. మిశ్రజాతి చాపుతాళమున కొదిగి

తకిట¹తకతక తకిట²తకతక తకిట³తకతక తకిట⁴తకతక
తకిట⁵తకతక తకిట⁶తకతక తకిట⁷తకతక తకిట⁸తకతక

అని పాదమునకు నాలుగు ఆవృత్తములచొప్పున రెండేసిపాదములకు వెరసి ఎనిమిదియావృత్తములు గలవు. ఇట్టిచరణము లిందు ముప్పదిమూఁడు గలవు. పిదప ద్రుతగతి నందుకొని,

"తకిట తకతక రామనామము, తకిట తకతక రామనామము"

అను రీతిని యతియో ప్రాసయతియో కలిగి విడివిడిపాదములు పదునైదున్నవి. మచ్చున కీ పంక్తులు చూడుఁడు :

ఆరంభము :

"శ్రీమదఖిల రహస్యమంత్ర విశేషధామము రామనామము
సామవేద విధూతశాస్త్ర విచారనామము రామనామము
సిద్ధకిన్నర సాధ్యపన్నగ సిద్ధసేవ్యము రామనామము
యుద్ధమధ్య మహోద్ధతాసుర యోధభీమము రామనామము
నీలకంధర వరపురందర నిత్యకృత్యము రామనామము
శైలరాజసుతాతనూభవ సతతకృత్యము రామనామము
రావణానుజహృదయపంజరరాజకీరము రామనామము
తావలము సుజ్ఞాన మూలస్తంభ మంత్రము రామనామము
సకల నిర్జర సకల సంయమి జనశరణ్యము రామనామము
సకలదివ్యనదీవిగాహన స్నానపుణ్యము రామనామము..-"

అంతము :

"దివ్యమంత్రము రామనామము భవ్యమంత్రము రామనామము
జననిధానము రామనామము మనునిధానము రామనామము
సులభగమ్యము రామనామము తలఁపగమ్యము రామనామము
ముక్తిదము శ్రీరామనామము భుక్తిదము శ్రీరామనామము
కడువిచిత్రము రామనామము కల్పభూజము రామనామము."

అనంతరము - "ఇది పూర్వభాగ సంకీర్తన. దో (ధ్యా) న సంకీర్తన. ఇది పరమరహస్యము. ఇది పంచమవేదము. ఈ సంకీర్తన నిత్యకృత్యంబుగా నెవ్వరు విందు రెవ్వరు పఠియింతు రెవ్వరువ్రాయుదు రట్టివారి పితృ పితామహ ప్రపితామహంబు వైకుంఠంబునం బొందుదురట్టె – మీయాన. మీ చరణంబు

లాన. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా ! ఆపద్బాంధవా ! అఖిలమంత్ర రాజాధిపా ! చింతిత ఫలదాయకా ! పరంధామా ! పరమపురుషా ! పరంజ్యోతీ ! పరతత్త్వప్రకాశా ! శరణు శరణు మా యతి రామానుజముని (పరం) దాతారు అనాథపతి సింహగిరి కృష్ణకువ్వారుస్వామి సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ !" అను వచనముతో నీ కృతి ముగియుచున్నది.

**5. రామనామాలు :** లభ్యము లగుకృష్ణమాచార్యకృతులలో నిది యైదవది.

ఇదియు పైవానివలెనే గానానుయోగ్యమై 'రామారామా' అనుపాదాంత సంబుద్ధులుగల రామనామ కీర్తనము. విశేషమేమన నీ సంకీర్తనమున రామనామ స్తోత్రముతోపాటు రామాయణగాథయు క్రమమున తత్త్వద్విశేషణములందు స్ఫురించుచున్నది. ప్రాసనియమము లేక ప్రతిపాదమున యతియో, ప్రాస యతియో చెల్లుచు రచన భజనపరులు పారవశ్యమున పాడుకొనఁదగినదిగా నున్నది. ముచ్చునకీ పంక్తులు తిలకింపుఁడు.

ఆరంభము :

దశరథాత్మజా రామారామా !
ధన్యచరిత్రా రామారామా !
భరతాగ్రజ రామారామా !
పంకజేక్షణా రామారామా !
మిత్రతేజా రామారామా ! - సౌ
మిత్రవరదా రామారామా !
శత్రుభీషణ రామారామా !
శత్రుఘ్నసేవక రామారామా !
దండకావీర రామారామా !
తాటకాంతకా రామారామా !
కల్యాణప్రియ రామారామా ! అ
హల్యాప్రియ రామారామా !

పాపఖండన రామారామా!
భూపమండన రామారామా?
జానకీప్రియ రామారామా!
మానవేశ్వర రామారామా!

అంతము :

"నందితాత్మజ రామారామా!
వందితాభరణ రామారామా!
మానసింధూ రామారామా!
దీనబంధూ రామారామా!"

ఈ సంకీర్తనమున నిట్టి పాదములు నూటపదునెనిమిది వరకును గలవు. తకధిమి తక, తకధిమి తకధిమి- అనునావృత్తములతో చతురశ్రజాతి- ఏక తాళమున కొమగు గీతమాలిక ఇది. ఈ ధ్యాన (గేయ) సంకీర్తనము వెనుక 'నమోనమో దయానిధీ' అను మకుటముగల కృష్ణమాచార్యుని వచనము కాన రాకున్నను పైన పేర్కొన్న ప్రతియందే 'రామనామాలు' అను శీర్షిక క్రింద నుండుటచేత పైవానివలెనే ఇదియు కృష్ణమాచార్యుని రచనముగా మనము సంభావింపవచ్చును.

పై రచనలన్నియు రాగతాళములతో పాడఁదగిన ధ్యాన సంకీర్తనములు. గీతమాలికలు. స్తోత్ర ప్రాయములు. వీరి యీ రచనల ననుసరించియేకావచ్చును, తరువాత తాళ్ళపాకవారుకూడ నీ మట్టులలో ననేక సంకీర్తనములు రచించినారు. తాళ్ళపాక అన్నమయగారి యీ శృంగార సంకీర్తనము చూడుఁడు.

"అతిశోభతేయం రాధా
సతత విలాస వశా రాధా ॥
దర్పక జలబోధా రాధా
తర్పణ గంధవిధా రాధా ॥
దర్పయుత క్రోధా రాధా
దర్పక రసవేధా రాధా ॥

తారితావరోధా రాధా
తారుణ్యోద్బోధా రాధా
ధారితాసురోధా రాధా
దారితాపరాధా రాధా ॥"

ఇత్యాదిగా నెనిమిది చరణములుగల యీ రచన పైని పేర్కొన్న 'దశరథాత్మజ రామా రామా' అను నామసంకీర్తనమునే పోలియున్నది. ఇట్లే 'తకిట తకిట' అనునావృత్తములును, 'తకిట తకతక' అనునావృత్తములును పాదమునకు నాలు గేసి చొప్పునగల సంకీర్తనలుకూడ తాళ్ళపాకవారివి బహుసంఖ్యలో నున్నవి. ఉదాహరణ కొకటి రెండు తిలకింపుఁడు.

"ఏమి చిత్రం బేమి మహిమలు ఏమి నీ మాయావినోదము
వామనాచ్యుత నిన్ను తెలియగ వసుధలో మా తరములా"

(అన్నమా- 2 - 225)

ఇందు 'తకిట తకతక' - ఆవృత్తములు పాదమునకు నాలుగు చొప్పున నుండి కృష్ణమాచార్యుని రామనామకీర్తనమును స్మృతికిఁ దెచ్చుచున్నది. ఇట్లే

"పుడమిలోన మగలు గలుగు పొలతులకును దిరుగబాసె
ఆడవారి నుండనియ్యడమ్మ నీ కొమారుడు"

(అన్నమా. 3 - 309)

"తకిట తకిట" ఆవృత్తములు పాదమునకు నాలుగుచొప్పున గలరచన లిట్టి వనేకములు కృష్ణమాచార్యుని 'నృసింహ నామము'లను దలఁపించుచున్నవి.

పై పరిశీలనమునుబట్టి కృష్ణమాచార్యుఁడే మన సంకీర్తనపదవాఙ్మయమునకు పరికల్పకుఁ డనియు, వారిమార్గము ననుసరించియే తరువాత తాళ్ళపాక వారు దానికొక సమగ్ర స్వరూపము నావిష్కరించినారనియు తెల్లమగుచున్నది.

ఇట్లు ఓరుగల్లు, పిదప సింహాచలము ప్రాంతములందు వసించిన కృష్ణమాచార్యుఁడు సింహాచలాధీశుని పేర చాతుర్లక్షసంకీర్తనలు చెప్పి భక్తుఁడై యా వైష్ణవక్షేత్రమున కెంతయో ప్రసిద్ధిని చేకూర్చెను. ఆ యాలయము నాశ్రయించుకొనియే కృష్ణమాచార్యుని వచన సంకీర్తన సంప్రదాయము వర్ధిల్లినది. అతనికి సమీప కాలమునం దచ్చటి శాసనములుకూడ పై యంశమును నిర్ధారించుచున్నవి. సింహాచలమున లక్ష్మీనృసింహాలయమున సంకీర్తనము చేయువారును, నట్టువసానులును,

పలువు రాదినములలో నియుక్తులగుచుండినట్లు వానివలన మనకుఁ దెలియుచున్నవి. ఈశాసనములు చూడఁదగును.

దక్షిణ దేశీయ శాసన సంచయము – సంపుటము VI.

1. సంఖ్య 890- నట్టువసానులు కొందరు నామసంకీర్తనము
చేయగా శ్రీ నృసింహ భారతీశ్రీపాదులు వారికై
చేసిన దానాదిక విషయము గలది. కాలము క్రీ॥ శ॥ 1359.

2. సంఖ్య 1134-ధర్మదాసజియ్యన తనకు నభీష్టార్థసిద్ధిగాను పెట్టించిన దానాదిక
విషయము గలది. నామసంకీర్తనమునకై కొందఱు నట్టువసా
నులును, వీణవాయించువారును, తాళము వేయువారును నియుక్తు
లైరి. కాలము క్రీ॥ శ॥ 1374.

ఆ నాళ్ళలో నచట నట్టువసానులు గావించిన నామసంకీర్తనములు కృష్ణమాచార్యుని వచన సంకీర్తనములో లేక నృసింహరామనామాదులో అయియుండు ననుటలో వింత లేదు. ఆ దినములలో అచట ఈ నట్టువసానులు మాత్రమే కాదు, సంగీతశాస్త్రపారంగతు లగువిద్వాంసులు కూడ నుండినట్లు ఆ ఆలయ మందలి శాసనములను బట్టియే తెలియుచున్నది. ఆ శాసన సంచయము VI సంపుట మందే-

1. సంఖ్య- 797 నందు- ఆలయమున దానాదికము జరిపించిన ఒడ్డాదిపెద్దన
ప్రెగడ కొడుకు వరదనప్రెగడ ' పెద్దన మంత్రికర్య
తనయస్సంగీత రత్నాకరః' అని పేర్కొనఁబడినాఁడు.
కాలము క్రీ॥ శ॥ 1375.

2. సంఖ్య- 780 లో- అచట దానాదికము నిర్వహించిన మచ్చిరాజు కొడుకు
కృష్ణదేవర ' సంగీతాంబోధి చంద్రస్సకల గుణనిధిః
వేదశాస్త్ర ప్రవీణః' అని ప్రస్తుతుఁడైనాఁడు. కాలము
క్రీ॥ శ॥ 1377.

3. సంఖ్య- 896 లో- నరసింహనాధుని జయింతి మహోత్సవము ప్రస్తావింపఁ
బడినది. కాలము క్రీ॥ శ॥ 1387

పైన పేర్కొనఁబడిన సంగీతజ్ఞులగువారెల్ల రట్లే అచట జరుగుచుండిన మహోత్సవముల సందర్భమున నామసంకీర్తనము గావించుచు భక్తిసలిపి చరితార్థు లైనవారే యని తలఁపవచ్చును.

(వీరి నామసంకీర్తనలగాన మొక్క సింహాచలమందు మాత్రమే కాక, వాని ప్రచారమునుఁబట్టి నాఁటి సుప్రసిద్ధ వైష్ణవాలయనులం దన్నిటను పాడఁబడుచుండిన వనుకొందును. తిరుమలమీఁద వేంకటేశ్వరుని సన్నిధిని గూడ కృష్ణమాచార్యుని సంకీర్తనాదులు గానము చేయఁబడుచుండెను గాఁబోలు. స్వామివారే అన్నమాచార్యునితో నిట్లు చెప్పుకొనినారట- 'ఆడుచుఁబతకమాకన్నుల జోల పాడఁగ నాఁడెల్లఁ బసిబిడ్డనైతి। నా కృష్ణమాచార్యు నధ్యాత్మవినుతి-రాకఁగొన్నాళ్లు విరక్తుండ నైతి। జగతి నీశృంగార సంకీర్తనముల కగపడి మంచిప్రాయపువాఁడ నైతి." (చూ. అన్నమాచార్యచరిత్ర ద్విపద- పుట 41) 'కృష్ణమాచార్యు నధ్యాత్మవినుతి' యచట కూడ కొంతకాలము సాగుచుండినదని దీనినిబట్టి తెలియ నగును.

కృష్ణమాచార్యునిరచనలే తరువాతివారికెల్ల నావేశోత్సాహములఁ గొల్పిన రచనలనవలెను. కాని దురదృష్టమేమియోగాని శపింపఁబడిన ట్లీతని "చాతుర్లక్ష సంకీర్తనము" లీనాఁడు పూర్తిగా వ్యవహారము నుండి నశించి పోయినవి. మిగిలియున్న వేనియు శిథిలాతిశిథిలములై చెదరిపోయి రూపు చెడియున్నవి. సత్య మెట్టిదోగాని దీనికి తార్కాణగా కారణాంతరమున స్వామివారియాలయము మ్లేచ్ఛులచేత భగ్నమగునట్లుగా కృష్ణమార్యుఁడు శపిచినట్లును, దానికి ప్రతిఫలముగా స్వామివారు కృష్ణమాచార్యుని రచనలన్నియు క్షుద్రములై రూపుచెడి నశించునట్టు ప్రతిశాప మిచ్చినట్లును గల కథయొకటి ఆచార్యసూక్తిముక్తావళియం దెక్కియున్నది. ఏది యెట్లయినను ఈతఁడు ప్రసిద్ధికిఁ దెచ్చిన వచన సంకీర్తనపద్ధతి భక్తిసంగీత రచనల విషయమున గణనీయమైనట్టిదే.

సంగీత రసికుఁడగు ఎఱ్ఱాప్రెగడ విష్ణునామ సంకీర్తనము నిట్లు ప్రస్తుతించినాఁడు.

'దారుణ దురితాంధకార సూర్యోదయం

బధిక పాతక విపినానలంబు...(నృసింహ పు. 2-35.)

ఈ పద్ధతినే పిదప తాళ్ళపాక అన్నమాచార్యుని కుమారుఁడగు పెద తిరుమలాచార్యుఁడును చేబట్టి రాగతాళనిర్దేశముతో తాళగంధి చూర్ణకములుగా

వైరాగ్యవచనమాలికాగీతములను పెక్కింటిని రచించెను. వానిలో నూటయరు వదియారు మాత్రమే నేటికి లభ్యములై ప్రకటితములైనవి. వానిలో తాళ్ళపాక వారే రాగిరేకులపై చెక్కించినవానిలో నలుబదియేడింటికి మాత్రము రాగతాళ ముల నిర్దేశము కానవచ్చుచున్నది. వీనియందు వారెన్నుకొన్నరాగతాళము లివి—.

| వచన సంఖ్య | రాగము | తాళము | వచన సంఖ్య | రాగము | తాళము |
|---|---|---|---|---|---|
| 45 | ఆహిరినాట | రూపక | 94 | మలహారి | ఏకతాళి |
| 90 | కన్నడబంగాళం | త్రివడ | 26 | మలహరి | త్రివడ |
| 43 | కాంభోజి | త్రివడ | 85 | మాళవి | — |
| 39 | గుండక్రియ | త్రివడ | 7 | మాళవిగౌళ | ఏకతాళి |
| 1 | గుజ్జరి | ఏకతాళి | 8 | మాళవిగౌళ | త్రివడ |
| 92 | దేవగాంధారి | జంపె | 32 | ముఖారి | జంపె |
| 41 | దేశాక్షి | జంపె | 42 | ముఖారి | రూపక |
| 52 | దేశాక్షి | త్రివడ | 4 | రామప్రియ | రూపక |
| 86 | దేశాక్షి | రూపక | 5 | లలిత | జంపె |
| 87 | ధన్యాసి | ఏక | 91 | లలిత | త్రివడ |
| 88 | ధన్యాసి | జంపె | 30 | వరాళి | త్రివడ |
| 53 | ధన్యాసి | త్రివడ | 2 | శంకరాభరణము | త్రివడ |
| 10 | నాట | త్రివడ | 46 | శుద్ధ వసంతము | త్రివడ |
| 9 | నాట | రూపక | 3 | శ్రీరాగము | ఏకతాళి |
| 34 | నాదనామక్రియ | ఏకతాళి | 36 | శ్రీరాగము | జంపె |
| 33 | నాదనామక్రియ | జంపె | 35 | శ్రీరాగము | త్రివడ |
| 37 | నారాయణి | త్రివడ | 11 | సామంతము | జంపె |
| 44 | పాడి | ఏకతాళి | 40 | సామంతము | త్రివడ |
| 89 | బౌళి | ఏకతాళి | 29 | సాళంగనాట | ఏకతాళి |
| 12 | బౌళి | జంపె | 28 | సాళంగనాట | త్రివడ |
| 31 | బౌళి | త్రివడ | 38 | సాళంగనాట | పల్లవి (?) |
| 95 | భూపాలము | జంపె | 93 | హిందోళవసంతము | జంపె |
| 6 | భూపాలము | త్రివడ | 50 | హిందోళవసంతము | త్రివడ |
| 27 | భూపాలము | రూపకము | | | |

ఈ వచనమాలికాగీతములందు సూచితము లగురాగములలో నారాయణి అపూర్వరాగమని తజ్జ్ఞు లందురు. ఇక నిందు సూచితము లగు ఏకతాళి, జంపె, తివడ, పల్లవి, రూపక తాళములలో తివడ, పల్లవి అనునవి ప్రాచీనకాలమందే ప్రయోగమున నుండినట్లు తోఁచును. నేఁడివి ప్రచారమున లేవు.

**నిబంధ పదకవితాపద్ధతి :** మనదేశమున ప్రాచీనమగు నీ "వచనసంకీర్తన పద్ధతి" యొకప్రక్క ప్రచారమునకు వచ్చుచుండఁగా, మఱియొకవంక భాషా వ్యుత్పత్తియు సంగీతపరిజ్ఞానమునుగల శిష్టులగు వాగ్గేయకారులు కొందఱు తత్పూర్వపు మార్గదేశి గేయరచనారీతుల నాకళించుకొని 'సంకీర్తనా పరిశుద్ధిన్ దగఁ జేయఁ బూని' లక్ష్య లక్షణ సమన్వయముతో నిబంధ పదకవితా పద్ధతికిఁగూడ చక్కని మార్గమును గల్పింప సాగినారు. వారిలో క్రీ॥ శ॥ 15 వ శతాబ్ది నడిమిభాగము నుండియు లక్షణశుద్ధిగల పదకవితలతో దేశమునుఱ్ఱూత లూగించిన తాళ్లపాకవారే ప్రముఖులును ప్రథమాచార్యులును ననవలసియున్నది. వారికిఁబూర్వమిట్టి పద కవితలు దేశీయతాముద్రగలిగి జానపదులవాగ్వ్యవహారమునవేగాని లక్షణ శుద్ధి గలిగి శిష్టసాహిత్యమునఁ జేర్పఁదగినవియు, కాలమును గర్తృత్వమును గుర్తింప వీలగునవియు నధికముగ లేవనియే చెప్పవలెను. ప్రాచీనుల ద్విపదలు, రగడలు, తరువోజలు కాక-అట్లు కాలమును కర్తృత్వమును గుర్తింపఁదగిన పాట లలో పదములలో నాచనసోముని దని చెప్పఁబడు జాజరయు, గార్లపాటి లక్ష్మయ్యగారివని యిటీవలనే తలఁపఁబడుచున్న (యాగంటి) ఏగంటివారి పదము లలోని 'శివశివ యన మేలు తుమ్మెదా' అను తుమ్మెద పదమును 'సూర్య సోమా వహ్ని నడుమా శౌర్య మానే చిలుకాగంటి ' అనెడి ఏలయు కొన్ని మాత్రమే కనబడుచున్నవి. వీనిలో ఏగంటివారిపదముల రచనాకాలము విషయమున విమర్శకులలో నభిప్రాయభేదము లేకపోలేదు. శ్రీ మల్లంపల్లి శరభయ్యగారు 'ఏగంటి గ్రామమున వెలసిన నంజేశ్వరున కంకితములు'గా 'ఏగంటివారి వచ నము లనుశైవవేదాంతప్రతిపాదకము లైనగేయము'ల రచించిన లక్ష్మయ్యగారు (ఏగంటి లక్ష్మయ్యయు, పిడుపర్తి లక్ష్మయ్యయుఁగారనియు) 'పోసెట్టి లింగకవి చేత నవచోళచరిత్రప్రస్తావనలో నాదిమశివకవిస్తుతిలోఁ బాల్కురికి సోమ నాథుని పిమ్మట సుప్రసిద్ధగేయరచయితగా స్తుతియింపఁబడిన గార్లపాటి లక్ష్మయ్యగారే యనియు వివరించినారు.[1] కాని (1958) లో ఆంధ్రవాగ్గేయ

---

చూ. Bulletin of the Govt. Oriental MSS library, Madras Vol III No.1- 1954.

కారులచరిత్రను రచించిన శ్రీ రజనీకాంతరావుగారు ఏగంటివారిని గూర్చి చర్చించుచు వీరు "తాళ్లపాకవారికి సమీపకాలంలోనివా రనిగాని, తరువాతివారని గాని, అనడానికి యిబ్బంది ఉండదు తాళ్లపాకవారిలో పదకర్తలలో మూఁడవవాఁ డయిన చిన తిరుమలాచార్యుఁడు 16 వ శతాబ్ది చివరివరకూ ఉండినవాఁడే. యాగంటివారు, వీరబ్రహ్మంగారు కూడా ఆ కాలంలో కాని, 17వ శతాబ్ది మొదటిభాగంలో పుట్టి మధ్యభాగం వరకూ ఉండినవా రని చెప్పుకో వచ్చు. వీరబ్రహ్మం కంటె అన్యుఁడైన యాగంటిగురుఁ డెవ్వరో మరొక వ్యక్తిగాని, తాళ్ళపాకవారివలె యాగంటివా రని వరుసగా కొందఱు తత్త్వకర్త లుగాని ఉండి ఉండాలి" అని అభిప్రాయమును వెలిబుచ్చియున్నారు. (చూ. వాగ్గేయకార చరిత్ర - పుటలు 452 - 453)

ఏది యెట్లున్నను ఏగంటి సిద్దప్ప, సిద్దయ్య నామకులు కొందఱు భిన్నులు కూడ నున్నట్లు తెలియుటచేత "ఏగంటి వారు" ఒక్కరుకాక పలువు రని శ్రీ రజనిగారన్నట్లే తలఁపవలసి యున్నది. యాగంటి లింగని సంబోధించి ఏలలు రచించిన లక్ష్మప్పగారే గార్లపాటి లక్ష్మప్పగారై సోమనాథునికిఁ దరువాతి వారు కావచ్చునేమోగాని, యాగంటివారి పదా (యాగంటి ఇంటి పేరేమో) లుగా ప్రసిద్ధి గాంచిన.

"ఓపితే పుణ్యము చేయు మోపకుంటే ఊరకుండుము
పాపము సేయకు మింతే పదివేలు జీవుఁడా"
"పొరలి సంసారమ్ము బొరయకుండెడి యోగి
యరసి కోర్కెలయందు నంటబోడు"

మున్నగు లక్షణశుద్ధిగల పదములను రచించినవారు మాత్రము తాళ్ళపాకవారి రచనల నెఱిఁగియుండినవారుగనే తోఁచుచున్నారు. వారి పదములలోని రచనా నిర్మితి, పదప్రయోగసరళి, నాకట్టి యూహను గల్గించుచున్నవి. తాళ్ళపాక వారు తమ సంకీర్తనచ్ఛాయాపహారుల నిట్లు తెగడినారు.

"వెఱ్ఱులాల మీకు వేడుక కలిగితేను
అఱ్ఱువంచి తడు కల్లంగరాదా ॥ పల్లవి ॥
ఉమిసిన తమ్మలో నొక కొంత కప్రము
సమకూర్చి చవిగొని చప్పరించనేల

అమరంగ ఛాయాపహారము చేసుక
తమ మాటగూర్చితే దైవము నగడా ॥ (3)
చిబికివేసిన గింజ చేతఁ బట్టగనేల
గబుక కెంగిలిబూరె గడుగంగ మఱియేల
తొబుక కవిత్వాల దోషాలఁ బొరలితే
దిబుకార నవ్వఁడా దేవుఁడైనాను ॥ (4)
ఎన్నగ శ్రీ వేంకటేశుఁ దాళ్ళపాక
అన్నమాచార్యులు అఖిల దిక్కులు మెచ్చ
ఉన్నతితోఁ బాడి రొకఁ డెవ్వఁడో తాను
సన్న నొరసునట సమ్మతాహరికి ॥[1] (10)

'వీరశైవాచారవిభవము మదిలోనుఁ గోరక శివుని గొలువ నేరక వేరొక్కమతమున విహరించు హీనులఁ జేరంగ నేగంటి సిద్ధయ్య నగెబో' అను నాడిగాఁగల 'యాగంటివారి పదాలను' స్మరించి తిరస్కరించినదేనా పై సంకీర్తనము ? ఏమో ! కాకున్న వారి సన్నిహితకాలమున వర్తిల్లి వారివలెనే పదరచన గావించి, వారి యాగ్రహమున కిట్లు పాల్పడినవారు వేరెవ్వరో ! తెలుఁగు పద కర్తలే అయి యుండవలె

తెలుఁగున వినూత మగునీ పదకవితాప్రక్రియకు సురూపమును గల్పించుటలో తాళ్ళపాకవారి కంతకుఁ బూర్వపు సంస్కృత, కర్ణాటకాది భాష లందలి వాగ్గేయకారుల రచనలు చాలవరకు దోహదమిచ్చియుండు ననువిషయము నీవఱకే తద్జ్ఞులు పలువురు వ్రాసియున్నారు.[2] ఆ భావమున గొంత యాథార్థ్యము లేకపోలేదు. విషయ మించుక వివరింతును. తాళ్ళపాకవారే తమ సంకీర్తన లక్షణ మున జయదేవునిగీతగోవిందమును స్మరించినారుగదా ! అందలి యష్టపదులను బోలినరచన లెన్నియో తాళ్ళపాకవారివి సంస్కృతాంధ్రభాషలం దున్నవి.

---

1. ఈ కీర్తనము అన్నమాచార్యుని రచనగా అధ్యాత్మసంకీర్తనసంపుటము లందు ముద్రితమైనది. అన్నమయ్యను భూతకాలికక్రియారూపములోఁ బేర్కొన్న యీ కీర్తన నాకుఁ జూడఁగా పెదతిరుమలయ్యదో చినతిరుమలయ్యదో అనిపించు చున్నది.

2. చూ. వాగ్గేయకార చరిత్రము. శ్రీ రజనీకాంతరావు. (పుటలు. 120, 152, 153)

కావున ఆ విషయమున చర్చకుఁ దావులేదు. ఇక కన్నడభాషయందలి ప్రాచీన గేయ రచనలనుగూర్చి కర్ణాటక సారస్వతమున ప్రాచీనమగు వీర శైవయుగము నకుఁ జెందిన నిజగుణశివయోగి బసవేశ్వరుఁడు మున్నగువారు గావించిన భక్తి జ్ఞాన వైరాగ్య బోధకము లగుగేయాత్మకరచనలు వందలకొలఁదిగా నున్నవి. వానిని గమకకళాకోవిదు లందముగా నాలపించు సంప్రదాయము నేఁటికిని కన్నడ దేశమున గలదు. ఈ కృతులను శాస్త్రములనియే వీరశైవ విద్వాంసులు వ్యవహరింతురు. ఇవి ప్రాయికముగా మన 'వచన సంకీర్తన పద్ధతి'కిఁ జెందినరచన లనవచ్చును. ప్రాచీనము లగునీ కర్ణాటకశైవ వచన గీతములే మనవారి వచన సంకీర్తనములకు మూలప్రాయము లగురచనలు. అటు తర్వాత దాససాహిత్యయుగమున మధ్వాచార్యపరంపరకుఁ జెందిన నరహరి తీర్థులు శ్రీపాదరాయరు ప్రభృతులుకూడ సంకీర్తనపదరచన గావించినా రనియు వారి రచనలు కొంతవరకు అన్నమాచార్యులు నిర్వచించి చెప్పుకొన్న పదరచనలకు దోహదమిచ్చియుండు ననియు, శ్రీ అనంతకృష్ణశర్మగారు ప్రకటించిన యభిప్రాయము సమంజసమైనదే. వీరిలో నరహరితీర్థులు పూర్వులేగాని శ్రీపాదరాయరు మాత్రము అన్నమాచార్యులకన్న వయసున నించుక పెద్దలైనను దాదాపు సమకాలికులే. ఇక అటుతర్వాత కన్నడమున పద రచనలో విశిష్టత గడించుకొన్న వ్యాసరాయపురందరదాసాదులు సమకాలికులే యయ్యు పదరచనా విషయమున అన్నమయ్యకుఁ దరువాతివారే. ఇటు చూడఁగా ఆంధ్ర కర్ణాటక సాహిత్యములందు కొంచె మెచ్చుతగ్గుగా సమకాలమందే లక్షణ శుద్ధిగల పదరచనలకును, సంగీతసంప్రదాయమునకును బునాదులు పడినవేమో అనిపించును. తెలుఁగున అన్నమాచార్యుఁడు పదకవితాపితామహుఁ డనిపించు కొన్నట్లే కర్ణాటకమున అంతకుఁ బూర్వపు పదకవు లొకరిరువు రున్నను పురందరదాసే ఆ స్థానము నలంకరించెను. ఆ నాళ్ళలో నీ పదకవు లిరువురును గలసికొనినారుకూడ.

**అన్నమయ్య - పురందరదాసు :** అన్నమాచార్య చరిత్రమున చిన్నన్న యిట్లు వ్రాసినాఁడు—

"గద్యపద్యముల డెబ్బదిరెండుమంది
యాద్యులచేఁ గొనియాడించుకొన్న

రసికుండు శ్రీ పండరంగ విఠలుఁడు
కొసరెడు భక్తిచేకూరఁ జేసేత
నెనయ సంధ్యలకు నీళ్ళియ్యఁ జేకొనుచు
దనరు పురందర దాసాహ్వయుండు
పరమ భాగవతుఁడై పరగుచు నంద
వర కులాగ్రణియైన వైష్ణవోత్తముఁడు
సవరించు మురవైరిసంకీర్తనములు
కువలయంబునఁ బేరుకొన్న మాత్రమున
తలఁచిన భూతభేతాళపిశాచ -
ములు పారిపోవ నిమ్ముల శుభంబెసఁగ
విని కనియును లోన వెఱగందికొనుచు
చని తాళ్లపాకశాసనుఁ డన్నమయ్య
వెన్నునిగానె భావించి కీర్తించి
సన్నుతి సేయ నాచార్యవర్యుండు
నతని విట్ఠలునిగా ననిశంబు దలఁచి-
ప్రతిలేని గతుల సంభావించె నపుడు ''

(పుటలు 44-45)

దీనిని బట్టి వీరిరువురును గలసికొనిరన్నది చారిత్రకసత్యమే. కాని ఈ యుదంతమును సందేహించుచు వ్రాసిన శ్రీ పంచముఖిగారి వాదము[1] సమంజ ముగా తోఁపదు. వ్యాసరాయ పురందరదాసుల జీవితవిశేషములనుగూర్చి సంప్రదాయజ్ఞులు పలుపలు విధముల వాకొనుచున్నను, శ్రీ బి. వెంకోబరావుగారు

1. చూ. కర్ణాటద హరిదాససాహిత్య-విద్యాతర్న శ్రీ ఆర్. యస్. పంచముఖి అందు వారి సమావేశ మసంభవ మనుటకు వీరిచ్చిన యుపపత్తు లివి.

క.) చిత్తశుద్ధిగల మాధ్వుఁడగు పురందరదాసు అన్నమాచార్యుని వెన్నునిగానె భావించి కీర్తించుట జరిగియుండదు.

చ.) ఈతఁడు విద్యానగరమున రాయలకడ నుపదేశమును పొందినపిదపనే పురందర దాసాహ్వయుఁడై పదరచనకుఁ గడంగెను. వ్యాసరాయలవారు క్రీ. శ. 1500 తర్వాతగాని విద్యానగరముకు రాలేదు. అందువలన అటు తర్వాత వారి శిష్యతానుగ్రహము పొందిన పురందరదాసు అన్నమయ్యను దర్శించి యుండఁడు.

ప్రత్యక్షప్రమాణ మనఁదగు సోమనాథకవీశ్వరుని వ్యాసయోగి చరితమునకు వెలయించిన సమర్థమును, సమగ్రము నగుపీఠికలోని చారిత్రకవిషయములను బట్టి పై విషయమున సందేహములకుఁ దావులేదని చెప్పవచ్చును. వ్యాసరాయల వారు (క్రీ. శ. 1446-1539) పండ్రెండేండ్లపాటు తిరుపతిలో శ్రీనివాసుని యాలయమున నర్చకత్వము నెరపుచు క్రీ. శ. 1486-1498 నడుమ పలు తూరులు విద్యానగరమునకు వెళ్లివచ్చు చుండినవారలే. 1498లో వెళ్ళి యక్కడే స్థిరపడినవారును. అందువలన ఆ పండ్రెండేండ్ల వ్యవధిలో గాని, కాదనుకొన్న పక్షమున క్రీ. 1498 లోగాని పురందరదాసు వ్యాసరాయల నుపదేశగురువుగా భావించి గ్రహించి యుండును. అట్టియెడ చిన్నన్న వ్రాసినట్లు 'పరమభాగవతుఁ'డగు పురందరాహ్వయుఁడు,మహా మహిమోపేతము లగు సంకీర్తనముల రచించి విఖ్యాతిగాంచిన వృద్ధుఁ డగుఅన్నమయ్యను (ఆతని యవసానకాలమగు) 1503 లోఁగా నెన్నడేని దర్శించి యుండుటలో నసంభావ్య మేమియును లేదు.[1] ఇక మాధ్వుఁడగుపురందరదాసు అన్నమయ్యను "వెన్నునిగానె భావించి కీర్తించుట" పొసగ దను శ్రీ పంచముఖిగారి యభిప్రాయము వారిదృష్టిలో సరియే కావచ్చును.కాని ఆది ఈసమావేశముజరిగిన యెంతో కాలమునకువైష్ణవ సంప్రదాయమునకు చెందిన చిన్నన్న చెప్పినతీరని మనము సరి పెట్టుకొనవలెను. కావున వారిరువురి సమావేశమును గూర్చి మనము సందేహింపనవ సరము లేదు. ఇకవ్యాసరాయలవారిని దర్శించుటకు పూర్వమే పురందరదాసు నకు వైరాగ్యము వచ్చినది. అప్పటికే యతఁడు మహారాష్ట్ర ప్రాంతమునందలి జ్ఞానదేవాదుల భక్తిమయగేయరచనలను జీర్ణించుకొని యున్నవాఁడు. కావు

---

1. పురందరదాసుల జన్మదేశ కాలములను గూర్చి కర్ణాటక విద్వాంసులలో నేకాభిప్రాయములేదు. సంప్రదాయజ్ఞులు పలువురు పలుతెరగుల చెప్పుదురు. శ్రీ వెంకోబరావుగారు వ్రాసిన చారిత్రక విషయములను సమన్వయించుకొని, అన్నమాచార్యుని పురందరదాసు దర్శించెనని చిన్నన్న చెప్పిన చారిత్రకసంఘటనము క్రీ॥శ॥ 1500 ప్రాంతమందు జరిగి యుండునని విశ్వసించి, "యౌవనదల్లి శ్రీహరి పాదనంబదే మూవత్తు వరుష మోహాబ్ధియల్లిబిడు" అని పురందరదాసే చెప్పుకొన్న పదము ననుసరించి చూడఁగా నాతని జననము సంప్రదాయజ్ఞులు చెప్పునట్లు క్రీ॥ శ॥ 1484 కాక 1470 ప్రాంతమగునని తోఁచును. దీనినిబట్టి యాతని జీవితకాలము క్రీ॥శ॥ 1470 1564 నడుమ కాఁగలదు. దాదాపు ఎనుబది నాల్గేండ్లకు పైబడి జీవించినవాఁడగునని నా భావన.

ననే శ్రీఘకాలముననే గొప్పరచయితగా పేరుపొందిన పురందరదాసునంతటి వానిని శిష్యునిగాఁబడయుటయే విశేషమన్నట్లుగా వ్యాసరాయలవారు 'దాసరెందర పురందర దాసరయ్య' అనియు, వారి రచనలను 'పురందరోపనిషత్తు' లనియు పేర్కొని ప్రశంసించినట్లు చెప్పుకొనుట.

వ్యాసరాయలును, పురందరదాసులును, ఆనాళ్ళలో దేశమున ద్వైతమత ప్రచారమున కెంతయో పాటుపడిరి. తుళువ నరసనాయకుని కాలమున తిమ్మరుసయ్య ప్రోద్బలమున విద్యానగరము చేరుకొన్న వ్యాసరాయలవారు తరువాత శ్రీకృష్ణదేవరాయని కాధ్యాత్మికదేశికులై తమ మతమునకుఁ గ్రొత్తరూపు కల్పించి వ్యాసకూటమును నిర్వహించినారు. ఈకూటము పండితవర్గమునకు జ్ఞానబోధ కల్గించుటకై యేర్పడినది. అట్లే పురందరదాస కనకదాస విజయ దాసాదులతోఁ గూడిన 'దాస కూటము' నుగూడ నిర్వహించి పామరలోకమునకు గేయరచనల మూలమున భక్తిభావ మనుభిక్షను పంచిపెట్టించినారు. కన్నడ నాడున ప్రసిద్ధమగు నీవ్యాసదాసకూటములకు ఒక విధముగా నాఁటి వైష్ణవకూటములు దోహదమిచ్చినవేమో అనిపించును. నాఁటి జియ్యరుమఠము అహోబిల మఠము మున్నగువానికి సంబంధించిన వైష్ణవకూటములు దేశమందలి యాధ్యాత్మిక వికాసమునకు పాటుపడి మతసంప్రదాయమును పోషించెడివి. తోడ్తోవానికి సహకరించునట్లు సుగమమగు భక్తిమార్గమున వైష్ణవమతప్రచారమునకై తాళ్ళపాక వాగ్గేయకారు లవతరించి "హరిదాసకూటము" నిర్వహించినారు. అన్నమాచార్యాదులు 'నీదాసుండనై దాసరినైతి' ననియు, భువిహరిదాసుల' మనియు తమ్ముతాము వర్ణించుకొనినారు తెలుఁగుదేశమందలి వైష్ణవ దాసరిభజన (హరిదాస) కూటములకు తాళ్ళపాకవారే పితామహులు.

ఇటు చూడఁగా నాఁటి వైష్ణవ కూటములే ద్వైతుల 'వ్యాసకూట' సంప్రదాయమునకును, తాళ్లపాకవారు నిర్వహించిన "దాసరికూటము"లే కర్ణాటక దాసకూట సంప్రదాయమునకును దారి చూపినవేమో అనిపించును.

**హరిదాసకూటము- దాసకూటము :—** రామానుజుల విశిష్టాద్వైత సంప్రదాయమునకును, మధ్వాచార్యుల ద్వైతసంప్రదాయమునకును సూక్ష్మమగు జీవుని వ్యక్తిత్వము విషయముననే తప్ప స్థూలమగు హరిభక్తి విషయమున నెట్టి విభేదమును లేదు. రెండు సంప్రదాయములును జీవాత్మ పరమాత్మల భేద భావము నంగీకరించి భక్తిభావమునకు పట్టముగట్టునవియే! కనుక జనసామాన్య

మున హరిభక్తిని వ్యాప్తికిఁదెచ్చి, మధుర మగుభక్తిగేయసారస్వతమున దేశమును రసప్లావితము గావించుటలో నాఁడీహరిదాసదాసకూటములు రెండును కలిసి మెలసి వ్యవహరించినవనియే నావిశ్వాసము. ఈ రెండు కూటములకును మూల పురుషులనఁ దగుమహనీయులు అన్నమాచార్య వ్యాసతీర్థవరేణ్యు లిరువురును సమ కాలికులే. ఇరువురును సాళ్వ నరసింహరాయనిచేత సత్కరింపఁబడినవారే. వీరి తరువాత ఈ విషయమున ముఖ్యముగా విజయనగరరాజుల యౌదార్యము నూతగాఁ గొని వైష్ణవులగు పెద తిరుమల చిన తిరుమలాచార్యులును, మాధ్వులగు పురందర దాసులవారును కలసి గణనీయమగు సేవ గావించిరి. వీరి కాలముననే కర్ణాటక సంగీతసంప్రదాయమునకును చక్కని పునాదు లేర్పడినవి. ఈ నా భావములకీ క్రింద చూపుసుపపత్తులే కారణము. అరసి యందలి సత్యాసత్యములను ప్రాజ్ఞులు గుర్తింపఁదగుదురు.

1. వృద్ధుఁడును, పదకవితాపితామహుడును నగుఅన్నమాచార్యులు పురందరదాసులను వయసునఁజిన్నవారైనను ఘనముగా సంభావించి కీర్తించినారు.
(చూ. అన్నమాచార్యచరిత్ర ద్విపద పు-44)

2. తాళ్ళపాకవారును, పురందరదాసాదులును భజనకూటముల నిర్వహించిరి. ఉభయకూటములవారును, తిరుమలయందును విద్యానగరమందును భజన కూటములను నడుపుచు శ్రీనివాసునిమీఁది భక్తిగేయముల నాలాపించినారు.[1] పాండు రంగవిట్ఠలునిమీఁద పదులకొలఁదిగా పదముల రచించినారు.[2] ఆంజనేయస్వామి

1. "ఇతవు నేసినవారికిది-నిగ్గుతో విజయనగర శృంగారవనములోన
వెగ్గళించి కోనేటి శ్రీవేంకటేశుండు" (అన్నమా. 3-583).

"విట్ఠలయ్య వీధికేగి వేగవచ్చేవో
విజయనగరములో వీధుల వీధుల వెంట
భుజమురికలతోడఁ బొద్దుపుచ్చేవో
త్రిజగములనేలిన తిరువేంకటేశుండ
భజననిలిచితి భూపతిచెరువుకాడను. (అన్నమా. 4-40)

2. చూ. తాళ్ళపాకవారి సంకీర్తనములు (3-228, 229, 269, 287, 482)

మఱియు "వసుధఁజూడఁ జిన్నవానివలె- పరగ నేడునూటడెబ్బదియేడుగురి చేత
నిరవైపాడించుకొన్నాఁడీ విట్ఠలుఁడు
గట్టిగాఁబుండరీకుఁడు కడువేడుకఁబెట్టిన
యిట్టికపీటపైనున్నాఁడీ విట్ఠలుఁడు" (6-217)

నారాధించినారు.[1]

3. తాళ్ళపాకవారి రచనలకును పురందరదాసాదుల కీర్తనలకును భావము నందును పదప్రయోగమునందును మాత్రమేకాక పదరచనావైవిధ్యమందును పదస్వరూపమునందును గూడ సామ్యమెంతో యున్నది. దీనికా భజనపరుల సాన్నిహిత్యమే కారణ మని నాతలంపు.

"శరణు శరణు సురేంద్రసన్నుత శరణు శ్రీసతివల్లభ
శరణు రాక్షస గర్వసంహార శరణువేంకటనాయకా"

అని భజనపద్ధతిలో అన్నమాచార్యునిదిగా నాఁటినుండి నేఁటిదాక భావింపఁబడు చున్న యీపై సంకీర్తనపంక్తులఁ జదివి పురందాసువారి యీ క్రింది సంకీర్తన పంక్తులనుగూడ జదువుఁడు—

'శరణుశరణు సురేంద్రవందిత శరణు శ్రీపతిసేవిత
శరణు పార్వతితనయ మారుతి శరణు సిద్ధివినాయక'

(చూ. అన్నమాచరిత్ర పీఠిక పు-67)

ఇట్లే—

నేఁటికిని దక్షిణదేశమందలి హరిభజన సంప్రదాయమున 'తోదయ మంగళం' అనఁబడు తొలి పాటలలో నొక్కటిగా సర్వత్ర వ్యాప్తిలోనున్న 'నారాయణ తే నమోనమో - భవ నారద సన్నుత నమోనమో' అను కీర్తనము తాళ్లపాకవారిదిగా రాగిరేకులలో నున్నది. అందు దీనిది పాడిరాగము. వ్యవహారమున నిప్పుడిది మధ్యమావతి రాగము. దీనినే కడపటిచరణమున గల 'నాద ప్రియ తే నమోనమో' అను దానిని 'పురందరవిఠల తే నమోనమో' అని మార్చి పురందరదాసుల పదముగా కర్ణాటకులు కొందఱు వాడుచున్నారు:

(చూ. తాళ్ళపాకవారి కీర్తనలు 11 వ సంపుటము పు-2)

4. తాళ్ళపాక పెద తిరుమలాచార్యుఁడును, పురందరదాసాదులును అచ్యుతదేవరాయలవారిచేత నాదరింపఁబడి వారికభీష్టముగా సంకీర్తనములు చెప్పినవారే.[2] తాళ్ళపాకవారి సంకీర్తన భాండాగార వ్యవస్థను సుస్థిరపఱచి రాగి

---

1. చూ. తాళ్ళపాకవారి సంకీర్తనములు (8-138), (9-230) (6-223) విజయనగరమందలి హనుమంతుని గూర్చిన యీకీర్తనలు కాక దేశమున పలుతావుల నెలకొన్న ఆంజనేయస్వామిని గీర్తించిన పదములెన్నో యున్నవి.

2. చూ. తి.తి.దే. శాసన సంచయము సం.4-సంఖ్య 20. క్రీ. శ. 1532.

రేకులపై వారిపదము లన్నిటిని( జెక్కించి భద్రపఱచుటకు( దగినయవకాశము( గల్పించినది అచ్యుతదేవరాయలే. శ్రీకృష్ణదేవరాయల యనంతరము వ్యాసదాస కూటములకు అచ్యుతదేవరాయ లాయన లేనికొరతను దీర్చినవా(డే. తదాస్థాన సంగీతవిద్వాంసు(డును, తోడరమల్ల బిరుదాంచితు(డును నగుబయకార రామా మాత్యు(డు నా(టి సంగీతప్రపంచము ను త్తేజపరచినవా(డే. చిన్నన్న అష్ట మహిషీ కల్యాణమున తోడరమల్లుని స్మరించినా(డు.

5 నా(టి వారి సంకీర్తనములకు సమకాలమున భిన్నప్రదేశములలో ప్రచారమును గల్పించుటకై స్వరసాహిత్యములతో వానిని నేర్పుటకును, వ్రాయించుటకును, అచ్యుతరాయని కాలమున గొప్ప కృషి జరిగినది. తత్ఫలితమే తాళ్ళపాక వారి సంకీర్తనభాండాగారవ్యవస్థ. మంగళగిరి, సింహాచలము మున్నగుచోట్లగల వైష్ణవాలయములలో( బెక్కింట ఆనా(డు 'సంకీర్తనఅరుళుప్పాడు' సాగుచుండినది. ఆ దృష్టితో సంగీతాభ్యాసమునకును, శిక్షణకును నా( డవసర మేర్పడినది. అప్పటికే ప్రత్యేకత గడించుకొనుచుండిన కర్ణాటకసంగీతపద్ధతికి కట్టుదిట్టము కల్పించుటకై పురందరదాసు సంగీతవిద్యాభ్యాసమున కను వగురీతిని సరళీ జంటవరుసలను, బహువిధగీతాలంకారములను రచించెను సంకీర్తన భాండాగారమున సంగీతవిద్వాంసులుండిరి. వారు పాడెడివారు. అర్హులకు నేర్పెడివారు. వారు 'పాటలెల్లాపాడుమంటా భూమికెల్ల నోర నూరిపోసి' నారు. నరసింగన్న "పాడ(జెప్పను వర్ణపద్ధతి నీడుజోడులే(డన సభ(జొచ్చి వాదించి పరగిన ధీశాలి:" సంగీత విద్యాభ్యాసతత్పరు లప్పటికే పురందరదాసులవారి యలంకారాదులను నేర్చుచుండిరి.

> "సరిగమ పదనిస సనిధప మగరి
> సరిగమ రిగమప - సనిధప మనుచు
> బహువిధాలంకృతుల్పాడుకొనంగ- గ్రామసంతతుల మేళముల్
> చేసి... ఆళాప మార్గంబు లలర( జూపుచును"
> (చూ. ఉషా. పుట 21)

– ప్రారంభకులు పాడుకొనుచుండినట్లు చిన్నన్న ఉషాకల్యాణమున వివరించెను.

"జోడుకూడి గురుశిష్యు లిరువురును ఆవృత్తి చేయుచు తద్దివ్యప్రబంధ నివహంబు నెల్ల తాళమానితముగా" పాడుకొనుటను చిన్నన్నయే పరమయోగి విలాసమున విశదీకరించెను.

తాళ్ళపాకవారే స్వరసాహిత్యములతో కూడిన తమ సంకీర్తనములను (రాగిరేకులపైఁజెక్కించుటకు వీలులేక కాఁబోలును) నిలువెత్తు శిలాశాసనములందు లక్ష్యలక్షణసమన్వయదృష్టితోఁ జెక్కించుకొనినారు. ఆలయ ప్రాకార కుడ్యము లలో నిలిపి స్వామి సందర్శనమునకు వచ్చువారికెల్ల వానిని చూచి నేర్చుకొను భాగ్యమును గల్పించుటకే వారట్టి యత్నము సల్పిరోయేమో !

చినతిరుమలాచార్యుఁడు "సంకీర్తన లక్షణము"ను తెనిఁగించెను. బయకార రామామాత్యుఁడు అచ్యుతదేవరాయలకు తోడుగనుండిన ఆరవీటి రామరాయల కభీష్టముగా "స్వరమేళ కళానిధి"ని రచించెను. పురందరదాసు సరళిజంట వరుస లకును, లక్షణ గీతములకును నెన్నుకొన్న మాయామాళవగౌళమేళముయొక్క ప్రాశస్త్యమునే రామామాత్యుఁడం దుగ్గడించినాఁడు. ఒక్క సంగీత విషయము మాత్రమేకాదు, అచ్యుతదేవరాయలు సంకీర్తనవిద్యకు తోడుగా నాట్య విద్యను గూర్చికూడ మిక్కిలి శ్రద్ధ వహించెను. విద్వత్సభారాయరంజకు రాంఁడని ప్రసిద్ధిగాంచిన ముద్దు కుప్పాయి, హనుమసాని మున్నగు సట్టువకత్తె లను ప్రత్యేకించి యతఁడు రాజధాని నుండి సంగీతనృత్యవిద్యోపదేశమునకై తిరు పతి యాలయమునకుఁ జేర్పించెను.

ఇటు చూడగా అచ్యుతదేవరాయలు, అళియ రామరాయలు, వారినను సరించి తాళ్ళపాకవారు, పురందరదాసులవారు బయకార రామామాత్యులు నందరును గలసి కర్ణాటకసంగీతపద్ధతి కానాఁడు పట్టాభిషేకము గావించినట్లు న్నారు. కాని స్వరసాహిత్యములతో నుండిన అప్పటి వాగ్గేయకారుల పదము లీనాఁడు మనకు కనుమరుగైపోవుట కా తరువాత జరిగిన విద్యానగర వినాశమే ప్రధానకారణమై యుండును. శిలాబద్ధమైన తాళ్ళపాకవారి కీర్తనము లొకటి రెండును, ఎట్లో సుబ్బరామ దీక్షితులవారికి చిక్కి సంగీతసంప్రదాయప్రదర్శి నిలో నుదాహృతములైన పురందరదాసులవారి కీర్తనలు కొన్నియును, రూపు చెడక స్వరసహితముగ నేఁటికిని మనకు లభించియున్నవి. ఆనాఁటి సంగీత సంపద నేఁటికి మనకు లభించిన దంతియే !

6. క్రీ॥ శ॥ 1540 ప్రాంతమున చినతిరుమలాచార్యుఁడు పునర్నిర్మించిన అలమేల్మంగాపుర గోపురప్రాకారమంటప శిలాస్తంభ కుడ్యాదులం దెచ్చటబట్టిన నచ్చట నాఁటి వాగ్గేయకారుల స్వరూపమును వెల్లడించు శిల్పము లెన్నియో నాకుఁ

గానవచ్చినవి. చినతిరుమలయ్య ఆనాఁటి యాలయమున పరకవితా పితామహుని శిలామూర్తినే ప్రతిష్ఠించెను. కాని నేఁడది కానరాకున్నది. ఇఁక నచటి శిలా స్తంభములందు అన్నమాచార్య, పెద తిరుమలాచార్య, చినతిరుమలాచార్యుల శిల్పము లున్నవిషయమును శ్రీ A. V. శ్రీనివాసాచార్యులుగారు వ్రాసియే యున్నారు.[1] నాకుఁ జూడగా వారివేకాక వ్యాసరాయలు, పురందరదాసులు, రామామాత్యులు, అచ్యుతదేవరాయలు ప్రభృతులయాకృతులుగా గుర్తింపఁదగిన శిల్పములు గల శిలాఫలకములుగూడ నందున్నట్లు తోఁచినది. కొండమీఁద నేఁడు మనకు లభించిన తెలుఁగు లిపి స్వరశాసన ఫలకములవంటి వీయలమేల్మంగాపురాలయ ప్రాకారకుడ్యములందుగూడ నేమేని ఉండునేమో యని చూచితిని గాని శిథిలమైన ప్రాకారమునం దట్టిశిల లేవియు నాకుఁ గానరాలేదు.

పైని వివరించిన హేతువులను బురస్కరించుకొని అచ్యుతదేవరాయలవారి కాలమున వారిప్రోత్సాహమున కళాదృష్టితో నీహరిదాస దాసకూటములు రెండును నేకముఖమై పరిశ్రమించిన వనుట విస్పష్టము. నాఁటి వైష్ణవాలయములే - ముఖ్యముగ తిరుమలమీఁది శ్రీనివాసాలయమే-కళానిలయములై కళాకేంద్రములై వర్తిల్లినవి. ఉదారు లగుప్రభువులయు, సమర్థు లగువాగ్గేయకారులయు, లక్షణజ్ఞులగు విద్వాంసులయు, కుశలు రగుకళాకారులయు ప్రాపున నాఁటి కళాలతిక చక్కఁగా చిక్కఁగా దేశమంతయు నల్లుకొని మూఁడుపూవులు నారుకాయలునై వర్ధిల్లినది.-

## నృత్యనాటకశాలలు - సంకీర్తన భాండాగారము

సంగీత రసికుఁడగు నెఱ్ఱాప్రెగడ విష్ణునామ సంకీర్తనమును వర్ణించుచు "దారుణ దురితాంధకార సూర్యోదయం। బధిక పాతక విపినానలంబు" అని నాఁడు. అప్పటికే అహోబిలము, సింహాచలము మున్నగు తావుల పేర్వెలసి ప్రఖ్యాతిగాంచిన కృష్ణమాచార్యుని నామసంకీర్తనములును, వచనసంకీర్తనములును, ప్రచారము నందియుస్నవి. అట్టి నామసంకీర్తనమునకై నట్టువసానులు కొందఱు నియోగింపఁబడుటయు, వారు పాడియాడుచుండుటయు క్రీ॥శ॥ 1400 నాఁటికే సింహాచలప్రాంతపు శాసనములందు మనకు తెలియవచ్చినది[2] ఇక తిరుమల

1. చిన తిరుమలాచార్యుని సంకీర్తనలు సం. 16. పీఠిక. పుట 26.
2. ఇది యాగమోక్తమగు సంప్రదాయము. పూజా సందర్భమున కుంభహారతి నెత్తువేళ గీత నాట్యము లుండవలెనను తత్సంప్రదాయము ననుసరించియే దేవాలయములందీ నట్టువసానులు నియోగింపఁబడుచుండిరి.

తిరుపతులందు సాళువ నరసింహరాయాదుల కాలమున తాళ్ళపాకవారి పదములు రాజసభకు సంబంధించిన నాట్యాగారములందు పాడియాడఁబడు చుండుటయు, ఆలయమందును, ఉత్సవ సమయములలో దేవుని యూరేగింపునకుముందును తిరువీధిసానులు నాట్యమాడి గానము సేయుచుండుటయు శాసనప్రమాణమున వ్యక్తము లగువిషయములే. అన్నమాచార్యుఁడు గొప్ప పదకర్త. సాళ్వ నరసింగరాయఁడు సంగీతనాట్యసాహిత్యము లందభిమానము గలవాఁడు. ఆ రాయఁడు టంగుటూరు పాలకుఁడుగనున్న నాళ్లనుండియు తానుండిన యూళ్ళలో నాట్యశాలలను నిర్మించి సంగీతనాట్యవినోదము లనుభవించినవాఁ డే. దానికి అన్నమాచార్యుని పదరచనలే చాలవరకు హేతువులు కానోపును. తొలుత టంగుటూరులో కేశవస్వామివారి యాలయమునకు ప్రక్కగా అన్నమాచార్యునకై నరసింగరాయఁ డొక పెద్ద భవనము నేర్పాటు చేసెనట (చూ. అన్నమాచార్యచరిత్ర ద్విపద పు. 32). అదియే నాఁడు అక్కడి సంగీతనాట్యశాలగా రూపొందినది. పిదప రాయఁడు పెనుగొండ, చంద్రగిరి నగరములందుండి విజయనగర సార్వభౌముఁడైన దినములలోఁగూడ అన్నమాచార్యుని శృంగార పదములను విని యానందించుచుండెను. ఆ పదములను అన్నమాచార్యుఁ డే కాక వానిని నేర్చి పాడెడి కళాకారులు కూడ నాఁడుండెడివారు. అట్టి సంకీర్తనములు "తిపిరిదండెలు, శ్రుతుల్ తిన్నగాఁ గూర్చి దండిమై నెఱ గానదండెయు, వాద్యదండెయుఁ, దాన సంతానంబుఁ జూప స్థాయి షడ్జమును బంచమమును జేసి రాయముల్ కడువింత డాలుగాఁ" జూప (చూ. అన్నమా. ద్విపద. పుట 33) పాడుచుండెడివారట. అంతేకాదు రాజధానీ నగరమున (చంద్రగిరిలో కాఁబోలును) రాయనికి ప్రత్యేకమగు నాటకశాలయే యుండెడిది. అందు తిమ్మనాయకుని కుమారుఁడగు తిప్పనాయకుఁ డనుకళాకారుఁ డొకఁడు గీతనాట్యాచార్యుఁడు (నట్టువకారుఁడు) గనుండినట్లు తెలియుచున్నది[1]. ఇక ఆలయమునకు సంబంధించి తిరువీధి సానులలో ఆనైమాది అనునామె కూతురు "వలంది" అనునొక నట్టువసాని ప్రశంశ కానవచ్చుచున్నది.[2]. వీరేకాదు వెంకటవల్లి, జక్కులకన్నాయి ప్రభృతులు మఱికొందఱుకూడ నా దినములలో నుండిరి. ఆ దినములలో వారి సంగీతనాట్య

1. తి. తి. దే. శా. సంపుటము 2-సంఖ్య 10- క్రీ॥శ॥ 1461.
2. తి. తి. దే. శా. సంపుటము 2-సంఖ్య 86-క్రీ॥శ॥ 1481.

ప్రదర్శనములందు తాళ్ళపాకవారి శృంగారాధ్యాత్మరచనలే అధికముగ గానము చేయఁబడుచుండెను కాఁబోలును.

ఇఁక కృష్ణదేవరాయల కాలమున విజయనగరమున నృత్యనాటకశాలలు నృత్యమునకును, నాటకప్రదర్శనములకును వేర్వేరుగా రెండుండెడివి. నాఁటి కృష్ణరాయల నృత్యశాలలో నాట్యాచార్యుఁడుగ విద్వత్సభారాయరంజకుఁ డగు శ్రీ రంగరా జనునొక కళాకారుఁడుండెను. తరువాత ఆవిద్వత్సభారాయరంజకుని వంశమువారలే కృష్ణరాయ అచ్యుతరాయాదుల కాలమున రాజనర్తకులుగ నుండిరి. ఈ శ్రీరంగరాజుకూతు రగు రంజకం కుప్పాయి (లేదా కుప్పసాని) అను నర్తకి రాయలతోపాటు తిరుపతికి వచ్చియుండినది. అంతకు మునుపే క్రీ॥శ॥ 1512 లో నొకతూరి ఆమె విడిగా వచ్చి ఆలయమునకుఁ గొంత దానము నిర్వహించి యుండినదికూడ. ఈ కుప్పసానికే తిరుమలమ్మ, ముద్దుకుప్పాయి అను నిరువురు కుమార్తెలుండిరి. వారిలో ముద్దుకుప్పాయి "విద్వత్సభారాయ రంజకురాలు" గా అచ్యుతదేవరాయల కాలమున మిక్కిలి ప్రఖ్యాతి గాంచినది. క్రీ॥శ॥ 1531 ప్రాంతమున అచ్యుతదేవమహారాయ లీ ప్రఖ్యాత నర్తకి ముద్దుకుప్పాయిని ప్రత్యేకముగా శ్రీనివాసుని కైంకర్యమునకై తిరుమలకంపినాఁడు.[1] ఈ రాజనర్తకి తిరుపతికి విచ్చేసిన పిదప తిరువీధిసానుల ప్రపత్తి పెరిగినది. నాఁటినుండి ఉత్సవములలో తిరువీధులవెంట వీరు తిరుగుచుండినట్లు కానరాదు. వీరు ఆలయనర్తకులుగనే యుండి స్వామికి నృత్యకైంకర్యము చేయుచుండిరి. అచ్యుతదేవరాయ లీముద్దుకుప్పాయినేకాక విద్యానగరమునుండి రాజనర్తకి యగుహనుమసాని యనునామెను గూడ తిరుపతికి పంపియుండెను. వీరేకాక గోవిందసాని, పెరుచ్చి, బెజ్జె మున్నగు నట్టువకత్తె లెందరో ఆలయము నంటిపెట్టుకొని స్వామి కైంకర్యము చేయుచుండిరి.

అటుతర్వాత సదాశివరాయల కాలమున క్రీ॥ శ॥ 1546 లో దేవస్థాన స్థానపతులు మాణిక్య మనునర్తకికి తిరువెంకటమాణిక్య మనుగౌరవనామ మిచ్చి యామెకు స్వామివారి పల్లకి నొకదానిని కూడ సమర్పించి సంభావించినారు.[2] ఆ దినములలో నామె మఱియొక ప్రసిద్ధ నర్తకియై స్వామి కైంకర్యము గావించి యుండఁబోలును.

---

1. చూ. తి. తి. దే. శా. సంపుటము 4-సంఖ్య.11-క్రీ॥శ॥ 1531.
2. చూ. తి. తి. దే. శా. సం॥ - 5. సంఖ్య 74-క్రీ॥శ॥ 1546.

ఇట్లు క్రీ॥ శ॥ 1530 నుండియు విద్వత్సభారాయరంజకురాంద్రగు ప్రఖ్యాత నర్తకులను, అచ్యుతదేవరాయలు స్వామి కైంకర్యమునకై ప్రత్యేకముగా తిరుపతికంపి సంభావించుటయు, వారు ఆలయనర్తకులై యాగమోక్తమగు సంప్రదాయము చొప్పున పూజాసమయములందు నర్తించుటయు మున్నగు నంశములనుబట్టి చూడఁగా నా మహారాజు తిరుమలమీఁది యాలయమునెట్లు కళాకేంద్రముగ తీర్చిదిద్దినదియు, తాళ్ళపాక వాగ్గేయకారుల భక్తి శృంగారమయములగు పదరచనలతోఁ గూడిన సంకీర్తనసేవకు నృత్యసంగీతములను గూడ తోడ్పఱచి కళాత్రిపుటి యనఁదగు పదకవితకెట్లు ప్రాశస్త్యము గల్పించినదియుఁ దేటతెల్లము కాగలదు. అచ్యుతదేవరాయ లీనృత్యసేవావిషయమున శ్రద్ధతీసికొనినట్లే తాళ్ళపాక వాగ్గేయకారుల సంకీర్తనసేవావిషయమున గూడ తగుశ్రద్ధ వహించి, వారి సంకీర్తనభండార వ్యవస్థను సుస్థిరపఱచి తన్మూలమున సంగీత, నాట్య సాహిత్యములను కళల వికాసమున కపార మగుసుత్తేజమును గల్పించినాఁడు.

## సంకీర్తన భండారము :—

తాళ్ళపాకవారు సంకీర్తన రచన యారంభించిననాఁటినుండియు వారు వాని నెల్ల వ్రాయించి భద్రపఱచిరి. అన్నమాచార్యుఁడు దినమున కొక్కకీర్తనకేని తక్కువగాకుండ చెప్పుచుండిన కీర్తనములను తానే తాళపత్రములపై వ్రాయించి యెటనేని భద్రపఱచుచుండెను కాఁబోలును. అన్నమాచార్యుఁడే యట్టి "సంకీర్తన భండారము" నొకదానిని నెలకొల్పెనేమో అనుకొనఁదగిన ట్లాతనిదిగా నీకీర్తన యున్నది.

"దాఁచుకొని పాదాలకుఁ దగనేఁజేసిన పూజలివి
పూఁచి నీకీరితిరూపు పుష్పములివి యయ్యా ॥ పల్లవి ॥
ఒక్క సంకీర్తనేచాలు వొద్దికై మమ్ము రక్షించఁగ
తక్కినవి భండారాన దాఁచివుండనీ-" (అన్నమా-అధ్యాత్మ)

ఇట్లు తొలుత అన్నమాచార్యుఁడే సంకీర్తన భండారమును నెలకొల్పిన ట్లున్నను దాని కన్నివిధములఁ బెంపు వెలయించినది. తరువాతికాలమున పెదతిరుమలయ్యగారే యనవలసి యున్నది. తిరుపతి శాసనములలో నీ సంకీర్తన భండార ప్రశంస తొలుత క్రీ॥ శ॥ 1530 లోనే కానవచ్చుచున్నది.[1] నేఁటికిని

1. తి. తి. దే. శా. సం॥ 4- సంఖ్య 6. క్రీ॥ శ॥ 1530.

తిరుమలమీఁది యాలయప్రాకారము నానుకొనియున్న "తాళ్ళపాకవారియర" ఇదియే! అంతకుఁ బూర్వము దీనిప్రశంస మన కిక్కడిశాసనములందు తెలియ రాదు. అందు అచ్యుతరాయలపేర జరుగుచుండిన బ్రహ్మోత్సవ సందర్భమున సంకీర్తనభాండాగారము ముందు తాళ్ళపాక పెదతిరుమలయ్యగారు జరిపించిన కైంకర్యమునుగూర్చి యున్నది. ఈ సంకీర్తన భండారమును గూర్చి యింకనుఁ దెలిసికొనుటకీక్రింది శాసనములు మఱికొన్నికూడ చూడఁదగును. అవి యివి-.

తి. తి. దే. శా. సం. 4-14 (క్రీ॥శ॥ 1532)లో తిరుమలమీఁద శుక్రవార ములందు సంకీర్తన వేళలందు పన్నీరుబుడ్డి సమర్పితమగుటయు, 4-20 (క్రీ॥శ॥ 1532) లో శ్రీవీరప్రతాప వీరఅచ్యుత మహారాయల కభీష్టముగా పెద తిరుమలాచార్యుఁడు తిరువేంగళనాథునకు శృంగారసంకీర్తనములు చేయుటయు నను విషయములున్నవి. వీని తర్వాత 4-155 (క్రీ॥శ॥ 1541) లో సంకీర్తన భండారముముందు 4 తిరుప్పోనకములు నివేదింపఁబడుటయు, దీపములు వెలిగించుట కేర్పాటు జరుగుటయు, మున్నగు విషయములతోపాటు అందు పని చేయుచుండిన శ్రీవైష్ణవుల కిరువురకు కైజీతముక్రింద ప్రసాద వినియోగము జరుగుచుండుటయు వెల్లడియైనది.

5-47 (క్రీ॥శ॥1545)లో సంకీర్తన భండారము నందలి కీర్తనముల నారాధించుటకై గ్రీష్మోత్సవ సందర్భమున 20 దినములపాటు ఇడ్డలిపడులు నివేదింపఁబడుటయు, అచటనే సంకీర్తనముల నాలాపించుటకై విద్వాంసులిరు వురు 16 రేఖల జీతముమీఁద నియుక్తులగుటయు వివరింపఁబడినది.

5-99 (క్రీ.శ. 1547) లో తిరువేంగళప్ప సంకీర్తనభండారముకడ నేర్పరచిన నైవేద్యమునుగూర్చి గలదు

5-153 (క్రీ.శ. 1554) లో పెండ్లితిరునాళ్ళ సమయమునను, నాఁడు జరుగుచుండిన 11 బ్రహ్మోత్సవములలో తొలి తొలి దినములందును, రథోత్సవ సందర్భములందును అన్నమాచార్య పెదతిరుమలాచార్యుల సంకీర్తనములు గానము చేయఁబడునప్పుడు సమావిష్టులగు భక్తులకు చందనతాంబూలాదులు సమర్పిం చుటను గూర్చి గలదు.

అట్లే మఱల 5-159 (క్రీ.శ. 1558) లో గ్రీష్మోత్సవ సందర్భమున 20 దినములందును జరుగు 'సంకీర్తన అరుళప్పాడు' సమయమున తాంబూ లము సమర్పితమగుట ప్రస్తావింపఁబడినది.

సంకీర్తనరచనను గూర్చియు, సంకీర్తనభండారమును గూర్చియు తిరుపతి శాసనములందు గుర్తింపఁదగిన ముఖ్యాంశము లివియే. పై యంశముల నన్నిటిని సమీక్షించి చూచినపుడు సంకీర్తనభండారవ్యవస్థను పోషించి దాని కొక రూపు నిచ్చినది అచ్యుతదేవరాయలే యనియు, అందుకే పరితృప్తితో రాయల కభీష్టముగానే తిరువేంగళనాథ దేవునకు సంకీర్తనములు సేయుచు పెద తిరుమలాచార్యుఁడు ప్రయోజకుఁడై తన్నిర్వాహమును జరిపించినాఁడనియు తెలియగలదు. అంతవఱకు చంద్రగిరిలో బంధితుఁడై క్రీ.శ. 1525 ప్రాంతము లందే కృష్ణరాయలచేత రాజధానికి రప్పింపఁబడి రాజ్యవ్యవహారములలో ప్రమేయముఁ గల్పించుకొనుచుండిన అచ్యుతదేవరాయలు ప్రాయశః ఆ దినములలోనే తనకు సుపరిచితుఁడగు పెదతిరుమలాచార్యునిద్వారా ఈ సంకీర్తన భండార వ్యవస్థకుఁ బెంపు వెలయించియుండవచ్చును. ఈ సంకీర్తనభండారమునే నేఁడు "తాళ్ళపాకవారి అర" అని వ్యవహరించుచున్నారు. ఇది స్వామివారి యాలయమున విమానప్రదక్షిణప్రాకారమంటపము నానుకొని యుత్తరము వైపున భాష్యకారుల గుడికి ప్రక్కగా నున్నది. ఆలయమున నీభండార నిర్మాణముకూడ నాదినములలోనే జరిగెనేమో ! ఏలన ఆ యర కిరుప్రక్కల శిలాఫలకములపై వీణలు పుచ్చుకొని ఒక చేయిని ఆలాపము చేయుచున్నట్లు పైకెత్తి పట్టియున్నట్టి చిత్రములు రెండు చెక్కఁయున్నవి. అట్టివే రెండు ప్రతిమలు రాగిరేకుల మీఁద ఉబ్బెత్తు చిత్రములుగలవి పూజ్య పితృపాదులు శ్రీ ప్రభాకరశాస్త్రిగారి పరిశీలనమున సంకీర్తనభండారముననే క్రొత్తగా లభించినవి.[1] ఇవి అన్నమాచార్య పెద తిరుమలాచార్యులవిగా శ్రీ శాస్త్రిగారి చేత గుర్తింపఁబడినవి. (పై శాసనములందు కూడ పై యిరువురు సంకీర్తనాచార్యుల పేర్లే ప్రస్తావింపఁబడినవి !) ఈ రాగిరేకులను బోలినవే ఆ శిలాఫలకములు కూడ. రాగితోనే శ్రీ కృష్ణదేవ రాయలయు, వారి పట్టమహిషులయు, నిలువెత్తు విగ్రహములు కూడ తిరుమల మీఁది యాలయ ప్రాంగణమున క్రీ॥ శ॥ 1525 ప్రాంతములందే వెలసినవి. బహుశః ఆ దినములలోనే రాగిరేకులపై వీరిప్రతిమలు నిట్లు తీర్పఁబడి తాళ్ళపాక వారి సారస్వత మంతయు రాగిరేకులపై కెక్కించు ప్రయత్నము గూడ జరిగినదేమో! ఆనాఁడు వారీకార్యములకై వాడినరాగి లోహమువిలువ యింతయని నేఁడు చెప్పుటకు వీలుపడదు. శ్రీ శాస్త్రిగా రనినట్లు "రాగివిలువయు, చెక్కించు

1. చూ. అన్నమాచార్య చరిత్ర పీఠిక (పుట 73–74)

కూలియు నిప్పటి లెక్కల ప్రకారము లక్షలగును. ఒకరో యిద్దరో అక్షరములఁ జెక్కువారగుచో నది యొక పురుషాయుషమునంతకాలము జరపినఁ దేలవలసిన పని యగును.' ఇంతటి ప్రయాసమును పడినవ్యక్తి పెదతిరుమలాచార్యుఁడేయైనను తద్వ్యయభారమును వహించినది అచ్యుతదేవరాయలే కావచ్చును. అందుకేనేమో అచ్యుతరాయల కభీష్టముగా తిరుమలాచార్యుఁడు సంకీర్తనములను చెప్పినట్లున్నది. ఇట్లు క్రీ.శ. 1525 ప్రాంతములనుండియే తాళ్ళపాకవారిసాహిత్యమును రాగి రేకులపై చెక్కించు కార్యక్రమ మారంభమై క్రమమున సాగుచుండియుండవలెను. క్రీ.శ. 1541లో సంకీర్తనభండారముకడ దీపము ఉంచుటయు, శ్రీ వైష్ణవు లిరువురు పనిచేయుచుండుటయు పై కార్యభారమింకను ముగియమిని సూచించునేమో! ఇక క్రీ.శ. 1545 లో సంకీర్తనభండారము వద్ద సంకీర్తనముల నారాధించుటకై 20 రోజులపాటు గ్రీష్మోత్సవ సందర్భమున నివేదనలు జరుగుట గమనింపఁదగిన విషయము. [1]అప్పటి కాకార్యము ముగిసియుండును. ఆరంభమై యిర్వదేండ్లు పూర్తియగుటను సూచించుటకేకావచ్చును 20 దినములపాటు జరుగు గ్రీష్మోత్సవముతో దానిని ముడిపెట్టినారు. లేకున్న దానితోనే కాక 24దినములపాటు జరుగు ఏ అధ్యయనోత్సవముతోనో మఱి యేపవిత్రోత్సవములవంటివానితోనో యానివేదనలను జరిపించియుండవచ్చును. కనుక సంకీర్తన భండారవ్యవస్థ దాదాపు ఇరువది యేండ్ల వ్యవధిలో రూపుదిద్దుకొని క్రీ.శ. 1545 నాఁటికి సుస్థితికి వచ్చియుండును. అప్పటికిఁగాని సంకీర్తన లాలపించుటకును, నేర్పుటకును ప్రత్యేకముగ జీతముమీఁద నియుక్తులగువిద్వాంసుల యవసరమేర్పడకపోయినది. వారును ఆ కీర్తనల ప్రచారమున కెంతయో పరిశ్రమించి యుందురు. తాళ్ళపాకవారు స్వరసహితము లగుశిలాశాసనములను చెక్కించినది కూడ నా దినములలోనే యైయుండును. ఏమైనను అది మొదలుకొనియే గ్రీష్మోత్సవ సందర్భమును బురస్కరించుకొని 20 దినములపాటు సంకీర్తరచనల నారాధించుటకై "సంకీర్తన అరుళుప్పాడు" అను సంప్రదాయ మేర్పడినట్లున్నది. క్రీ.శ. 1558 లో తిరుమలమీఁద సంకీర్తనఅరుళుప్పాడు జరుగుటయే కాదు, క్రీ.శ. 1562 లో మంగళగిరి నృసింహాలయమునఁ గూడ నీ సంకీర్తనఅరుళుప్పాడు ప్రశంస కానవచ్చుచున్నది.[2] ఈ భండారమున విద్యావ్యాసంగము చేసినసంకీర్తనఅరుళుప్పాడు

1. ఈ గ్రీష్మోత్సవ (కోడ తిరునాళ్ల) సందర్భమున "ఆటపాటలవాఁడు అందనే" వినిపించుట తాళ్ళపాకవారి కీర్తనములందు ప్రస్తావింపఁబడినది.
2. చూ. దక్షిణ దేశ శాసన సంచయము - సం. 4-సంఖ్య: 710.

భాగవతు లెందరో నాఁడిట్లే సింహాచలము శ్రీరంగం మున్నగు దక్షిణ భారత దేశమునందలి ప్రసిద్ధ వైష్ణవాలయములన్నింట సంకీర్తనగానము సేయుచు మత ప్రచారము గావించుచుండిరి.

## తాళ్లపాకవారి రచనలు – ముద్రణము

క్రీ॥ శ॥ 1525లో సంకీర్తన భండారము సుస్థాపిత మయినది మొదలుగా తొలుత పెదతిరుమలాచార్యుఁడును, ఆపిదప చినతిరుమలాచార్యాదులును తద్విషయమై మిక్కిలి శ్రద్ధ వహించినారు. తాళ్ళపాకవారి సాహిత్యమంతయు దాదాపు రాగిరేకులపై కెక్కినది. చిన్నన్న చెప్పిన సుదీర్ఘములగు ద్విపదకృతులను మినహాయించి మిగిలిన తాళ్ళపాక కవు (లలో పూర్వులగు అన్నమాచార్య, పెద తిరుమల, పినతిరుమలాచార్యాదు)ల లఘు కృతు లన్నియు రేకులపై కెక్కినట్లున్నవి. పెద తిరుమలాచార్యుఁడు మొదట తండ్రిగారివియు తనవియు రచనలను రేకులపై కెక్కించినాఁడు. స్పష్టతకై తండ్రిగారి రచనలుగల రేకులలో తొలి రేకుమీఁద "అ-చా" అనియు తన రచనలుగల రేకులపై "తి. చా"అనియు గుర్తులు చెక్కించినాఁడు. తదుపరి చిన తిరుమలాచార్యుల రచనలను కూడ రేకులపై కెక్కించవలసినప్పు డాగుర్తులలో కొంత మార్పు రావలసి వచ్చినట్లున్నది. అందుకే అది మొదలుకొని పెదతిరుమల చినతిరుమలయ్యల రచనలను వేర్పఱచి గుర్తించుటకు" తి. చా." అను సంకేతము వీలుకాక "పె. తి. చా" అని పెద తిరుమలయ్య రచనలకును "చి. తి" అని చిన తిరుమలయ్య రచనలకును విడిగా సంకేత మేర్పడినది. ఇట్లు వారి వారి రచనలను రేకులలో విస్పష్టముగా వేర్పఱచుటకు వారు వేర్వేరు సంకేతములను వాడుట మాత్రమేకాక ఆయా రేకుల కొలతలలోఁగూడ తరువాతి కాలమున వారు వేర్పాటును జూపి సూచించుకొనినట్లున్నారు. ఇట్లు స్థూలముగా వారు కొన్ని కట్టుదిట్టము లేర్పఱచుకొనియే రాగి రేకులపై కెక్కించుటకుఁ బూనుకొన్నను, వారి రచనలు బహుళములగుటను బట్టియు, చెక్కినవారు పలువురై యా కార్యక్రమము బహుకాలము జరుగుటను బట్టియు, నాఁడే ఆ వేర్పాటు విషయమున గొంత అవ్యవస్థ యేర్పడినట్లున్నది. అంతేకాదు, తొలుత వారు తమరచనలను భద్రపఱచుకొను దృష్టితోడనే రేకులపై కెక్కించియుఁ బిదప ప్రచార దృష్టితో వానిని సుదూరదేశాలకుఁ గొంపోవు నవసరమును గుర్తించుటచేత గావచ్చును వ్రాసిన దానినేవారు మఱల మఱల వేర్వేరు తీరులుగల రేకులపై వ్రాయించియున్నారు. ఆ ప్రయత్నమునఁగూడ మఱికొంత అవ్యవస్థ యేర్పడియుండవచ్చును. అందుకే నేఁడు మనకు రేకులలో

గల కీర్తనముల విషయమున పాఠభేదము లేర్పడుటయు, కొన్నింటి కర్తృత్వ విషయము సందిగ్ధ మగుటయు జరిగినది—

ఏమైనను రేకులపైగల వారి రచనల పరిమాణముదృష్ట్యా స్వల్పములగు నీ విషయము లంతగణనీయములు కావనియే చెప్పవలెను. రాగిరేకులపై అక్షర బద్ధమై నిలచిన తాళ్ళపాకవారి సారస్వతము దేశవ్యాప్తమై కాలగర్భమున గరఁగిపోయినది పోగా మిగిలినదేని తిరుమలమీఁది సంకీర్తనభండారమున నిక్షేపింపఁబడిన కారణముననే చెక్కుచెదరక నేఁటికిని నిలచియున్నది. సంకీర్తన భండారమున వీరిసారస్వత మిట్లు, జరిగిన యీ నాల్గైదువందలయేండ్లలోను, దేశమున కలిగిన వైపరీత్యములకుఁగాని విప్లవములకుఁగాని గురిగాక రూపునిలుపు కొనుటయు, మఱల నేఁటికి వెలుఁగుమొగము చూచుటయు వారు పూజించిన స్వామివారి యనుగ్రహవిశేషముచేతనేగాని వేరుగారణమున గాదు. కనుక నీ పట్టున పరిశీలనాత్మకదృష్టితో నేఁడు మన కాసంకీర్తనభండారమును గూర్చియు, నందలి విశేషములనుగూర్చియు, తాళ్ళపాకవారి వాఙ్మయమును గూర్చియు వెల్లడియగుచు వచ్చిన విషయము నించుక వివరించుట అప్రస్తుతము కాదనుకొందును.

## తాళ్ళపాకవారి రచనలు-ఉనికి :

తాళ్ళపాకవారి రచనలన్నియు, రాగిరేకులమీఁదను, తాళపత్రములపైనను లిఖితములై దేశమంతటను వ్యాపించినవి. రాగిరేకులు తిరుమలమీఁది సంకీర్తన భండారమందేగాక ప్రచారదృష్టితో పెద చిన తిరుమలాచార్యాదుల కాలమందే అహోబలము శ్రీరంగము మున్నగు వైష్ణవ క్షేత్రములకును జేరినట్లు తోఁచును. అట్టిరేకు లింక నెన్నిక్షేత్రముల కెన్నెన్ని చేరినవో- ఏమైనవోగాని- మిగిలినవి అహోబల, శ్రీరంగములందున్న వానినిమాత్రము తి. తి. దేవస్థానమువారు సేకరించి చెడకుండ భద్రపఱచినారు. ఈ రేకులటుండగా తాళపత్రములందు లిఖితమైన వీరి సాహిత్యము కాలాంతరమున చేతులుమారిమారి దేశమున బలుతావులఁ బ్రాకినది. వానిలోఁ గొన్ని గ్రంథములు మదరాసు, తంజావూరు, తిరుపతి ప్రాంతములందలి ప్రాచ్య పుస్తక భాండాగారములందున్నవి. కొన్ని తాళ్ళపాక వారి వంశీకులకడ నున్నవి. వానినిగూడ నేఁడు తి. తి. దేవస్థానమువారు శక్య మగునంతవరకు సేకరించియున్నారు. ఇట్లు రాగిరేకులమీఁదను, తాళపత్రము

లందునుగల వీరిసాహిత్యమును గుర్తించి వెలికిఁదీసి ప్రకటించుప్రయత్నము పలు సందర్భములలోఁ బలువురచేత జరిగినది. వాని వివరణ మీదిగువ నిచ్చుచున్నాను.

భారతదేశమున బ్రిటిషువారు కాలూనిన పిదప ద్రవిడదేశము నందలి యాలయములనన్నిటిని క్రీ.శ.1801 లో తమ యధీనమునకుఁ దెచ్చుకొనిరి. తదుపరి క్రీ.శ.1843ప్రాంతములలో తిరుమలతిరుపతులందలి యాలయముల నిర్వాహమును మతమునకు సంబంధించినంత వరకు నాఁటి హతిరామ్‌జీమఠ నిర్వాహకులగు శ్రీసేవాదాస్‌జీ ప్రభృతుల కప్పగించిరి. అది మొదలుకొని హతిరామ్‌జీ మఠాధిపతులే తదాలయనిర్వాహకులును, విచారణకర్తలునై వ్యవహరింపసాగిరి. వారిలో క్రీ.శ.1922 ప్రాంతములందు విచారణకర్తగా నుండిన మహంత్ ప్రయాగ్ దాసజీవారే తిరుమల తిరుపతులలో శాసనస్థములైన విషయములనన్నిటిని సేకరించి ప్రకటించుటకు తొలుత ప్రయత్నించినవారు.[1]

(1) అంతకుఁబూర్వమే క్రీ.శ.1915లో అహోబిలము నందలి తాళ్ళపాక వారి సాహిత్యముగల రాగిరేకులు గుర్తింపఁబడి మదరాసు ఎపిగ్రాఫికల్ రిపోర్టులో నిట్లు పేర్కొనఁబడినది.

"Many huge inscribed copper plates are kept - in the underground cellers in the temple on upper Ahobilam - These are of the same type as those found in the Tallapakam Vari-kottu on the Thirupati Hill - and also actually belong to that temple and not to Ahobilam; for the Telugu songs both erotic and philosophical which are recorded on them in the various ragas and talas are all addressed to Venketesa or Tiru Vengalanatha by their authors Annamacharya and his son Tirumalacharya of Tallapakam." (Mad. Epi. Rep. for 1915. page 96- para 19 Vide T. T. D. Epi. Rep. p. 282)

(2) క్రీ॥ శ॥ 1915 ప్రాంతములందే తిరుపతిలోని తాళ్ళపాకవారి రాగి రేకులను గొన్నిటిని ఆంధ్రసాహిత్యపరిషత్తువారు తరలించుకొనిపోయి వ్రాత ప్రతులు వ్రాయించి తమ పత్రికలో నందలి కృతులఁగొన్నిటిని ప్రకటించినారు.

---

1. చూ. Preface to the T. T. D. Epi-Report-page 1. pub 1930)

వానిలో సంకీర్తన లక్షణము, రేఫఱకార పద్యాలు, చక్రవాళమంజరి ఆం. సా. ప. 3 సం. పుటలు 348-430-440 లలో ప్రకటితములైనవి.

( 3 ) క్రీ॥ శ॥ 1922-1927 సం॥ల నడుమ మహంత్ ప్రయాగ్‌దాస్‌జీ వారి హయామున తాళ్ళపాకవారికొట్టులో నుండి యంతకుఁ బూర్వమే వెలికి తీయించిన రాగిరేకులలోఁ గొన్నిటికి వ్రాతప్రతులు వ్రాయించి ప్రకటించుటకు యత్నము జరిగినది. కాని ఆ ప్రయత్నము తొందరపాటుతో అస్తవ్యస్తముగా నసంపూర్ణముగా జరిగి నిలిచిపోయినది. ఆ ప్రయత్నఫలితమేని త్వరలో వెలుగు మొగము చూడలేదు. తాళ్ళపాకవారి లఘుకృతులును ఆధ్యాత్మ శృంగార సంకీర్తనములు కొన్నియును తరువాత క్రీ॥ శ॥ 1935 ప్రాంతములకుఁగాని ప్రకటితముకాలేదు.

( 4 ) మదరాసు, తంజావూరు ప్రాచ్య లిఖిత పుస్తకభండారములందలి తాళపత్రములనుబట్టి క్రీ.శ.1925లో శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారు తాళ్ళపాకవారి 'వేంకటేశ్వర వచనము'లను భారతి పత్రికలోఁ గొన్నిటిని ప్రకటించిరి. కాని దేవస్థానమువారు వానిని ప్రకటించుచుండిన విషయమునెఱిఁగి శ్రీ శాస్త్రిగారు ఆ ప్రయత్నము నపుడు కొనసాగింపలేదు. తరువాత 1945లో దేవస్థానమువారి పక్షమున శ్రీశాస్త్రిగారే మరల పూనుకొని లభ్య మగునంతవఱకు వేంకటేశ్వర వచనములన్నిటిని సేకరించి ప్రకటించినారు.

( 5 ) సంగీతసాహిత్యపరిపుష్టు లని మా తండ్రిగారిచే కొనియాడఁబడిన శ్రీమాన్ అనంతకృష్ణశర్మగారు తాళ్ళపాకవారి సంకీర్తనములను గొన్నిటిని స్వరపఱచి ప్రకటించినారు.

(6) క్రీ. శ. 1949 లో దేవస్థానమువారి పక్షమున శ్రీ ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్యచరిత్ర ద్విపదను,పరిష్కరించి విపులమగుపీఠికతో ప్రకటించినారు. అదియే తొలుత తాళ్ళపాకవారి జీవిత రచనావిశేషములను గూర్చిన సమగ్రమగు పరిశీలన కవకాశమిచ్చి పరిశోధకుల దృష్టి నాకర్షించినట్టిది. ఆ పిదప క్రమముగ తాళ్ళపాకవారి సంకీర్తనములు సుపరిష్కృతములై నేఁటికి దాదాపు పదునేడు సంపుటముల వఱకును వెలువడినవి.[1] ఆయా ప్రకటనముల వివరణమిది. (తి.తి. దేవస్థానమువారి ముద్రణము).

1935. తాళ్ళపాకవారి లఘుకృతులు Vol. 1. పరిష్కర్తలు పండిత శ్రీ విజయరాఘవాచార్యులుగారు మఱియు శ్రీ జి. ఆదినారాయణనాయుడు గారు.

---

1. 1964 లో నీ గ్రంథరచన జరుగునప్పటికి నే జూచినంతవఱకు గుర్తించిన యంశమిది. ఈనాఁటి కవి మొత్తము 22 సంపుటములు వెలువడినవి. వాని వివరణకూడ నిందు జతచేయుచున్నాను.

1936. తాళ్లపాకవారి ఆధ్యాత్మ సంకీర్తనములు Vol. 2. పరిష్కర్తలు పండిత శ్రీ విజయరాఘవాచార్యులుగారు మఱియు శ్రీ జి. ఆదినారాయణ నాయుడుగారు.

1937. తాళ్లపాకవారి శృంగారసంకీర్తనములు Vol. 3. పరిష్కర్తలు పండిత శ్రీవిజయరాఘవాచార్యగారు (క్రీ॥శ॥ 1936-38 సం॥ల నడుమనే తాళ్ల పాకవారి ద్విపద కృతులు మూఁడు ముద్రితములైనవి.)

1947. తాళ్లపాకవారి శృంగార సంకీర్తనములు Vol. 4. పరిష్కర్త శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు.

[ ఈ సంపుటము 1941 లో నారంభింపఁబడినది. 1947లో శ్రీశాస్త్రిగారీ కార్యక్రమమునకై నియుక్తులైన పిదప ప్రకటింపఁబడినది. తన్ముద్రణమును గూర్చిన విశేషము లెఱుఁగఁగోరువారీ సంపుటమునకు శ్రీ శాస్త్రిగారు వ్రాసిన యుపోద్ఘాతమునుఁ జూడఁదగుదురు.]

1950. తాళ్ళపాకవారి అధ్యాత్మసంకీర్తనములు Vol. 5. పరిష్కర్త శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు

1951. తాళ్ళపాకవారి అధ్యాత్మసంకీర్తనములు Vol. 6. పరిష్కర్త శ్రీశాస్త్రిగారి పర్యవేక్షమున నక్కడి సహాయ విద్వాంసులగు శ్రీ ఎ. వి. శ్రీనివాసాచార్యులుగారు (శ్రీశాస్త్రిగారి నిర్యాణానంతరమిది ప్రకటితము)

1951. అధ్యాత్మ సంకీర్తనములు. Vol. 6. పరిష్కర్త శ్రీమాన్ అనంతకృష్ణ శర్మగారు మఱియు శ్రీ A. V. శ్రీనివాసాచార్యులుగారు.

| | | | | |
|---|---|---|---|---|
| 1951. | " | Vol. 7. | " | " |
| 1952. | " | Vol. 8. | " | " |
| 1952. | " | Vol. 9. | " శ్రీమాన్ అనంతకృష్ణశర్మ గారు | |
| 1952. | " | Vol. 10. | " | " |
| 1955. | " | Vol. 11. | " | " |
| 1956. శృంగార సంకీర్తనములు; | | Vol. 12 | " | " |

| | | | |
|---|---|---|---|
| 1960. | శృంగార సంకీర్తనములు. | Vol. 13. | పరిష్కర్తలు శ్రీమాన్ అనంతకృష్ణ శర్మ గారు. |
| 1961 | " | Vol. 14. | పరిష్కర్తలు శ్రీమాన్ అనంతకృష్ణశర్మ గారు మఱియు శ్రీ A. V. శ్రీనివాసాచార్యులుగారు. |
| 1961. | " | Vol. 15. | శ్రీ A. V. శ్రీనివాసాచార్యులుగారు. |
| 1962. | చినతిరుమలాచార్యుని శృంగారాధ్యాత్మ సంకీర్తనలు | Vol. 16, | " " " |
| 1963. | అన్నమాచార్యుల శృంగార సంకీర్తనములు. | Vol. 17. | " " " |
| 1964. | " | Vol. 18 | పరిష్కర్తలు డా॥ పి. టి. జగన్నాధరావుగారు. |
| 1965. | " | Vol. 19. | పరిష్కర్తలు శ్రీ అనంత కృష్ణశర్మ గారు మఱియు శ్రీ గౌరిపెద్ది రామ సుబ్బశర్మగారు. |
| 1970. | " | Vol. 20 | శ్రీ అనంత కృష్ణశర్మగారు మరియు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు. |
| 1975. | పెదతిరుమలాచార్యుల శృంగార సంకీర్తనలు | Vol. 21 | పరిష్కర్తలు డా॥ పి.టి. జగన్నాథ రావుగారు. |
| 1975. | అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు | Vol. 22 | పరిష్కర్తలు శ్రీ అనంతకృష్ణశర్మ గారు మరియు శ్రీ గౌరిపెద్ది రామ సుబ్బశర్మగారు |

వీనిలో 4 సం॥ మొదలుకొని 11 వ సం॥ పూర్తి వఱకును అన్నమాచార్యులవారి అధ్యాత్మ సంకీర్తనములును, 12,13,14, 15, 17 సంపుటములలో వారి శృంగారసంకీర్తనములును గలవు. పరిశోధకుల కనువు గల్పించుట కొఱకై యానడుమ చినతిరుమలాచార్యుని సంకీర్తనము లన్నియును గలసి 16వ సంపుటముగా వెలువడినది. ఇంకను పరిష్కృతములై ప్రకటింపఁబడవలసినవి అన్నమాచార్యులవారి శృంగారసంకీర్తనములును పెదతిరుమలాచార్యులవారి శృంగారాధ్యాత్మ కీర్తనములును గలవు

4 వ సంపుటము పీఠికలో వివరింపఁబడినట్లు లభించిన తాళ్ళపాక వారి రచనలన్నింటిని "పరిశోధించి, చిక్కులుదీర్చి, విషయవిభాగము, కవి విభాగము, ముద్రితాముద్రిత విభాగము మొదలగు వివిధ విభాగముల నెల్ల" శ్రీ శాస్త్రి గారే తొల్త నచటి పరిశోధకవిద్యార్థియగు శ్రీ A. V. శ్రీనివాసాచార్యులుగారి తోడ్పాటుతో, వేర్పఱచినవారు. ఈ విషయ విభాగమే తర్వాతి సంపుటముల ప్రకటన క్రమమున కెంతయో సౌలభ్యము గల్గించినది. పై సంకీర్తనముల పీఠిక లలో నిట్లు తత్తత్పరిష్కర్తలు ప్రకటించిన యంశములను బట్టి తాళ్ళపాకవారి సాహిత్యముగల రాగిరేకులను గూర్చియు, తాళపత్రగ్రంథములను గూర్చియు, వ్రాతప్రతులను గూర్చియు మనకీవిషయములు తెలియుచున్నవి.

**రాగిరేకులు :**

ఇవి నిడురేకులు, సాధారణరేకులు, పెద్దరేకులు అని మూఁడు విధము లుగ నున్నవి.

**వీనిలో నిడురేకులు :**

33″ × 2½″ కొలతలు గలవి. ఇవి 120 రేకులును, తునకలు 5 ను వెరసి 125 లభించినవి.

పెద తిరుమలాచార్యుఁడు చెక్కించిన తొలిరేకు లివే కావచ్చును. కాని శ్రీశాస్త్రిగారనినట్లు వీని "దైర్ఘ్యమును పలుచందనము వాని చిరస్థితికి భంజక మగునని వెఱచి వానినే మఱల క్రొత్త తీరు ఱేకులకెక్కించి యుందురనుకొన వచ్చునేమో !" ఏలన ఇందలి కీర్తనములే సాధారణ రేకులందును గలవు. ఈ రేకులలో నలుగురైదుగురి కైవాడము స్పష్టముగా నున్నది. వీనిని చెక్కిన వారిలో నొకరిపేరు అన్నమరాజు తిమ్మయ్య యని తెలియవచ్చినది.

**సాధారణ రేకులు :**

తిరుమలలోని సంకీర్తన భండారమందున్న సంకీర్తన రేకు లివియే. వీని కొలతలు క్రమముగా నివి. (చూ. 4వ సంపుటము-పీఠిక)

| | | | **రేకులు** |
|---|---|---|---|
| అన్నమయ్యగారి శృంగార సంకీర్తనములు గలవి- | 15½″ × 7″ | లభ్యములు | 2002 |
| అన్నమయ్యగారి అధ్యాత్మ సంకీర్తనములు గలవి- | 15½″ × 7″ | | 391 |

| | | |
|---|---|---|
| పెదతిరుమలయ్యగారి శృంగార సంకీర్తనములు గలవి- | 16″ × 7″ | 100 |
| పెదతిరుమలయ్యగారి అధ్యాత్మ సంకీర్తనములు గలవి- | 15¾″ × 6¾″ | 77 |
| చిన తిరుమలయ్యగారి శృంగార సంకీర్తనములు గలవి- | 15½″ × 7·2″ | 10 |
| చిన తిరుమలయ్యగారి అధ్యాత్మ సంకీర్తనములు గలవి- | 15″ × 7½″ | 10 |
| | వెరసి రేకుల మొత్తము | 2590 |

| | | | | |
|---|---|---|---|---|
| తాళ్ళపాకవారి అధ్యాత్మ | కీర్తనముల | రేకులు | మొత్తము | 478 |
| ,, శృంగార | ,, | ,, | ,, | 2112 |

ఈ రేకులలోఁగూడ పలువురి కైవాడము గోచరించుచున్నది. కాని యిందెందును లేఖలకుల పేరులు గానరావు.

ఈ సాధారణ రేకులపొడవు వెడల్పులతో సమానమగు పరిమాణములుగల రేకులందే తాళ్లపాకవారి లఘుకృతులుకూడ లిఖింపఁబడినవి. కాని వీనిలోఁ గొన్ని మాత్రమే నేఁడు దేవస్థానమున నున్నవి. మిగిలినవి కానరావు. శ్రీ వంగూరి సుబ్బారావుగారు ఆంధ్రసాహిత్యపరిషత్తువారికై రాగి రేకులనుండి తాళ్ళపాకవారి శృంగార వృత్తపద్యాల శతకము నెత్తివ్రాయించినట్లు తమ శతకకవుల చరిత్ర (పుట 137)లో పేర్కొనినారు. కాని ఆ రేకులు 1930లో దేవస్థానమున లేవు.[1] అవి కాకినాడ చేరినట్లున్నవి. తాళ్ళపాకవారి సంకీర్తనపురేకులలోఁగూడ నుండవలసినవానిలో మొత్తము (అన్నమాచార్యుని శృంగార అధ్యాత్మ కీర్తనల రేకులు 81 + 28 = 109; మరియు పెద తిరుమలయ్యగారి శృంగారాధ్యాత్మ కీర్తనలరేకులు 10 + 2 = 12) వెరసి 121 రేకులు కానరాకున్నవి ఇట్లు కానరాని రేకులు కొన్ని శ్రీ జయంతి రామయ్యపంతులుగారు కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తువారికిగాను ప్రదర్శనమున (Exhibition) కని గొంపోయి

1. అన్నమాచార్యుని శృంగారవృత్తశతకమును, పెద తిరుమలార్యుని వైరాగ్య వచనమాలికా గీతములు రాగతాళముల నిర్దేశము గలవియును, వేంకటేశ్వరోదాహరణమును గల రాగిరేకులు నేఁడు కానరావు.
(చూ. T. T. D. Epi-Rep.pub. 1930. పుట. 282)

నట్లును పిదప నవి యేమైనవో తెలియనట్లును పరిష్కర్తలు వ్రాసినదానినిబట్టి తెలియుచున్నది. ఈ రేకులను పరిషత్తువారు 1915 - 20 సం॥ల నడుమ నెన్నడో తీసికొనిపోయినట్లున్నారు.

ఈ సాధారణరేకులను తాళ్ళపాకవా రెప్పుడు చెక్కించినది స్పష్టముగ తెలియదుగాని వీనిపై వారి లఘుకృతులలోఁ గొన్నిటిఁని జెక్కించినతేది వివరణ మాత్రమున్నది. వానిలో చినతిరుమలాచార్యుని అష్టభాషాదండకము "హేవిళంబి సంవత్సర మార్గశిర శు॥౫ బుధవారమునాఁడు అనఁగా 7-11-1537 లో తామ్ర శాసనముగా వ్రాయించినట్లు రేకుపైనున్నది. ఈతని సంకీర్తనలక్షణము కూడా నప్పట చెక్కించినదే కావలెను. ఇట్లే "అ. చా" అనుసంకేతముగల శృంగార మంజరి రేకులతుదియందు చిన తిరుమలాచార్యుని కీర్తనమున్నది. కనుక నదియు నా ప్రాంతములందే చెక్కఁబడియుండు ననవచ్చును. పెద తిరుమలాచార్యుని లఘుకృతులలో వైరాగ్యవచన మాలికాగీతాలు గల రేకులందు మాత్రము 'పె. తి చా.' సంకేతమున్నది. దీనినిబట్టి యీ రేకులును పైవానితోపాటే చెక్కియుందు రేమో అని తోఁచును.

## పెద్ద రేకులు ;-

మద్రాసు ఎపిగ్రాఫికల్ రిపోర్టు 1915 లో గుర్తింపఁబడిన రేకులు అహో బిలమునందలి వీపెద్ద రేకులు కావచ్చును. వీని కొలతలు 27″ × 16″. ఇవి యచ్చటికెన్నడు చేరినవో ఏమోగాని శ్రీ శాస్త్రిగారి పర్యవేక్షణమున శ్రీ A.V. శ్రీనివాసాచార్యులుగారు 1949లో నచ్చటికి వెళ్ళి చూచునప్పటికి లభించినవి మొత్తము 35 రేకులు మాత్రమే. అచటనుండి మఱికొన్ని రేకు లావఱకే రాగి పాత్రలుగా రూపాంతరమందినట్లుగాఁ గూడ తెలియుచున్నది. నేఁడు లభించిన వానిలోఁగల పాటలు సాధారణరేకులం దున్నవే. ఇట్టివే పరిమాణములతో శ్రీరం గమునందు కూడా తాళ్ళపాకవారి కీర్తనలరేకులు నలువది యున్నట్లును, వానిని గూడ దేవస్థానమువారు 1962లో సేకరించినట్లును, పరిష్కర్తలు వ్రాసిన దానిని బట్టి తెలియుచున్నది. ఇట్టివే యింకను సింహాచలము, చిదంబరం, కదిరి మున్నగు తావులలోఁగూడా వారి తామ్రఫలకము లున్నట్లును, వానినిగూడ దేవస్థానమువారు సేకరించుయత్నము జరుపుచున్నట్లును తెలియుచున్నది.[1] ఈ పెద్దరేకులను "ఐదేసి

1. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు తొలుత 1947 లో సంకీర్తనల 4 వ సంపుటమున వేర్పఱచి పేర్కొన్న నాఁటిరేకుల లెక్కకును, తరువాత గుర్తించిన రేకుల లెక్కకును

రేకు లొకటిగా గుదిగ్రుచ్చి వానికొక యుంగరమును తగిలించి, అట్టివానిని వారా కాలమున 'తండు' అని పిలువఁబడు లావుపాటి మ్రియూదకు తగిలించి బోయీలచే మోయించుకొని పోయెడివా" రనియు శ్రీనివాసాచార్యులుగారు వ్రాసియున్నారు. ప్రచారదృష్టితో నట్లు దేశమునఁ గల పలు వైష్ణవక్షేత్రములకుఁ గొంపోవుటకు వీలుగా కాఁబోలును, వారీ పెద్ద రేకులను గూడ జెక్కించినట్లున్నారు. లభించిన పెద్దరేకులందలి కీర్తనలు చాలవరకును సాధారణ రేకులందున్నట్టివియే. బహుశః పెద్ద రేకుల నిట్లు వ్రాయించినది చిన తిరుమలాచార్యుఁడే కావచ్చును. ఆతఁడే మంగళగిరి మున్నగు వైష్ణవక్షేత్రములందు "సంకీర్తన అరుళుప్పాడు" నకేర్పాటు గావించినవాఁడు కదా!

ఈ రాగిరేకులుగాక తాళ్ళపాకవారి సాహిత్యమున్న తాళపత్ర గ్రంథములు, వ్రాతప్రతులు నెన్నియో యున్నవి. వానిలో ముఖ్యము లగువాని వివరణ మిది.

## తాళపత్ర గ్రంథములు - వ్రాతప్రతులు:-

1) తంజావూరి సరస్వతీమహాలు భండారమునందు P. 465 సంఖ్యగల తాటాకులప్రతి 'శ్రీ వేంకటేశ్వర విన్నపాలు' అనున దొకటి కలదు. అందు 99 కీర్తనములు వేంకటేశాంకితములు తాళ్ళపాకవారివి గలవు. కాని యందు కర్తృత్వవిభాగము లేదు. ఇందలి కీర్తనములు కొన్ని రేకులందును గలవు.

2) రెండవది తిరుపతివారే యైన శ్రీ తాళ్ళపాక వేంకటశేషాచార్యులవారి యింటి వ్రాతపతి (S. V. O-6609). ఇందు శృంగారాధ్యాత్మ రచనలు 275 కలవు. ఇందును కర్తృత్వ విభాగము లేదు.

3) తాళ్ళపాకవారివే శ్రీరంగమున నాలుగు తాళపత్రగ్రంథము లున్నట్లును, వానిని గూడ సేకరించుచున్నట్లును శ్రీనివాసాచార్యులుగారు వ్రాసియున్నారు (చూ. సం॥ 16. పీఠిక పు. 32).

4) పుదుక్కోటలో శ్రీ కృష్ణభాగవతారుగారి యొద్ద కొన్ని కీర్తనల సంపుటములున్నవనియు, వారీ తాళ్ళపాకవారి కీర్తనములను పాడుదురనియు శ్రీయుతులు శ్రీనివాసాచార్యులుగారును, ప్రొఫెసరు సాంబమూర్తిగారును వ్రాసినారు. (చూ. సం॥ 15. పీఠిక పు. 5)

---

గల తేదాలను 22వ సంపుటము పీఠికలో పరిష్కర్తలు వ్రాసియున్నారు. వివరణమున కిందలి పరిశిష్టమును జూచునది.

5) పైన పేర్కొనఁబడినవే కాక తాళ్ళపాకవారివేమో అని అనుమానింపఁ దగిన రచనలు కొన్ని తంజావూరు సరస్వతీమహలు భండారమున మఱికొన్ని తాళపత్రగ్రంథములం దున్నవి.

వరుస సంఖ్య 809 - గ్రంథాంతమున గల వేంకటేశ్వరసేవాఫలము మేలు కొలుపు పాటలు-

వరుస సంఖ్య 459 - 'పదములు కీర్తనములు' అను సంకలన గ్రంథమున 14 తాళపత్రములలో రాగతాళములనిర్దేశముతో కొన్ని కలవు

ఇట్టి వింక నెన్ని యున్నవో తిన్నగా చూడవలసియున్నది.

రాగిరేకులందును, తాళపత్రములందునుగల యీ సంకీర్తన రచనాసంచయమును సేకరించి పరిశీలించుటలో విశేషము లెన్నియో గుర్తింపనైనవి. దీనివలన తాళ్ళపాకవారికీర్తనముల కర్తృత్వమునుగూర్చియు, పాఠస్వరూపమునుగూర్చియు కీర్తనములు పాడు సంగీతసంప్రదాయమున నేర్పడిన రాగతాళముల విభేదమును గూర్చియు, పల్లవి చరణములతోఁగూడిన పదములను పాడుటలోఁగల విన్యాసమునుగూర్చియు, పాడెడి విధానమును గూర్చియు, స్పష్టమగు పరిజ్ఞానము మనకు కలుగుచున్నది. ( వీనిలోఁ గొన్నిటికి 12వ సంపుటమున శ్రీ అనంతకృష్ణశర్మ గారిచ్చిన పాదసూచికలఁ జూడఁ దగును ).

## తాళ్లపాక వాగ్గేయకారులు - సంకీర్తనల ప్రచారము.

తాళ్ళపాకకవులు వాగ్గేయకారు లను ప్రసిద్ధి అన్నమాచార్యులనుబట్టి యేర్పడినదే. ఆ వంశపురుషులు పలువురిలో అన్నమాచార్య పెదతిరుమలాచార్య పినతిరుమలాచార్యులు ముగ్గురు మాత్రమే వాగ్గేయకారులుగా మనకు లభ్య మగు సంకీర్తనరచనలనుబట్టి తెలియుచున్నది. వీరు ముగ్గురును సంకీర్తనములను రచించినవారేగాక నాఁడు పాడుచుండినవా రనియు, 'సంగీత సాహిత్య సార్వజ్ఞకత్వ మంగళ సామ్రాజ్యమహితులై' యుండి రనియు తెలియుచున్నది. శిలాఫలకములందును, రాగిరేకులందును చెక్కఁబడిన వీరి యాకృతులు:గూడ నావిషయమును వెల్లడించుచునే యున్నవి. ఈముగ్గురును గాక తాళ్ళపాకవారిలో మిగిలిన వారెవ్వరేని సంకీర్తన రచనలు గావించినవా రున్నారేమోగాని తిరుపతిలోని రాగిరేకులలో మన కా విషయమును నిరూపించుసాధనములు కానరాకున్నవి.

కాని వారిలో మఱి కొందఱు సుప్రసిద్ధ గాయకులును, సంగీత చతురులునై యుండినట్లు మాత్రము గ్రంథస్థాధారము లున్నవి. వీరిలో 'పద్య గద్య శ్రేణిన్-చంపూ కవిత్వ సరణి'ని ప్రఖ్యాతిఁగాంచిన నరసింహకవి 'పాడఁ జెప్పఁగ వర్ణపద్ధతి నీడుజోఁడు లేఁడని సభ సొచ్చి వాదించి పరఁగిన ధీశాలి' యట! వర్ణపద్ధతి- ననఁగా స్వరధాతు పద్ధతిని- పాడుటందేగాక శిక్షణనిచ్చు నవసరమున నితరులకుఁ జెప్పు విషయమునఁగూడ నాతఁడు చతురుఁడని తెలియుచున్నది. అటుతరువాత పెద తిరుమలాచార్యుని మూఁడవ కుమారుఁడగు పెద తిరువెంగళనాథుఁడు 'సాత్త్విక శుభమూర్తి' గను 'సంగీత సత్కవిత్వాధికుఁడు' గను సోదరుఁడగు చిన్నన్నచే ప్రశంసితుఁడైనాఁడు. 'సంగీత సత్కవిత్వాధికుఁ'డను విశేషణమునుబట్టి యీ పెద తిరువెంగళనాథుఁ డేమేని సంకీర్తన రచనలు గావించెనేమో యని తోఁచునుగాని తిరుపతిలో మనకాతని రచనలేవియు లభించుటలేదు. ఈతనిగూర్చియే కావలెను, రేవనూరి వేంకటార్యుఁడు 'విశేషించియు న త్తిరువెంగళనాథుండు సంకీర్తనంబులు బాడిన నాదం దొడంగె' నని శకుంతలా పరిణయమునను 'వేకువఁ దాళ్లపాక తిరువెంగళనాథుఁడు బాడ నాడు దర్వీకర రాడ్గిరీశుఁ'డని శ్రీపాదరేణు మాహాత్మ్యమునను వర్ణించెను. పై వర్ణనములనుబట్టి యీతఁడును గొప్ప గాయకుఁడని తెలియనగును. ఈ యిరువురి తరువాత సుప్రసిద్ధ ద్విపదరచయితగా పేరుగాంచిన తాళ్లపాక చిన తిరువెంగళనాథుఁడు (చిన్నన్న నామకుఁడు) కూడ గొప్ప గాయకుఁడుగనే స్మరింపఁబడినాఁడు. 'తాళ్లపాక చిన్నన్న దండెమీటుటుగావు గోమాంసభుగ్దనుర్గుణరవము' లనియు 'అల తాళ్ళపాక చిన్నన్న రోమములైన తంబురాదండెకుఁ దంత్రు లౌనె' యనియు నర్వాచీనములగు శత్రుసంహారశతకాదులం దున్నది. ఈ విషయమై శ్రీ శాస్త్రిగారు 'చిన్నన్న గాయకుఁడనుట కిక్కడి రాగిరేకులలోఁగాని గ్రంథములలో గాని యాధారములు గానరావు. చిన్నన్నకు అన్న, తండ్రి, తాత గొప్ప గాయకులుగాన యిటీవల వారు గ్రంథములనుబట్టి చిన్నన్ననే యెఱిఁగినవారుగాన వారి యోగ్యత నీతనికిఁ జేర్చి చెప్పియుండవచ్చును. కాక యితఁడును గాయకుఁడేమో' అని (చూ. అన్నమా. పీఠిక పు. 95) వ్రాసియున్నారు. ఈతఁడు గొప్ప సంగీతరసికుఁ డగుట నిస్సందేహ మగువిషయమే. అందు కీక్రింది యుదాహరణలు చూడనగును.

(1) చిన్నన్న ఉషాపరిణయమున :-

'సరిగమ పదనిస సనిదపమగరి
సరిగమ రిగమప సనిదపమనుచు
బహువిధాలంకృతుల్ పాడుకొనంగ
రహిమించి వాయించి గ్రామసంతతుల
మేళములేర్చసి సమ్మేళముల్ గాగ
నాళాప మార్గంబు లలరఁ జూపుచును
సంకీర్తనము చిందు జక్కిణి గీత
మంకించి శుద్ధంబు లలర మీటుచును-' (పు. 21)

పాడుటను వర్ణించెను. ఇట్లే అందే.

(2) 'పాడరే యొక పెండ్లిపాట సొంపార —
పాడరే ధవళంబు పాడరే యనిన
కవగూడి యిద్దరు గబ్బిగుబ్బెతలు
ధవళంబు వాడి బిత్తరముగా నిలువ
దొమ్మి పేరంటాండ్రు తోడనే వేడ్క
ఘుమ్మని పల్లవుల్ గూడిపాడంగ'- (పు. 89)

అని ధవళముల నాడువారు పల్లవు లందుకొనుచు గోష్ఠిగా గానము నాల పించుటను వర్ణించెను

(3) పరమయోగి విలాసమున :-

'కొనవ్రేల శ్రుతితంత్రిగూడంగ మీటి
మును మంద్ర మధ్యమములు దారకమును
నిరవొందఁజూపి యాయిత మొనరించి
స్వరలయగ్రామ మూర్ఛనల సంచు లెఱిగి
స్ఫురిత కంపిత ముఖ్యముల బాగులెసఁగ
వరరస రీతి భావములు చొప్పడఁగ
ఘన శుద్ధమును సాళగమును సంకీర్ణ
మును తేటపడ జగన్మోహనం బొదవ.' (పు-209)

పాడుటను వివరించెను. ఇట్లే "జోడుగూడి యిరువురు ప్రబంధ నివహంబును తాళమానితముగా నావృతిచేయు" (పు. 477) విషయమునుగూడ విశదీకరించెను. అంతేకాదు, స్వయముగ "పాలించి కరుణచొప్పడ యోగనిద్ర-చాలించి శ్రీరంగ శాయి మేల్కొనవే" అను చరణములు పల్లవిగా భక్తాంఘ్రిరేణుని ప్రాబోధకీ స్తుతిని పదిపాటలుగా నిందే వ్రాసియున్నాఁడు.

పై యంశములను బట్టి యాతని సంగీతరసికతయు రచనాచాతురియు వెల్లడి యగుచునే యున్నది. కాని యీ సంగీతజ్ఞుని గేయరచనలు విడిగా మన కేమియు లభింపలేదు. సంగీత సంప్రదాయ ప్రదర్శినిలో సుబ్బరామదీక్షితులవా రాతనిని పదకర్తగా పేర్కొని వివరించిన యంశము లీతనికిఁగాక అన్నమాచార్యులకే చెల్లునవి. వారట్లు పేర్కొనుట ప్రమాద ఫలితమే[1] అనుకొందును.

ఇటుచూడగా తాళ్ళపాకవారిలో ప్రసిద్ధులు మువ్వురు వాగ్గేయకారులును, మఱిమువ్వురు సంగీతజ్ఞులును గోచరించుచున్నారు. వీరందఱును గలిసియే తమ సంకీర్తనములను దేశమున నాలుగుమూలలకుఁ బ్రాకునట్లు ప్రచారము గావించినారు. నాఁడు సంకీర్తన భండారమున సంగీతజ్ఞులను నియమించి శిక్షణ నిప్పించుటయు మత ప్రచారమున కనువుగా సంకీర్తనములను బలుతావులకు దీసికొని పోవుటకై పెద్దరేకులమీఁద పలు ప్రతులు నకళ్ళు దీయించుటయు మాత్రమేకాదు, వానిని సుదూరదేశములకుఁ గొంపోయి ప్రచారము గావించినారు కూడ. తాళ్ళపాకవా రీ విషయమునఁ దగుశ్రద్ధ వహించినట్లు తోఁచుచున్నది. వీరి కీర్తనము లాంధ్రదేశమందలి పలువైష్ణవక్షేత్రములందు పాడఁబడుచుండిన వను సంప్రదాయము మాత్రమే కాక శాసనస్థ ప్రత్యక్ష సాక్ష్యములు గూడ నున్నవి. మంగళగిరిలో చిన తిరుమలయ్య "సంకీర్తన అరుళుప్పాడు"న కేర్పఱచిన దానాదికమును దెలుపు దక్షిణదేశ శాసనసంచయము సం॥ 4-710, (క్రీ॥ శ॥ 1562)ను, అహోబిలము, శ్రీరంగము మున్నగు తావుల లభించిన

---

1. సుబ్బరామ దీక్షితులవారు వ్రాసినదాని నాధారముగాఁగొని కావచ్చును శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ఆంధ్రవిజ్ఞానసర్వస్వము-తెలుఁగు సంస్కృతి సంపుటమున "సంగీత"మను విషయమునుగూర్చి (పు 683-698) వ్రాయుచు చిన్నన్నను పదకవిగా స్మరించిరి. ఇట్లే ఆచార్య పి. సాంబమూర్తిగారును మఱికొందఱును తాళ్ళపాకవారి పదరచనల నన్నిటిని చిన్నన్న రచనలుగానే నేఁటికిని స్థూలముగాఁ బేర్కొని వ్రాయుచున్నారు.

వీరి సంకీర్తనముల రేకులును దీని కుదాహరణములు. మఱి యింక నెన్ని వైష్ణవ క్షేత్రములలో నిట్టి తేకులుచేరి కాలాంతరమున నణఁగిపోయినవో.

తాళ్ళపాకవారిని గూర్చిన శాసనాధారములను బట్టి చూచినను, వారి సంకీర్తనములందు వారు కీర్తించిన వేల్పులను గూర్చి (తిరిగిన దేశములను గూర్చియు) తెలియనైన విశేషములను బట్టి చూచినను మతప్రచారమునకై తమ వాగ్గేయ రచనలను మోసికొనిపోయి వారు దేశము నాలుగుమూలల నెంతటి ప్రసిద్ధిని బడసినదియు తెలియును. భిన్నస్థలములలో వారియునికిని గూర్చిన ఈ క్రింది విషయములు తిలకింపఁదగును.

అన్నమాచార్యుల యనంతరము కొలదికాలమునకే ఆతనితనయు లిరువురిలో నరసింహకవి రాజకీయ కౌటుంబిక కారణముల చేతనేమో శ్రీరంగము చేరుకొనినట్లున్నాఁడు. పెదతిరుమలాచార్యుఁడును జీవికకై పలువుర నాశ్రయించి పలుదేశములు తిరిగి చివరకు క్రీ॥ శ॥ 1525 ప్రాంతములకు తిరుపతికి వచ్చి చేరుకొనినట్లున్నాఁడు. సంకీర్తసభండారము నెలకొల్పఁబడిన దాదిగా అచ్యుత దేవరాయల యాదరమున తిరుమలయందే పెదతిరుమలాచార్యుఁడును తత్తనయులును కుదురుకొనినట్లున్నారు. (క్రీ॥ శ॥ 1520 ప్రాంతముల నుండియు తాళ్ళపాకవారి శాసనములు తిరుపతిలో విరివిగా నున్నవి. అంతకు పూర్వము వీరి శాసనములచట కానరావు. క్రీ.శ.1517న మాత్రమొక శాసనమున్నది). క్రీ.శ.1536లో తిమ్మరుసయ్య ప్రసాదభాగము లమ్ముకొనినశాసనములందలి విషయమునుబట్టి యప్పటికే వారచ్చట స్థిరపడినా రనవచ్చును. అచటనే స్థిరపడియు పెద చిన తిరుమలాచార్యులు పలుక్షేత్రములలో మతప్రచారమునకు దోహద మిచ్చుచునే యుండిరి. శ్రీరఁగము, కంచి మున్నగు తావులకుఁ బోవుచు వచ్చుచునే యుండిరి. నరసింహకవి మరణానంతర మాతనికుటుంబ మేమాయెనో మనకు తెలియరాదు కాని పెదతిరుమలాచార్యుని సంతానములో చినతిరుమలయ్యయు, చిన్నన్నయు తిరుపతిలోనే నెలకొనిరి. ఇఁక కోనేటి అన్నయ్యయు కోనేటితిరు వెంగళనాథయ్యయు క్రీ॥ శ॥ 1546 ప్రాంతములకు వినుకొండసీమ (నేఁటి గుంటూరు మండలము)ను జేరుకొనినారు.[1] ఇట్లు నరసింహకవి కుటుంబము వారు దక్షిణదేశమున శ్రీరంగప్రాంతములందే యుండిపోగా కోనేటి తిరువెంగళ

1. చూ. సం॥ 314 - 1915-16. S. I. Epi-Rep. గుంటూరుజిల్లానరసారావు పేట తా॥ మిన్నికల్లు. క్రీ॥ శ॥ 1546. కోనేటిఅన్నయ్య.

నాథాధు ఉత్తరమున వినుకొండసీమయందు నెలకొని మతప్రచారము గావించు చుండగా పెద చిన తిరుమలచార్యాదు లప్పు డాయాప్రాంతముల కేగి ప్రచారకార్య క్రమములను పర్యవేక్షించు చుండిరి గావలయును. క్రీ॥ శ॥1553లో పెద చిన తిరుమలాచార్యులు దక్షిణమున చిన కంచీపురం ప్రాంతములందుడిరి. 1562లో ఉత్తరమున మంగళగిరిలో చినతిరుమలాచార్యుఁడు సంకీర్తన "అరుళుప్పాడు"న కేర్పాట్లు గావించినాఁడు. పై యంశములనుబట్టి పలువురి సహాయసహకారములతో పెద చిన తిరుమలాచార్యుల పర్యవేక్షణమున నాఁడీ మత ప్రచారకార్యక్రమములు నిర్విఘ్నముగా సాగుచుండినదని తెలియుచున్నది.

విజయనగరసామ్రాజ్య విధ్వంసనముతో చెదురుమదురుగా నాలుగుదిక్కుల నుండిన తాళ్ళపాకవారిసాహిత్యముకూడ చాలవరకు రూపుచెడినది. పోయినది పోగా తంజాపూరు మండలముననే కొంతవరకు వారి సాహిత్యము నిలువరమందగలిగి నది. సంగీత సాహిత్య నాట్యకళలందప్పటి దక్షిణదేశపుటాంధ్రరాజులకుండిన యభిమానమే తాళ్ళపాకవారి వాగ్గేయరచనలను గొంతవఱకేని కాపాడినది. అందుకే తాళపత్రములలో లభ్యమైన తాళ్ళపాకవారి గేయసారస్వతము చాల వఱకు తంజావూరుప్రాంతములందే లభ్యమగుచున్నది. అచటి తాళ పత్రము లలోఁ గొన్నింట వారిసాహిత్యము నాగరిఅక్షరములలో గూడనుండుట తత్సాహి త్యమున కానాఁడు గల్గిన ప్రచారమునే సూచించును. అంతేకాదు, అందలి సంకీర్త నములు వ్రాయఁబడిన తెలుఁగు నాఁడు వారు వానిని పాడుచుండిన రీతినే వెల్లడించు నదిగానున్నది. ఇట్లు వీరిగేయ సారస్వతము మతప్రచారమునకే యుద్దేశింపఁ బడినను భక్తితోపాటు కాలాంతరమున వీరిరచనలు సంగీతనాట్యము లను కళలవికాసమునకుఁ గూడ చక్కని యవకాశమిచ్చినవి.

---

సం॥ 419 —1915-16. గుంటూరుజిల్లా, నరసారావుపేట తా॥ గొరిజవోలు. క్రీ॥ శ॥ 1546 - కోనేటి తిరువెంగళనాథయ్య.

సం॥ 684 —1920-21. గుంటూరు–తెనాలి తాలూకా ఈమని. క్రీ॥ శ॥ 1564. కోనేటి తిరువెంగళనాథయ్య.

సం॥ 182 — 1916-17. గుంటూరు-గుంటూరు తా. ఉంగుటూరు. కోనేటి తిరువెంగళనాథయ్య.

సం॥ 686 —1920-21. గుంటూరుజిల్లా తెనాలి తాలూకా - దంతులూరు; కోనేటి తిరువెంగళనాథయ్య.

## తాళ్ళపాకవారి వాగ్గేయ రచనలు—నామరూపములు

తాళ్ళపాకవాగ్గేయకారులలో నాద్యుఁడగు అన్నమాచార్యుని, తత్పుత్ర పౌత్రులగు పెద చిన తిరుమలాచార్యులను జేర్చి 'ఆంధ్ర పద కవిత్రయ' మని మనమిపుడు పేర్కొనవచ్చును. ఈ ముఖ్వురును గలసి తెలుఁగున వెలయించిన అధ్యాత్మ శృంగార సంకీర్తనములుగల రేకుల మొత్తము నేఁటికి మనకు లభించి నవే దాదాపు 478 + 2112 = 2590 వఱకును గలవు. స్థూలముగా రేకునకారు పదములచొప్పున గుణింపగా వారి సంకీర్తనములు లభ్యములగుచున్నవే (2590 × 6 =) 15540 వరకు నగుచున్నవి. వారి రచనలెన్నో నశింపగా మిగిలినవిమాత్రమే యివి. అన్నమాచార్యుఁడొక్కఁడే.

> 'సారసనేత్రుపై సంకీర్తనములు
> సరసత్వమునఁ దాళ సముఖముల్ గాఁగ
> పరమ తంత్రములు ముప్పదిరెండు వేలు'
>
> (చూ. అన్నమా. చరిత్ర ద్విపద పు. 45)

రచించినట్లున్నది. కాని ఆతనివేని నేఁటికి లభ్యములైనవి (2393 × 6 =) 14358 కీర్తనములుమాత్రమే. ఇఁక మిగిలినవారు రచించిన కీర్తనము లెన్నోగాని మనకు లభించినవిమాత్రము పెద తిరుమలాచార్యునివి (177 × 6 =) 1062; చిన తిరుమాలాచార్యునివి (20 × 6 =) 120; తిరుపతిలోని రేకులలో భద్ర ముగ నున్నవి.

అన్నమాచార్యుఁడీసంకీర్తనరచన తన పదునాఱవయేట నారంభించి— అనఁగా క్రీ.శ. 1440 లో మొదలుపెట్టి క్రీ.శ. 1503 వఱకును చేయుచుండినట్లును, పెద తిరుమలాచార్యుఁడు తదాది (అనఁగా క్రీ॥ శ॥ 1503) నుండి తండ్రిగారి యాజ్ఞచొప్పున 'దినమొక సంకీర్తన శ్రీ వేంకటేశ్వరున కంకితముగా' చెప్పు చుండినట్లును, తాళ్ళపాకవారి రేకులందు పేర్కొనఁబడినది. ఇది రేకులు చెక్కిన ప్పటిమాట కావచ్చును. అట్లని పెద తిరుమలచార్యుఁడంతకుఁబూర్వము పదములు చెప్పలేదని తలపఁనవసరము లేదనుకొందును. ఇఁక చిన తిరుమలాచార్యుని రచనారంభమునుగూర్చి రేకులందేమియు వివరణము లేకున్నను ఆతని తొలి యధ్యాత్మ సంకీర్తనమునుబట్టి యాతఁడును తన పదునాఱవ యేటనే

1. చిన తిరుమలాచార్యునివి మొత్తము 30 రేకులు లభ్యమై 16 వ సంపుటమున (1962) ముద్రింపఁబడినవి. పరిశిష్టము చూచునది.

అనఁగా క్రీ॥ శ॥ 1506 నుండియే- తద్రచన కుపక్రమించినట్లుగా తెలియు చున్నది.

అన్నమాచార్యచరిత్ర ద్విపదనుబట్టి చూడఁగా అన్నమయ్య తొలుత శృంగారసంకీర్తనములను, పిదప నధ్యాత్మసంకీర్తనములను రచించినట్లు తోఁచును. ఇఁక శాసనగ్రంథస్థవిషయములనుబట్టి పెదచినతిరుమలాచార్యు లిరువురును తొలుత అధ్యాత్మ సంకీర్తనములను పిదపనే శృంగార సంకీర్తనములను రచించినట్లు తెలియును.

అన్నమాచార్యుని పదరచనను పెదతిరుమలాచార్యుఁ డిట్లు స్తుతించెను.

"సురలకు నరులకు సొరిది విన విన
నరుదు తాళ్ళపాక అన్నమయ్య పదములు ॥పల్లవి॥
చక్కెరలై చవి చూపీ జాలై తావి చల్లీ
నక్కఁజపు మాతు వజ్రాలై మెఱసీని
నిక్కుటద్దములై మా నిలువు నీడలు చూపీ
నక్కర తాళ్ళపాక అన్నమయ్య పదములు ॥సుర॥
పన్నీరై పైఁ బూసీఁ గప్పంబై చలువ రేఁచీ
మిన్నగల ముత్యములై మెయి నిండీని
వెన్నుబలములై మా వెంట వెంటఁ దిరిగీని
అన్నిట తాళ్ళపాక అన్నమయ్య పదములు ॥సుర॥
నెట్టన వేదాంతములై నిత్యములై పొదసూపీ
పుట్టుతోనె గురువులై బోధించీని
గట్టి వరాలిచ్చే శ్రీ వేంకటనాథుని మెప్పించీ
నట్టె తాళ్ళపాక అన్నమయ్య పదములు ॥సుర॥

మఱియు : [శేషాచార్యులవారి వ్రాతప్రతి]

శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞానసారంబులై
యతిలోకాగమవీధులై విపుల మంత్రార్థంబులై నీతులై
కృతులై వేంకటశైలవల్లభరతిక్రీడారహస్యంబులై
నుతులై తాళ్ళపాక అన్నయవచోనూత్నక్రియల్ చెన్నగున్.

[సంకీర్తన లక్షణము]

ప్రాయికముగా నీస్తుతి తాళ్ళపాకవారి రచనల కంతకును జెల్లును. వారి యీ సంకీర్తన పదవాఙ్మయమునంతను పరిశీలనమున కనువు గొల్పు రీతి నీక్రింది విధముగా మనము వింగడించుకొనవచ్చును. " సంకీర్తనా పరిశుద్ధిన్

మునుజేయఁబూని" గావించిన వీరి పదరచనలు వస్తుస్వీకరణమును బట్టియు, రచనానిర్మాణమునుబట్టియు స్థూలముగా శిష్టరచనలు, దేశిరచనలు నని యిరు తెఱఁగుల విభాగింపవచ్చును. ఈశిష్టరచనలు మఱల భావభేదమునుబట్టి శృంగా రాధ్యాత్మరీతుల నిరుదెఱఁగులు. దేశిరచన లన్నియు ప్రాయికముగా నాధ్యాత్మిక ములే. వస్తురచనా విభేదములను బట్టియే గాక గాయనపద్ధతినిబట్టి కూడ వీరి రచనలను మఱి నాలుగైదు విధముల విభాగింపవచ్చును. వివరణమున కీ క్రింది సూచికలు చూచునది.

తిరుమల తిరుపతి దేవస్థానమువారు ఇప్పటి (1975) వఱకును ప్రకటిం చిన తాళ్ళపాకవారి శృంగార అధ్యాత్మ సంకీర్తన (22) సంపుటముల ననుస రించి వా రభిమానించిన రాగముల అకారాది సూచికను పరిశోధకుల యుపయో గార్థ మిందు పొందుపఱచుచున్నాను. (ఇందు పేర్కొన్న అంకెలలో మొదటిది వారి శృంగార సంకీర్తనముల సంఖ్య + రెండవది వారి అధ్యాత్మ సంకీర్తనముల సంఖ్య.).

| | శృం.-అధ్యా. | | శృం.-అధ్యా. |
|---|---|---|---|
| అమరసింధు | 20 + - | గౌళ | 93 + 27 |
| ఆందోళి | 7 + 1 | ఛాయ | 1 + - |
| ఆరభి (ఆరిభి) | 5 + - | ఛాయానాట | 15 + 3 |
| ఆబాలి | 1 + - | తెలుఁగుకాంబోది | 52 + 3 |
| ఆహిరి | 403 + 95 | తోండి | 8 + 2 |
| ఆహిరినాట | 9 + 1 | దేవగాంధారి | 57 + 78 |
| కన్నడగౌళ | 105 + 59 | దేవప్రియ(దేవక్రియ) | 2 + 2 |
| కన్నడబంగాళం | 12 + - | దేశాక్షి | 118 + 77 |
| కాంబోది | 198 + 25 | దేశి | 19 + 6 |
| కుంతలవరాళి | 12 + 1 | దేసాళం | 178 + 66 |
| కురంజి | 23 + 2 | ద్రావిడ భైరవి | 8 + - |
| కేదారగౌళ | 107 + 10 | ధన్యాసి (ధన్నాసి) | 71 + 65 |
| కొండమలహరి | 40 + 1 | నట్టనారాయణి | 13 + 1 |
| కోకిల పంచమం | 2 + - | నాగగాంధారి | 6 + - |
| కౌశి | 2 + 2 | నాగవరాళి | 34 + 5 |
| గంభీరనాట | 8 + - | నాట | 58 + 69 |
| గీతనాట | - + 1 | నాదరామక్రియ | 162 + 14 |
| గుండక్రియ | 45 + 95 | నారణి | 18 + 12 |
| గుజ్జరి | 44 + 57 | నారాయణగౌళ | 1 + - |
| గుమ్మకాంభోది | 1 + - | నారాయణి | 22 + - |

| | శృం.-అధ్యా. |
|---|---|
| నారణిదేసాక్షి | 4 + - |
| నీలాంబరం (నీలాంబరి) | 10 + - |
| పళవంజరం (పడ...పడి) | 13 + 5 |
| పాడి | 324 + 98 |
| పిసాళం | 1 + – |
| పూరెభి | 3 + - |
| పూర్వగౌళ | 8 + 1 |
| ప్రతాపనాట | 4 + 1 |
| బంగాళం | 3 + 3 |
| బలహంస | 14 + 1 |
| బౌళి | 219 + 190 |
| బౌళిరామక్రియ | 28 + 17 |
| భల్లాట (భల్లాటి) | 3 + 2 |
| భూపాలం | 67 + 61 |
| భైరవి | 205 + 50 |
| మంగళకైశిక | 6 + - |
| మంగళకౌశికి | 82 + 15 |
| మధ్యమావతి | 71 + 3 |
| మనోహరి | 10 + - |
| మలహరి | 45 + 51 |
| మాళవశ్రీ | 18 + 4 |
| మాళవి | 23 + 36 |
| మాళవిగౌళ | 85 + 33 |
| ముఖారి | 414 + 123 |
| ముఖారిపంతు | 3 + - |
| మేఘరంజి | 7 + 3 |
| మేచబౌళి | 21 + 1 |
| రామక్రియ | 271 + 114 |

| | శృం.-అధ్యా. |
|---|---|
| రాయగౌళ | 3 + 1 |
| రీతిగౌళ | 34 + - |
| రేవగుప్తి | - + 1 |
| లలిత | 168 + 234 |
| వరాళి | 190 + 67 |
| వసంతం | 6 + 7 |
| వసంత వరాళి | 16 + 6 |
| వేళావళి | 5 + - |
| శంకరాభరణం | 344 + 104 |
| శుద్ధదేశి | 42 + 10 |
| శుద్ధరామక్రియ | 3 + - |
| శుద్ధవసంతం | 115 + 59 |
| శోకవరాళి | 11 + 4 |
| శ్రీరాగం | 380 + 142 |
| సామంతం | 452 + 215 |
| సామవరాళి | 9 + 3 |
| సావేరి | 10 + 1 |
| సాళంగం | 71 + 29 |
| సాళంగనాట | 201 + 126 |
| సింధురామక్రియ | 21 + – |
| సోమరాగం | 1 + – |
| సౌరాష్ట్రం | 67 + 8 |
| సౌరాష్ట్రగుజ్జరి | 3 + - |
| హిందోళం | 18 + 3 |
| హిందోళవసంతం | 40 + 5 |
| హిజ్జజి (హెజ్జిజి) | 52 + 2 |

తంజావూరు తాళపత్రప్రతిలో తాళ్ళపాకవారు పాడిన మఱికొన్ని రాగములు :

| | |
|---|---|
| కల్యాణి | పంతువరాలి |
| కేదార | బిలహరి |
| గుమ్మకాంబోది | (యదుకులకాంబోది) |
| గౌళివంతు | సారంగ |
| ఘంటారావం | |

తిరుపతి ప్రాచ్యలిఖిత పుస్తకభండారమునందలి సంఖ్య 6609 ప్రతిలో తాళ్ళపాకవారి కీర్తనల కున్న మఱికొన్ని రాగముల పేర్లు.

| | |
|---|---|
| ఆళాపచారి | మోహణకల్యాణి |
| నవరోజు — ఆటతాళం | రమామనోహరము |
| మారువధన్యాసి | వసంతభైరవి. |

తి. తి. దేవస్థానం వారు ప్రకటించిన 22 (శృంగార + అధ్యాత్మ) సంకీర్తన సంపుటముల ననుసరించియు, నితర తాళపత్రప్రతుల ననుసరించియు తాళ్ళపాకకవు లభిమానించిన రాగముల సంఖ్య మొత్తము 109 వఱకు నున్నట్లు తెలియుచున్నది. వానిలో నీక్రిందిరాగములను వారు మిక్కిలి యభిమానముతో బాడుకొనిరి.

| | శృంగారకీర్తనములు. | | | అధ్యాత్మకీర్తనములు. | |
|---|---|---|---|---|---|
| 1 | సామంతం | 452 | 1. | లలిత | 234 |
| 2. | ముఖారి | 414 | 2. | సామంతం | 215 |
| 3. | ఆహిరి | 403 | 3. | బౌళి | 190 |
| 4. | శ్రీరాగం | 380 | 4. | శ్రీరాగం | 142 |
| 5. | శంకరాభరణము | 344 | 5. | సాళంగనాట | 126 |
| 6. | పాడి | 324 | 6. | ముఖారి | 123 |
| 7. | రామక్రియ | 271 | 7. | రామక్రియ | 114 |
| 8. | బౌళి | 219 | 8. | శంకరాభరణము | 104 |
| 9. | భైరవి | 205 | 9. | పాడి | 98 |
| 10. | సాళంగనాట | 201 | 10. | ఆహిరి | 95 |

| శృంగారకీర్తనములు· | | | అధ్యాత్మకీర్తనములు. | | |
|---|---|---|---|---|---|
| 11. | కాంబోది | 198 | 11. | గుండక్రియ | 95 |
| 12· | వరాళి | 190 | 12. | దేవగాంధారి | 78 |
| 13. | దేసాళం | 178 | 13 | దేశాక్షి | 77 |
| 14· | లలిత | 168 | 14. | నాట | 69 |
| 15. | నాదరామక్రియ | 162 | 15. | వరాళి | 67 |

తాళ్ళపాకకవులు తమ సంకీర్తనములలో మొత్తముమీఁద అభిమానించిన రాగముల క్రమ మీ తీరున నేఁటికి కానవచ్చుచున్నది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | సామంతం | 667 | 9. | రామక్రియ | 385 |
| 2· | ముఖారి | 537 | 10. | సాళంగనాట | 327 |
| 3. | శ్రీరాగం | 522 | 11. | వరాళి | 257 |
| 4. | ఆహిరి | 498 | 12. | భైరవి | 255 |
| 5. | శంకరాభరణం | 448 | 13. | దేసాళం | 244 |
| 6. | పాడి | 422 | 14. | కాంబోది | 223 |
| 7. | బౌళి | 409 | 15· | దేశాక్షి | 195 |
| 8. | లలిత | 402 | | | |

✻

## సంకీర్తనపదములు — శిష్టరచనలు:

వస్తువిభేదమునుబట్టి వేరుగా పేర్కొన్న సంకీర్తన శిష్ట రచనలలో శృంగార ప్రాధాన్యము గలవి శృంగారపదములనియు, నాధ్యాత్మప్రాధాన్యము గలవి యధ్యాత్మిక కీర్తనలనియు పేర్కొనఁబడుచున్నవి. తాళ్ళపాకవారి యీ సంకీర్తనపదములనుగూర్చి పరిచయపూర్వకముగ కీ.శే.శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు వ్రాసిన విషయమును వారి పలుకులలోనే వివరింతును.[1]

" మనుష్యుని చిత్తము ప్రాయికముగా శృంగార వైరాగ్యముల నొకటనో రెంటనో బద్ధమై యాపాతమధురమును బర్యంతపరితాపియునగు విషయ సుఖముననో సర్వదుఃఖనిబర్హణ మగువస్తుతత్త్వజ్ఞాన విరాగ విచారములోనో మునింగి రెంటను దత్కాలమున సుఖమెఱుంగక సంకల్పశతవిధుర మనఃపరితాపమున మలఁగుచు ననుక్షణము దుర్దశాకల్లోలములఁ ద్రోపువడుచుఁ దీవ్రరోగ మృత్యుభీషణ మహామకరముల నొక్కొక్కపాటఁ దప్పించుకొనుచు సంసార మహాసాగరమున మునిఁగి తేలుచుండునుగదా! శృంగారము తాత్కాలిక సుఖ బుద్ధిఁ జనింపఁ జేయును. వైరాగ్యము క్రమక్రమముగా నాత్మసంస్కారము నెలకొల్పి యాధ్యాత్మ భావనలచేఁ గర్మపరిత్యాగ పశ్చాత్తాప రూపముల బంధ ములఁ ద్రెంచివైచుచు సదనుష్ఠానచింతన భజన తపస్సమాధి మార్గముల దుర్గమ మగు నపవర్గమునకుఁ గొంపోవును. సంకీర్తన లీరెండుతెఱఁగుల విలసిల్లి పదార్థశక్తిచే స్వరతాళరాగాలాప విమానముల హేయమగు నైహికపంకిల ప్రదేశము విడిపించి యూర్ధ్వలోక విహారవిలాసముల జిత్తమున కొనరింపఁజాలును. ఇందు వైరాగ్య హేతుకములగు గీతముల నాధ్యాత్మ సంకీర్తనములనియు, శృంగార భావానుబంధియగు గేయజాలమును శృంగార సంకీర్తనములనియు బేర్కొందురు.

> గూఢార్థైః పరమార్థైశ్చ సంసార సుఖదూషకైః
>
> పదైర్నియోజితం గీతం సాధ్యాత్మం యోగివల్లభమ్ ॥

అని సోమేశ్వరుఁడు చెప్పెను. గూఢముగాఁ బరమార్థముల సంసార సుఖానిత్యతఁ జూపి యోగులకుఁ బ్రియమైన యాత్మానాత్మ వివేకజ్ఞానమును బొస

---

1. తాళ్ళపాకవారి సంకీర్తనలు-Journal of S.V.I. Vol. IV. No. 2. P- 10-12. శ్రీమానవల్లి రామకృష్ణకవి. ఎమ్. ఏ. 1943.

గించునది యాధ్యాత్మగీతము. ఇది విరక్తబుద్ధిజనింపనివారి కున్మత్త ప్రలాపముగా నుండును. వారికిఁ దరణోపాయమేది ? నిరంతర భ్రమణశీలమగు మనోహరిణము నెట్లు పట్టికట్టుట? విషయాంధీభూత చిత్త మత్తగజమునకు వశీకరణ కరిణియేది ? మదనమాయాగగనవిహారవిస్మృతాపరధర్మంబగు కర్మ శకుంతమునకు దీమమేది ? శృంగారరససంగతగీతగానమే పాశజాలము. అదియే గంధవిభ్రామకము. కర్షణాకనకశృంఖల. శృంగారస మెల్లరసములకు రసరాజముగదా ! మనసును రాగతాళ విజ్ఞానమున నెలయించి మృదుమధుర వాద్యములఁ జిక్కఁబట్టి మోహవిలాసముల క్షణక్షణవిజృంభమాణ విలీయమానవర్తనగతులఁ బరిభ్రమింపఁజేసి మదనవిద్యుదుద్ద్యోతము మఱగిపోవఁ జీకటి గ్రమ్మించి నిబిడనిశ్చలసత్యజ్ఞానమును మెఱయించి పరమాత్మ దర్శనముచేఁ గైవల్యము సాధింపఁగలది శృగారమని దివ్యసూరులు బోధింతురు. అట్టి శృంగార విలసనము రెండు తెఱఁగుల వెలయుచుండును. పరచేష్టాదర్శనశ్రవణరూపమొకటియు. స్వాత్మానుభవరూపము వేఱొకటియునగు అనఁగా శ్రీకృష్ణ లీలల నాడిపాడి భజించునపుడు గలుగు రసానుభవము మొదటి వర్గము. రెండవది తానే నాయికవలె నంతరంగమున సంభావన చేసికొని భగవంతుని నాయకునిగానెంచి సంభోగ విప్రలంభ శృంగారముల నానావస్థలఁ బాలుపడుచు విరహము నోర్వఁజాలక నిరంతర సన్నిధాన సమాగమముల నపేక్షించుచు నపరలోకమెల్ల నుపేక్షించుచు వివిక్తభావ సముద్రమునఁ దత్సాయుజ్యము పడయుటయే. మఱియు శృంగార మిరుభేదములనొప్పు. నాయికానాయకులు పరస్పర సాన్నిధ్యమున దర్శన స్పర్శనాలింగనాదుల వెలయుట యొక భేదము. పరస్పర మెడఁబాటునెంది యనురాగోత్కర్షమున నానావిధ శరీరావస్థలు నెందుట రెండవ భేదము. ఈ యెడఁబాటు పరస్పర ప్రవాసముచేతను, శోకకారణమగు విపత్తు పొందుటచేతను, ప్రథమసమాగమమునకుఁ బూర్వ మీప్సాబలముచేఁ గలుగు నౌత్సుక్యముచేతను, నాయకునియం దన్యనాయికాప్రేమ సంగమ చిహ్నములు గుర్తించి నాయిక యుపాలంభాదిచర్యలఁ బ్రవర్తించుటచేతను నాల్గు రీతులఁ జెల్లును. దానిని 1. ప్రవాస, 2. కరుణ, 3. ప్రథమానురాగ, 4. మాన శృంగారము లని పండితులు పేర్కొందురు. ఈ నాల్గుతెఱఁగుల మూఁడవ నాల్గవ భేదములే భగవత్సంకీర్తనములఁ బ్రతిపాద్యములు. నాయికలష్టవిధముల దశావస్థలలోఁ బెక్కండ్రగుదురు. తదనుసారము వర్ణనీయాంశములు సహస్రగుణితములై రమణీయము లగుచుండును.

ఆధ్యాత్మిక సంకీర్తనముల జగత్తు మిథ్య, సంపత్సుఖములు క్షణభంగురములు, దేహము నశ్వరము, చేష్టా ప్రాభవములు తటిద్విలాసములు, సంకల్ప వికల్పములు బుద్బుదపరంపరలు, మనోహంకారము లున్మత్తావేశములు, కామ క్రోధములు సన్నిపాత జ్వరప్రలాపములు – అనియు, భగవంతుఁడు సర్వభూతాశయవేది, సర్వవస్త్వంతర్యామి, కల్యాణగుణ సంపన్నుఁడు, మహాకృపాలుఁడు, భక్తలోకమందారుఁడు, అల్ప సంకీర్తన పరితుష్టుఁడు అనియు నుద్బోధించును.

...ఇట్లే శృంగారవైరాగ్యములు రెండును దులఁదూగుచు నంతరంగ పరిపాకమునకు హేతువులై జన్మజీవితఫలమునూపుచు సాయుజ్యసామ్రాజ్యమునకు సోపానపంక్తివలె నున్నవి''.

## శృంగారము - పదరచనలు

అనాదిగా సాగుచున్న యీ సృష్టియందలి జీవరాశియంతయు శాశ్వతము పరిపూర్ణమునునై యంతరాంతరమున వ్యక్తావ్యక్తముగనున్న ఏదో ఒక కాంక్షతోడనే అనంతముగఁ డోఁచు నీజీవయాత్రను సాగించుచున్నది. అట్టి కాంక్షయే లోకమున స్థాయిత్వమును బొందిన "రతి" యనఁబడునది. పృథగ్విధమగు నీ జీవకోటి కేకత్వానుభూతిని ప్రసాదించున దీ "రతి"యే. సర్వసామాన్యము నుత్కృష్టమునగు నిట్టిరతి స్థాయియగుటచేతనే తదాలంబనోద్దీపన విభావానుభావాది రససామగ్రివలన బరిపుష్టిఁజెందిన శృంగారరసమే రసరాజమని పేరుగాంచినది అందుకే "శృంగార ఏవ మధురః పరప్రహ్లాదనో రసః'' అనిధ్వన్యాలోకమునఁ జెప్పఁబడినది.

మధురమును ఆనందజనకమును నగునిట్టి శృంగారమే ఆలంబనాది భేదమును బట్టి లౌకికము, అలౌకికము (లేదా దివ్యము) నని యిరుతెఱఁగు లగుచున్నది. స్థాయీభావ మగురతి కాంతావిషయికము కాగా లౌకికశృంగారమును, భగవద్విషయికము కాగా నలౌకిక (దివ్య)శృంగారమును అనుభూయమానములగుచున్నవని మన యాలంకారికులు వివరించిరి. భక్తి మయమగు వైష్ణవము ప్రచారమందిన కారణముగా మన దేశమున నిట్టి శృంగారవిషయములకు లక్ష్యభూతములగు రసవత్ప్రబంధరచన లనేకము వెలువడినవి. తోడ్తో వాని కాలంకారికులు లక్షణనిర్వచనము గావించి నూతనసిద్ధాన్తములను గూడ గావింపవలసినవా రైరి. సంస్కృతవాఙ్మయమున జయదేవుని గీతగోవిందము మున్నగు రచన లట్టి దివ్య శృంగారమును వెలార్చునవే. వాని ననుసరించియే

వైష్ణవాలంకారికులగు రూపగోస్వామి, మధుసూదన సరస్వతి ప్రభృతులారస విషయమును గూర్చి చర్చించుచు ప్రకృతి మార్గమున సాగు దివ్యశృంగారముతో పాటు నివృత్తి రూప మగు భక్తినిగూడ రసముగనే పేర్కొని సిద్ధాంతీకరించుట జరిగినది. వంగదేశీయుఁడగు రూపగోస్వామి తన "ఉజ్జ్వల నీలమణి"యందు మధురము నుజ్జ్వలము నను పేర భక్తిరసమును విస్తరింపఁగా పరివ్రాజకాచార్యుఁడగు మధుసూదన సరస్వతి తన "భగవద్భక్తి రసాయన మను గ్రంథమున దానికిఁ బూర్ణత్వమును గల్గించినాఁడు. మధుసూదనసరస్వతి భక్తిరసమున కిట్లు పట్టముగట్టుచు [1]-

" అనుభవమాత్రము వలననే సాక్షాత్సుఖవిరుద్ధములయిన శోక క్రోధ భయాదులకు రసత్వ మంగీకృతమై యున్నది. అనుభవసిద్ధమై మిగిలినరసముల కన్న వేయిరెట్లెక్కువగా రస్యమాన మగుచున్న భక్తి రసముగా దనుటెట్లు? రస కోవిదులు దేవాదివిషయకరతి రసము కాదనియు, భావమనియుఁ జెప్పిరి. ఇతర దేవతావిషయకమగు రతి భావమే: ఏలన వారు జీవులే యగుటచేఁ బరమానం దము గలుగదు; పరమాత్మస్వరూప శ్రీకృష్ణరతి పరమానందమునకుఁ గొంపోవును. మఱియు కాంతాది విషయకములగు నేరసములందును భగవద్రతి యందువలెఁ బూర్ణసుఖము లేక యానందము కలుగదు. కాన వానియందుఁ దగిన రసపుష్టిలేదు. అవి క్షుద్రరసములు. భగవద్రతి పూర్ణరసము. అది మిడుగురు పుర్వులకన్న సూర్యకాంతి యెట్లు బలవత్తరమో యట్లే మిగిలిన రసములకన్న శ్రేష్ఠతరము, బలవత్తరము " నని వచించినాఁడు.

భక్తిరసమునకు నాలంబన విభావము భగవంతుఁడు. తచ్చరిత్రలు విభావములు. భగవదాకార చిత్తవృత్తియే స్థాయీభావము. అదియే భగవద్రతి. అనుభావములు తత్కాలమున బుట్టిన నేత్రాది వికారములు. వ్యభిచారులు నిర్వేద శంకా హర్షాదులు. ఇవియే పరమానందస్వరూపమగు భక్తిరసముగాఁ బరిణమించును. జీవాత్మ పరమాత్మల నాలంబనముగాఁ గొని నాయికానాయకుల పరస్పర శృంగారవిలసనరూపమున దివ్య శృంగారముగఁ గూడ రూపొందును.

ఇట్టి దివ్యశృంగారమునుగూర్చి ముచ్చటించునప్పుడే రూపగోస్వామి తన యుజ్జ్వలనీలమణియందు బూర్వాలంకారికులు గావించిన నాయికా విషయవిభాగము

1. చూ. కావ్యాలంకార సంగ్రహము పీఠిక పు. 307-310 శ్రీ సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారు.

లను గొంత పరిష్కరింపవలసినవాఁడాయెను. రుద్రభట్టు, భోజుఁడు మున్నగు పూర్వాలంకారికులు వివరించిన స్వీయా, పరకీయా, సామాన్యాది నాయికాభేదము లలో రూపగోస్వామి స్వీయా పరకీయా భేదములను మాత్రమే యంగీకరించెను. ఏలన ఆతనివాదము ననుసరించి కృష్ణరతి విషయమున సామాన్యకు తావేలేదు. అందుకే భక్తి పారవశ్యమున దాండవమాడిన తాళ్ళపాకవారి శృంగార పదము లందును స్వీయాభేదములకేగాని సామాన్యకు ప్రవేశమేలేదు. కాని తరువాతి కాలమున భక్తితోపాటు రసదృష్టితో అనంతమగు శృంగార నాయికా భావము నందలి వైవిధ్యము నంతను ప్రదర్శించు నేర్పుతోడనే పదరనన గావించిన వారు కావుననే కావలెను క్షేత్రజ్ఞాదుల శృంగార పదములందు సామాన్యాది భేదము లకును ప్రవేశము గల్గినది. అందు వారికి రసదృష్టియే ప్రధానమైనది. అందుకే తత్సమీపకాలమున వెలసిన యాలంకారికు లింకొక మెట్టు నెక్కి సామాన్యనుగూడ సమర్థింపవలసినవారైరి. అక్బర్‌షా రచితమగు శృంగారరసమంజరియం దీ విషయమును చూడనగును. డా॥ రాఘవన్ పై గ్రంథమునకు విపులమగు పీఠి కను వ్రాయుచు నీ విషయము నిట్లు వివరించిరి.[1]

" Love to him (according to the author of Sringara Manjari) is an emotion wich can have only one obect whether it be the case of a Sviya or a parakeeya - kulata or samanya. It is something which having come into being for somebody, produces no desire for anybody else. It can never be for money and yet be love; and such love arises not by reason of any Gunas, qualities as such, nor even by reason of beauty; Experience shows that such love is a blessing that providence gives us– "

ఇట్లు బహువిధ నాయికా భేదములందలి వైవిధ్యమునంతను ప్రదర్శించిన క్షేత్రజ్ఞాదుల పదరచనలకు తొలుత మార్గము కల్పించినది తెలుఁగున తాళ్ళపాక వారి శృంగారపదములే యనవలెను. ఈ విషయమున వీరువేసిన పునాదుల మీఁదనే తరువాతి కాలమున జరిగిన అలంకారశాస్త్రనిర్మాణమంతయు నిలువ వల సినదాయెను.

---

1. చూ. Introduction to Sringara Manjari of Saint Akbarshah–P. 90– Ed. Dr. Raghavan. Pub. 1951.

లెక్కకు మిక్కిలిగానున్న తాళ్ళపాకవారి శృంగార పదసాహిత్యము ఈ యలంకార శాస్త్రసస్యమునకుఁ బంటపొలము వంటిది. అందు గోచరించు విభావానుభావాది శృంగారరస సామగ్రి యనంతముగా దోఁచును. తదాలంబనమగు నాయికా స్వరూపము స్థితిభేదమును బట్టియు, నవస్థాభేదమును బట్టియు బహుధా ప్రత్యక్షమగును. రసవిషయ మనంతముగ నందున్నది. నా శక్తియే స్వల్పము. క్రమముగా వివరింతును.-

తాళ్ళపాకవారి శృంగార పదములలో తిరువేంకటనాథుడే నాయకుఁడు. అలమేల్మంగయే నాయిక. శ్రీభూనీళాదు లితర సతులు. కవి తానై శృంగార సహకారిణి యగుచుండును. ఇది సాధారణ స్థితి. కొన్ని యెడల కవి తానే నాయిక యగుటయు విరహవేదన ననుభవించుటయు మున్నగు తీరులగల పదములును లేకపోలేదు. ఇంచుక సోదాహరణముగ విశదీకరింతును—.

అలమేల్మంగా శ్రీ వేంకటనాథులు ఆది దివ్యదంపతులు. వారి దాంపత్య సౌభాగ్యము జగత్కల్యాణకారకము. లోకమున కాదర్శము. సృష్టి యందలి జీవాత్మలు కూడ సట్లే పరమాత్ముని సంసర్గమునకై పరితపించి పరవశానంద సంపద ననుభవింపవలెను. ఈ పదమును పఠింపుఁడు.

## స్వీయా-దివ్య :-

ముఖారి

"ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము మఱి
యిదిగాక వైభవం బిక నొకటి గలదా॥
అతివ జన్మము సఫలమై పరమయోగివలె
నితర మోహాపేక్ష లిన్నియును విడిచె
సతికోరికలు మహాశాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వాసన వోలె నుండె॥
తరుణిహృదయము కృతార్థతఁ బొంది విభు మీఁది
పరవశానంద సంపదకు నిరవాయ
సరసిజానన మనోజయ మంది యింతలో
సరిలేక మనసు నిశ్చలభావమాయ॥
శ్రీ వేంకటేశ్వరునిఁ జింతించి పరతత్త్వ
భావంబు నిజముగాఁ బట్టెఁ జెలి యాత్మ

దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు దిరమాయ" (12-17)

రామక్రియ

"ఇంట నున్న వారము నే మెందు వోయ్యేము
దంటలమై నిన్ను నేను తప్పువట్టేమా॥
వేడుకలు నీకెపుడు వెల్లివిరిసి వున్నవి
వీడె మిందరాదా వెరపేటికి
ఆడనే శ్రీ వేంకటేశ అలమేల్మంగను నన్ను
కూడితివి యింక నీకు గురి దప్పేనా" ॥3॥ (17-597)

ఇది నాయిక యగు నలమేల్మంగావాక్యము. ఆమెయే మఱి యిట్లనుచున్నది.

రామ ప్రియ

"ఏమి సేతునయ్య నీవు యింతటి నాయకుడవు
మోము చూచి తొలి నీకు మోహించినదానను॥
వలపించవలె నొండె వశముగాకుండితేను
చెలరేగి ప్రియమయినఁ జెప్ప వలెను.
పిలువ నంపఁగవలె బిగిసి రాకుండితేను
కొలువునకు వచ్చి కొంత కొసరఁగా వలెను" ॥3॥ (3-188)

ఇందలి శృంగారార్థము సుగమము. ఆమె పలుకులలోనే కవి తామసులగు తాము దైవమునుజేరి యర్థింపకున్నను దైవమే తమ్మాదరించి రక్షింపవలె ననెడి యాధ్యాత్మికభావనతోఁగూడిన మొఱను జతపఱచి చెప్పుకొనినాఁడు.

శృంగారరసమున కాలంబనమగు *నాయికావర్ణనమును, తదుద్దీపన విభావాదిక వర్ణనమును* గల యీ క్రింది పదమును తిలకింపుఁడు :

వరాళి

"కటకట సతి శృంగారము కన్నుల పండువు దోఁపుచు
యిటువలె నిలిచి చిత్తంబిందరి నేఁపెడిని॥
కోమలి కొప్పునఁ జెరివిన క్రొవ్విరు లాత్మజు శరములు
వేమరుఁ బొదిగొన నాటిన విధమున నొప్పెడిని

కామిని పూసిన కస్తురి కంతుని బాణారుణిమే
యీమెఁ బైపైఁ బేరిన యిటు వలె నొప్పెడిని॥
అతివకు భూషణ జాలంబంతయు మరునస్త్రములకు
జతనంబగు మైమరువై సరిఁ జెలువొందెడిని.
సతి గట్టిన తెలి పుట్టము చంపెడు మదనుని బారికి
సితకరుఁ డడ్డము చొచ్చిన చెలువము దోఁపెడిని॥
బలుపగు చెలిచనుగుబ్బలపై వేంకటపతి నించిన
లలితపు రేఖల బిత్తరిలాగులు దోఁపుచును
వలరాయని చిరునమ్ములు (?) వడిఁ దాఁకిన గంట్లవలెఁ
బొలుపుగఁ జూచిన వారల బొమ్మరపరపెడిని॥. (12-122)

ఇందు నాయిక శృంగారరసమున కాలంబనవిభావమై నాయకున కుత్తేజము గొల్పుచున్నది. ఇఁక నామె కొప్పున తురిమిన క్రొవ్విరులు, మేన పూసిన కస్తూరి, తాల్చిన భూషణజాలము, కట్టిన పుట్టము, నిలుపుకొన్న మదనాంకములు నుద్దీపనవిభావములై రసపోషకములై యున్నవి. (ఇట్టిదే మఱియొక పదము చూ. 12.2).

ఇట్టి నాయికాస్వరూపము తాళ్ళపాకవారి పదములలో పలుతెఱఁగుల గోచరించును. ఆలంకారికులు నిర్వచించినస్వీయాదిభేదములలో స్వీయానాయికాభేదములే కుప్పలుతిప్పలుగా వీరి రచనలందున్నవి. రూపగోస్వామి ఉజ్జ్వలనీలమణిలో వర్ణించిన శ్రీదివ్యశృంగారవర్ణనవిషయమున పరకీయాసామాన్యానాయికలకు ప్రవేశమే లేదు. తాళ్ళపాకవారు చిత్రించిన స్వీయాభేదములనిట తిలకింపఁదగును. పూర్వోదాహృతమగు ముఖారి రాగపదము 'ఇదిగాక తపము మఱి' (12-17) యనునది స్వీయా-ఉత్తమ-దివ్య కుదాహరణము.

## స్వీయానాయిక :

### ముగ్ధ-నవోఢ-(దివ్య)

గౌళ

"ప్రాయపు వనిత నింత పచ్చి సేతురా
మాయక మూసీని చలముల నింతి వలపు ॥
కుప్పగా కుచ్చెల వీడం గొంగు వట్టి తీసితేను
కొప్పు నెరులం జెలి మైగప్పుకొనెను

తప్పక వాలుం జూపుల తరుణి మోము చూచితే
రెప్పలు మూయుచు సిగ్గు రేగనీక దాచెను॥
సారెకుం జేతులు చాచి చన్నులు నీవంటగాను
కూరిమిం జేతుల మూసుకొనె నవ్వుచు
బిరాన నాపె మోవి బెదవి నటించ బోతె
దారి తప్పకుండ తన తమ్ములాన గప్పెను॥
బంగారు వొడ్డాణము పట్టినీ వెడలించబోతె
అంగమున నీరెంటె మంగవించెను.
సంగతి శ్రీ వేంకటేశ సఖియ నీవు గూడితె
ముంగిట మదనవేళ ముప్పిరి గొలిపెను" (3-117)

ఇందు నాయిక అలమేల్మంగ యగుటచే, దివ్య-స్వీయ. 'క్రియాహ్రియా మనోహరాముగ్ధా' అను రసమంజరీ నిర్వచనమున కిది చక్కనియుదాహరణము. ఈమె లజ్జచేత తన యౌవన భాగ్యమును బయల్పడనీక గోప్యమొనరింప యత్నించుటచేత జ్ఞాతయౌవన-నవోఢ. ఇందు *రాగము, వ్రీడ యను విభావములును;* నిలుకడలేని శృంగార చేష్టలతో వలపును దాచుకొన యత్నించుటలో ననుభావములును వర్ణితము లగుటవలన చాపలము, అవహిత్థ యనెడిసంచారులు తోచి రసోత్పత్తి జరుగుచున్నది.[1]

---

1. ప్రౌఢదేవరాయని సభలో ముగ్ధానాయికపై శ్రీనాథకవి సార్వభౌముఁడుచెప్పినట్లుగా గల చాటువొకటిద్దే రమ్యమైనదికలదు.

సీ॥ కమనీయ కరపల్లవము మేన గదియంగ
నొయ్యన సాచిన నులికి పడును
ఆలింగనమునకు నక్కునఁ జేర్చినఁ
జేదోయి యురముపైఁ జేర్చుకొనును
చుంబనమ్మున కోష్ఠబింబమ్ము గమకింప
వదనమొయ్య నొకింత వంచుకొనును
గిలిగింత నేతకుఁ గినుకయు సిగ్గును
మొలవంగ గన్నులు మోడ్చుకొనును
అట్టిబాల రతిక్రీడ ననువుపరుప
నేర్పు గల్గునె పరులకు నీకుఁ గాక
రాజ పరమేశ రాజాధి రాజవిభవ
లక్షణోపేంద్ర ప్రౌఢరాయక్షితీంద్ర.
(చాటుపద్య మణిమంజరి సం. 2 పు. 110)

ఇట్లే

"ఏమీ నెరంగని నన్ను నింత సేసెనే వీఁడు
సామము నేరిపె నంటా చవులుపుట్టించెనే" (3-609)

అనెడి పరాశిరాగపదమునగూడ నాయికావాక్యముగ స్వీయా – ముగ్ధ–నవోఢ వర్ణితయైనది. అందు స్మృతి యనెడి సంచారీవర్ణనమున రససిద్ధి యగుచున్నది.

ఇట్లే మఱియొకటి -

"ఎందాక నీసిగ్గు లేఁటికిఁ బెంచేవు
పొందులు దొరకెను భోగించరాదా" (17–547)

అను మలహరిరాగపదమున సఖీవాక్యముగా స్వీయా - ముగ్ధ-నవోఢ వర్ణితయైనది. ఇందు విశ్వాసవిశ్రామకారిణియు పార్శ్వచారిణియు నగుసఖి శిక్షావిధిచే నవోఢను పతి కున్ముఖురాలినిగఁ జేయుచున్నది.

## స్వీయ - మధ్యా - అతివిస్రబ్ధనవోఢ:-

లలిత

"తాలిమి చక్కనగాని తమక మెంతైనాఁ గద్దు
మేలమాడవయ్య చెలి మీఁదమీఁద నున్నది॥
వనితపువ్వులు వేసి వలపునీపైఁ జూసి
తనుదానె సిగ్గువడి తలవంచీని
మనసునీపైఁ బెట్టి మాటలు మాతోనాడీ
పెనఁగి పిలువవయ్య పేరుకొని నీవు ॥
పడతి నీతో నవ్వి పాయపుటాసలు దవ్వి
చిడుముడి సిగ్గుతోడఁ జెమరించీని
కడు నిన్నట్టె చూచి కాయము మాపై వేసీ
వొడివట్టి తియ్యవయ్య వొద్దికతో నీవు ॥
కలికి నీకాలుదొక్కి కమ్మటి నీకు మొక్కి
వలవని సిగ్గుతోడ వడఁబడీని
నెలవై శ్రీవెంకటేశ నిన్నుఁ గూడె తన్నుఁదానె
అలమి పైకొనవయ్య అప్పటికి నీవు"॥ (17-298)

"సమానలజ్జా మదనా మధ్యా" అను రసమంజరీకారుని నిర్వచనము నను సరించి యిందువర్ణిత యైననాయిక స్వీయా-మధ్య. అతివిశ్వాసముచేత లజ్జయును, మదనభావమును సమముగ వ్యక్తీకరించు చుండుటబట్టి అతివిస్రబ్ధనవోఢ. ఇందు "సంభోగవిషయకేచ్ఛావిశేష"మగురతి విభావముగా స్వేద మనెడిసాత్త్వికభావము వర్ణితమైనది.

ముగ్ధా మధ్యా నాయికలను వర్ణించినట్లే తాళ్ళపాకకవులు బహుభంగుల స్వీయా-ప్రగల్భా నాయికనుగూడ నభిమానముతో వర్ణించినారు. ఇట్టిపదములు వందలకొలఁదిగా నున్నవి. మచ్చునకుఁ గొన్నిటినిమాత్ర ముదాహరింతును.

## స్వీయా - ప్రగల్భ :-

శంకరాభరణము

"మేలే నీభాగ్య మలమేలుమంగా అదె
ఆలరి నీపతి మెచ్చె నలమేలుమంగా॥

ఎంచరాక పతితోడ నిచ్చకములాడి నేర్పు
మించితివి గదే యలమేలుమంగా
వంచనఁ బ్రియాలు సేసి వడి నాతని చిత్తము
అంచెల దక్కఁ గొంటివే అలమేలుమంగా॥

తఱితోడ మంచి జాణతనపుమాటల నెల్ల
మెఱసితి గదే యలమేలుమంగా
తెఱఁగున నీపతికి తెల్లనినవ్వులు చల్లి
అఱచేతిమణి వైతి వలమేలుమంగా॥

వొక్కటై శ్రీ వేంకటేశు వురమెక్కి యేపొద్దు
మిక్కుట మైతివే యలమేలుమంగా
యెక్కువఁ బదారువేలు యింతుల మతనికి మ
మ్మక్కర మన్నించి తలమేలుమంగా॥ (17-512)

పతిమాత్రవిషయకేళీకలాపకోవిద యగుటచేత నిందువర్ణిత యగునాయిక దివ్యా – స్వీయా-ప్రగల్భ. నాయకుఁడు దక్షిణుఁడు. నాయిక తన నేర్పుచేత పతిని వశవర్తినిగాఁ జేసికొనినది. ఈ పదమును బరికింపుఁడు.

సామంతం

''మదము దొలగెడియట్టి మంచివయసున మనకు
తుదలేని కోరికలు దొరకుచెన్నడురా॥
ఉదుటు జనుదోయి నీవురముపైఁ దనివార
నదిమి మోమున మోము నలమి యలమి
వదలైన నీవితో వాలుగన్నుల జక్కి-
లొదవనిమీఁద నే నొరగుచెన్నడురా॥
గరగర నీ కురులలో కస్తూరివాసనలు
విరులతావులతోడ విసరగాను
తిరువేంకటాచలాధిపుఁడ నినుఁ గూడి నే
నరమరచి సదమదము లౌట యెన్నడురా॥'' (3-54)

ఇందు నాయిక స్వీయా-ప్రగల్భా-రతిప్రీతిమతి వర్ణితయైనది. ఇందలి పదసంయోజనమున రత్యతిశయము వ్యంజితమగుచున్నది. ఇట ప్రియవిరహ మాలంబనవిభావము. ప్రియసంస్మృతి యుద్దీపనవిభావము. "తుదలేని వేడుకలు దొరకుచెన్నడురా''అనుటలో చింతయు నభిముఖీభావమును అనుభావములు. వీనిచే నౌత్సుక్య మనుసంచారిభావము వ్యక్త మగుచున్నది. ఇట్టిదే మఱియొక పదము-

## స్వీయా- ప్రగల్భా-రతిప్రీతిమతి:-

సౌరాష్ట్రం

ఎంత తమకమో చెలి కేమి చెప్పేది
వింతవింత వేడుకలు వెల్లివిరిసేని॥
సారె జారుంబయ్యెదతో సగముచన్నులు చూపె
నేరుపుల మాటలాడీ నెలంత నీతో
కూరుములు గొనరుతో గోరఁ జెమ్మట చిమ్ముతా
తారుమారై వలపుల తన్నుందా నెఱుంగదు॥(3-122)

ఇందు ప్రళయస్వేదాదిసాత్త్వికభావములు వర్ణితములు. మదవిక్షేపాది శృంగారచేష్టలు వర్ణితములు. ప్రియాప్రాప్తి విభావమై, చింత యనుభావమై ఔత్సు

క్యాధ్యానములు వ్యజ్యమానము లగుచున్నవి.

"జవ్వనంపు మదమున జడిసేటి తరుణి-
పువ్వులపాన్పుమీఁదం బొరలెఁ జూడరే॥." (3.371)

అను ఆహిరి రాగపదముకూడ నిట్టిదే. సురతానందసమ్మోహిత కీ దిగువ పదమును దిలకింపుఁడు.

## స్వీయా-ప్రగల్భా-సురతానందసమ్మోహిత : (దివ్య)

సాళంగనాట

"పలుకుఁదేనెలతల్లి పవళించెను
కలికితనముల విభునిఁ గలసినదిగాన॥
నిగనిగనిమోముపై నెఱులు గెలఁకులఁ జెదర
పగలైనదాఁకఁ జెలి పవళించెను
తెగని పరిణతులతోఁ దెల్లవారినదాఁక
జగదేకపతిమనసు జట్టిగొనెగాన॥
కొంగుజాఱిన మెఱుఁగుగుబ్బ లొలయగఁ దరుణి
బంగారుమేడపైఁ బవళించెను
చెంగలువ కనుగొనల సింగారములు దొలక
నంగజగురునితోడ నలసినది గాన॥
మురిపెంపుసటునితో ముత్యాలమలఁగుపై
పరవశంబున తరుణి పవళించెను
తిరువేంకటాచలాధిపుని కౌఁగిటఁ గలసి
యరవిరై నునుఁజెమట నంటినదిగాన"॥ (4-74)

ఇందు "పలుకుతేనెలతల్లి" యనుటచేత నాయిక దివ్యా-స్వీయా-ప్రగల్భ-రత్యనంతరస్థితి యందు మనోజ్ఞముగ వర్ణితయై తృప్త యగునమ్మవారి రసమయమూర్తి మన కన్నులఁ గట్టిన ట్లున్నది. శృంగారరసాధిదైవతము శ్రీమహావిష్ణువే యగుట నాతని మూర్త్యంతరమే యగుశ్రీవేంకటాచలాధీశుఁ డిందు నాయకుఁడై వర్ణితుఁ డగుటనుబట్టి యిందలి దివ్యశృంగారవర్ణనకుఁ బరిపూర్ణత్వ మబ్బినది. ఇట్లే ప్రగల్భానాయిక నింక నెన్నోవిధములఁ జిత్రించినారు తాళ్ళపాకవారు చూడుఁడు.

## స్వీయా-ప్రగల్భా-జ్యేష్ఠాధీర :-

భైరవి

"ఎంత నేరుపరివి ని న్నేమందుమే
పంత మాడె యాపె నింత భ్రమయించెఁ జూడరే॥
చలపాది యాపె నా సంగడినె వుండఁగాను
వెలది రమణుఁ డొక్క విధము సేసెనే
అల చుక్కల నెంచవె యని దాని నేమరించి
కళ లంటి నన్ను బిగ్గెఁ గాఁగిలించెనే॥
మొక్కలాన యాపె నాతో మొనసి సాటికి రాఁగా
చక్కని రమణుఁ డొక్క జాడ సేసెనే
అక్కడ దాఁగిలిముచ్చులాడి దాని గన్ను మూసి
దక్కి నామో వాని నాకుఁ దమ్ములము పెట్టెనే"॥ (16-94

ఇందు నాయకుఁడు దక్షిణుఁడు. ఇరువురుసతుల నేకకాలమున సమీపించి నాయకుఁ డందొకతెను వంచించి వేరొకతెను శృంగారవిషయమున సంభావించెను చతురుఁడై నాయకుఁడు గావించిన వంచనను గూర్చి సంభావిత యగునాయిక తోడివారికి పిదప వివరించుచున్నది. ఇందు నాయిక పతియొక్క స్నేహాధిక్యమునకుఁ బాత్రయైనది కనుక "పరిణీతత్వేసతిభర్తురధికస్నేహాజ్యేష్ఠా" అను రసమంజరీనిర్వచనమునుబట్టి-స్వీయా-ప్రగల్భా-జ్యేష్ఠాధీర. అట్లే పతియొక్క అల్పస్నేహమునకుఁ బాత్రయైన రెండవనాయిక కనిష్ఠ.

ఇట్లు తాళ్ళపాకవారిపదములలో సన్నియు నాయికాసఖీవాక్యములలోనే గాక నాయకముఖమునగూడఁ గొన్నివర్ణన లున్నవి. ఈ క్రింది పదములనుఁ జూడఁదగును.

## స్వీయా-ప్రగల్భా-సౌందర్యగర్వితా:-

సాళంగ

ఏల తిట్టేవే నన్ను నెంత గబ్బిదానవే
మేలని పొగడితేను మెచ్చవద్దా నీవు॥
చిక్కనివెన్నెలతేట సెలవినె వుండఁగాను
చక్కని నీమోమునే చంద్రుఁ డంటినే

నిక్కినిక్కి మూతులెత్తి నీమొగాన కెగరఁగా
జక్కవపిట్టలు నీచన్ను లంటినే॥
కామించి మురిపెముతోఁ గదలుచు నుండఁగాను
రామ నీ పిరుఁదు మరురథ మంటినే
కోమలపుఁబోలికలు గురుతులు చూపఁగాను
తామెరలనె పాదాలు తగ నంటినే॥
జాతిమెఱుఁగులతోడ సరివచ్చి వుండఁగాను
నీతురిమె రాశియైననీలా లంటినే
నీతితో నన్నుఁగూడితి నేను శ్రీ వేంకటేశుఁడ
నీతనువే బంగారు నెలవంటినే"॥ (17-459)

రసమంజరీ శృంగారమంజరీకారులు స్వీయానాయికాదులకుఁ జెప్పిన వక్రోక్తి గర్వితాభేదములందలి సౌందర్యగర్వితకు పైపదము చక్కని యుదాహరణము. నాయకుఁడు నాయికాసౌందర్యము నెన్నియుపమలతో నెంచి వర్ణించినను తదౌపమ్యముల నొల్లక తిట్టి తిరస్కరించుటచేత నిట నాయిక స్వీయా - ప్రగల్భా - ధీర - సౌందర్య గర్విత. నాయకుఁడు ధృష్టుఁడు.

## స్వీయా-ప్రగల్భా-ధీర-రత్యుదాసీన:-

ధన్నాసి

"మోనాన నుందాన వేమే ముని వై తివా
మేనులు సోఁకిన మందెమేళ మైన లేదా॥
అలిగితే నేమాయె అట్టె వూరకుండ నేలా
పలుకుల నైనఁ దూరఁ బాడిగాదా
మలయుచుఁ బొట్లాడే మాసటీలు నైతము
అలరి పగలుచాటే రదియైన లేదా॥
రాకుండితే నేమాయె రతినాపై నెరపి
దాకొని చెప్పంపనైనఁ దగవుగాదా
కాకుగాఁగొట్లాడేటి కడవారునైతము
ఆకడఁ జేతులు చాఁతు రదియూలేదా॥

పంతమైతే నేమాయ పైకొని నే వేఁడుకోఁగా
అంతటికోపము దీరనైనఁజెల్లదా
వింతగా శ్రీవేంకటాద్రివిభుఁడ నింతే నేను
యింతలో నన్నుఁగూడితి యెర వింత లేదా"॥ (17-25)

రత్యౌదాసీన్యము వహించుటవలన నిందు నాయిక స్వీయా-ప్రగల్భా-ధీర. నాయకుఁడు ధృష్టుడు.

తాళ్ళపాకవారి శృంగారపదములలో త్రివిధనాయికలలో స్వీయ ప్రధానముగా వర్ణితయై యవాంతరప్రకారాంతరభేదములచేత ననేకవిధముల నర్థే సాక్షాత్కరించు చుండును. ఇట్లే నాయకుఁడుకూడ నెడనెడ ననుకూలుఁడుగనో, దక్షిణుఁడుగనో మఱి కొన్నియెడల ధృష్టుఁడుగనో ప్రత్యక్ష మగుచుండును. పైని వివరించిన తీరుననే కాక వీరిపదములం దవస్థాభేదములచేత నాలంకారికుల రచనలలో అష్టవిధములుగను నవవిధములుగను పేర్కొనఁబడిన నాయికాదిభేదములలోఁ గొన్నిటికిఁ గూడ లక్ష్యము లనఁదగినవి పదులకొలఁదిగ నున్నవి. మచ్చునకుఁ గొన్నింటి కుదాహరణము లెత్తి చూపుదును.

## అ వ స్థా నా యి క లు

**1. వాసకసజ్జిక (స్వీయా-ప్రగల్భా) :**

కాంభోది

"ఎప్పుడు గాని రాఁడో యెంతదడవాయ కాలి
చప్పుడాలకించి మతి జల్లురనెనమ్మా ॥
ఇద్దర మదరిపాటు ఏకాంతాన నాడుకొన్న
సుద్దులు దలఁచి మేను చురుకనె నమ్మా
పెద్దగాఁ గస్తురిబొట్టు పెట్టిన నాతఁడు గోర
తిద్దుట దలఁచి మేను దిగులనెనమ్మా ॥
పాయక యాతఁడూ నేనూఁ బవ్వళించేయింటివంక
బోయిపోయి కడుఁ జిన్నఁబోతి నోయమ్మా
తోయపు గుబ్బల చన్నుదోయిమీఁద వాఁడొత్తిన
పాయపుఁ జంద్రులఁ జూచి భ్రమసితినమ్మా"॥ (12-46)

ఇందు నాయిక ప్రియునిరాకకై పడకింటికడ వేచియుండుట వర్ణితమై యుండుట చేత- వాసకసజ్జిక. పదమున విరహోద్దీపనవిభావసామగ్రి పుష్కలముగ వర్ణితమై యనుభావబలమున చింతాస్మృతు లనుసంచారులు వ్యంజితము లగు చున్నవి.

**2. అభిసారిక (స్వీయా - ప్రగల్భా) :**

ఆ హి రి

"కామించి నీవరుగఁ గలయు నాయకుఁడు నేఁ
డేమి భాగ్యము నేసెనే తరుణి ॥
కాఁగినగుబ్బలమీఁద కమ్మఁజెమటలఁ దొప్పఁ
దోఁగిన బయ్యెదకొంగు దూలగను
వేఁగైనకొప్పున క్రొవ్విరులు దురిమి విఱ్ఱ
వీఁగుచు నీవెటు వొయ్యేవే తరుణి॥
ఒప్పైనశిరసుమీఁదఁగుప్పళించిన జవ్వాది
చిప్పిలి చెక్కులవెంటఁ జిందఁగను
అప్పళించిన కస్తూరి లప్పలురాలఁగ నీ
విప్పు డెక్కడికి నేగేవే వో తరుణి" ॥ (12-142)

సహజ మగువేషభూషాదికముతోడనే ప్రియు నభిసరించి వెడలినది కావున నిందు నాయిక స్వీయాభిసారిక— ప్రగల్భ.

**3. ఖండిత (స్వీయా - ప్రగల్భా) :**

ము ఖా రి

"దానిసాహసము మేలు తరువాత నీవు మేలు
పూనిన యారడికి ని న్నొడిగట్టించినది ॥
రవ్వగా మేనెల్లా జీరలుగాఁ జేయించుక
మవ్వపు నాయెదుట నీవు మలసేవు
నవ్వులకై నాను నామాట మీరనినిన్ను
యెవ్వతెరా నిన్ను నింతగాఁ జేసినది ॥
చిగురు నీమోవియెల్లా చిల్లులుగాఁజేయించుక
వెగటుగా నాయెదుట విఱ్ఱవీఁగేవు

తగవులకైనా జవదాఁటని నిన్నుఁదెచ్చి
జగ నీపై యింత సేసి చలివాపెను" ॥ (16-97)

అన్యోపభోగచిహ్నితుఁడై వచ్చిననాయకుని జూచి చింతాసంతాపములు పెనగొన పరుషముగా మాటాడుచున్నదిగాన ఇందు నాయిక ఖండిత–ప్రౌఢ. 'నవ్వులకైనాను మాటమీరనివాఁ'డని నాయకుఁడు వర్ణితుఁ డగుటచే నాయిక స్వీయ. అట్టినాయకుఁడే తనసతికి వంచనచేసి వేరొకతెను గూడి నిర్భీకుఁడై మఱి వచ్చినవాఁ డగుటచేత– ధృష్టుఁడు. ఇందు ప్రియాపరాధము విభావము. పరుష వచన మనుభావము. వీనిచే రోషము (అమర్షము) వ్యక్త మగుచున్నది.[1]

## 4. కలహాంతరిత (స్వీయా–ప్రగల్భా) :

శుద్ధవసంతం

"ఎంతవాఁడ వైన నిన్ను నింత సేసితి
యింతిని నాయపరాధా లె ట్టోరిచేవయ్యా॥
చేర రమ్మంటే రానైతి చెక్కులు చేత గిల్లితి
గారవించగా నిన్నుఁ గసరితిని
కూరిమిఁ గొసరఁగాను కోపాన జంకితిని
యీరీతి నాయపరాధా లె ట్టోరిచేవయ్యా".
మనసునొప్పించితిని మాటలేల్లా నాడితిని
చెనకఁగావద్దని పైఁజెయివేసితి
పెనఁగితినీతోడఁ బ్రేమము రెట్టించఁగాను
యెడ సినాయపరాధాపెట్టోరిచేవయ్యా'' (17—565)

"పతి మవమత్య పశ్చాత్ పరితప్తా కలహాన్తరితా" అని రసమంజరీనిర్వచనము. ఇందు నాయిక పతిని తిరస్కరించి పిదప పశ్చాత్తాపమున తన్నుఁదాను నిందించుకొనుచున్నదిగాన – కలహాంతరిత – స్వీయ – ప్రగల్భ. ప్రియవిరహ మిందు

1. ఇందలినాయిక పారిజాతాపహరణమందలి సత్యభామను దలఁపించుచున్నది. "కలలోననైన నవ్వులకైన నామాట జవదాట వెఱచునో చంద్రవదన" అని యామెనోటఁ బలికించిన నంది తిమ్మనార్యునిపలుకు లిట సంధానించుకొనఁ దగును.

విభావము. నాయిక తానే యపరాధి ననుకొనుటలో స్వాపకర్షభాషణ మనుభావమై యున్నది. దీనిచేత నాయికాదైన్యము వ్యంజిత మగుచున్నది.

**5. ఉత్క (స్వీయా - ప్రగల్భ) :**

మధ్యమావతి

"విన్నవించవే వోరమణి ! విభునికి వింత లింకనేలే
వున్నతిఁ దన్ను నేనేమైన నంటినా వోరుచుకొమ్మనవే॥
చెలులలో నన్నే చేపట్టినవాఁ డలుగనేటికినే
వలచి తా నాకు నిచ్చినబాసలు వాకిటనేపోయెనా
తలఁచితలఁచి తాపాన నే నిట్టె తలఁకుచునుండఁగా
కలయఁ దా రాక యెడమాటలనె కాఁక రేఁచనేలే ॥
యెప్పుడు నావద్దఁ బాయనివాఁడు నేఁ డేమిటికిఁ బోయెనే
తప్పెనో నామీఁదిమోహము తనకు తామసించనేలే
ముప్పిరిగొన్నట్టి జవ్వనము నే మోవలేక వుండఁగా
యిప్పుడె విచ్చేసి నన్నుఁ గలయక యేమిటికున్నాఁడే"॥

(16-2)

"పతిరాక తడవుండ నుత్కంఠ దాల్చునింతి"యై యాతనిరామికి హేతువుల నరయు చుండిసకారణమున నిందు వర్ణిత యైననాయిక ఉత్క-స్వీయ. నాయకుఁడు రానందులకు కారణమును ప్రకాశముగా సఖుల నడుగుటచేత ప్రగల్భ. ప్రియవిరహ మాలంబనవిభావముకాఁగా "తలఁచితలఁచి" యనుటలో ప్రియ సంస్కృతి యుద్దీపనవిభావముకాఁగా "ఏమిటికి రాకున్నాఁడే" అనుచింత అనుభావముకాగా నిందు ఔత్సుక్య మనెడిసంచారి వ్యక్తమగుచున్నది.

**6. స్వాధీనపతిక (స్వీయా-ప్రగల్భ) :**

పాడి

"అలమేలుమంగ నీవభినవరూపము
జలజాక్షుకన్నులకు చవు లిచ్చేవమ్మా
గరుడాచలాధీశు ఘనవక్షమున నుండి
పరమానంద సంభరితవై

నెరతనములు చూపి నిరంతరము నాధుని
హరుషించఁగఁ జేసి తొగదమ్మా॥
శశికిరణములకు చలువలచూపులు
విశదముగా మీఁద వెదచల్లుచు
రసికతపెంపునఁ గరఁగించి యెప్పుడు నీ
వశము చేసుకొంటి వల్లభునోయమ్మా॥
రట్టడి శ్రీవేంకటరాయనికి నీవు
పట్టపురాణివై పరఁగుచు
వట్టిమాఁకులిగిరించు వలపుమాటల విభు
జట్టిగొని వురమున సతమైతివమ్మా॥ (12-159

భర్తృవాల్లభ్యాతిశయ మిందు వర్ణితము-"వశముచేసికొంటి "వల్లభునోయమ్మా" అనుటచేత నాయిక స్వాధీనపతిక-ప్రగల్భ. అలమేలుమంగ యగుటచేత దివ్య.

## 7. విప్రలబ్ధ (స్వీయా - ప్రగల్భా):

సామంతం

"పొద్దిక నెన్నడు పొడుచునో పోయినచెలి రాదాయను
నిద్దుర కంటికిఁ దోఁపదు నిమిషం బొకయేఁడు ॥
కన్నుల నవ్వేడి నవ్వులు గబ్బితనంబుల మాటలు
నున్నని యొయ్యారంబులు నొచ్చినచూపులును
విన్నదనంబుల మఱపులు వేడుకమీఱినయలపులు
సన్నపుఁజెమటలుఁ దలఁచిన ఝల్లనె నామనసు॥ (12-138)

ఇందు నాయిక ప్రియునిరాకకై వేచివేసారుట వర్ణితమైనది. చెలినిగూడ పంపి యుండినదిగాని ప్రియుఁ డింకను రాఁడాయెను. ప్రియాప్రాప్తిచే నాయిక కుందుచున్నదిగాన ఇట వర్ణిత విప్రలబ్ధ యనవచ్చును. 'సంకేతనికేతనే ప్రియ మనవలోక్య సమాకులహృదయా విప్రలబ్ధా" అని రసమంజరీకారుఁడును, అంతకుఁ బూర్వాలంకారికులును విప్రలబ్ధకు లక్షణమును వివరించుచు 'సంకేతస్థానము' నకుఁ ప్రాముఖ్య మిచ్చినారు. కాని శృంగారమంజరీకారుఁడుమాత్ర మీరసమంజరీ

నిర్వచనమును విమర్శించి 'సంకేత' విషయము నందుండి తొలఁగించినాఁడు. ఆతని దృష్టిలో స్వీయావిషయమున 'సంకేత'మునకుఁ బ్రసక్తి లేదు. ఆ నాయిక యున్నచోటనే ప్రియునికొఱకు వేచి యాతఁడు రామిచే విరహాతిశయ మనుభవించుచున్నది కావచ్చును.[1]

శృంగారమంజరీకారుని లక్షణ మిట్లున్నది- 'వంచనా ప్రయుక్త విరహవేదనావతి విప్రలబ్ధా". కావున పైని పేర్కొన్న ఉదాహరణములవంటి "స్వీయా విప్రలబ్ధా" నాయికా స్వరూపమే శృంగారమంజరీకారుని లక్షణమునకు దోహద మిచ్చియుండు నని తలఁపవచ్చును. ఏలన తాళ్ళపాకవారి శృంగారపదములందలి నాయిక సర్వత్ర స్వీయమే. అందును దివ్య. అట్టి జగజ్జనని దివ్యశృంగార వర్ణనసందర్భమున 'సంకేత' స్థలముల ప్రసక్తియే యుండదు. ఇఁక వంచన యన మఱి సర్వాంతర్యామి యగుపరమాత్ముఁడు తా నంతకుఁ బూర్వము ప్రత్యక్షముగ చవులిచ్చి యుండినసతి కాసమయమునవచ్చి వేడుక నింపకుండుట వంచనయే యగునుకదా! కావున నీ యుదాహరణమందలి నాయిక విప్రలబ్ధకాఁదగును. ఈ విప్రలబ్ధ నాయికావిషయ మిట్లు కొంతగా గుర్తింప నగునేమోగాని దిక్కాలాబాధిత మైన పరమాత్మునిదివ్యశక్తి సర్వాంతర్యామిరూపమున జీవకోటికెల్ల సామీప్య సాయుజ్యముల నిచ్చుచునే యుండఁగా నిఁక ప్రోషితభర్తృకా ప్రవత్స్యత్పతికాది నాయికాభేదములుమాత్రము తాళ్ళపాక కవుల దివ్యశృంగార వర్ణనప్రధానములైన పదములం దంతగా గోచరములు కావు. తుదిని పేర్కొన్న ఈ యవస్థా నాయకలకు లౌకికశృంగారవర్ణనమున గలస్థానము దివ్యశృంగారవర్ణనమునుండుటకు వీలులేదేమో అనుకొందును. వైష్ణవాలంకారికు లగురూపగోస్వామి ప్రభృతులు కృష్ణరతివిషయమున సామాన్యాభేదములను బరిగణింపక స్వీయా పరకీయా నాయికలనుమాత్రమే పరిగణించినారు. తాళ్ళపాకకవుల దివ్యశృంగార

---

1. "The author of Sringaramanjari criticises Bhanudatta's definition that it is not applicable to a Sviya or Samanya who do not go to a trysting place, but are expecting union or meeting at their own residence and are disappointed by the lover's failure to present himself; Thus the Sringaramanjari really enlarges the scope of the Vipralabdha and offers its definition that she is one in the pang of separation consequent on disappointment caused by the lover".
(See Introduction to Sringaramanjari of Saint Akbarshah-by Dr. V. Raghavan. P-79. Pub. 1951)

పదములలోను నట్లే మనము అవస్థానాయికలను లెక్కించుపట్టున ప్రోషితపతికా ప్రవత్స్యత్పతికాభేదముల నంత విస్పష్టముగా గుర్తింపఁజాలనికారణమున వానిని విడచి విప్రలబ్ధనాయికనుమాత్రమే స్మరింతుము. ఈ పదమును తిలకింపుఁడు.

**పా డి**

"ఇదివో యింతట వరం బీవయ్యా
కదిసి ప్రత్యక్షంబు గావయ్యా చెలికి॥
తరుణి నిను నెడఁబాసి తపము సేయఁగఁ దొడఁగె
విరహంపు నులిగురుల విరిజడలతో
అరమోడ్పు కనుఁగొనల ఆనందములతో
బరువైన నిట్టూర్పు పవనముతోడ ॥
ముదిత నినుఁ దలపోసి మునిమార్గమునఁ జెలఁగె
మొదల నిబ్బెరపాటు మోనంబుతో
వదలని పులకగముల వనవాసముల తోడ
అదనెరఁగని నిరాహారంబుతోడ ॥
ఉవిద నీతోఁగూడి యోగంబు సాధించె
వివరంబుతోడ శ్రీ వేంకటేశ
నవక మగురతుల నానావిధంబులతోడ
కవగూడియున్న చిరకాలంబుతోడ ॥ (13-290)

ఇందు నాయిక సుదీర్ఘకాలవియోగముచేత 'మునిమార్గమునఁ జెలఁగె' ననుటలో లౌకికదృష్టిలో ప్రియుని ప్రవాస మూహ్య మగునేమోగాని శ్రీ వేంకటేశ్వరుని మీఁది రతి యిందు వర్ణిత మగుటచేత నిట ప్రోషితభర్తృక కాక నాయిక విప్రలబ్ధ యనుకొనుటయే సమంజసము.

ఇట్లు పైని పేర్కొనఁబడిన యవస్థానాయికలును మరల నవాంతర ప్రకారాంతరభేదములచేత నింక నెన్నో తెఱఁగుల నగుచున్నారు. ఆయాభేదముల కన్నిటికినిఁగూడ తాళ్ళపాకవారి పదములలో లక్ష్యములుగా నుదాహరింపఁ దగినవి పుష్కలముగ గలవు. ఆ ప్రయత్న మన్యత్ర సమగ్రముగ జరుగవలసియున్నది. ప్రస్తుతమున కింతమాత్రము చాలును.

**చతుర్విధ నాయికలు :**

తాళ్ళపాకవారి శృంగారపదములం దీపైని చెప్పఁబడిన చేష్టావిశేషభేద ముల మూలమున నేర్పడిన నాయికాభేదములనుగూర్చి మాత్రమే గాక కొక్కోక రతిరహస్యాది కామశాస్త్రగ్రంథములందు ప్రపంచింపఁబడిన హస్తిన్యాది చతు ర్విధ నాయికాభేదములనుగూర్చి కూడ కొంత తెలియనగుచున్నది. ఈ విభేద ములనుగూర్చి కామశాస్త్రగ్రంథములందే కాని ప్రాచీనాలంకారికగ్రంథము లందు కానరాదు. శృంగారమంజరీకారుఁ డొక్కఁడే ఈభేదములనుగూర్చి తొలుత ప్రస్తావించిన యాలంకారికుఁడు. సంస్కృత సాహిత్యమునం దంతగా కానరాకు న్నను ప్రాచీనాంధ్ర కర్ణాటక సాహిత్యములం దీభేదములను గూర్చిన ప్రశంస లున్నవి. ఈ యంశములనుగూర్చి సవిమర్శముగ డా॥ రాఘవన్‌గారు తమ శృంగారమంజరీపీఠికలో చర్చించి యున్నారు.[1] వారి యభిప్రాయము ననుసరించి కర్ణాటాంధ్రసాహిత్యాలంకారికులే ఈ విభేదమును బాగా ప్రచారమునకుఁ దెచ్చిన వారు. హస్తిని, చిత్తిని, పద్మిని, శంఖిని అను నీ నాలుగుజాతులనుగూర్చి తాళ్ళ పాక కవు లిట్లు వ్రాసియున్నారు.

**ఆహిరి**

"కుందనపుమై గొల్లెత తా
నెందును బుట్టని యేతరి జాతి॥
కప్పులుదేరెటి కస్తురి చంకల
కొప్పెరగుబ్బల గొల్లెత
చప్పుడు మట్టెల చల్ల లమ్మెడిని
అప్పని ముందట హస్తిణి జాతి ॥
దుంపవెంట్రుకల దొడ్డతురుము గల
గుంపెననడపుల గొల్లెత
జంపులనటనలఁ జల్ల లమ్మెడిని
చెంపల చెమటల చిత్తిణి జాతి॥

1. "It is significant that like The Sringaramanjari, the two works Sringaradipika - Ratirahasya, and the Sivatatva-Ratnakara, which mention this classification are works produced in the Deccan and South India under the influence of Telugu and Kannada Literature."
See Introduction to Sringaramanjari of Akbarshah by Dr. V. Raghavan P. 36.

వీపున నఖములు వెడ వెడ నాఁటిన
కోపపుఁజూపుల గొల్లెత
చాఁపున జట్టిగఁ జల్ల లమ్మేదిని
చాఁపెటి యెలుగున శంకిణిజాతి॥

గారవమున వెంకటపతి కౌఁగిట
కూరిమిఁ బాయని గొల్లెత
సారెకు నతనితో చల్ల లమ్మేదిని
భారపుటలపుల పద్మిణిజాతి" ॥. (12-92)

ఇట్లే మఱియొక పదము :

ఆహిరి

"అన్నిజాతులుఁ దానె యై వున్నది
కన్నులకలికికి మాయగరచెనో యనఁగ॥
కన్నె శంఖిణిజాతి కాఁబోలు వీఁపునను
సన్నపు మదనాంకములు జడిగొన్నవి
వన్నెలుగ వలరాజు వలపు తలకెక్కించ
పన్నినటువంటి సోపానములో యనఁగ ॥
తెఱవ దలపోయ చిత్తిణిజాతి గాఁబోలు
నెఱులు విచ్చుచు వీధి నిలుచున్నది.
నెఱతనము మరుఁడు తను నిండనేసినయంప
గురులిన్ని యనుచు లెక్కలుపెట్టుగతిని॥
కాంత హస్తిణిజాతి కాఁబోలు కరమూలము
లంతకంతకు నలుపులై యున్నవి
పంతంపు మరుఁడు తన భండారమిండ్లకును
దొంతిగా నిడిన కస్తురిముద్ర లనఁగ ॥
ఘనత పద్మినిజాతి గాఁబోలు నీలలన
తనువెల్ల పద్మగంధంబై నది

మినుకుగా మరుఁడు తామెరలమ్ములనె మేను
కనలించి వడిఁ బువ్వుగట్టెనో యనఁగ ॥
ఇదియు జగదేకమోహిణి దానె కాఁటోలు
కదలు కనుగవకెంపు కలిగున్నది
వదల కిటు వేంకటేశ్వరుని కుంకుమపూత
చెదరి చెలికనుఁగొనలఁ జిందెనోయనఁగ" ॥ (12-123)

ఈ కవులు పై నాలుఁగుజాతులతోపాటు 'మోహిణి' యను నొక జాతినిగూడ క్రొత్తగఁ జేర్చినారోయేమో। కామశాస్త్రగ్రంథములం దీ'మోహినీ'జాతిపేరు కానరాదు. ఈ పదములం దాయాజాతులకు వర్ణితములైన శారీరక మానసిక గుణాదులు కామశాస్త్ర గ్రంథములందును దరువాత శృంగారమంజరియందును గలయట్లే యున్నవి.[1] తెలుఁగున నన్నిచోడని కుమారసంభవముతరువాత నీజాతులను గూర్చి యిట్లు విపులీకరించినకవులు తాళ్ళపాకవారే యనవచ్చును.

**శృంగారము - సంభోగ విప్రలంభములు :**

సంభోగ విప్రలంభము లని యిరుతెరఁగులఁగల శృంగారమును దాళ్ళపాక కవులు తమ పదరచనలలో విస్తారముగఁ బోషించినారు. సంభోగశృంగారవర్ణనమున రతిపారవశ్యముతోపాటు విశిష్టాద్వైతానుభూతినిగూడ చక్కఁగ జోడించినారు. అట్లే విప్రలంభశృంగారమును 'అఖిలాషేర్ష్యావిరహప్రవాసకారణ పరిణతిచేఁ' జరగునాల్గుగతుల వర్ణించియున్నారు. ఇంచుక సోదాహరణముగ విశదీకరింతును.

**సంభోగ శృంగారము :**

సామంతం (లేక దేసాళం)

పొదలిన వీడెపుఁ బుక్కిళ్లో—తమ
చొదుకుల చెమటల చొక్కిళ్లో ॥
అముకొనిన యధరామృతవేళల
మోముల మోముల మొక్కిళ్లో
కామినుల మకరికా పత్రమ్ముల
చీమలదొంతర చెక్కిళ్లో ॥

---

1. ఈ జాతుల గుణసందోహముల నెరుఁగుటకు చూ. శృంగారమంజరీ పీఠిక పు. 38-39. డా॥ వి. రాఘవన్.

కయ్యాపుఁగౌఁగిటఁ గలికిరచనలను
నెయ్యాపుఁ బులకల నిక్కుళ్లో
ముయ్యాని మోహపు ముచ్చట మురిపెపు
తొయ్యలిపాదపుఁ దొక్కుళ్లో ॥
మొలకలేనగవు మోముల గోళ్ల
నులిమెటి వదనపు నుక్కుళ్లో
అలమేల్మంగకు నావేంకటపతికి
తలఁపు లోసంగిన దక్కుళ్లో ॥" (12-31)

రత్యుపక్రమ మిందు చుంబనము, ఆలింగనము, సమాగమము నను క్రమమున వర్ణితమైనది. ఇటఁ బ్రియసన్నిధి విభావము. రోమాంచాదు లనుభావములు. వీనిచే హర్షము వ్యజ్యమాన మగుచున్నది. ఇట్లే సంభోగశృంగారము నీకవులు పారవశ్యముతోఁ జిత్రించిరి.

ఈ పదమును దిలకింపుఁడు-

శంకరాభరణము

"ఏమి చెప్పేమమ్మా మన మిద్దరి కింక బుద్ధులు
తాముందాము నేకమట తమకములు వేరు॥
తనువులే వేరుగాని తలంపు లొక్కటెపో
అనుంగురమణికి నంగనకును
కనుంగొనలే రెండు కనుచూపు లొక్కటెపో
పెనగొన్న భావనలె భేద మింతె కాని॥
ప్రాయములే వేరుగాని ప్రాణము లొక్కటెపో
చాయల విభునికిని సతికిని
ఆయెడఁ జేతులు రెండు అంటుకౌఁగి లొక్కటెపో
యీయెడ వినయములె యిన్నే సికాని॥
భావపురతులె వేరు పరవశ మొక్కటెపో
శ్రీవెంకటపతికిం జెలియకును
ఆవల మోవులె వేరు అధరామృత మొక్కటె
కావిరి గళలు పెక్కై కమ్ముకొనెఁగాని॥" (3-210)

నాయికానాయకుల సంభోగపారవశ్యము నతిరమణీయముగ నిటఁ జిత్రించినారు కవులు. తనువులే వేరుగాని తత్సమయమున గలుగు తాదాత్మ్యానుభూతి మాత్ర మొక్కటే యనుశృంగారభావన నాధ్యాత్మికముగ విశిష్టాద్వైతమతానుభూతితోఁ జిత్రించిరి. జీవపరమాత్మలభేదము నంగీకరించుచునే సంయోగ సమయమున తదనుభూతియందుమాత్ర మద్వైతమునే గుర్తెరుఁగుట విశిష్టాద్వైతుల వైశిష్ట్యము. ఇం దావైశిష్ట్య మున్నది. పై పదమునందువలెనే యిందును హర్ష మనుసంచారి వ్యంజితమై రతిభావమునకు పరిపుష్టిని కల్గించు చున్నది.

చక్కెర తీపే యైనను చక్కెర నాస్వాదించుటయందే మాధుర్య ముండును గాని చక్కెరే యైపోవుటలో నానందములేదు. అట్లే మధురాతిమధుర మగు పరమాత్మనిసంపర్కము ననుభవించుటలోనే యానంద ముండునుగాని జీవాత్మయే పరమాత్మలో నైక్యము పొందిపోఁగోరుటలో సొగసు లేదు. వ్యక్తిత్వముచేత జీవపరమాత్మల కీమతమునందు ద్వైతభావము సిద్ధమే యైనను భోగసమయ మందలి యద్వైతపారవశ్య మొక్కొకవేళ ద్వైతబుద్ధిని నశింపఁ జేయునుగదా యని వీరు చింతింతురు "చాలుఁ జాలును భోగసమయమున మైమఱపు పాలుపడునట యేటిబ్రదుకురా వోరి" (12-45) అని కవులు పలవింతురు. సాలోక్య సామీప్య సారూప్యములేగాని సాయుజ్యము కా దనుట వీరిదృష్టి.

**సంభోగ ఆభాస :**

శృంగారరసపోషణముతోపాటు తాళ్ళపాకకవులు తమపదములలో నెడనెడ తద్రస భావముల కాభాసము ననౌచిత్యము లేనివిధమున చిత్రించిరి. ఈ యుదాహరణములు చూడఁదగును. సంభోగాభాసమునకు :

శ్రీరాగం

"మంచ మదె యిల్లదె మాట లేటికి
నించినవేడుకతోడ నిద్దురించు లోనను॥
ఇంటికిఁ జెప్పి యంపితి నిందాక నేల రావైతి
వంటఁగార తొలఁగితి నట్టెవుండరా
వెంటవచ్చిన చెలిచే వింటిమి నీసుద్దులెల్లా
వొంటినైనం బవ్వళించు వొక్కండవే లోనను॥"(3-521)

ఆవేగమున నాయిక కబురంపినను నాయకుఁ డాలసించి వచ్చెను. ఆతఁడు వచ్చునప్పటికే ఆమె అంటఁదగని దైనది. ఇట అంటఁగార (అంటఁ దగనిదానరా) అని నాయిక యనుటచేత సంభోగాభాసమే.

శంకరాభరణము

"ఆయెడ నేమరితి నే నంటిపట్టి నిలుపనైతి
కాయమిదె ప్రాయమిదె ఘనుఁ డెందున్నాఁడో॥

కాంతుని నే గలలోనఁ గౌఁగలించినట్లాయె
నంతలోనె పులకించినట్లాయెను
చేతుల నా చెక్కులెల్లఁ జెమరించినట్లాయె
వింతెల్లా మేనంగంటి విభుఁ డెందున్నాడో॥" (3-198)

ఇట ప్రియుఁడు సాన్నిధ్యమున లేనితరి స్వప్నమున నాయిక ముద మందుచున్నది. స్వప్న మనునది వ్యభిచారీభావము. కావున భావాభాసము. భావాభాసమువలెనే తాళ్లపాకకవులు భావోదయము, భావ సంధి, భావ శాంతి మున్నగు చిత్రణములుకూడ పదరచనలోఁ గావించినారు. భావసంధి కీయుదాహరణమును గాంచుఁడు.

మంగళకౌశిక

"దోసము లేదను తొయ్యలిని
వాసుల సిగ్గులు వంచెద నీకు॥

నిక్కల గంటిని నిను నాపాదము
తక్కక యేటికొ తాకె నని
యిక్కడ మేల్కొని యింతలొ వెరగై
మొక్కెద నిదివో మునుకొని నీకు ॥

నెమ్మది నేనటు నీవదనమునను
యిమ్ముల దమ్ముల మిడితి నటా
కమ్మి యందులకే కడిగెదఁబన్నీట
చిమ్ముల పంతము చేరును నీకు॥"

చెందిన కౌఁగిట చేతలలోనట
క్రిందుపఱచి జంకింతునటా
యిందుకే శ్రీవేంకటేశ్వర నిజముగ
వొందితి విచ్చల వొసగితి నీకు॥" (3-504)

ఇందు శయ్యాగతులైననాయికానాయకులు వర్ణితులు. నాయికకు స్వప్నము కల్గినది. ఆ స్వప్నవిభ్రమమున నాయిక తడఁబడి మేల్కని యథార్థ మనుకొని సన్నిధి నున్ననాయకుని క్షమాభిక్ష వేఁడుచున్నది. ఇట్లు స్వప్నము, ఆవేగము ననెడి సంచారీభావద్వయము నాయికాశ్రితమై వర్ణింపఁబడుటచేత నిట భావసంధి.

**విప్రలంభ శృంగారము :**

సంభోగశృంగారమువలెనే విప్రలంభశృంగారమునుగూడ తాళ్ళపాక కవు లతిరమణీయముగాఁ జిత్రించిరి. 'న వినా విప్రలంభేన సంభోగః పుష్టి మశ్నుతే' అను నాలంకారికవచన ముండనే యున్నది గదా! కేవల సంభోగ మునకన్న విప్రలంభానంతరప్రాప్త సంభోగశృంగారమునకే రక్తి యెక్కువ. ఈ యభిప్రాయమనే తాళ్లపాకకవు లిట్లు పాడియున్నారు.

సౌరాష్ట్రం

"ఊరులేని పొలిమేర పేరుపెంపు లేనిబ్రదుకు
గారవంబు లేనిప్రియము కదియ నేటికే॥

ఉండరాని విరహవేదన వుండని సురతసుఖ మేల
యెండ లేనినాఁటి నీడ యేమి సేయనే
దండిగగలుఁగు తమకమనెడి దండలేని తాలిమేల
రెండు నొకటిగాని రచన ప్రియము లేటికే॥" (3-55)

ఊరులేని పొలిమేర యుండఁజాలదు. పేరులేని బ్రదుకు నిష్ప్రయోజన మగును. కనుక నట్టివి రెండును గలసి యుండుటయే సహజము. అట్లే విరహమును, సురతసుఖమును జంటగ కలిసి యుండు నెండనీడలవంటివి. ఎండ తాపమును బుట్టించునదియే యైనను ఎండలేని నీడను మాత్ర మెవ్వఁడును గోరఁడు. నీడలోని యానందము నెండవల్లనే యధిక మగును. అట్లే సురత

సుఖము విరహవేదనవలననే అతిశయించును. అందుకే విరహవేదన ఉండరాని దయినను సురతసుఖమున కది యుండవలె నట! ఈ శృంగారభావము నీ కవు లాధ్యాత్మికదృష్టితో మేళవించి యిట్లు రమ్యముగా రచించినారు. జీవాత్మపర మాత్మల యెడబాటుతోనేగదా వీరనుభవించు విశిష్టాద్వైతానుభూతి కుత్తేజము. అందుచేతనే వీరి రచనలలో సంభోగమునకన్న విప్రలంభశృంగారమునకే ప్రాముఖ్య మెక్కువ. అందు తపన యున్నది. ఆ తపనయే జీవుల కుత్తేజ కరము.

ఆలంకారికులు నిర్వచించిన ప్రకారము చతుర్విధములగు విప్రలంభ శృంగారమునందలి బహువిధభేదములకును లక్ష్యోదాహరణములుగ నెత్తి చూపఁ దగిన పదములు వీరి వెన్నో యున్నవి. అంతేకాదు, వీరి యీలక్ష్యసామగ్రి యాలంకారికుల కింకనెంతయో పని గల్పించుటీరునగూడ నున్నది. సోదాహ రణముగ వివరింతును.

## పూర్వరాగ విప్రలంభము :

దీనికే 'అభిలాష' అనియు నామాంతరము. నాయికానాయకులు పరస్ప రము చూచుకొన్న తొలిచూపునుండి దృఙ్మనస్సంగ సంకల్ప జాగరాదు లగు దశావస్థలో లేక ప్రలాపసంజ్వరములతోఁగూడి ద్వాదశావస్థలో వారికిఁ గలుగు చుండును. ఈ (దశ లేక) ద్వాదశావస్థాత్మక మగు శృంగారమునకే పూర్వరాగ మని యాలంకారికు లిడినపేరు. ఇది సంభోగశృంగారమునకుఁ బూర్వావస్థ. ఇందు సంభోగము లేమిచేత ఆలంకారికు లీవిభాగమును పూర్వారాగవిప్రలంభ మని పేర్కొనిరి. ఈయవస్థలే కొన్ని అనంతరవిరహవిప్రలంభమునందును గలుగును. లక్ష్యములనుబట్టి తద్విషయము నూహింపవలెను. ఈక్రింది లక్ష్యోదా హరణములను బరికింపఁదగును.

సామంతం

"ఎట్టు ధరింపఁగనగు భువి నిట్టి వియోగావస్థల
నట్టును నిట్టును విధి దము నారడిఁ బెట్టఁగను ॥

కాంతునిచూపులఁ జిక్కినకాంత వియోగాగ్నికిఁ దగ
శాంతికిఁ జెంగలువలు పైఁజల్లిరి నెచ్చెలులు

కాంతుఁడు చూచిన తొల్లిటికనుచూపులె బహుళములై
కాంతశరీరం బంతయుఁ గప్పినతెఱఁ గాయ ॥

రమణునిమాటలఁ దగిలిన రమణికి నంగజతాపం
బమరఁగ మకరందము పైనలికిరి నెచ్చెలులు
రమణుని తియ్యనిమాటల రచనలె కడు నగ్గలమై
కమలదళాక్షికిఁ బైపై గట్టిన తెఱఁగాయ ॥" (12-144)

"శ్రవణాద్దర్శనాద్వాపి" అనునాలంకారికమతము ననుసరించి యిట నాయిక నాయకుని ప్రత్యక్షముగ చూచుటచేతనే కాక అతని మాటలను వినుట చేతను గూడ రాగోదయము పొందిన దగుటవలన 'చక్షుఃప్రీతి' యనునవస్థ వర్ణితము. ఇందు చూపులఁజిక్కినకాంత యగుటచేత ప్రథమానురాగరూప మగు పూర్వారాగమే లక్షితము. ఇట్లే ;

ముఖారి

"ఎక్కడ నున్నదో చిత్త మేమిదలఁచెనో యింతి
చెక్కులెల్లాఁ జెమరించీఁ జెప్పరమ్మా చెలులు ॥

ఆతని సుద్దులు చెప్పే అతివలే చుట్టాలు
ఆతనిని వద్దనినవా రందరుఁ బగ
రాతిరెల్లా నిద్దు రెఱుఁగదు పాదము లొత్తి
చేతులెల్లఁ బొక్కె నేమిసేతుమమ్మా చెలులు॥" (12-28)

అను పదమున ఎవ్వరినొల్లదు 'వత్తివలె దేహమెల్లా వాడఁబారెడు' మున్నగు వర్ణనము లుండుటవలన నిందు చింతా సంతాపకార్శ్యాది యవస్థలు వర్ణితములైనవి. ఇందుకు పూర్వారాగమే సూచితము.

కేదారగౌళ

"పడతి నీయాసనె బతికున్నది
యెడయక నీవింక నెట్టయినా జేయుమీ॥

గుబ్బలమీఁదఁ జెలి కొంగువేయదు
నిబ్బరపుమోహమున నిన్నుఁ దలఁచి

గబ్బి యైన మారునిచే కాఁకలుబెట్టు
అబ్బురంపు విరహము నాఁపలేక వున్నది॥

పొలఁతి మేనఁ గస్తూరి పూయనొల్లదు
నెలకొన్న వలపుల నిన్నుఁ దలఁచి
కలువబాణాల చేతి గాసియూబెట్టు
బలిమైనతాపముల బారిబడి యున్నది॥" (16—16)

ఈ పదమున విషయనివృత్తరూప మగునరతి వర్ణితమై యున్నది. 'పడఁతి నీయాసనె బతికున్నది' అనుటలో నభిలాషారూప మగుపూర్వరాగము సూచితము.

నాదరామక్రియ

"నెలఁతకుఁ గొండలతిమ్మని నే నిదె తోడ్కొనివచ్చెద
ఎలనాగలు మీరిందరు నేమరకుఁడి చెలిని ॥

వలపులరేనికి చెంగలువలు కొండము చొర మొక్కుడి
అలులకుఁ బూఁదేనియ సోయగములు మెయికొనుఁడి
ఫలరసములు మీఁదెత్తుడి పదరి చిలుకలకు గోకిలలకు
పొలఁతికిఁ గెందమ్మిరేకులు పోయుఁడు బడిమిగను ॥"
(12-351)

అను పదమునందును, మఱియు

శ్రీరాగం

"చెప్పదు మనతో నించుక చెలి విరహపువెట్టిది యని
యెప్పటివలె నని చూడఁగ నింతగ నాయనయో॥

శిరసున పువ్వులు ముడిచినఁ జెమరించును మేనెల్ల
తరుణికి మరుబాణము లని తలఁచమైతి మదియు
విరు లటు దులుపుచు గంధము వెలఁదికి మెత్తితి
మెఱుఁగక
తరువుల ననలం బుండే తాపము రేచెనయో॥" (3-215)

అనుపదమునందును దూతి నాయకునికై వెదలివచ్చులోపున చెలులు నాయికకు విప్రలంభశాంతిని గల్గించి ప్రాణము నిల్పుటకై చేసినయత్నము

వర్ణితమైనది. తొలిపదమున విప్రలంభోద్దీపనము లగుప్రకృతిహేతువులను చమత్కారముగ తొలఁగించుట చెప్పఁబడినది. రెండవపదమున చెలులు శైత్యోపచారములు చేయఁబోగా నవి మఱియింతగా నామెకు విప్రలంభతాపమును గల్గించిన విషయము వర్ణితమైనది. ఇందు వ్యాధి యను విప్రలంభావస్థ వివరింపఁబడినది. 'నే నిదె తోడ్కొని వచ్చెద', 'చెప్పదు మనతో నించుక' అని యీ పదములం దున్నయంశములనుబట్టి పూర్వరాగవిప్రలంభమే సూచితమగుచున్నది.

ఇట్లు ద్వాదశావస్థాత్మక మగుపూర్వరాగవిప్రలంభము సంయోగాకాంక్ష నపేక్షించి యుండును. ఇందు అనంతరవిరహవిప్రలంభస్వరూపము సుంత యేని గోచరింపదు.

**విరహ విప్రలంభము :**

ఇందును దొల్లిపేర్కొన్నవిప్రలంభావస్థలలోఁ గొన్ని యేర్పడుచుండును. కాని, యీ విరహవిప్రలంభమున పూర్వరాగవిప్రలంభమునందు గోచరింపని సంభోగశృంగారానుభూతియు తదవస్థావిశేషములను వ్యక్తము లగుచునే యుండును. ఈ క్రింది పదములను తిలకింపఁదగును.

భైరవి

"వనితభాగ్యంబు దేవరచిత్తము - మాకుఁ
బనిగాదు యింక నీపాదంబులాన॥

అడబాలసతి బోన మారగించు మటంచు
బడిబడిని కడు విన్నపము సేయఁగా
ఉడుగని పరాకుతో నుండి నెచ్చెలి మీఁద
బడలి వొరిగినది నీ పాదంబులాన॥

అడపంబుసతి వీడె మవధరింపు మటంచు
అదరి కప్పురపుఁబలు కందీయగా
కడకంటఁ జూడ దిదె కాఁతాళమో మరపో
పడఁతి యిప్పుడు నీ పాదంబులాన॥" (12-23)

ఈ పద్యమున నాయిక ఆహారాదులందుఁ బ్రీతిని గోల్పోయిన దనుటలో నరతియు, 'బడలి యొరగినది ఏలా గవునో' అనుటలో మూర్ఛాంతాదులు

సూచితము లైనవి. కాని, పల్లవిలోని 'మాకుఁ బనిగాదు యింక నీపాదంబులాన' అను దూతీనివేదనవైఖరియు' వీడె మవధరింప' కుండుటయు నిందు నాయికావిరహ విప్రలంభమునే ధ్వనింపఁ జేయుచున్నది. ఇంకను స్పష్ట మగునుదాహరణములు వందలకొలఁదిగ నున్నవి. మచ్చున కొకటి రెండు చూచినఁ జాలును.

శంకరాభరణము

"తరుణి నీయలుక కెంతటి దింత యీవేళఁ
గరుణించగదర వేంకటశైలనాథా॥
ఒకమారు సంసార మొలఁబొమ్మని తలఁచు
నొకమారు విధిసేఁత లూహించి పొగడు
నొకమారు తనుఁ జూచి వూరకే తలవూఁచు
నొకమారు హర్షమున నొంది మే మరుచు॥"

సౌరాష్ట్రం

"పతిమాత్రమా నాపాలిదైవ మతఁడే
ఆతని కిచ్చకము లాడే నింతె కాక॥
నీటున తానె అన్నియు నేరవలె నింతె కాక
మాటలాడవచ్చునా మగవానిని
తేటచూపులనె తెలుసుకోవలె గాని
తాటించి జంకించ తగునా ఇల్లాలికి॥" (తం॥ వ్రాతప్రతి)

పైపదములందలి విరహవిప్రలంభము సుస్పష్టమే. తొలిపదమున దూతీ ముఖమున నాయికావిరహోద్వేగము వర్ణితము. రెండవపదమున నాయిక తానే పతివిషయమున వ్యంగ్యమాడుచు విరహమున వేగుచున్నది.

ఈ విరహవిప్రలంభము నాయికావిషయముననే కాక నాయకవిషయ మునగూడ వర్ణితము కావచ్చును. పురుషవిరహవిప్రలంభమును దెలుపు తాళ్ళ పాకవారి పదము లివి చూడఁదగును.

సాళంగనాట

"పురుషవిరహ మింత పొగులాయ నీవల్ల
నరిఁజూతువు రావమ్మ చక్కని నీవిభుని

తలపోతలనె నీపైఁ దమకించి తమకించి
పిలుపులనే నిన్నుఁ బేరుకొనీ
చెలులు యెదుట నుండే చేరి నీసుద్దు లడిగీ
కలతువు రావమ్మ గక్కన నీప్రియుని॥

బయలుగాఁగిల్లనె పైపైనె పొద్దువుచ్చీ
నియతిఁ జక్కదనాల నిన్ను వర్ణించీ
రయమున నేడనైనా వ్రాఁతల నీరూపు వ్రాసీ
క్రియఁగూడ రావమ్మ కేలుచాఁచి మగని॥" (13-456 )

ఇందు నాయకుఁడు నాయికనుగూర్చి తలఁచుట; గుణవినుతిసేయుట నను నవస్థలు వర్ణితము లైనవి. చూడుఁడు.

కన్నడగౌళ

"అయ్యో యేమనవచ్చు నాసాస నీపతి
యెయ్యెడ బాయక పోయె నేమవునో యమ్మా॥

కోవిలకూఁతలు విని కొమ్మ విలిచీనంటా
దావతితో రమణుఁడు దగ్గరఁబోయి
ఆవల నొకనెమలి అంతలో నేఁగఁగఁ జూచి
వేవేగ చెలియంటా వెంటఁగూడఁ బారె॥

కీరము వేరొకచోటఁ గెలయుచు నుండఁగాను.
చేరఁబోయె సతి యందుఁ జెలఁగీనంటా
నీరుతామరమీఁద నిండుఁదుమ్మెదలఁ జూచి
కోరి యింతిముఖమంటాఁ గొలనిలో దుమికె॥" (13-299)

ఇందు లజ్జాత్యాగము, గమనము, ఉన్మాదము నను విప్రలంభావస్థలు పురుషవిరహవిషయమున వర్ణితము లైనవి.

**ప్రవాస విప్రలంభము :**

విరహవిప్రలంభముతోపాటు మన యాలంకారికులు ప్రవాస విప్రలంభ మనుదాని నింకొకటి పేర్కొనినారు. నాయికానాయకు లేదేని కార్యవిశేషముచేఁ

గాని, శాపముచేఁ గాని, సంభ్రమమువలనఁ గానీ భిన్నదేశములలో నుండుట తటస్థించినచో నా యవస్థావిశేషమును వారు ప్రవాసవిప్రలంభ మనిరి. కాని. వాస్తవమునకు దానికిని విరహవిప్రలంభమునకును నంతగా భేద మేర్పరుపరాదు. అందుకే సాహిత్యదర్పణకారుఁడు విరహవిప్రలంభమును ప్రవాసవిప్రలంభముననే జేర్చి పేర్కొనెను. అది యెట్లయినను ఈ ప్రవాసవిప్రలంభమునకుఁ గూడ తాళ్ళపాకవారి పదములనుండి యుదాహరణములను తేలికగా మన మెత్తిచూప వచ్చును. ఏలన నీ విప్రలంభశృంగారమును వారు చిత్రించినవైఖరి యంత విస్తృత మైనది. ఈ పదములు తిలకింపుఁడు.

కేదారగౌళ

"ఓరుచుకోవే యెట్టయినా వువిద నీవు
నేరుపరి నీవిభుఁడు నేఁడే వచ్చీ నీడకు॥

కలువల వేసితేనే కాముఁడు చుట్టముగాఁడా
వెలయు విరహులకు వెగటుగాక
చలివెన్నెల గాసితే చందురుఁడు పగవాఁడా
పొలయలుకలవారే పొగడరుగాక॥" (13-135)

సామంతం

"నీ విభుఁడు వచ్చుదాఁక నిచ్చలాన నుండవే
వేవేలకును రేయి వేగించవేమే॥

పూయకు కస్తూరి మేనఁ బొద్దుగూఁకెఁ జీకటంటా
నోయమ్మ చందురుఁ డుదయించీని
చాయల వెన్నెల దాఁకి చల్లజంపు యెండలంటా
అయెడ నీవు వేఁగఁగ నది చూడవేమే"॥ (13-285)

కార్యవిశేషవశమున పతి నెడబాసి విరహానలమునఁ గ్రాగుచు చంద్రోపాలంభనాదులనుజేయుచున్న నాయికయొక్క తాపోపశమమునకై సఖులు పలికినపలుకు లివి. సఖీముఖమున నాయికాప్రవాసవిప్రలంభ మిందు వర్ణితము.

బౌళి

"హరి యేమనెనే అలిగెనో
విరహినై నే నుండఁగా యేల రాఁడాయె॥

మరలి మరలి తన్ను మాటఁ గొసరును
యిరవైన విభుఁ డేమనెనే
తరుణులే వచ్చితిరి తా నాడ నున్నాఁడు
యెరవెరవై తా నేమనెనే॥" (13-329)

ఇందు నాయికావిరహము ప్రవాసమేగినప్రియుని వెదకిరాఁ బోయిన దూతికలను బృచ్ఛించు నుత్కంఠయందే గోచరించుచున్నది.

**ఈర్ష్యా విప్రలంభము :**

మన యాలంకారికులు పేర్కొన్న విప్రలంభములలో నీ యీర్ష్యావిప్రలంభము రమణీయ మైనది. దీనికి మానమే మూలము. మాన మనఁ గోపము.

ఈ మానమే ప్రణయమాన మనియు, ఈర్ష్యామాన మనియు నిం దిరుతెఱఁగులు. వానిలో మగల ప్రకారాంతరభేదములు మఱికొన్ని యున్నవి. తాళ్ళపాక కవు లీవిప్రలంభభేదమును భావసౌకుమార్యముతోఁ జాలచక్కఁగఁ జిత్రించినారు. పరికింపఁదగును.

**ప్రణయ మానము :**

ప్రేమాతిశయమున కారణము లేకయే నాయికానాయకులలో నేయొక్కరికో కలుగు వెలయలుకయే ప్రణయమానము. నాయకుని ప్రణయమానమున కిది యుదాహరణము.

సామంతం

"మిక్కిలి నేరుపరి యలమేలుమంగ
అక్కఱదీరిచీ పతి నలమేలుమంగ॥

కన్నులనె నవ్వునవ్వి కాంతునిఁ దప్పక చూచి
మిన్నక మాటాడీ నలమేలుమంగ

సన్నలనె యాసరేచి జంకెన బొమ్మలు వంచి
అన్నువతోఁ గొసరీని అలమేలుమంగ ॥

సారెకుఁ జెక్కులు నొక్కి సరుసనె గూచుండి
మేరలుమీరీ నలమేలుమంగ
గారవించి విభునికిఁ గప్పురవిడె మిచ్చి
యారుతులెత్తే నదె యలమేలుమంగ ॥" (13—21)

హావభావవిలాసములను బ్రదర్శించి నాయికయందు పొలయలుకఁ జెందిన పతి ననునయించు చున్నది. నాయికాప్రణయమానమున కీయుదాహరణమును గాంచుఁడు.

**పా డి**

"విభుని వినయములు వినవమ్మా -నిను
నభయం బడిగీ నయ్యో తాను ॥

రహస్యమున శ్రీ రమణుఁడు బంపిన
విహరణ లేకలు వినవమ్మా
అహిపతిశయనం బతితాపమ్మై
బహువేదన కగపడెనట తాను ॥" (3-374)

అలుక మాను మనియర్థించుచుండిన విభునివినయములను సైతము విన నొల్లనినాయికను దూతి నాయకపక్షమై యనునయించుచున్నది. ఇట్లుకాక నాయికానాయకు లిరువురకుఁ గలిగినపొలయలుక కీ యుదాహరణము చూడఁ దగును.

**ఆహిరి**

"ఆఁపరాని వలపాయ నమ్మలాలా- యింతి
యేఁపులకు లోనైతి మిఁక నేమిసేతుమే ॥

ఆరగించు మనఁగద రమ్మలాలా అయ్యో
నీరు వుక్కిలించ దిదె నిన్నట నుండి

అరినది బోనమెల్లా నమ్మలాలా అయ్యో
శ్రీ రమణుఁ డింతట విచ్చేయఁ దేమి సేతమే ॥

అద్దమరాతిరి వోయె నమ్మలాలా అయ్యో
నిద్దుర గంటఁబెట్టదు నిన్నట నుండి
అద్దపుఁజెక్కులు వాడె నమ్మలాలా అయ్యో
యిద్దరి కోపము దీర దిఁక నేమిసేతమే ॥" (12-32)

నాయికానాయకు లిరువురు నలిగి కూర్చున్నవేళ సఖు లేమియు చేయఁజాలక చోద్యమందుచున్నారు.

ప్రేమాతిశయమేతప్ప నీ పొలయలుకలకుఁ గారణ మరయ వేరు గన్పట్టదు. ఇది ప్రణయమానము. ఈ మానమునకే తగినంత కారణ ముండెనేని యది ఈర్ష్యామాన మగును.

**ఈర్ష్యామానము :**

నాయిక నాయకునియం దన్యకాంతాసక్తి యున్నట్లు విన్ననుఁ జూచినను లేక అనుమానించినను నామెలో కలుగునీసుచేఁ బుట్టుగోపమే ఈర్ష్యామానము ఇందు వినుట సఖులపలుకులవలన. చూచుట ప్రత్యక్షముగ. అనుమానము పతి మీఁది భోగాంకముల నరయుటవలన. వీనికిఁ గ్రమమున నీ యుదాహరణములు లక్ష్యము లనఁదగినవి.

శ్రవణమువలని ఈర్ష్యామానమునకు —

బౌళి

"మానరే అతని నేల మందాడేరు
కానుక మా మొక్కులివి కద్దాయముగాదు॥

తనకే నెలవయ్యిన తరుణి నేను
వనితలు పెక్కుగలవాఁ డాతఁడు
యెనసిన మా పొందు లేదకునేడ
మొనసి నేఁజేసినబత్తి మొగచాటే కదా॥" (13-593)

ఇందు చెలులు నాయకుని పరవనితాసక్తిని బహిర్గతము సేయగా నాయిక ఈర్ష్యామానమున వారిని వారించునెపమున ప్రియు నుపాలంభించు చున్నది. దర్శనమువలన కలిగిన మానమునకు—

సామంతం

"సరుస దిష్టములకు సాకిరేలరా
మరుతంత్రములలోన మరఁగులు గలవా॥
యేకతాన ఆకె నిన్ను నిద్దరి నేఁబొడగంటి
నాకుచుట్టి యిచ్చె నింతె యని బొంకేవు
మేకొని పువ్వులలోన మెదలే తుమ్మెద దా
నాకడ బరిమళము లంటనంటే నిజమా॥" (3-517)

ఈర్ష్యామానమునకు గుఱియైననాయిక యిందు ప్రత్యక్షముగ తానే నాయకుని నిగ్గదీసి యడుగుచున్నది. ఈపదమును జూడుఁడు.

సాళంగనాట

"మేకులు నావద్దనే మెరనేనా
యీకత లెఱుఁగుచు న న్నేలపిలిచీనే॥
సంగడిఁ గూచుండి సరసములాడి యాపె
అంగము కస్తూరిపూఁత లంటించుకొనె
ఎంగిలిదేహముతోనె యీడకు విచ్చేసినాఁడు
యింగితమెఱిఁగితి న న్నేలపిలిచీనే॥" (13-25)

గురుమానమును బొందిననాయిక నాయకునియపరాధమును క్షమింపజాలక సఖితోఁ బలుకువ్యాజమున నుపాలంభించుచున్నది. పైపదములందు నాయకునియుచ్ఛిష్టిదము ప్రత్యక్షముగ నాయికకంటఁబడినవిషయము విదితమే. ఇం దనుమానము లేదు. ఇఁక అనుమానమువలన కలిగినమానమునకు.

శ్రీరాగము

"అప్పటి యెండచెమట లట్టే వుండీనా
నేర్పుదప్ప బొంకేవు నే నెఱుంగనా॥

ఆవులం గాచిననాఁటి యడవికంపజీర
లావల నేఁడూ బాయక అట్టె వుండీనా
యేవంక నెవ్వరో నిను నెనసి చేసినత
నీవెంత మొఱంగినా నే నెఱుంగనా॥

వెన్నలు ముచ్చిలునాఁడు వేడిపాలారగించిన
అన్నువ నీ మోవిపొక్కు లట్టే వుఁడీనా
వన్నెకాఁడ యెవ్వతెకొ వలలఁ జిక్కేవని
నిన్నమొన్నట సుద్దులు నేనెఱుంగనా॥ '' (3–26)

ఇందు నాయకుని భోగాంకములు నాయికకు శంకను గలిగించినవి. నాయకుఁడు వానిని గప్పిపుచ్చుకొనుటకై యసంబద్ధాలాపము లాడినాఁడు దాని పసిగట్టి నాయిక వాని నుపాలంభించుచున్నది.

వరాళి

"చూనితి నప్పుడే వానిసోరణగండ్ల నేను
యేచి వేరె సింగారించి యిటు దోడితేరే॥

గందవొడి చల్లరె కడుఁ జెమరించె మేను
ముందుముందు విడె మీరె మోవి వాడెను
చెంది నే నవి చూచితే సిగ్గువడే నాతఁడు
మందలించి యలపార్చి మరి తోడితేరే॥" (15–266)

ఇందు గురుమానము రమ్యాతిరమ్యముగఁ బ్రదర్శితమైనది. నాయకుని మీఁది భోగాంకములను జూచిననాయిక సఖులతోఁ జెప్పునెపమున వాని నుపాలంభించుచున్నది. ఆతఁ డపరాధముసేసి రాఁగాఁ దాను సత్కారము చేయింపఁ బూనుకొన్నది. ఇది కేవలము ఉపాలంభమునకన్న మిన్నయగుశిక్ష.

ఈ విధముగ తాళ్ళపాకకవు లీర్ష్యామానరూప మగు విప్రలంభమును జిత్రించినారు. గురులఘు మధ్యమానము లను త్రివిధము లగుమానములను గూడ నీ కవులు పలుపదములలో ప్రదర్శించినారు. విస్తరభీతిచేత వానికి విడిగా లక్ష్యములను జూపుట లేదు. గురుమానము పై నుదాహరించిన పదములందే వ్యక్తమగుచున్నది కదా ! మన యాలంకారికు లీమానమును శమింపఁజేయుటకు



"పలుకుఁదేనెల తల్లి పవళించెను
కలికితనముల విభునిఁ గలిసినదిగాన" (4-47) చూ. పుట 92.



"అలరులు గురియఁగ నాడె నదె
అలకలఁ గులుకుల నలమేల్మంగ" (8-24) చూ. పుట 181.



"ఏమొకొ చిగురుటధరమున యెడ నెడఁ గస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన ప్రతిక కాదు గదా "(3-467) చూ. పుట 129.



ఆఁకటివేళల నలపైన వేళలఁ దేకువ హరినామమే దిక్కు మఱిలేదు" (౬-100)
చూ. పుట 101 ప్ర॥ సం॥

ఆరువిధము లగుమార్గములను సూచించినారు. తల్లక్ష్యము లించుక చూడఁ దగును.

సామంతం

"మగువలతోడి దేల మందెమేళాలు
తగినయందే కాక తమక మేలయ్యా॥

పెక్కుమాటలాడితేను ప్రియమెల్లాఁ జవు కవును
యెక్కుడు సుద్దులు నన్ను నేలడిగేవు
మొక్కులే సారెకు నైనా మోపులై వేసట పుట్టు
యెక్కసక్యాలకు పాద మేల పట్టేవయ్యా॥" (13-31)

ముఖారి

"ఏల నాతో బొంక వచ్చే వెఱఁగనా నేఁదొల్లి
వాలాయించి మాకు మంచి వాఁడవే యెప్పుడును॥

దవ్వులనే మొక్కు మని దయ నాపైఁబెట్టుమని
యెవ్వతె చెప్పెనో కాక యీ బుద్ధులు
నివ్వటిల్ల నీయంతనీ వెఱుఁగ వింతేసి
చివ్వన నొకరి పెట్టుఁజెట్టవే యెప్పుడును॥

చేచేత వేఁడుకొమ్మని చెక్కు నాకు నొక్కుమని
యే చదువులో నుండెనో యీ వోజలు
నీ చందము లివిగావు నేఁడు గొత్తలా నాకు
సూచింప నొక రాడించే సూత్రమ వెప్పుడును॥" (13-33)

ఇందు నాయకుఁడు ప్రియురాలిమానము నుపశమింపఁ జేయుటకై ప్రతిమాలుట, పాదప్రణామము సేయుట మున్నగు నలంకారశాస్త్రవిహితచర్యలను జరపినాఁడట - 'ఈ చదువు లెందు నేర్చితి' వని యంతకు రెండాకులెక్కువ చదివిన నాయిక యుపాలంభించు చున్నది.

మానమున నించుక వెత యున్నను మానానంతరసంభోగశృంగారమున మాత్ర మనుభూతిచవి యధికముగ నుండు నని యాలంకారికుల వచనము. తాళ్లపాకకవు లీవిషయము నిట్లు చిత్రించినారు.

ఆహిరి

"నమ్మవా యింకా నీవు నా మనసు
చిమ్ముఁ బలుకుఁదేనెల సేదదేర్తుఁ గాక ॥

ఇయ్యకొన్నదాన నీకు నెదురాడేనా నేను
నెయ్యపుటిచ్చకములే నెరపేఁగాక
పయ్యెద కొంగుఁ బట్టేవు బలిమికత్తెనా యింత
వొయ్యన నీ ప్రియముల కొడిగట్టేఁగాక ॥

నీవే నేనైనదాన నెరసులు వెదకేనా
చేవమీరి నీరతులఁ జెలఁగేఁగాక
శ్రీ వేంకటేశ నన్నుఁ జిత్తగించికూడితివి
పూవులువాసనవలెఁ బొందివుందుఁగాక ॥" (13–79).

**విప్రలంభాభాసము :**

సంభోగశృంగార రసభావాభాసములవలెనే తాళ్లపాకవారి పదము లందు విప్రలంభ భావాభాసాదులును గోచరించును. విప్రలంభాభాసమున కీ పదము చూడఁదగును.

వరాళి

"నిన్నుఁ బాసియు నీపతి నీవద్ద నున్నాఁడనంటా
వన్ని నీరూపు దలఁచి భావరతి సేయును ॥

మఱచి యిచ్చినయాకు మగువ నీమోవంటా
పడఁతిచే సందుకే చప్పరించును
ముడిచిన మేలుకట్టు మొల్లలదండలు నీ
కడగంటిచూపులంటా ఘాతఁ బైపైఁజూచును॥" (13-278)

ఇది విప్రలంభాభాసము. ఇట విప్రలంభజన్య మగునున్మాదము వ్యభి చారి. దీనినే 'భావరతి' యని ఆ కవులు పేర్కొనిరి.

శ్రీరాగం

"ఒకటి కొకటి యాసనుండఁ జెలిభావ మిది
మొక మెదుటనె నన్ను మోవ వ్రాసెనే॥

పొలతికురులు వ్రాయఁబోతేఁ దుమ్మెద లాయ
తలఁగ కుండఁగ మోముదమ్మి వ్రాసెనే
కలికి కన్నులు వ్రాయ గండుమీలై పొడచూపె
చెలప చెమట నీటి చెక్కులు వ్రాసెనే॥

సరిఁ గుచములు వ్రాయ జక్కవలె పొడచూపె
నిరుదెస బాహులత లిటు వ్రాసెనే
గరిమ నడుము వ్రాయఁగా సింహమై తోఁచె
వరుసఁ దొడల యంటివనము వ్రాసెనే॥

కోమలి పాదాలు వ్రాయఁ గూర్మములై పొడచూపె
ఆమని జవ్వనపులోఁ తటు వ్రాసెనే
యీమేర శ్రీవేంకటేశుఁ డేననుచుఁ గూడె
రామ యిట్టే యిదివో నారతి వ్రాసెనే॥" (15-70)

ఇందు విప్రలంభ మనుభవించునాయకుఁడు భావనలో కనులయెదుటనే నాయికారూపమును గ్రమమున చిత్రించుకొని, యా చిత్రము రూపుదాల్చిన దనుకొని భ్రమసి భావరతి సేయుట వర్ణితమైనది. కనుక నిదియు విప్రలంభా భాసమే. చిత్రరచనలో 'భ్రమ' మను భావ ముదయించినది[1].

---

1. ఇట్టిదే పద్య మొకటి చౌడయ గంగరాజుకృత నందనచరిత్రలోనిదిగా ప్రబంధ రత్నావళియం దుదాహృత మైనది. మదనవిభ్రమము నాతఁ డిట్లు వర్ణించినాఁడు. ఈ కవి తాళ్ళపాకకవులకాలమునకుఁ దర్వాతివాఁడే కాఁబోలును.

సీ. కురులు వ్రాయుటయును గొదమతుమ్మెద లయ్యెఁ
గన్నులు వ్రాయంగఁ గలువ లయ్యె
నధరంబు వ్రాసిన మధురబింబం బయ్యె
గళము వ్రాయుటయును గంబు వయ్యెఁ
జనుఁగవ వ్రాసినఁ జక్రవాకము లయ్యెఁ
జేతులు వ్రాసినఁ జివురు లయ్యె
నడుము వ్రాయుటయును నవలతయై యొప్పెఁ
బొలుపారఁ గటి వ్రాయఁ బులిన మయ్యెఁ

ఇట్లు సంభోగ విప్రలంభ భేదములతో నొప్పు శృంగారమును చిత్రించుటతోపాటు తాళ్ళపాకకవులు సఖీ దూత్యాది శృంగారసహకారిణుల వ్యాపారములనుగూడ విశదీకరించినారు.

**శృంగార సహకారిణులు:**

నాయికావిషయమునుగూర్చి చర్చించునపుడు ఈ శృంగార సహకారిణులగు సఖీదూతికల వ్యాపారమునుగూర్చి యించుక గమనించి యున్నాము. మఱికొంత వివరణ మిటఁ జూడఁదగును.

**సఖి :**

భానుదత్తుఁడు రసమంజరిలో సఖి నిట్లు నిర్వచించినాఁడు. 'విశ్వాస విశ్రామకారిణీ పార్శ్వచారిణీ సఖీ - అస్యా మణ్డనోపాలంభ శిక్షా పరిహాస ప్రభృతీని కర్మాణి'. సఖి నాయిక నలంకరించును. శృంగారవిషయమున నామెకు హితము బోధించి శిక్ష నిచ్చును. ఒక్కొకయెడ పరిహసించియో ఉపాలంభించియో మానవతి యగునాయికను దారికి తెచ్చుచుండును. మచ్చున కొకటిరెండు పదములు తిలకింపుఁడు.

మలహరి

"ఎందాఁక నీ సిగ్గు లేఁటికిఁ బెంచేవు
పొందులు చొరకెను భోగించరాదా॥

చెలఁగి నీకురులు చేతుల దువ్వుచు
మలసెటిపతితో మాటాడవే
సెలవి నవ్వుతోఁ జెక్కులు నొక్కి
చెలువునిచనవులు చెల్లించరాదా॥" (17-547)

---

గీ. రమణితొడలు పాదతలములు వ్రాసిన
గరికరములు హల్లకములు నయ్యె
నేమి వ్రాయఁ దలఁచి యేమి వ్రాసితి నని
మదనవిభ్రమమున మనుజవిభుఁడు.

[చూ. ప్రబంధరత్నావళి - పుట. 47. ప. 45.]

ఇందు నవోఢ యగునాయికకు పార్శ్వచారిణి యగుచెలి హితము నుపదేశించుచున్నది.

సామంతం

"పిలిచీ రాఁగదవే ప్రియుఁడు నిన్ను
బలిమి చేసినంతనే పనులెల్ల దక్కునా॥

కలసిమెలసి వుంటే కాఁపుర మీడేరుగాక
పెలుచదనాన నుంటే ప్రేమపుట్టునా
నెలఁతకు మగనితో నేస్తమే మంచిదిగాక
అలుకలు నెరపితే నట్టే విసుగరా॥" (13-363)

ఇందు నాయిక కుపాలంభనపూర్వకముగా సఖి హితము నుపదేశించుచున్నది. ఈ యుపాలంభన పతివిషయకమై కూడ నుండవచ్చును.

దేసాళం

"ఏల వెరచేవు నీవు యిదిగో నీపతి వచ్చె
జాలివాయ నిన్నుగూడి సంతస మిచ్చీని॥

నీరధిలోఁ బుట్టినట్టి నీరుచిచ్చైనపూవు
నూరిపోసినట్టి పామునోరిలో కడి
మారుతో నగ్నిఁబడిన మాఁకులలో భూతము
యీరీతి విరహుల కెగ్గుసేయ కుందురా॥" (13-324)

ఇందు అపరాధి యగునాయకునిగూర్చి ఉపాలంభనపూర్వకముగా సఖి నాయికతోఁ జెప్పుచున్నది. పరిహాసమున కీయుదాహరణమును గాంచుఁడు.

సామంతం

"అందాఁకాఁ గాఁగిననిన్ను ననరాదుగా
పొందిక లైనమీఁద బుద్దిచెప్పేఁగాని॥

వేడుక నీరమణుఁడు విచ్చేసుదాఁకా నీ
వాడినట్టెల్లా మాకు నాడవలెఁగా

యీడుగా సమరతి మిమ్మిద్దఱిఁ గూడఁగఁ జేసి
జోడుగా నీతిట్లకు సూడువట్టేఁగాని॥'' (17-483)

ఇట్లు సఖీవ్యాపారములను జక్కగా నీ కవులు చిత్రించిరి. వీరి పదములలో నెడనెడ రచయితలే సఖులై అలమేల్మంగా శ్రీ వేంకటనాథుల ప్రణయ విషయమున వ్యవహరించుచుందురు.

ఇట్లే దూతీవిషయమున కూడ -

**దూతి :**

రసమంజరీకారుఁడు "దూత్యవ్యాపారపారంగతా దూతీ - తస్యాః సంఘటన విరహనివేదనాదీని కర్మాణి" అని దూతీనిరూపణము గావించినాఁడు. విరహనివేదనమున కీయుదాహరణమును గాంచుఁడు.

ముఖారి

"నీ కెదురు చూచిచూచి నెలఁత నన్నంపెనిదే
రాకుండితే నాపె వచ్చీ రావయ్య నీవూ॥

అపుడు నీ వానపెట్టినది నమ్మినది గాక
తప్పులు పట్ట నేరదా తరుణి నిన్ను
నెప్పున నీ విందుకుఁగా నీవేల వెరచి రావు
చెప్పేఁగాని యింటికి విచ్చేయవయ్య నేఁడు॥" (17-594)

సంఘటనమున కీపదము పరికింపుఁడు.

భైరవి

"చిత్తగించి చూడవయ్యా చిగురుఁబోఁడి దిక్కు-
బత్తి నీవు గల దాపెభాగ్యముకొలఁదయ్యా ॥

చెలిచెమటల నాని చిత్తములో వలపులు
పులకాలై మొలిచెను బుజకలిగే
యెలమిఁగోరికెలై యీరిక లెత్తై నవే
బలుపంట లిఁక నీభాగ్యముకొలఁ దయ్యా॥'' (17-442)

ప్రియాసమ్ముఖమున నున్న నాయకునకు నాయికాసౌముఖ్యమును వెల్లడించి యాయిరువురను గూర్చుటకై దూతి చేయు ప్రసంగ మిందు వర్ణితమైనది.

ఈవిధముగా తాళ్ళపాకకవులు శృంగారరసవిషయమును సమగ్రసుందరముగ చిత్రించినారు. వీరు పోషించిన శృంగారము లౌకికపరిధులకుఁ జాలవఱకు దూరమై, దివ్యులగు నాయికానాయకుల నాలంబనముగాఁ జేసికొనుటచేతఁ గూడ దివ్యమై భవ్యమై యొప్పుచున్నది.[1] వీరి యీ శృంగారపదములలో నంగిరసము శృంగారమే యైనను తదంతర్లీనమై భక్తియుఁ బరుగులువారు చుండును. వీరి దృష్టిలో ప్రేమయన నిట్టిది.

"ప్రాణవల్లభుఁ బెడఁబాసి మరుబాణముల
ప్రాణబాధల నెగులుపడు చేఁటివలపే
ప్రాణేశ్వరుఁడు దన్నుఁ బాయఁజూచినయపుడె
ప్రాణంబు మేనిలోఁ బాయంగవలదా !" (12—229)

---

1. అన్నమయ్య తన శృంగారభావనాప్రపంచము నిట్లొక వరాళిరాగ పదమున చిత్రించుకొనినాఁడు.

"నీ విందు విచ్చేయుదాఁకా నిలచితిమి
యేవివరమున రతి కెక్కేనో కాని ॥పల్లవి॥

నిండిననామతిలోన నీరూపే తలపోసి
కొండవంటికోరికలే కోరుచుందును
దండిసంతపములనే తగ దొబ్బితిఁ బొద్దులు
వండి యిటమీఁద నెట్టు బతికేనో కాని॥

కందువసుద్దులు కొన్ని కల్పించుకొని నీతో
అందాన నాలోనే మాటలాడుచుందును
అంది యీ మనోరథాల నాఁపితి విరహ మెల్ల
కింద మీఁదు నిఁక నెట్టు గెలిచేనో కాని॥

అద్దె యేకతమనేటి అమృతలహరిలోన
గట్టిగా నీకాఁగిట నేఁ గలశుంటిని
నెట్టన శ్రీ వేంకటేశ నేఁడు నన్నుఁ గూడితివి
మట్టుతో నెట్లు నిన్ను మఱపేనో కాని॥ (22-220)

సరిగా నిట్టిభావమునే గోదాదేవిముఖమున నాముక్తమాల్యదలో శ్రీ కృష్ణ దేవరాయలు పలికించినాఁడు. ఇట శృంగారరసమున కాలంబనములగు నాయికా నాయకులు దివ్యులు నవ్యయులు నగుటచేత వారి వలపుకూడ దివ్యము నవ్యయము నైనట్టిదే. అందుకే తాళ్ళపాకవారు "తిరువేంకటేశుపై తిరమైనవలపు - సరస రీతులచేత సరిలేనివలపు" (12-350)అనినారు. వారి దృష్టిలో జీవాత్మయే నాయికగావున—

ముఖారి

"వలవ నేరుతుగాని వాదించ నేరరా
మెలఁగి నీవెట్టుండినా మెచ్చుకుండలేనురా॥

బిగిసి నీవు రాకున్నా పిలువ రానేర్తుగాని
తెగి నీతో నలిగి సాధించనేరరా
వొగి నిన్నుఁ గానకున్నా నుసురననేర్తుగాని
తేటల నేమినేసినా దిట్టనేరరా॥" (3-501)

అని పరమాత్మునితోడి సంయోగమునకై పరితపించుచుండును. అందుకే ఒకవేళ ఉపాలంభించినను ఆ నాయిక ఉపాలంభనమున భక్తియో పరమాత్మని మహత్త్వమో వెల్లడియగుచుండునేకాని వేఱుతీఱు కానరాదు. చూడుఁడు.

దేసాళం

"తల్లిదండ్రి వెంచనట్టి తగుఁ బలుగాకి చూర
చల్లుఁబుప్పొడి దొంగిలిన జాజరకాఁడు

మల్లాడి చెట్లమీఁద మధువువట్టినపాత్ర
వెల్లిగా మంచిగుణాలు వీని కింక వచ్చునా॥" (13-324)

రామక్రియ

"చిత్తగించి యేఁటికో విచ్చేసితిగాక
హత్తి నన్ను బుజ్జగించే వన్నిటా జాణవయ్యా॥

అంది నీకుఁ గావఁబో నావులమంద గలదు
కుంది వయ్యాళికి రాతిగుఱ్ఱము గద్దు
అందపుబోయిఁడవుగా నర్జునునిబండి గద్దు
దిందువడి యీడకురా దీరునటనయ్య॥

సారఁ బవళించఁ బాల జలనిధి నీకు గద్దు
పోరచి దానమడుగ భూమి గద్దు
చేరి నిక్కినిక్కి చూడ శ్రీ వేంకటాద్రి గద్దు
తేరి నన్నుఁగూడితివి తీరునటవయ్య ॥" (16-319)

ఇట్లున్నను శృంగారప్రపంచమున వీరి పదములు ఆధ్యాత్మికతాగౌరవ ముతో భారముగా పట్టినవచున ట్లుండవు. కవితావిహాయసమున వృత్తిరీతు లను ఱెక్కలఁ గట్టుకొని గమ్మున నెగిరిపోవుచున్న ట్లుండును. అందుకే వీరి శృంగార పదములలోని కవితామాధుర్యమునకుఁ జొక్కి "యిది కవిత్వం" బని మెచ్చి, "తవిలి యెన్నినఁ గాళిదాసాదు లైనకవులందుఁ దక్కిన కవులందు నిట్టి కవి తయు శృంగారభావంబు వివరింపఁ గంటిమే వింటిమే ; మున్ను కన్న విన్నవి గాదు గదర యీ పదము"లని సాళ్వ నరసింగరాయఁ డానందించె నఁట ; వీరి యీ పదములలోని కవితామాధుర్యము నరయుఁడు.

నాదనామక్రియ

"యేమొకొ చిగురుటధరమున యెడనెడగస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక గాదుగదా ॥

కలికి చకోరాక్షికిఁ గడకన్నులు కెంపై తోఁచిన
చెలువం బిప్పు డిదేమో చింతింపరె చెలులు
నలువునఁ బ్రాణేశ్వరుపై నాటిన యాకొనచూపులు
నిలువునఁ బెరుకగ నంటిన నెత్తురు కాదుకదా ॥

పడఁతికిఁ జనుఁగవమెఱుఁగులు పైపై బయ్యెద వెలుపల
కడు మించినవిధ మేమో కనుగొనరే చెలులు
వుడుఁగని వేడుకతోఁ బ్రియుఁ డొత్తిన నఖశశిరేఖలు
వెడలఁగ వేసవికాలపు వెన్నెల గాదుగదా ॥" (3-467)

శ్రీగరాం

"రమణుఁడు చూచుఁగాని రమ్మనరే యీవేళ
తమితో నిట్టే దయదలఁచుమీ యనరే ॥

వదనచందురునిపై వాసనకస్తురిబొట్టు
చెదరుచున్నది చూడరే చెలులాల
వదరి రాహువు దన్నుఁ బట్టినట్టి పగదీర
పదిలాన తా మగుడఁబట్టినయట్టుండె ॥

చల్లగాఁ జెలిచెక్కులఁ జల్లినకప్పురధూళి
జల్లనరాలీఁ జూడరే సతులాల !
కొల్లలుగా నయనచకోరములు వెన్నెలలు
వొల్లనె తనిసి వెళ్లనుమిసిన ట్లుండె॥" (13-184)

ఇందలి రచన మృదుపదభూయిష్ఠమై లలితమై శృంగారరసమున కుచిత మగురీతి నున్నది. ఇట్లు వీరి పదములందలి వైదర్భీరీతియు, కైశికీవృత్తియు శృంగారభావప్రకటనమునకుమాత్రమే కాక తదభినయమునకుఁ గూడ నెంతయో అవకాశ మిచ్చుతీరున నున్నది. ఆ దినములలో వీరి పదము లభినయింపఁబడు చుండె ననుట కానాఁటి శాసనాములే కాక ఈ క్రింది యుదాహరణములు కూడ తోడ్పడఁగలవు. అభినయానుకూల మగు వాచికముచేతను, శయ్యాసౌభాగ్యము చేతను నవి సాత్త్వికాభినయమున కెంతవఱకు దోహదమిచ్చుచున్నవో తరువాతి కాలమున నభినయ ప్రధానము లగుక్షేత్రజ్ఞపదముల కివి యెంతవఱకు మార్గదర్శకము లైనవో యిట పరికింపఁ దగును.

భైరవి

"యోగి భోగి నటనం కురువుల్లాసానన మోహన
సాగరోద్భవకన్యకాపతి సారస శ్రీ వేంకటగిరియోగి॥

లీలానక్షత్ర జాలాధికరండ
మాలా త్రైవిక్రమాకారయోగి ॥
హాలాహలకర కోలాహలకర
ఖేలాయుధవంద్య పరిపూర్ణయోగి ॥

కాళీవినుత ప్రహేళిచరితాహి
మౌళిఘనసార విన్యస్తయోగి ॥
గరుడపక్షివాహగమన విహారి
గురునాగ శైలేశ గోరక్కురే ॥

మురళీనాద శృంగ మోహనమురారి
కరుణానంద సాగరశాయిరే ॥
పరమశ్రీ వేంకటపతియవతార
నరరూప గోపికానాథ గోరక్కురే ॥" (17-588)

ఇందలి మాటల కూర్పును "నటనం కురు" అను వాక్యమును నాట్యానుకూల్యమునే వెల్లడించుచున్నవి. ఈ పదమును జూడుఁడు.

శంకరాభరణం

"అలరులు గురియఁగ నాడె నదె
అలకలఁ గులుకుల నలమేల్మంగ ॥

అరవిరిసొబగుల నతివలు మెచ్చఁగ
అరతెర మరుగున నాడె నదె
వరుస నపూర్వదువాళపు తిరుపుల
హరి గరగింపుచు నలమేల్మంగ ॥

మట్టపుమలపుల మట్టెల కెలపుల
తట్టెడి నడపుల దాటె నదే
పెట్టినవజ్రపు పెండెపుతళుకుల
అట్టిటు చిమ్ముచు నలమేల్మంగ ॥

చిందులపాటల శిరిపొలయాటల
అందెల మ్రోతల నాడె నదె
కందువ తిరువెంకటపతి మెచ్చఁగ
అందపు తిరుపుల అలమేల్మంగ ॥" (3-24)

ఈ పదము స్పష్టముగ నలమేల్మంగానాట్యమునే ప్రత్యక్షముగ నభి వర్ణించుచున్నది. ఇందలి మాతువులకూర్పుగాని, భావములతీర్పుగాని స్వరాక్షర క్రమమున నున్నట్లుండి తాళలయాశ్రయ మగునృత్యమునే సూచించు చున్నది. నాట్యానుకూల్యముగల శృంగారపదము లన్నియు నిట్లే లేవు. కొన్నిట మాతు వులకూర్పున ధాతుప్రస్తారమున కవకాశముండి విలంబగతితో పాడఁదగినట్లుండి భావరసాశ్రయ మగునభినయమున కెక్కువ వీలు గల్పించునట్టి పదములుకూడ నున్నవి. ఇట్టి యీ రచనలే తరువాతికాలమున క్షేత్రజ్ఞాదుల అభినయపదరచన కవకాశ మిచ్చియుండు నని తలఁపవచ్చును. ఈ పదముఁ దిలకింపుఁడు.

సామంతం

"ఇచ్చకాలు నీకు నాకు నింక నేలరా — నీ
అచ్చపుఁగోరిక నాతో నానతీయరా—వోరి॥

అమ్మితి నామేను నీకు నప్పుడే వోరీ—చూపు
జిమ్ముల నేఁచ కేమైనాఁ జిత్తగించరా
అమ్మకచెల్ల నే నీకు నడ్డమా వోరీ-యింపు
గుమ్మరింపుచు నాగుట్టు కొల్లగొంటి వోరి-॥" (12-11)

అభినయజ్ఞు లీ పదమునందలి యభినయానుకూల్యమును వివరింపఁగలరు. తంజావూరుప్రతియందలి యీ పదమును జూడుఁడు.

కాంబోది - జంపెతాళం

"బాల నిన్నటిరేయి ప్రాణేశు కలలోన
లాలితంబుగఁ గూడి యిఁక బోవిడువ నని
మేలుకని పొడ గానలేక - వాకిలి మూసి
లోలాక్షి యిటు దివ్వెదెచ్చి ॥
మూలమూలలు వెదకి ముగ్ధ తన ప్రాణేశుఁ
దేలకో పొడచూపఁ దేమీసేయుదు ననుచు
జాలిబడి మదిలోన కీలు వదలిన బొమ్మ
ఆలాగు నేనుంటినే చెలులు ॥చరణము॥

నేయమానను నెంచను—తన్ను
పాయలే పాయలే పాయలే నని చెప్పఁడి చెలులు ॥పల్లవి॥
చెలియ తన పాణేశు చిత్రఫలకము మీఁద
అలగినట్టె వ్రాసి యేలకో పలుకవని

పలికింతు గద్దింతు పలుక వని కోపింతు
పలుమారు వెరగందుచుఁ
అలసి వేసటబొంది యక్కటా వుసురనుచు
సొలసి దిక్కులుచూచి సుడివడ్డ నాప్రేమ
కలఁగుచు మదిలోన కన్నీరు దెచ్చుకొని
కలవరింపుచు నుంటినే చెలులు" ॥చరణము-౨॥

(చూ॥ తంజావూరు ప్రతి)

ఇత్యాదిగా నాలుగైదుచరణములు గల పద మిది. ఇందలి వ్రాతఁతీరు రాగతాళముల నిర్దేశముతో చరణముతో నెత్తుకొని పల్లవిని పిదప సందుకొని పాడెడు తీరును సూచించుచున్నది. సాంప్రదాయకులు నేఁటికిని క్షేత్రజ్ఞుల పదముల నిట్లే యాలపించుట పరిపాటి. అది నాఁటితంజావూరుసంప్రదాయ మనియు తోఁచుచున్నది. అందుకే అచ్చట దొరికిన తాళపత్రప్రతిలోని తాళ్ళపాకవారి పదముల పాటతీరుకూడ నట్లే యున్నది. తిరుపతిరాగిరేకులలో మఱి యాతీరు కానరాదు.[1] అనఁగా వీరి యీ రచనలు రసాభినయమున కనువైనవి కొన్ని తరువాతి కాలమున తంజావూరుమండలమునం దాతీరుగా ప్రచారమును గాంచియున్నవే నేమో ! పైపదము తరువాతికాలపు నారాయణతీర్థులవారి "బాలాగోపాల మాముద్ధర కృష్ణ పరమకల్యాణగుణాకర" అను తరంగపుమట్టునకు దారి నిచ్చినట్లున్నది. ఈ పద మభినయానుకూల్యము గల దనుటలో సందేహము లేదు.

అచ్చముగా నిక రసాభినయమువిషయమున క్షేత్రయ్యకు భిక్ష పెట్టినట్లే యున్న తాళ్ళపాకవారి యీ శృంగారపదరచనను గాంచుఁడు.

---

1. తాళ్ళపాకవారి నిడురేకులలో నొక్కగా నొక్క కీర్తనమాత్రమె ముందు చరణము తరువాత పల్లవి అను క్రమమునఁ జెక్కఁబడి యున్నది.

చూ. 11-2-6 అధోజ్ఞాపిక.

కాంభోది—

"ఏల రాఁడమ్మా యింతిరో వాఁ
డేల రాఁడమ్మా - నన్నేనలివాఁడు ॥

పచ్చనివులుఁగుల బండిమీఁద నుండు
పచ్చవింటి పిన్నశాలునితండ్రి
పచ్చనిచాయలఁ బాయనిబంగారు
పచ్చడముగట్టి బాగైనవాఁడు ॥

తెల్లనివులుగుపైఁ దిరుగ మరిగినట్టి
తెల్లనిసతిపాలిదేవర తండ్రి
తెల్లని పరువుపైఁ దేలిపొరలు వెట్టి
తెల్లనికన్నుల తెలివైనవాఁడు ॥

కొండవింటివాని గుత్తగొనిన యట్టి
కొండుకపాయపుఁ గూతురు తండ్రి
కొండలరాయఁడు కోనేటితిమ్మయ్య
కొండతలనెత్తి గెలుఁతైనవాఁడు ॥" (12—234)

ఇందలి రచన విలంబకాలమున పాడఁదగియున్నది. పల్లవిలో స్వీయా విప్రలబ్ధానాయికా విరహము నుద్యోతముసేయు భావాభినయమును ప్రదర్శింప నగును. ఇక చరణములం దానాయకుని వర్ణనమునకుఁ దగినట్లు వివిధము లగు ముద్రలతో హస్తాభినయమును ప్రదర్శింపవచ్చును. ఇట్లు నృత్యాభినయముల కనువగు పదములను వీరి రచనలనుండి మఱికొన్నిటి నెత్తి చూపవచ్చును గాని ప్రస్తుతమున కివి చాలు ననుకొందును.[1]

తాళ్ళపాకవారి కీశృంగారపదరచనావిషయమున సంస్కృతమున జయదేవకవి రచితము లగు గీతగోవింద అష్టపదులు పితృస్థానములు. మరల నా క్రమమున తరువాతి క్షేత్రజ్ఞాదుల పదరచనల కివి పితృస్థానమును వహించు చున్నవి. జయదేవుని గీతగోవిందమునందలి శృంగారకపిత్వాంశ నాఁడు తాళ్ళ

1. పై నుదాహరించిన రెండు పదములను క్షేత్రయ మిక్కిలిగా నభిమానించిన "కాంభోజి"రాగమునందే యుండుట గుర్తింపఁ దగిన విషయము.

పాకవారి పదముల నాశ్రయించి అభినయకళ కాలంబనము గల్పింపఁగా నదియే తరువాతికాలమున క్షేత్రజ్ఞుని పదముల నాలంబముగాఁ గొని మిన్నుముట్టి మూఁడుపూవు లారుకాయ తై వర్ధిల్లినది. జయదేవుని గీతగోవిందరచనను తాళ్ళపాకవారు తమ సంకీర్తనలక్షణమున స్మరించినారుకూడ ; అందలి యష్టపదులను బోలిన సంస్కృతాష్టపదుల నీకవు లెన్నిటినో రచించిరి. మచ్చున కొకటి చూడఁదగును.

శంకరాభరణం

"అహో సురతవిహారోయం
సహజ పరాజయశంకా నాస్తి॥

యమునాకూలే సుమలతాగృహే
విమలసైకతవివిధస్థలే
రమణీరమణౌ రమత స్తయోః
ప్రమదస్య పరాత్పరంనాస్తి ॥౧॥

రజనీకావా ప్రాతః కింవా
త్యజనం భజనం తత్కింవా
విజయః కోవాపజయః కోవా
భుజపరిరంభస్ఫుటం నాస్తి ॥౨॥

పరిమళభరిత ప్రచురసుశీతల
వరమృదువాయౌ వాతిసతి
తిరువేంకటగిరిదేవరాధయో
స్సరసరతిసుఖశ్రాంతిర్నాస్తి ॥౩॥" (12–78)

ఇది పదముల (చరణముల) సంఖ్యనుబట్టియే కాక పలుకుబడినిబట్టియు, భావసంపదనుబట్టియుఁ గూడ జయదేవుని అష్టపదిరచననే తలపించుచున్నది. రాధామాధవరతిచరితమే యితివృత్తముగాఁ గల సంస్కృతపదరచనలు వీరివి 3, 8, 12, 16 మొదలుగా చరణములు గల వెన్నో యున్నవి. అన్నియు నిట్లే జయదేవుని రచనను పుణికిపుచ్చుకొనినట్టివే యనవచ్చును.

జయదేవుని కవితాప్రభావము తాళ్ళపాకవారి కవితపై ప్రసరించినట్లే తాళ్ళపాకవారి కవితాప్రభావము తరువాతి క్షేత్రజ్ఞాదుల కవితయందును ప్రసరించిన దనవచ్చును. తాళ్ళపాకవారి పదాలకును క్షేత్రజ్ఞులవారి పదాలకును గల సాదృశ్యమును జూడఁదగును.

1. ఇరువురి పదరచనలును బహువిధ శృంగారభావములను, భిన్ననాయకావస్థలను జిత్రించి ప్రతిపాదించునట్టివే.

2. తాళ్లపాకవారి రచనలలో స్వీయానాయికకే ప్రాముఖ్యము. పరకీయానాయికనుగూర్చిన పదములు కొన్నిమాత్రమే గలవు. సామాన్య నాయికాచిత్రణము గల పదములు గానరావు. క్షేత్రజ్ఞుని పదములందును లభించినంతవఱకుఁ జూడ స్వీయకే ప్రాధాన్య మున్నది. శ్రీ విస్సా అప్పారావుపంతులుగారి పరిశీలనమున ప్రకటితములైన పదముల సంపుటిలోను, శ్రీ గిడుగు సీతాపతిపంతులుగారిచేత పరిష్కృతము లైన పదములసంపుటిలోను గూడ స్వీయకు చెందిన పదములే అధికముగా నున్నవి. తరువాత సామాన్యకు సంబంధించిన వధికము. పరకీయకు సంబంధించిన పదములుకూడ నించుమించ చన్నియే యున్నవి. తాళ్ళపాకవారి పదములలో గానరాని సామాన్యనాయికకు క్షేత్రజ్ఞుని పదములలో ప్రవేశము కలుగుటలో వింత లేదు. తాళ్ళపాకవారు స్వామిభక్తులు. నరస్తుతి విముఖులు. విష్ణు (కృష్ణ) భక్తి విషయమున సామాన్యకుఁ దావులే దను విశ్వాసముతో వా రా పదములను రచించినారు. కాని క్షేత్రజ్ఞుఁ డట్లుకాక కళాదృష్టితో పదరచన గావించినాఁడు. నాఁటి రాజుల నవాబుల గొలువులందు వర్తిల్లి, విద్యావినోదము లనుభవించి, శృంగారవిషయమునందలి విస్తృతిని రస వైవిధ్యమును తలమునకలుగా భావించి పదకవిత లల్లినవాఁడు. అతఁడు విద్వత్కవి. ప్రతిభావ్యుత్పత్తులు రెండును ఆతని కవితలో ప్రత్యక్షముగ దర్శనీయ మగుచుండును. అలంకారశాస్త్రవిషయమున కా దినములలో కలిగిన యభ్యుదయము మఱి యెన్నడును కలుగలేదు. అట్టియెడ నాఁటి యలంకారశాస్త్రవిషయమును తలదాకున ట్లీతఁడు పదములు రచించినాఁ డనుటలోఁగాని, క్షేత్రజ్ఞుని పదములనుబట్టి యలంకారశాస్త్రవిషయచర్చ కానాఁ డెంతో పెంపు చేకూరిన దనుటలోఁగాని విప్రతిపత్తి లే దనుకొందును. గోలకొండపాదుషా కొలువున నచటి సుప్రసిద్ధ వాగ్గేయకారుఁ డగు "తులసిమూర్తి"తో వాదు తగిలి నలువది దినములలో వేయిన్నూరుకుఁ బైగా నాతఁడు పదములను జెప్పె నను చారిత్రకవిషయమునుబట్టి యాతఁడు

విద్వత్కవియని తోఁపక మానదు.[1] కనుక శృంగారరసవిషయ మంతయు కర తలామలక మగు నామహాకవి అభినయాలంకారశాస్త్ర లక్ష్యలక్షణ సమన్వయ దృష్టితో పదరచన సాగించియుండు ననుటలో నాతని కెట్టి న్యూనతయు కలుగ దనుకొందును. ఈ కారణములచేతనే తాళ్ళపాకవారి పదరచనలలోఁ గానరాని సామాన్యనాయికకును రసదృష్టితో క్షేత్రజ్ఞుని పదములు స్వీయతోపాటు తుల్య మగు స్థానమునే గల్గించినవి. కావున మన యలంకార శాస్త్ర విషయ ప్రపంచము నకు తాళ్ళపాకవారి శృంగార పదములు ప్రాతిపదికను గల్పింపగా క్షేత్రజ్ఞాదుల పదము లవధులను దెరచిన వని తలఁప వచ్చును.

3. ఈ నాయికావస్థలను జిత్రించు విషయమునందును ఇరువురి రచన లను బోల్చి చూచినపుడు భాషలోను, పలుకుబడిలోను, భావప్రకటనవిధానము లోను సామ్యము గోచరించును. సామెతలును గ్రామ్యోక్తులును పదకవితలకు సహజ మగురీతి నౌచిత్యముతోఁ బ్రయోగింపఁబడినవి.

4. పై రచయితల శృంగారపదములు పెక్కులు నృత్యాభినయముల కనుకూల మగుపదలాలిత్యముతోడను, సౌకుమార్యముతోడను నొప్పునట్టివే. భావప్రదర్శన కనువుగ విలంబగతిలోఁ బాడఁదగినవే.

5. ఇఁక వీరి పాటసంప్రదాయముకూడ నించుమించుగ నొకేతీరున నుండియుండెడిదేమో అనిపించును. తాళ్ళపాకవారి సంప్రదాయ మీనాఁడు ఇద మిత్థముగా నిట్టిదని గుర్తింపఁ దగినసామగ్రి యంతగా కానరాకున్నను, కొంచె మెచ్చుతగ్గుగా నిట్లుండెడి దని చెప్పఁకోఁదగిన సంప్రదాయ మొకటి క్షేత్రయపద ములవిషయమున నేఁటికి నిలిచియుండుటనుబట్టి ఆయాపదరచయితల రచనలలోని స్వరూపసాదృశ్యమును పురస్కరించుకొని తాళ్ళపాకవారి పాటసంప్రదాయ మును గొంచెమేని భావించుట కవకాశముండునేమో అని తలఁతును. తాళ్ళపాక వారు వాడనిరాగములను కొన్ని క్షేత్రజ్ఞుఁడు ప్రయోగించినను క్షేత్రజ్ఞునిచూపు కందనిరాగస్వరూపములను కొన్ని తాళ్ళపాకవారు గుర్తించియుండినను- ఇరువు

---

1. ఈ యంశమును గూర్చి శ్రీ విస్సా అప్పారావుపంతులుగా రిట్లు వ్రాసియున్నారు. "వీనిని బట్టి పదములను వ్రాయుటలో అలంకార శాస్త్రములోని రసమంజరిలోని శృంగార ప్రధానములగు సర్వ లక్షణములను వ్రాయుట క్షేత్రయ్య యొక్క యభిప్రాయమని తోచకమానదు.

(క్షేత్రయ్య పదములు పీఠిక - పుట-57. రెండవ ముద్రణము)

రును సమముగా సభిమానించి ప్రచురముగా వాడుకొనిన రాగములు కొన్ని లేకపోలేదు. తాళ్ళపాకవారు వేలకొలఁదిగా రచించిన శృంగారపదములలో నేఁడు మనకు గోచరించిన రాగములు(నేఁటి -1975-వరకుపరిచూచిన లెక్కప్రకారము) 109 మాత్రమే అయినను మనకు లభించిన క్షేత్రజ్ఞుని పదములు నాల్గు వందలలో గోచరించురాగములసంఖ్య 39 మాత్రమే అయినను ముఖారి ఆహిరి కాంభోజి వంటి రాగములకు రెంటను ప్రాముఖ్య మున్నట్లే తెలియవచ్చుచున్నది తాళ్ళపాకవారు అధ్యాత్మసంకీర్తనములందుకన్న శృంగార సంకీర్తనములందే ముఖారి ఆహిరి కాంభోజిరాగముల నధికముగా ప్రయోగించుకొనిరి. క్షేత్రయ్యయు నంతేకద ! ఇరువురకును ఆరాగభావములందలిరక్తి సమముగనే యున్నది.

పైని వివరించిన సాదృశ్యములలోఁ గొన్నిటి కుదాహరణములు పరికింప వచ్చును.

1. చిత్రరచనలో భ్రమ మను భావోదయము గోచరించు వీరి యీ శృంగారపదములలోని సాదృశ్యమును జూడుఁడు.

శ్రీరాగం

"ఒకటికొకటి యాసనుండఁ జెలిభావ మిది
మొకమెదుటనె నన్ను మోవ వ్రాసెనే ॥
పొలఁతికురులు వ్రాయఁబోతేఁ దుమ్మిదలాయ
తలఁగకుండ మోముదమ్మి వ్రాసెనే
కలికికన్నులు వ్రాయఁగ గండుమీలై పొడచూపె
చెలప చెమట నీటిచెక్కులు వ్రాసెనే ॥"(15-70తాళ్లపాక)

కాంభోజి - ఝంప

"ఏమిచేయుదు మోహ మెటువలె దీరును
భామినీమణిని యెవ్వరు తోడితెచ్చేరు ॥
వెలయ నీదుముఖారవిందంబు లిఖియించి
యలరువాసనలు వ్రాయఁగ నేరనైతి
కళలొల్కు నీమోవి గదిసి వ్రాసితిగాని
నెలఁత తేనియ లుంచ నే నేరనైతి ॥

కలికి సొగసైన నీకనులు వ్రాసితిగాని
బెళుకుజూపులు వ్రాయువిత మెరుగనైతి ॥" (126 క్షేత్రయ్య)

రెండు పదములందును నాయికావర్ణనము కేశాదారభ్య పాదపర్యంత మున్నది. రెంటను నాయికలు 'దివ్య'లని యాలంకారికసూచనము. రెంటను పురుషవిరహము— భావోదయము వర్ణితము. తాళ్ళపాకవారి నాయకుఁ డామె రూపును దలంచి యొకటి వ్రాయఁబోయి ఒకటిగా నాయికారూపసౌందర్యము నంతను వ్రాయవలసి వచ్చినది. క్షేత్రజ్ఞుని నాయకుఁ డామెరూపున నొకటి వ్రాయఁజాలి వేరొకటి వ్రాయఁజాలక నాయికాసౌందర్యాతిశయమును భావింప వలసి వచ్చినది.

2. స్వీయా-సురతానందమోహిత లిరువురిపదములందు నొకేతీరున చిత్రింపఁబడుటలోని సాదృశ్యమునకు-

శంకరాభరణం

"ఎవ్వరికి గలదమ్మా యింతభాగ్యము
ఇవ్వల నీతో సరి యెంచరాదే వొరుల ॥
వీడిన తురుముతోడ విరులు పైపైరాల
వాడిన కన్నులతోడ వచ్చేవేమే
యేడ నుంటి విందాకా యెవ్వఁడు నిన్ను బోధించె
చేడె నీసొబగు లిదె చెప్పరాదే నేఁడు ॥
నిద్దురకన్నులతోడ నిండుఁబులకలతోడ
ముద్దుగారే మోముతోడ మురిసే వేమే
వొద్దనె శ్రీవేంకటేశుఁ దొగిఁ గూడు పెరుంగమే
ముద్దరాల నేఁడు నీ మోహ మెంచరాదే ॥"
(13-42 తాళ్లపాక)

మోహన

"మగువ తన కేళికామందిరము వెడలెన్
వగకాడ మా కంచివరద తెల్లవారె నను చు ॥
విడజారుగొజ్జంగి విరిదండ జడతోను
కడుఁ జిక్కువడి పెనఁగు కంటసరితోను

నిడుదకన్నుల దేరు నిదుర మబ్బుతోను
తొడరి పదయుగమునఁ దడబడెడునడతోను ॥"
(247 క్షేత్రయ్య)

ఇరువురును సురతానందసమ్మోహితలై పరవశమునఁ దూలివచ్చుచున్న నాయికలే-

3. నాయకుఁడు దక్షిణుఁడైనను ధృష్టుఁడైనను ఆతనినే నమ్ముకొని ప్రేమాతిశయమును ప్రదర్శించునాయిక చెలులమాటను కాదనుచున్నది.

బౌళి

"మానరే ఆతని నేల మండాడేరు
కానుక మొక్కులివి కడ్డాయముగాదు ॥
కందువఁ దన్నుఁ గూడిన కాంతను నేను
యిందరిలో శ్రీ వేంకటేశుఁ డాతడు
ముందువెనుకల మేలు మోపులాయను
విందుమీఁదవిందు లైతే వెగటులే కావా ॥"
(13-593 తాళ్ళ.)

మధ్యమావతి - అది

"తెలిసితెలియలేక పలికేరు చెలులు
కలిసియున్న నా సామిపై గాఁక సేయ వశమా ॥
నాపాల గల మువ్వగోపాలసామితో
కోపించుకొమ్మని కొమ్మ లనేరు
ఏ ప్రొద్దు నాసామి యెదనిండి యుండగ
బాప మింతెగాని కోపమున కిమ్మున్నదో ॥"
(195 క్షేత్రయ్య)

4. నృత్యాభినయమున కనుకూల మగు పదలాలిత్యము గల పదరచనల లోని సాదృశ్యమునకు-

కాంభోజి

"ఏల రాఁడమ్మా-యింతిరో వాఁ
డేల రాఁడమ్మా నన్నేలినవాఁడు॥

పచ్చనిపులుఁగుల బండిమీఁద నుండు
పచ్చవింటి పిన్నబాలుని తండ్రి
పచ్చనిచాయలఁ బాయని బంగారు
పచ్చడము గట్టి బాగైనవాఁడు॥ " (12-234 తాళ్ల)

మోహన - త్రిపుట

"ఏమో రాఁడమ్మా యిందుండిపోయి జామాయెనమ్మా
భామరో ఆదివరాహుఁడే పతినిగూడెనో ॥

ఎన్నడైన నన్నెడబాసి యీలాగునా
సన్నుతాంగిరో నామాట జవదాటని విభుఁడు
మన్ననతో నిపు దేమగువుల దగిలెనో॥" (132 క్షేత్రయ్య)

5. రాగరక్తిని చరణమునో అనుపల్లవినో ముందుగా నాలాపించి (అభినయించి) పిదప పల్లవి నెత్తుకొని పదమును బట్టుపద్ధతికిని సాదృశ్యమును చూపుటకు-

కాంభోజి - జంపె

"బాల నిన్నటిరేయి ప్రాణేశు కలలోన
లాలితంబుగఁ గూడి యిఁకఁబోవిడువనని
మేలుకని పొడగానలేక-వాకిలి మూసి
లోలాక్షి యిటు దివ్వె దెచ్చి ॥చరణం॥

నేయమానను నెంచను - తన్ను
పాయ్యత్త పాయలే పాయలే నని చెప్పుడి చెలులు ॥పల్లవి॥
(తాళ్ల. చూ. తంజావూరు ప్రతి.)

కాంభోజి - త్రిపుట

"అది యొక్కయుగము వేరే జన్మ మిపుడు
వదరక పోపోవే వాఁ డేల వచ్చీని- వద్దు రావద్దనవే." ॥పల్లవి॥
(క్షేత్రయ్య 283)

తాళ్ళపాకకవులు పదచక్రవర్తులు. వారి శృంగారపదములు మధురభక్తి భండారములు.

# అధ్యాత్మ సంకీర్తనములు

'సా త్వస్మిన్ పరమప్రేమరూపా' (సూ. 2) అని నారదమహర్షి తన భక్తిసూత్రములలో వివరించినట్లు భగవద్విషయక మగురతియే పరిపుష్టిని జెంది భక్తి యగుచున్నది. అదియే అలౌకికమై 'పరమప్రేమ' రూప మగునట్టిది. అట్టి 'ప్రేమస్వరూప మనిర్వచనీయ' (సూ. 51) మని యా మహర్షియే వివరించెను. ఇహపరముక్తిసాధన మగు నట్టిప్రేమయే- భక్తియే- జీవుల కనుసరణీయ మను నంశమును నిరూపించుటకే ఆతఁడు 'భక్తి రేవ గరీయసీ భక్తి రేవ గరీయసీ' (సూ. 81) అని ముక్తకంఠముతోఁ బలికెను.

మహోత్కృష్టమును, పరమప్రేమస్వరూపమును, నగునట్టి భక్తితత్త్వము నుద్బోధించు గేయరచనలే భక్తిసంకీర్తనములు. మన ఆధ్యాత్మిక సంపదకు జీవగఱ్ఱ లగుటచేత వానికే అధ్యాత్మసంకీర్తనము లనియు పేరైనది. తొలియుగముల వేదాములవలె కలియుగమున నీ అధ్యాత్మసంకీర్తనము లున్నవి.

> "మురవైరి కృతయుగమున సర్వజనుల-నిరత నిజధ్యాననిష్ఠచే మెచ్చు క్రతువులఁ ద్రేతాయుగమున నర్చనల-ప్రతిలేనియట్టి ద్వాపరమున నలరు నామూఁడుగముల ధ్యానాదివిధుల-నేమేమి నరులకు నిచ్చు నన్నియును జలజోదరుఁడు నిజసంకీర్తనమునఁ-గలియుగంబున నిచ్చుఁగావున నీవు ప్రతిలేని వేంకటపతిమీఁద భక్తి-వదలక మనుము" (చూ. అన్నమా. చరిత్ర పు. 41).

అని అన్నమయ్య వరదుఁడై పలికినట్లు చిన్నన్న పేర్కొన్నాఁడు. కలియుగంబున సంకీర్తనవేదమే వేదము. అందుకే తాళ్ళపాకవా రిట్లనిరి.

**ఆహిరి**

"కలియుగంబునకుఁ గల దిదియే
వెలసిన పంచమవేదమె కలిగె॥

పర మగువేదము బహుళము చదివియు
హరి నెఱిఁగినవా రరు దనుచు

తిరువాముడి యై దివ్యమంత్ర మై
వెలసిన పంచమవేదమె కలిగె॥

టింకపుమనుజులు పెక్కులు చదివియు
సంకెదీర దెచ్చట ననుచు
సంకీర్తనమే సకల లోకముల
వేంకటేశ్వరుని వేదమె కలిగె॥" (11-2-60)

ఇట్టి వీరి సంకీర్తనవేదమున కాధారభూతుఁ డగు పరమపురుషుఁ డర్చారూపమున వెలసిన ఆ వేంకటేశ్వరుఁడే.

## స్వామివారి రక్షకత్వము :

సర్వకర్తయు నీశ్వరేశ్వరుఁడు నగుప్రత్యక్షదైవ మతఁడే. అతఁడే జగద్రక్షకుఁడు. జీవులపాలిటి ఏడుగడ.

శ్రీ రాగం

"కొలిచినవారిపాలి కొల్ల లివివో
యిల నిట్టిదైవము యింక వేరే కలరా ?॥
యెట్టైన నభయహస్త మెత్తుక కాచుకున్నాఁడ
వట్టె దాసులఁ గాచే నంటా నీవు
తొట్టిన పాపాలు పోఁదోలు నీనామమంత్రాలు
జట్టిగా లోకాల వెదచల్లి నాఁడవు॥
తలఁచినవారికెల్లా ధనధాన్యా లిత్తునంటా
వొలసి శ్రీసతి మోచుకున్నాఁడవు
యిలఁ బావనులఁగా నిందరిఁ జేసేనంటా
నెలమిఁ బాదతీర్థ మేరుఁజేసినాఁడవు॥
పుట్టించ జీవులను భువనములలోపలఁ
గట్టిన బ్రహ్మను నాభిఁ గన్నాఁడవు
అట్టుగఁ బాలువడి చుట్టి రక్షకత్వానికే
యిట్టే శ్రీ వేంకటాద్రి యెక్కినాఁడవు ॥" (9-193)

ఇది యా స్వామివారి మూర్తీభవించిన రక్షాస్వరూపము. అభయరూపము. అన్నియును దైవమే అని నమ్మినవారి కాదైవమే అన్నియు నగును.

పాడి

''వేరొక్కరు లేరు విశ్వమంతా నీ మహిమే
యేరీతి నీవే కలవు యితరము లేదు ॥

తల్లివై రక్షింతువు తండ్రివై పోషింతువు
యిల్లాలవై మోహమిత్తువు నాకు
వొళ్లయి పెరుగుదువు వొగిం బురాకృత మౌదు
యిల్లుముంగిలై వుండుదు వింతా నీ మహిమే॥

దేవుండవై పూజగొందు దిక్కుప్రాణ మౌదువు
కావలసినట్టౌదు కామించినట్టు
శ్రీ వేంకటేశ నీవె చిత్తములోన నుండి
యీవల వైకుంఠ మిత్తు వింతా నీమహిమమే॥'' (2-148)

ఆదైవమున కీడు మరి లేదు. అదియే పరదైవతము. వినుఁడు తాళ్లపాకవా రేమనుచున్నారో !

దేవగాంధారి

''పాపము పాపము ప్రజలాలా
పైపై నిటువలె పలుకకురో॥

హరియందుఁ బుట్టి నజుఁడును శివుఁడును
హరితో సరి వీ రనుబెట్టు ?
పొరిఁ గొండలందుఁ బుట్టినశిల లివి
సరుసఁ బెట్టితే సరి యౌనా ॥'' (9-61)

ఆదైవమే కాదు ఆదైవమును నమ్ముకొన్నవారు కూడ నందరికన్న నధికులే యందురు వారు. అందుకే ఆస్వామివారి ముగ్ధమోహనసౌందర్యమును, అనంతకల్యాణగుణములను తనివితీర వర్ణించి యీకవులు భక్తజనుల నుద్బోధింతురు.'ఆకోటిమన్మథాకారుని' సౌందర్యమును దర్శింపుఁడు -

దివ్యసౌందర్యము :

శ్రీరాగము

"కప్పురమునకుఁ గప్పురమై
చిప్పిలుఁదావి మించె నీతఁడు॥

బంగారమునకు బంగారమై
శృంగార మమరె శ్రీహరికి
అంగమయిన మొల పీతాంబరమున
కొంగుబంగారై కూడె నీతఁడు ॥

తట్టుపునుఁగునకుఁ దట్టుపునుంగై
ఘట్టిమేన మించేఁగా నితఁడు
నెట్టన నొసల నిండినకస్తూరి
బొట్టుచెమటతోఁ బొలిచే నితఁడు॥

పన్నీటిపాదానపన్నీరు తానయి
యిన్నిటి శ్రీవేంకటేశుఁ డితఁడే
ఉన్నతి జలధి నుదయము నందిన
కన్నియకౌఁగిటిఘనుఁ డితఁడు॥ (9-2-7)

ఆ లక్ష్మీకాంతుని నల్లనిమేను కస్తూరితట్టుపునుఁగులతోఁగలసి కన్నుల పండువుగా నున్నది. అజ్ఞానతిమిరమునఁ గొట్టుమిట్టాడు జీవకోటి కాకాజ్యోతులను వెలార్చు నాదేవుని యందచందముల నింకను వారు వర్ణించినారు.

నాట

"నల్లనిమేని నగవుఁజూపులవాఁడు
తెల్లనికన్నుల దేవుఁడు ॥

నీటఁ గలసినట్టి నిండిన చదువులు
తేటపరచినట్టి దేవుఁడు
పాటిమాలినట్టి ప్రాణుల దురితపు
తీట వాపినట్టి దేవుఁడు॥" (3-312)

ఆదేవుఁడు తన సౌందర్యసర్వస మను వలనుబన్ని జీవు లనెడిమత్స్యముల నాకర్షించుచుండును. ఆవలలోఁ జిక్కుకొనిన కవి యిట్లు స్వామిని కృతజ్ఞతతో స్మరించుచున్నాఁడు.

ధన్యాసి

"నే నేమిటాఁతి నీకు నీ రుణము పాపలేను
నానావిధముల నీవే నన్ను ఁ జాయవుగా॥

మతిలో చీకటి మాన్ప మాణిక్యదీపమవై
సతమై నాలికెపైకి చవిదేనెయై
కతలై నన్ను జొక్కించఁ గర్ణామృతమవై
గతియైతివిగా నాకుఁ గమలారమణా॥

చేరి నాకన్నులెదుట శృంగారసమవై
అరసి రక్షింపఁ బితురార్జితమవై
సారపుటిహపరాల సంసారసుఖమవై
యీరీతిఁ బెంచితిగా నా కిందిరారమణా॥" (9-92)

**కల్యాణగుణములు:**

ఇట్టిపరమాత్ముని అనంతకల్యాణ గుణములను బదింబదిగా తాళ్ళపాక కవులు పరవశులై పాడుకొనినారు. మచ్చున కొకటి పరికింపుఁడు.

సాళంగం

"నీకుఁ దొల్లే యలవాటు నిరుహేతుకపుదయ
జోక నురుతమెచ్చిన సులభుఁడవేకా॥

నేరముల దొలఁగించ నెలవులు గలిగించ
గారవించ హరి నీవే కలవు నాకు
నారిపేరఁ బిలిచితే నారాయణ యనెనంటా
చేరి కాచినటువంటి శ్రీపతివిగా॥

దురితము లణఁగించ దుఃఖములు పెడఁబాప
గరిమ కేశవ నీవే కలవు నాకు
మరమరా యంటేను మరి రామ యనెనంటా
తిరముగఁ గాచినట్టి దేవుఁడవుగా॥

వినతులు చేకొని వేడుకతో నన్నుగావ
ఘనుఁడ శ్రీ వేంకటేశ కలవు నాకు
మనసునఁ దలఁచితే మాటలఁ బిలిచెనంటా
తనిసి కంచానవెళ్లే దైవమవుగా॥ (9-162)

ఇందు స్వామివారి "నిర్హేతుకపు దయ" వర్ణిత మైనది. తొలిచరణమున సౌందర్యము, ద్వితీయచరణమున కారుణ్యము, తృతీయచరణమున వాత్సల్యము నను కల్యాణగుణములు వర్ణింపఁబడినవి. ఇట్లే యింకను రామానుజాచార్యులవారు వివరించిన మార్దవస్థైర్యమాధుర్యార్జవ సౌహార్దము లనెడి కల్యాణగుణములు గూడ నీ కవులు తమపదములలోఁ బదింబదిగ ప్రస్తుతించిరి.

**పరావ్యూహాది పంచరూపములు :**

విశిష్టాద్వైతసంప్రదాయము ననుసరించి ఆస లాపరమాత్మని కరుణా స్వరూపమే పరా వ్యూహ విభ వాంతర్యా మ్యర్చా రూపము లను నైదువిధముల ప్రత్యక్ష మగుచుండును. తాళ్ళపాక కవు లాపంచభేదములను వందలకొలఁది పదములలో పరవశించి వర్ణించుకొనిరి. స్థూలముగ నుదాహరింతును.

**1.** పరా :

పరమపదమందలి పరంజ్యోతిస్స్వరూప మిది.

సాళంగనాట

"ఈతఁడే యీతఁడే సుండి యెంత యెంచి చూచినా
చేతనే వరాలిచ్చీ శేషాచలేశుఁడు॥

విశ్వరూపపు బ్రహ్మము విరాట్టయిన బ్రహ్మము
ఐశ్వర్యస్వరాట్టా సామ్రాట్టయిన బ్రహ్మము
శాశ్వత బ్రహ్మాండము శరీర మయిన బ్రహ్మము
యీశ్వరుఁడై మహారాట్టై యిందరిలో బ్రహ్మము ॥

సూర్యునిలో తేజము సోమునిలో తేజము
శౌర్యపుటనలుని భాస్వత్తేజము

కార్యపుటవతారాలఁ గనుఁగొనే తేజము
వీర్యపుటెఱ్ఱుభాగాల విష్ణునామ తేజము" (7-137)

ఇట్టిదే పరమపురుషుని విరాట్స్వరూపమును జిత్రించినట్టి "కిన్నజానేఽహం కేశవాత్పరమహో" (6-83) అను కీర్తనమును. నిత్యముక్తానుభవార్థమై పరమపదమునం దిచ్ఛానుగృహీతం బైన నిత్యవిగ్రహ మది.

## 2. వ్యూహస్వరూపము :

వ్యూహము లనఁగా పరమాత్ముని విశ్లేషరూపములు. జగదుత్పత్తిస్థితి ప్రళయార్థంబును, నుపాసకానుగ్రహార్థమును నిజేచ్ఛావశంబున గైకొన్నరూపము లవి. వైఖానస పాంచరాత్రాగమము లీజీవకోటి నుద్ధరించుటకై పరాస్వరూపమే వ్యూహరూపముల నందియుండు నని వివరించినవి. పాంచరాత్రమున పరావాసుదేవుఁడే వ్యూహవాసుదేవుఁ డగునని కలదు. శుద్ధస్ఫటికాకారము గల యీ వ్యూహవాసుదేవుఁడే మరల సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధరూపములనుగూడ నంది జీవాత్మలను దరింపఁజేయును. ఈ నాలుగురూపములనే చతుర్వ్యూహము లందురు. ఇవే కాక అవాంతరవ్యూహంబులు వివిధంబులు. తాళ్ళపాకవా రిట్టి విశ్లేషరూపములగు వ్యూహములను గీర్తించినారు. చూ. కీర్తనలు.

భూపాళం :

"ఇవియేపో ప్రద్యుమ్న యిహపర సాధనము
భవజలధులతేప పరమ యోగులకు ॥

అనిరుద్ధ పురుషోత్త మాధోక్షజ ఉపేంద్ర
జనార్దన కేశవ సంకర్షణా
నినుఁ దలఁచఁగలేము నిన్నుఁ దెలియఁగలేము
నునుపై నీ నామమె నోటికి సులభము ॥

వామన గోవింద విష్ణు వాసుదేవ హరికృష్ణ
దామోదరాచ్యుత మాధవ శ్రీధరా ॥" (11-110)

ఇట్టిదే చూ. ( 11-35 ) కీర్తనము. వీనియందు పరావాసుదేవుని విశ్లేషరూపము లగువ్యూహములు వర్ణితము లైనవి. ( ఈ వ్యూహస్వరూపములు ప్రసి

ర్థములు నాలుఁగే యైనను ఉపవ్యూహములు 24 ఉన్నవని ఆగమములు చెప్పుచున్నవి).

వైకుంఠవాసుఁడగుపరావాసుదేవుఁడు జీవులకొఱకై వ్యూహవాసుదేవుఁడైనట్లే సృష్టికార్యమునకై నీలమేఘశ్యాముఁడగునారాయణుఁడుకూడ నగునని యాగమములు పలుకుచున్నవి. అట్టి నారాయణుని రూపమునుగూడ తాళ్ళపాక కవులు చిత్రించినారు. చూ. కీర్తనము.

పళమంజరి

"పాల జలనిధిలోఁ బాయని
నీల వర్ణుఁడ వట నీవా యిపుడు ॥
వెదజల్లు మణుల వేయి పడగలను
చెదరని మెరుగుల శేషునిపై
మృదువు పరుపుగా మెల్లనె పొరలుచు
నిదురవోదు వట నీవా యిపుడు ॥
పరమమునీంద్రులు పద్మభవాదులు
ఇరువంకల నుతియించఁగను
అరవిరి మోమున నల్లన నవ్వేడి
నిరతమూర్తి వట నీవా యిపుడు ॥" (11.234)

**3. విభవము :**

ఇదియే సాధుజీవలోకోద్ధరణమునకై యుగయుగముల నవతరించు పరమపురుషుని కరుణాస్వరూపము. దీనికే అవతార మనియు పేరు.

బౌళిరామక్రియ

"ఇతఁడె పరబ్రహ్మ మిదియె రామకథ
శతకోటి విస్తరము సర్వ పుణ్యఫలము ॥
ధరలో రాముఁడు పుట్టె ధరణిజఁ బెండ్లాడె
అరణ్యవాసుల కెల్లా నభయ మిచ్చె
సొరిది ముక్కుఁ జెవులు చుప్పనాతికిఁ గోసె
ఖరదూషణులను ఖండించి వేసె ॥

సౌమిత్రియు భరతుఁడు శత్రుఘ్నుడు గొలువఁగ
భూమియేలె కుశలవపుత్రుల గాంచె
శ్రీమంతుఁడై నిలిచె శ్రీ వేంకటాద్రి మీఁద
కామించి విభీషణు లంకకుఁ బట్టముగట్టె ॥" (11-224)

రావణాదులను జంపి, శరణాగతి నొందినవిభీషణునకుఁ బట్టముగట్టి లోకమున ధర్మమును నెలకొల్పఁజేసిన శ్రీరామావతారము విభవముగ నిందు వర్ణితమైనది. ఇట్టి యవతారము లన్నియు విభవములే. ఇది తత్తత్కాలములందు ధర్మరక్షణార్థ మవతరించి పిదప నంతర్హిత మగునట్టివి. మత్స్య కూర్మ వరాహావతారాదు లన్నియు నిట్టివే. ఈ విభవవర్ణనమున దశావతారములను జిత్రించుకీర్తనములు తాళ్ళపాకవారి వెన్నో కలవు. మచ్చున కొకటిరెండు పదములుచూడుఁడు.

### లలిత (అవతారాలు)

"అరుదైన భవదూరుఁ డగునీతఁడు
అరిదిభావము లందునతఁడువో యితఁడు ॥

[1]కొడుకుటెక్కెమురూపు కోరి కైకొని పెద్ద
కొడుకు కొరకుఁగా గోరపడి
కొడుకువైరి భక్తిఁ గూడినయాతని
నదరి తోఁ జంపినయతఁడువో యితఁడు॥ (1)
(ఇందిట్టివి పదునొకండుచరణము లున్నవి)" (11-2-8)

దశావతారములప్రశంస గలసుదీర్ఘ మగునీపదమున విభవములే వర్ణితములు క్రమమున నిందు పదిచరణములలోఁ బది యవతారము లున్నవి. తుది పదు

1. కొడుకుటెక్కెపురూపు = మీనకేతనుని టెక్కెమునఁగల మత్స్యరూపము.
పెద్దకొడుకుకొరకుగా = బ్రహ్మకొఱకై, అనఁగా వేదముల కొఱకై,
కొడుకువైరిన్ భక్తిఁగూడినయాతనిన్ } బ్రహ్మనెదిరించిన సోదరులగు మధుకైటభులను.

ఈ తొలిచరణమున వేదములనుద్ధరించుటకై విష్ణువెత్తిన మత్స్యావతారము కీర్తింపఁబడినది. ఇందే వేదముల నపహరించిన మధుకైటభులవృత్తాంతమును స్మరింపఁబడినది.

ఇట్లె మిగిలిన పదియవతారములును పదిచరణములలో వర్ణింపఁబడినవి.

నొకండవ చరణమున యథావిధిని వేంకటేశ్వరవర్ణనము ముద్రతో నున్నది. దీనిని ప్రత్యేకముగ 'అవతారాలకీర్తన' మని తాళ్ళపాకవారు పేరునుగూడ బెట్టుకొనిరి.

జీవలోకము నుద్ధరింపవలె ననెడిలంపటమే పరమపురుషునిచేత నిన్నివిభవముల నెత్తించిన దని వ్యంగ్యముగ వర్ణించినా రీకవులు.

ముఖారి

"పెక్కులంపటాల మనసు పేదవైతివి నీకు
నెక్కడా నెవ్వరు లేరు యేమిసేతు వయ్యా॥

[1]కన్నుమూయఁ బ్రొద్దు లేదు [2]కాలుచాచ నిమ్ము లేదు
[3]మన్నుద్రవ్వి క్రిందనైన మనికి లేదు.
మున్నిటివలెనే [4]గోరుమోపనైనఁ జోటు లేదు
ఇన్నిటా నిట్లానైతి వేమిసేతు వయ్యా॥

[5]అడుగిడగ నవ్వల లేదు [6]అండనైన నుండలేదు
పుడమిఁ [7]గూడుగుడువనైనఁ బ్రొద్దు లేదు
[8]వెడఁగుఁదనము విడువ లేదు [9]వేదమైనఁ జదువలేదు
ఎడపఁదడప నిట్ల నీకు నేమి సేతు వయ్యా॥

ఉప్పరములుమానియైన నుండలేదు లోకమందు
నిప్పుడైన [10]నివిహార మిట్లనాయసు
చెప్ప నరుదు నీగుణాలు శ్రీవేంకటేశ యిట్లు
నెప్పుడును ఘనుడ వరయ నేమిసేతువయ్యా॥ "(5-67)

ఇందు అవతారముల వర్ణనము సూక్ష్మచమత్కారములతో నున్నది.

చూడుఁడు. (1) మత్స్యావతారమున కన్నుమూయఁ బ్రొద్దు లేదట-మీనము కన్నుమూయదు కదా :

(2) కూర్మావతారమున కాలుచాఁచ నిమ్ము లే దట-కూర్మము కాళ్ళను లోననే ముడుచుకొని యుండును.

(3) వరాహావతారమున మన్నుఁ ద్రవ్వియు క్రింద నుండదఁట- వరాహము మన్నుఁ ద్రవ్వునేగాని యందే యుండదు గదా!

(4) నృసింహావతారమున హిరణ్యకశిపుని జీల్చి చెండినపిదప గోరు మోపుటకేని చోటు లేకపోయినదట!

(5) వామనావతారమున నడుగిడనైన నవకాశము లేకపోయెనట—విశ్వమంతయు వ్యాపించిన వామనునకు తావులేకనే గదా బలినెత్తిని కాలుపెట్టినది.

(6) పరశురామావతారమున నండఁగానైన నుండలేదట. మఱి యాతఁడు క్షాత్రధర్మమును బూనియు రక్షించుటకు బదులుగా క్షత్రియలోకమునంతను చెండాడినాఁడు కదా!

(7) రామావతారమునఁ గూడుగుడువనైనఁ బ్రొద్దు లేకపోయె నఁట! వనవాసమునను సీతావియోగమునను రావణవధప్రయత్నమునను శ్రీరామచంద్రుఁడు నిజముగనే అగచాటులు పడెనుగదా!

(8) శ్రీకృష్ణావతారమున వెడగుఁదనమును విడువలేదట. శ్రీకృష్ణుని బాల్యక్రీడ లన్నియు లౌకికదృష్టిని వెఱ్ఱిపనులే గదా!

(9) బుద్ధావతారమున వేదమునేని చదువలేదట. బౌద్ధ మవైదికమతమే.

(10) కల్క్యవతారమున నుప్పరములు మానియైన నుండలేదట. కొండ నెక్కి కూర్చున్నాఁడని భావము.

ఇట్లు స్వామి కెవ్వరును లేరని వాచ్యముగ నాయా యవతారములలోని యవగుణముల నెన్నుచున్నట్లే యెన్నుచు వ్యంగ్యముగ నా పరమాత్ముని మహామహిమమునే కవు లిందు వర్ణించిరి. సర్వరక్షకుఁడగు జగన్నాథుఁడు లోకరక్షణ విషయమున నెప్పుడును మేలుకొనినవాఁడే కదా! సర్వాంతర్యామి యగుటచేత నాతఁడు లేనితావు లేనేలేదు. దుష్టశిక్షణము శిష్టరక్షణము నాతని ధర్మములు. వేదపురుషుఁడే యాతఁడు.

ఈ విధముగ దశావతారములవర్ణన తాళ్ళపాకకవులు పలువిధముల పలు కీర్తనములలోఁ గావించిరి. తద్విభవము లగు నృసింహ రామ కృష్ణా ద్యవతారములను విడివిడిగాకూడ నిట్లే కీర్తించిరి. ఆ విషయము ముమ్ముందు వివరింతును.

**4. అంతర్యామి :**

ఇట్లు పరావ్యూహవిభేదములనే కాక వీరు అంతర్యామిస్వరూపమునుఁగూడ పలుకీర్తనములలోఁ గీర్తించిరి. ఉపాసనాసిద్ధికై ఉపాసకాంతరంగంబులకు విషయం బయ్యెడు సుపాస్యవిగ్రహవిశేషం బిది. యోగిహృద్ధ్యానగమ్య మగురూపము. చూడుఁడు.

భూపాలం

"సర్వశక్తివి నీవె సకలలోకేశ్వరా
నిర్వహించి నన్ను రక్షించ నీవె॥

తంద్రిపైఁ జేసినభక్తి దైవమా నీకె సెలవు
తంద్రికిఁదంద్రివి నీ వంతర్యామివి
మంద్రాడి తల్లిపైఁ జేసేమచ్చి కెల్లా నీది
నిందుదల్లిలోవాఁడవు నీవే కనక॥

ఇమ్ముల దేహానకు భోగించినభోగము నీదే
నెమ్మది నంతర్యామివి నీవు గనక
యిమ్ముల శ్రీవేంకటేశ యిన్నియు విన్నవించితే
కమ్మి నాకన్నిటికి కర్తవు నీవేకాన॥" (2-150)

పరమాత్ముఁడే సర్వజీవకోటికి నంతర్యామిరూపమున వెలసి యీ ప్రకృతి దేహమున భోగించుచుండును. ఈ యంశమే పైకీర్తనమున గలదు. ఇట్లు అంత ర్యామి యగుస్వామి కిమ్ముగావుననే తాళ్ళపాకవారు శరీరమును "ఆతఁడు నిత్య నివాస ముండు తిరుమలగిరి పట్టణము" గనే భావించిరి.

ఇట్లు సర్వజీవగతుఁడై సర్వాంతర్యామి రూపమున వెలసి యుండినను భక్తులకు భక్తిచేత సులభుఁడగుటకై అర్చారూపమున పలుక్షేత్రములలో వెలయు చుండును. ఇట్టి అర్చారూపములే పరమాత్ముని నిత్యావతారములు.

**5. అర్చా:**

కలియుగమున తిరుమలగిరిపట్టణమును భూలోకవైకుంఠముగ నొనర్చి వెల సిన శ్రీవేంకటేశ్వరునిదివ్యమంగళస్వరూప మిట్టినిత్యావతార మగునర్చా రూపమే. ఈ సంకీర్తనను పరికింపుఁడు:

శ్రీరాగం

"చేరి కొల్వరో యీతఁడు శ్రీదేవుఁడు
యీ రీతి శ్రీవేంకటాద్రి నిరవైనదేవుఁడు॥

అలమేలుమంగ నురమం దిడుకొన్నదేవుఁడు
చెలఁగి శంఖచక్రాలచేతి దేవుఁడు
కల వరదహస్తముఁ గటిహస్తపు దేవుఁడు
తులసీ శ్రీవత్స వనమాలికల దేవుఁడు

ఘన మకరకుండలవర్ణముల దేవుఁడు
కనకపీతాంబర శృంగారదేవుఁడు
నెనిచి బ్రహ్మాదుల నాభిగన్నదేవుఁడు
జనించెఁ బాదాలగంగ సంగతైనదేవుఁడు

కోటిమన్మథాకారసంకులమైనదేవుఁడు
జూటపుఁగిరీటపు మించుల దేవుఁడు
నాటపుసొమ్ములతోడి వసుధాధిపతిదేవుఁడు
యీటులేని శ్రీవేంకటేశుఁడైనదేవుఁడు॥" (11-1)

తిరుమలమీఁది అర్చారూపమును వర్ణించు నిట్టిసంకీర్తనములను తాళ్ళపాకవారు వందలకొలఁదిగా రచించినారు. ఇట్లే పలుక్షేత్రములందు వెలసినదైవతములను గూర్చియు వీ రెన్నో పదములను బాడినారు. ఆ విషయమునుగూర్చి మున్ముందు చూడఁదగును. మచ్చున కిచట అహోబిలమందు వెలసిన నిత్యావతారమును గూర్చినపదమునుమాత్ర ముదాహరింతును.

శుద్ధవసంతం

"చేకొన్న భక్తులపాలిటి చింతామణి
సాకారమై వున్నాఁడు సర్వేశ్వరుఁడు

వేవేలు చేతులను వెస నాయుధాలు పట్టి
చేవమీరి ప్రతాపాన సిరుల మించి
యీవల నహోబిలాన నిరవై యున్నవాఁడు
శ్రీ వేంకటాద్రిమీఁది సిద్ధమూర్తి యీతఁడు॥" (11-171)

ఈ విధముగా తాళ్ళపాకకవులు పరమాత్ముని కరుణాస్వరూపావిష్కార వర్ణనమును పలుసంకీర్తనములందు భక్తి యుట్టిపడునట్లు గావించిరి.

పరమాత్ముని కరుణాస్వరూపమునే కాక జగత్కల్యాణార్థ మాతఁడు తాల్చిన వైష్ణవసంకేతరూపము లనఁదగుపంచాయుధములనుగూడ వీరు భక్తితో స్మరించిరి. చూ. కీర్తనము.

**పంచాయుధములు :**

బౌళి

"మా దురితములు వాపి మమ్ము గాచు టరుదా
శ్రీదేవిరమణుఁడ శ్రీ వేంకటేశ ॥

అంబరీషుఁ బైకొన్న ఆపద లన్నియుఁ బాపి
వెంబడిఁ గాచె నీచేపెనుచక్రము
అంబరాన నున్న ధ్రువు నజ్ఞాన మెల్లఁ బాపె
పంబి నీ చేతనున్న పాంచజన్యము ॥

పక్కను జరాసంధు బలమెల్ల నుగ్గాడి
నిక్కము మధుర నిల్పె నీచేగద
తొక్కి హిరణ్యకశిపుఁ దునిమి ప్రహ్లాదుఁ గాచె
నిక్కి నిక్కి మెరసే నీ ఖడ్గము ॥

వెడ రావణునిఁ జంపి విభీషణునిఁ గాచె
చిడిముడిపడక నీచే శార్ఙ్గము
యెడమీక శ్రీ వేంకటేశ నేఁడు నన్నుఁగాచె
బడిబడి నీ నామపఠన నేఁడిదిగో ॥" (9-145)

భారత భాగవత హరివంశపురాణాదులలోఁ గల విష్ణుభక్తులగాథలను స్మరించుచు విష్ణునిపంచాయుధము లెట్లు జగత్కల్యాణమునకుఁ గారకము లైనవో వీ రిందు వివరించినారు. ఈ పంచాయుధ స్మరణముకూడ విష్ణునామస్మరణమువలెనే ముక్తిదము. అందుకే వైష్ణవకవులు పలువురు తమకావ్యారంభములం దీపంచాయు

ధములను భక్తితో స్తుతించిరి. తాళ్ళపాకవారు విశేషించి సుదర్శనచక్రోపాసకు లగుటంబట్టి ప్రత్యేకించి వా రాచక్రమును పలుకీర్తనములలో సంస్తుతించిరి. వైష్ణవసంప్రదాయమున సుదర్శనచక్రమును "చక్రత్తాళ్వా" రని యు పేర్కొందురు.

చూ. కీర్తనములు. స్వామిహస్తమున గలచక్రమును గాంచుఁడు.

బౌళి

"మొక్కేద మిదిగో మూఁడు మూర్తులను
వొక్కరూపమై వొనరెఁ జక్రము॥
చించి హిరణ్యకశిపు పెనురక్తపు
అంచ నర్ఘ్యపాద్యమ్ములను
పంచజన ఘన కపాలపుటెముకను
పంచవాద్యములఁ బరగు చక్రము
బలు మధుకైటభప్రాణవాయువుల
అలరిన నైవేద్యంబులను
యెలమిని శ్రీవేంకటేశుహస్తముల
వెలసి నిలిచి నిదె విజయచక్రము॥" [7-282]

తత్స్వరూపమెట్టిదన- చూ. కీర్తనము.

సాళంగనాట

"నమోనమో దానవవినాశన చక్రమా
సమరవిజయమైనసర్వేశుచక్రమా॥
అట్టె పదారుభుజాల నమరినచక్రమా
పట్టిన ఆయుధముల బలుచక్రమా
నెట్టన మూఁడుగన్నుల నిలిచినచక్రమా
అట్టుగా మన్నించవే మెఱయుచు చక్రమా॥
అరయ నారుగోణాల సమరినచక్రమా
ధారలు వేయిటితోడి తగుచక్రమా

అరక మీఁదికి వెళ్లే అగ్నిశిఖలచక్రమా
గారవాన నీదాసులఁ గావవే చక్రమా॥

రవిచంద్రకోటితేజరాసియైన చక్రమా
దివిజసేవిత మైన దివ్యచక్రమా
తవిలి శ్రీ వేంకటేశు దక్షిణకరచక్రమా
యివల నీదాసులము యేలుకోవేచక్రమా॥"(8-282)

ఇట్లే చక్రత్తాళ్వార్ ఊరేగింపునుగూడ నీకవులు వర్ణించిరి. చూడుఁడు

నా ట

"వెడలె వెడలె సదె వీధులవీధుల
తొడికి దైత్యులను దుంచఁగను॥

కోటిసూర్యు లొకకూటువ గూడుక
చాటువ మెఱసేటి చక్రమా
గాటపు వేవేలు కాలరుద్రులటు
నీటునఁ దొలఁకేటి నిబిడచక్రము॥" (7-281)

పైకీర్తనములందలి చక్రస్వరూపవర్ణనము హరివంశకావ్యమునందలి చక్రవర్ణనముతో సరిపోలియున్నది.

ఇట్లు పంచాయుధములే కాక స్వామివారిశ్రీపాదములును, అభయహస్తమును, శ్రీపాదతీర్థాదులును పలుసంకీర్తనములలో ప్రస్తుతింపఁబడినవి. ద్రావిడ వేదపరు లగునాళ్వారాచార్యులు స్వామివారి అంగప్రత్యంగములను వేరువేరుగా భక్తితో కీర్తించియున్నారు. అట్లే తాళ్ళపాకవారును తత్కీర్తిగానము గావించినారు.

**శ్రీపాదములు :**

చూ. కీర్తనములు.

శ్రీ రా గ ం

"ఈ పాదమే కదా యిలయెల్లఁ గొలిచినది
యీ పాదమే కదా యిందిరాహస్తముల కితవైనది॥

ఈ పాదమే కదా యిహపరము లొసఁగెడిది
యీ పాదమే కదా యిలనహల్యకుఁ గోరికైనది
యీ పాదమే కదా యీక్షింప దుర్లభము
యీ పాదమే కదా యీవేంకటాద్రిపై నిరవైనది॥ "
(5-66)

శ్రీపాదములయొక్క విరాట్స్వరూపమును గాంచుఁడు-

ముఖారి

"బ్రహ్మ గడిగినపాదము
బ్రహ్మము దానే నీపాదము॥

చెలఁగి వసుధ గొలిచిన దీపాదము
బలితల మోపినపాదము
తలఁకక గగనముఁ దన్నినపాదము
బలరిపుఁ గాచిన పాదము॥

కామినిపాపముఁ గడిగినపాదము
పాముతల నిడినపాదము
ప్రేమపుశ్రీసతి పిసికేటిపాదము
పామిడితురగపు పాదము॥" (2-180)

వామనరామకృష్ణాద్యవతారములగాథ లిందు స్మరింపఁబడినవి. తిరుప్పాణాళ్వారు కూడ శ్రీపాదముల నిట్లే కీర్తించినారు.

## శ్రీపాదతీర్థము:

శ్రీపాదమే కాదు శ్రీపాదములఁ గడిగినతీర్థమును మహామహిమోపేతమైనదే. శ్రీపాదతీర్థము జీవుల కర్మరోగముల నపాస్త మొనరించుదివ్యౌషధ మనికీర్తించినారు తాళ్ళపాకవారు. చూ. కీర్తన.

శంకరాభరణము

"శ్రీహరి పాదతీర్థమే చెడనిమందు
మోహపాశాలు గోసి మోక్ష మిచ్చేమందు

కారమై కంటగించని కడుఁజల్లనిమందు
నూరని కాచనియట్టి నున్ననిమందు
కోరికతో వెలవెట్టి కొనితే నొల్లనిమందు
వేరువెల్లంకులు కూర్చనట్టి వెందువోనిమందు॥

గురుతైనరోగములు గుణముచేసేమందు
దురితములు పెడఁబాపే దొడ్డమందు
నిరతము బ్రహ్మాదులు నేరుపుతో నేవించేమందు
నరకముసొరనట్టినయమయినమందు॥" (అన్న మా. పీఠిక. పు. 34)

**అభయహస్తము :**

శ్రీ పాదములవలెనే స్వామివారి అభయహస్తమును విష్ణుభక్తులకు సంపత్ప్రదమే.

ఆ హి రి

"ఇన్నిలాగులచేతు లివియెపో కడు
నెన్నిక కెక్కినచేతు లివియెపో॥

పరమచైతన్యమై ప్రాణుల కెల్లను
యెరవు లిచ్చిన చేతు లివియెపో
తిరువేంకటగిరిదేవుఁడై ముక్తికి
నిరవు చూపెడుచేతు లివియెపో॥" (5-108)

అని తాళ్ళపాకవారు స్వామివారి నాలుగు చేతులను వర్ణించుటయే కాక మిక్కిలిగా వారి అభయహస్తమును మాత్రము విడిగా వర్ణించిరి. చూ. కీర్తనము.

సామంతం

"ఇందరికి నభయంబు లిచ్చుచేయి
కందువ లగుమంచిబంగారుచేయి॥

వెలలేనివేదములు వెదకితెచ్చినచేయి
చిలుకుగుబ్బలిక్రిందఁ జేర్చుచేయి
కలికి యగుభూకాంతఁ గౌఁగిలించినచేయి
వలనైన కొనగోళ్లవాఁడిచేయి॥

తనివోక బలిచేత దానమడిగినచేయి
ఒనరఁగ భూదాన మొసఁగుచేయి
మొనసి జలనిధి యమ్ముమొనకుఁ దెచ్చినచేయి
యెనయ నాఁగేలు ధరియించుచేయి॥

పురసతులమానములు పొల్లసేసినచేయి
తురగంబుఁ బరపేటిదొడ్డచేయి
తిరువేంకటాచలాధీశుఁడై మోతుంబు
తెరువు ప్రాణులకెల్లఁ దెలిపె నీచెయి- (2-319)"

స్వామివారి అభయహస్తవర్ణన మిందు చమత్కారముగ దశావతారవర్ణనముతో జోడింపఁబడినది.

ఇట్లే విడివిడిగా కాకున్నను సంకీర్తనచరణములం దెడనెడ నింకను పాంచజన్య కౌమోదకీయనందకశార్ఙ్గాదులను, శ్రీపాదరేణువును, కిరీటమును, కౌస్తుభపీతాంబరాదులనుగూడ తాళ్ళపాకకవులు వర్ణించినారు. వాస్తవమునకు భక్తులు తొలుత వీనిని పూజించియే పిదప స్వామిని సేవింతురు. వీనితోడి సంపూర్ణ స్వరూపమే స్వామివారి యర్చామూర్తి. అందుకే తాళ్ళపాకవు లిట్లనినారు.

శ్రీరాగం

"చండప్రచండాది జయవిజయులన్
అండఁ బూజించి హరి కటుకదా పూజ॥

గరుడసేనేశులను ఘనుని శేషుని మఱియు
వరమతులఁ బాదసంవాహినులను
కరమొప్ప శంఖచక్రగదాసిశార్ఙ్గముల
అరసి పూజించి హరి కపుడుగా పూజ॥

నవకిరీటమును గుండలహారకౌస్తుభము
లవిరళపుఁ బీతాంబరాదు లలర
వివిధగతిఁ బూజించి వేంకటేశ్వరుపూజ
యివలఁ దళిగలుపెట్టు డిదిగదా పూజ॥" (11-2-9)

ఈ విధముగా పరమాత్ముని కరుణాస్వరూపావిష్కారవర్ణమును తాళ్ళపాక కవులు భక్తిప్రపత్తులతోఁ గావించిరి. ఇప్పు డించుక వారి కీర్తనములలో ప్రతిపాదితమైన భక్తితత్త్వమును గూర్చి వివరింతును.

## భక్తిభేదములు

'ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ
జ్ఞానీ చ భరతర్షభ' (7-16)

అని గీతలో చెప్పఁబడిన శ్లోకవులు పలుసందర్భములందు పలువిధుల పరమాత్మని భక్తి నర్థించు చుందురు.

గుజ్జరి

'ఆర్తుఁడను నేను నీ కడ్డమెవ్వరును లేరు
మూర్తిత్రయాత్మక మొగిఁ గరుణించవే' (7-148)

అని యొకపరి కవి యార్తుఁ డగును.

సాళంగనాట

'వెదకి వెదకి చొప్పులెత్తుచును విచారించితి నిన్నాళ్లె
యిదివో కంటిని శ్రీవేంకటగిరియెదుటనే నీ శ్రీపాదములు'
(2-360)

అని మరియొకపరి జిజ్ఞాసు పసను.

గౌళ

'ఆతురబంధుఁడవు హరి నారాయణ కృష్ణ
మా తలఁ పెరిఁగి నీవే మన్నించితి విపుడు' (7-43)

అని యింకొకపరి యర్థార్థియై వాంఛితార్థములు తీరఁగా స్వామిని కృతజ్ఞతతో స్మరించును. కాని యొక విశేష మున్నది. వీరు కోరువాంఛితములు లౌకికములును గావు- కైవల్యాదులును గావు; సాధారణముగా భగవద్భక్తియో భాగవతదాస్యమో అగుచుండును. అంత మాత్రము కోరినఁ జాలును. చేకూరవలసిన వన్నియు నతని యనుగ్రహమున నవియే చేకూరఁగలవు. అందుకే వారు మఱివేనిని గూర్చియుఁ జింతలు పెట్టుకొనలేదు. సర్వమును స్వామికే సమర్పించుకొనిరి.

"మాతలఁ బెఱిఁగి నీవే మన్నించితి విపుడు
గురుకుమారులఁ దెచ్చుకొని రక్షించినయట్టు
ధరలో గజరాజు నుద్ధరించినట్లు
గరిమఁ జెరలు మాన్పి కాంతలఁ బెండ్లాడినట్లు
సిరులతో మముఁ దెచ్చి సేవలు గైకొంటివి॥" (7-43)

అని యందుకే వా రనుకొనిరి. ఇట్లు ఆర్తుఁడును జిజ్ఞాసువు నర్థార్థి యగుటయేకాక కవి బహుధా జ్ఞానియు నగుచుండును. అందుకే-చూడుఁడు.

శంకరాభరణము

"అటువలెనే సుజ్ఞాని యన్నిపుణ్యములుం జేసి
తటుకున హరి కిచ్చి దా నుండవలెను" (2-373)

గౌళ

'గట్టిగాఁ దెలుసుకొంటే కన్నదే కంటిగురుతు
దట్టమై సుజ్ఞానము తనలోనే వున్నది' (7-42)

అని కవి యనును.

"తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే
ప్రియోహి జ్ఞానినోత్యర్థ మహం సచ మమప్రియః" (7-17)

అను గీతావాక్యము ననుసరించి తాళ్ళపాకకవులు ప్రధానముగా నట్టి జ్ఞానులగు భక్తులే. భగవద్భక్తిని బహువిధముల సాధింపవచ్చును. భాగవత పురాణమున

'శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్॥'

అని చెప్పఁబడిన నవవిధములును, నారదమహర్షి భక్తిసూత్రములలో వివరించిన ఏకాదశవిధములును నిట్టి భక్తిభేదములే. వీని కన్నిటికిని తాళ్ళపాక కవుల రచనలలో నుదాహరణము లెన్నియైన నెత్తి చూపవచ్చును. స్థూలముగ భేదమున కొక్కపదముచొప్పున నుదాహరింతును.

1. శ్రవణము :

దేవగాంధారి

"వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబల మిదివో విష్ణుకథ॥
 ఆదినుండి సంధ్యాదివిధులలో
 వేదం బయినది విష్ణుకథ
 నాదించీ నదె నారదాదులచె
 వీధివీధులనె విష్ణుకథ॥
వదలక వేదవ్యాసులు నుడివిన
విదితపావనము విష్ణుకథ
సదనం బైనది సంకీర్తనయై
వెదకినచోటనె విష్ణుకథ॥" (9-66)

ఇందు శ్రవణభక్తి ప్రతిపాదితము.

**2.** కీర్తనము :

సామంతం

"చాలదా బ్రహ్మమిఁది సంకీర్తనం మాకు
జాలెల్ల నడఁగించు సంకీర్తనం॥
 సంతోషకర మైన సంకీర్తనం
 సంతాప మణగించుసంకీర్తనం
 జంతువుల రక్షించుసంకీర్తనం
 సంతతముఁ దలఁచుఁడీ సంకీర్తనం॥" (11-3-131)

ఇంకను తత్సంకీర్తనమహిమ మిట్టిది గనుకనే—

"దప్పిగొన్నవానికి శీతలోదకమువలె
కప్పి పతివ్రతకు మంగళసూత్రమువలె
ముప్పిరి దరిద్రునకు ముంగిటినిధానమువలె
నెప్పుడు నీ నామ మున్న దింకనేల చింత॥" (2-289)

అని తాళ్ళపాక కవు లాలపించి తనిసినారు. తన్నామస్తుతి నిట్లు వారు గావించినారు.

పాడి

"నారాయణతే నమోనమో
నారదసన్నుత నమోనమో॥

మురహర నగధర ముకుంద మాధవ
గరుడగమన పంకజనాభ
పరమపురుష భవబంధవిమోచన
నరమృగశరీర నమోనమో॥" (11-2-32)

తాళ్ళపాకవారి యీ నామసంకీర్తనములే సంకీర్తనపరులు నేఁటికిని భజనలందు పాడుదురు. ద్రవిడదేశమునందలి వైష్ణవాలయములలో నీ కీర్తనమే 'తోదయమంగళ' మని నేఁటికిని నిత్యము గానముసేయఁబడుచున్నది. ఇది స్తుతిరూపమున వ్యక్త మగుకీర్తనభక్తి కుదాహరణము. స్తోత్ర రచన లన్నియు నీ వర్గమునకుఁ జెందినవే. శ్రవణ కీర్తనముల రూపమై భాగవత పురాణోక్త మగు నీభక్తిభేదములనే మేళవించి నారదమహర్షి 'గుణ మహాత్మ్యాసక్తి' అని పేర్కొని వ్యాసాదులరచనలను తదుదాహరణములుగ నెంచెను. ఈ సంకీర్తన వాఙ్మయము పంచమవేదమేగనుక తాళ్ళపాకవారిరచనలును వ్యాసాదుల రచనలతోఁ దుల్యములే

## 3. స్మరణము :

శ్రవణకీర్తనముల మూలమున స్మరణభక్తి యేర్పడును. దీనినే నారద మహర్షి 'స్మరణాసక్తి' యని పేర్కొనెను. శ్రవణ కీర్తనములవలన నుద్దీపనము నందిన స్థాయి యగు భగవద్రతి యీ స్మరణావస్థయందు రసాభిముఖ మగును. ఈ పదమును బరికింపుఁడు.

మంగళకౌశికి

"నిడువవో మాయా విష్ణువధీనము
వొడలిది నీ కెందు నునికే లేదు॥

శ్రీపతినామము చేకొనె నాలుక
యేపాపములకు నెడలేదు
దాపగు గోవిందుఁ దలఁచినమనసిది
కోపముల కిరవుకొన నెడలేదు

నెలవుగ హరికథ నిండెను వీనుల
కలిదోషము లిక్కడ లేవు
అలరినజన్మం బచ్యుతు శరణని
నిలిచె దుఃఖముల నివారణము॥

శ్రీవేంకటపతిఁ జేరె నాత్మయిది
భావవికారము పనిలేదు
దైవాధీనము తత్త్వవిచారము
వేవేలుకర్మపు విధులే లేవు॥" (9-135)

ఇందు తొలిరెండుచరణములందును కీర్తన శ్రవణములు వర్ణితములైనవి. మూఁడవచరణమున స్మరణాసక్తి వర్ణితమైనది. జీవాత్మ స్మరణాసక్తితో శ్రీ వేంకటపతిని జేరె నట- అందుకే భావవికారము పనిలే దనుట. నారదమహర్షి యీ స్మరణాసక్తికి ప్రహ్లాదుని భక్తి నుదాహరించెను. తాళ్ళపాక కవులును 'అడుగడ్డునకు మాధవానుచింతన సుధా మాధుర్యమున మేను మఱచిన' ప్రహ్లాదునివంటి భక్తులే.

**4. పాదసేవనము :**

పరమాత్మనిపాదములను శరణుగోరి సేవించుటయే పాదసేవనము. చూ. సంకీర్తనము.

**మాళవి**

"శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణనీ శ్రీపాదమే శరణు॥

కమలాసతిముఖ కమలకమలహిత
కమలప్రియ కమలేక్షణా
కమలాసనహిత గరుడగమన శ్రీ
కమలనాభ నీ పదకమలమె శరణు॥" (5-97)

## 5. అర్చనము :

పరమాత్మని యర్చారూపమునకు ఆగమవిహితము లగు నిత్య నైమి త్తికముల నాచరించుటయే అర్చనారూప మగుభక్తి. మేలుకొలుపు మొదలుకొని పవళింపు సేవ వఱకును భక్తు లర్చామూర్తి కొనరించుసేవ లన్నియు నర్చనలే. ఈ క్రింది పవ్వళింపుసేవపాటను పరికింపుఁడు.

మలహరి

"నిద్దిరించీఁ బాలజలనిధివలెనే
ఒద్దిక శ్రీరమణునికి నొత్తరే పాదములు॥

వేగుదాఁకఁ జిత్తగించి విద్దె లెల్ల నాదరించి
బాగుగాఁ గృపారసము పంచిపంచి
యేగతిఁబవళించెనో యెట్లు భోగించెనో
యోగీంద్రవరదుని నూఁచరే వుయ్యాలను ॥

వాలుఁగన్నులరెప్పల వడదాఁకి తనుతావి
చాలుకొన నూర్పుకలు చల్లిచల్లి
నీలవర్ణపుగుణము నెరపుచు నొకయింత
కాలము కన్నులఁ దిప్పీఁ గప్పరే దోమతెర ॥

సరగున యోగనిద్ర చాలించి లోక మెల్ల
కరుణించఁ దలఁచి వేంకటగిరిపై
అరుదుగ సకలలోకారాధ్యుఁ డాయె మించి
విరివి నాలవట్టాల విసరరే సతులు ॥" (3-409)

ఇందు పవళింపుసేవాసందర్భమున పాదము లొత్తుట, ఉయ్యాల నూచుట, దోమతెఱఁ గప్పుట, ఆలవట్టములు విసరుట మున్నగు చర్యలు వర్ణింపఁబడినవి.

పైని వివరించిన అర్చనము, పాదసేవనము అనుభక్తి రూపముల సమ్మేళనమునే నారదమహర్షి పూజాసక్తి యని పేర్కొనెను. తద్భక్తి కాతఁడు అంబరీషాదుల నుదాహరించెను. వారి వలెనే తాళ్ళపాకకవులును స్వామివారి నిత్యసేవల నేమరక గావించుచుండిరి.

**6. వందనము :**

'నారాయణ తే నమోనమో' అనుచు, సర్వశక్తిమంతుఁ డగు పరమాత్ముని మహిమము నెఱిఁగి యాతనికరుణాస్వరూపమగు సర్చామూర్తియొక్క సౌందర్యమునకు లోఁగి యొఁగుటయే వందనరూప మగుభక్తి చూ. సంకీర్తన.

శ్రీరాగం

"విన్నప మిదే నీకు వేవేలువిధముల
నన్నుఁ గావవె హరి నమోనమో॥
    నీగుణము నే నెఱిఁగి నిన్నుఁ గొలువనేర
    నాగుణము నీ వెఱిఁగి నన్ను నేలుకొనవయ్య
    సాగరము నీవు దచ్చి సతిఁ దెచ్చుకొన్నట్టు
    నాగశయనుఁడ హరి నమోనమో॥
మనసులోన నున్ననిన్ను మరవకుండనేర
మనసులోని నీవే నా మరపుఁ దెలుపనయ్యా
పనివడి యహల్యఁ బాదమునఁ గాచినట్టు
ననిచి శ్రీవేంకటేశ నమోనమో॥" (11–127)

ఇందు భక్తుఁడు వందనముసేయుటమాత్రమే కలదు. మీఁద సర్వరక్షకత్వము నా స్వామిదే. అందుకే తాళ్లపాకకవులు మఱియు నిట్లనుచున్నారు.

ధన్యాసి

"దేవదేవం భజే దివ్యప్రభావం
రావణాసురవైరి రఘుపుంగవం॥
    రాజవరశేఖరం రవికులసుధాకరం
    ఆజానుబాహు నీలాభ్రకాయం
    రాజారి కోదండరాజ దీక్షాగురుం
    రాజీవలోచనం రామచంద్రం॥
పంకజాసనవినుత పరమనారాయణం
శంకరార్చితజనక చాపదళనం
లంకావిశోషణం లాలితవిభీషణం
వేంకటేశం సాధు విబుధవినుతం॥" (11–102)

ఇందు స్వామియొక్క నిత్యావతారమున కాకృష్టుఁడైన జీవుని వినతి గోచరించుచున్నది. మహిమోపేతుఁడగు పరమాత్మునిదివ్య సౌందర్యము దృగ్గోచరమో, మనోగోచరమో, అయినప్పుడే భక్తునిమానసము భక్తి తాత్పర్యములతో నిండి శిరసావినమ్రునిగావింపఁజేసి యాతనిచేత వందన మాచరింపఁజేయును. ఇట్లు దర్శన వందనముల రూపమునఁ గల భక్తి విశేషమునే కావచ్చును నారదమహర్షి రూపాసక్తి యని పేర్కొనెను. తద్భక్తి కాతఁడు బృందావన స్త్రీల నుదాహరించెను. వారివలెనే తాళ్ళపాకకవులును తద్రూపాసక్తులై జీవితములను గడపిరి.

## 7. దాస్యము :

శ్రీ విష్ణు కైంకర్యమే, దాస్యమే, దాస్యభక్తి- దీనినే నారదమహర్షి దాస్యాసక్తి యనియు పేర్కొనెను. చూ. కీర్తనము.

ధన్యాసి

"హరి నీదాస్యమునకు నవియేమి సరిగావు
అరయ శుకుఁడు నిన్ను నంటి నీయంతాయను॥
వగలఁదపము నేసి వసిష్ఠు నయ్యేనంటే
వొగి వసిష్ఠుఁడు మింట నొక్కచుక్క
యెగువ యజ్ఞాలు చేసి యింద్రుఁడ నయ్యేనంటే
దిగువ నాయింద్రుఁ డొక్కదిక్పాలకుఁడే॥
ఘన మైనయీవు లిచ్చి కర్ణుఁడ నయ్యేనంటే
వొనర నాతఁడు భువి నొక్కరాజే
అనువై దానాలుచేసి అమరత్వమందేనంటే
కొన నది మేరువుకొండమీఁది బ్రదుకే॥" (2–46)

భగవత్సేవామార్గమున దాస్యమే ఘనమైనయీవు లిచ్చునది. మిగిలిన మఱియేమార్గముననేని కలుగుఫలితము దానికన్న నల్పమే యని కవు లిందు చమత్కారముగ నిరూపించిరి. ఈ కీర్తనమును దిలకింపుఁడు.

దేసాళం

"కైవల్యమునకంటె కైంకర్య మెక్కుడు
శ్రీవిభుఁడవు నీవు మాకుఁ జిక్కేమర్మ మిదివో॥

చేపట్టి నీశిరసు పూజించే అహమికకంటె
నీపాదాలు పూజించే నేమ మెక్కుడు
మాపుదాకా నినుఁ గొల్చి మందెమేళ మౌకంటె
దాపగు నీదాసులశేషత్వ మెక్కుడు॥

హరి నీప్రసాదజీవి నై గర్వించుటకంటె
నరయ నీదాసుల లెంకౌ టెక్కుడు
వెరవున నీచెవిలో విన్నపాలు సేయుకంటే
ధర నీవూడిగకాండ్లఁ దలఁపించు టెక్కుడు॥'' (7-249)

కవులిందు కైవల్యముకంటె కైంకర్యమే ఘన మని ఘంటాపథముగ జెప్పుచున్నారు. ఇందు మఱియొక విశేషము గలదు. భగవద్దాస్యముతోపాటు భాగవతదాస్యమునుకూడ కవు లిందు వివరించిరి. తొలిది దాస్య భక్తి కాఁగా మలిది దాసదాస్యభక్తి యగుచున్నది. దాస్యభక్తికి నారదమహర్షి హనుమ దాదుల నుదాహరింపఁగా తాళ్ళపాకవారు శుకాదుల నుదాహరించిరి. ఇక దాస దాస్య భక్తికి సుప్రసిద్ధోదాహరణము భక్తాంఘ్రిరేణు (తొండరడిప్పొడి యాళు వారి) పవిత్రచరిత్రమే. " స తరతి స తరతి స లోకాంస్తారయతి "(50) యని కదా నారదసూత్రము. అందుకే తాళ్ళపాక కవులు పలు తావుల దాస దాస్య భక్తినే ప్రపంచించిరి. చూ. కీర్తనము.

శ్రీరాగం

"ఇన్ని జన్మము లేటికి హరిదాసు
లున్నవూరం దా నుండినం జాలు ॥

హరిభక్తులయింట నన్నముఁ గొనువారి
వరవుఁడై యుండవలె నన్నంజాలు
పరమభాగవతుల భవనంబులఁ జెడ్డ
పురువు దానయి పొడమినం జాలు ॥ [1]

---

1. యామునాచార్యుల స్తోత్రరత్నమునకూడ నిట్టి భావమే కలదు.
"భక్తి మిమ్మెగొల్చు భాగవతులయింట్ల
కీట భావమైన తేటగాని
అట్లు కానివారి యావాసముల నెంత
బ్రహ్మభావమైన వలదు స్వామి."
(55. నా యనువాదము)

శ్రీవేంకటేశుఁ జూచినవారి శ్రీపాద
సేవకుండై వుండఁ జేరినంజాలు
యీ విభుదాసుల హితపాదధూళి
పావనమై సోఁకి బ్రదికినం జాలు॥" (2-352)

ఈవాసదాస్యభక్తిప్రభావ మెఱిఁగినవారు కావుననే తాళ్ళపాక కవులు కులశేఖరాళ్వారులవలెనే

'కందువ శ్రీవేంకటేశ కడు నీబంటుబంటుకు
సందడిబంటు నవుటే చాలదా (మా)కు॥' (8-23)

అని యానందించినారు. "తస్మిన్ తజ్జనే భేదాభావాత్" (41) అను నారదభక్తి సూత్రము నిట ననుసంధించుకొనఁదగును.

## 8. సఖ్యము :

స్నేహధర్మమున పరమాత్మునితో నెయ్యమునడుపుచుఁ జూపు భక్తి భావమే సఖ్యభక్తి. దీనినే నారదమహర్షి "సఖ్యాసక్తి" యని పేర్కొని తద్భక్తికి ఉద్ధవాదుల నుదాహరించెను. ఇట్టి భక్తికి నరునికూడ నుదాహరింప వచ్చును. నారాయణునియెడ నరునకుఁగలభక్తి సఖ్యభక్తి కుదాహరణమే. ఈ కీర్తనమును పరికింపఁ దగును.

పాడి

"బలువగుఁ దనరూపము చూపెన్
కల దింతయుఁ దనఘన తెఱిఁగించెన్
పాండవరక్షణపరుఁడై నరునకు
నండనె తెలిపె మహామహిమ
దండ విడిచి తనదయతో నర్జును
డుండఁగ మగటిమి నొడఁబడఁ బలికె॥
మగుడఁగ కులధర్మములుఁ బుణ్యములు
తెగి పార్థున కుపదేశించెన్
నగుచు నతనితో నానాగతులను
నిగమము నియమము నిజ మెఱిఁగించెన్॥"

ఇందు నరనారాయణులసఖ్యమే వర్ణితము.

## 9. ఆత్మనివేదనము :

సర్వేంద్రియములతోపాటు నీ శరీరధారి యాత్మసర్వస్వమును పరమాత్మున కర్పించుకొనుటయే ఆత్మనివేదనరూపమగు భక్తి విశేషము దీనినే నారదమహర్షి 'ఆత్మనివేదనాసక్తి' యని పేర్కొని బలివిభీషణులభక్తి నందు కుదాహరించెను. సర్వాత్మసమర్పణమున కీ క్రింది కీర్తనమును జూడుడు.

రామప్రియ

"మఱి నే నేమిసేయంగలను మాధవ! నాశక్తిగల దిదియే
నెఱవుగ భువిలోఁ గలిగినవెల్ల నీ సొమ్ములే కలవి॥

ధరణీధరా! నాతపమనంగా నేటిది
యిరవుగ నామనసుమీఁదెత్తుట యింతే నీకు
పరగంగ నాలోనిభక్తి యనంగా నేటిది
సరగున నాయాతుమ నీకు సమర్పణ మనుటె॥

నుడిగొని పై నాస్తుతి యనంగా నేటిది
నుడిగిన నా నొడుగులు నీకు నోరనె యర్పించితి ననుటె
వడిగా నే గైకొన్నవ్రత మనంగా నేటిది
జడియక నీపాఁద నునుకొనుచు శరణనుటె కలది॥" (2-356)

పైని వివరించిన నవవిధము లగుభక్తులును భాగవతపురాణమందు పేర్కొనఁబడినవే. వానినే పెక్కింటిని నారదశాండిల్యాదులును తమ భక్తి సూత్రములలో నుదాహరించిరి. కాని వీరిలో నారదమహర్షి తన భక్తి సూత్రములలో నీ తొమ్మిదింటికిఁ దుల్యము లగు భక్తి విశేషముల నేడింటిని పేర్కొనుటతో పాటు వాత్సల్యాసక్తి, కాంతాసక్తి, తన్మయాసక్తి, పరమ విరహాసక్తి అను మఱి కొన్నింటిని కూడఁ జేర్చి మొత్తము భక్తి భేదములు పదునొకం డని వివరించెను నారదమహర్షి పిడిగా చెప్పిన పైనాల్గు విధములగు భక్తిభేదములకును తాళ్ళపాకకవుల రచనలనుండి యుదాహరణముల నెత్తి చూపవచ్చును. చూడుఁడు.

## 10. వాత్సల్యాసక్తి :

దేవకీ కౌసల్యలు పరమాత్మస్వరూపులగు తమ బిడ్డలపైఁ జూపినయను రాగవిశేషమునే నారదమహర్షి 'వాత్సల్యాసక్తి' యని పేర్కొనెను. దీనికి తాళ్ళపాకవారి కీర్తనములలో లెక్కలేనన్ని యుదాహరణములఁ జూపవచ్చును. మచ్చున కొకటి.

కాంభోది

"మొత్తకురే యమ్మలాల ముద్దులాఁడు వీఁడే
ముత్తెమువలె నున్నాఁడు ముద్దులాఁడు॥
చక్కనియశోద తన్ను సలిగతో మొత్తరాఁగా
మొక్కఁబోయీఁ గాళ్లకు ముద్దులాఁడు
వెక్కసాన రేపల్లె వెన్నలెల్లా మాపుదాఁకా
ముక్కున వయ్యగఁ దిన్నముద్దులాఁడు॥
రువ్వేడి తాళ్లఁ దల్లి రోలఁ దన్నుఁ గట్టెనంటా
మువ్వలగంటలతోడి ముద్దులాఁడు
నవ్వేడిఁ జెక్కులనిండ నమ్మిక బాలునివలె
మువ్వురలో నెక్కుడైన ముద్దులాఁడు॥ (4-142)

ఇందు పరమాత్ముఁడగు బాలుని చిలిపిచెయ్దములకు పరవశించు మాతృవాత్సల్యము వర్ణితమై యున్నది. (4-1 పదముకూడ నిట్టి భక్తి కుదాహరణమే)

## 11. కాంతాసక్తి:

శ్రీకృష్ణపరమాత్మనియెడ రుక్మిణీసత్యభామలకుఁ గలయనురాగవిశేషము నుదాహరించుచు నారదమహర్షి యీ కాంతాసక్తిని పేర్కొనెను. వాస్తవమునకు తాళ్ళపాకవారి శృంగారసంకీర్తనము లన్నియు నీ కాంతాసక్తి కుదాహరణములుగ నెన్నఁదగినవే. పూర్వ ముదాహరింపఁబడిన ముఖారి రాగపదము "ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము మఱి యిదిగాక వైభవంబిఁక నొకటిగలదా" అనునదీ కాంతాసక్తి కుదాహరణమే.

## 12. పరమవిరహాసక్తి :

నారదమహర్షి ద్రేపల్లెలోని గోపికలవలపు నుదాహరించుచు 'పరమవిరహా

సక్తి'ని పేర్కొనెను. స్వామిసాన్నిధ్యమును నిరంతరముఁ గోరుజీవుల కిది చేకురు నప్పుడీ గోపికలయవస్థలే తటస్థింపఁగలవు. గోపిక లిచట పరమవిరహాసక్తితో నార్తి నొందుజీవులకు ప్రతీకలే. విరహాసక్తి కీ యుదాహరణమును గాంచుఁడు.

సామంతం

"విరహాన నినుఁ బాసి వేగేను
తరుణి నేను నిన్నుఁ దప్పఁదోయఁ గలనా?॥

మున్ను నీవు రేపల్లెను ముచ్చిలించుకొన్నపాలు
వెన్నలును నారగించి విఱ్ఱవీఁగేవు
సన్నపునడిమితోడి జవ్వని నలయుచు
నున్నదాన నీతోడ నోపుదునా పెనంగ॥

నేరుపునం జలనిధిలో నమృతమెల్ల
నారగిం చీలాగున న న్నప్పళించేవు
బీరమునం జిగురాకుఁబెదవితోఁగనుచూపు
గూరిమి నే నుండి నిన్నుం గుచ్చిపట్టఁ గలనా॥" (3-359)

## 13. తన్మయతాసక్తి :

సనత్కుమార, యాజ్ఞవల్క్యుల యనురాగము నుదాహరించుచు నారద మహర్షి యీ 'తన్మయతాసక్తి'ని వివరించెను. ఇది జీవాత్మ పరమాత్మని తోడి యనుభూతి నందుసమయమున నేర్పడుపారవశ్యమున వెల్లడి యగుభక్తివిశే షము. చూడుఁడు.

బౌళి

"యెవ్వరు గలరమ్మ యింక నాకు
నెవ్వగలలోఁ జిత్తము నెలకొన్న దిపుడు॥

మనుప కోరికె దీని మానిపెద నంటినా
వొనగూడి మనసు నావొద్ద లేదు
పెనఁగ తమకము నాపెద నంటినా మేన
అనయము నెరపు దానై వున్న దిపుడు॥

శృంగారపుమేను నా చేతికి లోనంటినా
అంగలించి పరవశమై యున్నది
యింగిత మెఱిఁగి వేంకటేశుఁడు నా కంటినా
కంగుననుం గారించి కలిసె నేఁ డిపుడు॥" (3-356)

తాళ్ళపాకవారి యీ కీర్తనమునందు తన్మయతాసక్తియే ప్రతిపాదిత మైనది.

వ్యాసనారదాదులు విశదీకరించిన భక్తివిశేషము లీవిధముగా వీరి సంకీర్తనములందు దృగ్గోచరము లగుచున్నవి. సత్యమునకు భక్తిస్వరూప మిట్టిది యని గాని తద్భేదము లిన్ని యనిగాని చెప్ప వలను పడదేమో ! భక్తుని హృదయ మెన్నిరీతుల బహిర్గతము లగుచుండునో అన్ని రీతుల భక్తి భేదము లవతరించుచుండగలవు. అందుకే కాఁబోలును 'నానా భక్తు'ల నింక నెన్నిటినో తాళ్ళపాకకవు లిట్లు తడవినారు. చూ. కీర్తన-

సాళంగం

"నానా భక్తు లివి నరులమార్గములు
యేనెపాన నైనా నాతఁ డియ్యకొను భక్తి॥
హరికిఁగా వాదించు టది ఉన్మాదభక్తి
పరులఁ గొలువకుంటే పతివ్రతాభక్తి
అరసి యాత్మగను టదియే విజ్ఞానభక్తి
అరమరచి చొక్కుటే ఆనందభక్తి॥
అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి
ఆతని దాసులసేవే అది తురీయభక్తి
క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి
అతఁడే గతనివుండు టదివైరాగ్యభక్తి॥
ఆట్టే స్వతంత్రుఁ డౌటె అది రాజసభక్తి
నెట్టన శరణనుటే నిర్మలభక్తి
గట్టిగా శ్రీవేంకటేశు కైంకర్యమే సేసి
తట్టుముట్టు లేనిదే తగ నిజభక్తి॥" (7-235)

నారదాదులు వివరించిన భక్తిభేదములకే కాక తాళ్ళపాకవారు నానావిధభక్తులను మఱికొన్నిటిని పేర్కొనినారు. వానిలో ఉన్మాదభక్తి, పతివ్రతాభక్తి, రాక్షస

భక్తి, ఆనందభక్తి మున్నగునవి పరిశీలింపఁదగినవి. "హరికిఁగా వాదించు టది ఉన్మాదభక్తి" యని వారనిరి. ఈ యుదాహరణమును జూడుఁడు.

"పాపము పాపము ప్రజలాలా
పైపై నిటువలె పలుకకురో

హరియందుఁ బుట్టి రజుఁడును శివుఁడును
హరితో సరి పీ దను పెట్లు
పోరి గొండలందుఁ బుట్టినశిల లివి
సరుసఁ బెట్టితే సరియౌనా॥" (9-61)

మతవిషయ మగుతీంద్రనే వారు "ఉన్మాదభక్తి" యనినారు.

ఇట్లే రాక్షసభక్తి - "అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి" అని వారనిరి. చూ. కీర్తనములు.

### ముఖారి

"మొక్కరో మీరు మోసపోక-మీకు
దిక్కుదెసైన ఆదిదేవునికి॥

మారుచేతు లీయవద్దు మారుగా ళ్లీయవద్దు
బీరాన గుండెలుగోసి పెట్టవద్దు
గోరపడి చిచ్చులోన గుండాలు చొఅవద్దు
ఊరకే మీవార మని వున్నఁ జాలు॥

సిడిదల లియ్యవద్దు జీవాలఁ జంపవద్దు
బడిబడి పగ్గాలఁ బారవద్దు
సిడిమీఁద బిత్తరపుచిమ్ములు చిమ్మగవద్దు
కడనుండి...దారిఁ గన్నఁ జాలు॥" (11-2-62)

ఇందు సాహసముతోఁ గావించు రాక్షసపూజావిధానము స్మరింపఁబడినది. ఇట్లే వీరి శృంగారసంకీర్తనములను బెక్కింటిని ఆనందభక్తికిని, పతివ్రతాభక్తికిని నుదాహరణములుగాఁ బేర్కొనవచ్చును. గోదాదేవి రంగనాథుని సేవించిన రీతి పతివ్రతాభక్తియే. మతాంతర సాధనాంతరముల వర్జించి హరిని గొల్చుటే తాళ్ళపాకవా రనినట్లు పతివ్రతాభక్తి కాఁగలదు.

భక్తి బహుభంగు లనుమాట యథార్థమే. పరమాత్ముఁడు భక్తవత్సలుఁడు గాన "నే నెపాననైన నాతఁ డియ్యకొను భక్తి" యనుమాట సత్యమే. భాగవత పురాణమే దీనికిఁ బ్రమాణము - వ్యాసుఁ డిట్లనెనుగదా: "యథా వైరానుబంధేన మర్త్యస్తన్మయతామియాత్ । న తథా భక్తియోగేన ఇతి మే నిశ్చితా మతిః" (7-1-26) - "తస్మాత్ కేనా ప్యుపాయేన మనః కృష్ణే నివేశయేత్"అని కదా సారాంశము: శిశుపాల హిరణ్యకశిపాదు లట్లే కదా కైవల్యము నొందినది; అందుకే కామక్రోధలోభమదమాత్సర్యమోహములచేఁ జీవికి శిథిల మగుచున్నను వెఱువఁ బనిలే దనియుఁ బిలచిన భక్తవత్సలుఁడు వచ్చి పరిరక్షించు ననియుఁ దాళ్ళపాకకవు లిట్లు చమత్కారముగఁ జెప్పుచున్నారు. చూ. కీర్తన.

మాళవిగౌళ

"ఎందుకు విచ్చేయ వేల యిన్నియు నాలోనివే
అంది యవే చేకొనవే ఆరడి నీకేల?॥

కాముకుఁడవై గోపికలఁ బొందఁ బ్రియ మైతే
కాముకత్వము నాయందుఁ గల దెంతైనా
గోమున కంసాదులపై క్రోధమే ఘన మైతే
నాముల క్రోధ మదివో నాలో నున్నది॥

లోకుల చీర లీకుండే లోభమే ప్రియ మైతే
యీకడ లోభము నాలో హెచ్చిన దిదే
మాకులు మద్దులు దొబ్బేమదమే ప్రియ మైతే
చేకొను మదము నాలో నేనానేన॥

మఱి శిశుపాలునిపై మత్సరమే ప్రియ మైతే
మెఱయు మచ్చర మిదే మించీ నాలో
తఱి శ్రీవేంకటపతిదాసులపై మోహము
నెఱి నీకుఁ బ్రియ మైతే నేనే కానా॥" (7-214)

"ఏనకేనా ప్యుపాయేన" అనుట కిది చక్కని యుదాహరణము; ఇట్లే అనంతమైనది భక్తిస్వరూపము. అందుకే నారదమహర్షి "అనిర్వచనీయం ప్రేమ స్వరూపమ్" (51) అని యొక్క సూత్రమున పేర్కొనెను.

ఇట్లు భవ్యమగు భక్తియోగసాధనకై శ్రీమద్రామానుజులవారు వివేక విమోకాదులతోఁ గూడిన సాధనసప్తకము నుదాహరించిరి. అట్టి భక్తియోగాను ష్ఠానమునం దధికారము లేనివారికి [1]సులభోపాయమగు శరణాగతిధర్మమును ప్రబోధించిరి.

ఈశ్వరసాయుజ్యమును బడయుటకు రామానుజమతమున అర్థపంచకము వివరింపఁబడినది. బ్రహ్మస్వరూపమును, జీవరూపమును, ఉపాయస్వరూపమును, విరోధిస్వరూపమును, పురుషార్థస్వరూపమును దెలియుటయే అర్థపంచకజ్ఞానము. వీనిలో నుపాయస్వరూప మెట్టిదనఁగా, బ్రహ్మప్రాప్తికి కర్మ జ్ఞాన భక్తి ప్రపత్తు లను చతుర్విధోపాయములు చెప్పఁబడినవి. కర్మయు నిత్య నైమిత్తిక కామ్యము లని త్రివిధము. బ్రహ్మార్పణబుద్ధితో నిష్కామముగా శాస్త్రవిధి ననుసరించి కర్మ ముల నాచరించుటయే మోక్షమునకు మార్గము. కర్మాచరణమున జీవుని మాలి న్యము తొలఁగి జ్ఞాన ముదయించును. భక్తి యవతరించును. జ్ఞానయోగము స్వస్వ రూపమును ఈశ్వరస్వరూపమును దెలిసికొనుట కుపకరించును. భక్తిసాధనకును, ఈశ్వరానుభవమునకును జ్ఞాన మొక ద్వారము. జ్ఞానవికాసముననే భక్తి యవత రించు ననియు, భక్తిగా పరిణమింపని జ్ఞానము జ్ఞానమే కాజాలదనియు విశిష్టా ద్వైతుల సిద్ధాంతము. తైలధారావదవిచ్ఛిన్నరాగతంబును, ప్రీతిరూపసమాపన్నమై తనర్చు సతత భగవత్స్వరూపాను సంస్మరణరూపమును నగు భక్తియోగంబు తత్పదప్రాపకంబు. ఈ భక్తియోగమున యమనియమాసన ప్రాణాయామ ప్రత్యా హార ధారణ ధ్యాన సమాధు లనునష్టాంగ యోగ మన్వయించును. భక్తియోగము నకు వివేక, విమోక, అభ్యాస, క్రియ, కల్యాణ, అనవసాద అనుద్ధర్షము లను సాధనసప్తకము చెప్పఁబడినది.

1. సాత్త్వికాహారమున కాయశుద్ధి చేసికొనుటయే వివేకము. ఇది బహిశ్శుచి మార్గము.

2. కామక్రోధాదుల నధిగమించుటయే విమోకము. ఇది అంతశ్శుచి మార్గము.

---

1. "సులభమా మనుజులకు హరిభక్తి
వలనొంది మతికదా వైష్ణవుఁ డౌట-
—తిరువేంకటాచలాధిపుఁడైన కరిరాజ
వరదునికృపఁ గదా వైష్ణవుఁ డౌట" (5-86)

3. పై వానికై చేయు నిరంతర యత్నమే అభ్యాసము.

4. దుఃఖ నైరాశ్యములకు దూరమైన పరితృప్తియే అనవసాదము.

5. అతిసంతోషమో, అసంతోషమో లేని మధ్యరక మగు సౌమ్యదశ అనుద్ధర్షము.

6. యథాశక్తిగా నొనరించు పంచమహాయజ్ఞాద్యనుష్ఠానమే క్రియ.

7. సత్య అర్జవ దయా దాన అహింసారూప మగు పరిశుద్ధ జీవనమే కల్యాణము.

ఇట్టి సాధన సప్తకము చేతగాని, అష్టాంగయోగమునగాని బంధవిమోచనమును బడయఁజాలని అనధికారుల కొరకై రామానుజమతమున శరణాగతి యోగము ప్రతిపాదింపఁబడినది. ఇది సర్వజీవకోటికి నుపయుక్తమగు యోగము. దీనికే ప్రపత్తి యనియుఁ బేరు. ప్రపత్తికి సమర్పణమే జీవము. దీనికే న్యాసమనియుఁ బేరు. ఈ శరణాగతియోగమునకు 1. అనుకూల్య స్వసంకల్పము. 2. ప్రాతికూల్య వర్జనము, 3. మహావిశ్వాసము, 4. కార్పణ్యము, 5. గోప్తృత్వవరణము అను నైదు నంగమములు. ఇఁక నారవది యగు "ఆత్మనిక్షేపమే (సర్వాత్మ సమర్పణమే) అంగి.

ఈ ప్రపత్తియోగసాధనకు విశేషాధికారము లేమియు నవసరము లేదు. దేశకాల కులగోత్ర నిరపేక్షముగా నిచ్ఛ పొడమిన వ్యక్తు లెట్టివారైనను ప్రపత్తి మార్గము నవలంబింపవచ్చును. ప్రపత్తి ప్రారబ్ధమును గూడ నశింపఁజేయును. అందువలన సంసారసాగరోత్తరణమునకు ప్రపత్తిని మించిన సాధన మింకొకటి లేదు. ఈ ప్రపత్తిమార్గమును రామానుజులు శరణాగతిగద్యలో కొంత వివరించినారు. కాని దీనికిఁ బెంపు చేకూర్చినవారు వేదాంతదేశికులవారే.

ఈ భక్తియును, ప్రపత్తియును జీవుని ధర్మభూత జ్ఞానముయొక్క అవస్థాభేదములే.

ఇప్పు డాయావిషయములను తాళ్ళపాకవారిపదములు ఆధారముగా సమన్వయించి చూపుదును. వానిలో-

### 1. వివేకము :

ఇది హితాహితాహార జ్ఞానముతో కాయశుద్ధిని గావించుకొను మార్గము.

ఇదియే బహిష్కృచికి మార్గము. స్వామికి సాత్త్వికాహారమే నివేదింపఁబడుచుండును. భక్తుఁడును తత్ప్రసాదములనే పరిగ్రహించు చుండవలెను. ఆ నాళ్ళలో తిరుమల స్వామి కారగింపు జరగుచుండిన పణ్యారము లెట్టివో గమనింపుఁడు.

ధన్యాసి

"పంకజాక్షులు సొలసి పలికి నగఁగా
నింకా నారగించు మిట్లనే అయ్యా॥

కలవంటకములు పులుగములు దుగ్ధాన్నములు
పలుతెరఁగు లైనఅప్పములగములు
నెలకొన్న నేతులును నిరంతపుచక్కెరలు
గిలుకొట్టుచును నారగించవయ్యా॥

పెక్కువగు సైఁదంపుబిండివంటలు మీఁద
పిక్కటిలు మెఱుఁగుఁ బొడిబెల్లములును
వొక్కటిగఁ గలుపుకొని వొలుపుఁబప్పులతోడ
కిక్కిటియ నిటు లారగించవయ్యా॥

కడు మధురమైన మీఁగడపెరుగులును మంచి
అడియాల పూరుగాయల రుచులతో
బడిబడిగ నవకంపుఁ బళ్లెరంబులతోడ
కడునారగించు వేంకటగిరీంద్రా॥" (5-80)

తాళ్ళపాకవారి పై పదమున వర్ణితమైన పణ్యారపువిశేషములే స్వామికివలె భక్తులకును హితమైనవని తలఁపవలెను. అందుకే 'మనసున దలఁచేది మాధవుని పాదములు - దినముఁ గడుపునించేది హరిప్రసాదము' (10-132) అని వారు చెప్పుకొనినారు. ( 5-22 పదమును గూడ చూడఁదగును )

చవియుఁ బుష్టియుఁ గలయాహారపదార్థములే యిందు విధింపఁబడినవి. అందుకే వైష్ణవుల పులుగములును దుగ్ధాన్నములును సైఁదపుబిండివంటలును నాఁడేకాదు నేఁడికిని భక్తకూటముల నాకర్షించుచున్నవి.

## 2. విమోకము:

భక్తియోగమునకు వలయుసాధన సప్తకమున నిది రెండవది. విమోకమన

నాశారాహిత్యము. తాళ్ళపాకకవు లీఆశారాహిత్యమునుగూర్చి భక్తుల కెట్లుద్బోధించుచున్నారో గమనింపుఁడు.

నాట

"లంకెలూడు టేలాభము యీ
కింకరులను నలఁగెడికంటెను॥

జంపులఁజంపక సరగున బాసేటి
లంపటమేపో లాభము
కంపమోపుతో గనలి శరీరపు
కొంపలోన వేగుటకంటెను॥

యీవలనావల నెంచేటియాసల
లావుదిగుటేపో లాభము
యేవగింతలకు నిరవగునరకపు
కొలవులఁబడి మునుగుటకంటెను॥" (2-186)

కామక్రోధాదుల నధిగమించుటయే విమోకము. అందుకే వీరు-

ధన్నాసి

"ఎంత విభవము గలిగె నంతయును నాపదని
చింతించినదిగదా చెడని జీవనము॥

చలముఁ గోపంబుఁ దనుఁ జంపేటి పగతులని
తెలిసినది యదిగదా తెలివి॥"

అని తాళ్ళపాకకవులు పాడుకొనినారు- అంతశ్శుకిది మార్గము

### 3. అభ్యాసము:

ఇది మూడవసాధనము. అంతశ్శుచి కిదియు మార్గమే. అనుష్ఠానరూపమున గల యీ యభ్యాసమునే తాళ్ళపాకకవులు నిజమైనమతస్వరూపముగా భావించిరి. చూ. కీర్తన.

శ్రీరాగం

"అదిగాక నిజమతం బదిగాక యాజకం
బదిగాక హృదయసుఖ మదిగాక పరము॥

అమల మగువిజ్ఞాన మనుమహాధ్వరమునకు
నమరినది సంకల్ప మనుమహాపశువు
ప్రమద మనుయూపగంబమున విశసింపించి
విమలేంద్రియాహుతులు వేల్పంగవలదా॥

అరయనిర్మమకార మాచార్యుఁడై చెలఁగ
వరుసతో ధర్మదేవత బ్రహ్మగాఁగ
దొరకొన్న శమదమాదులు దానధైర్యభా
స్వరగుణాదులు విప్రసమితి గావలదా॥

తిరువేంకటాచలాధిపు నిజధ్యానంబు
నరులకును సోమపానంబు గావలదా
పరగ నాతని కృపాపరిపూర్ణ జలధిలో
నరుహులై యవభృథం బాడంగవలదా॥" (5-40)

ఇట్టి అభ్యాసాదులవలననే భక్తునిలో క్రియ, కల్యాణము అనవసాదము, అనుద్ధర్షత్వము నను మఱికొన్నిలక్షణము లేర్పడుట కవకాశము కలుగును. అవియు భక్తికి సాధనములే. వానిలో

## 4. అనవసాదము:

అనఁగా చింతారాహిత్యము. దుఃఖనైరాశ్యములకు దూరమైన ప్రవృత్తి ఇది. దీనికి చిత్తవిరతి ముఖ్యము. కావుననే చిత్తవిరతి మతమునకు మూలమని తాళ్ళపాకవా రిట్లుచాటిరి. చూ. కీర్తనము.

మాళవి

"ఇదియే వేదాంత మిందుకంటె లేదు
ఇదియే శ్రీవేంకటేశునిమతము

విరతియే లాభము విరతియే సౌఖ్యము
విరతియే పో విజ్ఞానము
విరతిచే ఘనులైరి వెనక వా రెల్లరును
విరతిఁబొందకున్న వీడదు భవము" (11-74)

ఇట్టిదే.

**5. అనుద్ధర్షత్వము:**

ద్వంద్వములం దుద్వేగములేమియే అనుద్ధర్షత్వము. దీని నెఱిఁగి ప్రవర్తించుటయే భక్తియోగసాధనకు మఱియొకమార్గము. చూ. కీర్తనము.

**సాళంగం**

"యివియె తొల్లిటివారు యెంచి నడచినశాంతి
వివరించి కొలిచితే విష్ణుండె శాంతి॥

సకల ఉద్యోగములు చాలించుటె శాంతి
సుఖదుఃఖములు విడచుట్టే శాంతి
వొక రేమియిచ్చినను వొల్లకుండుటె శాంతి
ప్రకటించి రచ్చలకు వాయుటే శాంతి॥

వూరకె నిశ్చింతమున నుండగలదే శాంతి
కోరకుండెసాత్త్వికగుణమె శాంతి
భారము శ్రీవేంకటేశుని పై బెట్టుటే శాంతి
ధీరత తోడుత గుణాతీతుం డౌటె శాంతి॥" (2-377)

అనుద్వేగమున కిట్టిశాంతియే దోహద మిచ్చును గావున భక్తిసాధన కిది యొకమార్గమని తొల్లిటి వారి నుదాహరించి తాళ్ళపాకవా రిట్లు వివరించినారు.

**6. క్రియ:**

పరోపకారబుద్ధి కలిగియుండి పంచమహాయజ్ఞాద్యనుష్ఠానమును యథాశక్తి నొనరించుటయే క్రియ. చూ. కీర్తనము.

**ఆహిరి**

"ఇతర ధర్మము లందునిందు గలదా
మతిఁదలఁప పరము నీమతముననే కలిగె॥

విదురునకుఁ బరలోకవిధి చేసెనఁట తొల్లి
అదె ధర్మసుతుఁడు వర్ణాశ్రమంబులు విడిచి
కదిసి నీ దాసుఁడై నకతముననె కాదె యీ
యెదురనె తుదిపదం బిహముననె కలిగె॥

యిరవైన శబరిరుచు లివియె నైవేద్యమై
పరగెనట శేషమును బహునిషేధము లనక
ధరఁ దదీయప్రసాదపువిశేషమె కాదె
సిరుల శ్రీవేంకటేశ చెల్లుబడులాయ॥" (5-224)

ఇందు దేవపితృయజ్ఞములును, అతిథిపూజయు ప్రస్తావించఁబడినవి. ఇట్లే-

### 7. కల్యాణము:

సత్యనిరతి, ఋజువర్తనము, దయ, అహింస, దాతృత్వము మున్నగు గుణసంపదలను గలిగియుండు పరిశుద్ధజీవనమే కల్యాణము. జీవుఁ డీదేహమును దాల్చునది ఈ యోగ్యతల నలవఱచుకొనుటకే నని తాళ్ళపాకవా రిట్లు వివరించి నారు. చూ. కీర్తనము.

సామంతం

"సకలభూతదయ చాలఁగఁ గలుగుట
ప్రకటించి దేహసంభవ మైనఫలము॥

తలకొన్న ఫలవాంఛఁ దగులకుండఁగఁ జిత్త
మలవరించుట కర్మి యైనఫలము
పలుకర్మములలోన బ్రహ్మార్పణపుబుద్ధి
గలుగుట హరికృప గలిగినఫలము॥" (11-3-94)

సామంతం

"ఇన్నివిధాలు యిక నేలా ప్ర
పన్నుఁడై మీఁద బహువిధు లేల॥

సతతభూతదయ సత్యవాక్యము గలితే
కుతిలపుధర్మాల గొడవ లేలా
ప్రతిలేనివిజ్ఞాన భావశుద్ధి గలిగితే
మతకపుఁ గర్మాలు మరి యేలా॥

పొందుగ నిన్నిటను సమబుద్ధి నిలిచితేను
సందడిలోఁ దీర్థాచరణ మేలా

నిందమాని యాసమాని నిర్మలచిత్తు లయితే
వందదైన వుపవాసవ్రతము లేలా॥

శ్రీ వేంకటపతి చింతనము గలిగితే
పావనపు శాస్త్రాల పఠన లేలా
ఆవల నీతనిదాసులందుఁ బ్రేమగలిగితే
కావరపుటితరసంగతు లేలా॥" (11-128)

ఇందు దయ, అహింస, పరోపకారము, ఋజువర్తనము, మున్నగునంశములు స్పృశింపఁబడినవి. ఇట్లు పైఁ జెప్పఁబడినసాధనలే జీవునకు భక్తియోగసామ్రాజ్యమును సంక్రమింపఁజేయునవి. దాని కిదియే తెరు వనియు వెర వనియు, తాళ్ళపాకవా రెట్లు చాటుచున్నారో గమనింపుఁడు.

సామంతం

" వెనకముందరికిఁ బెద్దలకెల్లను వివరపుసమ్మతి యీవెరవు
వెనుకొని తన గురునాథునియనుమతి వేదోక్తంబగు నీతెరవు॥
కనకాసక్తుఁడు గాకుండుట మది కైవల్యమునకు నొకతెరువు
వనితలభ్రమ లను వలఁ దగులనిమది వైకుంఠమునకు నొక తెరువు
మును కోపముఁ బెడఁబాపినమతి మోక్షమునకును నొకతెరువు
యెనసి యిందుపై హరిఁ దలఁచినమతి యిన్నిటి కెక్కుడు యీతెరువు
నిరతి విషయముల నణఁచినదృఢమతి నిశ్శ్రేయసమున కొక తెరువు
విరతితోడ నెలవైనమతి విభవపుఁబరమున కొకతెరువు
వెరవున నిందరిమీఁదట సమమతి విష్ణులోకమున కొకతెరువు
యిర వెరిఁ గంతట హరినమ్మినమతి యిన్నిటి కెక్కుడు యీతెరువు॥"
( 11-137 )

ఇంతవఱకును గేవల భగవత్సేవారూప మగుముఖ్యభక్తిస్వరూపమును గూర్చియుఁ దత్సాధన కుపయుక్తము లగువిధానములను గూర్చియు తాళ్ళపాకవారి సంకీర్తనములనుండి సోదాహరణముగ వివరించితిని. ఇప్పుడీ ముఖ్యభక్తి యొక్క పరమావధి యనఁదగు ప్రపత్తిభావమునుగూర్చియు నించుక తెల్పుదును. ప్రపత్తి యన నాత్మనిక్షేపమని పూర్వమే వివరించితిని. అట్టి అంగి యగు ప్రపత్తిమార్గమును సాధించుటకు రామానుజాదు లైదంగములను జెప్పి

యుండిరి. ఇట్లు అంగాంగిభావముతోఁ గూడినభక్తినే శరణాగతిధర్మ మనివైష్ణవాచార్యులు పేర్కొనిరి. తాళ్ళపాకకవు లీశరణాగతిధర్మమును చాలరమ్యముగఁ బ్రతిపాదించిరి.

'ఊరకే నీశరణని వుండుటే నాపని గాక
యీరీతి నావుపాయము లేద కెక్కినయ్యా'(8-16) అనియు'
'శరణు శరణు నీకు సర్వేశ్వరా! నీ
శరణాగతే దిక్కు సామజవరదా' (2-228)

అనియు వారు స్వామిని సవిశేషముగ ప్రార్థించిరి. వారి దృష్టిలో శరణాగతిని మించిన ధర్మము లేదు. ఏలన చూ. సంకీర్తనము.

లలిత

"సర్వేశ్వరుండవు స్వతంత్రుఁడవు నీవు
సర్వోత్తముండ వన్నిచ్చటఁ గావవే॥
శక్తి కలిగితే నీ నరస దేవుఁడఁ గానా
యుక్తి గలిగితే నే నొడలుమోతునా
యుక్తియు శక్తియు నొకటి లేక నీ
భక్తుండ నైతి నన్నుం బాలించవే॥
శ్రీ వేంకటేశ నీవు చేసినప్రతిమ నింతే
నీ వెరుంగనిది లేదు నేరుపు నాయందు నేది
భావములోపల నీవె పైకొని బుద్ధియ్యంగా
నీవాఁడ ననుకొంటి నేఁడు గావవె॥" (2-27)

జీవునకు శక్తియుక్తు లేమియు లేవు. ఒకవేళ నున్నను అవి యహంకారమునకే దారితీయునుగాని వేరు కావు. అందుచేత భక్తిసేయుచు భారమంతయు భగవంతునిమీఁద వైచి శరణువేడుటయే శరణాగతి. ఇపుడు తదంగముల నించుకరయుదము.

## 1. ఆనుకూల్యస్వసంకల్పము :

భక్తి కనుగుణ మగు భక్తునిస్వసంకల్ప మిందుకు ముఖ్యము. తాళ్ళపాకకవు లిట్టిస్వసంకల్పము నెట్లు వెల్లడించుచున్నారో గమనింపుఁడు.

శంకరాభరణము

"ఇదియె నాకు మత మిది వ్రతము
నుదుట కర్మము నొల్ల నింకను॥

నిపుణత హరినే నిను శర ణనుటే
తపములు జపములు ధర్మములు
నెపమున సకలము నీవె చేకొనుము
వుపమల పుణ్యము లొల్లనే యింకను॥

హరి నీదాసుఁ డనుకొనుటె నా
పరమును ఇహమును భాగ్యమును
ధర నీమాయల తప్పుదెరువులను
వొరగిన సుకృతము లొల్లనేఁకను॥" (2-172)

ఇట్టి ఆనుకూల్యస్వసంకల్ప ముండుటమాత్రమే చాలదు. తత్ప్రతికూలవిషయము లను పరివర్జించుకొనవలెను కూడ. అందుకే శరణాగతికి రెండవయంగము-

**2. ప్రాతికూల్యవర్జనము:**

ఈ కీర్తనము నరయుఁడు.

నాటనామక్రియ

"ప్రపన్నులకు నిది పరమాచారము
విపరీతాచారము విడువఁగవలయు॥

భగవదపచారము భాగవదపచారముఁ
దగులక దేవతాంతరము మాని
నగధరు శరణము నమ్మి యాచార్యుని
బగివాయనిదే పరమవైష్ణవము॥

దురహంకారము దుఃఖము సుఖమునుఁ
బొరయక ప్రాకృతులపొంతఁ బోవక
దరిశనాభిమానాన ధర్మమువదలక
పరిశుద్ధి నుండుటే పరమవైష్ణవము॥" (7-83)

ఇందు పరమవైష్ణవ మనఁదగుప్రపత్తి కంగమగు ప్రాతికూల్యవర్జనమును కవులు చక్కఁగ నిరూపించినారు. పై రెండింటితోపాటు ప్రపన్నున కుండవలసిన మూఁడవవిషయము సంశయరాహిత్యము. ఇదియే మహావిశ్వాసము.

### 3. సంశయరాహిత్యము:

'సంశయాత్మా ప్రణశ్యతి'(4-40) అని గీతావాక్యము. ఇందువలన పరమాత్మని రక్షకత్వమును గూర్చికానిసర్వశక్తిమత్వమునుగూర్చికానిశక్తునకు సంశయ ముండరాదు. ఈ విషయమును తాళ్ళపాకవా రెట్లు వివరించిరో చూడుఁడు.

సాళంగనాట

"యిదియే కామనిదాన మిదియే మూలధనము
యిదియె నమ్మెట గాక యితరము లేల॥
'న మే భక్త ప్రణశ్యతి' యనుమాట
అమోఘమై నీ వానతియ్యఁగా
రమారమణుఁడ రతి నీ దాసుల కెల్ల
సమోహి నితరవిచారము లేల॥
నాఁడు 'మా మేకం శరణం వ్రజ' యనుమాట
పోఁడిమి దిక్కుల నీ వెప్పుడు చాటఁగా
నేఁడు నీదాసులమై నెరవేరితిమి గాక
వెండివెండి కర్మపువిధు లింక నేల॥
అల 'యోగక్షేమం వహామ్యహ' మ్మనుమాట
అలముచు తుదిపదమై యుండఁగా
నెలవై శ్రీవేంకటేశ నినుఁ గొలిచినమాకుఁ
గలిగె నీ కరుణ యేకథలు నేల॥" (2-57)

ఇందు భగవద్వాక్యమును గవులు త్రికరణశుద్ధిగ విశ్వసించుచున్నారు కనుక సంశయము లేదు. ఇఁక నాల్గవది కార్పణ్యము.

### 4. కార్పణ్యము :

సామంతం

ఇదియే కృపణత్వము – దయనీయ మగు పరిస్థితి. చూ కీర్తనము.

"ఎదురుమాట లాడితి నీకు యీ తప్పులు లోఁగొను నీవు
పదరఁగఁ దగదు నీకు పంతము లిచ్చితిఁ గావఁగదే॥
మునుపే నే విన్నవించితిని విన నవధరించితివి నీవు
వెనకవేసుకో శరణు జొచ్చితిని విడువకు నన్నుచు
నను( జూచి దేహి యంటే నాస్తి యనరాదు నీకు
ఘనయాచకుఁడను నేను కడు దాతవు నీవు॥
వెదకి నిను వేడుకొంటిని విచ్చేసితివి మాయింటికి
వదలఁ దగదు నీభక్తి యొసఁగు నీవాఁడను పాయకు మనుచు
పదిలంబుగ మొక్కినచేతులు బలిమిని గోయరాదు
యిదివో బంటను నేను యేలినవాఁడవు నీవు॥" (7-65)

ఈ కార్పణ్యము రక్షణకొరకైన మొఱగా పర్యవసింపవలెను. అప్పుడా మొఱయే ప్రపత్తికైదవయంగ మగును.

**5. మొఱ :** చూ. కీర్తనము.

మలహరి

"హరికి మొరవెట్టితే అన్నిపనులు లెస్సవును
సరవి నెన్నాళ్లని జాలిఁబడవచ్చును.
యేమిసేయు నీజీవుఁ డీయరివర్గాలతోడ
బూమెల నెన్నాళ్లని పోరాడేని
చూమరలఁ జూడఁజూడఁ జుట్టాలవలెనె వుండి
దోమటి పంచేంద్రియాలు దోడుగాకపోయను॥" (16-6)

కవు లిందు కార్పణ్యము మొఱగా రూపొందించుటను జిత్రించినారు. అట్టి స్థితిలోనే ప్రపన్నుఁడును –

"త్వమేవ శరణం, త్వమేవ శరణంకమలోదర! శ్రీ జగన్నాథా!" (2-308) అని మొఱలిడుకొనును. అప్పుడు భగవంతుఁడు గీతావాక్యప్రమాణము ననుసరించి భక్తుని రక్షించును.

ఇట్లు ఈ అయిదంగములఁ గూడినదే శరణాగతి. దానికి పరాకాష్ఠయే ప్రపత్తి. ఇది యంగి. మిగిలిన వన్నియు దీని కంగములే.

**6. ప్రపత్తి :**

ఇదియే ఆత్మనిక్షేపము. సర్వేంద్రియ సర్వాత్మ సమ్పురణబుద్ధి. తాళ్ళ పాకకవు లీ ప్రపత్తి నిట్లు నిర్వచించినారు.

భూపాళం

"భారము నీపై వేసి బ్రదికియుండుటే మేలు
నారాయణుండ వీవే నాకుం గల వనుచు॥

శరణన్న వెఱపయ్యా సామజముం గాచినట్టి
వరుస దావతిపడి వచ్చేవంట
హరి కృష్ణ యన వెఱపయ్యా ద్రౌపదివర
మిరవుగ నిచ్చినట్టు యిచ్చేవో యనుచు॥" (2-31)

అందువలన నాత్మనిక్షేపముగావించు టొక్కటే గతి. అదియే ప్రపత్తి. అట్టి ప్రపత్తియందే లోకమునందలి వేదములును, వాదములును, వర్ణాశ్రమ ధర్మములును, కర్మములును (2-37), సమస్తము లీయ మందఁ గలవు. ఈ రీతి ప్రపత్తి మాని యితరమార్గము (కర్మము) లూనుట "శిరసుండఁగ మోకాల సేసవెట్టినయట్లు" (2-126) అని వారే వివరించిరి.

నాదనామక్రియ

"ఆతఁడు లోకోన్నతుఁ డాదిమపురుషుఁడు అన్నిటాను పరిపూర్ణుఁడు
చతురుఁ డితఁడే రక్షింపఁగలవాఁడు శరణని బ్రదుకవా వో మనసా।

మరుతండ్రిఁ జూచిన మంచికన్నులను మరొకరిఁ జూచిన నింపౌనా
సిరివరునామము నొడిగిన నోరను చిక్కినపేరులు యితవౌనా
పరమాత్ముని దలఁచిన మనసులోపలను పరులఁ దలఁచితే నొడఁబడునా
కరుణానిధి పుణ్యకథలు వినిన చెవుల కడలసుద్దులు విన సమ్మతించునా॥

గోవిందుఁడె దిక్కై వుండు ఘనులకు కొలిపినా దేవతాంతరములు
భూవల్లభుడెనఁ బుట్టిన జ్ఞానము పొంది పెరొకట నిలిచేనా।
శ్రీ వేంకటపతిపై నిడిన భక్తి చెలులపై నుసుపఁగఁ దగ వవునా।
దేవకినందనుఁ డితనిదాసులఁ దెలియగ జడులపు దరమయ్యీనా॥"
(7-79)

ఇదియే సర్వాత్మ సమర్పణము. ఇట్టి ప్రపత్తికిక జ్ఞాన కర్మ లనవసరము లని తాళ్ళపాకకవులు వివరించినారు. చూ. కీర్తనము.

ఇందలి తత్త్వము మార్జాల కిశోరన్యాయమును దలఁపించుచున్నది. ప్రపత్తి యుండఁగా భారము భగవంతునిదే అనుటయు నాతఁడు సర్వరక్షకుఁడు గావున రక్షించి తీరు ననుటయుఁ దాళ్ళపాకవారి భక్తి మత తత్త్వము. అందుకే,

"నరహరి నీదయ మీఁదట నాచేఁతలు గొన్నా
శరణాగతియును జీవునిస్వతంత్రము రెండా ॥" (9-79)

అని వారు ప్రశ్నింతురు.

## పరమాత్ముఁడు భక్తి సులభుఁడు

పరమాత్ముఁడు 'భక్తికిం బలెన్ జదువులకున్ గరంగఁ' డనుటకు వీరి కీర్తనమును జూడుఁడు.

బౌళి

"చదివి చదివి వట్టి జాలిఁబడు టింతేగాని
యెదుట నిన్ను గానఁగ నితరుల వశమా॥

ఆకారము పొడవు ఆకాశమే యెరుఁగు
ఆకడ జలధిలోతు ఆ జలధే యెఱుఁగు
శ్రీ కాంతుఁడ నీ ఘనము చేరి నీవే యెఱుఁగుదు
నీ కడ నింతంతన నితరుల వశమా॥

శ్రీ వేంకటేశ యన్నిచింతలకు మొదలు
యీవల నీశరణంటే యిటు నీవే యెఱిఁగింతు
దైవమా నీకల్పనలు తగ నీవే యెరుఁగుదు
వీవల నౌఁగా దన నితరుల శవమా॥" (10-121)

పరమాత్ముఁడు తనస్వరూపము నాతఁడే మన కెరుకపడున ట్లును గ్రహింపవలయునే కాని దాని నీరీతి నెరుఁగుదుననుటకు జీవుఁ డెతటింవాఁ డని వారందురు. ఆతని పరిపూర్ణత నెఱుఁగుట కాతనికే శక్యముగాని మనకుఁ గాదు. అది యిట్లే యయినను మఱి దేనికిని గట్టుబడని నారాయణుఁడు భక్తిలతా

చయంబులకు మాత్రమే కట్టువడును. ఆ భక్తసులభుని యపార కారుణ్యమును గలకింపుఁడు-

రామక్రియ

"సులభుఁడు మధుసూదనుఁడు మన
మెలమి నమ్మిన నిట్టే సుండి॥
పడుచుమాటన కాప్రహ్లాదునకు
పొడచూపె నాదిపురుషుఁడు
అడవిదే పోనక ఆ దంతిమొఱకును
తడవి కాచిన దైవము సుండి॥
ఆడుమాటనక అంతలో ద్రౌపదిని
వాఁడిమిఁ గాచినవరదుఁడు
పోఁడిమిఁచేదన కాపొందినకుచేలుని
వీఁడె సంప దిచ్చె విష్ణుఁడు సుండి॥" (5-219)

పరమాత్మనకు బాలుఁడు, వృద్ధుఁడు, పురుషుఁడు, స్త్రీ, వారు వీరు, హెచ్చు తగ్గు లనెడి భేదములే లేవు. ఏక మగునట్టి పరబ్రహ్మమున కెట్టి పక్షపాతమును లేదు. జీవలోక మంతయు నా బ్రహ్మమున కొక్కటే. అందుకే తాళ్ళపాకవా రిట్లు చాటి చెప్పినారు.

బౌళి

"బ్రహ్మమొకటె పరబ్రహ్మమొకటె పర
బ్రహ్మమొకటె పరబ్రహ్మమొకటె॥
కందువగు హీనాధికము లిందులేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ॥
ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ॥
కడఁగి యేనుఁగుమీఁదఁ గాయు యెండొకటే
పుడమి శునకముమీఁదఁ బొలయు నెండొకటే
కడుఁ బుణ్యులనుఁ బాపకర్ములను సరి గావ
జడియు శ్రీవేంకటేశ్వరునామ మొకటే॥" (అన్నమా)

ఈ దేహుల నింక నెవ్వరేని చేపట్టి విడుతురేమోగాని పరమాత్ముఁడు మాత్రము విడువఁడు. ఈ తత్త్వ మెఱిఁగినవారుగావుననే తాళ్ళపాకవా రిట్లు తలపోసినారు

'కడుపులోనిశిశువు కన్నతల్లిఁ దన్నితేను
చెడుగు లెంచక కని పెంచీ నటా
యెడ మీక శ్రీవేంకటేశ నీ కుక్షిలో నేను
తడవి తప్పుసేసినా దయఁ గావవే' (9-148)

అని దేహుల నిట్లు హెచ్చరించినారు.

గుజ్జరి

"తెలిసి బ్రదుకరో దేహులాల
వలె నని తలంచినవారి వాఁడే దేవుండు॥

తనుఁ గొలువకుండితే తారమువెట్టఁ దేలిక
పెనఁగి కొలువకున్నఁ బెట్టు దేవుండు
జనుగుచు విడుతురు చుట్టాలు దరిద్రులైతే
వెనువెంట నెంతయిన విడువఁడు దేవుఁడు" (2-58)

**గురుభక్తి :**

వైష్ణవ తత్త్వమున దైవము తరువాత గురువునకే తత్స్థానము "తస్మిన్ తజ్జనే భేదాభావాత్" (41) అని నారదమహర్షి భక్తి సూత్రములందు వివరించినట్లు తదీయులను తత్సములే. కనుక వారిలోఁ దరణోపాయము నుపదేశించు నాచార్యుఁడే దేహికిఁ బ్రత్యక్ష దైవము కాఁగలఁడు. గురుభక్తిని తాళ్ళపాకకవులు చిత్తశుద్ధితోఁ జాటుకొనిరి. పెదతిరుమలాచార్య చినతిరుమలాచార్యాదులు తాతపాదులును గురుపాదులును నగు అన్నమాచార్యుని భక్తి తాత్పర్యములతోఁ గొనియాడిరి. పెద తిరుమలాచార్యుని యీ కీర్తనము నరయుఁడు.

దేవగాంధారి

"అతిమతిఁ జూడఁబోతే నజ్ఞానిని నేను
మఱుఁగు సొచ్చితి మీకు మహిలో నారాయణా॥

నిన్ను ధ్యానముచేసీ నిచ్చఁ దాళ్లపాక
అన్నమయ్యగా రెదుట నదిగోవయ్యా

పన్ని యాతనినే చూచి పాతకుల మైనమమ్ము
మన్నించవయ్య వో మధుసూదనా॥" (8-127)

ఇందు గురుస్థానము చక్కఁగ జెప్పఁబడినది. పరమాత్ముఁడు ఆచార్యునిఁ దలఁచియేని పాతకు లగు భక్తుల ననుగ్రహించును. అందుకే పరమాత్ముని భక్తి చేతఁ జేరఁ జాలని సామాన్యులు తదనుగ్రహమునకై గురువు నాశ్రయింతురు. ఆ గురువే వారిని పరమాత్మునను కంపకుఁ బాత్రులనుగా జేయును పెద తిరుమలాచార్యుఁ డన్నమాచార్యు నడ్డు పెట్టుకొనుటందులకే.

చిన తిరుమలాచార్యుని యీ సంకీర్తనము నరయుఁడు.

లలిత

"తాళ్లపాకన్నమాచార్య దైవమవు నీవు మాకు
వేళమే శ్రీహరిఁ గనేవెర వానతిచ్చితివి॥
గురుఁడవు నీవె సుమ్మీ కుమతి నైననాకు
సరవి బ్రహ్మోపదేశము నేసితి
పరమబంధుఁడవై నా పరికింప నీవె సుమ్మీ
వరుస నేఁ జెడకుండ వహించుకొంటివి॥" (16-39)

మంత్రోపదేష్టయు, వేదాంతోపనిషద్వాక్యోపదేష్టయు పరమగురువు లని సంప్రదాయము. చిన తిరుమలాచార్యునికి అన్నమాచార్యులే బ్రహ్మోపదేశము చేసిన వారు. అంతేకాదు, శ్రీ వేంకటేశమంత్రము నుపదేశించినవారుకూడ నన్నమాచార్యులే. కనుక వారే ఆతనికి పరమగురువులు.

వైష్ణవాళ్వారుల చరిత్రలో నమ్మాళ్వారు మధురకవియాళ్వారున కెట్లో ఇటు నన్నమాచార్యులు తిరుమలాచార్యుల కట్లు। అటు ద్రావిడవేద మొనర్చిన నమ్మాళ్వారును, ఇటు ద్రావిడవేదము నాంధ్ర మొనర్చిన అన్నమాచార్యులును శ్రీ ఉదయవరులతోపాటుగ పరమగురువులై యా చ ం ద్ర తా రా ర్క ము సాక్షాత్కరించుచుందురు. నమ్మాళ్వారుల నన్నమాచార్యుఁ డెట్లు స్మరించెనో చూడుఁడు.

భైరవి

"చూడుఁ డిందరికి సులభుఁడు హరి
తోడునీడ యగుదొరముని యితఁడు॥

కాపాడఁగ లోకములకు సుజ్ఞాన
దీపమై జగతికిఁ దేజమై
పాపా లడఁపఁగ భవపయోధులకు
తేపై యున్నాఁ డిదె యితఁడు॥
కరుణానిధి రంగపతికిఁ గాంచి
వరునకు వెంకటగిరిపతికి
నిరతి నహోబలనృకేసరికిఁ ద
త్పరుఁ డగుశఠకోపమునియితఁడు॥" (2-117)

పరమాచార్యు లగునుదయవరుల నన్నమాచార్యుఁడు భక్తితో స్మరించిన తెఱఁగు గనుఁడు-

దేసాళం

"గతులన్ని ఖిలమైన కలియుగ మందును
గతి యీతఁడే చూపె ఘనగురుదైవము॥
ఈతనికరుణనే కా యిల వైష్ణవులమైతి
మీతనివల్లనే కంటి మీ తిరుమణి
యీతఁడే కా వుపదేశ మిచ్చె నష్టాక్షరమంత్ర
మీతఁడే రామానుజులు యిహపరదైవము॥ "(7-138)

"మహత్సంగస్తు దుర్లభో ఽ గమ్యో ఽ మోఘశ్చ" (39)

అని నారదభక్తిసూత్రము. గురుతుల్యు లగునిట్టిమహాత్ములసంగము దుర్లభమును, అగమ్యమును, అమోఘమును. అందుకే తాళ్ళపాకకవు లిట్లు గురు స్వరూపు లగుతదీయులను సేవింపుఁడని బోధించుచున్నారు. చూడుఁడు కీర్తనము.

సాళంగనాట

"ఇదియే మర్మము హరి యిందుఁగాని లోనుఁగాఁడు
పదపడి జీవులాల బ్రదుకరో॥
హరిఁ గానలేరు మీరు అర సెందు వెదకినా
గరిమ బ్రత్యక్షముఁగాఁడు దేవుఁ డెవ్వరికి
ధరఁ బ్రత్యక్షము హరిదాసులఁ గొలువరో॥

అంతరంగమున నున్నాఁ డందురు విష్ణుఁడు గాని
అంతట నున్నారు వైష్ణవాధికులు
చెంతల తదియ్యులచేతి యనుజ్ఞవడసి
సంతతము శ్రీ వేంకటేశు శరణము చొరరో॥"(5-243)

తదియ్యులభక్తి యిది స్వామిభక్తికి మర్మ మనినారు తాళ్ళపాకవారు. ఇదియే గురుభక్తిమర్మమును. చినతిరుమలాచార్యుని సందేశమును వినుఁడు.

దేసాక్షి

"ఎన్నటికి నీకు జీవుఁడా యిదియె బుద్ధి వో జీవుఁడా
మన్నించిన నీ గురువులపాదము మఱువకువో వోయి
జీవుఁడా॥" (16-3)

ఇట్లు తాళ్ళపాకకవులు హరియగు వేంకటగిరివల్లభుని, హరినెఱిఁగించెడి గురుని, హరిదాసుల కూడిగముసేయువారిని గూడ తన్మయులై భక్తితో స్మరించి తరించినారు.

## దేహము—జీవుఁడు—దేవుఁడు

**తాళ్ళపాకవారి తాత్త్వికత :**

తాళ్ళపాకకవులు తాత్త్వికభావముల నెన్నిటినో సంకీర్తనములుగా నాలపించిరి. భగవత్సేవలో సంకీర్తనసేవ మహనీయమైన దగుటచేత [1] తత్సేవ లోనేవారు జీవితమెల్లఁ గడిపి తరించినారు. వారు తమ శరీరమునే ఒక పసిఁడి వీణగా భావించి పరమాత్మని చేతి కర్పించుకొని యాతఁడు మీటినట్లెల్ల పలికి వేడుకరాగాలను వింతతాళాలను వినిపింపఁజేసినారు. చూడుఁడు కీర్తనము.

బౌళి

"పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక ముప్పదిరెండువేళల రాగాలను॥

తనువే వాళవు తలయే దండెకాయ
ఘనమైనవూర్పులు రెండు కట్టిన తాళ్లు

1. ఆముక్తమాల్యదలో "మాలదాసరి" కథలో ప్రపంచితమైన సంకీర్తనసేవా మహిమము నిట ననుసంధించుకొనఁ దగును.

మనసే నీబద్దితాడు మరి గుణాశే జీవాళి
మొనసి పుట్టుగే మూలమైన కరడి॥
పాపపుణ్యా లిరువంక పైఁడివెండియనుసులు
పైపై గుత్తికె మేటి పైచనిఁగె
కోపుల నాలిక లోనఁ గుచ్చికట్టినతాడు
చూపరాని సంసారమే సూత్రపుగణికె ॥
జీవునికిని దండెచేసినవాఁడవు నీవు
వావాతిమాటలె నీపై వన్నెపదాలు
యీవి మాకు నిహపరా లిచ్చితివి మెచ్చితివి
శ్రీ వేంకటేశ నీవే చేకొన్న దాతవు ॥" (9-178)

దుర్లభ మగునీమానుషజన్మం బెత్తినఫలమును వారు పూర్ణముగ ననుభవింపవలె నని త్రికరణశుద్ధిగా భావించిరి. ఈ శరీరమును వారొక ఆలయముగ భావించిరి. పరమాత్మని నెలవగు వైకుంఠముగా తలపోసిరి. చూడుఁడు—కీర్తనలు.

మాళవిగౌళ

"నిత్యపూజ లివివో నేరిచిన నోహో
ప్రత్యక్ష మైనట్టిపరమాత్మునికి ॥
తనువే గుడియట తలయే శిఖరమట
పెనుహృదయమే హరిపీఠమటా
కనుఁగొన చూపులె ఘనదీపములట
తనలోపలి యంతర్యామికిని ॥
పలుకే మంత్ర మట పాడైననాలికే
కలకల మనుపిడి (పైడి) ఘంట యట
నలువైనరుచులే నైవేద్యములట
తలఁపులోపల నున్న దైవమునకును॥
గమనచేష్టలే యంగరంగగతి యట
తమిగల జీవుఁడె దాసుఁ డట
అమరిన వూర్పులె యాలవట్టము లట
క్రమముతో వేంకటరాయనికిని ॥" (6-82)

ఇట్లే వారు.

"నీ వున్నచోటనే వైకుంఠము నెరసులు మఱి చొరరాదు
పావన మనిచెప్పేది వేదము పాలించఁగ వలెను॥
దేవుఁడా నాదేహమే నీకు తిరుమలగిరి పట్టణము
భావింప హృదయకమలమె బంగారపుమేడ॥" (2-355)

అనియు వర్ణించుకొనిరి.

వారి దృష్టిలో నీ శరీర మొకరథము. జీవుఁడు సారథి. పంచేంద్రియము లతో నిది పరుగెత్తును. ఇం దధివసించునది పరమాత్ముఁడే. చూ. కీర్తనము.

మాళవి

"గుఱ్ఱాలఁ గట్టనితేరు కొంక కెందైనాఁ బారీ
విఱ్ఱవీఁగుచుఁ దీసీని వేడుకతో జీవుఁడు॥
సరి పిఱుఁదే రెండు జంటబండికండ్లు
సరవితోఁ బాదాలు బాఁపునొగలు
గరిమఁ జూపులురెండు గట్టినపగ్గములు
దొరయై దేహరథము దోలీఁ బో జీవుఁడు॥
పంచమహాభూతములు పంచవన్నెకోకలు
పంచల చేతులు రెండు బలు పెక్కెలు
మించైన శిరసే మీఁద నున్న శిఖరము
పంచేంద్రియరథముఁ బఱపీఁ బో జీవుఁడు॥
పాపపుణ్యములు రెండు పక్కనున్నచీలలు
తోపుల యన్నపానాలు దొబ్బుఁదెడ్లు
యేపున శ్రీవేంకటేశుఁ డెక్కి వీధులనేఁగఁగ
కాపాడినరథము గడిపీఁ బోజీవుఁడు॥" (6-152)

అందుకే వా రీశరీరమును మోదికొని పరమాత్మనూరూర నూరేగించినారు. మత ప్రచారము గావించినారు.

పై సంకీర్తనములలోని ఉపమలు తాత్త్వికభావముల నెంతో రమ్యముగఁ బ్రదర్శించుచున్నవి. శరీర మాలయముకాఁగా జీవుఁడు పూజారి. పరమాత్ముఁడు

మూలవిరాట్టు. శరీరము రథముగాఁగా జీవుఁడుసారథి. పరమాత్మఁ దూరేగు నట్టిదొర. దేహదేహిసంబంధమును జీవునిస్థానమును ఈ సంకీర్తనములు సూచించుచున్నవి. మానుషశరీర మెట్టిదైనను జీవుఁ డెట్టిఁడైనను పరమాత్మనితోడి సంపర్కమే దీనికి భవ్యతను చేకూర్చునట్టిది. చూడుఁడు కీర్తనము.—

సామంతం

"పరుస మొక్కటె కాదా పయిండిగాఁ జేసేది
అరయ లోహ మెట్టున్నా నందు కేమి?॥

వనజనాభుని భక్తి వదల కుండినఁ జాలు
మనసు యెందుదిరిగినా మఱియేమి
మొనసి ముద్రలు భుజముల నుండితేఁ జాలు
తను వెంత హేయమైన దానికేమి॥

శ్రీ కాంతునామము జిహ్వఁ దగిలితేఁ జాలు
యేకులజుండైనను హీనమేమి
సాకారుఁడైనహరి శరణుఁజొచ్చినఁ జాలు
చేకొని పాపము లెన్నిచేసిన నేమి?॥" (2-399)

కావున భక్తియు, భగవదనుగ్రహము నున్నయెడ నీ దేహ మెట్టిదైనను, ఏ జాతియందు జన్మించిన దైనను, దానిని వహించుజీవుఁ డెట్టివాఁ డైనను చింత లేదు. 'నాస్తి తేషు జాతివిద్యారూపకులధనక్రియాదిభేదః.' (72) అనికదా నారదసూత్రము. అందుకే 'ఏ కులజుఁడైననేమి యెవ్వఁడైననేమి ఆకడ నాతఁడె హరినెఱిఁగినవాఁడు' అని వారు నిర్ణయముగఁ జెప్పుకొనఁగల్గినారు.

దేహము,- జీవుఁడు,- దేవుఁడు,- అనునీమూటిలో దేహ మనిత్యము—జీవుఁడు నిత్యుఁడే కాఁగలఁడు కాని అస్వతంత్రుఁడు. దేవుఁడు నిత్యుఁడును స్వతంత్రుఁడు నైనవాఁడు. దేహ మనిత్యము- దేహి నిత్యుఁ డనుటకు చూడుఁడు కీర్తనము -

బౌళి

"దేహి నిత్యుఁడు దేహము లనిత్యాలు
యీహల నామనసా యిదిమరువకుమీ॥

గుదిఁ బాతచీర మాని కొత్తచీరఁ గట్టినట్టు
ముదిమేను మానిదేహ మొగిఁ గొత్త మేను మోచు
అదనఁ జంపఁగలేవుఆయుధము లితని
గదిసి యగ్నియు నీరు గాలిఁ జంపఁగలేవు॥

ఈతఁడు నరకుపడఁ డీతఁ డగ్నిఁ గాలఁడు
యీతఁడు నీట మునుగఁ డీతఁడు గాలిఁ బోడు
చేతనుఁడై సర్వగతుండౌ చెలియించఁ డేమిటను
యీతల ననాదియీతఁ డిరవు గదలఁడు" (7-185)

భగవద్గీతలో,

"వాసాంసిజీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరో పరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ ॥
నైనం ఛిందన్తి శస్త్రాణి నైనం దహతి పావకః
నచైనం క్లేదయం త్యాపో నశోషయతి మారుతః
అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయమక్లేద్యోఽశోష్యఏవచ
నిత్యఃసర్వగతఃస్థాణు రచలోఽయం సనాతనః
అవ్యక్తోఽయ మచింత్యోఽయ మవికార్యోఽయ ముచ్యతే
తస్మాదేవం విదిత్వైనం నానుశోచితుమర్హసి॥" (2-22-25)

అని శ్రీకృష్ణభగవానుఁ డుపదేశించిన విద్యాసారమే పైసంకీర్తనము--
జీవుఁడు పరతంత్రుఁ డనుటకు చూ. కీర్తనము

మాళవిగౌళ

"నీవు సర్వగుణసంపన్నుఁడవు నే నొక దుర్గుణిని
మానవు నన్నొక యెదురుచేసుకొని మనసుచూడ నేలయ్యా॥

అంతర్యామివి నీవు అంగమాత్రమే నేను
చింతింపఁగ నీవే స్వతంత్రుఁడవు శిగి నేఁ
బరతంత్రుఁడను
యింత నీవే దయఁగలవాఁడవు యెప్పుడు
నే నిర్దయుఁడను
చెంతల నన్నొక మొనచేసుక నాచేత లెంచనేలయ్యా॥

శ్రీ వేంకటేశ్వరుఁడవు నీవు సేవకుఁడను యిటు నేను
ఆవలనివల దాతవు నీవు యాచకుఁడను నేను॥
నీవే కావఁగఁ గర్తవు నేనే శరణాగతుఁడను
కైవసమగు నను ప్రతిపెట్టుక నాకథలుయెంచనేలయ్యా॥"
(7-280)

జీవపరమాత్మల యనుబంధము నిత్యమైనది. జీవాత్మ మిథ్య కాదు. పరమాత్మని లోని యంశమే. కాని జీవాత్మయే పరమాత్మయు కాఁజాలదు-. చూ. కీర్తనము-

గుండక్రియ

"నిన్నూ నన్నూ నెంచుకోని నేరమిగాక
పన్నిన సూర్యకాంతి ప్రతిసూర్యుఁడౌనా॥
జలధిలోపలి మీను జలధి దా నౌనా
జలము లాధారమైనజంతువుగాక
నెలవై నీలోనివాఁడ నీవే నే నౌదునా
పొలసి నీయాధరువుబొమ్మనింతేకాక॥
రాజువద్ద నున్నబంటు రాజే తా నౌనా
రాజసపు చనవరి రచనేకాక
సాజమై నిన్నుఁ గొలిచి సరిగద్దె నుందునా
వోజతో నిన్ను సేవించివుందు నింతేకాక
ముత్తెపుఁజిప్పలో నీరు మున్నిటివలె నుండునా
ముత్తెములై బలిసి లో మొనపుఁగాక
నిత్తెపు శ్రీవేంకటేశ నీ శరణాగతులము
మొత్తపులోకులమా ముక్తులముగాక॥" (6-139)

జీవుఁడు పరమాత్మనియం దాధారపడినవాఁడే. పరమాత్మని విడచి జీవుఁ డుండఁజాలడు. సూర్యుని విడచి కాంతి యుండఁజాలదు. కాని కాంతియే వేరొకసూర్యుఁడు కాఁడు. అట్లే పైయుపమ లన్నిటను -

"కైవసమై యీ దేవుఁడె యిటు ననుఁ గరుణించుచు రక్షించుచు నుండఁగ
పూవునుఁ బరిమళమును వలెనే పొదలుచు నుండెద నయ్యానేను."
(8-85)

అనియుఁ దాళ్ళపాకవారు వేఱొకచోఁట జీవపరమాత్మల యనుబంధమును వివరించినారు.

**భోగభోగితత్త్వము**

దేహాదివ్యతిరిక్తుఁడును భోక్తయునగుజీవునియొక్క యాత్మయే పరమాత్మ యని వేదాంతము చెప్పుచున్నది. కనుక జీవుఁడు భోగముకాఁగా పరమాత్ముఁడు భోగి యగుచున్నాఁడు. ఈ భోగభోగితత్త్వమునే తాళ్ళపాకకవులు పలుకీర్తనములలోఁ బ్రకటించినారు. మచ్చున కొకటి చూడుఁడు.

లలిత

"భోగము నేను నీకు భోగివి నీవు
శ్రీగురుఁడ విన్నటాను చిత్తగించు నన్నును॥

చక్కని జన్మపుసంసారవృక్షమునకు
పక్కువ ఫలము నీవు భావించఁగా
మక్కువఁ గర్మమనేటి మత్తగజమునకును
యెక్కిన మావటీఁడవు యెంచఁగ నీవు॥

నెట్టన దేహమనేటి నిర్మలరాజ్యమునకు
పట్టమేలుచుండిన భూపతివి నీవే
దిట్టయైన చిత్తమనే తేజి గుఱ్ఱమునకు
వొట్టుక రేవంతుఁడవు వుపమింపనీవు॥" (7-40)

శ్రుతులుచాటెడి పరమసత్యములను తాళ్ళపాకవా రెట్లువినిపించుచున్నారో పరికింపుఁడు—.

రామప్రియ

"ఓహో దేందేం వొగి బ్రహ్మ మిది యని
సాహసమున శ్రుతి చాటెడిని॥

పరమును నపరముఁ బ్రకృతియు ననఁగా
వెరవు దెలియుటే వివేకము
పరము దేవుఁడును అపరము జీవుఁడు
తిరమైన ప్రకృతియే దేహము॥

జ్ఞానము జ్ఞేయము జ్ఞానగమ్యమును
పూని తెలియుటే యోగము
జ్ఞానము దేహాత్మ జ్ఞేయముపరమాత్మ
జ్ఞానగమ్యమే సాధించు మనసు॥

క్షరము నక్షరమును సాక్షి పురుషుఁ డని
సరవిఁ దెలియుటే సాత్వికము
క్షరము ప్రపంచ మక్షరము కూటస్థుఁడు
సిరి పురుషోత్తముఁడే శ్రీవేంకటేశుఁడు॥" (5-221)

ఇట్లే సర్వవేదాంతసారమును వారు మూఁడుముక్కలలో సూక్ష్మముగఁ జెప్పుచున్నారు. చూ. కీర్తనము.

హిందోళవసంతం

"మూఁడేమాటలు మూఁడుమూండ్లు తొమ్మిది
వేడుకొని చదువరో వేదాంతరహస్యము॥

జీవునిస్వరూపము చింతించి యంతటాను
దేవునివైభవము దెలిసి
భావించి ప్రకృతిసంపద యిది యెఱుఁగుటే
వేవేలువిధముల వేదాంతరహస్యము॥

వేడుకతో నాచార్యవిశ్వాసము గలిగి
జాడల శరణాగతిసాధనముతో
కూడి శ్రీవేంకటేశ్వరుఁ గొలిచి దాసుఁ డౌటే
వీడనిబ్రహ్మానంద వేదాంతరహస్యము॥" (6-233)

పై కీర్తనములోనిభావముల ప్రపంచనమే తాళ్ళపాకకవుల ఆధ్యాత్మికసంకీర్తనముల సంచయము—

## ఆళ్వారులు – అన్నమాచార్యాదులు

ద్రవిడమున, వేదవేదాంతముల సారమును పరాంకుశయోగి మొదలగు నాళ్వార్లు ద్రావిడీకరించి ద్రావిడాగమసార్వభౌము లనిపించుకొనఁగాఁ దెలుఁగున కృష్ణమాచార్య అన్నమాచార్య పెదతిరుమలాచార్యులు ముప్పురును వేదమును

తెనుఁగు గావించిన కారణముగా ఆంధ్రవేదాంతకర్త లనియు, "పంచమాగమ సార్వభౌము"లనియు, "పంచమాగమ చక్రవర్తు" లనియు పేరొందిరి. చిన్నన్న తాళ్ళపాక అన్నమాచార్య పెదతిరుమలాచార్యులను (తన తాతతండ్రులను)" పంచ మాగమ సార్వభౌము"లని గీర్తించియున్నాఁడు (చూ. అష్టమహిషీ కల్యాణము).

వైష్ణవభక్తిసాహిత్యమునకుఁబాదుకట్టి తత్త్వ ప్రచారమునకై పాటుపడిన పన్నిద్దరాళువారలకును, తాళ్ళపాక అన్నమాచార్యాదులకును వారివారి రచనల కునుఁ జాలపోలిక లున్నవి. వానినిఁ గూర్చి పితృపాదులు శ్రీ ప్రభాకరశాస్త్రిగా రిట్లు వ్రాసి యున్నారు. [1]

"ద్రవిడ వేదాంతరచనమునకై శఠకోపయతీంద్రు లవతరించినవిధ ముగా నంధ్రవేదాంతరచనమునకై యన్నమాచార్యుఁ డవతరించినాఁడు. శఠకోప యతి వైశాఖమాసమున విశాఖానక్షత్రమున నవతరింపఁగా - నన్నమాచార్యుఁ డును వైశాఖమాసమున విశాఖానక్షత్రమున నవతరించినాఁడు. శఠకోపయతి పదునారేండ్లవయసువాఁడయినతర్వాత సర్వవిద్యలు గోచరించి ద్రవిడ సంకీ ర్తనములు రచింప దైవానుగ్రహ మందఁగా-నన్నమాచార్యుఁడును నట్లే పదునారవ యేట స్వామి ప్రత్యక్షమై యుద్బోధింపఁగా సంకీర్తన రచనము సాగించెను. శఠకోపయతి శ్రీ తిరువేంగడనాథునిమీఁదను నింక ననేకదివ్యస్థలములలోని విష్ణుమూర్తులమీఁదను సంకీర్తనములు రచింపగా నన్నమాచార్యుఁడును ప్రధాన ముగా తిరువేంగడనాథునిమీఁదను నింకననేకపుణ్యస్థలములవిష్ణుమూర్తులమీఁదను, సంకీర్తనలు రచించెను. శఠకోపయతి స్వామికౌస్తుభాంశమున జన్మించినట్లు విజ్ఞులు విశ్వసింపఁగా నన్నమాచార్యుఁడు స్వామినందకాంశమున నవతరించి నట్లు ప్రాజ్ఞులు పరిగణించిరి.

పెరియాళ్వార్లు (విష్ణుచిత్తులు) తులసీవనమున జనించిన గోదాదేవిని రంగనాథస్వామి కొసఁగి పెండ్లిచేసి మామగా రయినట్లే యన్నమాచార్యులు గూడ బద్మసరోవరమున జన్మించిన మంగాంబికను వేంకటేశ్వరస్వామికిచ్చి పెండ్లిచేసి మామగా రయ్యెను.

ఆళ్వార్లు రచింపఁగా నరవమున ద్రావిడవేదమనీ పంచమాగమమనీ పేర్కొనఁబడు దివ్యప్రబంధము నాల్గువేల సంకీర్తనములు పాట్టులు (సీసపద్యా

1. చూ. అన్నమాచార్య చరిత్ర పీఠిక. పుటలు 121 - 122.

దుల వంటివి) కలది కాఁగా అన్నమాచార్యుఁడొక్కఁడే రచించిన యంధ్రవేదము ముప్పదిరెండువేల పాటలు గలది. ఈ సంకీర్తనలు దివ్యప్రబంధముల ననువర్తించియే పరమాత్మునకు భక్త జీవులకు పతిపత్నీభావము నాయికానాయక భావము కల్పించి యుజ్జ్వల రసానుభూతి నొనవించుచు, ననేకదేవాలయములలోని యర్చామూర్తుల నభివర్ణించుచు శరణాగతిమహత్త్వమును బ్రతిపాదించుచు నింక ననేక విధముల లోకనీతి ధర్మోద్బోధ భూతదయాది విశేషాంశముల వెలయించుచు నెంతో వింతగా వేడుకగా సంగీతసారస్యముతో సవరనిభాషతో వేదవేదాంతేతిహాసాదిసూక్తి తదర్థప్రతిపాదనములతో వెల్విరిసి పెరియవాచ్చాంబిళ్ళైవంటి మహావ్యాఖ్యాత పెలసెనేని యఖండానందతాండవముగాఁ బెద్దవ్యాఖ్యాచమత్కారములు త్రవ్వితీయఁదగినట్లు విజ్ఞాననిధులై విరాజిల్లుచున్నవి"

తాళ్ళపాకకవులు తమకుఁ బూర్వు లగునాయాళువారల నిట్లు స్మరించిరి. చూ. కీర్తనము.

**భూపాళం**

"వాఁడె వేంకటేశుఁ డనేవాఁడె వీఁడు
వాఁడిచుట్టుఁగైదువ వలచేతివాఁడు॥
కారిమారసుతుని చక్కనిమాటలకుఁ జొక్కి
చూరఁగా వేదాలగుట్టు చూచినవాఁడు
తీరనివేడుకతో తిరుమంగయాళువారి
ఆరడి ముచ్చిమిగూటి కాసపడ్డవాఁడు॥
పెరియాంళువారిబిడ్డ పిసికి పై వేసిన
విరులదండల మెడ వేసినవాఁడు
తరుణి చేయి వేసిన దగ్గరి బుజము చాచి
పరవశమై చొక్కి పాయలేనివాఁడు॥
పామరులఁ దనమీఁదిపాటలెల్లాఁ బాడుమంటా
భూమికెల్ల నోర నూరిపోసినవాఁడు
మామకూతు రలమేల్మంగనాంచారియుఁ దాను
గీముగానే వేంకటగిరి నుండేవాఁడు॥ "(11-2-55)

ఆస్వామియే నాఁడు తాళ్ళపాకవారినిగూడ నట్లే యాచరించినాఁడు.

అన్నమాచార్యుఁడును కారిమారసుతుని వలెనే తన సంకీర్తనములచేత స్వామినిఁ జొక్కించెను. పెదతిరుమలాచార్యుఁడును తా నార్జించినసంపద నంతను స్వామి వారికే యర్పించి తిరుమంగైయాళువారివలెనే తరించెను. అన్నమయ్య మంగాంబ నిచ్చి పెండ్లిచేసి పెరియాళువారివలెనే చరితార్థుఁడయ్యెను. విరులదండలవలెనే స్వామికే శేషమైన సంకీర్తనహారములనే సమర్పించి వారివంశమువా రందరును ధన్యతఁ గాంచిరి. స్వామి యనుగ్రహించి నాఁడు వలెనే ఆనాఁడును 'పామరులఁ దనమీఁదిపాటలెల్లాఁ బాడుమంటా-భూమికెల్లా నోరనూరిపోసినాఁడు.' ఆళువార్ల నాలుఁగు వేలపాశురములలో శఠకోపముని రచనలే యెక్కుడు. సంఖ్యలో తరువాతివే తిరుమంగయాళువారివి. తెలుఁగు సంకీర్తనములందును అన్నమాచార్యులవే యధికము. ఆ తరువాతనే పెదతిరుమలాచార్యులవి.

ఇట్టింతటిసామ్యము వారివారిజీవితరచనలలో నుండుట యాదృచ్ఛికము కాఁజాలదు. స్వామివారి దివ్యానుగ్రహమే దానికి హేతుభూతమై యుండవలెను. ఇప్పుడించుక వారి రచనాసామ్యము నెంచి చూడఁదగును.

## ద్రావిడవేదము - ఆంధ్రవేదాంతము :

తాళ్ళపాకవారి సంకీర్తనము లన్నియుఁ బ్రాయికముగా ద్రావిడపాశురములఁ బోలినవే యని చెప్పవచ్చును. అయినను సూత్రప్రాయముగా కొన్ని పోలికలను ముందు చూపి పిదప నీ యిరువర్గములకుఁ జెందిన రచనలలోని సాధారణ ధర్మములను గూర్చి ముచ్చటింతును

(1) నమ్మాళ్వారు (శఠకోపముని) తిరువాయ్‌మొళి 3-3-1 లో సెలయేళ్ళతో ప్రకృతిసౌభాగ్యముతో నొప్పారుతిరువేంగడమును నందలిస్వామిని "ఒళివిల్ కాలమెల్లామ్" మున్నగుపాశురములందు కీర్తించినాఁడు. [1] ఇట్లే తాళ్ళపాకవారును గొండాడిరి. చూ. కీర్తనములు.

1. మధ్యకాలపుఁగవియగు కాంచ్రపేట రామానుజాచార్యులు నమ్మళ్వారు తిరువాయ్‌మొళిని తెలుఁగున ద్విపదకావ్యముగ వెలయించియున్నారు. వారి రచన చాల వఱకుఁ జిన్నన్న ద్విపదలను దలఁపించుచున్నది. సామ్యపరిశీలనమునకై వారి ద్విపదానువాదముల నిట పొందుపరతును.

"ఇంకకుండెడు సెలయేరులుగల్గు - వేంకటాచలముపై విచ్చేసియున్న తమ తండ్రిగన్నట్టి తండ్రియైనట్టి-యమిత తేజునకు శేషాచలేశునకు॥"(ఇత్యాది)

రామక్రియ

"కట్టెదుర వైకుంఠము కాణాచయినకొండ
తెట్టలాయ మహిమలే తిరుమలకొండ॥

వేదములె శిలలై వెలసినది కొండ
యేదెసఁ బుణ్యరాసులే యేరులైనది కొండ
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనలకొండ
శ్రీ దేవుఁ డుండేటిశేషాద్రి యీకొండ॥" (9-182)

ఇట్లే-

లలిత

"వాఁడె వెంకటాద్రి మీఁది వరదైవము
పోఁడిమితోఁ బొడచూపేఁ బొడవైన దేహము॥

వొక్కొక్క రోమకూపాన నొగి బ్రహ్మాండకోట్లు
పిక్కటిల్ల వెలుఁగొందే పెను దైవము
పక్కనను తనలోని పదునాలుగు లోకాలు
తొక్కి పాదానఁగొలిచే దొడ్డ దైవము॥" (5-247)

ద్రావిడపాసురములలో శ్రీనివాసునియర్చామూర్తిసౌందర్యమును నమ్మాళ్వారు చిత్రించిరి. తాళ్ళపాకవారును నట్లే శ్రీనివాసునియర్చామూర్తిని వర్ణించు కీర్తనము లెన్నోరచించిరి.

(2) తిరువాయ్మొళి 3-9-9 లో 'వాయ్కొండు' అనుపాసురమున స్వామిని గొనియాడిననోర నితరులను బాడఁజాలనని నమ్మాళ్వారు తమపతివ్రతా భక్తిని, నరస్తుతివైముఖ్యమును జాటుకొనిరి.[1] అట్లే తాళ్ళపాకవారును బలుసంకీర్తనములు రచించిరి. చూడుఁడు.

'నరహరికీర్తన నానినజిహ్వా
బరుల నుతింపఁగ నోపదుజిహ్వా' (అన్నమా)
'తక్కక శ్రీవేంకటేశు దాసానుదాసుం డైతే

1. "ఎడవక హరినుతియించునానోర-చెడుగులఁ బాడవచ్చినకవిగాను
వేదాంతవేద్యుండు విష్ణుండు చక్రి-యాదిపురుషుఁడు నాయందుఁ దా నిలిచి
అల తిరునగరికి నధిపుగాఁ జేసి-తెలియ నేనుఁగునెక్కి దిడ్డి దూరుదురే."
(కాం. రామా)

మక్కువ నవ్వుంగాములు మఱియేల
దిక్కుల నేనుఁగు నెక్కి దిద్ది దూరఁ బోతేను
వెక్కస మౌగాక యిది విన సంగతి యౌనా॥" (2-234)

లలిత

"చెలఁగి నా కిందుకే చింతయ్యీని
తెలిసినదాఁకా నిది ద్రిష్ట మయ్యీనా॥
హరి పుట్టించినదేహి హరినే కొలువక
నరుల గొల్చుట అన్యాయమయ్యీ
గరిమ నేరుగుడిచి కాలువఁ బొగడఁబోతే
యెరవెరవే కాక యితవయ్యీనా॥" (8-67)

(3) తిరువాయ్‌మొళి[1] 3-7-9లో "కులంతాంగు" అనుపాశురమున హరిభక్తిగలచండాలుఁడైనను బూజనీయుఁడే యని నమ్మాళ్వారు వివరించిరి. అట్లే తాళ్ళపాకవారును బాడిరి.

శ్రీరాగం

"కొంచెమును ఘనముగను గొననేల హరిఁదలఁచు
పంచమహాపాతకుడైన బ్రాహ్మణోత్తముఁడు ॥
పరమమగు వేదాంతపఠన దొరికియు సదా
హరి దలఁచలేని సన్యాసికంటె
మరిఁగి పసురముఁదినెడి మాలయైనను వాఁడె
పరమాత్ముఁ గొలిచినను బ్రాహ్మణోత్తముఁడు ॥"
(11-3-117)

తిరుమంగైయాళువారును భాగవతమున ప్రహ్లాదుఁడును (9-31) నిట్లే విష్ణుభక్తిప్రాశస్త్యమును వేనోళ్లఁ గొనియాడి యుండిరి.

1. "తులలేకయొప్పు చతుర్వర్ణములకు-తలఁపఁగాఁ గ్రిందైన తజ్జాతిలోన
జడమతి చండాలచండాలుఁడైన తొడరినేఁ జక్రహస్తునిబంట టన్న
తలపోయఁగా వారిదాసులవారి కలవడఁగా దాసులై యున్నవారు
వారికిదాసులై వహికెక్కువారు-వేఱు సేయక మీకు విభులైనవారు."
(కాం. రామా)

(4)"తిరువాయ్‌మొళి"[1] 3-7-10 "అడియార్‌న్ద" అనుపాశురమున నమ్మాళ్వారు దాసదాస్యభక్తిని ప్రదర్శించిరి. "త్వద్భృత్యభృత్యపరిచారక భృత్యభృత్య భృత్యస్యభృత్యఇతి మాం స్మర లోకనాథ" అని ముకుందమాలాస్తోత్రమున కులశేఖరాళువారు నిట్లే యర్థించిరి. అట్లే తాళ్ళపాకవారును దలఁచిరి.

శంకరాభరణం

"అచ్యుత మిమ్ముఁ దలఁచేయంత పనివలెనా
యిచ్చల మీవారే మాకు నిహపరాలియ్యఁగా॥
అంది నీకు భక్తులైన యల మహానుభావుల
చందపువారిపై భక్తి చాలదా నాకు
కందువ శ్రీవేంకటేశ కడు నీబంటుబంటుకు
సందడిబంట నవుటే చాలాదా నాకు॥ " (8-23)

(5) తిరువాయ్‌మొళి (2) 4-8 లో పదిపాశురములందును స్వామిని కొలవని కొలుపులు నిరర్థకము లని పలురీతుల నిదర్శనపూర్వకముగ నమ్మాళ్వారు విశదీకరించిరి. స్వామివారి మెప్పును, ఆదరమును, వాత్సల్యమునుఁ బొందఁజాలని జీవుని యా యునికి వ్యర్థమని వారి రచనలోని తాత్పర్యము. అట్లే తాళ్ళపాకవారును ఆలంకారికముగ నావిషయమును వెల్లడించిరి.

దేసాక్షి

"ఎంచి చూడరో ఘనులార యిందీవరాక్షుఁడు రక్షకుఁడు
సంచితముగ నితని శరణంటే సర్వఫలప్రద మిందరికి॥
హరిఁ గొలువనికొలువులు మఱి యడవిఁగాసినవెన్నెలలు
గరిమల నచ్యుతువిననికథలు భువి గజస్నానములు
పరమాత్మునికిఁగాని తపంబులు పాతాళములనిధానములు
మరుగురునికిఁగాని పూవులపూజలు మగడులేని
సింగారములు॥" (7—1)

1. లోకంబులను బొజ్జలోపలను నిలిపి- యాకుపై పవళించు నట్టిమాధవుని
దాసానుదాసుల దాసుల వారి-దాసుల వారికిదాస్యంబు సేయు
భృత్యులు తద్భృత్య భృత్యులు మాకు-నిత్యంబు నాథులై నిలచిన ఘనులు"
(కాం. రామా)

2. "చక్కఁదనంబున సవతెందులేక - మక్కువగల యుషామానిని కొఱకు

(6) తిరువాయ్మొళి 1 - 10-3 లో 'ఎంచిరానై'., 1-10-6 లో [1] "నీయుమ్ నానుమ్" అను పాశురములందు స్వామినేనమ్మి కొలిచినవారి కేడుగడ స్వామియే యగునని నమ్మాళ్వారు వర్ణించిరి. అట్లే తాళ్ళపాకవారును వివరించి.

పాడి

"వేరొక్కరు లేరు విశ్వమంతా నీమహిమే
యేరీతి నీవేకలవు యితరము లేదు॥
తల్లివై రక్షింతువు తండ్రివై పోషింతువు
యిల్లాలవై మోహమిత్తువు నాకు
వొళ్లయి పెరుగుదువు వొగిఁ బురాకృత మౌదు
యిల్లుముంగిలై వుండుదు వింతా నీమహిమే॥" (2-148)

ఇట్లు కేవల మొక్క తిరువాయ్మొళి నుండియే కాక నమ్మాళ్వారులవియు, తదితరాళ్వారులవియు నగునితరరచనలనుండికూడ తాళ్ళపాకవారి సంకీర్త నముల కుద్బోధకములగు పాశురముల నెన్నిటినైన నెత్తి చూపవచ్చును. సంగ్ర హముగ వివరింతును.

(7) నమ్మాళ్వారు "పెరియతిరువందాది" యను వందపాటలు గల గ్రంథమున "ఇంగిల్లై పండుపోలె" అనుపాశురమున స్వామి భావనతో నిండి యున్న తనమేన నిక "భవబంధములకును, కర్మములకును మున్నుబోలె ప్రాభవముతో నుండుచోటు లేదుపొం" డనియదలించు భక్తి విశ్వాసము లుట్టి పడురచన యున్నది. సరిగా తదనువాదరూపము లనఁదగుసంకీర్తనములు తాళ్ళపాకవారి వెన్నో కలవు. చూ.

పాడి

"ఇందు నుండ మీ కెడయే లేదు
సందడి సేయక సనరో మీరు॥

బాణుని హస్తముల్ వలుమాఱు నఱికి ప్రాణముల్ గాఁచిన పద్మలోచనుఁడు
యాదరించినయట్టి యంగంబుఁ దలప నాదట షండునకైన వామాక్షి" ఇత్యాది.
(కాం. రామా.)

1. "తల్లియుఁ దండ్రియుఁ దానయై మనకు నెల్లదాన్య సుఖంబు చిల్చిన ఘనుఁడు
అవతారముఖమున నతులితం బగుచు నవనీల మేఘంబు నగుమేనివాఁడు
మన మిందఱమును సమ్మతి నాశ్రయింప ననఘుండు మననొప్పు లన్నియు మాన్పు."॥
(కాం. రామా.)

నాలుక శ్రీహరినామం బున్నది
తూలుచుఁ బారరో దురితములు
చాలి భుజంబున జక్రం బున్నది
తాలిమి భవబంధము లటు దలరో॥

అంతర్యామై హరి వున్నాఁడిదె
చింతలు వాయరో చిత్తమున
వింతలఁ జెవులను విష్ణుకథ లివిగో
పొంతఁ గర్మములు పోరో మీరు॥

కాపయి శ్రీవేంకటపతిపే రిదె
నాపయి నున్నది నయమునను
కోపపు కామాదిగుణములార మీ
రేపున కడఁగడ నెందైనఁబోరో॥" (2-401)

ఇట్టిదే మరొక కీర్తన.

సాళంగనాట

"ఉమ్మడికర్మములార వుండఁ జోటులేదు మీకు
యిమ్ముల నెందైనాఁ బోరో యివి లేనిచోటికి॥

మనసునఁ దలఁచేది మాధవునిపాదములు
దినముఁ గడుపునించేది హరిప్రసాదము
తనువుపైఁ దులసి పద్మాక్షమాలికలు
చెనకి హరిదాసులఁ జేరునా బంధములు॥" (10-132)

అందుకే ఆయాళువారి వలెనే తాళ్ళపాకవారును

'ఎక్కడినరకములు యెక్కడిమృత్యువు మాకు
దక్కె నీదివ్యనామామృతము చూరగొంటిమి॥" (8-12)

అని భక్త్యమృతపానమత్తులై పరమానందతాండవము గావించిరి.

(8) తొండరడిప్పొడియాళ్వారు కావించిన ప్రబోధకస్తవము (తిరుప్పళ్లియెళుచ్చి) నందలి తుది నాలుగుపాశురములకును ననువాదరూపములగు నీ తాళ్ళపాకవారి కీర్తనముల గాంచుఁడు-

భూపాళం

"విన్నపాలు వినవలె వింతవింతలు
పన్నగపుదోమతెర పైకెత్త వేలయ్యా॥

తెల్లవారె జామెక్కె దేవతలు మునులు
అల్లనల్ల నంతనింత నదివో వారే
చల్లని తమ్మిరేకుల సారసపుగన్నులు
మెల్లమెల్లనె విచ్చి మేలుకొనవయ్యా॥

గరుడకిన్నరయక్షకామినులు గములై
విరహపుగీతముల వింతాలాపాల
పరిపరివిధములఁ బాడేరు నిన్నదివో
సిరిమొగము దెరచి చిత్తగించ వేలయ్యా॥" (4-25)

భూపాళం

"భోగిశయనమున బుసకొట్టెడిని
యోగనిద్ర పాయును మేల్కొనవే॥

కన్నులు తెఱవక కమలబాంధవుఁడు
వెన్నెలరేణువు వెలయ దిదే
అన్నువ మలసీ నరుణోదయ మిదే
మిన్నక నీవిటు మేలుకొనవే॥

తెల్లనికన్నులు దెరువక విరియఁగ
నొల్లక జలజము లున్న వివే
కల్లనిదుర నినుఁ గవియఁగనియ్యక
మెల్లనాయెనిటు మేలుకొనవే॥" (5-81)

యోగనిద్రావశుఁడైన పరమాత్ముని మేలుకొలుపు నీ ప్రాబోధకిస్తవరూప మగు ద్రావిడప్రబంధమును చిన్నన్న పరమయోగివిలాసమునఁదెనిఁగించెను. అందలి భావములను పైసంకీర్తన భావమును బోల్చి చూడఁ దగును.

---

1. చూ. నా గ్రంథము - "తాళ్ళపాకకవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు" పు 288.

(9) ఈ మేలు కొల్పులు ప్రాబోధకీ స్తవముననే గాక ఆండాళ్ ళాయించిన తిరుప్పావై యను ముప్పదిపాశురముల గ్రంథ మందును గొన్ని గలవు. ధనుర్మాసమున వ్రత మాచరించు గోపవనితలు సూర్యోదయాత్పూర్వమే భక్తితో నభ్యంగస్నానాదు లాచరించి పదిమందిని గూర్చుకొని ముందుగనే నందయశోదలను మేల్కొల్పి పిదప సుప్పువడముగాకున్న కృష్ణ పరమాత్మని మేల్కొల్ప జేయుపాట లందున్నవి. ఈ ధనుర్మాసవ్రతప్రసక్తి తాళ్ళపాకవారి కీర్తనము పలుతావులలో గానవచ్చును. తిరుప్పావైలోని 'అంబరమే తణ్ణీరే' (17) మున్నగు పాశురములలోని భావ సంపదను బుణికి పుచ్చుకొన్న తాళ్ళపాకవారి యీ కీర్తనము నరయుఁడు-

భూపాళం

"మిన్నక వేషాలుమాని మేలుకోవయ్యా
నన్నల నీయోగనిద్ర చాలు మేలుకోవయ్యా॥
ఆవులు పెయ్యలకుఁగా నఱచీఁ బిదుకవలె
గోవిందుఁడ యింక మేలుకొనవయ్యా
ఆవలీవలిపడుచు లాటలు మరిగి వచ్చి
త్రోవగాచుకున్నారు ప్రొద్దున మేలుకోవయ్యా॥
పిలిచీ నందగోపుడు పేరుకొని యిదే కన్నుఁ
గొలుకులు విచ్చి మేలుకొనవయ్యా
అలరిన శ్రీవేంగటాద్రిమీఁది బాలకృష్ణ
యిల మామాటలు వింటి వింక మేలుకోవయ్యా॥" (2-400)

ఇట్లు పైని పేర్కొన్న తిరుప్పళ్ళియెళిచ్చి, తిరుప్పావై పాశురముల భావములను దెలిగించుటయే గాక తాళ్ళపాకవారు తమ కాలమున తిరుమల మీఁద నాయా సందర్భములలో జరగుచుండిన విశేషవిధులనుగూడ వర్ణించుగీతములను రచించినారు 1

ఈ విధముగా తాళ్ళపాకవారు ద్రావిడ వేదముల కనువాద రూపములగు సంకీర్తనముల రచించుటేగాక వాని ధోరణిని మఱికొన్నిటిని గూడ స్వతంత్రముగ రచించిరి.

---

1. ధనుర్మాసోత్సవమునకు (9-95); (11-2-45)
తిరుప్పళ్ళియెళిచ్చికి-9-9.

పెరియాళ్వారు లాన తిచ్చిన నీరాట్ట విషయముగల పాశురములను బోలిన కీర్తనములు వీరి వున్నవి. చూడుఁడు కీర్తనము.

శంకరాభరణము

"అప్పుడు మజ్జనూడే నంగనఁగూడి
కుప్పలు తెప్పలుగాఁ గ్రుమ్మరించరో॥
బంగారుకొప్పెరలఁ బన్నీరు నించి
రంగైన పచ్చకప్పురపుధూళొత్తి
చెంగటఁ గస్తురిధూళి చికిలిగావించి
పొంగారుఁ దట్టుపునుఁగు పోయరో గిన్నెలను॥" (3-3:5)

ఇట్లే 'పల్లాఁడు పల్లాండు' అనునంతముతో పెరియాళ్వారు లాసతిచ్చిన 'తిరుప్పల్లాండు' పాశురములను బోలిన కీర్తనములనుగూడ వీరు రచించిరి. చూ. కీర్తన.

ఆహిరి

"గుట్టునఁ గోరికలెల్లఁ గొల్లవట్టె నీ
పట్టపుదేవికిఁ బల్లాండుపల్లాండె॥
పచ్చలసందిదండలు బాహుపురులు మెఱయ
నెచ్చెరిపై మేనుసోక నిలుచుండి
పచ్చవిలుకానితల్లి బంగారుదోసిటి నీపైఁ
బచ్చకప్పురముఁ జల్లెఁ బల్లాండుపల్లాండె॥
అలరు మేడలోన అలమేలుమంగ నిదె
అలయికదీరఁ బ్రేమ నలరఁజేసి
కలసి వేంకటేశ కౌగిలించుకొనే విదె
పలుమారు మీకుమీకుఁ బల్లాండుపల్లాండె॥" (3-256)

పల్లాండు అనగా మంగళ మని యర్థము. ఈ యళ్వారుల తిరుప్పల్లాండు పాశురములఁ గొన్నిటిని చిన్నన్న పరమయోగి విలాసమున దెనిగించి యున్నాఁడు.

---

1. చూ. నా గ్రంథము 'తాళ్ళపాకకవుల కృతులు – వివిధ సాహితీ ప్రక్రియలు' పుట. 289.

ద్రావిడప్రబంధములనుండియే కాక ఆళ్వారాచార్యులానతిచ్చిన స్తోత్ర రత్నములనుండి కూడ తాళ్ళపాకకవుల సంకీర్తనములలో వచ్చి చేరిన భావ సంపదను గుర్తింపసగును. ఇంచుక వివరింతును.

### శ్రీరాగం

"ఇన్ని జన్మము లేటికి హరిదాసు
లున్నవూరం దా నుండినఁ జాలు॥

హరిభక్తులయింట విన్నము గొనువారి
వరవుఁడై వుండవలె నన్నుం జాలు
పరమభాగవతభవనంబులఁ జెడ్డ
పురువు దా నయి పొడమినఁ జాలు॥" (2–352)

అను కీర్తనము యామునచార్యుల స్తోత్ర రత్నమునందలి 'తవదాస్య సుఖైకసంగినామ్ భవనేష్వ స్త్వపి కీటజన్మమే' (55) అనుశ్లోకమున కనుకరణము.

### గుండక్రియ

"హరిభక్తి వోడ యెక్కినట్టివారలే కాని
తరగు మొరగులను దాఁటలే రెవ్వరును॥

నిండుఁ జింతాజలధికి నీళ్లు దనచిత్తమే
దండి పుణ్యాపాపాలే దరులు
కొండలవంటికరళ్లు కోరిక లెందుచూచినా
తండుముండుపడేవారే దాఁటలే రెవ్వరును॥

ఆపదలు సంపదలు అందులోని మకరాలు
కాపురపులంపటాలె కైయొత్తులు॥
చాపలపుగుణములే సరిఁ జొచ్చేయేరులు
దావుదండ చేకొని దాఁటలె రెవ్వరును॥" (6-56)

లౌకిక సంసారపు చింతాజలధి నుత్తరించుటకు హరిభక్తి యనునోడ యొక్కటియే శరణ్యమను నీభావము కులశేఖరాళ్వారుల ముకుందమాలా స్తోత్రమునందలి యీశ్లోకమునుండి గ్రహించిన దనవచ్చును.

"తృష్ణాతోయేమదనపవనో ద్ధూతమోహోర్మిమాలే
దారావర్తే తనయసహజ గ్రావసంఘాకులేచ
సంసారాఖ్యే మహతిజలధౌ మజ్జతాం నస్త్రిధామన్
పాదామ్భోజే వరద భవతో భక్తినావం ప్రయచ్ఛ॥" (14)

"సామీప్యము నడుగ సారూప్యము నడుగ
కామించి సాయుజ్య సాలోక్యము లడుగ
భూమింగాని పాతాళంబునఁగాని దివిం గాని
సహన నీదాసులలో సహవాస మియ్యవే॥" (2-21)

ఇందలిభావము ముకుందమాలలోని "దివివా భువివా మమాస్తు వాసో నరకేవా నరకాన్తక ప్రకామం" (6) అను శ్లోకమును దలఁపింపఁజేయుచున్నది. ఇట్టి భావములే నమ్మాళ్వార్ తిరువాయ్ మొళి 3-9-5 లోను గలవు. కులశేఖరుఁడు "చరణౌ తేమరణేపి చింతయామి" అనఁగా నిందు తాళ్ళపాకవారు దాససాంగత్య మర్థించినారు.

ఇంకను కులశేఖరుని "త్వద్భృత్యభృత్యపరిచారక భృత్యభృత్యభృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ" (27) అనుభావమును గ్రహించి తాళ్ళపాకవారు, "కందువ శ్రీవేంకటేశ కడునీబంటుబంటుకు సంచడిబంట నవుటే చాలదా నాకు" అనువిధమున ననువదించిన విషయము నిదివఱకే పేర్కొంటిని. (నమ్మాళ్వార్ తిరువాయ్ మొళి 3-8-10 లోను నిట్టి భావములే కలవు).

ఇట్లు తాళ్ళపాకవారు తమకుఁబూర్వమున్న వైష్ణవభక్తిసాహిత్యమునంతను జీర్ణింపుకొని నూతన మగునీ సంకీర్తనవాఙ్మయమును సృజించిరి. అందుకే వారివారి రచనలలోని సామ్య మంత యెత్తి యిచ్చినట్లుగా గోచరించును. వైష్ణవ సంప్రదాయమందలి భావుకతయే వారి రచనా సామ్యమున కొక హేతువు. ద్రావిడాగమకర్తలదృష్టియందును తెలుఁగుసంకీర్తనాచార్యులదృష్టియందును పరతత్త్వ మగుహరియే పరమప్రాప్యుఁడు. ఆతనికిఁ బుట్టినవారే అజుఁడును, శివుఁడును. అతఁడు మనోహరమగునీలమణివంటివాఁడు. ఆ మణివర్ణుఁడు మన్మథ మన్మథుఁడు. తేజోమయుఁడు. ఆతనితేజశ్శక్తి జీవులయజ్ఞానాంధకారము నణచు విజ్ఞానదీపాంకురము. ప్రాణికోటి యా పరమాత్మునికృపకు ఋణపడి యున్నది. అందుకు తమ సర్వస్వమును సర్వేంద్రియములను సమర్పించి యా పరమాత్మ

నికి ప్రపత్తి సేయవలసి యున్నది. పరమాత్ముఁడే నాయకుఁడు. జీవుఁడే నాయిక. ఆతఁడే భోగియు, సర్వశేషియు. కడమ జగత్తంతయు నాతనికి శేషమైనదే - భోగ్యమైనదే. ఈ భావములు వారి రచనలలోఁ దడవినచోట నెల్లఁ గానవచ్చును. ఇంచుక పరిశీలింపుఁడు. (చూ. శ్రీముఖ సూక్తి - శ్రీ బచ్చు పాపయ్య శ్రేష్ఠి)

(1) "అవరవర్ తమతమ దఱిదఱి వగై వగై
అవరవ రిఱైయవ రెనవడి యడైవర్గళ్
అవరవ రిఱైయవర్ కుఱైవిల రిఱైయవర్
అవరవర్ విదివళి యడైయ నిన్ఱనరే"
(1-1-5 తిరువాయ్మొళి)

బౌళి

"ఎంతమాత్రమున నెవ్వరు దలఁచిన నంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచిచూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు॥
కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుం డని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మ మనుచుఁ
దలఁతురు మిము శైవులు తగిన భక్తులును శివుఁ డనుచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁ డనుచు॥
నీవలనఁ గొఱఁత లేదు మఱి నీరుకొలఁదితామెరవు
ఆవల భాగీరథి దరి బావుల నా జలమే వూరినయట్లు
శ్రీ వేంకటపతి నీవైతే మము చేకొనివున్న దైవమని
యీవల నే నీ శరణనియెద నిదియే పరతత్త్వము నాకు॥" (7-159)

(2) "ఒత్తార్ ఒక్కారై యిలైయాయ మామాయా
ఒత్తా యెప్పొరుట్కుం ముయిరాయ్ ఎన్నైప్పెత్త
అత్తాయాయ్ త్తందైయా యఱియాదన వఱివిత్త
అత్తా నీశెయ్దన వడియేనఱియేనే" (తి॥ మొ॥ 2-3-2)

"తంజమాగియ తందైతాయొడు తానుమా యవైయల్లనాయ్
ఎంజలిలమరర్ కులముదల్ మూవర్తమ్ముళ్ళుమాదియై
అంజిసీరులగత్తుళ్ళోర్గళవనివనెన్డుకూ శెన్మిన్
నెంజినాల్ నినైప్పాన్ యవ నవనాగుమ్ నీళ్ కడళ్ వణ్ణనే"
(తి. మొ. 3-6-9 మఱియు 4-10-5 ; 3-10-9)

శంకరాభరణము

"తలఁచి చూడ పరతత్త్వం బితఁడు
వలసినవారికి వరదుం డితఁడు॥ " (2-243)

"వే రొక్కరు లేరు విశ్వమంతా నీమహిమే" అను 2-148 కీర్తనము కూడ చూడఁదగును.

దేవగాంధారి

"పాపము పాపము ప్రజలారా పైపై నిటువలె పలుకకురో
హరియందుఁ బుట్టె నజుఁడును శివుఁడును హరితో సరిపీ రను బెట్టు॥
పొరి గొండలందు బుట్టినశిల లివి సరుసఁబెట్టితే సరియౌనా॥" (9-61)

(3) "విడివేనో వెన్విళక్కై యెన్నావియై
నడువేవ న్దుయక్కాక్ గెన్దనాదనై
తొడువేశెయ్ దిళవాయ్చ్చియర్ కణ్ణినుక్
విడవేశెయ్దు విళిక్కుమ్పిరానైయే" (తి. మొ. 1-7-5)

శ్రీరాగం

"ఏతదఖిలంబునకు నీశ్వరుండై సకల
భూతములలోనఁ దాఁ బొదలువాఁ డితఁడు॥
గోపాంగనల మెఱుగుగుబ్బచన్నులమీఁద
చూపట్టు కమ్మకస్తురిపూత యితఁడు
తాపసోత్తముల చింతాసౌధములలోన
దీపించు సుజ్ఞానదీప మితఁడు॥" (5-112)

చూ. మఱియు
"మతిలో చీకటి మాన్పు మాణిక్యదీపమవై " (9-92).

(4) "మణివణ్ణా (తి॥ మొ॥ 1-5-5)
'మాణిక్యదీపమనై' (9-92)
'యెన్మాణిక్యచ్చోదియై' (తి॥ మొ॥ 1-7-3)
'మాణిక్యపుపసన్మథమన్మథుండితఁడె' (2-243)
'కరుమాణిక్కమె
న్కణ్ణులదాగుమే' (తి॥ మొ॥ 1-10-1)

'పనివడి గొప్ప నిడుపాటి నేరెడుఁ బండు
కనుపట్టు పురుషాకారమైనట్టుండె.'

(5) తిరువాయ్‌మొళి ప్రథమ ద్వితీయ శతకములందు చిత్తమా! తుమ్మెదా! చిలుకా మున్నగు సంబుద్ధులుగల ధ్యాన పాశురములు గలవు.

తాళ్ళపాకవారును నిట్లే చిలుకా! మనసా! మున్నగు సంబుద్ధులతోఁ గూడిన పదములను విడివిడిగా రచించిరి. (చూ. సర్వేంద్రియాలు) 16-9; (మనసా) 2-177 (చిలుకా) 5-50.

(6) పూతమగు కవితను నరస్తుతికై కాక భగవంతుని నుతించుటకే యంకితము కావలెనని నమ్మాళ్వారు తిరువాయ్‌మొళి తృతీయ శతక నవమ దశకమున విపులముగా వివరించిరి.

తాళ్ళపాకవారును నిట్లే నరస్తుతివైముఖ్యమును భగవత్‌స్తుతి ప్రాముఖ్యమును బలుసంకీర్తనములలోఁ బ్రకటించిరి.

(7) జీవపరమాత్మలసంబంధమును నాయికానాయకులయనురాగముగా నమ్మాళ్వారు పలుతావుల చిత్రించిరి.

తాళ్ళపాకవారి శృంగారసంకీర్తనముల కాయాళువారలదివ్యశృంగార వర్ణన గలరచనలే యుద్బోధకములు.

(8) ఆళ్వార్లు స్వామివారి విభవములగు నృసింహరామకృష్ణాది మూర్తులను భక్తిప్రపత్తులతో వర్ణించుకొనిరి. అన్నిటికన్న కృష్ణావతారమునకే ప్రాముఖ్య మిచ్చి వర్ణించిరి.

తాళ్ళపాకవారును నట్లే.

ఈ విధముగా ద్రావిడవేదమే ఆంధ్రవేదాంతమై తాళ్ళపాకవారి రచనాముఖమున నవతరించినది. వెనుక ఆళ్వారాచార్యులు వైష్ణవమునకు, వైష్ణవ భక్తిసాహిత్యమునకును, చేసినంత సేవయు, కృషియు, నాఁడు తాళ్ళపాకకవులు గావించినా రనుటలో నతిశయోక్తి లేదు.

ద్వితీయాధ్యాయము

# తిరుమల తిరుపతులు

# పరిసరములు

( పుటలు· 218 - 276 )

# తిరుమల తిరుపతులు – పరిసరములు

చరిత్ర కంచనిప్రాచీనకాలమునుండియు వేంకటాచలము భూలోకవైకుంఠమని పేర్వేలసిన పుణ్యక్షేత్రము. ఆ క్షేత్రముయొక్క ప్రభావము క్రమక్రమున తరువాతికాలమున ప్రజలదృష్టిలోను భక్తులయనుభూతిలోను పెచ్చుపెరిగి మరింత ప్రబలమైనది. ఆకారణముననే ఆక్షేత్రము అర్వాచీనకాలమున పలువిధముల విస్తరించి విశిష్టత నందుకొని ముక్తిదమై బహుజనానందకారకమైనది. తిరుమలతోపాటు దిగువతిరుపతియు ప్రాముఖ్యము వహించినది. నూతనాలయమంటపాదినిర్మాణములతోపాటు విగ్రహప్రతిష్ఠాపనములతో, ఉత్సవములతో, నూరేగింపులతో ఆపుణ్యక్షేత్రము పలువసతులతో వైభవోపేతమైనది.

క్రీస్తుశకము తొలిపదిశతాబ్దులలో ధూపదీపనైవేద్యాదులతో విరాజిలుచుండిన మూలమూర్తికి తరువాతికాలమున అంగరంగభోగము లతిశయించినవి. ఉత్సవమూర్తులు ప్రతిష్ఠితములై యూరేగింపులు సాగినవి. ఆలయనిర్మాణ పునస్సంస్కారములు జరిగినవి. అనుభూయమానమగు నాక్షేత్రమహిమకు దగినవైభవముకూడ నచట దర్శనీయము కాజొచ్చినది. క్రీ॥ శ॥ 10వ శతాబ్ది తృతీయపాదముననే పల్లవరాణి సామవై వేంకటాచలాధీశునకు కిరీటాభరణాదులు చేయించినది. మనవాళప్పెరుమాళ్ అనుపేరున వెండితో ఉత్సవమూర్తిని స్థాపించినది. ఆలయవ్యవస్థయు నుత్సవాదులును కొనసాగుటకై తిరుచ్చానూరు ప్రాంతములందున్న కొన్నిభూములను దానముచేసినది. అట్లే క్రీ॥శ॥ 1001లో రెండవపరాంతకసుందరచోళునిరాణి స్వామివారినుదుటికి బంగారుపట్టమును తొడిగించి వైభవమును పెంచినది. క్రీ॥ శ॥ 13వ శతాబ్దిలో జటావర్మసుందరపాండ్యుడు స్వామివారిగర్భాలయమున బంగారుపూతకలశము నెత్తించెను. పదునాల్గవశతాబ్దిలో హొయసల వీరబల్లాళునిసామంతుడు యాదవరాయడు స్వామివారి యంగరంగభోగములకై సర్వమాన్యములుగా రెండుగ్రామములను దానముచేసెను. ఆకాలముననే సాళువ మంగిదేవమహారాజు ఆలయవిమానమునకు బంగారుపూతపూసినరాగి రేకుల గప్పించి బంగారపుకలశమును స్థాపించెను. క్రీ॥ శ॥ 15వ శతాబ్దిద్వితీయపాదమున విజయనగరప్రభు వగురెండవదేవరాయలు ఆలయశోభను పెంచుట

కును, ఆధ్యాత్మికవాతావరణమును మార్మ్రోగించుటకును నూతనముగానచట వేదపారాయణము నారంభింపఁజేసెను. అటుపై సాళువగుండనరసింహరాయలు శ్రీకృష్ణదేవరాయలు మొదలగు విజయనగరచక్రవర్తులు తిరుమలదేవునకు గావించినకైంకర్యములకు కొదువయే లేదు. ఆకాలమున నాక్షేత్రము మహోచ్చదశ ననుభవించె ననుటలో నతిశయోక్తి లేదు. అటు పిదప క్రీ॥ శ॥ పదునేడవశతాబ్ది తొలిపాదమున మట్లవంశీకుఁడును, తిరువేంగళనాథతనయుఁడును నగు కుమార అనంతభూపాలుఁడు ఆక్షేత్రమునకు గణనీయ మగుసేవ గావించినాఁడు. ఉత్సవములకై అశ్వ గజ సమరభూపాల వాహనములు చేయించినాఁడు. పద్మపీఠమును, నైవేద్యభాజనమును, రత్నకిరీటమును చేయించెను. ఉన్నతకేళీమంటపమును నిర్మింపఁ జేసెను. ఏడుకొండలలోని మొదటియెక్కుడుమీఁద నగ్రగోపురమును వెలయింపఁ జేసెను. భక్తులను భక్తరక్షకునిదరికిఁ జేర్చుటకై యేడుకొండలను కలుపు సోపానమార్గమును సుకరము గావించెను.

ఇట్లెందరో ప్రభువులు, ప్రముఖులు భక్తిప్రపత్తులతో వేంకటాచలక్షేత్ర మహిమకుఁ దగినరీతిని వన్నెయువాసియుఁ గల్పించి ధన్యులైరి.

తాళ్ళపాక అన్నమాచార్యులు దిగువతిరుపతినుండి తిరుమల నధిరోహించు నపుడు చెప్పిన సంకీర్తనములనుబట్టి యానాఁటి తద్వైభవ మిట్లు కనులఁ గట్టుచున్నది. చూ. కీర్తనములు.

మలహరి

"అదె చూడు తిరువేంకటాద్రి నాలుగుయుగము
లందు వెలుగొంది ప్రభ మీఱఁగాను॥ పల్లవి॥

తగ నూటయిరువైయెనిమిది తిరుపతులం గల
స్థానికులును చక్రవర్తిపీఠకములును
అగణితంబైన దేశాంత్రులమతంబులును
నధికమై చెలువొందఁగాను
మిగుల నున్నతములగు మేడలును మాడుగులు
మితిలేని దివ్యతపసులున్న గృహములును
వొగినొరగుఁ బెరుమాళ్లవునికిపట్టయి వెలయు
దిగువతిరుపతి గడవఁగాను ॥౧॥

పొదలి యరయోజనముపొడవునను( బొలుపొంది
పదినొండుయోజనంబుల పరపునను( బరగి
చెదర కేవంక చూచిన మహాభూజములు
సింహశార్దూలములును
కదిసి సురవరులు కిన్నరులు కింపురుషులును
గరుడ గంధర్వ యక్షులును విద్యాధరులు
విదితమై విహరించు విశ్రాంతదేశముల
వేడుకలు దైవార(గాను ॥ ౨ ॥

ఎక్కువల కెక్కుడై యెస(గివెలసినపెద్ద
యెక్కు డతిశయముగా నెక్కినంతటిమీ(ద
అక్కజంబైన పల్లవరాయని మటము
అల యేట్లపేడ గడవన్
చక్క నేగుచు నవ్వచరి( గడచి హరి(దల(చి
మొక్కుచును మోకాళ్ళముడుగు గడచినమీ(ద
నక్కడక్కడ వేంకటాద్రీశుసంపదలు
అంతంత( గానరా(గాను ॥ ౩ ॥

బుగులుకొనుపరిమళంబుల పూవు(దో(టలును
పొందైన నానావిధంబుల వనంబులును
నిగిడి కిక్కిరిసి పండినమహావృక్షముల
నీడలను నిలిచినిలిచి
గగనంబుదా(కి శృంగారరసభరితమై
కనకమయమైన గోపురములను( జెలువొంది
జగతీధరుని దివ్యసంపదలు గలనగరు
సరగునను( గానరా(గాను ॥ ౪॥

ప్రాకటంబైన పాపవినాశము లోని
భరితమగు దురితములు పగిలిపారుచునుండ
ఆకాశగంగతోయములు సో(కిన భవము
లంతంత వీడి పార(గను

ఈకడను( గోనేట యతులు( బాశుపతులు మును
లెన్న నగ్గలమైవున్న వైష్ణవులలో
యేకమై తిరువేంకటాద్రిఁ దాదరిని
యేప్రొద్దు విహరించ(గాను ॥ ౫ ॥" (5-130)

సుదీర్ఘమగు నీ సంకీర్తనమున నాఁటి దిగువతిరుపతి వైభవముఁ, గొండ నెక్కు సోపాన మార్గము, నచటి విశేషములును వర్ణితములైనవి. ఎనిమిది యేడుల పిన్నగా నన్నమాచార్యుఁడు తిరుమల నధిరోహించిన సందర్భమును వర్ణించుచు 'అన్నమాచార్య చరిత్ర ద్విపద'లో చినన్న కూడ నిట్టి వివరణమే కొంత ఇచ్చి యున్నాఁడు. అతఁడును *అళిపురిసింగరి*, *తలయేరుగుండు*, *పెద్ద యెక్కుడు*, *కపురంపుఁగాలువ*, *మోకాళ్ల ముడుపు* మున్నగు నంశములను వివరించినాఁడు. కొండనెక్కు పరుషవారు 'కోనేటి రాయఁడా! కానిక రూకలవాఁడా! వరముల రాయఁడా! వడ్డి కాసులవాఁడా! తిమ్మప్ప తిమ్మప్పా!' అని మొరవెట్టుకొనుచు నెక్కు విషయమునుగూడ విశదీకరించినాఁడు. పై వర్ణనములఁబట్టి యప్పటికే సుప్రసిద్ధ మగునాసోపాన మార్గమును యాత్రికు లుపయోగించుచుండిరని తలఁప వచ్చును. ఆ మార్గమునే మట్లవారు తరువాతికాలమున శిలాసోపాన నిర్మాణాదులచే సుకరము గావించి యుందురు. నాఁటి యా తిరువేంకటగిరిసోపానమార్గమును తాళ్ళపాకకవులిట్లు వర్ణించిరి.

ఆహిరి

"తోరణములే త్రోవెల్లా
మూరటబారట ముంచినలతల॥

కూరిమిమటములు గోపురంబులును
తేరుగడపలే తెరువెల్లా
కోరినపండ్లు గురినేటితరువులు
తోరములైన వెదురుజొంపములు॥

ఆటలు దిరుపులు నందపుటురుపులు
పాటలు వనవైభవ మెల్లా
కూటువ నెమిళ్లకోవిలగుంపులు
పేటలఁ దేటల పెనుఁగూటములును॥

వింజామరలును విసనకఱ్ఱలును
గొంజెగొడుగులే కొండెల్లా
అంజనగిరిరాయఁడు వేంకటపతి
సంజీవని పరుషల కొదవఁగను॥" (11-3-52)

తాళ్ళపాకకవులు వర్ణించిన పై యంశముల కించుక వివరణము [1]

(1) *ఆళివురిసింగరి* :- అడిపడి నృసింహస్వామి. అడిపడి యనఁగా నడుగుమెట్టు. అదియే వ్యవహారమున 'అలిపిరి' అయినదందురు. కొండ యెక్కుడులోఁ దొలిమెట్టు గలప్రాంతమును నేఁటికిని 'అలిపిరి' యని జనులు వ్యవహరింతురు. అచటగల నృసింహునే తాళ్ళపాకవారు ముందు పేర్కొనిరి.

(2) *తలయేరుగుండు*:- కొండమీఁది కెక్కువారును దిగువారును తలనొప్పి కాలు నొప్పి గలుగకుండుటకై యాగుండును దలతో మోఁకాళ్ళతో దాకుదురు. కనుకనే దానికిఁ దలయేరుగుండని పేరయ్యెను.

ఈ తలయేరుగుండుకడనే స్వామివారి శ్రీపాదము లున్నవి. శ్రీరామానుజాచార్యులవారు తిరుమలనంబికడ రామాయణరహస్యార్థముల నెఱుఁగుచుండిన దినములందు తిరుమలనంబికి మధ్యాహ్నపూజ కంతరాయము కలిగి విచారించుచుండఁగా వారిసౌకర్యమునకై శ్రీపాదము లచట ప్రత్యక్షమైనట్లు శ్రీవేంకటేశ్వర యితిహాసమాలలో గలదు. తాళ్ళపాకవారు శ్రీపాదములను 'బ్రహ్మగడిగిన పాదము' అను కీర్తనమున స్తుతించి యున్నారు.

(3) *పెద్దయెక్కుడు* :– ఇక్కడ మెట్లు నిట్టనిల్వుగా చాల యెత్తున నుండును. తిరుమల నధిరోహించుటలో నెక్కువ శ్రమకరమైన యెక్కుడిది.

(4) *పల్లవరాయని మటము* :- క్రీ॥ శ॥ 1287 ప్రాంతములలో దిగువ తిరుపతిలోని ఆళ్వార్ తీర్థమున నమ్మాళ్వారుతిరుమాళిగెను మంటపప్రాకారాదులతో నిర్మించిన 'వానెదుత్త కైయలగర్' అనునాతఁడే 'పల్లవరాయఁడు' అతని నిర్మాణములలో నీ పల్లవరాయనిమటము నొక్కటై యుండును.

1. ఇందలి విశేషములను గొన్నింటిని పితృపాదులు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు వివరించినారు. (చూ. అన్నమాచార్య చరిత్ర ద్విపద పీఠిక. పుటలు. 7-15)

(5) *కర్పూరపుఁగాలువ* :- పెద్దయెక్కుడునకును మోకాళ్ళముడుపునకును నడుమ నీ సుగంధజలపూరితమగు కర్పూరపుఁగాలువ యున్నట్లు సేవాక్రమమున వర్ణితమై యున్నది. "తతః కర్పూర సురభి తీర్థం కర్పూర నిర్ఝరమ్" అని ;

(6) **అవ్వచరి** :- ఇది మోకాళ్ళ ముడుపునకు ముందున్న లోయ. దీనినే "అవ్వచరి కనుమ" అనియు నందురు. పరుషల మొరలిందు ప్రతిధ్వనించి తిరుమలగిరులన్నియు మార్మ్రోగుచుండును.

(7) *మోకాళ్ళ ముడుపు* :- సాలగ్రామమయ మైనదిగనుక నట మీఁదఁ బర్వతము పాదములతోఁ గాక మోకాళ్ళతో నడచుట జరిగెడి దట ! కాన మోకాళ్ళముడు పని పేరయ్యె నని యందురు. ఒక్కొక్కమెట్టు మోఁకాలియెత్తు గలిగి మోఁకాళ్ళు ముడుచుకొనుచు నెక్కవలెను గనుక నా పేరయ్యె ననియు నందురు. వీనిలోఁ గొన్నియంశములు నేఁటికిని గొండనెక్కువారికి దర్శనీయము లై యున్నవి. కొండనెక్కెడి పరిషజ్జనంబుల యార్తనాదంబులను తాళ్ళపాకవారిట్లు వర్ణించిరి. చూ. కీర్తనము.

"వేడుకొందామా వెంకటగిరివేంకటేశ్వరుని॥
　　ఆమటి మ్రొక్కులవాఁడే-ఆదిదేవుఁడే వాఁడు
　　తోమనిపళ్యాలవాఁడే దురితదూరుఁడే॥

వడ్డికాసులవాఁడే వనజనాభుఁడే పుట్టు
గొడ్డురాండ్రకు బిడ్డల నిచ్చేగోవిందుఁడే॥
　　ఎలమిఁ గోరినవరా లిచ్చేదేవుఁడే వాఁడు
　　అలమేల్మంగాశ్రీవేంకటాద్రినాథుఁడే॥"

(చూ. అన్నమా. చరిత్ర పీఠిక. పు.6 - శ్రీ శేషాచార్యులుగారి వ్రాతప్రతి)

అన్నమాచార్యుఁ డాతిరుమల నధిరోహించుచు పావన మగు నాశేషాచలదర్శనానందమున దాని నిట్లు కీర్తించినాఁడు.

శ్రీరాగం

"అదివో అల్లదివో హరివాసము
పదివేలశేషుల పడగలమయము॥

అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాస మఖిలమునులకు
నదె చూడు డదె మ్రొక్కు డానందమయము॥

వెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతలనిజవాసము
ముంగిటనల్లదివో మూలనున్న ధనము
బంగారుశిఖరాల బహుబ్రహ్మమయము॥ '' (5-23)

కొండకు బోవు మార్గమున మోకాళ్ళపర్వతముకడ నున్న త్రోవ భాష్యకారులను అన్నమాచార్యు డిట్లు కీర్తించినాడు,

దేసాళం

''గతులన్ని ఖిలమైన కలియుగ మందును
గతి యీతడే చూపె ఘనగురుదైవము॥
ఈతనికరుణనేకా యిల వైష్ణవుల మైత్రి
మీతనివల్లనే కంటి మీతిరుమణి
యీతడేకా వుపదేశ మిచ్చె నష్టాక్షరమంత్ర
మీతడే రామానుజులు యిహపరదైవము॥
నియమము లీతండెకా నిలిపె బ్రపన్నులకు
దయతో మోక్షము చూపె దగ నీతండె
నయమై శ్రీవేంకటేశునగమెక్కివాకిటను
దయ జూచి మమ్ము నిట్టె తల్లిదండ్రిదైవము॥''
(చూ. అన్నమా. చరిత్ర పీఠిక పు. 17)

ఈ త్రోవభాష్యకారుల దర్శనానంతర మిక దిన్నగా తిరుమలగిరికే పయనము. అచట ''ఆనందనిలయ మందిరము''న నెలకొన్న అలమేల్మంగామనోహరుని దర్శించి కొలుచుటకు బూర్వము భక్తు లగుతాళ్ళపాకకవు లాతిరుమలగిరి పట్టణమున దిరిగి సేవించిన విశేషము లించుక దెలియ దగును.

చిన్నన్న పరమయోగివిలాసమున :

''ఆదియావరణమున - వైకుంఠగోపురమునకు బ్రణమిల్లిగారుడ స్తంభంబు

చక్కి వినతుఁడై - చెంతఁ గ్రొవ్విరిసాలకేఁగి చంపకావరణంబు వలచుట్టి - స్వామి పుష్కరిణితోయంబు లాని - ఉత్తుంగభాగమున నా యహికులపతియవతార మగుచుఁదిరుగని చింతలం దెరలించు నీడదిరుగనిచింతకు మ్రొక్కి - రెండవ గోపురము దాఁటి లోని కమలమహానసాగార సేవించి - ఆనందనిలయ మణివి మానమును సేవించి - మహామణిమంటము సేవించి - తురగ తార్క్ష్యాహినాయకుల సేవించి - నిత్యుల సేవించి - లోని కరుదెంచి అలుమేలుమంగామనోజు" ని దర్శించిన క్రమమును వర్ణించెను.

అతఁడే పిదప అన్నమాచార్య చరిత్ర ద్విపదయందు అన్నమాచార్యుఁడు స్వామి దర్శనమున కేఁగిన క్రమమును గూర్చి విపులీకరించుచు నిట్లు రచించెను.

'కోనేటు గడతెంచి తీర్థవిభుని సేవించి-సోబనాలతోఁ గనుపట్టు స్వామి పుష్కరిణీసోయగంబునకు విస్మయముఁజెంది-ఆదివరాహస్వామి నాదరంబునఁ గొనియాడి వలచుట్టుకొని వచ్చి-పెద్ద గోపురము సేవించి - నీడదిరుగనిచింత వ్రేల నమ్రుఁడగుచు - గరుడగంభము పేర్మిగని సాగి మ్రొక్కి-చంపకపుఁ బ్రదక్షిణము చనుదెంచి-స్వామి పుష్కరిణిఁ బూజించి-నడగోపురము సొత్తెంచి ప్రసాదము లమ్ముపట్టు లరసి-కమ్మని వాసనల కలరి-శ్రీనివాసుని నమస్కృతి చేసి-దండ కానుపించిన భాష్యకారులఁ బొగడి - శ్రీ నరసింహుని సేవఁగావించి, జనార్దను మన్నించి-అలమేలుమంగ కభివందనములు సలిపి-ఆనంద నిలయంబు గాఁచి మరుగురుకల్యాణమంటపమునకు కరములు మొగిచి - చెంగటి తేజి కెఱఁగి-బంగారు గరుఁడని భజయించి-శేషునిఁ గొలిచి-పరుసలు రాఁగా బండా రమును దేరగొనుచు కాసుకానుక బెట్టి - బంగారుగాదెల పజ్జ సాష్టాంగ మంగ లింపుచు-పసిఁడి టక్కుల తలవాకిటను గానవచ్చు స్వామివారి 'దివ్య మఁగళ విగ్రహంబును' గన్నులార సేవించి-' అన్నమాచార్యుఁడు చరితార్థుఁ డాయెనట ! (చూ. పుటలు. 18-22)

పైవర్ణనములందు భక్తులు తిరుమలదేవుని దర్శించుటకు వెడలుక్రమము మాత్రమే కాక నాఁటిదేవాలయపరిసరములుకూడ చక్కఁగా కనులగట్టుచున్నవి. తిరుమలమీఁది యాలయపరిసరములను వర్ణించు తాళ్ళపాకవారికీర్తనము లున్నవి. కొన్ని చూడఁదగును.

స్వామిపుష్కరిణి :

"దేవునికి దేవునికి నీ తెప్పలకోనేరమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీ కమ్మా॥

ధర్మార్థకామమోక్షతతులు నీసోబనాలు
అర్మిలి నాలుఁగువేదా లదె నీదరులు
నిర్మలపునీజలములు నిండు సప్తసాగరాలు
కూర్మము నీలోఁతు వో కోనేరమ్మా॥

తగిన గంగాదితీర్థములు నీకడఖ్
జగతి దేవతలు నీజలజంతులు
గగనపుఁ బుణ్యలోకాలు నీదరిమేడలు
మొగి నీచుట్టుమాఁకులు మును లోయమ్మా॥" (7-192)

ఈస్వామిపుష్కరిణీమాహాత్మ్యము వేంకటాచలమాహాత్మ్యమున వర్ణింపఁబడినది. పైసంకీర్తనమునే చిన్నన్న ద్విపదలో స్మరించినాఁడు. స్వామిపుష్కరిణిని తాళ్ళపాకవా రెంతోపవిత్రముగా భావించి కొలిచిరి. క్రీ॥ శ॥ 1532లో తాళ్ళపాక పెదతిరుమలాచార్యుఁడే స్వామిపుష్కరిణిని బాగుచేయించి నీరాళిమంటపము నుద్ధరించి ప్రదక్షిణమంటపమును నూతనముగా నిర్మించెను.[1] మఱల శిలలతో సోపానములు గట్టించెను. అంతేకాదు పుష్కరిణీతీరమునఁ గలవరాహస్వామి వారియాలయమునకు ప్రాకారకుడ్యములను, ప్రదక్షిణమంటపమునుగూడ వీరు నూతనముగ గట్టించిరి. అన్నమాచార్యుఁ డీతీర్థమును భక్తితోఁ గొనియాడి యుండుటయే పెదతిరుమలాచార్యుఁ డీకైంకర్య మొనర్చుటకు ప్రధానహేతువైయుండును. చిన్నన్న ద్విపదలు పైవిషయమును స్మరించునవిగనే యున్నవి. ఈకోనేటిలో నేఁటేట జరుగు స్వామివారి తెప్పతిరునాళ్లను తాళ్ళపాకకవులు వర్ణించిరి. చూ. కీర్తనము.

లలిత

"ఎందు నీకుఁ బ్రియమో యీతెప్పతిరునాళ్లు
దిందుపడె సిరులతో తెప్పతిరునాళ్లు॥

(1) చూ. సం. 40, 41 తి. తి. దే. శా. సం॥ 4. పు 82-83.

అప్పుడు పదారువేలు అంగనల చెమటల
తెప్పలఁదేలిన తెప్పతిరునాళ్లు
నొప్పుగ శ్రీవేంకటాద్రి నున్నతిఁ గోనేటిలోన
తెప్పరిల్లె నేఁటనేఁట తెప్పతిరునాళ్లు॥" (6-143)

## ఆలయములు, క్షేత్రదైవతములు

**భూవరాహస్వామియాలయము:**

స్వామిపుష్కరిణికి వాయవ్యదిశయం దీమందిర మున్నది. ఈవరాహ స్వామియే వరాహక్షేత్రమని ప్రసిద్ధిగాంచిన తిరుమలయందలి క్షేత్రదైవతమనియు, శ్రీనివాసుఁడచట నర్చారూపమున వెలసినపిదప నీవరాహస్వామి ప్రాభవముతగ్గిన దనియు, నయినను శ్రీనివాసుఁడు తనను దర్శింప నేతెంచుభక్తులందరకు మున్నుగా నీయాదివరాహస్వామిని దర్శించియే తనకడకు రావలెనని కట్టడిచేసి వరాహక్షేత్రప్రాముఖ్యమును నిలఁబెట్టె ననియు పురాణగాథలు చెప్పుచున్నవి. తిరుమల మీఁద నీదైవతమునుగూర్చినతొలిప్రశంస క్రీ॥శే॥ 1379 లో తిరుపతి శ్రీవైష్ణవబృందమునకు జెందిన తిరుకలిక్రణిదాసునిశాసనమున కానవచ్చుచున్నది. ఆతఁడు శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలమూర్తికిని, ఉత్సవమూర్తికిని జరపిన నివేదనములనువరాహస్వామికిని జరపిన ట్లందున్నది.[1] అటుపై బ్రహ్మోత్సవ సందర్భములందు స్వామివారియుత్సవమూర్తి యూరేగింపులతో వరాహస్వామి వారియాలయమున కైదుదినములుఁ వరుసగా విచ్చేయు చుండినట్లును తిరుమంగై యాళువారల తిరుమొళిపాటలు అచట గానముచేయఁబడు చుండినట్లును శాసన ప్రశంస లున్నవి. కాని యేలనో వైష్ణవాళ్వారులెవ్వరును ఈవరాహస్వామి నభివర్ణించినట్లు కానరాదని శ్రీవీరరాఘవాచార్యులవారు వ్రాసియున్నారు. (చూ. తిరుపతి చరిత్ర. ప్రకటన-1954) దశావతారస్తుతులలోఁ దప్ప అన్నమాచార్యుని సంకీర్తనము లీదైవతమునుగూర్చినవి విడిగా నాకు గానరాలేదు. పెదతిరుమలా చార్యుఁ డేమేని వ్రాసె నేమో? చిన్నన్నమాత్ర మిట్లు వర్ణించినాఁడు.

"ఉరగేంద్రుశిరసుపై నొకపాద మూది
చరణ మొక్కటి రసాస్థలి మోవఁ జాచి॥
డాకేలు పుడమిపడంతుక నలమి

1. చూ. సం॥-81-T.T. (చూ Epi.Report. P. 56)

యాకేలు కటి నూఁది యనురక్తిఁ జక్కఁ
బంటవలంతి గుబ్బల తావిమోవి
పంటతేనియ లోకపరిచయానుతమిని॥
మోముదామరఁజూచి మొగసిరి కేరి
తామరలను శ్రుతిద్వయము నిక్కించి
సంకుచక్రముల హస్తమ్ములరెంటఁ
బొంకించు కరుణ చూపుల జొబ్బిలంగ॥
నాదరిఁ బెంపొందు నాదివరాహు
నాదరంబునఁ గొనియాడి సేవించి॥"

(అన్నమా. చరిత్ర పు. 19)

వరాహస్వామి దర్శనానంతరము తాళ్ళపాకవారు వర్ణించిన క్రమమున గల యాలయపరిసరవిశేషములలోఁ గొన్నిటినిఁ గూర్చిన కీర్తనము లున్నవి. చూ.

ముఖారి

"జనులు నమరులును జయ లిడఁగా
ఘనుఁ డదె పుయ్యాలగంభము కాడ॥

వదలక వలసినవారికి వరములు
యెదురెదురై తా నిచ్చుచును
నిదుర లేక పెనునిధినిధానమై
కదలఁ డదె గరుడగంభము కాడ॥

కోరినవారికిఁ గోరినవరములు
ఓరంత ప్రొద్దు నొసఁగుచును
చేరువయై కృపసేసీ నిదివో
కూరిముల నడిమిగోపురమాడ॥

వడి వేంకటపతి వరములరాయఁడు
నుడుగఁ గాళ్లఁ గన్నులు సుతులు
బడిబడి నొసఁగుచు బ్రాణాచారులకు
కడిమి నీడదిరుగని చింతాడ॥" (11-3-108)

ఇందు ఆలయమునుండి వెలికివచ్చువరుసన గరుడగంభమును, నడిమి గోపురమును, నీడదిరుగనిచింతయు వర్ణితములై నవి. ఆలయప్రథమావరణమునఁ గల పెద్దగోపురము (పడికావలి గోపురము) నకుఁ బ్రక్కనున్నట్లు వర్ణిత మైన యీ చింతచెట్టు శేషాంశమని సేవాక్రమమునను, వేంకటాచల మాహాత్మ్యము నను గలదు. కాని యీ చెట్టు నేఁడు గానరాదు. "గరుడగంభముకాడ కదుఁ బ్రాణాచారులకు వరము లొసఁగీని శ్రీవల్లభుండు" అని వేరొక సంకీర్తనమున గూడ నీ గరుడగంభమును వీరు స్తుతించినారు.

ఇఁకఁ దిరుమలమీఁది యాలయప్రాంగణమున తాళ్ళపాకవారు దర్శించిన యితర దైవతములను గూర్చికూడ కొన్ని సంకీర్తనములు చూడఁదగియున్నవి.

## సన్నిధి భాష్యకారులు :

తిరుమలమీఁద నీభాష్యకారులమూర్తులు రెండున్నవి. అందొకటి మోకాళ్ళముడుపుకడ నున్నత్రోవభాష్యకారులది. దానిని తాళ్ళపాకవారు వర్ణించినవిధము నిదివఱకే వివరించితిని. ఇఁక రెండవది స్వామివారి సన్నిధానముననే కల సన్నిధిభాష్యకారులది. దిగువ తిరుపతిలో భాష్యకారుల యర్చామూర్తిని క్రీ॥ శ॥ 1220 ప్రాంతమున వెలయింపఁ జేసినట్లు శాసనసాక్ష మున్నది. ఇంచుమించు సమకాలముననే తిరుమలమీఁది భాష్యకారులమూర్తులను గూడ నెలకొల్పియుందురని విజ్ఞుల విశ్వాసము. అట్లు నెలకొల్పఁబడిన విగ్రహమే తరువాతికాలమున విమానప్రదక్షిణ మంటపమున స్వామివారి యాలయమున కుత్తరదిశఁగా నిర్మితమై నేఁడును గానవచ్చు మందిరమునఁ జేర్చఁబడి యుండునని శ్రీ T.K.T. వీరరాఘవాచార్యులుగారు తమ 'తిరుపతి చరిత్రము' (I-పుట 238)లో వివరించినారు. తిరుమలమీఁద స్వామివారి కీడై యున్న యీ సన్నిధిభాష్యకారులను అన్నమాచార్యుఁడు కీర్తించి యుండుటచేత నాతనికాలము నకుఁ బూర్వమే తన్మూర్తి యచట నుండె ననుకొనుటలో విప్రతిపత్తి లేదు. చూడుఁడు కీర్తనము.

సామంతం

"ఉన్నతోన్నతుఁడు వుడయవరు
యెన్న ననంతుఁడె యీ యుడయవరు॥

సర్వలోకముల శాస్త్రరహస్యము
లుర్విఁ బొడమె నీయుడయవరు
పూర్వపు వేదాంత పుణ్యశాస్త్రములు
నిర్వహించె నన్నిట నుడయవరు॥
కదిసి మోక్షసాకారము దానై
వుదుటున నిలిచె నీయుడయవరు
యిదిగో శ్రీవేంకటేశ్వరుఁడు యీతై
పొదలుచు నున్నాఁడు భువి నుడయవరు॥" (2-229)

వారే వేరొకకీర్తనమున :-

"పంకజపుఁజేయి చాచి పాదపుఁబర మిచ్చిన
వేంకటేశుకృపతోడ వెలయఁ దానే
తెంకినే వొడయవరై తిరుమంత్రద్వయాన
పంకమెల్లఁ బోఁగడిగె భాష్యకారులు॥" (5-104)

అనియు రామానుజులవారిని గీర్తించిరి. ఇందు 'వేంకటేశ్వరు యీతై' 'తెంకినే వొడయవరై' యున్నవారు సన్నిధిభాష్యకారులే యనుటకు సందేహము పనిలే దనుకొందును.

**నృసింహస్వామి :**

నృసింహస్వామి మందిరము వేంకటేశ్వరస్వామివారియాలయప్రాంగణమున నీశాన్యదిశయిందు విమానప్రదక్షిణపథము లోతట్టున గలదు. తిరుప్పళ్ళి యెళుచ్చి (ధనుర్మాస) సందర్భమున ముప్పదిదినములు వరుసగా నిత్యమొక తిరుపోనకముసమర్పిత మగుచుండినట్లును విశేషదివసములందు అతిరసప్పడులు నివేదితము లగుచుండినట్లును, శాసనసాక్ష్యములనుబట్టి తెలియుచున్నది.1 పంగుణి అమావాస్యా, వసంత పూర్ణిమా తిథులందు ఆస్వామికి అభిషేకములు జరగునట్లు కందాడై రామానుజయ్యంగారు వసతులు గల్పించి యుండిరి. తాళ్ళపాకవారీ నృసింహస్వామిని గీర్తించిరి. చూ. కీర్తన.

నాట

"ఘోరవిదారణ నారసింహా నీ
వీ రూపముతో నెట్లుండితివో॥

ఉడికెడికోపపుటూర్పులఁగొండలు
పొడిపొడియై నభమున కెగయ
బెడిదపురవమున పిడుగులు వొరుగఁగ
యెడనెడ నీవపుఁ డెట్లుండితివో॥'' (2-69)
(2-85 కూడ చూడఁదగును)

## గరుడాళ్వారు :

గరుడాలయము వేంకటేశ్వరస్వామివారి తిరుమామణిమంటపమునం దున్నది ఇచట గరుడాళ్వారునకు నిత్యనైవేద్యములు బ్రహ్మోత్సవసమయములందు సాగును. బ్రహ్మోత్సవము శ్రీగరుడనియారాధనముతోడనే ప్రారంభ మగును. గరుడచిత్రితమైనపట మొకటి ధ్వజస్తంభముపై కారోహింపఁజేయుటతో బ్రహ్మోత్సవమారంభ మగును. ఈగరుడధ్వజపటమునకుఁ గూడ పూజాదిక మున్నది. గరుడఁడు ఆళ్వారుగా పేర్కొనఁబడినప్పటికిని పన్నిద్దరాళ్వారుల తరగతికిఁ జెందినవాఁడు కాఁడు.(శ్రీమన్నారాయణమూర్తికి వాహనమాత్రుఁ డంతె వాహన మగునీగరుత్మంతుని తాళ్ళపాకవారిట్లు వర్ణించినారు. చూ. కీర్తన.

నాట

"ఇటు గరుఁడని నీ వెక్కినను
పటపట దిక్కులు బగ్గనఁబగిలె॥

ఎగసినగరుఁడుని యేపున ధా యని
జిగిదొలఁగ చబుకు చేసినను
నిగమాంతంబులు నిగమసంఘములు
గగనము జగములు గడగడ వడకె॥

పల్లించిన నీ పసిఁడిగరుఁడుని
కెల్లున నీ వెక్కినయపుడు
ఝుల్లనె రాక్షససమితి నీ మహిమ
వెల్లి మునుఁగుదురు వేంకటరమణా॥" (2-92)

ఈ పసిఁడిగరుఁడఁడు స్వామివారి వాహనము. 'బంగరుగరుఁడని భజించి' అని చిన్నన్న పేర్కొన్న దీగరుడమూర్తినే.

1. సం॥ 280 (చూ.తి. తి. దే. శా. నివేదిక P.56)

**విష్వక్సేనుఁడు** (సేనమొదలారి) :

సేనై మొదలా రనునామాంతరము గల ఈ విష్వక్సేనునకు ప్రత్యేక మందిరము పూజావ్యవహారమును లేదుగాని తిరుమలలో గర్భమందిరమున నుత్సవ మూర్తులవెంట నీతని మూర్తియుఁ గొలువఁబడుచున్నది. అధ్యయనోత్సవనసమ యమునం దీదేవునకు ప్రత్యేకారాధనము సాగును. తాళ్ళపాకవా రీవిష్వక్సేనునిట్లు స్తుతించినారు.

లలిత

"నీవే కా చెప్పఁ జూప నీవే కా
శ్రీవిభుప్రతినిధివి సేనమొదలారి॥

నీవేకా కట్టెదుట నిలుచుండి హరివద్ద
దేవతలఁ గనిపించే దేవుండవు
యేవంక విచ్చేసినాను యిందిరాసతికి నిజ
సేవకుండవు నీవే కా సేనమొదలారి॥

పసిఁడిబద్దలవారు పదిగోట్లు గొలువ
దెసలఁ బంపులు వంపే ధీరుఁడవు
వసముగా ముజ్జగాలవారి నిందరిని నీ
సిసువులుగా నేలిన సేనమొదలారి॥" (అన్నమా)

ఇట్లే వేరొక కీర్తనమున-

"దిట్టపుసూత్రవతీపతి వసురలం
జట్టలు చీరంగఁ జతురుఁడవు
రట్టడి వేంకటరమణుని వాకిటి
పట్టపుసేనాపతి (వట కా)॥" (2-196)

అనియుఁ గీర్తించిరి.

**ఆదిశేషుఁడు** :

తిరుమలమీఁది యనంతుని తాళ్ళపాకవారు వర్ణించియున్నారు.

మాళవి

"వీఁడు గదే శేషుఁడు శ్రీవేంకటాద్రిశేషుఁడు
వేడుక గరుఁడనితోఁ బెనుదైనశేషుఁడు

వేయిపడగలతోడ వెలసినశేషుఁడు
చాయమేని తళుకు వజ్రాలశేషుఁడు
మాయనిశిరసులపై మాణికాలశేషుఁడు
యేయెడ హరికి నీడై యేఁగేటిశేషుఁడు॥

పట్టపువాహన మైనబంగారుశేషుఁడు
చుట్టు చుట్టుకొనిన మించులశేషుఁడు
నట్టుకొన్న రెండువేలునాలుకలశేషుఁడు
నెట్టన హరిఁ బొగడ నేరుపరిశేషుఁడు॥" (9-76)

"పట్టపువాహనమైన" యీ "బంగారుశేషునే" చిన్నన్న "గరుఁడని భజించి శేషునిఁ గొలిచి" యనుపట్టున స్మరించినది.

తాళ్ళపాకవారీయనంతగరుడవిష్వక్సేనాదుల నిట్లు కీర్తించుటయే కాక దిగువతిరుపతిసమీపమునఁ గల మంగాపురమున తాము జీర్ణోద్ధరణముగావించిన కల్యాణవేంకటేశ్వరాలయమున క్రీ॥ శ॥ 1540 లో నాచ్చియార్ కల్యాణవేంకటేశ్వరుల మూలమూర్తులతోపాటు వీరి మూర్తులనుఁగూడ ప్రతిష్ఠాపించి యుండిరి.[1]

తాళ్ళపాకవారి పైసంకీర్తనములందు పైని పేర్కొన్న దైవతములే కాక తిరుమలమీఁద మఱికొన్ని దైవతములయునికిఁ గూడ గుర్తింప నగుచున్నది.

## శ్రీరంగనాథస్వామి :

తిరుమలమీఁది యాలయమున బహిఃప్రాకారము నానుకొని ఆగ్నేయదిశయందు రంగమండప మనుపేర నేఁ డొకమంటప మున్నది. దానివెనుకగా నొక చిన్నమందిరమున్నది. అది నేఁడు మూయఁబడియున్నను వెనక నందే శ్రీరంగనాథస్వామి నెలకొని కొంతకాల ముండె నని తలఁపఁబడుచున్నది. క్రీ॥ శ॥ 1310-1320 సం॥లనడుమ జరిగిన మాలిక్‌కాఫరు దండయాత్రల సందర్భమున

1. సం॥ 144— తి. తి. దే. శా. సం॥ 4.

రక్షణకొఱకై శ్రీరంగమందలి రంగనాథస్వామి విగ్రహమును దెచ్చి కొంత కాలముపాటు తిరుమలమీఁద నెలకొల్పఁజేసినట్లు చరిత్రయు సంప్రదాయమును జెప్పుచున్నవి. రంగనాథునిమందిరము చిన్నదగుటచేత శ్రీరంగమునందలి మూల విగ్రహమును గాక ఉత్సవవిగ్రహమును మాత్రమే ఆనాఁ డచ్చటికిఁ దెచ్చి యుందు రని శ్రీ టి. కె. టి. వీరరాఘవాచార్యులుగారు తమ "తిరుపతిచరిత్ర" ( 1-173పు ) లోఁ దలపోసియున్నారు. ఏమైనను ఆవిగ్రహము మఱల క్రీ॥ శ॥ 1371 ప్రాంతములందే గోపన్నమంత్రిచేత శ్రీరంగమునకుఁ గొంపోఁబడి పునః ప్రతిష్ఠితమైనట్లు తెలియుచున్నది.[1] ఇదియే తిరుమలమీఁది రంగనాథస్వామివారి యునికినిగూర్చిన చరిత్ర. తద్విషయమును స్మరించుచుఁ గాఁబోలు తాళ్ళపాకకవు లీ రంగనాథు నిట్లు కీర్తించినారు.

శంకరాభరణము

"రంగ రంగ రంగపతి రంగనాథా నీ
శృంగారాలే తఱచాయె శ్రీరంగనాథా॥

యేప్రొద్దు పవ్వళించి యింతులభోగము నీకు
రాపుగౌలు వెప్పుడోయి రంగనాథా
పాపసెజ్జమీఁద నుండి పచ్చివిరహము నీకు
పోపో వయ్యాళి యెప్పు డోరంగనాథా॥

కావేటిరంగమున కాంతపై పాదాలుచాచి
రావుపో వెక్కడికిని రంగనాథా
శ్రీవేంకటాద్రిమీఁద చేకొనినిల్చితివి
యేవేళ చూచిన నీవె యిటు రంగనాథా॥" (2-242)

రామస్వామి :

శ్రీరాములవారికి తిరుమలమీఁద ప్రత్యేక మగుమందిర మున్నట్లుకానరాదు. 'రామర్ మేడై' అను మందిర మొకటి గర్భాలయమునకుఁ బోవుమార్గమున నుండి నట్లు శాసనములనుబట్టి తెలియుచున్నది కాని యిది క్రీ॥ శ॥ 1262 ప్రాంతములకే ముక్కోటిప్రదక్షిణ ప్రాకారకుడ్యముల పునర్నిర్మాణ సందర్భమున మూయఁబడి నది. అందు నేఁ డేమియు లేదు. ఉన్న శ్రీరాములవారివిగ్రహము గర్భాలయము

1. చూ. తి. తి. దే. ఎపిగ్రాఫికల్ రిపోర్టు-పు-132.

ననే స్వామిసన్నిధి నున్నట్లు శాసనములనుబట్టి తెలియుచున్నది. ఆ మూర్తికే క్రీ. శ. పదునైదవశతాబ్ది మధ్యభాగమునుండి స్వామివారితోపాటు, పూజాదికము సాగుచుండినట్లు తిరుపతిశాసనములం దున్నది. తాళ్ళపాకవా రీరామమూర్తి నిట్లు ధ్యానించినారు.

బౌళి రామక్రియ

"ఇతఁడే పరబ్రహ్మ మిదియె రామకథ
శతకోటివిస్తరము సర్వపుణ్యఫలము॥

ధరలో రాముఁడు పుట్టె ధరణిజఁ బెండ్లాడె
అరణ్యవాసుల కెల్లా నభయ మిచ్చె
సొరిది ముక్కుఁజెవులు చుప్పనాతిని గోసె
ఖరదూషణులను ఖండించి వైచె॥

కినిసి వాలిఁ జంపి కిష్కింధ సుగ్రీవు కిచ్చె
వనధి బంధించి దాఁటె వానరులతో
కనలి రావణకుంభకర్ణాదులను జంపె
వనితఁ జేకొని మళ్ళి వచ్చె నయోధ్యకును॥" (11-224)

శ్రీరాములవారితోపాటు ఆంజనేయస్వామికూడ తాళ్ళపాకవారి కీర్తనములందు వర్ణితుఁ డైనాఁడు. చూడుఁడు కీర్తనము.

గౌళ

"నేల మిన్ను నొక్కటైన నీబంటు నొక్క-
వేలనే యక్షునిం దెగవేసె నీబంటు॥

అలర నన్నియుఁ జేసి అజునిపట్టానకు
నిలుచున్నాఁ డదిగో నీబంటు
బలు వేంకటేశ ఈపవననందనుఁడు
కలిగి లోకము లెల్లఁ గాఁచె నీబంటు॥" (2-70)

శ్రీకృష్ణుఁడు :

శ్రీరాములవారి మూర్తివలెనే శ్రీకృష్ణుని విగ్రహముకూడ వేంకటేశ్వరా

లయమున నున్నట్లు శాసనసాక్ష్య మున్నది. శ్రీజయంతినాఁడును, బ్రహ్మోత్సవములందును నీమూర్తికి విశిగాపూజలు గావింపఁబడు చుండెను. తాళ్ళపాకవారీమూర్తి నిగూడ తమ సంకీర్తనములందు గొనియాడిరి. చూడుఁడు కీర్తనము.

రామక్రియ

"గబ్బిగొల్లెతలముద్దు ఘనమాయ నేఁడు
వుబ్బుచునే చెంతకై వూరకుందే బాలుని॥

కొప్పుపువ్వు మెడదండె గుచ్చికట్టె నెవ్వతె
వొప్పుగ దేవరవలె నున్న బాలుని
తిప్పితిప్పి వీధులెల్లఁ దిరిగించె నెవ్వతె
ముప్పిరి శ్రీవేంకటాద్రి మూలనున్నబాలుని॥"(3-534)

ఈవిధముగా తాళ్ళపాకకవులు తిరుమలమీఁద ప్రధానదైవతమగు శ్రీవేంకటేశ్వరునితోపాటుగ తదితరదైవతములనుగూడ భక్తిశ్రద్ధలతోఁ గీర్తించియున్నారు. అసలు మూలవిరాట్టగు శ్రీవేంకటేశ్వరుని దివ్యమంగళవిగ్రహమునుఁ దిరుమలను అన్నమాచార్యుఁడు తొలుత దర్శించినప్పు డిట్లుగా నానందతాండవము గావించినాఁడట![1] చూ. కీర్తన—.

దేశాక్షి

"కంటి నఖిలాండకర్త నధికుని గంటి
కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తిఁ గంటి॥

పావనం బైనపాపవినాశనము గంటి
కైవశంబగు గగనగంగఁ గంటి
దైవికపుఁబుణ్యతీర్థము లెల్లఁ బొడగంటి
కోవిదులు గొనియాడు కొనేరిఁ గంటి॥

---

1. చూ. అన్నమాచార్యచరిత్ర ద్విపద- పు- 23.
"కంటి నయ్యఖిలాండకర్త నే నధికుఁ గంటి నాయఘము నిక్కము వీడుకొంటి
పావనంబైన పాపవినాశమ్ము
కోవిదుల్ గొనియాడు కోనేటిఁ గంటి
... ... ... ...
అనువర్థ మలవడ నాదేవు నెదుట
ననువుగా సంకీర్తనంబులు సేయ"

పరమయోగీంద్రులకు భావగోచరమైన
సరిలేనిపాదాంబుజములు గంటి
తిరమైన గిరిచూపు దివ్యహస్తము గంటి
తిరువేంకటాచలాధిపుఁ జూడఁ గంటి॥" (11-258)

తాళ్ళపాకవారిదేరీతిని బలుసంకీర్తనములలో నానాఁటిస్వామివారి దివ్యమంగళ విగ్రహమును గనులగట్టినట్లు వర్ణించిరి.

శ్రీనివాసుఁడు :

రామక్రియ — అటతాళం

"కంటిఁ గంటి నిలువు చక్కని మేనుదండలను
నంటుఁజూపులను జూచే నవ్వుమోముదేవుని॥

కనకపుఁబాదములు గజ్జెలు నందెలును
ఘనపీతాంబరముపై కట్టుకటారి
మొనసి యొడ్డాణపు మొగపులమొలనూలు
ఒనరనాభీకమల ముదరబంధములు॥

గరిమ వరదహస్త కటిహస్తములును
సరస నెత్తిన శంఖచక్రహస్తములును
ఉరముపై కౌస్తుభ మొప్పగుహారములు
... ... ... ... ॥

కట్టిన కంటసరులు ఘనభుజకీర్తులు
కట్టాణిముత్యాల సింగారనామము
నెట్టన శ్రీవేంకటేశ [illegible]
[illegible]॥

నొడ్డాణంబు నుదరబంధంబును, అక్కున నెలకొన్నయలమేలుమంగయును, శంఖచక్రములును, చతుర్భుజములును, కిరీటాదులును, వర్ణితము లైనవి. అలంకారరూపము లగునాయా యాభరణవిశేషము లన్నియు నాఁటిరాజులును, రాణులును, తదితరమండలేశ్వరులును స్వామివారి కర్పించుకొనియుండినట్టివే.–( ఈ పట్టున కళాపూర్ణోదయమందలి వర్ణనమునుగూడఁ బోల్చిచూడఁదగును ).

అలమేలుమంగకు స్వామివారి యురముననే కాని తిరుమలమీఁద విడిగా నామెకు స్థాన మేదియు నున్నట్లు కానరాదు. తాళ్ళపాకవారి సంకీర్తనములం దన్నిటను నామె శ్రీవేంకటేశు నురమం దున్నట్లే వర్ణితయైనది.[1] చూ. కీర్తనము.

**అలమేల్మంగ :**

పాడి

"అలమేలుమంగ నీ వభినవరూపము
జలజాక్షుకన్నులకు చవులిచ్చేవమ్మా॥

గరుడాచలాధీశు ఘనవక్షమున నుండి
పరమానందసంభరితవై
నెరతనములు చూపి నిరంతరము నాథుని
హరుషించఁగఁ జేసితౌ గదమ్మా॥" (12–159)

ఆయమ్మవారికి మూలమూర్తి విషయమెట్లోగాని తిరుమలమీఁద నుత్సవమూర్తి మాత్రమొకటిగల దని తెలియుచున్నది. చూ. కీర్తనము.

దేసాళము

"పలుకరె నమునరో కొమ్మలాలా
[illegible]॥

చల్లేటి గందవొడి మైజాజీ నిలువరో
పల్లకి వట్టిన ముద్దుఁబడతులారా
మొల్లమైన కుందనంపుముత్యాలకుచ్చు లదర
ఘల్లనుచుఁ గంకణాలు గదలీ మాయమ్మకు॥"
(అన్నమా)

ఇది యమ్మవారిని బల్లకిలోఁ దీసికొనిపోవునప్పటిపాట. ఇట్టిదే 'అలరులు గురియఁగ నాడె నదే-అలకల కులుకుల నలమేల్మంగా' అను సంకీర్తన మింకొకటి యామెనృత్యమును వర్ణించునదియుఁగలదు.

ఈవిధముగా తిరుమలమీఁది యాలయపరిసరములును, అందలి దేవతామూర్తులును, తాళ్ళపాకవారి కవితలందు కనులగట్టురీతి నున్నవి. వీరి రచనలలో నొక్క-తిరుమలనుగూర్చియే కాక దిగువతిరుపతిని దత్పరిసరములందలి యాలయములను వర్ణించుకీర్తనములుకూడ నెన్నియో గలవు. వానినిగూర్చికూడ నిట సంగ్రహముగ వివరింతును–.

## దిగువతిరుపతి :

దిగువతిరుపతిలోని యాలయములలో శ్రీ గోవిందరాజస్వామివారి యాలయము మిక్కిలి ప్రాచీనమైనది. ఆటు తరువాతిదే శ్రీరామాలయము. ఇఁక వానికనుబంధముగ వెలసిన యాలయములు మఱికొన్నియుఁ గలవు. ఆనాళ్ళలోఁ దిగువతిరుపతియందలి యాలయములలోఁగూడఁ తాళ్ళపాకవారు తిరుమలమీఁది యాలయమున జరపించినటులే పెక్కు కైంకర్యముల జరపించినారు. తిరుమలయందువలెనే తిరుపతియందును దాళ్ళపాకవారినివాసగృహ మున్నది. తిరుపతియందును వారు నూతనాలయముల నెన్నిటినో గట్టించిరి. దైవతములఁ బ్రతిష్ఠించిరి. ప్రస్తుత మిచట తాళ్ళపాకవారి సంకీర్తనములందు ప్రతిబింబితములగు తద్విశేషములను మాత్రమే యించుక వివరింతును.

## శ్రీ గోవిందరాజస్వామివారియాలయము :

ఈ యాలయ మంతకుఁబూర్వ ముండిన పార్థసారథియాలయమున కనుబంధముగా క్రీ. శ. 1129-30 సం॥లలో శ్రీమద్రామానుజాచార్యులవారి నిదేశమున నెలకొల్పఁబడినట్లుగా చరిత్రపరిశోధకులు తలఁచుచున్నారు. కాలక్రమమున

పార్థసారథిస్వామివారిమూర్తి భిన్నమై గోవిందరాజస్వామివారిమూర్తికే ప్రాముఖ్య మేర్పడినది. అన్నమాచార్యాదు లీగోవిందరాజస్వామివారిని పలుసంకీర్తనములలోఁ గీర్తించిరి. చూ. కీర్తనము.

శంకరాభరణము

"అల వటపత్రశాయి వైనరూప మిట్టి దని
కొలువై పొడచూపేవా గోవిందరాజా॥

పడఁతు లిద్దరిమీఁద పాదములు చాచుకొని
వొడికపు రాజసాన నొత్తిగిలి
కడలేని నిజనాభికమలమున బ్రహ్మను
కొడుకుఁగాఁ గంటి విదే గోవిందరాజా॥

సిరులసొమ్ములతోడ శేషునిపైఁ బవళించి
సొరిది దాసులఁ గృపఁ జూచుకొంటాను
పరగుదైత్యులమీఁద పామువిషములే నీవు
కురియించితివిగా గోవిందారాజా॥" (5–303)

ఇందు చేయి తలక్రింద బెట్టుకొని పరున్న గోవిందరాజస్వామివారిమూర్తి వర్ణిత మైనది.

"పరగి నీముందరను పంచబేరము లుండఁగా
గరిమ చక్రము నీకుఁ గాపై వుండఁగా
తిరమై శ్రీవేంకటాద్రి తిరుపతిలోపలను
గొరబాయ నీబ్రదుకు గోవిందరాజా॥" (7-130)

అని వారే వేరొక కీర్తనమున గోవిందరాజాలయమునందలి "పంచబేరముల" విషయమును గూడ ప్రస్తావించిరి.

తిరుమలమీఁద స్వామి నిలచియుండఁగా తిరుపతిలో పరుండి యుండును. తాళ్ళపాకవారు స్వామి నిట్లు ప్రచ్ఛించినారు.

శోకవరాళి

"వేంకటగిరి గోవిందుఁడా
యింకా నొకరో యిద్దరోమీరు॥

నిలుచుండుటయును కెటిఁ బవళింపుచు
నలరుటయును మీ రటనిటును
జలజాక్షులు దొడ చరచగ నొరపుల
నొలయఁగ నిద్రో విభవ మిదో॥

తిరువెంకటగిరి దిగువతిరుపతిని
పరమానందపు బహుసిరుల
అరుదుగఁ బొందుచు అధికము లందుచు
ఉరగశయనుఁడవో వొడయఁడవో॥" (11-2-28)

గోవిందరాజస్వామివారి యాలయమునఁ గాఁబోలు వసంతపూర్ణిమనాఁటి వైభవ మునుదాళ్ళపాకవా రిట్లు వర్ణించినారు.

వరాళి

"వరుసతో సాసముఖా వసంతపూర్ణిమ నేఁడు
సిరుల యీవిభవాలు సేవించరో॥

లలితపు గోవిందుఁడు లక్ష్మిమండపమందున్న
వలరా జదివో కొలువఁగ వచ్చెను
వెలఁ జంద్రుఁడు తోడనే వెల్ల గొడుగటు వట్టె
సులభానఁ బవనుఁడు సురటి విసరెను॥" (13-445)

ఇందు పేర్కొనఁబడిన లక్ష్మిమండపము క్రీ॥శ॥ 1494 కుఁ బూర్వమే నిర్మితమైన వసంతమంటప మేమో! ఆయాలయమున లక్ష్మీదేవిమంటప మని [illegible] అన్నమాచార్యులు పేర్కొనిన [illegible]
[illegible]

పాడి

"బాలుఁ డటవే సాదటవే వీఁడు పల్లదీఁడు గాక
కోలుముందై తనమాటలేగెలువ గొబ్బునఁ దగువు చెప్పీనమ్మా॥

నీరాటిరేవులఁ బొంచీనమ్మా! నిక్కినిక్కి తానే చూచీనమ్మా
వేఱులేక యెట్టు దగ్గరుదము గోవిందకృష్ణరాయని
అరదితో నొడి దొడికీనమ్మా అనలువెట్టుచుఁ బోనీఁడమ్మా
వీరిడిమాయల నిందరినిఁ దాను వెంటనెంట నేల తిప్పీనమ్మా॥"
(16-శృం॥ 111)

చినతిరుమలాచార్యుఁడు పేర్కొన్న గోవిందకృష్ణుఁడు క్రీ.శ. 1523 ప్రాంతములందు సాళువగోవిందరాజు గోవిందపుష్కరిణీతటమున నెలకొల్పిన గోవిందకృష్ణుఁడే కాఁదగును. క్రీ. 1522-37 సం॥ల నడుమ దిగువతిరుపతిలో గోపాలకృష్ణుల విగ్రహములు రెండుమూఁడు ప్రతిష్ఠితము లైనట్లు శాసనాధారము లున్నవి. కాని యవి యేవియు నేఁ డచట గానరావు. వీరు కీర్తించిన "గోవిందకృష్ణుని" మందిరముకూడ నాగోవిందపుష్కరిణీతటమున నేఁడు కానరాదు.

'రారా చిన్నన్న రారోరి చిన్నవాఁడ
రార ముద్దులాఁడ రారోరి బాలకృష్ణ' (16 శృం- 82)

అను సంకీర్తనమున చినతిరుమలాచార్యుఁడు కీర్తించిన బాలకృష్ణుఁడు కూడ నీగోవిందకృష్ణుఁడే యై యుండును.

శ్రీ — [illegible]

యమునందలి రఘునాథుఁడు కాక గోవిందరాజాలయమున రామానుజమందిరమున వేరొక రఘునాథునిమూర్తికూడ కలదు. తాళ్ళపాకకవులీ 'పెద్దరఘునాథు'ని గీర్తించుచు పలుసంకీర్తనములు రచించినారు. చూ. కీర్తన.

సాళంగనాట

"రాముఁ డిదే లోకాభిరాముఁ డితఁడు
గోమున పరశురాముకోప మార్చె నటరే॥

యీవయసు తానై యా యెక్కువ జలధి గట్టి
రావణుఁ జంపి సీత మరలిఁ దెచ్చెను
శ్రీవేంకటేశుఁ డితఁడాసిరులనయోధ్య నేలె
కావున నాఁటికినేఁడు కంటి మిట్టే కదరే॥" (5-299)

అన్నమాచార్యుని పైకీర్తనమునందు వర్ణితుఁడైన స్వామి తిరుపతిలోని రఘునాథుఁడే కాదఁగు ననుకొందును. ఇట్లే వారు ఆంధ్రదేశమందలి పెక్కువైష్ణవ క్షేత్రములలో నెలకొన్న రఘునాథుని మూర్తులను స్థలనామాంకములతో కూడ కీర్తించియున్నారు. చినతిరుమలాచార్యుఁడు తిరుపతిలోని రఘునాథునే స్పష్టముగా కీర్తించినాఁడు. చూ. సంకీర్తనము.

మాళవిగౌళ

"నీ వెక్కుడో ఆపె నీకంటె నెక్కుడో
రావయ్య తిరుపతి రఘురామచంద్ర॥

తుమురుగ దనుజులఁ దోలితొప్పరలాడి
అమరఁగ గెలిచితి నందువు
మమతతోడుత నిన్ను మదనయుద్ధమునందు
రమణి నిన్ను గెలిచె రఘురామచంద్ర॥"
(16-శృం-107)

దేసాళం

"ఏమి మందు గద్దె యింతులాల-యీ
రామకుఁ దిరుపతిరాముఁడే మందు॥

వెలసేటి విరహాన వేఁగేటి యింతికి
చెలియలాల యేమి సేతమే
చలివేఁడివలపుల చవిగొన్నయీపెకు
వలపించిన తన వరుఁడే మందు॥" (16-శృం-108)

పైసంకీర్తనములందు జానకీదేవియే ప్రస్తుతయైనది. చినతిరుమలాచార్యుఁడు రాములవారి నిట్లు కీర్తించినాఁడు.

మాళవిగౌళ

"శ్రీపతిపురనాయకా జయ చింతితాభీష్టదాయకా
ఉన్నతోన్నతవిగ్రహా దాసోపరిస్థానుగ్రహా॥

జానకీప్రియకారకా శివసాధితాఖిలతారకా
మానుషాహితమారకా మామకాఘనివారకా
శ్రీవేంకటనాథరూపకా సంచితరఘుకులదీపకా
భావసంతోషప్రాపకా అభంగమంజులచాపకా॥"
(16-అధ్యా 51)

ఇందలి శ్రీపతిపురము— తిరుపతినగరమే.

ఇట్లు శ్రీరాములవారినే కాక బంటగు ఆంజనేయస్వామినిగూడ తాళ్ళపాక వారు కీర్తించియున్నారు.

**ఆంజనేయస్వామి:**

దిగువతిరుపతిలో రఘునాథుని యాలయమునకు పడమరగా నీఆంజనేయ స్వామివారి మందిర మున్నది. అదియు రఘునాథాలయముతోపాటుగనే క్రీ॥ శ॥ 1481 ప్రాంతమునందు నిర్మితమై యుండెనని చారిత్రకుల యభిప్రాయము. ఆదేవునిమూర్తిని వర్ణించుసంకీర్తనము గాంచుఁడు-

రామక్రియ

"మగటిమిగల హనుమంతరాయ
దిగువపట్టణములోని దేవహనుమంత॥

చక్కఁగాఁ దోఁక చాఁచి జంగవెట్టి చేచాఁచి
అక్కజఁపుఁబ్రతాపవు హనుమంతుఁడా
రక్కసులఁ దునుమాడి రామునిదేవులకు
దిక్కై వుంగర మిచ్చిన దేవహనుమంత॥

తమితోడ దాసులను తప్పక కాచే నని
అమర నభయమిచ్చిన హనుమంతుఁడా
జమళి శ్రీవేంకటేశు సరన వూడిగానకు
తిమిరుచు నుండేయట్టి దేవహనుమంతుఁడా॥" (7-16)

ఈ దైవతములనే కాక అక్కడి క్షేత్ర దైవతములనింక నెందఱనో వారు తమ సంకీర్తనములందు తప్పక గీర్తించి యుందురు. వారి సంకీర్తనము లన్నియు వెలువడినగాని సమగ్ర మగు పరిశీలన కవకాశ మేర్పడదు. తాళ్ళపాక వారు తిరుమలతిరుపతులందలి దైవతములను గొనియాడుటయేకాక తమకాల మునకక్కడ నాయాఆలయములలోని దైవతములకు జరుగుచుండిన ఉత్సవములను వర్ణించుకీర్తనములను కూడ పెక్కింటిని రచించినారు. దానినిబట్టి యాకాలమున నాయాయుత్సవముల స్వరూప మెట్లుండెనో గుర్తించుట కవకాశమున్నది. ఇంచుక వివరింతును.

**తిరుమల తిరుపతులు — ఆలయోత్సవ విశేషములు :**

తిరువేంకటగిరిమీఁద స్వామివారికి సంవత్సరోత్సవ మాసోత్సవ పక్షోత్సవ నిత్యోత్సవాదుల ప్రశంస మన కక్కడి శాసనములందు క్రీ॥ శ॥ తొమ్మిది పది శతాబ్దులనుండియే కాననగుచున్నది. అంతకుఁబూర్వము వాని విషయము మన కచట నేమియుఁదెలియరాదు. క్రీ॥ శ॥ 830 లో పల్లవ కోవిజయదంతి విక్రమవర్మ తిరుమలమీఁదస్వామివారిమూలమూర్తి కొక ఉత్సవమూర్తినిగూడ నెలకొల్పఁజేయటయే పైయుత్సవములచట క్రమాభివృద్ధి నందుట కారంభ మని తలఁపవచ్చును. అటు తరువాత-నొకటిన్నర శతాబ్ది గడచినవెనుక పల్లవరాణి సామవై అచటనే మఱియొక వెండివిగ్రహమును సాపించినది. ఈ నూతనోత్సవ మూర్తి నూరేగించుటతోనే ఆదినములలోఁ దిరుమలమీఁదిప్రధానోత్సవము జర గున ట్లామె యేర్పాటు గావించినది. బ్రహ్మోత్సవ మని పేరుగాంచిన యాప్రధా నోత్సవము ఆదినములం దచట పురట్టాశి (భాద్రపద) మాసమున చిత్తా నక్షత్ర

మున నారంభమై తొమ్మిదిదినములపాటు జరుగుచుండినట్లు తెలియుచున్నది. అది మొదలుగా నీబ్రహ్మోత్సవములప్రశంస మన కక్కడి శాసనములందు విస్తారముగా కాననగును.

శ్రీవేంకటాచలమాహాత్మ్యమున నీప్రధానోత్సవమును స్వామివారికి బ్రహ్మదేవుఁడే తొల్దొల్త పూనుకొని వారి యనుమతిని జరిపించినట్లు కలదు. అందుకే ఆయుత్సవములకు బ్రహ్మోత్సవము లని పేరైనది. క్రీ॥శ॥ పదియవ శతాబ్దిలో నీయుత్సవమును తొలుత పురట్టాశి (భాద్రపదము), మార్గళి (మార్గ శీర్షము) లందును, తరువాత పదమూఁడు పదునాల్గు శతాబ్దులలో ఆడి (ఆషాడము), మాసి (మాఘము) లందును గూడ జరుగుచు పదునాఱవ శతాబ్దినాఁటికి సంవత్సరమునకుఁ బదియుత్సవములుగా పెంపుసెందినది.[1] వైకాశి (వైశాఖ) ఆణి (జ్యేష్ఠ) మాసములందు బ్రహ్మోత్సవము లప్పుడు తిరుపతిలోని గోవిందరాజస్వామివారికి జరుగుచుండెను. ఆకారణమున నారెండుమాసములును వదలి తక్కిన పదిమాసములందును తిరుమలమీఁద నీయుత్సవములు సాగుచుండినవి. తిరుపతి ఎపిగ్రాఫికల్‌రిపోర్టులో శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు నాఁడీయుత్సవములు తిరుమలమీఁద పదియు, తిరుపతిలో రెండును జరుగుచుండినట్లు వ్రాసియున్నారు. కాని అక్కడిశాసనములనుఁ బరిశీలింపఁగా తిరుమలయందు మొత్తము పదునొకండును, తిరుపతియందు మూఁడును బ్రహ్మోత్సవములు సాగుచుండినట్లు తెలియవచ్చుచున్నది.[2] తిరుమలతిరుపతులందు ఈ ఆణి (జ్యేష్ఠ) మాసోత్సవమున కనేకవిధములఁ బెంపు వెలయించినది తాళ్ళపాకవారే అని కూడ మన కాశాసనములందు వెల్లడి యగుచున్నది.

బ్రహ్మోత్సవము లాదినములలోఁ బదిరోజులపాటు జరుగుచుండెను. తొలిదినమున ధ్వజారోహణము. పదియవదినమున ధ్వజావరోహణమును, ఉత్సవమును దర్శింపవచ్చిన దేవతల కంపకాలు జరుపుటయు; ఇఁక నానడుమదినములలో నిత్యము రెండుగాని మూఁడుగాని యూరేగింపు లుండుటయు, వేంకటాచల మాహాత్మ్యమున వర్ణితమైనది. అందలి వివరణమిది-.

---

1. చూ- శాసనములు- 4-129 (క్రీ॥ 1539); 5-47 (క్రీ.॥ 1545) తి. తి.దే. శా. సంచయము, మఱియు (ఎపిగ్రాఫికల్‌రిపోర్టు పుట 20-22.
2. చూ. శాసనములు. 4–129 (క్రీ. 1539) 5-47 (క్రీ.1545); 5-15[3] (క్రీ.1554).

| దినము. | ఉదయము. | మధ్యాహ్నము. | రాత్రి. |
|---|---|---|---|
| మొదటి దినము. | మనుష్యాందోళిక | — | శేషవాహనము. |
| రెండవ దినము. | శేషవాహనము. | — | హంసవాహనము. |
| మూడవ దినము. | సింహవాహనము | — | మౌక్తికమండపము |
| నాల్గవదినము. | కల్పవృక్షవాహనము | — | సర్వభూపాల వాహనము. |
| అయిదవ దినము. | పల్లకివాహనము | — | గరుడవాహనము |
| ఆరవదినము. | హనుమంతవాహనము | వసంత తిరుమంజనమునకుఁ బోవునపుడు మంగళ గిరి యానము. | ఐరావతవాహనము |
| ఏడవ దినము. | సూర్యమండల వాహనము. | సాయంత్రము ఉద్యానవనవిహార మున కేగునపుడు మంగళగిరియానము. | చంద్రమండల వాహనము. |
| ఎనిమిదవదినము. | రథవాహనము | — | హయవాహనము |
| తొమ్మిదవదినము. | పల్లకీవాహనము | అభిషేకము అవభృథమున కేగునపుడు మంగళ గిరియానము. | ధ్వజావరోహణము |
| పదియవదినము. | పుష్పయాగోత్సవము. | సత్కారము - | అంపకములు. |

ఇందు మొత్తము పండ్రెండు పదమూడు వాహనముల పేర్లున్నవి. తిరుపతి శాసనములందును నీవాహనములపేరులు కొన్ని వినవచ్చుచున్నవి. కాని బ్రహ్మోత్సవములం దాయా వాహనము లేయేదినములం దుపయుక్తము లగుచుండినవో విస్పష్టముగ దెలియవచ్చుటలే దని ఎపిగ్రాఫికల్ రిపోర్టులో శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగా రిట్లు వ్రాసియున్నారు.

" The inscriptions give numerous references to festivals in the temples, but, in all but those that are dated in the 16th Century, we have no infrormation as to the Vahanam or Vehicle used on each day of the procession of the deities through the streets during the Brahmotsavams. The epigraphs dated during the reigns of Achutaraya and SadaSiva Raya mention

the names of about half a dozen of Vehicles and further indicate that the same Vehicle was used for procession on different days." (P-30)

అక్కడి శాసనవిషయము లెట్లున్నను తాళ్ళపాకవారి సంకీర్తనములు మాత్ర మావిషయమై మనకు మఱికొన్ని విశేషము లెఱుకపరచుచున్న వనియే తలఁపవచ్చును. తాళ్ళపాకవారి శాసనములలో 5 వ దినము గరుడోత్సవమును 8 వ దినము రథోత్సవమును ముఖ్యముగా ప్రస్తుతము లైనవి. ఇఁక 7వ దినము ఉద్యానవనవిహారమున కేగుటయు, 10 వ దినమున వసంతములు జరుగుటయు కూడ వర్ణితము లైనవి.[1] తాళ్ళపాకవారి సంకీర్తనములుకూడ తదను గుణము గనే గలవు. బ్రహ్మోత్సవవిషయముగల వారి యీసంకీర్తనములు తిలకింపఁ దగును.

ఆహిరి

"నానాదిక్కుల నరులెల్ల
వానలలోననె వత్తురు గదలి॥
సతులు సుతులుఁ బరిసరులు బంధువులు
హితులు గొలువఁగ నిందఱును
శతసహస్రయోజనవాసులు సు
వ్రతములతోడనె వత్తురు గదలి॥
ముడుపులు జాళెలు మొగి దలమూటలు
కడలేనిధనము గంతలును
కడు మంచిమణులు కరులు దుర్గములు
వడిగొని చెలఁగుచు వత్తురు గదలి॥
మగుటవర్ధనులు మండలేశ్వరులు
జగదేకపతులు జతురులును
తగు వేంకటపతి దర్శింపఁగ బహు
వగల సంపదల వత్తురు గదలి॥" (2-331)

1. చూ. శాసనములు- 4-6. (క్రీ. 1530); 5-47 (క్రీ. 1545); 5-55 (క్రీ. 1545); 5-153 (క్రీ. 1554); తి. తి. దే. శా. సం.

ఇందు వానకాలమున పెరటాశి (భాద్రపద మాసమున) తిరుమల మీఁద జరగు ప్రధానమగు బ్రహ్మోత్సవవిషయము వర్ణితమై యున్నది. ముడుపులు మూటలుఁ బుచ్చుకొని సుదూరదేశమునుండి సామాన్యులును, రారాజులును, ఉత్సవదర్శనార్థమై తిరుమలకుఁ దరలివచ్చు విషయ మిందు చక్కఁగా వర్ణింపఁబడినది.

"నానాభూములవారు నమ్మి శ్రీవేంకటపతి
గానవచ్చి యేఁటనేఁట ఘను లయ్యేరు"॥ (9-94)

అని వారే యీవిషయమును వేరొక్కసంకీర్తనమందుగూడ పేర్కొనిరి. ఈ యుత్సవములం దుపయుక్తములగు వాహనములవిషయమున కీసంకీర్తనము చూడఁదగును.

శ్రీరాగం

"తిరువీధుల మెఱసీదేవదేవుఁడు
గరిమల మించిన సింగారములతోడను॥

తిరుదండెలపై నేఁగీ దేవుఁ డిదే తొలునాఁడు
సిరుల రెండవనాఁడు శేషునిమీఁద
మురిపేన మూఁడోనాఁడు ముత్యాలపందిరిక్రింద
పొరి నాలుఁగోనాఁడు పువ్వుఁగోవిలలోను॥

గక్కన నైదవనాఁడు గరుడునిమీఁద
యెక్కను ఆరవనాఁడు యేనుఁగుమీఁద
చొక్కమై యేడవనాఁడు సూర్యప్రభలోనను
యిక్కువఁ దేరును గుఱ్ఱ మెనిమిదోనాఁడు॥

కనకపుటందలము కదిసి తొమ్మిదోనాఁడు॥
పెనచి పదోనాఁడు పెండ్లిపీట
యెనసి శ్రీవేంకటేశుఁ డింతి యలమేల్మంగతో
వనితల నడుమను వాహనాలమీఁదను॥" (13-192)

తాళ్ళపాకవారు వర్ణించిన యీవాహనములవిషయము చాలవఱకు వేంకటాచలమాహాత్మ్యమందలి వివరణముతో సరిపోలుచున్నది. వీరు వర్ణించిన తిరుదండెలే-

అందలి మనుష్యాందోళిక., ముత్యాలపందిరి- మౌక్తికమంటపము., పువ్వుఁ గోవిల- కల్పవృక్షము., కనకపుటందలము- పల్లకీవాహనము; పదియవనాఁడు పెండ్లిపీటలమీఁద నుండుటయే పుష్పయాగోత్సవిషయము. ఈకీర్తనమున తాళ్ళపాకవారు ఆయానాళ్లలోని ముఖ్యము లగువాహనములను మాత్ర ముదాహరించినారు. బ్రహ్మోత్సవసమయములందు తాళ్ళపాకవారి విశేషకైంకర్యములతో విశిష్టముగా జరుగుచుండినవియు, భక్తుల నంచరను మిక్కిలిగా నాకర్షించునవియు, గరుడోత్సవ రథోత్సవములే. ఈయుత్సవముల వర్ణించు తాళ్ళపాకవారి సంకీర్తనము లెన్ని యున్నవో లెక్కచెప్పుటకు వీలులేదు. దినమున కొక్క కీర్తన చొప్పున చెప్పిన యీకవులకు మాసమున కొక్కతూరిగా పదిదినముల పాటు జరుగుచుండినయీయుత్సవములందలి కోలాహలమును వర్ణించుట కెంతేని అవకాశ ముండియుండును గదా: అందుచే వీరిరచనలలో వీని బాహుళ్య మంతగా నుండుట:

*గరుడోత్సవము*ను వర్ణించు వీరి యీ సంకీర్తనమును గాంచుఁడు.

రామక్రియ

"ఎక్కడ నీవుద్యోగ మెటు విచ్చేసేవయ్యా
యిక్కువ నీమహిమకు నెవ్వ రెదురయ్యా॥

పల్లించి గరుఁడనిపై నీ వుబ్బున నెక్క
అల్లనాఁడె పారిజాత మడవికెక్కె
పల్లదపు రుద్రుఁడును బాణుని వాకిలి దొక్కె
చుల్లరి రాక్షసమూక సురసుర సుక్కె ॥

బంగారుగరుఁడనిపై నీవు వీధు లేఁగ
చెంగట శ్రీ వేంకటేశ సిరులు మూఁగె
సంగతి నలమేల్మంగ సంతసాన విఱ్ఱవీఁగె
పొంగారు దేవ దుందుభులు పైపై వాఁగే ॥" ( 11-70 )

ఇట్టిదే.

"ఇటు గరుఁడని నీ వెక్కినను
వటవట దిక్కులు బగ్గన పగిలె ॥" (2-92)

అను వీరి కీర్తనముగూడ. ఇందు గరుడవాహనుఁడగు శ్రీవేంకటేశుని వర్ణించుచు నాదేవుని మహామహిమమును వీరు వేనోళ్ళఁ గొనియాడినారు.

ఇఁక రథోత్సవమును వీరు వర్ణించినతెఱఁగు నించుక వివరింతును. తాళ్ళపాకవారి కీర్తనములలో నన్నిటికన్న నీ రథోత్సవకోలాహలమును వర్ణించు కీర్తనములే లెక్కకు మిక్కిలిగా నున్నవి. దేవదేవుఁడు దివ్యరథ మెక్కుటను జిత్రించు నీ కీర్తనము నరయుఁడు.

సాళంగనాట

"దేవ దేవుఁ డెక్కె నదె దివ్యరథము
మావంటివారి కెల్ల మనోరథము ॥

జగతి బాలులకై జలధులు వేరఁ జేసి
పగటున దోలె నదె పైఁడి రథము
మిగులఁగఁ గోపగించి మెఱయు రావణుమీఁద
తెగియెక్కె తోలె నదె దేవేంద్రరథము ॥

బలిమి రుక్మిణిఁ దెచ్చి పరులఁ గెలిచి యెక్కె
అల యేఁగు బెండ్లి కల్యాణ రథము
యెలమి శ్రీ వేంకటాద్రి నలమేలుమంగఁ గూడి
కలకాలమును నేఁగె ఘన మైన రథము ॥" (5–225)

ఈ యుత్సవసందర్భమున దివ్యరథము తిరువీధులవెంట నేగునపుడు భక్తులు కానుకలు చల్లుచు నాగినచోట నెల్ల హారతు లిచ్చుచుందురు. తాళ్ళపాకవా రిట్లు తిరుమలమీఁద తమ యింటిముందు ఆగినసందర్భములలోఁ గొన్ని కైంకర్యముల కేర్పాటు చేసియున్నారు.[1] అట్టి సందర్భములలోనిదే కావచ్చు నీ దిగువ సంకీర్తనము.

బౌళి

"ఎత్తరే ఆరతులు యియ్యరే కానుకలు
యిత్తల నేఁగి వచ్చిని యిందిరానాథుఁడు ॥

1. చూ. శాసనము 5-55 (శ్రీ॥ శ॥ 1545) తి. తి. దే. శా. సం.

గరుడధ్వజపుతేరు కనకమయపుతేరు
సిరులతో వేదములచేరులతేరు
సురలు మునులుఁ బట్టి సొంపుతోడఁ దియ్యఁగాను
యిరవుగ నేఁగి వచ్చీ నిందిరానాథుఁడు ॥" (10-31)

ఇట్లు మహావైభవముగాఁ దిరుతేరు కదలుచుండఁగా భజనపరు లొకవంక సంకీర్తన లాలపించుచుందురు. ఆటపాటలవారు ముందుగా నానందముతో కదలి పోవుచుందురు. రథోత్సవమునాఁటియాటపాటలనుగూర్చి పిరి కీర్తనము లెన్నియో యున్నవి. భజనలకు చూడుఁడు.

"విజయ ధ్వజమున దేవుండే శ్రీవేంకటేశుఁడు
భజన నలమేలుమంగ పలుమారు మెచ్చెనదే" (2-162)

ఆటపాటలకు చూడుఁడు.

"ఆటలుఁ బాటలు వింటా నలమేల్మంగయుఁ దాను
యీటున శ్రీవేంకటేశుఁ డెదురు లేక
వాటపు సింగారముతో వాకిట వచ్చినిలిచీ
కోటానఁగోటివరాలు కొమ్మని యిచ్చుచును" (8-122)

"ఆటలు పాటలు నవె అచ్చరలేమలు వారె
చాటువ నలమేల్మంగ సంగడి నదె
యీటులేని శ్రీవేంకటేశుఁ డేఁగీ నల్ల వాఁడె
కోటానఁగోటి దాసుల కోరిక లీడేర్చను" (8-274)

"అమరాంగన లదె యాడేరు
ప్రమదంబున నదె పాడేరు॥

గరుడవాహనుఁడు కనకరథముపై
యిరవుగ వీధుల నేఁగీని
సురలును మునులును సొంపుగ మోఁకులు
తెరలిచి తెరలిచి తీసేరు ॥" (10-26)

భక్తజనుల కీ రథోత్సవ వైభవము నెట్లు కనులగట్టించుచున్నారో చూడుఁడు

సౌరాష్ట్రం

"వీధుల వీధుల విభుఁ డేగీ నిదె
మోదముతోడుత మొక్కరో జనులు ॥

గరుడధ్వజ మదె కనకరథం బదె
అరదముపై హరి యల వాఁడె
యిరుదెసల నున్నారు యిందిరయు భువియు
పరఁగఁ బగ్గములు పట్టరో జనులు ॥

ఆదే రదివో యచ్చర లెల్లను
పాదేరు గంధర్వపతు లెల్లా
వేడుకతో వీఁడె విష్వక్సేనుఁడు
కూడి యిందరును జూడరో జనులు ॥" (10-286)

తాళ్ళపాకకవు లిట్లు తిరుమల మీఁదనే కాక కడప మున్నగు క్షేత్రము లందు జరగు రథోత్సవములను గూడ వర్ణించి యున్నారు. చూ. కీర్తనము (8-93). ఈ విధముగా వారు తిరుమలమీఁది బ్రహ్మోత్సవసంరంభమును సంకీర్తనములలోఁ జిత్రించి యున్నారు.

## కల్యాణోత్సవము :

దేవాలయములలో సంవత్సరోత్సవములను ద్రావిడదేశమున బ్రహ్మోత్సవము లనియు, తెలుఁగు దేశమున కల్యాణోత్సవములనియు నేఁడు పేర్కొనుట గలము. ఆలయములలో స్వామిప్రతిష్ఠజరిగిననాళ్ళే యాయుత్సవములనాళ్ళనియు, శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మప్రతిష్ఠితుఁడు గనుక ఆ ప్రతిష్ఠ జరిగించిన బ్రహ్మ పేర తిరుపతివర్షోత్సవములు బ్రహ్మోత్సవములయ్యె ననియు దాని ననుసరించియే దక్షిణదేశపుదేవోత్సవముల కెల్ల బ్రహ్మోత్సవము లని పేరు సంక్రమించె ననియు, నా యుత్సవములలోనే కల్యాణము జరపుట తెలుఁగుదేశమునఁ గొత్తఁగా గలిగిన యాచార మనియు శ్రీ పరవస్తు రామానుజ స్వామిగారు పేర్కొని యున్నారు.[1] తిరుమలమీఁద నీ కల్యాణోత్సవము తాళ్ళపాకవారికాలమున చైత్ర ఫాల్గునమాసములందు జరగుచుండినట్లు అక్కడి

1. చూ. శ్రీ ప్రభాకరశాస్త్రిగారి అన్నమాచార్య చరిత్ర పీఠిక 117 పు.

శాసనములను బట్టి తెలియుచున్నది.[1]

ఈ వివాహమహోత్సవమును గూర్చిన తొలి తొలి ప్రశంసలు మనకు తిరుపతి శాసనములందు క్రీ॥ శ॥ 1485 ప్రాంతముల నుండియే తెలియవచ్చుచున్నది.[2] ఆ దినములలో వివాహోత్సవ మైదవదిన మగుటయు. స్వామివారు ఉయ్యాలమంటపములో నుండుటయు, నాలవదినమున వసంతోత్సవము జరపుకొనుటయు శాసనములం దున్నయంశములే. పరిశీలించి చూడఁగా నాదినములలో నీ కల్యాణము బ్రహ్మోత్సవములలో నొక యంశముగానే జరగుచుండె నట్లు తెలియుచున్నది. తిరుపతి శాసనములలో 4-69 (క్రీ॥ 1536) లో నీవిషయము "తొమ్మిది బ్రహ్మోత్సవములందును జరగు తిరుకల్యాణము దినములందు" అని విస్పష్టముగనే యున్నది. కాని తరువాతి కాలమున అనఁగా క్రీ॥ శ॥ 1546 ప్రాంతముల నుండి యీ వివాహమహోత్సవము బ్రహ్మోత్సవములతో సంబంధించి కాక విడిగా అయిదుదినములయుత్సవముగా నిర్వహింపఁబడ సాగినది.

తిరుమలమీఁద నీ కల్యాణోత్సవ మిట్లు విడిగా క్రీ. శ. 1546 లో తిరుమలయ్యగారి కుమారుఁడగు తిరువేంగళనాథయ్యగారి ధర్మమున [illegible] ఘనముగా నిర్వహింపఁబడినది .అమరుసటి సంవత్సరమే అనఁగా క్రీ.శ. 15[illegible] లో నాతని సోదరుఁ డగు చినతిరుమలయ్యగారి ధర్మమున తిరుపతిలో [illegible] రాజస్వామివారికి కల్యాణోత్సవము నిర్వహింపఁబడినది. అది మొ[illegible] తాళ్లపాక వారి మూలమునను, వారి ననుసరించి యితరుల మూలమునను నీ యుత్సవము తిరుమలతిరుపతులందు వైభవమును గూర్చుకొని బ్రహ్మోత్సవముతోఁ దుల్యమైనదిగా రూపొందినది. ఈ వివాహోత్సవప్రారంభవికాసములను సూచించు శాసనవిషయముల నీదిగువ నుదాహరించుచున్నాను.

## వివాహోత్సవవివరణము :

(1) 2-83 (క్రీ.శ. 1485) తిరునిన్రవూర్ వుడయన్ ధర్మముగా తిరుపతి గోవిందరాజాలయమున బ్రహ్మోత్సవసందర్భమున నైదవదినము పెండ్లి.

1. చూ. శాసనములు 5-99 (క్రీ॥ శ॥ 1547); 5-71 (క్రీ॥ 1554) తి. తి. దే. శా. సం॥
2. చూ. శాసనములు 2-83 (క్రీ॥ 1485); 2. 127 (క్రీ॥ 1494)

(2) 2-127 (క్రీ.శ. 1494) నరసరాజ వుడయ్యార్ ధర్మము. తిరుపతి గోవిందరాజాలయమున-వైశాఖ బ్రహ్మోత్సవసందర్భమున నైదవదినము పెండ్లి.

(3) 5-71 (క్రీ.శ. 1546) తాళ్ళపాక పెదతిరుమలార్యుని తనయుఁడగు తిరువేంగళనాథయ్యగారి ధర్మము. చెందలూరు, మల్లవరగ్రామము లీలవివాహోత్సవమునకుఁగా *తిరుమలమీఁది* స్వామివారి కర్పితములు.

*తొలిదినము:* "అంకురార్పణోత్సవము - సోమ బ్రహ్మ మూర్తులకు పూజ. తిరుమామణిమండపమున స్వామివారికి తిరుమంజనము, కస్తూరిచంద నాదులతో నూర్ధ్వపుండ్రాలంకారము. ఊరేగింపుతర్వాత నుయ్యాలలో నుండుట. పాదాభిషేకము - శ్రీదేవీభూదేవులు హంసచాతకవాహనములపై నుండఁగా స్వామివారితో పూలదండల మార్పు. తిరుమామణిమంటపమున పంచవర్ణపీఠమున నుండుట. మధుపర్కసమర్పణము. రాత్రి ఊరేగింపుతరువాత తిరుమరై (పెండ్లిగది)లో నుండుట.

*రెండవ దినము :* చందన వసంతోత్సవము - సదస్యము. వసంత తిరుమంజనము. స్వామివారు శ్రీదేవీభూదేవులతో రాత్రి శేషవాహనమున నూరేగుట.

*మూఁడవ దినము :* ఆస్థానము. చందనతాంబూలసమర్పణము. రాత్రి వైకుంఠవిమానమున నూరేగింపు.

*నాలుగవ దినము :* సుమంగలులకు చందనతాంబూలములు సమర్పించుట. రాత్రి స్వామివారు హంసవాహనమునను శ్రీదేవీభూదేవులు పల్లకీయందును నూరేగుట.

*అయిదవ దినము :* చందనతాంబూలసమర్పణము. రాత్రి స్వామివారు గజవాహనమునను, శ్రీదేవీభూదేవులు పల్లకీయందును నూరేగుట.

ఉత్సవసమయములందే వేంకటాచలమాహాత్మ్యమును, నాచ్చియార్ (గోదాదేవి) తిరుమొళిని పఠించుట జరుగును

(4) 5-99 (క్రీ॥ 1547) చినతిరుమలయ్యధర్మము. *తిరుపతి గోవింద రాజస్వామివారికి* వివాహోత్సవము. నేడియం గ్రామము మీఁది సగము ఆదాయమగు 150 రేఖ లిందుకుగా వినియోగింపఁబడును. ఉత్సవము చైత్రమాసమున రోహిణీనక్షత్రమున నారంభము.

(5) 5-153 (క్రీ॥ 1554) చినతిరుమలార్యునిపుత్రుఁ డగుతిరువెంగళప్ప ధర్మము. పూర్వమునుండియు జరుగుచుండిన వివాహోత్సవమున మఱి కొన్ని నూతనాంశములను ప్రవేశపెట్టెను. అన్నివిధముల నీయుత్సవమును బ్రహ్మోత్సవముతోఁ దుల్య మగుదానినిఁగా నేర్పఱచెను. బ్రహ్మోత్సవములందు వలెనే రథోత్సవ మీపెండ్లితిరునాళ్లయందును వీ రేర్పరచిరి.

(6) 5-169 (క్రీ. 1558) తిరువెంగళనాథయ్యధర్మము. తాళ్ళపాకవారే యారంభించి పోషించిన యీ యుత్సవమునఁ జేరవలసిన నూతనాంశము. లన్నియుఁ జేరి పూర్ణమైనది. బ్రహ్మోత్సవములకే ప్రత్యేకమగు గరుడధ్వజారోహణము పెండ్లితిరునాళ్లకును నొకముఖ్యలక్షణ మైనది. వివాహోత్సవమున నైదవ దినము రథోత్సవముగా నిర్ణయమైనది.

పై యుత్సవసమయములందు విధిగా తిరువేంకటాచలమాహాత్మ్యమును, నాచ్చియార్ (గోదాదేవి) తిరుమొళియుఁ బఠించుట జరిగెడిది.

పైని పేర్కొనఁబడిన శాసనములందు స్వామివారి కల్యాణోత్సవము తొలిదినములందు బ్రహ్మోత్సవములతోపాటే కొన్నిమాసములందు జరగుచుండె ననియుఁ, దరువాత కాలక్రమమున నాయుత్సవము బ్రహ్మోత్సవముల కన్న భిన్నముగా విడిగా చైత్ర, ఫాల్గునములందు జరుపఁబడుచు వచ్చె ననియు దెలియ నగుచున్నది. మఱియొకవిశేష మేమన పై యుత్సవములను తిరుమల తిరుపతులందు ఆరంభించినవారు తాళ్ళపాకవారే యని యాశాసనములందు స్పష్టోక్తి కలదు.

పై శాసనస్థవిషయములను బట్టియుఁ దదితరగ్రంథస్థాధారములను బట్టియుఁ బరిశీలింపఁగా శ్రీ వేంకటేశ్వరస్వామివారి పెండ్లితిరునాళ్ళు తాళ్ళపాక అన్నమాచార్యుఁడే తొలుత వెలయించినవాఁడుగాఁ దోఁచుచున్నాఁడు. హేతువులివి

1. అన్నమాచార్యుని కాలమునకన్న పూర్వ మచ్చట కల్యాణోత్సవమునకు సంబంధించిన శాసనవిషయములు కానరాకుండుట.

2. తాళ్ళపాకవారే ఈ యుత్సవస్థాపకులుగా శాసనములందు స్పష్టోక్తి యుండుట.

3. అన్నమాచార్యాదుల సంకీర్తనములును మంజరీద్విపదలును పై కల్యాణోత్సవమును వర్ణించునవిగా నుండుట.

4. అన్నమాచార్యుని దౌహిత్రుఁడును, శ్రీ పాదరేణుమాహాత్మ్య శకుంతలాపరిణయాది కృతికర్తయునగు రేవణూరి వేంకటాచార్యుఁ డీవిషయమును ధ్రువపరచుచు నిట్లు వ్రాయుట. శ్రీపాదరేణుమాహాత్మ్యమున వేంకటాచార్యుఁడిట్లు వ్రాసియున్నాఁడు.

"శ్రీలలరంగ మంగమను శ్రీహరి కెన్నడు ధారవోయుచోఁ
దాళులపాకయన్నమయ దాఁ గడిగెం బదములౌ ధరిత్రి మా
తాళులపాక చిన్నన పదంబులు పాడిన నాఁడె సర్వరాట్
శైలవిభుండు తత్పదరజంబును మాకు నొసంగఁజెల్లదే॥"

మఱియు. శకుంతలాపరిణయ కృత్యవతరణికయం దిట్లు ప్రశంసించెను.

"అమ్మహాదేవుండు మదీయమాతామహవంశశిఖా రత్నం బగు నన్నమాచార్యునకు జామాతరుం డనిపించుకొని, భవదీయసంకీర్తనంబు లాలించిన కర్ణంబుల నితరసంకీర్తనంబు లాలించ నని ప్రతిజ్ఞఁగావించె".

ఆగమశాస్త్రముచొప్పున వివాహోత్సవము చేయుచున్నమాన్యుఁడే కన్యాదాతఁగా వర్తిల్ల నగునని విజ్ఞు లందురు. ఆకారణముననే కావలెను స్వామివారి పెండ్లితిరునాళ్ళ నారంభించిన తాళ్ళపాకవారికి వేంకటేశ్వరస్వామి యల్లుఁడువరుసయైనాఁడు. అందుకే రేవణూరి వెంకటాచార్యుఁ డట్లు వర్ణించి యుండును.

తాళ్ళపాకవారీకల్యాణోత్సవము నారంభించుటయే కాదు, దిగువ తిరుపతియందు క్రీ. 1540 లో కల్యాణవేంకటేశ్వరాలయము నొకదానిని పునరుద్ధరించినారుకూడ. తిరుమలతిరుపతులం దీకల్యాణోత్సవ మింతఘనముగా నేఁడు జరగుచుండుటకును, దాని నూతఁగాఁ గొని తెల్గుదేశమందలి పెక్కు వైష్ణవాలయములలో నీయుత్సవమును జరుపునాచారము క్రొత్తగా వెలయుటకును నాఁటి తాళ్ళపాకవారే ముఖ్య కారకులని తలఁపఁ దగియున్నది.

తాళ్ళపాకకవు లీయుత్సవమును తమసంకీర్తనములం దిట్లు చిత్రించినారు. చూ.

సామంతం

"పసిఁడి యక్షంత లివె పట్టరో వేగమె రారో
దెసలఁ బేరఁటాండ్లు దేవుని పెండ్లికిని ॥

కందర్పజనకునికిఁ గమలాదేవికిఁ బెండ్లి
పందిలిలోపలం దలఁబ్రాలు నేఁడు
గందమూ విడె మిచ్చేరు కలువడాలు గట్టిరి
అందుక మునులు రారో హరి పెండ్లికిని ॥

అదె శ్రీవేంకటపతి కలమేలుమంగకును
మొదలితిరునాళ్ళకు మొక్కేము మేము
యెదుట నేగేరు వీరే యిచ్చేరు వరము లివే
కదలిరారో పరుషఘనులు పెండ్లికిని ॥" (8-194)

ఇందు గరుడధ్వజారోహణము, తలంబ్రాలు, గంధము విడెము లిచ్చుట పర్ణితము లైనవి. వీరు దీనిని "మొదలితిరునాళ్ళని పేర్కొనిరి. బహుశః ఈపెండ్లి చైత్రమాసమందలి దేమో; సంవత్సరమునకు తొలియుత్సవ మనియేమో మొదలి తిరునాళ్ళనుట ! చూడుఁడు మఱియొకకీర్తనము-

రామక్రియ

"గరుడధ్వజం బెక్కె కమలాక్షి పెండ్లికి
పరుష లదివో వచ్చేఁ బైపై సేవించను ॥

పాడిరి సోబాన నదె భారతియు గిరిజయు
ఆడిరి రంభాదులైన అచ్చర లెల్ల
కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి
వేడుకలు మీఱఁగ శ్రీవిభునిపెండ్లికిని ॥

వేసిరి కానుకలెల్ల వేవేలు కొప్పెరల
పోసి రదే తలఁబ్రాలు పుణ్యసతులు
ఆసల శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ దాను
నేసలు వెట్టినయట్టి సింగారపుపెండ్లికిని ॥" (8-21)

ఇందు వివాహోత్సవమునకు సంబంధించిన పైవివరములతోపాటు స్త్రీలు జతగాఁ

గూడి శోభానలు పాడుటయు వర్ణితమైనది. తాళ్ళపాకవారి మంగళముల్ను, శోభానలు నీసందర్భమునకుఁ జెందినవి పెక్కులున్నవి. శోభానలలో మచ్చున కొకటి మాత్ర మిచట నుదాహరింతును.

వసంతం

"శోభనమే శోభనమే
వైభవముల పావన మూర్తికి ॥
అరుదుగ మును నరకాసురుఁడు
సిరులతో జీరలు దెచ్చిన సతులా
పరువపువయసులఁ బదారువేలను
సొరిది పెండ్లాడిన సుముఖునికి ॥ " (3–18)

ఈ యైదుదినముల పెండ్లితిరునాళ్ళలో తొలిదినము అంకురార్పణోత్సవమున జరుగు తిరుమంజనమును వర్ణించు తాళ్ళపాకవారి యీకీర్తనము సరయుఁడు–.

శంకరాభరణం

"అప్పుడు మజ్జనమాడీ నంగనఁ గూడి
కుప్పలుఁ దెప్పలుగాఁ గ్రుమ్మరించరో ॥
బంగారు కొప్పెరల పన్నీరు నించి
రంగైన పచ్చకప్పురపు ధూళొత్తి
చెంగటఁ గస్తూరిధూళి చికిలిగావించి
పొంగారుఁ దట్టుపునుంగు పోయరో గిన్నెలను ॥
బలుపింగాణులఁ గదంబకము గంధమును
కలపము గావించి గంబూరముతో
వెలయ మజ్జనమాడీ వేంకటాద్రి విభుఁడు
చెలఁగి యింతులు చేరి సేస చల్లరో ॥ " (3–325)

అయిదవనాఁటి రథోత్సవ వర్ణనము తిలకింపుఁడు.

సాళంగనాట

"తిరువీధు లేఁగీని దేవతలు జయ వెట్ట
హరి వాఁడె పెండ్లికొడుకై ప్రతాపమున ॥

కనకపుఁగొండవంటి ఘనమైన రథముపై
దనుజమర్దనుఁ డెక్కెఁ దరుణులతో
వినువీధిఁ బడగెలు వేవేలు కుచ్చులతోడఁ
బెనఁగొనఁగఁగదలె భేరులు మ్రోయఁగను ॥" (8-122)

తుదకు పెండ్లి తిరునాళ్ళను దర్శింపవచ్చిన పెద్దల కందఱకును అంప కాలు చెప్పు వీరి కీర్తనము నరయుఁడు.

ముఖారి

"భోగీంద్రులును మీరుఁ బోయి రండు
వేగిన మీఁదటి విభవములకు ॥

ఖగరుఁడ పోయిరా అజుఁడ నీవునుం బోయి
తిరిగిరా మీఁదటి తిరునాళ్లకు ॥
సురలు మునులును భూసురులు పోయి రండు
అరవిరి నిన్నాళ్లు నలసితిరి ॥"

ఈ బ్రహ్మోత్సవ వైవాహికోత్సవములను గూర్చి యొక్కమాటలోఁ జెప్పవలె నన్న స్వామివారికి తొలినాళులఁ జరుగుచుండిన పదిదినములపెండ్లియే బ్రహ్మోత్సవము. తరువాతికాలమున వేర్పడి అయిదుదినములలో జరుపుచుండిన పెండ్లియే వైవాహికోత్సవము-.

తాళ్ళపాకవారును వారిసమకాలికులును తిరుమలతిరుపతులందు స్థాపించిన నూతనోత్సవము లెన్నియో అప్పటిశాసనాదులనుబట్టి తెలియవచ్చుచున్నవి. తాళ్ళపాకవారి సంకీర్తనసాహిత్య మంతయు వెలువడిననేఁగాని సమగ్ర మగుపరిశీలనమున కవకాశమేర్పడదు. కనుక ప్రస్తుత మట్టియుత్సవముల ప్రశంసను విడిచి తాళ్ళపాకవారి కీర్తనములలో నేఁటికి గుర్తింపఁదగిన మఱికొన్ని యుత్సవములనుగూర్చిమాత్ర మించుక వివరింతును.

**మఱికొన్ని యుత్సవములు — సేవలు:**

ప్రఖ్యాతము లగు బ్రహ్మోత్సవాదివర్షోత్సవములతర్వాత తిరుప్పళ్లియెళుచ్చి లేదా ధనుర్మాసోత్సవమునుగూర్చియుఁ బ్రతిశుక్రవారమును జరుగునభిషేకోత్సవము లేదా తిరుమంజనోత్సవమునుగూర్చియు, నటుతర్వాత నిత్యమును స్వామివారికి జరుగుకైంకర్యములలో మేలుకొలుపులు మొదలుకొని పవళింపుపఱుకును గల సేవలలోఁ గొన్నిటినిగూర్చియుఁ దాళ్ళపాకవారి కీర్తనము లధికముగా నున్నవి. దీనికి హేతువు వీరి యీ కీర్తనము లాయాసేవలసందర్భమునం దచటవిధిగా గానము సేయఁబడుచుండుటయే. పరికింపుఁడు-

**ధనుర్మాసోత్సవము :**

మార్గశిర (మార్గళి) మాసమున ముప్పదిదినములపాటు వైష్ణవాలయములందు జరగు నీయుత్సవమే ధనుర్మాసోత్సవము. గోదాదేవి రచించిన 'తిరుప్పావై' లోని ముప్పదిపాశురములను దినమును కొక్కటిచొప్పున నీముప్పదిదినములను తెలతెలవారకమునుపే భక్తజను లనుసంధించుచు స్వామికైంకర్య మొనరింతురు. గోపికలు శ్రీకృష్ణభగవానునిగూర్చి వ్రత మాచరించుటయే "తిరుప్పావై" లోని యితివృత్తము. అందు గోపిక లుదయాత్పూర్వమే తమ్ముఁ దాము మేల్కొల్పుకొని యాయత్తలై శ్రీకృష్ణునికడకుఁ బోవుదురు. అట్టిసందర్భములందలి తిరుప్పావైపాశురములను బోలినపాటలు తాళ్ళపాకవారివి కొన్ని గలవు; చూ. పూర్వోదాహృతమైన "మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా" అను (౭-400) తాళ్ళపాకవారి కీర్తనము. ఇట్టి వారి మేలుకొలుపు "తిరుప్పళ్లియెళుచ్చి" కీర్తనము లీధనుర్మాసోత్సవములందే ప్రముఖముగా గానము సేయఁబడుచుండెడివి. తాళ్ళపాకవారికాలమున తిరుమలమీఁద నీధనుర్మాసోత్సవమునకు సంబంధించిన యీ సంకీర్తనము లరయుఁడు.

భూపాలం

"ఏమి నిద్దరించేవు యెందాఁకాను
కామించి బ్రహ్మాదులెల్లఁ గాచుకున్నా రిదివో ॥
పులఁగాలుఁ బచ్చళ్లు బోనముపెట్టిన దిదే
వెలయు ధనుర్మాసమువేళయు నిదే
బలసి సంకీర్తనపరులు పాడే రిదే
జలజాక్షుఁడ లేచి జలకమాడవయ్యా ॥

తోడనే గంధాక్షతలు ధూపదీపా లివిగో
కూడినవిప్రుల వేదఘోషణ లివే
వాడుదేరఁ బూజించవలెఁ గమ్మఁబువ్వు లివే
వీడే మిదె కొలువుకు విచ్చేయవయ్యా ॥

చదివేరు వైష్ణవులు సారెఁ దిరువాము డిదే
కదిసి శ్రీపతి ముందే కాచు కున్నది
అదనాయ శ్రీవేంకటాధిప మాచరి పిదే
యెదుట నిన్నటిరూపే యియ్యకొంటివయ్యా॥"(9-195)

ఇందు ధనుర్మాసపువేళలందు స్వామివారికి మేలుకొలుపులు పాడుటయు, బోనము లిడుటయు, సంకీర్తనము లాలపించుచుండఁగా జలకములాడుటయు, ధూపదీపాదులఁ గొనుటయు,వర్ణితములైనవి.సంకీర్తనగానముతోపాటు ఆదినములలో స్వామివారి యెదుట వేదపారాయణమును, తిరువాయ్మొళిప్రాపిదప్రబంధపఠనమును జరగుచుండెడి దని తెలియనగుచున్నది.

**ఆరగింపుసేవ:**

పై కీర్తనమున చెప్పఁబడినక్రమమున ధనుర్మాసములందు స్వామివారి బోనము లర్పించు ఆరగింపుసేవాసందర్భమునందలి కీర్తనమిది చూడుఁడు.

భూపాలం

"వేఁకువఁ దిరుపళ్ళచ్చి విష్ణునికిఁ జేయరో
అంకటి కొదగినట్టి ఆరగింపులు ॥

ఏడుదినములదాఁక నెత్తెను గోవర్ధనము
ఆదివచ్చెబాలునికి నారగింపులు
మేడెపుగోపికలతో మిక్కిలిఁ బెనఁగినట్టి
వేడుకకానికిఁ దేరో విందు లారగింపులు ॥

పట్టపుదేవుళ్లఁ దాను బంతి సాగివున్నవాఁడు
అట్టే సేయరో పులుగ మారగింపులు
నెట్టన శ్రీవేంకటాద్రినిలయుఁ డారగించీని
మట్టులేక వడ్డించరో మంచియారగింపులు ॥" (9-9)

ఇట్లే తిరుమజ్జనాదులకు సంబంధించిన కీర్తనములుకూడ పెక్కులున్నవి. వానినిగూర్చి ముమ్ముందు వివరింతును. ప్రస్తుత మీధనుర్మాసోత్సవసంరంభ మును తాళ్ళపాకవారు వర్ణించినవిధమును జూతుఁడు.

భూపాలం

"ముద మలర కాలముల మీ రిటు మోసపోక
హృదయ మలర భజింపరో మీ-
రిటుధనుర్మాసములవిధులన్ ఘనులు ॥

వేఁగ నాలుఁగుఘడియ లనఁగా వేదవేద్యులు లేచి పరగున,
నాగమోక్తవిధులను తమ దేహానుగుణములుగా
వేగమున సంధ్యాదు లొగిఁగావించి విమలాంబోధిశయనుని
బాగుగాఁ బూజించరో యెడపక ధనుర్మాసములవిధులన్ ఘనులు॥
పరగు చీనాంబరములను నతిపరిమళమ్ములఁ బుష్పముల కడు
వెరవుగా వేంకటపతికి నై - వేద్యసంగతుల
అరుదుగా ధూపముల బహుదీపాదులను తాంబూలవిధులను
పరగఁ బూజింపుఁడు సమస్త-ప్రభు ధనుర్మాసమునవిధులన్
ఘనులు॥ (11-2-45)

**తిరువేంకటగిరిమీఁది నిత్యార్చన :**

ఇంతవరకు తిరుమలమీఁదిస్వామివారికి జరగువర్షోత్సవములను గూర్చి తాళ్ళపాకవారి కీర్తనములలోఁ దెలియఁదగిన యంశములను వివరించితిని. ఇప్పు డచటి నిత్యార్చనాక్రమమునుగూర్చి సంగ్రహముగ నెరుగఁదగిన విషయముల నించుక వివరింతును.

తిరుమలమీఁది నిత్యార్చనావిధానము చాలవఱకు వైఖానసాగమము ననుసరించియే జరగుచున్నది. ఆయాగమములు షట్కాలపూజావిధినే విధించినవి తిరుమలమీఁద నేఁడు సంప్రదాయమును, ఆనుకూల్యమును ననుసరించియే నిత్యార్చన జరుగుచున్నది అది యీనాఁట నిట్లు జరుగుచున్నది.

| | సేవ | కాలము | లక్షణము | సమయము. |
|---|---|---|---|---|
| 1. | సుప్రభాతము. | ప్రత్యూషకాలము | ప్రత్యేకము | 6-00 గం. |
| 2. | విశ్వరూపదర్శనము. | ప్రభాతపూజ | ధర్మము. | 6-30 గం. |
| 3. | తోమాలసేవ | మధ్యాహ్నపూజ | ఆర్జితము. | 10-00 గం. |
| 4 | కొలువు | ” | ధర్మము. | 11-00 గం. |
| 5. | సహస్రనామార్చన | ” | ఆర్జితము. | 11-15 గం. |
| 6. | నైవేద్యము (మొదటిగంట) | ” | ప్రత్యేకము. | 12-00 గం. |
| 7. | ధర్మదర్శనము. | అపరాహ్నపూజ | ధర్మము. | 1-00 గం. |
| 8. | సంగ్రహార్చన, నైవేద్యము (రెండవగంట) | | ప్రత్యేకము. | 3-00 గం. |
| 9. | ఆర్జితము ఉత్సవాదులు | | ఆర్జితము. | 5-00 గం. |
| 10. | తోమాలసేవ, అర్చన. నైవేద్యము (మూడవగంట) | సాయాహ్నపూజ | ప్రత్యేకము | 8-30 గం. |
| 11. | రాత్రిధర్మదర్శనము | | ధర్మము. | 9-00 గం. |
| 12. | ఏకాంతసేవ (పానుపుసేవ) | నిశిపూజ | ఆర్జితము. | 10-00 గం. |

ఈసేవాక్రమము వైఖానసాగమములందుఁ జెప్పఁబడిన మంత్రాసన, స్నానాసన, అలంకారాసన, భోజ్యాసన, యాత్రాసన, శయనాసనము లను షడాసనములతోఁ గూడిన పూజావిధానము ననుసరించి జరగుచున్నది. ఈ విషయము లన్నిటినిగూర్చియు శ్రీ T. K. T. వీరరాఘవాచార్యులుగారు తమ 'తిరుపతి చరిత్ర' (పు 301–340) లో విపులముగా చర్చించియున్నారు. ఇచట నేను తాళ్ళపాకవారి కీర్తనముల నాధారముగాఁ జేసికొని మాత్రమే తత్పూజాక్రమమును గూర్చి వివరింతును.

## నిత్యార్చనాక్రమము :

ప్రత్యూషకాలపూజ క్రీ॥ శ॥ 15 వ శతాబ్దికిఁ బూర్వ మచట నుండెనో లేదో దాని స్వరూప మెట్టిదోగూడ తిరుపతి చరిత్రనుబట్టి మనకేమియుఁ దెలియ రాదు. అందుకే ' How the morning was welcomed in the temple in the centuries before the 15th Cent., it is not possible to conjecture ' (పు. 311) అని శ్రీవీరరాఘవాచార్యులుగారు వ్రాసియున్నారు. క్రీ॥ 14వ శతాబ్ద్యంతమున శ్రీ రంగనాథస్వామివారిమూర్తి తిరుమలమీఁద నెలకొనియుండిన సందర్భమునందే సుప్రభాతపఠనము నుషఃకాలపూజయు తిరుమలయం దారంభించి యుండు నని వారితలంపు. తిరుపతి

శాసనములలో క్రీ॥ 1430 కిఁబూర్వ మచట ఉషఃకాలసంధినిగూర్చిగాని, వేదపారాయణమునుగూర్చిగాని తెలియరా దనియు క్రీ॥ 1476 కిపూర్వ మచట ద్రావిడప్రబంధపఠన మున్నట్లు గోచరింప దనియు వారు వ్రాసిరి. కాని అన్నమాచార్యాదులవి సుప్రభాతపుమేలుకొలుపుకీర్తనములు పెక్కులు గలవు. పెద తిరుమలాచార్యుని మేలుకొలుపుద్విపద యుండనే యున్నది. దీనినిబట్టి పదునైదవశతాబ్ది యారంభమందే ప్రారంభమైన యీ నూతనపూజావిధానమునకుఁ దాళ్ళపాకకవు లెన్నోవిధముల పోషణ మిచ్చి సాహిత్యరూపమున స్థిరత్వము గల్పించినా రనవచ్చును. నేఁటికినిఁ దాళ్ళపాకవారికి తిరుమలమీఁది నిత్యార్చనాక్రమమున తత్తత్సందర్భములం దున్నప్రాముఖ్యముకూడ నాయూహకు బలమిచ్చుచున్నది.

అర్చకుఁడు ఆగమవిధి ననుసరించి యాలయముతలుపులు తెరచును. శయనమంటపమున నూయెలలో రాత్రియంతయు నున్నభోగశ్రీనివాసమూర్తిని గర్భమంటపమునందలి జీవస్థానమునకుఁ దరలించువిధుల నాతఁడు నిర్వహించుచుండఁగా నోరగా వేసినతలుపులకు వెలుపల ముఖమంటమున గాయకులు సంకీర్తనముల నాలపింపఁగా వేదపారాయణముకూడ జరగుచుండును. నేఁ డీవేదపారాయణాదు లచట లేవు. తదుపరి భోగశ్రీనివాసునకు మంత్రాసన, స్నానాసన, అలంకారాసనాదివిధులు నిర్వర్తింపఁబడును. పిదప విశ్వరూపప్రదర్శనమునకై భక్తులను లోనికి విడుతురు. దానితో ప్రభాతపూజ యారంభ మగును.

తాళ్ళపాకవారి సుప్రభాతకీర్తనములు కొన్ని మున్నే యుదాహరించితిని. మఱియొకటి గాంచుఁడు.

దేవగాంధారి

"వారిధిశయన వోవటపత్రపరియంక
గారవాన మేలుకొని కన్నులు దెరవవే ॥

ఘనయోగిహృదయపుఁగమలాలు వికసించె
నొనర విజ్ఞానసూర్యోదయ మాయె
మును జీవపరమాత్మము లనుజక్కవలు గూడె
వనజాక్ష మేలుకొని వాకిలిఁ దెరవవే ॥

కలుషము లనేటిచీకటెల్లఁ బెడబాసె
నలువంక వేదకీరనాదము మ్రోసె
అలరి యితరధర్మా లనేటిచుక్కలు మాసె
జలజాక్ష మేలుకొని నతిమోము చూడవే ॥"( 11-170 )

ఇందు వాకిలి కవతలగా నిలఁబడి గాయకుఁడు పాడిన తెలుఁగును, వేద గానప్రశంసయుఁ గానవచ్చుచున్నది. అటుపై విశ్వరూపదర్శనమునకు వాకిలి దెరచుటకు గర్భమంటపమున జరుగుపూజాకలాపము నీకీర్తనమున తాళ్ళపాక కవులు వర్ణించినారు. చూ.

లలిత

"షోడశకళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి॥

అలరు విశ్వాత్మకున కావాహన మిదే సర్వ
నిలయున కాసన మిదె నెమ్మి నిదే
అల గంగాజనకున కర్ఘ్య పాద్యాచమనాలు
జలధిశాయికిని మజ్జన మిదే॥

వర పీతాంబరునకు వస్త్రాలంకార మిదే
సరి శ్రీమంతునకు భూషణము లివే
ధరణీధరునకు గంధపుష్పధూపములు
తిరమిదే కోటిసూర్యతేజునకు దీపము ॥

అమృతమథనునకు నదివో నైవేద్యము
గమిఁ జంద్రనేత్రునకుఁ గప్పురవిడెము
అమరిన శ్రీవేంకటాద్రిమీఁది దేవునకు
తమితోఁ బ్రదక్షిణాలు దండములు నివిగో ॥"

(6-134)

ఇందు వర్ణిత మైనభోగ మంతయు కౌతుకబేరమునకే. ఇందు క్రమమున నర్ఘ్యపాద్యాచమనములందు మంత్రాసనము, మజ్జనమందు స్నానాసనము, వస్త్రాలంకారములందు అలంకారాసనము, నైవేద్యమునందు భోజ్యాసనము వర్ణితములు.

కౌతుకబేరము జీవస్థానముఁ జేరుకొన్నపిదప ధ్రువ కౌతుకబేరములు రెంటిని దర్శించి భక్తులు భక్తితోఁ బ్రణామము లాచరింతురు.

పైన వర్ణితములైన వివిధాసనములలో స్నానాసనమున స్వామి యున్నప్పుడు తాళ్ళపాకవారి కైంకర్యము తిరుమలయందు నాఁడు సాగుచుండినది. వారి సంకీర్తనగాన మప్పుడు విధిగా నుండెడిది. చూ. కీర్తనము—

ధన్యాసి

"సందడి విడువుము సాసముఖా
మందరధరునకు మజ్జనవేళా ॥

అమరాధిపు లిడుఁ డాలవట్టములు
కమలజ పట్టుము కాళాంజి
జమలిచామరలు చంద్రుఁడు సూర్యుఁడ
అమర నిడుఁడు పరమాత్మునకు ॥

వేదఘోషణము విడువక సేయుఁడు
ఆదిమునులు నిత్యాధికులు
శ్రీదేవుఁ డగుశ్రీవేంకటపతి
ఆదరమున సిరు లందీ వాఁడే ॥" (5-12)

ఇది ప్రతినిత్యము కౌతుకబేరమునకు జరగు మజ్జన కైంకర్యమును వర్ణించు కీర్తనము. ఈ సందర్భమునందలిదే వీరికీర్తనము మఱియొకటి చూడుఁడు.

మలహరి

"తిరుమజ్జనపువేళ దేవునికి నిదివో
పరగ నారదాదులు పాడరో యిందరును॥

చింతదీర వేంచేసీ సింహాసనమున నుండి
దంతధావనాది కృత్యములు చేసీ
సంతసాన నంటరో సంపంగినూనియఁ దెచ్చి
కాంతలు గందపుటటికలి పెట్టరో ॥

పంచామృతములతోడ పన్నీట మజ్జనమాడె
కాంచనాంబరాలు గట్టె కస్తూరి పూసె
నించుకొనె సొమ్ము లెల్లా నిలువుదండలు చాతె
పొంచి ధూపదీపతాంబూలము లొసఁగరో ॥

పాదుకలు వాహనాలు బహుఛత్రచామరాలు
ఆదరించె శంఖకాహళాదివాద్యాలు
వేదపారాయణలతో వెసఁ జూచెఁ గపిలను
గాదెల లెక్కలడిగె గడేరాలు వినెను ॥

అంగరంగవైభవాల కరళుపాడులువెట్టె
అంగపు నిత్యదానాదు లన్నియుఁ జేసె
చెంగట నలమేల్మంగ శ్రీవేంకటేశుఁడు గూడి
ముంగిటి పారుపత్యమ్ములు చేసీని ॥" (13-473)

ఇందు క్రమమున సుప్రభాతకాలపూజ మొదలుకొని ప్రభాతపూజ ముగియువఱకు నాఁ డచట జరుగుచుండిన సేవావిశేషములు వర్ణితము లైనవి. మంత్రాసనమున నర్ఘ్యపాద్యాదులు సమర్పించుట, దంతధావనాదికృత్యములకొఱకే. ఇట్లే స్నానాసన అలంకారాసనములుకూడ నిందు వర్ణితము లైనవి. ఇవి యన్నియు నాగమ విహితము లగువిషయములే. ఆటు పిదప వాహనచ్ఛత్రచామరాదుల నాదరించి వేదపారాయణలతో వెసఁ జూచి గాదెల లెక్క లడుగుటయు, గడేరాలు వినుటయు, అంగరంగవైభవాల కరళుపాడులు వెట్టుటయు నేఁడు 'కొలువు' అనఁబడు సేవాక్రమమును తెలుపునవి. దీనిని గూర్చి శ్రీ వీరరాఘవాచార్యులవా రిట్లు వ్రాసియున్నారు.

"The Alamkarasanam itself is a darbar held in the Sanctum Sanctorum. It is however done outside the Sanctum Sanctorum in the Mukha mantapam ( or Tirumamani mantapam ) ... for this function ' Koluvu Srinivasa ' ( or the Bali Beram ) is brough to the Tirumamani Mantapam on a silver chair with silver umbrella and other paraphernalia. A laghu archana is conducted offering arghyam, padyam and Achamaniyam. A mixture of powderd gingelly seeds, dried ginger powder and Jaggerry is offered to the deity and distributed to the congregation. The day's calendrical details are read out from the panchangam

(almanac) and also an abstract accoutnof the previous day's collection in the hundi in the shape of coins, gold, jewellary etc. There is no reference to this function (nor to Koluvu Srinivasa) in any of the inscriptions."

(చూ. తిరుపతి చరిత్ర. I. పు. 319)

ఇట్లు వ్రాసి యీ సేవ బ్రిటిషువారు వచ్చినతరువాతనే తిరుమలయం దారంభించి యుండు ననియు వారు సూచించియున్నారు. కాని శాసనాధారములు లేకున్నను తాళ్ళపాకవారి పై కీర్తనమునుబట్టి యీకొలువు నాఁడును జరుగుచుండిన దని చెప్పనగుచున్నది. పైగా పైవర్ణనమున నీకొలువు భృగుసంహిత ననుసరించి గర్భమంటపముననే జరుపఁబడుచుండినట్లును తలఁప నగుచున్నది. ఇందు 'గాదెల' లెక్కలడుగుటయే హుండీలెక్క లడుగుట. 'గదేరాలు వినుట'యే పంచాంగము నాలకించుట. 'అంగరంగవైభవముల కరణపాదులు వెట్టుటయు', 'ముంగిట పారుపత్యములు' చేయుటయే, దర్బారుచేయుట- ఇట్లు పై సంకీర్తనము మరుగునపడిన చారిత్రకవిషయములను కనులఁ గట్టినట్లు చిత్రించుచున్నది.

ఈ కొలువు ముగిసిన వెనుక సహస్రనామార్చనము జరుగును. తదుపరి బంగారువాకిలి మూయఁబడును. లోన శుద్ధి జరుగును. ఆలోపునే తళిగలు ముఖమంటపముఁ జేరుటయు, మొదటిగంట మ్రోగుటతో స్వామివారికి నైవేద్యము జరుగుటయు నగును. తాళ్ళపాకవారి కాలమున భోజ్యాసనమున నున్నస్వామివారికి నివేదింపఁబడుచుండిన తళిగ లివి. చూ. కీర్తనము-

ధన్యాసి

"పంకజాక్షులు సొలసి పలికి నగఁగా
నింకా నారగించు మిట్లనే అయ్యా ॥
కలవంటకములు పులుగములు దుగ్ధాన్నములు
పలుదెఱఁగులైన అప్పములగములు
నెలకొన్ననేతులు నిరంతపు చక్కెరలు
గిలు కొట్టుచును నారగించవయ్యా ॥
పెక్కువగు నైఁదంపు పిండివంటలు మీఁద
పిక్కటిలు మెఱుఁగుఁబొడిబెల్లములును
వొక్కఁటిగ గలుపుకొని వొలుపుఁబప్పులతోడ
కిక్కిఱియ నిటు లారగించవయ్యా ॥" (5-80)

ఇవే గాక యింకను అక్కాళపాళాలు, అప్పాలు, వడలు, సైఁదంపుపేణులు, మీఁజిన కెళంగుమిరియఁపుఁదాళింపుఁగూరలు, సారంపుఁబచ్చళ్ళు, పిండివంటలు, పాళాలు, దివ్యాన్నాలు మున్నగున వన్నియు స్వామికి నివేదింపఁబడుచుండినవి.

భోజ్యాసనము తరువాత యాత్రాసనమున పరివారదేవతలకు బలిప్రదానము జరుగును. తిరుమలమీఁద బలిబేర మగుకొలువుశ్రీనివాసమూర్తి యూరేగింపుతో వెడలి బలియిచ్చు నాగమవిహితాచారము ఆయాలయమున నాను కూల్యము లేమిచే విడువఁబడినది. అర్చకుఁడే విమానప్రదక్షిణము గావించి గరుడవిష్వక్సేనాదులకు బలి నర్పించును. ఈ విషయమై వ్రాయుచు శ్రీ వీరరాఘవాచార్యులవారు "Even the names of the devetas who are eligible to get food do not appear to be mentioned" (1 పు. 324) అని తమ తిరుపతిచరిత్రలో వ్రాసియున్నారు. ఈ విషయమై తాళ్ళపాకవారి యీ కీర్తనము చూడఁ దగును.

శ్రీరాగం

"చండప్రచండాది జయవిజయులన్
అండఁ బూజించి హరి కటుకదా పూజ ॥

కూర్మ భూమ్యాదులను గోరికఁ బ్రతిష్ఠించి
ధర్మ ముఖ్యంబుల నధర్మాదులన్
కర్మగతి చామరగ్రాహిణులఁ బూజించి
మర్మంబుగా హరికి మఱికదా పూజ ॥" (11-2-9)

ఈ కీర్తనమందే తర్వాత క్రమమున గరుడ సేనేశులను, శేషుని, పాదసంవాహినులను శంఖచక్రగదాసిశార్ఙ్గములను, నవకిరీటమును, కుండలహారకౌస్తుభములను పీతాంబరాదులను-"వివిధగతిఁ బూజించి వేంకటేశ్వరుపూజ- యివ(ద)లఁ దళిగలుపెట్టఁ దిదిగదా పూజ" అని యున్నది.

ఇఁకి నటుతరువాత జరగు సేవలలో నిశియందు (శయన) పర్యంకాసనమున నున్నప్పుడు స్వామివారికి జరుగు ఏకాంత (పానుపు) సేవను గూర్చియే తాళ్ళపాకవారి కీర్తనము లధికముగ నున్నవి. ఈ సందర్భమున దాళ్ళపాకవంశము వారు పాడుచుండుట నేఁటికిని దిరుమలయం దాచారముగ నున్నది. జీవస్థానము

నుండి భోగశ్రీనివాసమూర్తిని తరలించి శయనమంటపమున వెండిచేరులు గల తూగుటుయ్యేలపై నుంచుదురు. ఆ సందర్భమున తాళ్ళపాకవారి జోలపాట లివి యాలింపుదురు.

దేసాళం

"నాటకపునిన్ను జూచి నవ్వు వచ్చీని
యేటికి వచ్చితి నేను యేమిసేసేవు॥

నిద్దిరించవలె నంటా నీకురులు దువ్వితేసు
వొద్దఁ బండు మని యేల నొడివట్టేవు
అద్దో నీపదాలుపాడి అట్టే నిన్ను జోకొట్టితే
కొద్దిమీర వలపులు గుప్పళించేవు॥" (3-629)

స్వామి యిందు శృంగారప్రియుఁడగు నాయకుఁడై నిదురపోక చమత్కారములు సేయుట వర్ణితమైనది. ఈ పానుపుసేవలో స్వామివారిని నిదురింపఁజేయుటయే ముఖ్యముగావున తాళ్ళపాకవారీ సందర్భములందు వారిని బాలునిగానే సంభావించి పెక్కు జోలలు పాడి నిదురఁబుచ్చిరి. ఈ కీర్తనము సరయుఁడు.

శంకరాభరణము

"ఉయ్యాల బాలునూచెదరు కడు
నొయ్య నొయ్య నొయ్యనుచు॥

బాల యవ్వనలు పసిఁడివుయ్యాల
బాలునివద్దం బాడేరు
లాలి లాలి లాలి లాలెమ్మ యెల్ల
లాలి లాలి లాలెనుచు॥

చల్లఁజూపుల జవరాండ్రు రే
పల్లెబాలునిం బాడేరు
బల్లిదువేంకటపతిఁ జేరి యందెలు
ఘల్లు ఘల్లు ఘల్లనుచు॥"(3-314)

వీరి జోలపాట లిట్టివే శ్రీరంగనాథ, బాలకృష్ణ, శ్రీ వేంకటేశ్వర ముద్రలు గలవి మఱికొన్ని యున్నవి. ఇట్టి పానుపుసేవతో తిరుమలమీఁది యాలయమున

నిత్యార్చనావిధి నెరవేరుచున్నది. తాళ్ళపాకవా రాయాలయపూజాక్రమము నిట్లు శ్రద్ధతో ననుసరించుచు తదేకజీవనమును గడపిరి.

ఈ సేవాక్రమము ప్రతినిత్యము నిట్లే జరగుచుండునుగాని గురు శుక్ర వారములందు మాత్ర మించుక భేదించును. శుక్రవారాభిషేకమున కనువుఁ గల్పించుటకై కాఁబోలు గురువారము సాయంత్రమే స్వామివారి యాభరణాదు లన్నియు దూసి పూలతో నలంకరించుట యీనాఁడు జరుగుచున్నది. ఇదియే పూలంగిసేవ. ఇది తిరుమలమీఁద నెప్పటినుండి సాగుచువచ్చినదో మనకు తెలియరా దని శ్రీ వీరరాఘవాచార్యులవారు వ్రాసి యున్నారు. ఈ గురువారపు పూలంగిసేవాసందర్భముననే వెనుక వ్యాసతీర్థులవారు తమ తపస్సుచేత స్వామివారి రౌద్రాకారమును మాన్పి ప్రశాంతతను నెలకొల్పఁజేసినా రనెడి కథ యొకటి సంప్రదాయమున నున్నది. కాని తాళ్ళపాకవారి కీర్తనములం దీపూలంగి సేవను గూర్చిన ప్రశంస నాకుఁ గాన రాలేదు. పైగా శుక్రవారములందే స్వామి వారి కాభరణము లన్నియుఁ దీసి యభిషేకముచేయుంచు చుండినట్లు కీర్తనములం దున్నది. కనుక నప్పటి గురువారపు పూలంగి సేవను గూర్చి మన కంతగా తెలియరాదు. శుక్రవారాభిషేకమును గూర్చిమాత్రము తాళ్ళపాకవారి కీర్తనములు పదింబదిగా నున్నవి.

## శుక్రవారాభిషేకము :

తిరుమలమీఁద జరుగువారోత్సవములలో నీఅభిషేకోత్సవము ప్రసిద్ధ మైనది. ప్రతినిత్యము భోగశ్రీనివాసమూర్తి కభిషేకము జరుగును. కాని వార మున కొకసారి శుక్రవారములందుమాత్రమే మూలమూర్తి యగుధ్రువబేరమునకు మజ్జనోత్సవము మహావైభవముగా సాగును. స్వామికి శుక్రవారమునాఁటి యీ తిరుమజ్జనోత్సవమును తాళ్ళపాకకవు లభిమానముతో వర్ణించుకొనిరి. అది యీనాఁట నిట్లు సాగుచున్నది. ప్రతిశుక్రవారము మధ్యాహ్నము 1 గంటకు అభిషేకము. క్రమ మెట్లనఁగా " పునుగుతైలపుటభ్యంజనమును. క్షీరాభిషేక మును, కుంకుమపూవు కస్తూరి కర్పూరమునూటి బంగరుగిన్నెల నించిన యనుకుతో నలుఁగును, స్వల్ప జలాభిషేకమును, అనుకునలుఁగుతోఁ గలసిన యాతీర్థము స్వామిపాదతీర్థముగా సేకర మయినపిదప విరివిగా జలాభిషేకమును జరగును. తలకుఁ దడియారఁగాఁ బొడివలువ పిడిచుట్టు చుట్టి దివ్యమంగళవిగ్రహము నెల్లఁ బొడిపలుపతోఁ దుడిచి నీరుపూఁతగా ముఖమున దూమెఱుఁగుగా సర్వాంగమున

పునుఁగుతైలముపూఁత ముఖమునఁ గర్పూరచూర్ణముతో నామము సాఁతుట, ఆ నామమునకునడుమఁ గస్తూరీతిలకము దిద్దుట, అలమేల్మంగహారము (మంగతాళి) మొదలగు దివ్యాభరణములను పీతకౌశేయములను ధరింపించుట జరగును.

తాళ్ళపాకవారి నాఁట నిట్లు సాగెడిది.

ఆపాదమస్తకము పునుఁగుతైలపుటభ్యంజనముచేసి కుంకుమపూవు మొదలగువాని యనుకుతో నలుఁగుపెట్టి పన్నీటను, శుద్ధోదకమునను జలకమార్చి తుడిచి సర్వాంగములందు నారఁగాఁ గర్పూరధూళి చల్లి మేదించి దానిపై నారఁగాఁ బునుఁగుతైలము రాచి ముత్యాలతిరునామము మంగతాళి మొదలగు దివ్యాభరణములను నలంకరించుటయ్యెడిది.

అభిషేకసమయమునఁ దాళ్ళపాకవారు దగ్గర నుండి నలుఁగుపాటలు, అభిషేకపుఁబాటలు, మొదలగునవి పాడుట, అభిషేకానంతరము వారికొక యభిషేకపుఁబన్నీటిచెంబును తాంబూలచందనాదులను నొసఁగి సత్కరించుట జరిగెడిది. తిరుమజ్జనోత్సవ మిట్లు శాశ్వతముగా జరగుటకుఁ దాళ్ళపాకవారే స్వామికగ్రహారముల నర్పించిరి."[1] ( చూ. అన్నమాచార్యచరిత్ర పీఠిక. పు.30-31 ) తూప్పిల్ పిళ్ళ ( వేదాంతదేశికుల ) వారి కయ్యార్ చక్ర శ్లోకములు ( సుదర్శన చక్రస్తుతి ) కూడ నాఁడచట గానము చేయఁబడుచుండినవి.

పైసందర్భమున గానముసేయఁబడుచుండినకారణమునఁ గాఁ బోలు ను పదింబదిగాఁ గానవచ్చుచున్న తాళ్ళపాకవారి కీర్తనములలో నొకటిరెండింటి నిట నుదాహరింతును. చూ. కీర్తనములు.

"కంటి శుక్రవారము గడియలేడింట
అంటి అలమేల్మంగ అండ నుండేస్వామిని॥

సొమ్ములన్ని కడఁబెట్టి సొంపుతో గోణముగట్టి
కమ్మని కదంబము కప్పు పన్నీరు
చెమ్మతోన వేష్టువలు రొమ్ము తలమొల చుట్టి
తుమ్మెదమై చాయతోన నెమ్మది నుండే స్వామిని॥

1. 4-14, తి. తి. దే, శా. సం॥ 1532 మఱియు
5-153 " " సం॥ 1564.

పచ్చకప్పురమె నూఱి పసిఁడిగిన్నెల నించి
తెచ్చి శిరసాదిగ దిగ నలఁది
ఆచ్చెరుపడిచూడ అందరికన్నుల కింపై
నిచ్చమల్లె పూవువలె నిటు తా నుండేస్వామిని॥

తట్టుపునుఁగె కూర్చి చట్టలుచేరిచి నిప్పు
పట్టి కరఁగించి వెండిపళ్యాల నించి
దట్టముగ మేనునిండ పట్టించి దిద్ది
బిట్టు వేడుక మురియుచుండే బిత్తరస్వామిని॥"

(శేషాచార్యులవారి వ్రాతప్రతి చూ. అన్నమా, చరిత్ర పీ. పుట. 31)

శంకరాభరణము

"ఏమని చెప్పుదుమమ్మ యీతనిసౌభాగ్యము
కోమలపు జవ్వనము గుఱుతై నట్టుండె॥

ఒట్టుచుఁ గప్పురకాపు ఊడిగపువారెల్లా
అట్టె దేవునికి నలఁదగాను
దట్టముగ మంచితెల్లఁదామెరపువ్వునకు
ముట్టి అవయవములు మొలచినట్టుండె॥

తనివొంద గిన్నెలతోఁ దట్టుపునుఁగులు దెచ్చి
పొనుపొంద దిరుమేనఁ బుయ్యఁగాను
పనివడి గొప్పనిడుపాటినేరెడుఁబండు
కనుపట్టు పురుషాకార మైనట్టుండె॥

అలమేలుమంగనురమందుఁ బెట్టి సొమ్ములెల్లా
పలువిధముల నించి భావించఁగాను
అలర శ్రీవేంకటేశుం డనెడివుప్పొడిరాశి
వెలయ మరుఁడు ముద్రవేసి నట్టుండె॥"

(చూ. అన్నమా. చరిత్ర. పీ. పు. 33)

ఇట్టి సంకీర్తనములింకను గలవు.

ఈ శుక్రవారాభిషేకమున 'పునుఁగుకప్పు'ను గూర్చి చర్చించుచు శ్రీ వీర రాఘవాచార్యులవా రీయభిప్రాయములను వెలిబుచ్చిరి.

"The application of this scented oil over the entire body of the Murti is of recent Origin- It may be pointed out here that the whole body was not anointed nor was the application made all round the year. hTe current practice is to apply the civet oil daily to the feet and not to the face. When the application of civet oil for the whole body commenced we cannot say" (చూ. తిరుపతి చరిత్ర I పు. 329-331)

కాని అన్నమాచార్యాదుల పై సంకీర్తనము లన్నిటినిఁ బరిశీలించి చూడఁగా "చెక్కులఁబూసిన తట్టు పునుఁగు", "తట్టు పునుఁగులు దెచ్చి పొలుపొందఁ దిరుమేనఁ బుయ్యఁగాను" మొదలగు వర్ణనములనుబట్టి యానాళ్ళలోనే ఈ "పునుఁగు కాపు" స్వామివారి తిరుమేన పూర్ణముగ జరగుచుండిన దని భావింప నగుచున్నది. పైగా ఈ కాపును వారెట్లు చేయుచుండిరో కూడ తాళ్ళపాకవారు వర్ణించిరి.

"తట్టుపునుఁగెకూర్చి చట్టలచేరిచి నిప్పు
పట్టికఱఁగించి వెండిపళ్యాలనించి
దట్టముగ మేనునిండపట్టించి దిద్దు"

చుండెడివారట ! నిప్పపట్టి కరగించి పూయుటచేతనేమో దానికి 'పునుఁగుకాపు' అనియుఁ బేరైనది.

ఇంతేకాదు పైకీర్తనములనుబట్టి అన్నమాచార్యుని కాలమునకే శుక్రవారాభిషేకమును, పునుఁగుకాపును తిరుమలయందు ప్రసిద్ధమై యుండె నని తెలియ నగును.

ఈయభిషేకసందర్భమున సేకరింపఁబడిన ప్రసాదవిశేషములే శ్రీపాద తీర్థము (శ్రీహరిపాదతీర్థము) గా తాళ్ళపాకవారి సంకీర్తనములందు ప్రస్తుతిఁ గన్నది. (చూ. పుట. 158కీర్తనము 'శ్రీహరి పాదతీర్థమేచెడనిమందు'-)ఇట్లే స్వామి మేనెల్ల మేదించిన, మేదించుటలో శ్రీపాదములందుఁ దొరగిన కర్పూరపు ధూళితోడి పునుఁగు తైలమును 'శ్రీపాదరేణువుఁ'గా రేవణూరి వేంకటాచార్యుఁడు తన శ్రీపాదరేణుమాహాత్మ్యమున గొండాడి యున్నాఁడు. ఈ శ్రీపాదరేణుప్రశంస తాళ్ళపాకవారి కీర్తనములం దప్పటికి తాము జూచినంతలోఁ గానరాలే దని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వ్రాసినారు. (చూ. అన్నమా. చరిత్ర పీఠిక-పు-34) ఇంకనుఁ బరిశీలింపవలసి యున్నది.

తృతీయాధ్యాయము

# తాళ్లపాకవారు ఆర్జించిన అగ్రహారములు తిరిగిన దేశములు కీర్తించిన వేలుపులు

( పుటలు 277 - 312 )

# తాళ్ళపాకవారు ఆర్జించిన అగ్రహారములు – తిరిగిన దేశములు కీర్తించిన వేలుపులు

తొలుత తాళ్ళపాకవంశీకులు అన్నమాచార్యుని పితృపితామహులు పొత్తపినాటిసీమలోని తాళ్ళపాకగ్రామ వాసులే. వారిబంధువులు కొందఱు తత్సమీప గ్రామములగు ఊటుకూరు మాడుపూరులందును నుండిరి. తాళ్ళపాక నారాయణ సూరికిని, మాడుపూరి లక్కమాంబకును గల్గినపుత్రుఁడే మన అన్నమాచార్యుఁడు ఈతఁడు పదునాఱవయేటనే తిరుమల దర్శించి సంకీర్తనరచన నారంభించినను అక్కడే స్థిరనివాస మేర్పరచుకొనినట్లు కానరాదు. తాళ్ళపాక, మరులుంకు పెనుగొండ, విజయనగరము, కడప, తిరుపతి, మున్నగుస్థలములం దుండుచు మతప్రచారమునకై కడప, కర్నూలు, బళ్ళారి, అనంతపురము, చిత్తూరు, చెంగల్పట్టు, ఆర్కాడు, నెల్లూరు, గుంటూరు, తంజావూరు, తిరుచినాపల్లి మండలములెల్ల సంచారముచేయుచు తుదకు వార్ధకమున తిరుపతిలోనే నెలకొనియుండి నట్లు ఆతనిసంకీర్తనసంచయమునుబట్టి యూహింపనగుచున్నది.

క్రీ॥శ॥ 1513-14 సంవత్సరములనడుమ వీరియగ్రహారమగుతాళ్లపాకను శ్రీకృష్ణదేవరాయఁడు రొఖధాన్యములతోఁగూడ శ్రీనివాసున కర్పించెను. తుదకు ఆయాదాయముతో నిర్వహింపఁబడిన కైంకర్యములందలి ప్రసాదభాగములను గూడ రాయఁడు తాళ్లపాకవారి కిప్పింపక తన కాశ్రితులగురంగదీక్షిత, శివ దీక్షితు లనువారి కిప్పించెను. ఆ ప్రసాదభాగములనే వారితరువాత రాయలు మరల క్రీ॥శ॥ 1524లో వ్యాసర్థతీలవారి కిప్పించెను. 'మండెమురాయ నామక నరసింహదండనేత్రు (తృ)న కిష్టధనబలస్ఫూర్తి' నని యన్నమాచార్యచరిత్రమున నున్నవాక్యమును విమర్శించుచు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు తమపీఠికలో వివరించిన విధముగా అన్నమాచార్యునివార్ధకమున తత్పుత్రులగునృసింహ పెదతిరుమలాఖ్యల కును, మదపనరసానాయకునకును గలిగినస్పర్థ యేదేని కృష్ణరాయని వైచర్యకు హేతువగునేమో అనిపించును. వైయక్తికముగా కృష్ణరాయనికిని తాళ్లపాకవారికిని

నడుమ సామరస్య మంతగా నుండినట్లు మనకుఁ దెలియరాదు. రాయలకుఁ బూర్వము సాళువనృసింహునకును, తరువాతి అచ్యుతదేవరాయలకును తాళ్లపాక వారితో నుండినసామరస్యము రాయలకాలమున లేకుండుటయు మీఁదుమిక్కిలి సామరస్యము చెడె నేమో అని యనుమానింపఁ దగినయంశము లుండుటయుఁ బై యూహకుఁ గారణములు. ఏది యెట్లైనను క్రీ॥ 1513 ప్రాంతములకే (అంతకుఁ బూర్వమోకూడ!) తాళ్లపాకవారు తాళ్లపాకను వీడియుందు రనుట నిశ్చయము. నృసింహకవి యటనుండి సుంకేసుల కేగి యహోబల శ్రీరంగాదులలోఁ గాలము గడిపి యస్తమించిన ట్లున్నాఁడు : పెదతిరుమలయ్య తిరుపతిని కేంద్రముగ నొనర్చుకొనియుఁ దొలుత కొలఁదికాలము దేశసంచారముచేసి తంద్రివలెనే వైష్ణవ మతప్రచార మొనర్చినట్లున్నది. అచ్యుతదేవరాయలు ప్రాభవమునకు వచ్చుటతో తాళ్ళపాకవారి దశయుఁ బెరిగినది పెదతిరుమలార్యుఁడు తిరుపతిలోనే నెలకొని నాఁడు. ఆతని పుత్రులును పండితులై రచయితలై యాధ్యాత్మికదేశికులై విఖ్యాతిని సంపాదించుకొని దేశమునలుమూలలఁ జోటుచేసికొని తమ సంతతిని వర్ధిల్ల చేసినారు. ఈవిషయముల నెల్ల గుర్తించుటకు నేఁడు మనకు వారి సంకీర్తనములును మఱికొన్ని శాసనములును మాత్రమే మిగిలియున్నవి. వాని ననుసరించియే ఈక్రిందివిషయములు గుర్తింప నగుచున్నవి.

అన్నమాచార్యునకు సాళువనృసింహరాయఁ డెన్నియగ్రహారము లిచ్చి యుండెనో వాని నాతఁడు స్వామివారి కెట్లువినియోగించెనో తెలియఁదగిన శాసన విషయము లేవియు మన కీనాఁడు లభ్యము గాకున్నవి. అన్నమాచార్యచరిత్రమున 'మరులుంకు' అన్నమాచార్యుని యగ్రహార మని యున్నది. బహుశః యిది వారికి నృసింహరాయఁ డిచ్చినదే యగునేమో ! ఇఁక మనకు గుర్తింపఁదగినవి తరువాతికాలమున పెదతిరుమలాచార్యులకు అచ్యుతదేవరాయాదు లొసఁగినయగ్ర హారాదులనుగూర్చియే. భిన్నసమయములలోఁ దాళ్ళపాకవారు అప్పటి విజయ నగరప్రభువులయు, సామంతులయు నను గ్రహమున నీక్రిందియగ్రహారముల నంది మరల వానిని స్వామివారికే యర్పించి తన్మూలమున స్వామికైంకర్య మాచంద్రతారార్కము నిర్విఘ్నముగా సాగునట్టి యేర్పాటు గావించి తామే ప్రత్యక్షముగా పర్యవేక్షించి పరిరక్షించుచుండిరి. ఆయగ్రహారము లివి.

1. అంబత్తూరు. (నగరిసీమ) క్రీ॥శ॥ 1545 తిరువెన్నాదయ్య స్వామి కర్పించెను.

2. ఈమని— తెనాలితాలూకా గుంటూరుజిల్లా- సిద్ధిరాజువెంకటరాజు కోనేటి అన్నయ్య కిచ్చినది. క్రీ॥ 1564.
3. ఎఱగుంటాయపల్లె- శిరివోలుసీమ- పెదతిరుమలయ్య స్వామి కర్పించినది.
4. కత్తంవారిపల్లె- కడపజిల్లా- " "
5 కావనూరు- క్రీ॥ శ॥ 1538లో " "
6. కీలంగున్నం- క్రీ॥ శ॥ 1541లో " "
7. కుప్పం - క్రీ॥ శ॥ 1541లో " "
8. కొత్తూరు- పేరింబాకరాజ్యం- - -
9. గండమతిమ్మాపురం.
10. వామనగుండపరం.- తిరువెన్నాదయ్యకు సదాశివరాయఁ డిచ్చినది.
11. గొరిజవోలు- కొండవీటిసీమ- క్రీ॥ శ॥ 1546లో సదాశివరాయఁడు తిరువెంగళనాథయ్య కిచ్చినది.
12. చెందలూరు— కొడవీటిసీమ.
13. తిప్పనపల్లి- కడపజిల్లా.
14. తుప్పిల్ అగ్రహారం.
15. దేవరాయపల్లి- వినుకొండసీమ.
16. నేడియం.
17 పళ్ళిపురం- తూపూరు కంచిగుంటసీమ— బుక్కరాజు తిమ్మరాజువద్ద కొని స్వామివారి కిచ్చినది. క్రీ॥ 1539.
18. పున్నియం- నగరిసీమ.
19. పూండి - మేర్రైసీమ- క్రీ॥ 1532లో పెదతిరుమలయ్య స్వామి కిచ్చినది.
20. బొల్లాపల్లి- అద్దంకిసీమ- క్రీ॥ 1544లో సదాశివరాయఁడు కోనేటి తిరువెంగళనాథయ్య కిచ్చినది.
21. మంగాపురం- చంద్రగిరిరాజ్యం- విజయనగరరాజులు సర్వమాన్యాగ్రహారముగా తాళ్ళపాకవారి కిచ్చినది
22. మరువాకరై - క్రీ॥ 1538లో పెదతిరుమలయ్య స్వామి కిచ్చినది.
23. మల్లవరం- క్రీ॥ 1545లో సదాశివరాయఁడు తాళ్ళపాకవారి కీయఁగా 1546లోవారు దానిని స్వామికిచ్చిరి.
24. మాచనూరు- కడపజిల్లా- తాళ్ళపాకవారి యగ్రహారము.

25. మిన్నికల్లు- వినుకొండసీమ క్రీ. 1546లో సదాశివరాయఁడు తాళ్ళపాక అన్నయ్య కిచ్చినది.
26. ముత్యాలపట్టు- తాళ్ళపాకవారికి విజయనగరరాజు లిచ్చినది.
27. రాయల్పాడు- కర్నూలుజిల్లా కోయిలకుంట తాలూకా.
28. వేదుమపాకం- మాదనల్లూరిసీమ.
29. సంగమకోట- మేరైసీమ – తాళ్ళపాకవారికి అచ్యుతరాయ లిచ్చినది.
30. సోమయాజులపల్లె- కాల్వాయ్‌సీమ.

పైగ్రామము లన్నియుఁ జాలవరకు నేఁటి రాయలసీమ, గుంటూరు మండలములం దున్నవే. తాళ్ళపాకవా రీయగ్రహారముల నార్జించి, తన్మూలమున స్వామిని సేవించుటయేకాదు - భక్తి తోడను, మత ప్రచారదృష్టితోడను పలు క్షేత్ర దైవతములపై రమ్యము లగు సంకీర్తనములను కూడఁ జెప్పినారు. ఆవిష యమై యించుక వివరింతును.

అన్నమాచార్యుఁడును, ఆయన కొడుకు పెదతిరుమలాచార్యుఁడును, మనుమఁడు చినతిరుమలచార్యుడును తిరుమల తిరుపతులందలి దైవతములనే గాక విశేషముగా నీక్రింది పేర్కొన్న దైవతములఁగూడ నాయాప్రక్కలఁ బేర్కొన్న పుణ్య స్థలములందు దర్శించి సంకీర్తనములు చాల రచించిరి.

1. ఆంజనేయస్వామి-
   కలశాపురం, మంగాంబుధి, మతంగాద్రి, విజయనగరము.
2. కృష్ణుఁడు -
   ఉద్దగిరి, కృష్ణగిరి, కోవిలకుంట, గండవరము, చెంజి, విజయనగరము, వెంకటగిరి.
3. కేశవస్వామి—
   ఊటుకూరు, కురునూతుల, కోన, చాగలమట్టి, చెప్పల్లి, నల్లబల్లి, పులివెందల, మాడుపూరు, వెలిగోడు, సంబటూరు.
4. చెళ్ళపిళ్ళస్వామి- నందలూరు.
5. చొక్కనాథస్వామి- నెలదలూరు. (నందలూరు ?)
6. నృసింహస్వామి-
   అహోబలము (పెద్ద), అహోబలము (దిగువ), కదిరి, నవనారసింహ క్షేత్రాలు, బొమ్మిరెడ్డిచర్ల, మండెము, వేదాద్రి-గరుడాద్రి.

మఱియు - ఓగునూతుల, ముదియము, విజయనగరము, శోభనగిరి.

7. యాదవనారాయణస్వామి - తిరుపతి (?)

8. రంగనాథస్వామి- శ్రీరంగము.

9. రఘురాముడు- ఒంటిమిట్ట, గుత్తి, దాసరిపల్లె, వావిలిపాడు, విజయనగరము.

10. వరదరాజు- కంచి.

11. విఠలేశ్వరస్వామి - కోయిలకుంట్ల, విజయనగరం.

12. వెంకటనాథుడు- కడప, కోసువానిపల్లె, చెంజి, పందిళ్ళపల్లి, విజయనగరం.

**అహోబలం : నృసింహస్వామి.**

కర్నూలుజిల్లా శిరివెళ్ళతాలూకా నల్లమలశ్రేణిలో గలదు. ఇచ్చట కొండ కెగువను దిగువను గూడ నృసింహస్వామియాలయములున్నవి. ఎగువ అహోబలమునే పెద్దఅహోబల మనియు నందురు. ఇచ్చటనే కంబమునందు ప్రహ్లాదవరదుడగు నృసింహస్వామి యవతరించి హిరణ్యకశిపుని వధించె నందురు. నృసింహక్షేత్రములలో నిది చాలపవిత్రమై మహిమోపేతమైనదిగా భక్తులు తలంతురు. ఇచటి స్వామిని లక్ష్మీనృసింహుండందురు. ఇక దిగువఅహోబలము నందలి నృసింహాలయము సుందరమైనది. ఇచటి స్వామిని ఉగ్రనరసింహుండందురు.

తాళ్ళపాకకవు లీయెగువ దిగువ అహోబలములందలి నృసింహస్వామిని పదులకొలది కీర్తనములందు కొండాడిరి. చిందులు పాడిరి. నరసింహవిజయమును కథలుగా కీర్తించిరి. ఈ కీర్తనములు చూడదగును- ( చూ. తాళ్ళపాకవారి సంకీర్తనముల సంపుటములు. 2-127, 239. సం. 5-13. సం. 6-93. సం. 9-23. సం. 10-29. సం. 11-13, 202, 217, 227. సం. 11-3-2).

తిరుపతికొండవలెనే వీరీ అహోబలమునుకూడ కొనియాడిరి. (సం. 9-231; 10-29 చూడదగును ).

సామంతం

**అనిశము దలచరో అహోబలం**
**అనంతఫలదం బహోబలం ॥" (9-231)**

నారాయణి

"అనాది జగమున కౌభళము
అనేకాద్భుతం బౌభళము" (10-29)

**పెద్దఅహోబిలము: నృసింహస్వామి.**

తాళ్ళపాకకవు లీయోభళమును పర్మానందమున నిట్లు కొనియాడిరి.

భల్లాట

"పెదయోభళపుగొండఁ బెరిగినిదే
వదలకఁ గొలిచితే వరము లిచ్చీని॥" (11-13)

ఈకొండమీఁదిదేవుని ప్రహ్లాదవరదుఁ డనియు లక్ష్మీనృసింహుఁ డనియు వారీ కీర్తనములందు కీర్తించిరి.

సామంతం

"ఔనయ్య జాణఁడవు ప్రహ్లాదవరదా
ఆనలు పెట్టకుము ప్రహ్లాదవరదా" (11-202)

పురాణప్రసిద్ధ మగునీక్షేత్రమం దావిర్భవించిన నృసింహస్వామివారి విజయగాథ నొకసంకీర్తనమందిట్లు తాళ్ళపాకకవులు ప్రస్తుతించిరి-

ప్రహ్లాదునిభక్తి, కంబమున స్వామి యావిర్భవించుట, హిరణ్యకశిపువధ, లక్ష్మీనృసింహుడు నెలకొనుట- మున్నగునంశములు క్రమముగ నీనరసింహ విజయసంకీర్తనమున వర్ణింపఁబడినవి.- చూ. 11-218.

నాట

"వినరయ్య నరసింహవిజయము జనులాల
అనిశము సంపదలు నాయువు నొసఁగును॥" (11-218)

అని వివరించుచు పదునొకండుచరణములతో సుదీర్ఘమగు నీకీర్తనము కథకులు బహుగతుల నాడిపాడి చెప్పఁదగినదిగా తోఁచుచున్నది. భవనాశినీనదిమూలమున పవిత్రమైన యీక్షేత్రమందలి పెద్దగుహలో గద్దెమీఁద నున్నలక్ష్మీనృసింహుని వారిట్లు వర్ణించిరి.

సామంతం

"ఇందె కలిగె నీకు నిన్నిభోగాలు
అందముగా జిత్తగించు మౌభశేశ్వరా॥" (2-237)

ఈదేవుఁ డచట వైశాఖశుద్ధచతుర్దశీశనివారమునందు సంధ్యాకాలమున నవతరించె నని వివరించుచు, నారసింహజయంతివేడుకను వర్ణించిన తాళ్ళపాకవారి కీర్తన మిది చూడుఁడు.

"నరులార నేఁడువో నారసింహజయంతి
సురలకు నానందమై శుభము లొసఁగెను॥" (11-14)

**నవనారసింహక్షేత్రములు :—**

ఆంధ్రదేశమున నృసింహక్షేత్రములు పెక్కులు గలవు. నవనారసింహ క్షేత్రము లనుపరిగణనముకూడ పలుతావుల పలుతెఱఁగులుగ నున్నట్లున్నది. మంగళగిరి, అహోబిలం, సింహాచలం, అంతర్వేది, వేదాద్రి, యాదవాద్రి, ఖాద్రి, ఆకిరిపల్లి, నగరి క్షేత్రములే నవనారసింహక్షేత్రము లని నేఁడు కొందరనుచుందురు. కాని తాళ్ళపాకవారి పరిగణనము భిన్నముగ నున్నట్లున్నది. బహుశః వా రానాఁడు తమచుట్టుపట్ల నున్నక్షేత్రములనే యెంచి పరిగణించినట్లున్నది. చూ. కీర్తనములు. ( 5-278 ); ( 10-182 ).

వీరిదృష్టిలో నున్నక్షేత్రము లివి.

1. కదిరి- ( ఖాద్రి ) లక్ష్మీనరసింహము.
2. వెంకటాద్రి- ,, ,,
3. నగరి- జ్వాలానారసింహము.
4. వేదాద్రి— యోగానందలక్ష్మీనారసింహము.
5. భార్గవూటు- ప్రహ్లాదనారసింహము.
6. మట్టెమళ్ళ- లక్ష్మీనారసింహము.
7. కానుగమాను- వరాహపులక్ష్మీనారసింహము.
8. అహోబిలము- ప్రహ్లాదనారసింహము.
9. బొమ్మిరెడ్డిచర్ల- ,, ,,

వీనిలో కొన్ని క్షేత్రములనుగూర్చి తాళ్ళపాకవారి కీర్తనము లున్నవి. చూడుఁడు.

వరాళి

"నవమూర్తులైనట్టి నరసింహము వీఁడె
నవమైన శ్రీకదిరి నరసింహము॥" (10-182)

ఇందు ఖాద్రి నృసింహుఁడు వర్ణితుఁడు.

మఱియొకటి.

నాట

"నవనారసింహా నమో నమో
భవనాశినీతర యహోబలనారసింహా" (5–278)

ఇందు అహోబిలనృసింహుఁడు వర్ణితుఁడు.

**దిగువఅహోబిలము: నృసింహస్వామి.**

అహోబిలము కొండదిగువ నున్న నృసింహస్వామిని కాఁబోలు తాళ్ళపాక వారు ఉగ్రనరసింహస్వామిగా వర్ణించి యున్నారు. "పెద్ద యౌబళ"మని వారు పేర్కొనకపోవుటచేత దిగువ అహోబిల మనియే మనము భావింపవచ్చును.

చూ. కీర్తనము.

రామక్రియ

"అల్లవాఁడే గద్దెమీఁద నౌబళపుగుహాలోన
యెల్లవారిఁ గరుణతో నేలుకొన్నాఁడు" (11-210)

అహోబిలనృసింహస్వామి కేటేట ఫాల్గునమాసమందు బ్రహ్మోత్సవము జరుగుచున్నది. అట్టి యుత్సవసందర్భమున కాఁబోలును అశ్వవాహనరూఢుఁడై యూరేగు నృసింహస్వామిని తాళ్లపాకవా రిట్లు వర్ణించిరి.

"దేవశిఖామణి దివిజులు పొగడఁగ
వేవేలు గతుల వెలసీ వాఁడే॥"

వీధుల వీధుల వెసఁదురగముపై
భేదిల బల్లెము బిరబిరఁ దిప్పుచు
మోదముతోఁడుత మోహనమూరితి
యేదెస చూచిన నేఁగీ వాఁడే ॥" (6-93)

**అహోబిలము : లక్ష్మీదేవి.**

కర్నూలుజిల్లా సిరివోలు తాలూకా నల్లమల కొండలలోని నృసింహక్షేత్ర మీ అహోబిలము. ఎగువ అహోబిలమున ప్రధానదైవత మగు నృసింహస్వామితో పాటుగ ఆ కొండచివరన నొక లక్ష్మీదేవిఆలయముకూడ గలదు. కొండమీఁది దేవుఁడు లక్ష్మీనృసింహుఁ డనియుఁ బ్రసిద్ధి యున్నది.

తాళ్ళపాకకవు లీకొండమీఁది లక్ష్మీదేవిని వర్ణించి యున్నారు. నృసింహ క్షేత్రమున్న ఈనల్లమలకు గరుడాద్రి వేదాద్రి నామములను పర్యాయములుగా తాళ్ళపాకవారు వాడి యున్నారు. "నరసింహు లక్ష్మి"ని గీర్తించిన వీరి యాకీర్త నము జూడఁదగును.

రామక్రియ

"గరుడాద్రి వేదాద్రి కలిమి యీపె
సిరులొసగీఁ జూడరో చింతామణి యీపె॥" (11-227)

**ఉద్దగిరి : కృష్ణుఁడు.**

నెల్లూరుజిల్లా ఉదయగిరితాలూకా ఉదయగిరియే యిది. ఈ గ్రామసమీప మున ప్రాచీనమగు కృష్ణదేవాలయమున్నది. నేఁడిది శిథిలమై యున్నది. ఇందుం డియే బాలకృష్ణుని విగ్రహమును కృష్ణదేవరాయలు క్రీ॥శ॥ 1514 లో తా నీదుర్గ మును స్వాధీనపరచుకొని వెడలునపుడు వెంట తీసికొని విజయనగమునకు వెళ్ళె నని పలువురు చెప్పుదురు.

తాళ్ళపాక అన్నమాచార్యుఁ డీ ఉదయగిరి కృష్ణాలయమునందలి బాల కృష్ణుని వర్ణించినాఁడు. అతనికాలమున నీ విగ్రహ మిచట చెక్కుచెదరక దర్శనీ యముగ నుండినదని తలఁపఁదగును. కనుక "వాస్తుసంవిధానము ననుసరించి యీ యాలయనిర్మాణకాలము క్రీ॥ శ॥ 16వ శతాబ్దికి పూర్వకాలమునకు పోఁజా

లదు" అను శ్రీ చీమకుర్తి శేషగిరిరావుగారి యభిప్రాయము సరికాదేమో అనిపించును. (చూ. ఆంధ్రవిజ్ఞానసర్వస్వము సం. 4-2-1331 పు.)

అన్నమాచార్యుఁ డీ అందమైన బాలకృష్ణుని వర్ణించిన కీర్తనములు రెండింటిలో నొకదానియం దాతని బాలక్రీడావిశేషములను, మఱియొకదానియం దాతని బాలచరితమును గనులఁ గట్టించెను.

8-235; 10-172 కీర్తనములు చూడఁదగును.

ముఖారి

"ఉవిదలాల చూడరే వుద్దగిరి కృష్ణుఁడు
నవకపు నెలవుల నవ్వుచున్నాఁడు॥" (8–235)

**ఊటుకూరు : చెన్నరాయఁడు.**

కడపజిల్లా రాజంపేట తాలూకాలోని ఊటుకూరునందు చెన్నరాయని దేవాలయము గలదు.

ఈ ఊటుకూరులోని చెన్నరాయనిపై చినతిరుమలాచార్యుఁ డొకశృంగార సంకీర్తనమును జెప్పియున్నాఁడు.

మాళవిగౌళ

"తియ్యనిమాటలఁ దేలించేవూ
వొయ్యారపువూటకూరిచెన్నరాయా ॥" (16-2-24)

**ఒంటిమెట్ట - రఘురాముఁడు.**

కడపజిల్లా సిద్ధవటంతాలూకా ఒట్టిమెట్టగ్రామము. దీనికే ఏకశిలానగరమను వ్యవహారము కల దని కొంద రందురు. ఇచట కొండపైనున్న శ్రీ రామాలయము మిక్కిలి పురాతనమైన దని ప్రతీతి.

ఈ ఒంటిమిట్టరఘురామునే అన్నమాచార్యుఁ డొక అధ్యాత్మకీర్తనమున వర్ణించియున్నాఁడు.

నాట

"ఇందులోనే కానవద్దా యితఁడు దైవమని
విందువలె నొంటిమిట్ట వీరరఘురాముని॥" (5-302)

**ఓగునూతుల : అహోబలేశ్వర నృసింహుఁడు.**

కడపజిల్లా కడపతాలూకాకుచెందిన చిన్నదాసరిపల్లి సమీపమున కొండ లోయలో వేఁగునూతులు గలప్రదేశ మున్నది. దానినే వేనూతులకోన వోనూతుల కోన, వోగునూతులకోన యని పలుతెరఁగులఁ బేర్కొందురు. అచ్చట నృసింహ స్వామియాలయము గలదు. ఈ ప్రాంతమందలి కొండను 'మందల పాలకొండ మల' యందురు.

అన్నమాచార్యుఁడును, చినతిరుమలచార్యుఁడు నీఓగునూతులకోనయందలి నృసింహస్వామినే కీర్తించియున్నారు. అన్నమాచార్యుని (11-80) కీర్తనమందా వోగునూతుల అహోబలేశ్వరుని యాలయసౌందర్య మంతయు రమణీయముగా వర్ణితమై యున్నది.

ఈ కీర్తనములు చూడఁదగును. 11-80; 16-18; 17-395. తాళ్లపాక వారి ప్రమేయముగల ఓగునూతుల నృసింహాలయమందలి యీ శాసనమును జూడఁదగును. నెం. 337-1938-39; కడప-కడప-చిన్నదాసరిపల్లె. అచ్యుత రాయల పాలనాకాలము (క్రీ. 1553). కొండలోయలోని నృసింహాలయము ముందున్న శాసన మిది.

ఓగునూతులపల్లె అహోబలేశ్వరాలయమునకై గండికోటసీమపాలకుని కార్యకర్త యగుబాచరసు తాళ్ళపాక తిరుమలయ్యగారియాజ్ఞ ననుసరించి దుర్గ దన్నాయనివర్తనగా సమర్పించిన వివరణముగల దీశాసనము.

లలిత

"ఆడరమ్మ పాడరమ్మ అంగనలు చూడరమ్మ
వేడుకఁ బరుష లెల్ల వీధి నుండరమ్మా॥

అల్లదిగో వోఁగునూఁతులౌ భళేశు పెద్దకోన
వెల్లి పాలనీటిజాలు వెడలే సోన
చల్లనిమాఁకులనీడ సందడిమేడలవాడ
యెల్లగాఁగ నరసింహుఁ దేగీనింతితోడ॥

సింగారపుమండపాల సింహాల మునిమంద
లంగపు తెల్లగోపుర మదె మిన్నంద

చెంగట నాళువార్లు చేరి పన్నిద్దరుఁ గొల్వఁ
సంగడి దాఁ గొలువిచ్చీ జయనరసింహము

కందువ శ్రీవేంకటేశు కల్యాణముల వేది
అందమై భూములకెల్లా నాదికి నాది
మందల పాలకొండమలకు నట్టనడుమ
విందగు దాసులతోడ విహరించీ దేవుఁడు॥" (11-80)

ఇందు దేవునియూరేగింపు వర్ణితమైనది. ఆలయమున పన్నిద్దరాళ్వారుల విగ్రహములుకూడ ప్రతిష్ఠాపితములై యుండినవి. ఉత్సవములతో వేడుకలతో పరుషల సందడితో నాయూరు ప్రసిద్ధ మహానృసింహక్షేత్రముగా పేర్వెలసినది.

**కంచి : వరదరాజస్వామి.**

చెన్నపట్టణమునకు సమీపమునఁగల సుప్రసిద్ధ వైష్ణవక్షేత్రమిది.

తాళ్ళపాకవారి కీర్తనము లీకంచివరదునిపైఁ గొన్ని యున్నవి. తంజావూరియందు లభ్యమైనతాళపత్ర గ్రంథము (D. No. 465-B. No. 11658, నందలి యీకీర్తనము చూడఁదగును. కంచివరదునే వారు పెరుందేవివరదుఁ డని పేర్కొనిరి.

ముఖారి; అటతాళం

[1]"నామనసువంటిదే నీమన సైతే నా
నోముఫల మీదేరురా ఓరి వరదా॥"

తిరుపతి ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునఁగల No. 6609 తాళ్ళపాకవారి సంకీర్తన సంచయమున పుట 200 లో -

"తెరు వెంట వచ్చే వరదరాజులును
నరులార సేవించరే మనకోరికలు మీర॥"

1. ఈ పదమునే కొందరు క్షేత్రయ్యపద మని భావించుచున్నారు. (చూ. డా॥ సీతాపతిగారు ప్రకటించిన క్షేత్రయ్య పదాలుగల గ్రంథము.) తాళ్ళపాకవారి పదము లధికముగానున్న తాళపత్రసంచయమునందలిదగుటచేత నిదియు తాళ్ళపాకవారిదే అని నాతలఁపు. పెదతిరుమలాచార్యుని దని భావింతును.

అనుకీర్తనముకూడ కంచివరదరాజునుగూర్చినదే.

**కడప : శ్రీనివాసుఁడు**

జిల్లాకేంద్రమగు కడపలో ప్రాఁతకడపయందు శ్రీవేంకటేశ్వరాలయ మున్నది.

ఈ కడపయందలి శ్రీనివాసుని అన్నమాచార్యాదులు పెక్కుకీర్తనము లందు వర్ణించిరి. అన్నమాచార్యుఁడు కడపలోని బ్రహ్మోత్సవసమయమునందలి రథోత్సవమునుగూడ వర్ణించి యున్నాఁడు. చినతిరుమలాచార్యుని కీర్తనములు గూడ నీదేవునిగూర్చి యున్నవి.

ఈ సంకీర్తనములు చూడఁదగును.

సం. 3-234, 235, 236, 580. సం. 8-90, 93. సం. 15-245. సం. 16-2, 7, 86. సం. 17-45, 290, 291, 417, 501, 563.

పై సంకీర్తనములనుబట్టి తాళ్ళపాకవారు కడపలోఁ గొంతకాల ముండి కడపరాయని ప్రత్యక్షముగ సేవించినట్లు తోఁచును.

ఈ దైవమును వీరు కడపరాయఁ డనియు, వేంకటాద్రి కడపరాయఁ డనియు పేర్కొనిరి. ఒకచో స్పష్టముగ నిట్లనిరి.

'తటకన నన్నుగూడే దయ నీకు లేకుండితే
ఘటన నెదురుకొని కాఁగిలింతువా
యిటువలె శ్రీవేంకటేశ కడపలోన
నటల కెవ్వతో నిన్నుచండిచేనెఁ గాక' (17-563)

కడపలో రథోత్సవము. చూ. కీర్తనము.

సాళంగనాట

"కన్నులపండుగలాయ కడపరాయనితేరు
మిన్ను నేల శృంగారము మితిమీరినట్లు॥" (8-93)

**కదిరి : లక్ష్మీనారసింహము.**

అనంతపురముజిల్లా, కదిరితాలూకా, కదిరి. ఈ గ్రామమునకే ఖాద్రి యని

పౌరాణికనామము. ఖాద్రి అను నామముగల వృక్షమునీడను చీమలపుట్టలో లక్ష్మీనృసింహస్వామి యావిర్భవించెను గావున తన్నగరమునకు ఖాద్రి యని పేరైనట్లు పెద్దలు చెప్పుదురు.

తాళ్ళపాకవారీ కదిరి నృసింహస్వామిని లక్ష్మీనృసింహస్వామిగా కీర్తించియున్నారు. ఈ కీర్తనములు చూడఁదగును.

సం. 10-32, 182 ; సం 16-37 ; సం. 16-2-38, 58.

అన్నమాచార్యుని కీర్తనములం దీదేవుఁడు లక్ష్మీనృసింహుఁడుగామాత్రమే ప్రస్తుతుఁడు.

కాని చినతిరుమలార్యుని అధ్యాత్మకీర్తనమం దీనృసింహుఁడు "పెందుగా నాగముపాల వెలసినవాఁ"డని యున్నది. పాముపుట్టలో వెలసె నని భావము.

సాళంగనాట

"తన దాసునికొఱకు ధరియించె నీరూపము
దినదినవేడుకఁ గదిరి నారసింహము॥" (16-37)

**కలశాపురము : హనుమంతుఁడు.**

కళసాపురమే కలశాపుర మై యుండును.

"కళసాపురప్రాంత కదళీవనాంతర ద్రాక్షా లతాఫలస్తబకములకు" అన్న శ్రీనాథుని సీసపద్యపాదమున ప్రసిద్ధిగన్నగ్రామ మిదియే కాఁదగును.

ఈ గ్రామమందలి ఆంజనేయస్వామిని తాళ్ళపాకవారు భక్తితోఁ బలు కీర్తనములందు కొనియాడిరి. తోక పైకెత్తుకొని, చేతఁ బండ్లగెలలు పట్టుకొని పెరిగి పెద్ద జంగ చాచిన శ్రీరామునిబంటును వీరు దర్శనీయముగఁ జిత్రించిరి. కలశాపురము పండ్లతోటలతో ప్రసిద్ధి గాంచినది కాఁబోలును.

సం. 5-182, సం7-113; సం. 8-148,232; సం.9-13, 214, 232; కీర్తనములు చూడఁదగును. ఒక్క కీర్తనము నుదాహరింతును.

సాళంగనాట

"అవధారు దేవ హరికులరామ
వివిధమైన నీబంటు వెలయుచున్నాఁడు॥" (8-144)

**కుఱునూతుల : చెన్నుఁడు.**

గుంటూరు జిల్లా, గుంటూరుతాలూకా, కుఱునూతుల గ్రామము. ఈ కుఱు నూతులయందలి చెన్నరాయనిగూర్చియే కావచ్చును తాళ్ళపాకవారి కీర్తన మున్నది.

తిరుపతి ప్రాచ్య లిఖిత పుస్తకభండారమునగల నం. 6609 తాళ్ళపాక వారి సంకీర్తన సంచయమునందలి పుట 58 లోని శంకరాభరణరాగకీర్తనము 'వేడుకొంటి' అనునది అక్కడి చెన్నరాయని గూర్చినదే.

**కోన : చెన్నరాయఁడు.**

కడపజిల్లా, కడప తాలూకాలోని నందిమండలమునకు దక్షిణమున 'పాలకొండ' పర్వతమందలి కోనలో చక్కని యూటలుగల ప్రదేశమున్నది. ఆ కోనలో చెన్నకేశవస్వామియాలయము గలదు.

అందమైన యీకోన చెన్నరాయనిమీఁద తాళ్ళపాక అన్నమార్య, చిన తిరుమలార్యులు శృంగారకీర్తనములు చెప్పియున్నారు. ఆదేవుఁడుకూడ అంద గాఁడై అందరిని వలపించి వశముచేసికొనువాఁడే. ఆతని వలపువలలోఁ జిక్కు కొన్న తాళ్ళపాకవారి యీకీర్తనము లరయఁదగును.

సం. 16- 19, 62, 68; సం. 17- 423.

అహిరి

"మిక్కిలి నేరుపరివి మేలు మేలోయి
గుక్కనివలపుల వోకోనచెన్నరాయ॥" (16-2-19)

**కోయిలకుంట్ల : విఠలేశ్వరుఁడు.**

కర్నూలుజిల్లా. కోయిలకుంట్ల తాలూకా, కోవిలకుంట్లయే కావలెను. ఇచటి పాండురంగస్వామివారికి వైశాఖమాసమున గొప్ప యుత్సవము జరుగును.

ఈ గ్రామమందలి దైవతములను తాళ్ళపాకవారు కీర్తించియున్నారు.

చినతిరుమలార్యుఁ డచటి విఠలేశ్వరుని వర్ణించినాఁడు 'పండరంగి విఠల' నామము తోనే ఆదేవు నీతఁడు పేర్కొనినాఁడు.

సాళంగనాట

"రచ్చ కెక్కితివి పండరంగవిఠలా
పచ్చిదేరే వింతలోనే పండరంగివిఠలా॥" (16-2-27)

**కోవిలకుంట్ల : గోపాలకృష్ణుఁడు.**

కర్నూలుజిల్లాలు, కోవిలకుంట తాలూకాకేంద్రమగు కోవిలకుంట్లయే కాఁదగును.

ఈ గ్రామమునందలి గోపాలకృష్ణవిగ్రహమునే తాళ్ళపాక చినతిరుమలార్యుఁడు వర్ణించుకొనినాఁడు. ఆ కీర్తనమున నాయకుఁడు గోపాలకృష్ణుఁడు. నాయిక తానే.

శంకరాభరణము

"చెల్లె నీవు చేసినట్టి చేతలెల్లాను
కొల్లవై కొమకుంట్ల గోపాలకృష్ణుఁడా॥" (16-2-28)

**కోసువానిపల్లె : వెంకటనాథుఁడు.**

కడపజిల్లా, జమ్మలమడుగు తాలూకాయందొక 'కోసనేపల్లె' కలదు. కోసు వానిపల్లెయే 'కొసునేపల్లె' యైనదేయో ! ఇదికాక చిత్తూర్ జిల్లా యందొక 'కోసు వారిపల్లె' కలదు. మఱియు కర్నూలు జిల్లా ధోన్ తాలూకాలో నొక కోసనేపల్లి కలదు (ఆంజనేయస్వామి).

వీనిలో నే గ్రామమో తెలియదుకాని కోసనేపల్లెలోని వెంకటనాథుని తాళ్ళ పాక చినతిరుమలయ్య కీర్తించినాఁడు కడపమండలమునందలి కోసనేపల్లె యందు ప్రసిద్ధమగు సింగరయ్యస్వామి యాలయము గలదు. వీరి కీర్తనమున 'కోసువానిపల్లె వేంకటనాథా' అని కలదేగాని దైవముపేరు విడిగా చెప్పఁబడి యుండలేదు. కాని అందలి విషయము మాత్రము ఆంజనేయస్వామికి సంబంధించినది కాదు. వెంకటనాథునియాలయ మచట నుండెనేమో !

ఈ కీర్తనములు చూడఁదగును. సం. 16-2-71, 75.

సామంతం

"ఈదేర వలదితే యేపని సేయఁగరాదు
యేడనైనా యెగ్గుసిగ్గు లెంచేరా భూమిని॥" (16-2-75)

**గండవరము : గోపాలుఁడు.**

గండవరము, గుండవరము అనుపేర్లుగల గ్రామములు నెల్లూరు, గుంటూరు మండలములం దున్నవి. నెల్లూరు జిల్లాలో నొక గండవరము కలదు. గుంటూరుజిల్లా గుంటూరు తాలూకా ఉంగుటూరు సమీపమున నొక "గుండవర" ముండినట్లు శాసనాధారమున్నది దానికే "వామన గుండవర"మని మఱియొక పేరు. ఈ వామనగుండవరము తాళ్ళపాకవారికిఁ జెందిన యగ్రహారము.

గండవరపు గోపాలుని మీఁద తాళ్ళపాకి వారి లాలిపాట సుప్రసిద్ధమైన దొకటి కలదు. ఈ లాలినిగూర్చి శ్రీ ప్రభాకరశాస్త్రిగా రిట్లు వ్రాసియున్నారు. ఈ లాలిపాట యందు "గండవరపు గోపాలుని నామాంకమున్నది. కాని శ్రీ వేంకటేశ్వర స్వామి నామాంకము గానరాదు. అన్నమయ్యాపే రందు లేకపోయి నను గండవరము తాళ్ళపాకవారికిఁ జెల్లుచు వచ్చిన గ్రామ మని తెలియుటచే దమయూరి స్వామిమీఁద నన్నమాచార్యుఁడో తత్పుత్ర పౌత్రులో దానిని రచించి యుందు రనుకొంటిని." (అన్నమాచార్య చరిత్ర పీఠిక. పు. 63)

తాళ్లపాకవారికి చెందినగ్రామము "గుండవరము"గాని గండవరము కాదు. ఆ గ్రామమునకు వారు వేయించుకొనిన సరిహద్దుశిలలపై వామనుని చిత్రములు గలవు. (మా. 182-1916-17) "వామన గుండవర"మను వ్యవహార మాగ్రామ మునకు గలదనుట కా శిలాశాసనమే సాక్ష్యము. తాళ్ళపాకవారికీర్తనమున 'బాల గండవరపు గోపాలా' అని యున్నది. ఆ 'వామనగుండవరమే' యీ 'బాలగండ వర'మేమో ! గండవర, గుండవరనామము లభిన్నములై యుండును. గుంటూరు జిల్లాలోని "గుండవరము"నందలి బాలగోపాలునే తాళ్ళపాకవారు కీర్తించియుందు రని తలఁతును.

శ్రీరాగం — జంపెతాళం

"లాలనుచు నూచేరు లలన లిరుగడల
బాలగండవరగోపాల నినుఁ జాల॥"

(D. నం. 465., B. నం. 11658)

**గుత్తి : రఘురాముఁడు.**

అనంతపురం జిల్లా, గుత్తి తాలూకా, గుత్తిదుర్గము. ఈ గుత్తి గ్రామమున వెలసిన రఘురాముని అన్నమాచార్యుఁడు వర్ణించి యున్నాఁడు. రాముని చరిత్ర మీ సంకీర్తనమున సంగ్రహముగ చెప్పఁబడి యున్నది.

పాడి

"సౌమిత్రిసహోదర దశరథరామా
చేముంచి గుత్తిలో వెలసినరఘురామా ॥" (9-210)

**చాగలమఱ్ఱి : చెన్నుఁడు.**

కర్నూలుజిల్లా చాగలమఱ్ఱిగ్రామము. ఈ గ్రామమందలి చెన్నకేశవస్వామి మీఁద అన్నమాచార్యుఁడు శృంగారసంకీర్తన మొకటి చెప్పియున్నాఁడు.

సామంతం

"సిగ్గుగల యాఁడదైతే జేరవచ్చునా?
వొగ్గి నేకాఁగా నీతో నొక్కటైతిఁ గాక॥" (3-567)

**చెప్పల్లి : చెన్నరాయఁడు.**

కడపజిల్లా, కమలాపురముతాలూకా, పెద్దచెప్పల్లిగ్రామము అన్నమాచార్యుఁడీ చెన్నరాయనిపై నొక శృంగారసంకీర్తనము చెప్పియున్నాఁడు. శృంగార పురుషుఁడును, మదనమోహనుఁడును నగు పెద్ద చెన్నరాయనితోడి సంభోగ శృంగార మీ కీర్తనమున వర్ణిత మగు విషయము.

శంకరాభరణము

"వరుసకు మాపటంత వచ్చేఁగాని
గెరసు దాఁటకు వోయి కేశవరాయ॥" (13-307)

**తిరుపట్ల ; మదనగోపాలుఁడు.**

తాళ్ళపాకవారి సుప్రసిద్ధమగు జోలపాట 'జోవచ్యుతానంద జోజోముకుంద' యనునది అన్నమాచార్యనామాంకముతో నుండుటను శ్రీప్రభాకరశాస్త్రి

గారు తొలుత గుర్తించినారు[1] (చూ. అన్నమాచార్యచరిత్ర పీఠిక పు. 62.) అందు స్వామివాహాంకము లేదు. తిరుపట్లమదనగోపాలునిపేర నాపద మున్నది.

"జోవచ్యుతానంద జోజో ముకుంద
రావె పరమానంద రామగోవింద ॥
అంగజుని గన్నమాయన్న యిటు రారా
బంగారుగిన్నెలో పాలు వోసేరా
దొంగ నీ వని సతులు పొంగుచున్నారా
ముంగిట నాడరా మోహనాకారా॥
అంగుగా తాళ్ళపాకన్నయ్యచాల
శృంగారరచనగాఁ జెప్పె నీ జోల
సంగతిగ సకలసంపదలు నీవేళ
మంగళము తిరుపట్ల[2] మదనగోపాల॥

## నల్లబల్లి : చెన్నుఁడు.

కడపజిల్లా కమలాపురము, పులివెందల తాలూకాలలో చెన్నకేశవాలయములు పలుగ్రామములందు కలవు- నల్లబల్లి ఆప్రాంతములందలిదేమో !

కేశవస్వామినే చెన్నుఁ డని, చెన్నరాయఁ డని, చెన్నకేశవుఁ డని, ఆదికేశవుఁ డని, పలుతెఱఁగులఁ దాళ్ళపాకకవులు పేర్కొనిరి. నల్లబల్లి గ్రామమునందలి చెన్నకేశవుని అన్నమాచార్యుఁడు భక్తితోఁ గొండాడినాఁడు. కొలువుఁ డని పలువుర నుద్బోధించినాఁడు.

సం. 10–168, 282 కీర్తనములు చూడఁదగును.

శ్రీరాగం

"నల్లబల్లి చెన్నుఁడు నాపాలిటి వెన్నుఁడు
యెల్లజీవులకు మఱి యిన్నిటాఁ బ్రసన్నుఁడు॥" (10-168)

---

1. శ్రీవిస్సా అప్పారావుగారి యింట వారి పూర్వులు వ్రాసి యుంచుకొన్న మంచి సంకీర్తనముల సంచయములోనిది. చిరంజీవి తి. కోదండ రామయ్య ఆంధ్ర 8-9-48 వారపత్రికలోఁ బ్రకటించెను.

2. ఈ పదమున "తిరుపట్ల" అని యున్నపట్టున పితృపాదులు శ్రీ ప్రభాకరశాస్త్రి గారు "పుదుపట్ల" కాదగునా అని ప్రశ్నార్థ చిహ్నము నుంచిరి. పుదిపట్ల చిత్తూరు జిల్లా చంద్రగిరి తాలూకాలో గలదు.

**నెలదలూరు : చొక్కనాథస్వామి.**

కడపజిల్లా రాజంపేటతాలూకాలో నందలూరు కలదు. ఆ గ్రామమున బాహునదీ (చెయ్యేరు) తీరమున చొక్కనాథస్వామి యాలయము కలదు. ఈ యాలయమునకే పొత్తపినాటిసీమలోని ప్రోలినాడు వెంబాక, తాళ్ళపాక, ఒంగు టూరు, ఓపిలి గ్రామములందలి ప్రముఖులు కొందరు చేరి దానధర్మములు గావించిరి. (చూ. No. 606-1907-08. S. I. Epi. Rep.)

తాళ్ళపాకవారు పేర్కొన్న నెలదలూరు బహుశః పై నందలూరే కాఁదగును లోకల్ రికార్డ్స్‌లోకూడ నీ విషయ మిట్లే భావింపఁదగిన ఆధారములున్నవి.

చినతిరుమలాచార్యుఁడు నెలదలూరిచొక్కనాథునిపై నొక శృంగారసంకీర్తనము చెప్పియున్నాఁడు. అన్నమాచార్యునిదిగా శృంగారకీర్తన మొకటి (3-237) చొక్కనాథునిపై నున్నది. అదియు నీనెలదలూరి దైవమునే పేర్కొనునదేమొ తెలియదు.

మలహరి

"చుల్లరవెట్టుఁజేఁతల చొక్కనాథుఁడు
వుల్లములో నీ నెలదలూరిచొక్కనాథుఁడు॥" (16-20)

**పండరంగి : విఠలేశ్వరుఁడు.**

బళ్ళారి జిల్లా, హోస్పేట తాలూకా, తుంగభద్రానదీతీరమునందలి హంపీ క్షేత్రమున విఠలేశుని యాలయ మున్నది.

విఠలేశుని తాళ్ళపాకవారు పలుకీర్తనములలోఁ గీర్తించిరి. తిరుపతి, విజయనగరము, కోవిలకుంట్ల మున్నగుతావులందు గల విఠలేశుని వర్ణించినట్లే వీ రిందు పండరంగివిఠలుని యాకృతిసౌభాగ్యమును గూడ వర్ణించిరి. 6-217; 12-218; 17-427; కీర్తనములు చూడఁదగును.

బౌళిరామక్రియ

"వసుధఁ జూడఁ బిన్నవానివలె నున్నవాఁడు
వెస నన్నివిద్యలాను వెలసె విట్ఠలుఁడు॥" (6-217)

**పందిళ్ళపల్లె (?) : ప్రసన్నవేంకటేశ్వరుఁడు.**

గుంటూరు జిల్లా బాపట్లతాలూకాకు చేరిన పందిళ్ళపల్లెయందు ప్రసన్నవేంకటేశ్వరస్వామి యాలయము గలదు. అచటిదైవమునే కావచ్చును. తాళ్ళపాకవారు కీర్తించినారు.



నెలదయారు శ్రీ చొక్కనాథస్వామి [పుట 296]

# తాళ్ళపాకవారు తిరిగిన ప్రదేశములు: (చూ.పుట 277)



1. తిరుమల-తిరుపతి
2. చంద్రగిరి
3. వాయల్పాడు
4. ఊటుకూరు (నెల్లూరు)
5. నెల్లూరు
6. ఉదయగిరి
7. టంగుటూరు
8. సుంకేసుల (ప్రకాశం)
9. ఎఱ్ఱగొండపాలెం
10. దంతలూరు
11. మంగళగిరి
12. వెలుగోడు
13. యాగంటిపల్లె
14. కోయిలకుంట్ల
15. అహోబిలం
16. బాగలమఱ్ఱి
17. గుత్తి
18. పామిడి
19. పెన్న అహోబిలం
20. గార్లదిన్నె
21. కదిరి
22. పులివెందల
23. సుంకేసుల (కడప)
24. గండికోట
25. పాలగిరి
26. దాసరిపల్లె
27. పుష్పగిరి
28. కడప
29. ఊటుకూరు (కడప)
30. ఒంటిమిట్ట
31. నందలూరు
32. రాయచోటి
33. రాజంపేట
34. తాళ్ళపాక
35. ఈమని



తిరుపతిలోని తాళ్ళపాకవారి సంకీర్తనల రాగిరేకు. చూ. పుట 64

గుంటూరు జిల్లా పందిళ్ళపల్లియేకాక కడపజిల్లా కమలాపురంతాలూకాలోఁ గూడ నొక పందిళ్ళపల్లె కలదు. ఇఁక ప్రసన్న వేంకటేశ్వరాలయములు కడప జిల్లా కడప తాలూకా మాసపేటలోను, కర్నూలు జిల్లా ఆళ్ళగడ్డ తాలూకా మద్దూరులోను, చిత్తూరుజిల్లా పుత్తూరుతాలూకా పతి పుత్తూరులోను కూడ గలవు.

పలుతావుల వెలసిన వేంకటేశ్వరస్వామిని భక్తజనులు పలువిధముల కొనియాడుదురు. తిరుపతిలోని శ్రీనివాసుఁడే అలమేలుమంగాపురమున 'కల్యాణ వేంకటేశ్వరుఁడు'గాను విజయనగరమున 'కోనేటి వేంకటేశ్వరుఁడు' గాను, కడపలో 'కడపరాయఁడు'గను, కీర్తింపఁబడుచున్నాఁడు. పందిళ్ళపల్లెలోని దైవము ప్రసన్నవేంకటేశ్వరస్వామి. తాళ్ళపాకవారీ దైవమును గీర్తించిరేగాని యూరి పేరు పేర్కొనలేదు. అయినను సాన్నిహిత్యమునుబట్టి పందిళ్ళపల్లెలోని దైవమునే వీరు వర్ణించినారని తలఁపవచ్చును.

చినతిరుమలాచార్యుని దీకీర్తనము.

నాదనామక్రియ

"వేవేలచేతులవాఁడు వీఁడె వీఁడె
దేవుఁడుగదె ప్రసన్నతిరువెంగళప్పుఁడు॥" (16-2-29)

**బొమ్మిరెడ్డిచెర్ల(?) : ప్రహ్లాద నారసింహము.**

ఈ గ్రామమునందలి ప్రహ్లాద నారసింహుని మోహనశృంగారరూపమును అన్నమాచార్యుఁ డొక శృంగారకీర్తనమున వర్ణించి యున్నాఁడు.

గౌళ

"కొమ్మలాల యిదె మంచికొలువువేళ
చిమ్ముచు విన్నపాలెల్లఁ జేయరే యిప్పుడు॥" (13-4)

**మంగాంబుధి : హనుమంతుడు.**

అంబుధి, సముద్రము అను నంతములుగల గ్రామనామము లగ్రహారములుగా కొన్ని యున్నవి. మన్నసముద్ర మున్నది. ఈ మంగాంబుధి (మంగ సముద్రము) యెచ్చట నుండిన గ్రామమో తెలియరాదు. తాళ్ళపాకవారీ గ్రామమునందలి యాంజనేయస్వామిని స్తుతించిరి.

చంద్రగిరిసమీపమున నున్న మంగాపురము అలమేలు మంగాంబపేర ప్రఖ్యాతి గాంచిన తాళ్ళపాకవారి యగ్రహారము. మంగాంబ సముద్రరాజతనయ గావున మంగాపురమే మంగాంబుధి యగునేమో ! నేటి మంగాపురమ్మున నాంజనేయస్వామి విగ్రహములు లేకపోలేదు.

'మంగాంబునిధిహనుమంత నీ వేకాలము
చెంగట శ్రీవేంకటాద్రి శ్రీరామరతి॥' (11-164)

'బలిమి శ్రీవేంకటేశుబంటై మంగాంబుధి
నిలయహనుమంతనీ కెదురా॥' (11-163)

'అల శ్రీవేంకటపతి యండనె మంగాంబుధి
నిలయపుహనుమంత నెగడితిగా॥' (11—163)

అను తాళ్ళపాకవారి వర్ణనలు తిరుపతికొండ దిగువ చంద్రగిరికడ నున్న మంగాపురాగ్రహారమునే సూచించుచున్న వేమో అనుకొందును.

చూ. కీర్తనములు 11-163, 164, 167.

పాడి

"ఒక్కఁడే యేకాంగవీరుఁ డుర్వికి దైవ మైనాఁడు
ఎక్కడా హనుమంతుని కెదురా లోకము॥"

**మండెము · నృసింహస్వామి.**

కడపజిల్లా రాయచోటితాలూకా చిన్నమండెము.

ఈ గ్రామమునందలి నృసింహస్వామిని తాళ్ళపాకవారు మండెము నృసింహుఁ డనియు, మండెమురాయఁ డనియుఁ పలుకీర్తనములందు వ్యవహరించినారు. ఈ కీర్తనములు చూడఁదగును.

3-94; 5-162; 13-229; 16-34, 35. 66, 74, 88.

వీనియందు మండెమురాయఁడు తాళ్ళపాకవారితో చనవున సరసాలాడినట్లును, క్రీడలకుఁబిగినట్లును వర్ణితమై యున్నది. వీరికీర్తనములందు కొన్ని మండెమురాయనిమీఁది చిందులుకూడ నున్నవి. మండెమునరసింహస్వామిని వీరు

"నవమూర్తినారసింహుఁ"డని కీర్తించిరి. కదరి నరసింహునిపలెనే యీదేవు డును నవనారసింహులస్వరూపము గలవాఁ డని భావము.

సామంతం

"నగధర నందగోప నారసింహా వో
నగజవరద శ్రీనారసింహా॥
నరసింహ పరంజ్యోతి నారసింహా వీర
నరసింహ లక్ష్మీనారసింహా
నరసఖ బహుముఖ నరసింహా వో
నరకాంతక జేజే నారసింహా॥
నవరసాలంకార నారసింహా వో
నవనీతచోర శ్రీనారసింహా
నవగుణి వేంకటనారసింహా వో
నవమూర్తి మందెము నారసింహా॥" (5–162)

**మాడుపూరు — చెన్న కేశవుఁడు.**

కడపజిల్లా సిద్ధవటముతాలూకాలో నీగ్రామము కలదు.

అన్నమాచార్యుఁడు మేనమామగారియూరగు "మాడుపూరు"నందలి మాధవుఁ డగుచెన్నకేశవస్వామిని గీర్తించినాఁడు. ఆధ్యాత్మకీర్తనసుం దాదేవుని బాలక్రీడావిశేషములను, శృంగారపదమునం దాలక్ష్మీరమణుని లీలావినోదమును గవి చిత్రించినాఁడు. ఈ పదములలోఁ దాళ్ళపాకవారు మాడుపూరిలక్ష్మిని గూర్చి కూడకీర్తనలు రచించినట్లు తెలియుచున్నది. చూ.

'కోపగించుకొన్నవేళ కోరి నీవు మోహించిన
ఆపెపై నానవెట్టితే నట్టే మానేవు
పైపై నాపెమీఁది పదములు వాడితేను
మాపుదాకా పరాకెల్ల మానుదువుగా నీవు' (13-47)

చెన్న కేశవుని బాలక్రీడా వినోదముల నీకీర్తనమున విలకింపుఁడు.

పాడి

'చేరి యందెలమ్రోతతో చెన్నకేశవా
యీరీతి మాడుపూరిలో నిట్లాదేవా॥

మున్ను యశోదవద్దనుముద్దు గుని సాడితివి
పన్ని రేపల్లెవీధుల( బారాడితివి
విన్నవై గోపాలులతో( బిల్లదీపు లాడితివి
యెన్నిక మాడుపూరిలో నిట్లాడేవా॥' (8-179)

**మతంగాద్రి : పెద్ద హనుమంతుఁడు.**

బళ్ళారి జిల్లా, హొస్పేట తాలూకా, హంపీ ప్రాంతము.

మతంగాద్రి బిలమువాతనున్న ఈ పెద్ద హనుమంతుని తాళ్ళపాకవారు కీర్తించినారు. ఈ దేవుఁడును విజయనగరపు( బెద్ద హనుమంతుఁడు నభిన్నులే. "మతంగపర్వతమాడ మాల్యవంతము నీడ- అతిశయిల్లిన పెద్ద హనుమంతుఁ డతఁడా" (6-223) అని వీరే విజయనగరపు హనుమంతుని వర్ణించుచు పేర్కొనిరి.

ఈ కీర్తనము చూడఁ దగును.

హంపీ క్షేత్రమున కిటునటు మతంగమాల్యవంతము లున్నవి. ఆ నడుమ గల "పెద్ద హనుమంతుఁడు" విజయనగరపు దేవుఁడే.

ప్రతాపనాట

"ఏమని నుతింపవచ్చు నితనిరూపము
భీమవిక్రముఁ డితఁడు పెద్దహనుమంతుఁడు॥ " (7-116)

**మతంగాద్రి : వేంకటేశ్వరుఁడు.**

బళ్ళారిజిల్లా హొస్పేతాలూకా హంపీప్రాంతము.

"మతంగపర్వతము, మాల్యవంతము నడుమ సతమై శ్రీవేంకటేశ్వరుఁ డున్నవాఁడు" అని తాళ్ళపాకవా రీదేవుని వర్ణించిరి. తుంగభద్రాతటమున చక్కనిపువ్వులతోటలనీడలో- కనకమయములైన ఘనమైనమేడలలో- నీవేంకటేశ్వరుఁడు వినుతికెక్కినాఁడట- విజయనగరమందలి కోనేటివేంకటేశ్వరుఁడు నీమూర్తియు నభిన్నులనుకొందును.

లలిత

"మతంగపర్వతము మాల్యవంతము నడుమ
సతమై శ్రీ వేంకటేశ్వరుఁ డున్నవాఁడు ॥

శరణన్నవారికి చనవిచ్చి రక్షించి
గరిమఁ బూజించువారిఁ గరుణఁ జూచి
పరిపూర్ణ మగు తుంగభద్రాతటమునందు
విరివిగొన్నవాఁడు శ్రీ వేంకటేశ్వరుఁడు॥" (10-167)

**ముడియము:— నృసింహస్వామి.**

కడపజిల్లా జమ్మలమడుగుతాలూకాలో కుందేరు నదియొడ్డున పెద్దముడియము కలదు. అచట ప్రాచీనాలయములు కొన్నియున్నవి. వానిలో నొకటి శ్రీనృసింహస్వామియాలయము.

అన్నమాచార్యుఁ డీముడియము నారసింహునిపై నొక శృంగార కీర్తనమును జెప్పియున్నాఁడు. వర్ణనమునుబట్టి యాదేవుఁడు లక్ష్మీ నృసింహుఁ డగునని తలఁపవచ్చును.

సాళంగనాట

"జయమాయ నీకు నాపె సరసములూ
నయగారి ముడియము నారసింహా॥" (17-139)

**వావిలిపాడు : శ్రీరామచంద్రుఁడు.**

చిత్తూరుజిల్లా వాయిల్పాడు గ్రామమే వావిలిపాడు.

తాళ్ళపాక అన్నమాచార్యుఁ డొక అధ్యాత్మసంకీర్తనమును, చినతిరుమలాచార్యుఁడు రెండు శృంగార సంకీర్తనలు (16-67; 70) వావిలిపాటి శ్రీరామచంద్రునిమీఁద చెప్పియున్నారు.

పాడి

"రావయ్య వావిలిపాటి రామచంద్ర
రావాడి వలపులు రామచంద్ర ॥

మూఁగిన సభలలోన ముంచిమాటలాడఁగాను
రాఁగెఁగా నీమోవికెంపు రామచంద్ర
మాఁగిన మాటలనె మర్మము లెత్తితినని
రాఁగతనాలు మానుమా రామచంద్ర॥" (16-67)

**విజయనగరం : రాఘవుఁడు.**

బళ్ళారిజిల్లా, హోస్పేట తాలూకా, హంపీ విజయనగరము. ప్రాచీన హంపీ శిథిలములందు ప్రసిద్ధము లగు రామాలయములు కొన్ని యున్నవి. వానిలో హజారరామాలయ, పట్టాభిరామాలయములు క్రీ॥ 1513; 1530 ప్రాంతములందు కట్టఁబడిన పని యందురు. ఇవి కాక కోదండరామాలయ మింకొకటి యున్నది. ఇంక నెన్ని యుఁడినవో! తాళ్ళపాక అన్నమాచార్యుఁడు విజయవగరమందలి కోదండరాముని పలుకీర్తనములలోఁ గీర్తించినాఁడు. క్రీ॥ 1503 నకుఁ బూర్వ ముండిన అన్నమాచార్యుఁడు ప్రస్తుతించిన రఘురామాలయము నేటి హంపీ శిథిలములలో నేదియగునో! ఈ రఘురాముని అన్నమాచార్యుఁడు "కోనేటి దండవాఁ డనియు "విజయనగర పురవరవిహార పుండరీకాక్షుఁ" డనియు "తారక బ్రహ్మ మనియు, "విజయనగరాధీశుఁ" డనియు, "శరణాగతవజ్రపంజరుఁ" డనియు ప్రస్తుతించినాఁడు. ఈ కీర్తనములు చూడఁదగును.

5-217; 8-233; 10-274; 11-176, 219.

మాళవిగౌళ

"అదె లంక సాధించె నవనిభారము దించె
విదితమై ప్రతాపము వెలయించె నితఁడు ॥

శరణాగతవజ్రపంజరుఁ డితఁడు
సరిలేని యసురభంజకుఁడితఁడు
వరదుఁడు శ్రీ వేంకటేశ్వరుఁ డితఁడు
అరయ విజయనగరాధీశుఁ డితఁడు॥" (11-219)

**విజయనగరం : కోనేటి వేంకటేశ్వరుఁడు.**

విజయనగరమునందలి శృంగారవనమున "కోనేటి వేంకటేశ్వరు"ని తాళ్ళపాకవారు కీర్తించిరి.

రామక్రియ

"యితవు చేసినవారికిది పాటి యమ్మలాల
కతలు చెప్పఁగాఁబోతే కాక రేగీ నితఁడు॥" (3-583)

**విజయనగరము : నృసింహస్వామి.**

విజయనగరమున తుంగభద్రా దక్షిణతీరమున హంపీ శిథిలములలో హజారరామాలయమునకు పశ్చిమముగానున్న యావరణములో పెక్కు దేవతలతో పాటుగా 22 అడుగుల ఎత్తయిన ఏకాంతపురాతి నరసింహవిగ్రహ మున్నది. (చూ. హంపీ శిథిలములు విజ్ఞానసర్వస్వము 3-1-1299)

ఈ నృసింహస్వామినే కాంభోలును అన్నమాచార్యులు "తుంగభద్ర తటమున చలువబండల మీఁద చక్కని కొండలదండ అలరీని వీరనరహరి వీఁడే" అని వర్ణించి యున్నాఁడు. చూ. కీర్తనము 11-217. మఱియు నందే "పువ్వుల తోటలనీడ భువనేశ్వరమాడ" అనియు నున్నది. హంపీలోని హజారరామాలయము సమీపమున భువనేశ్వరీదేవి గుడి యొకటి ప్రాచీనమైనది గలదు. ఇందలి "భువనేశ్వర" ప్రశంస దానికి సంబంధించిన దేమో :

బౌళి

"సులభుఁడై వున్నాఁడు సుగ్రీవనారసింహుఁడు
నెలకొన్న దాసులకు నిధానము వీఁడే॥" (11-217)

**విజయనగరము : పెద్ద హనుమంతుఁడు.**

ఈ విజయనగరమందలి హనుమంతుని పెద్ద హనుమంతుఁ డనియు, నుగ్రహనుమంతుఁ డనియు, తాళ్ళపాకవారు పేర్కొనిరి. రామాయణ కథలో నీహనుమంతుఁడు నిర్వహించిన పాత్రను వీరు చక్కఁగా పలుకీర్తనములలోఁ జిత్రించినారు.

6-223; 9-230; 10-85 కీర్తనములను జూడఁదగును. మచ్చున కొక్కటి ఉదాహరింతును.

రామక్రియ

"అన్నిటా నేరుపరి హనుమంతుఁడు
పిన్ననాఁడే రవి నంటె పెద్దహనుమంతుఁడు॥

త్రిజగములలోపల దేవతాసంఘములోన
అజునిపట్టాన నిల్చె హనుమంతుఁడు

విజయనగరాన శ్రీవేంకటేశు సేవకుఁడై
భుజబలుఁడై యున్నాఁడిప్పుడు హనుమంతుఁడు॥"
(8-138)

**విజయనగరము : బాలకృష్ణుఁడు.**

శ్రీకృష్ణదేవరాయలు క్రీ॥ 1514లో ఉదయగిరి దుర్గమును గజపతుల నుండి వశముచేసికొని వచ్చునపు డొక బాలకృష్ణవిగ్రహమును వెంట దెచ్చుకొని నట్లుగా శాసనాధారము లున్నవి.

తాళ్ళపాకకవు లీతుంగభద్రా తీరమునందలి బాలగోపాలకృష్ణుని శృంగార లీలలను మనసార పాడుకొనిరి. 16-82, 17-121 కీర్తనములు వీరివి చూడఁదగును. వీనిలో "పడుచుఁజేఁతలు గావు బాలకృష్ణుఁడు" అనుకీర్తనమున తుంగభద్రదరినున్న బాలకృష్ణుఁడే వర్ణితుఁడు. తాళ్ళపాకవారు విజయనగరమును వర్ణించునపుడు "తుంగభద్రదరి"యనియుఁ బేర్కొందురు. కావున విజయనగరమందలి కృష్ణాలయమునే వారు స్మరించినా రనవలసియున్నది. విజయనగరము పేరు కానరాకున్నను చినతిరుమలార్యుని "రారా చిన్నన్న రారోరి చిన్నవాఁడా రారా ముద్దులాడ రారోరి బాలకృష్ణ" (16—82) అనుకీర్తనమునకూడ నాదేవుఁడే కీర్తింపఁబడినాఁ డని తోఁచుచున్నది.

**మంగళకౌశికి**

"పడుచుఁజేతలు గావు బాలకృష్ణుఁడు
తొడికి మోవిపంటికె దుండగపుఁగృష్ణుఁడు॥" (17-121)

**విజయనగరము : విఠలేశ్వరుఁడు.**

విజయనగరమున 'తుంగభద్రయేటికాడ తోరమైన కొండనీడ రంగుమీరు పైడిగొండ రాతిమేడ'లో వెలసిన పాండురంగవిఠలుని తాళ్ళపాకవారు పెక్కు కీర్తనములందు వర్ణించిరి. విజయనగరమున 'తేరువీధి నెల్ల నాఁడు దిమ్మరై తిరిగి చేసినచేతలనే కాక ఆ దేవుని యాకృతిని కనులగట్టునట్లుగా వీరు చిత్రించిరి.

3-229, 269; 4-26. కీర్తనములు చూడఁదగును.

లలిత

"వేడుకకాఁడుగదమ్మ విట్ఠలుండు
ఆడనీడ నేగివచ్చి నదె విట్ఠలుండు॥" (3-229)

ఆతఁడు 'ఏడునూటడెబ్బదియేడుగురిచేత నిరవై పాడించుకొన్న దైవమట –'చిందులపాటలు వినుచు' నెందరెందరినో వలపించిన వాఁడట - ఈ కీర్తనములందు గోచరించువిఠలునిమీఁది భక్తినిబట్టియు, కీర్తన రచనా నిర్మాణమున గల అనుప్రాసవిన్యాససామ్యమును బట్టియుఁ తాళ్ళపాకవారికిని పురందరదాసాదిదాసకూటమువారికిని గల సాహచర్యము నించుక గుర్తింప వచ్చును.

లలిత

"ఎందరివలపించెనో యింటనింట
చిందులపాటలు వింట సిరులుచేకొంట॥

తుంగభద్రయేటికాడ తోరమైనకొండనీడ
రంగుమీరి పైఁడిగోడ రాతిమేడ
అంగడినున్నాఁడుచూడ నదివో పెడతల
చుంగులపించెపుగూడ చుట్టుఁబాగతోడ॥" (4-26)

**వెలిగోడు : కేశవస్వామి.**

కర్నూలుజిల్లా, ఆత్మకూరు తాలూకా, వెలుగోడు.

వెలిగోటికేశవస్వామిని అన్నమాచార్యుఁడు 'కేవలకృష్ణావతారము'గా వర్ణించినాఁడు. లక్ష్మీనాయకుఁడుగను, కేకివాహనుఁడుగను తాళ్ళపాకవా రాదేవుని గీర్తించిరి.

రామక్రియ

"కేవలకృష్ణావతార కేశవా
దేవదేవ లోకనాథ దివ్యదేహ కేశవా॥" (11-96)

**వేంకటాద్రి : నారసింహుఁడు (లక్ష్మీనారసింహ).**

తిరుమలమీఁది నృసింహస్వామినే తాళ్ళపాకవారు నవనారసింహులలో

నొకదైవముగాఁ బేర్కొనినారు. ఈ దేవునిపైఁ దాళ్ళపాకవారి కీర్తనములు పెక్కులు గలవు. పూర్వమే కొన్ని యుదాహరించి యుంటిని. ప్రస్తుత మింకొక్కటి మాత్ర మిట నుదాహరింతును.

**బౌళి రామక్రియ**

"నమోనమో లక్ష్మీనారసింహా
నమోనమో సుగ్రీవనారసింహా॥" (7-114)

**వేదాద్రి : యోగానందలక్ష్మీనారసింహము.**

కృష్ణాతీరమందలి వేదాద్రియో? లేక నెల్లూరు జిల్లా నరసింహుని కొండయో! ఈ నరసింహుని కొండకే వేదగిరి యని నామాంతరమున్నది.

తాళ్ళపాకవారు "నగముపై యోగానందనారసింహము వీఁడె'- మిగుల వేదాద్రి లక్ష్మీనారసింహము" (10-18?) అని తమ నవనారసింహస్తుతిలోఁ బేర్కొనియున్నకతమున యోగానందలక్ష్మీనృసింహక్షేత్రముగా కృష్ణాతీరమున కొండపై ప్రసిద్ధిగన్న వేదాద్రినే వారు స్మరించినారని తలఁపఁదగునేమో!

"వేదాద్రిగుహలోనే వెలసీవాఁడే"అని అన్నమాచార్యుఁడు (9-218) కీర్తనములో వర్ణించియుండుటను బట్టి యాతఁడు కృష్ణామండలమందలి యాక్షేత్రమునుగూడ వర్ణించినాఁడేమో ! అనిపించును. కాదేని వేదగిరి వేదాద్రినామములతో వ్యవహరింపఁబడు నృసింహక్షేత్ర మేదేని కావచ్చును. నెల్లూరు జిల్లాలోని నృసింహునికొండనుగూడ వేదాద్రి యని వ్యవహరించుట గలదు. తాళ్ళపాకవారు వర్ణించిన వేదాద్రి యిదియేని కాఁదగును.

ఈ దైవము అహోబిలమునందు వలెనే వేదాద్రి గుహయందును వెలసె నట!

సాళంగనాట

"ఆదిమపురుషుఁడు అహోబలమునను
వేదాద్రిగుహలో వెలసీ వాఁడే॥" (9-218)

**శోభనగిరి : (నరసింహస్వామి).**

గుంటూరుజిల్లా, గుంటూరు తాలూకా, మంగళగిరి గ్రామము. ఈ మంగళ

గిరియే పైశోభనగిరి యైయుండును. మంగళగిరికి శోభనగిరి పర్యాయరూపము కాఁదగును.

తాళ్ళపాకవారి కీర్తనములుగా తాళపత్ర గ్రంథము (D. No. 465, B. No. 11658)న ఈ శోభనగిరీశునిపై రెండుకీర్తనము లున్నవి. ఇవి రెండును చినతిరుమలాచార్యుని కీర్తనము లగునేనేమో; కాని (16వ సంపుటమున నీకీర్తనములు కానరావు) ఈ యూహకు గారణము మంగళగిరియందు చినతిరుమలాచార్యుఁడు క్రీ॥ 1562లో సంకీర్తనఅరుళప్పాడున కేర్పాటుచేయించిన విషయము శాసనస్థము గావించి యుండుటయే ఈ శృంగారకీర్తనములందు "శోభనగిరీశుఁడ"నియు "శోభనాద్రీశుఁ"డనియుఁ గలదు గాని నృసింహస్వామి పేరు స్పష్టముగ లేదు. చినతిరుమలాచార్యుని శృంగారసంకీర్తనములం దీరీతి రచన సామాన్యమే. చూ. 16-38,58. శృంగారకీర్తనములందు 'కదిరి నాథుఁ'డనియు, "గదిరి యిప్ప"డనియు పేర్కొనెనేగాని కదిరినృసింహుఁ డనియుండ లేదు. అట్లే శోభనాద్రీశునిమీఁద శృంగారకీర్తనములును మంగళగిరి నృసింహుని గూర్చినవే యై యుండును. అంతేకాదు. పానకాలరాయఁడుగా పేరుగాంచిన అక్కడి నృసింహస్వామి నోరుతెరచుకొని యుండుటను గని యీ కీర్తనము లందు 'ఆవులింత లేటికయ్యా' అని చమత్కరించి నట్లున్నాఁడు. ఆ స్వామి పానకాలరాయఁ డగుటచేతనే కాఁబోలును కవి యిందు నాయికచేత దగఁగొన్న నాయకునకు అధరామృతము లిప్పించినాఁడు.

శంకరాభరణము : అదితాళము

"అన్నిపనులు వెనక నైతే అవుగాని
అన్నుదీర జలకము లాడవయ్యా చాలును॥
నీ వక్కడ కేగినంత నిదురగాచితివో
వావిరి నీముఖమెల్ల వాఁడి యున్నది
ఆవలింత లేటికయ్యా నీయలసట తీరుదాక
వోవరిలోపల నిద్దురఁ బోవయ్యా చాలును॥
యిక్కువ దెలిసి నీవెవ్వతెను గలసితివో
దక్కి శోభనగిరీశ దగగొంటివి -
అక్కడి సొలపుదీర నాయధరమిచ్చేగాని
వొక్కపై రతులఁ గూడి వుండవయ్యా చాలును॥"

## శ్రీ రంగము : రంగనాథస్వామి.

ద్రావిడ దేశమున తిరుచ్చినాపల్లి సమీపమునఁగల సుప్రసిద్ధమగు వైష్ణవ క్షేత్రము.

తాళ్ళపాక అన్నమాచార్యుఁడు శ్రీరంగమందలి కావేటిరంగనిపై పదములు పాడినాఁడు. ఈకీర్తనములు చూడఁదగును.

2-131; 3-24, 474, 545; 11-2-1.

వీనిలో శేషశయనుఁ డగు శ్రీరంగని శృంగారమును గూర్చియు, శ్రీరంగ శిశువు ఉయ్యాలలూగుటనుగూర్చియు, వర్ణన మున్నది. అన్నమాచార్యుఁడు శ్రీరంగమున కేగినవిషయము వ్యక్తమే. తిరుమలమీఁద కొంతకాలము వసతి గల్పించుకొని యుండిన రంగనాథుని విగ్రహము అన్నమాచార్యుని కాలమున కంటె పూర్వమే మరల శ్రీరంగమును జేరుకొన్నది. పైకీర్తనములందు శ్రీరంగ క్షేత్ర వర్ణనము సువ్యక్తముగ నున్నది. అన్నమాచార్యుఁ డీరంగనాథుని "బ్రహ్మ పూజించె రఘుపతి విభీషణుని కిచ్చె"నని వర్ణించియున్నాఁడు. "లబ్ధ్వా కులధనం రాజా లంకాం ప్రాయాద్విభీషణః" అన్న వాల్మీకి వాక్యమునకు 'కుల ధనం ఇక్ష్వాకుకులధనం, శ్రీరంగవిమాన మితి సంప్రదాయః' అని గోవింద రాజీయ వ్యాఖ్య - తీర్థయవ్యాఖ్య యీపట్టున పద్మపురాణాదులనుగూడ నుదాహ రించినది. కనుక అన్నమాచార్యుని ఈ రచన సంప్రదాయమున కనుగుణమున నున్న దనవలెను.

ధన్యాసి

"బ్రహ్మ పూజించె రఘుపతి విభీషణున కిచ్చె
బ్రహ్మణ్యుఁ డీరంగపతిఁ గొలువరో॥

కావేరిమధ్య రంగక్షేత్ర మల్లదిగో
శ్రీవిమాన మదిగో శేషపర్యంక మిదే
దేవుం డల్లదే వాఁడే దేవి శ్రీలక్ష్మియదే
సేవించరో నాభిం జిగురించె నజుండు॥

ఏడుగోటలు నవిగో యెసఁగపూఁదోపులవే
కూడి దామోదరపురగోపుర మదే

తోడ వేయిగంబాల దొడ్డమంటప మదిగో
చూడరో పసిడిమించులకంబ మదిగో॥

ఆళువారలు వారే యంగరంగవిభవ మదే
వాలు శ్రీవైష్ణవపుజాడ లవిగో
ఆలీల శ్రీవేంకటేశుండై వరమచ్చీ నీ
తాలిముల శ్రీరంగదైవముంగొలువరో॥" (2-131)

**సంబటూరు : చెన్నరాయఁడు.**

కడపజిల్లా, కమలాపురంతాలూకా, సంబటూరు. తాళ్ళపాకవారి కీర్తనములను బట్టి కడపజిల్లా పులివెందల తాలూకాలోఁగూడ నేదేని సంబటూరు గలదేమో అని పించుచున్నది.

ఈ సంబటూరిచెన్నరాయని అన్నమాచార్య చినతిరుమలాచార్యులు వర్ణించి యున్నారు. కేశవస్వామి మదనమోహనస్వరూపమును వలచి విడువలేక నాయి కలై కవు లీకీర్తనములం దాదేవుని దక్షిణనాయకత్వమును దలఁచి వాపోవుదురు.

16-23, 17-162 కీర్తనములు చూడఁదగును.

'పూపపాయమురా మావూ రల్ల పులివిందలరా వోరి' అను నింకొక కీర్తనమున తాళపాకవారు 'పులివిందల సంబటూరయ్యకై పొందితి మేలురా' అనిరి. సంబటూరు నాఁడు పులివెందలలోఁ జేరిన దసియో సమీపగ్రామ మనియో భావమై యుండును.

చూ. తాళపత్రగ్రంథము D. No. 465/B No. 11658.

లలిత

"చక్కని యీవెన్నుఁడు సంబటూరిచెన్నుఁడూ
అక్కడ నిక్కడ చూపి ఆసలు రేచీని॥" (17-167)

**(ఊరిపేరు లేదు) – చెల్లపిళ్లరాయఁడు.**

చినతిరుమలాచార్యుఁ డీచెల్లపిళ్లరాయనిపై నొకశృంగారకీర్తనమును జెప్పి యున్నాఁడు. కాని ఏయూరిదైవమో అందు పేర్కొనలేదు. మైసూరురాజ్యము నందలి మేల్కోటలోని చెల్లపిళ్ళరాయనిస్తుతి యిది యగునా?

లేదా కడపజిల్లా రాజంపేట తాలూకా నెలదలూరు గ్రామములోని చొక్క (సౌమ్య) నాథస్వామియే ఈ చెల్లపిళ్ళరాయఁడగునో!

**మాళవిగౌళ**

"బెల్లపునూటలచెల్లపిళ్లరాయఁడానికుఁ
జెల్లునయ్య యేమైనచెల్లపిళ్లరాయఁడా॥" (16-80)

**(ఊరిపేరులేదు) - యాదవనారాయణస్వామి.**

చిన్నతిరుమలాచార్యుఁ డీయాదవనారాయణస్వామిని వర్ణించుచు (16-22) శృంగారకీర్తనమొకటి చెప్పియున్నాఁడు. కాని యూరిపే రందు కానరాదు. నెల్లూరు జిల్లా వేంకటగిరితాలూకా లోని "నాగపుదల్" గ్రామమున నొక యాదవ నారాయణస్వామియాలయము గలదు. తిరుపతిలో గోవిందరాజస్వామివారి యాలయముఖద్వారమున కెడమప్రక్కనున్న సుదర్శనస్వామిమందిరమున నొక యాదవనారాయణస్వామిప్రతిమ గలదు. పైకీర్తన మిందలియేదేవునిగూర్చియైన నై యుండవచ్చును. కాని నాకుఁ జూడఁగా కీర్తనము తుదిని

"యింటికి నీవు రాఁగా యిప్పు డిట్టె భ్రమసితి
నంటుఁజావుల యాదవనారాయణా
వెంటవెంటఁ దిరిగి శ్రీవెంకటనాథుఁడవై
అంటుకొని కూడితిని యాదవనారాయణా॥"

అని యుండుటచేత నిది తాళ్ళపాకవారి యింటిపూజావిగ్రహమేమో అనిపించు చున్నది. లేకున్న గ్రామముపేరు చెప్పియుండఁడా?

సాళంగనాట

"దొరవు నిన్నోఁగా దని దూరవచ్చునా
అరిదిపదేముగాక యాదవనారాయణా॥" (16-22)

**మఱికొన్ని గ్రామములు - కొందఱు వేలుపులు.**

*కనకగిరి*రాయఁడు:- 3. 14 (రాయచోటిసమీపమందలి కనకగిరియేమో)
*చెంజి* వెంకటరాయఁడు: D No. 465/B No. 11658. (పు. 41)
*కృష్ణగిరి* గోపాలుఁడు: (సేలం జిల్లా లోనిదగునా?) (పు. 51, 43)
*అహోబల* కృష్ణుఁడు: (పు. 56)

చిరతనూరు 366: (తిరుపతికి సమీపమునగల చిరతానూరు, తిరుచానూరు గ్రామము అగునా ?)
దాసరిపల్లె రాముఁడు: (పీఠిక పు. 100 చూ)
కదిరి వసంతుఁడు:
చెంజి నవనీతకృష్ణుఁడు:
తిరుపళాచ్చి విష్ణుఁడు: (తిరుపళాచ్చి కోయంబత్తూరు సమీపమునగలగ్రామము)
తిరువళ్లూరి వీరరాఘవుఁడు :
ముక్కపల్లి చెన్నుఁడు :
నెల్లూరు శ్రీవేంకటనాథుఁడు : (16-89)

తాళపాకకవుల సంకీర్తనము లన్నియునువెలువడినపిదప గుర్తింపఁదగు వేలుపులయు గ్రామములయు[1] సంఖ్య కడముట్ట పరిశీలించిన నింక నెన్ని యగునో!

1. పై క్షేత్రములనుగూర్చిన వివరమును సేకరించుటలో ప్రభుత్వమువారు ప్రకటించిన జిల్లా గెజిటీర్లును, సంకీర్తన సంపుటములలో పరిష్కర్తలు పేర్కొన్న అంశములును తోడ్పడినవి.

మ ల హ రి

"ఇంక నేల వెరపు యెదుటనే వున్నారము
వంక లొత్తకిఁక మఱి వద్దు వద్దు యిపుడు॥

వావులు నీవెంచనేల వాడల గొల్లెతలకు
దేవరవు గావా తెలిసినదే
యీవల మావంక నిట్టె యేమి చూచేవు తప్పక
మోవనాడితి మిదివో మొదలనే నేము॥

చందాలు చెప్పఁగ నేల సతి నెత్తుక వచ్చితి
విందుకు రాజవు గావా యెరిఁగినదే
దిందుపడి మమ్ము నేల తిట్టేవు పెదవులను
నింద వేసితి మిదివో నిన్ననే నేము॥

వెలినవ్వేల పదారువేలఁ బెండ్లాడితివి
బలిమికాఁడవు గావా భావించినదే
చెలఁగి పులివిందల శ్రీరంగదేవుఁడ వని
కలసితి మిదె శ్రీ వేంకటరాయ నేము॥

(ఈ కీర్తనమందు పులివెందల శ్రీరంగదేవుఁడు ప్రస్తుతుఁ డైనాఁడు.
చూ. అన్నమా. సం॥ 20. పుట 10)

—※—

## చతుర్థాధ్యాయము

# తాళ్లపాకవారి దేశిగానము

( పుటలు 313 - 366 )

[illegible]

…గారి రెండేండ్లు

# తాళ్ళపాకవారి దేశిగానము

తాళ్ళపాకకవులు తమ కాలపుసంకీర్తనపద్ధతికి "పరిశుద్ధిని" గల్పించు యత్నమున అంతకుఁబూర్వము దేశమున ప్రచారములోనుండిన మార్గదేశిగేయ రచనారీతుల నెన్నిటినో ఆకళించుకొని యుండినట్లు వారి సంకీర్తన లక్షణమును బట్టియే కొంతవఱకుఁ దెలియుచున్నది. ఇఁక వారి సంకీర్తన సముచ్చయ మా విషయమును సంపూర్ణముగ నిర్ధారించుచున్నది. ఈ పట్టున వారి సంకీర్తనము లందలి దేశికవిత్వపుసొంపు నించుక ప్రదర్శింతును.

తాళ్ళపాకకవుల సంగీతరచనలనుగూర్చి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్యచరిత్ర పీఠిక (పు.77)లో వ్రాయుచు "జాజరలు, చందమామలు, కోవెల. చిలుక, తుమ్మెదపదములు, లాలి సువ్వి గొబ్బి ఉయ్యాల లాలి జోల, జోజో, జేజే, జయజయ విజయీభవ, శోభనమంగళవైభోగములు, మేలుకొలుపులు, నలుఁగులు, దంపుళ్లు, కొట్నాలు, కూగూగులు, గుజ్జెనగూళ్ళు, చందమామగుటకలు, నివాళులు, ఆరతులు, మంగళారతులు, జయమంగళాలు, అల్లోనేరేళ్లు, చాఁగుభళాలు, బళాబళాలు, సాసముఖాలు, అవధానములు, తందానలు, వెన్నెలలు, చిత్తమామనసాబుద్ధి (సంబోధనలు) మొదలగు మధురకవితా రచనా విశేషము శ్రీసంకీర్తనములలోఁ జాలఁగలవు" అని పేర్కొనినారు. పలువురు విమర్శకులును, పరిశోధకులును ఆయా దేశిరచనావిశేషములనుగూర్చి కొంత చర్చించియున్నారు. క్రమముగ వానినెల్ల నిట పరామర్శింతము.

తెలుఁగువారి దేశిగానమునుగూర్చి బృహద్దేశి, సంగీతచూడామణి, అభిలషితార్థచింతామణి, సంగీతరత్నాకరము, మున్నగు ప్రాచీనలక్షణగ్రంథములం దెన్నియో ప్రశంస లున్నవి. వానియందు ఆగానమునకుసంబంధించిన కొన్నికొన్ని గేయఫణితులకు లక్షణనిర్వచనముకూడ చేయఁబడియున్నది. ఇఁక తెలుఁగున నన్నెచోడుని కుమారసంభవమునందును,పాల్కురికి సోమనాథునిబసవపురాణపండితారాధ్యచరిత్ర ద్విపదలందును ఆయాగేయఫణితులను గూర్చిన మఱికొన్నివివరములు తెలియనైనవి. ఇప్పుడీతాళ్ళపాకవారి సంకీర్తనముల ప్రకటనముతో అయా గేయఫణితులకును, తల్లక్షణములకును, సమగ్రమైన సమన్వయ మొనర్చుకొనుట

కెంతేని మన కవకాశ మేర్పడుచున్నది. అంతేకాదు- తాళ్ళపాకవారి కాలమునకు అనఁగా క్రీ॥ 15-16 శతాబ్దులనాఁటికి ఇంకను లక్షణశుద్ధిఁ బడసియుండని గేయ ఫణితు లింక నెన్నిటినో లభించినలక్ష్యోదాహరణములనుబట్టి పరిశీలించుటకుఁ గూడ నవకాశ మేర్పడుచున్నది. వివరింతును.

గీతలక్షణకోవిదులు గానమును నిబద్ధ అనిబద్ధ భేదములచే నిరుతెఱఁగులుగ గుర్తించియున్నారు. అందు నిబద్ధగానమునకే చతుర్ధాతుకమును, షడంగ సహిత మును నగు ప్రబంధ మనుసంజ్ఞయు నొసఁగియున్నారు. అట్టిప్రబంధములను వారు మరల సూడస్థములు అవిస్థలములు, ప్రకీర్ణకములు నని ముత్తెఱగులుగ పేర్కొనినారు. వానిలో సూడస్థములు ఏలాదిభేదము లెనిమిదింటితోను; అవిస్థములు వర్ణ వర్ణస్వరాదిభేదము లిరువదినాల్గింటితోను; ప్రకీర్ణకములు శ్రీరంగశ్రీవిలాసాది భేదములు ముప్పదియారింటితోను వెరసి 68 గేయరీతులు ప్రముఖముగ నేర్పడు చున్నవి. ప్రసిద్ధము లగునీఏలాదిభేదము లరువదియెన్మిదింటిలోనే ఏల, ఏక తాళి, ద్విపది, చక్రవాళము, తోటకము, పద్ధళి, రాహడి, ధవళము, మంగళము, ఓలీ, లోలీ, ఢోల్లరీ మున్నగు మధురగేయఫణితు లన్నియు నున్నవి. వీనిలో ఒక్క ఏలకే సంగీతరత్నాకరమున మరల 356 ప్రభేదములు చెప్పఁబడియున్నవి. వానిలో గణైలలు 112; వర్ణైలలు 24; మాత్రైలలు 20: దేశైలలు 200; వెరసి 356. ఈ దేశైలావిభాగమున ఒక్క ఆంధ్రైలకే నలుపదిభేదము లున్నట్లు తెలియుచున్నది. దీనినిబట్టి చూడఁగా మనగేయప్రబంధముల కన్నిటికిని ప్రాచీన కాలమున ఏల లనెడిపేరుకూడ పర్యాయముగఁ జెల్లుబడి యగుచుండె నని తోపఁ గలదు.

'ఏలపాట' లనుశీర్షికతో శ్రీ వేటూరిప్రభాకరశాస్త్రిగా రీవిషయమై 11-6-44 ఆంధ్రపత్రికయం దిట్లు వ్రాసియున్నారు. చూడుఁడు.

"ఏలపాటలంటే నానారసాలతో, నానారాగాలతో, నానాఫణితులతో పాడే చమత్కారపు పొడిపాటలన్నమాట. ప్రాచీనగ్రంథాలు పరిశోధిస్తే యీవిషయ మలాగే తేలుతుంది. మరిన్ని ఆరంభకాలంలో యేల లనేపేరుతో పేర్కొన బడుతూవచ్చిన చమత్కారపుపాటలే తర్వాత జోలలనీ, సువ్వాలనీ, ఓలలనీ ఇంకాయేమోఅనీ విభాగములతో పేర్కొనబడుతూ వచ్చినవి. క్రీస్తుశకము నాల్గవశతాబ్దిలోని దనదగిన మతంగునిబృహద్దేశిలో ఆంధ్రద్రవిడకర్ణాటాదిభాషల ఏలలు పేర్కొనఁబడినవి. తర్వాతి సంగీతగ్రంథాలు సంగీతచూడామణి, సంగీత

రత్నాకరము, వగైరాలుకూడా ఏలలభేదములను విరివిగా పేర్కొన్నవి. సంగీత చూడామణిలో తెలుఁగువారియేలలు చాలామనోజ్ఞముగా వుండునని ప్రసంశ వున్నది.

"కర్నాట లాట గౌడా -ంధ్ర ద్రావిడానాం స్వభాషయా
నానాధ్వనిప్రయోగాఢ్యా నానారాగాంగమిశ్రితా
ఆంధ్రనామ్నా భవేదేలా రసభావై ర్విభూషితా
సరసా ప్రాససంయుక్తా చిత్రధ్వనివిమిశ్రితా"

శాతవాహనులనాఁటివాఁ డైనమతంగుఁడు బృహద్దేశిలో యిట్లు చెప్పినాఁడు.

"చత్వారోగీతయో యత్ర పాదేపాదే భవన్తిచ
గీత్వా తదీయపాదార్థ మనుప్రాసో విధీయతే
త్యాగ సౌభాగ్య సౌందర్య శౌర్య ధైర్యాదివర్ణనా
యస్యాం భవతి గీతజ్ఞా స్తామేలాం సంప్రచక్షతే
... ... ... ...
రమ్యగీతగుణై ర్యుక్తా ఛందోగుణసమన్వితా
అలంకారరసోపేతా కర్తవ్యైలా మనీషిభిః॥"

అని యిత్యాదిగా యేలల్లో యెన్నో భేదములను పేర్కొని కర్ణాట, గౌడ, ద్రవిడ దేశపుయేలలగుణదోషములను వర్ణించి తెలుఁగువారియేలల నిట్లు ప్రశంసించినాఁడు.

"ప్రాసై ర్మనోహరై ర్దివ్యైః ఆదిమధ్యాంతగోచరైః
ఏలా కర్ణాటకా ప్రోక్తా లలితధ్వనిసంయుతా
సర్వత్రప్రాససహితా గమకైశ్చవివర్జితా
నాదబిందురసోపేతా ఏలా సా గౌడదేశజా
అనేకరాగసంకీర్ణా మేలా మాంధ్రీం విదుర్బుధాః
భావాభినయతాళాఢ్యా విచిత్రధ్వనిరంజితా
ప్రాసహీనా రసస్థా చ ఏలా ద్రవిడదేశజా॥"

పై లక్షణాలనుబట్టి చూడఁగా యేలకు ఒకనియతమైనఫణితి లేదని అనేక రాగములతో, అనేకతాళములతో. అనేక ఫణితులతో. ఉంటవనీ తేలుతుంది.

ఊఁగునప్పటియేల ఊయేలనీ, జోగునప్పటి యేల జోలనీ,[1] యీ విధంగా నానా సందర్భములలో పాడే పాటలన్నీ ఏలల భేదములే అవుతవని తోస్తుంది."

ఏలలు గేయరచనాప్రభేదము లనెడి దృష్టితోనే కావచ్చు పాల్కురికి సోమనాథుఁడు "...శ్రీ బసవపురాణంబు నేలలువెట్టంగ నింపుసొంపారుశైలిచే గ్రాలుచుఁ జదివెడివారు" అని పేర్కొని యున్నాఁడు. ఈ గేయరచనా ప్రక్రియల మీఁదనే "ఓలలాడు,' 'వాలలాడు' అను పదబంధములు మనదేశమున పలుకు బళ్ళుగా రూపొందినవి. ఈయేల లింతటివైవిధ్యము గల గేయరచన లగుట చేతనే ఇటీవల శ్రీ చిలకలపూడి వేంకటేశ్వరశర్మగారు 'భారతీయ ప్రాచీనసంగీత గేయఫణితులు' అను వ్యాసమున "మొత్తముమీద ఏలలన్నియు 358 విధములుగ నున్నవి. పురందరదాసులవారి పదములు అన్నమాచార్యులవారి పదములు ఈ ఏలాలక్షణములు గలవై రెండుచరణములు మాత్రమే గలవై యున్నవి" అని వ్రాసియున్నారు. (చూ. ఆంధ్రప్రభ–దినపత్రిక-8-11–64) వారు అన్నమాచార్యాదుల కీర్తనము లన్నియు నేలపదములే యనిపేర్కొనుటకూడ పైవివరించిన కారణముననే కావలెను.

. స్థూలదృష్టిని తాళ్ళపాకవారి కీర్తనము లన్నియు భజనకీర్తనల వంటివే యనిపించినను వేలకొలఁదిగ నున్నవారిపదము లన్నియుఁ బరిశీలించినయెడల వారందు సాధించిన రాగతాళగతుల వైవిధ్యము వ్యక్తము కాకపోదు. రాగిరేకు లందు వారు తమకీర్తనముల కన్నిటికి రాగములను బేర్కొనినారు. వేంకటేశ్వర వచనములకుఁదాళములనుగూడ పేర్కొనిన తాళ్ళపాకవా రేలనో సంకీర్తనముల విషయమున రేకులలోఁ దాళముల నుదాహరింపరైరి. అయినను రాగతాళములు రెంటిని బేర్కొన్న వారికీర్తనములు రేకులందును, ప్రాచీనకాలపు వ్రాతప్రతు లందును కొన్ని లేకపోలేదు. 3-32, 83, 612, 613; 4–77 మున్నగు కీర్తనములు చూడఁదగును. ఇట్లే వారు గేయగతులందుకూడ వైవిధ్యమును

---

1. ఈభావముతోనే శ్రీ శాస్త్రిగారు ఏనుఁగు లక్ష్మణకవి రచితమగు "అప్పారావోయీ ఒప్పులకుప్పారావోయీ" అను పదమును ఏల పదముగా పేర్కొనినారు. అందే 'లాలీపాటాలతో నిన్ను వోలాపాడేను" అని యుండుటనుబట్టి వారే దానిని "జోలపాట" యనియు పేర్కొనియున్నారు. చిన్నన్నచెప్పిన ఏలపదలక్షణమునకు లక్ష్యముగాఁదోచునట్లు పైపాటను నేను పరిశోధన అగస్టు - సెప్టెంబరు 1954 సంచిక-పుట 42 లో పేర్కొని యుండుట ప్రామాదికము - అది జోలపాటయే.

చూపకపోలేదు. త్ర్యస్ర-చతురస్ర, ఖండ, మిశ్రాది గతులన్నిటియందును వారి కీర్తనము లున్నవి. వానిలోఁగూడ వారు ఆవృత్తముల సంఖ్య హెచ్చించియు, తగ్గించియు, గతులలో మార్పును దెచ్చియుఁగూడ వైవిధ్యమును సాధించినారు. ఇఁకఁ గొన్నిఁట ఎట్లును ఒదుగని ఛందోగతులతోఁ గ్రొత్తవరుసలను గూర్చుటకై యత్నించినారా యని తోచునట్లుగ పదరచన గావించియున్నారు. సోదాహరణముగ వివరింతును.

**1. త్రస్యగతి :**

భైరవి

"వేంక[1] టాద్రి[2] విభుని[3] బాసి[4] విరహి[5] యైన[6] రమణి[7] జూచి[8]
రంకె[9] వేయ[10] నేటి[11] కమ్మ[12] రాజ[13] సమున[14] నూడ[15] ఊఁడ[16]"
(3-381)

పాదమునకు ఎనిమిదేసి చొప్పున తకిట-తకిట ఆవృత్తములుండి పదము త్ర్యస్రగతిని నడచుచున్నది. ఇది సుప్రసిద్ధ జానపద గేయమగు "సువ్వి సువ్వి రామచంద్ర" యను కొట్నముల పాటమట్టు వంటిది. "రామచంద్రాయ జనకరాజజామనోహరాయ" యనెడి ప్రసిద్ధమగు మంగళారతిమట్టు గూడ నిదియే. "మహిత నాయక సంబుద్ధి మధ్యమగు" నేలపదము కూడ నీ గతిలో సాగునదే.

**2. చతురస్రగతి :**

బౌళి

"ఎక్కడి[1] మానుష[2] జన్మం[3] బెత్తిన[4] ఫలమే[5] మున్నది[6]
నిక్కము[7] నిన్నే[8] నమ్మితి[9] నీచి[10] త్తంబిక[11] నూ[12] (ఊఁ)"
(2.44)

పాదమున నారేసి చొప్పున, కిటతక-కిటతక ఆవృత్తములుండి పదము చతురస్రగతిని నడచుచున్నది. ఇట్టివే పాదమున కెనిమిదేసియు నాలుఁగేసియు నావృత్తములుగల పదములు కూడ నున్నవి. స్త్రీల పాటలు పెక్కు లీగతిలోనే సాగునవి కలవు.

**3. ఖండగతి :**

'అలరచం[1] చలమైన[2] ఆత్మలం[3] దుండనీ[4] ఆలవాటు[5]
చేసేసీ[6] వుయ్యాలా[7]
పలుమారు[8] నుచ్ఛ్వాస[9] పవనమం[10] దుండని[11] భావంబు[12]
దెలిపెనీ[13] వుయ్యాలా॥'[14] (2-68)

ఈ ఖండగతి అయిదేసి మాత్రల నడక గలది.

పై యుదాహరణమున "తక తకిట" "తక తకిట" అను నా వృత్తము లేదేసి చొప్పున పాదమున కున్నవి. ఈ పదమునందలి పాదములన్నియు సమావృత్తపాదములు. ఖండగతిలోనే 'తకిట తక', 'తకిట తక', అను రీతిని చరణములందలి సమపాదములం దేదేసి యావృత్తములును, విషమ పాదములం దెనిమిదేసి యావృత్తములును సాగునట్లును అర్ధసమావృత్త పదములను గూడ వీరు రచించిరి.

"అదె చూడు తిరువేంకటాద్రి" యను పదమునందలి చరణమును గాంచుఁడు.

'కదిసి సుర[1] వరులుకి[2] న్నరులు కిం[3] పురుషులును[4] గరుడగం[5]
ధర్వయ[6] క్షులునువి[7] ద్యాధరులు[8]
విదితమై[9] విహరించు[10] విశ్రాంత[11] దేశముల[12] వేడుకలు[13]
దైవాలు[14] గాను'[15]

ఇందు సమపాదమున నేడావృత్తములే యున్నవి. అందును తుదియావృత్తమున రెండుమూఁడేసి మాత్రలకాలము గానమున కలుపుకొనవలసిన తెఱఁగుననే పదరచన సాగినది. ఇట్లు ఖండగతిలో వీరు చమత్కారపు పోకడలనే పోయినారు. మన ద్విపదలు, తరువోజలు, స్త్రీలపాటలు పెక్కు లీఖండగతిలో సాగిన రచనలే.

**4. ద్విత్ర్యస్రగతి :**

ఇది త్ర్యస్రగతికే చెందునుగాని మన వీలునుబట్టి "తకకిటతక", "తకకిట తక", అనునారేసి మాత్రలయావృత్తములను గుణించుటకై వేరుగా చూపఁబడుచున్నది.

ఆహిరి

'సతతమునే[1] జేయుననా[2] చారములకు[3] ఁగడయెక్కఁడ[4]
మతిననుగని[5] కావుమురా[6] మూరామా[7] రామా (ఆ)'[8]

**5. మిశ్రగతి :**

భూపాలం

'ఏమిచిత్రం[1] బేమిమహిమలు[2] ఏమినీమా[3] యావినోదము[4]
వామనాచ్యుత[5] నిన్నుదెలియఁగ[6] వసుధలోమా[7] తరములా (ఆ)[9]
(2-225)'

ఇందు పాదమునకు నాలుఁగేసి చొప్పున "తకిటతకతక-తకిటతకతక"-అనునేడుమాత్రల యావృత్తములు వచ్చుచుండును. మన గుమ్మడిపాటలును, మఱికొన్ని మేలుకొల్పులును నిట్టి మిశ్రగతిలో నడచునవే. "మేలుకొనవే చంద్రశేఖర మేలుకొనవే యింద్రవందిత" అను సుప్రసిద్ధమగు మేలుకొలుపుపాట మట్టు పైసంకీర్తనవుమట్టునకు చెందినదే. ఇదియు భూపాల రాగముననే యుండుటను బట్టి యీమిశ్రగతిలో సాగురచనలు మేలుకొలుపులకే అధికముగా నుపయుక్తములగుచుండినవేమో అని తలపవచ్చును. తాళ్ళపాకవారి కీర్తనము లీగతిలో నింక కొన్ని లేకపోలేదు. భూపాలరాగముననే "వేగ నాలుగుగడియ లనఁగా వేదవేద్యులు వేచిసరగున నాగమోక్త విధులను తమ దేహానుగుణములుగా" (11-2-45) అని మొదలుగానున్న వీరికీర్తనము అచ్చముగా గుమ్మడిపాట వంటిదే.

**6. ద్విచతురస్రగతి :**

ఎన్మిదేసి మాత్రలుగల యావృత్తములతో సాగురచనలు చతురస్రగతికి జేరినవిగానే మనము తలఁపవచ్చునుగాని ఆ యెనిమిది మాత్రలును కిటతక తకతక (2 × 4) అను రీతినిగాక "తకిట తకిట తక" (6 + 2) అనురీతిని భిన్నముగ నడచునపుడు వానిని వేరుగనే పేర్కొనుట తగును. చూ॰ ఉదాహరణములు,

లలిత

"గోవిం[1] దాశ్రిత[2] గోకుల[3] బృందా[4]
పావన[5] జయజయ[6] పరమా[7] నందా॥"[8] (2-268)

"కిటతక-కిటతక" ఆవృత్తములతో నున్నయీరచన చతురస్రగతికి చెందిన దనియే చెప్పవచ్చును-కాని వీనిని చూడుఁడు-.

గుజ్జరి

"ఎన్నడుమానవు[1] యీదుర్గుణములు[2]
యేదియౌషధము[3] యిందుకును"[4]

ఇందు పాదమునకు నాలుగేసిచొప్పున "తకిటతకిటతక" అను ఆవృత్తములుసాగుచు నడకలో భేదమేర్పడినది. భద్రాచలరామదాసుగారి సుప్రసిద్ధ భజనకీర్తన "క్రూరకర్మములు నేరకచేసితి నేరములెంచకు రామా" అనునది పైసంకీర్తనపుగతిలో సాగినదే.

ఇట్లు 3, 4, 5, 6, 7, 8 మాత్రల కాలములో నడచు నావృత్తములుగల సంకీర్తనములను తాళ్ళపాకవారు భిన్నగతులలో రచించిరి. ఇవికాక తొమ్మిదేసి మాత్రల యావృత్తములతో సాగు ప్రకీర్ణజాతి యింకొకటి యున్నది. ఇందలి యా వృత్తములు సుదీర్ఘములగుటచేత పదము నడక త్ర్యస్రగతికి విరుగనప్పుడు క్లిష్టముగనే యుండును. తాళ్లపాకవారి పదములు త్ర్యస్ర ద్విత్ర్యస్ర గతులందే కాని యీ ప్రకీర్ణగతి యందలివి నేను గుర్తించియుండలేదు.

**కొన్ని వింతపదములు :-**

తాళ్ళపాకవారు ఇట్లు భిన్నరాగములతో, తాళలములలో వందలకొలఁది పదములు రచించినారు. ఇవి సాధారణపదరచనలసంగతి. కొన్నికొన్ని విశిష్ట పదము లున్నవి. అందు వా రూహించిన గతియేమో, భావించిన స్వరకల్పనపు తీరేమో కూడ గుర్తించుట కీనాఁడు మనకుఁగొంత కష్టమే యగుచున్నది. అట్టి కీర్తనములను జూచినపుడే తాళ్ళపాకవారు సంకీర్తనరచనలోఁ గొన్నిట నూతన స్వరకల్పనకై కూడ కొంత యత్నించినారేమో! యనిపించును. మచ్చునకుఁగొన్ని యుదాహరణములు చూడఁదగును.

గుజ్జరి

"యీయీయీ యీయీయీ యీయీ రీతి
నాగుణము యిదె నాయందె తగిలెను॥

మనసున్న నే నిన్ను దలంచి మాటలఁ గొసరుదును -వొక్కొకపరి
వినయముతో నీకు వేవేలు మ్రొక్కులు మ్రొక్కుదును-వొక్కొకపరి
ఘనంబగుభక్తిని బయలు కౌఁగిట నలముదును -వొక్కొకపరి
తనియక వేడుకతోను దైవమా నినుఁ బొగడుదును -వొక్కొకపరి॥"

(2-380)

చరణాంతములందలి "వొక్కొక పరి" అను పదము సంగీతస్వరాక్షరములతో నీకారాంతదీర్ఘమై పల్లవిలోని "యీయీరీతి"లోని ఇకార ఆలాపనమున చక్రవాళ రీతిని మేళవించుచున్నది. ఈ సంకీర్తనమందలి మాతువులును, విరుపును, ధాతు కల్పనా వైశిష్ట్యమునే సూచించుచున్నది. మఱి యొకటిరెండుమాత్రము చూడుఁడు.

ముఖారిపంతు

"ఎవ్వండో వీఁడేల తంగివచ్చి
నవ్వీనవ్వీ నా తోనె॥
పచ్చిపాలె పచ్చిపాలె
పచ్చిపాలె తోడంటుఁబాలె
వచ్చివచ్చి వాడవాడలం
బొచ్చియారగించెం జూడరే" (3-244)

ఈ పదము నందలి ప్రయోగములును ఆమ్రేడితరూపములను, యతుల విసరుపాటును గతిచమత్కృతినే వెల్లడించుచున్నవి.

గీతం — నాట

"ఏదైవము శ్రీపాదనఖమునం బుట్టినగంగ
త్రిలోకపావనముచేయును త్రిపథగామిని యాయెను
యేదైవము నాభినలినంబున జనియించిన
అజుండు అఖిలాండంబులుసృజియింప నధిపతి యాయెను॥"

(2—100)

ఇది పల్లవి. ఇట్టి గతిలోనే దకారప్రాసతో మఱి నాలుగుపాదములు గల యొకే యొక చరణ మున్నది. ఇందు పాదాదియతి కానరాకున్నను, ద్వితీయార్థములందు మాత్రము భిన్నమగు యతిమైత్రి పాటింపఁబడినది. సంకీర్తనముయొక్క నడ

కయు, నిర్మాణమునుగూడఁ జిత్రములుగనే యున్నవి. రాగతాళములు పేర్కొను తావున "గీతం—నాట" అని గలదు. గీత నాటరాగ మనియో లేక "గీతము" అనఁబడు పదరచనా ప్రక్రియ యనియో! (చూ. చిన్నన్న ఉషాకల్యాణము. పు. 21)

ఇట్టి వింతపదములే కాక పరిహాసజల్పములును, మృదంగ కాహళధ్వనులును, పాదాంత చరణాంత ధ్రువము లగుచు నున్న పదములుకూడ వీరివి కొన్ని యున్నవి. కొన్ని యుదాహరణములఁ గాంచుఁడు.

ఆహిరి

"బాపుదైవమా మాపాలిదైవమా
త్రిపురాకాసినెత్తురు దిందోందోందోందోందోం॥

కాలనేమి పునుకిది కంచువలె లెస్స వాగీ
తాళ మెత్తరే తత్తత తతత్తత్త
కాలమెల్ల మాభూతగుణమెల్ల వీఁడే కాచె
నేలబడి నేఁడును ధింధింధింధింధింధింధిం॥"(2-120)

సాళంగనాట

"జయము మనది వనచరులార
రయమున ధర్మదారలు తత్తుతూ ॥

రక్కసులమీఁద రాముఁ డలిగెనలు
దిక్కుల నడవుఁడు తిడిం తిడిం
యెక్కుడు నేనను యిటు మెరయింపుఁడు
ఢక్కానినదము ఢమం ఢమం ॥ " (11-222)

మంగళకౌశిక

"అబ్బురంపుశిశువు ఆకుమీఁది శిశువు
దొబ్బుడురోలి శిశువు త్రుప్వివ్వి త్రుప్వివ్వి త్రుప్వివ్వి॥" (3-283)

పై కీర్తనములందు మృదంగ కాహళ ధ్వనులును, చమత్కారజల్పములును, రచనలో వింతగా మేళవింపఁబడినవి. పరిహాసజల్పమునకుఁ జూడుఁడు.

"దదదద దదదద దశరథ తనయా
కదిశితి కకకక కావవే॥
అదెవచ్చె బాణాలు హానాథ హానాథ
పదపద పదపద పారరో పవుజులు ॥ "
అనుచు రావణసేన లటు భ్రమయుచు వీగె
ఇనకులచంద్ర నేఁడిదిగో నీ మహిమ ॥"

ఇందు రామబలము నెదుర్కొనఁజాలని రావణుసైన్యపు తత్తరపాటు నత్తినత్తి మాటలలో హాస్యరసస్ఫోరకముగా వర్ణింపఁబడినది.

ఇఁక శబ్దాలంకారములతో అనుప్రాసవిన్యాసము లధికముగాఁ గలిగి కర్ణాటక సంకీర్తనపద్ధతిని దలపించు రచనలుగూడ వీరివెన్నో యున్నవి. చూడుఁడు.

**బౌళి**

"పరమపురుష నిరుపమాన శరణు శరణురే
యిందిరా నిజమందిరా ॥ పల్లవి ॥
కమలనాథ కమలనయన కమలచరణురే
అమితసురమునినాథయూథప నాయకా వరదాయకా॥
చతురమూరితి చతురబాహూ శంఖచక్రధరా
అతిశయ శ్రీ వేంకటాధిప అంజనా కృతిరంజనా ॥"
(7-133)

**లలిత**

"బండిదొక్కె పామునెక్కెఁ బనులెల్లాఁ దక్కె
అండఁజిక్కె గోపికలందరికి మొక్కె॥
ఈతఁడు దొంగిలె వెన్న యీతఁడు నాకంటెఁ చిన్న
నేతఁ బాల నోలలాడె నిన్న మొన్న
పాతకపురాకాసి పల్లెలు చూరలుగొన్న
యేతరిపై నేరమి మాకేలిక నెన్న ॥ " (12-48)

పురందరదాసాదుల కర్ణాటకపదములఁ జదివినవారికి పైకీర్తనములకును వానికిని గలసామ్య మెట్టిదో తెలియఁగలదు.

అన్నమాచార్యుని ఆధ్యాత్మసంకీర్తనములు 7వసంపుటములో పరిష్కర్తలు "సంస్కరింపవీలుకాకున్న"దని చెప్పివిడచిన పదములలోని గతిమాధుర్యమును గాంచుఁడు—.

మాళవి

"హే సమీచీన మపహాసంతే
దాస్యై ప్రకాశితందరిదంతులోకే ॥

ద్వారకాపట్టణే త్వంపురాచస్వయ దీక్షితస్త్రుస్త్రియః కేశముష్టిః కథం
సారస కురువంతి సరసవేళాయాం ॥
వరశిరో రక్షణే త్వంపురా చ అహం బ్రహ్మచారి అథోచేతస్తదేతిగోప
తరుణయః కిమితి వా తద్వసతి త్వం ॥" (7-134)

ఇందలిభాష యటుండగా గతిచమత్కారముకూడ తిన్నగాగుర్తింపవీలు కాకున్నది. కాని చరణమునందలి తొలిపాదమునుబట్టిచూడఁగా నిది లీలాశుకుని కృష్ణకర్ణామృతమునందుగల 'అంగనా మంగనా మంతరే మాధవో మాధవం మాధవం చాంతరేణాంగనా' అనుపద్మనీవృత్తమునుబోలి యున్న దనిపించును. ఇది తాళ్ళపాకవారి వృత్తపదములజాతికిచేరిన అర్ధసమవృత్తపద మగునేమో! (చూ. సంకీర్తనలక్షణము)

తాళ్ళపాకవారి గేయరచనలలో రాగతాళములును, యతిప్రాసలును, పల్లవి చరణాదులును గలరచనలు సంకీర్తనము లనుపేరున చెల్లుబడికాగా రాగతాళములు మాత్రమే కలిగి యతిప్రాసలుకాని, పల్లవిచరణాదులుకాని లేక 'ధరణీధరా' 'శ్రీవేంకటేశ్వరా' మున్నగునాద్యంతసంబుద్ధులతో నున్నరచనలు వచనము లనిపించుకొన్నవి. ఈవచనములే తాళగంధిచూర్ణకము లనఁబడునవి. ఈ రెండు తెలుఁగులగేయఫణితులకును నడిమిమార్గముగా "విన్నపము" లనువేరొక తెలుఁగు రచనలనుగూడ తాళ్ళపాకవారు అనుసరించినారేమోఅని నాకు తోఁచుచున్నది. "తరువాతి కాలమున నిట్టివచనములు విన్నపము లనియుఁ బేర్కొనఁబడినవి." అని వేంకటేశ్వరవచనముల పీఠిక (పుట-10)లో శ్రీవేటూరిప్రభాకరశాస్త్రి గారు వ్రాసియున్నారు. స్థూలదృష్టి నిందు సత్యములేకపోలేదుకాని సూక్ష్మముగాఁ బరిశీలించినపుడు విన్నపములు వచనములకంటె నించుక భిన్నమైన వని తోఁపక మానదు. వామనుఁడు, విశ్వనాథకవిరాజు మున్నగులాక్షణికులు గద్యము చతుర్వి

ధము లనిరి. అనంతుఁడు తన తెలుఁగులక్షణమున గద్యమునే వచన మనియుఁ బేర్కొనెను. కాని తాళ్ళపాకవారి వచనములకంటే తరువాతికాలమునకుఁ జెందిన 'లక్షణశిరోమణి' (17వశతాబ్ది) యందు గద్య మైదువిధములుగా బేర్కొనఁ బడినది. తాళ్ళపాకవారి వచనములకంటె భిన్నమైన విన్నపములను గుర్తించియే కావలెను లక్షణశిరోమణికారుఁడు వచనములను, విన్నపములను భిన్నములుగా స్మరించెను. ఆతని లక్షణమున వచనములు బహుప్రకారనిచయప్రాచుర్యమ్ములై సంచరించినవి. విన్నపములు విన్ననై ఋజుమార్గమ్ముల ననుగమించినవి–

'విన్నపాలు వినవలె వింతవింతలు
పన్నగపుదోమతెర పై కెత్తవేలయ్యా' అని తాళ్ళపాకవారు విన్నపములను స్మరించినారు. విన్నపములుగా గుర్తింపఁదగిన తాళ్ళపాకవారి యీరచనలను దిలకింపుఁడు. 2–355, 356, 357, 358. 359, 360, 386మొదలగునవి.

### రామక్రియ

"మఱి నేనేమి సేయంగలను మాధవా నాశక్తిగల దిదియె
నెఱవుగ భువిలోఁగలిగిన వెల్ల నీ సొమ్ములే కలవి॥
ధరణీధరా నాతప మనంగా నేటిది
యిరవుగ నామనసు మీదెత్తుట యింతె నీకు
పరగంగ నాలోని భక్తి యనఁగా నేటిది
సరగున నాయాతుమ నీకు సమర్పణ యనుటె॥"
(3-556)

ఈరచన వచనసంకీర్తనరూపమగు విన్నపమని తలఁతును– ఇది చూడుఁడు.

### దేశాక్షి

"ఇది నీమాయయో యింద్రజాలమో యేమియు నెఱుఁగను
సదరపు నాకర్మవశంబుననే సంకల్పించెదనో యెఱుఁగను॥
మెఱయంగ గలలో నన్నియుఁ గందును మేలుకాంచితే నట్ల తాను
మఱచితిఁ దలంచితి సర్వాపరాధములు మఱి యన్నియునేఁ జేసితిని
తఱితో శ్రీ వేంకటేశ నాపాలిటిదైవమ యలమేల్మంగపతి
గుఱిగా నావిన్నప మవధరించు గోవింద గోవింద గోవిందా॥"
(2-359)

డనిని తాళ్ళపాకవారు ' విన్నప ' మనియే పేర్కొనినారు.

ఇవే కాక ద్రుతగతితో సాగు దరువులవంటి రచనలుకూడ తాళ్ళపాకవారి గేయకృతులలోఁ గలవు. మచ్చున కొకటి చూడుఁడు.

భైరవి

"కూరి మెఱింగి కైకోవు —నీ
బీరములే నెరపేవు ॥

రంతులు సేసిటు రావు - యెంతైనం జననీవు
చెంతలే కడుదలఁచేవు – యింతలో నెర వయ్యేవు॥

పొలయుచు నూరకె పోవు - గిలిగింపుచుఁ దిరిగేవు
చెలఁగుచు వడి మురిసేవు - నిలరా యించుక నీవు ॥

బొంకుచు నూరకె పోవు - తెంకికి నెవ్వతెఁ దేవు
వెంకటపతి నవ్వేవు - పొంకమైతి విఁకఁ బోవు॥"
(3-376)

ద్రుతగతితో, నంత్యానుప్రాసలతో సాగునిట్టిరచనలే దరువులుగా తరువాతికాలపు యక్షగానములవంటి నృత్యప్రబంధములం దధికముగా చేరినవి.

ఇట్లు వివిధగతులతో చిత్రవిచిత్రములగుపదములను రచించుటయేగాక తాళ్ళపాకకవులు తమకాలపు దేశిరచనాప్రక్రియలు గూడ నెన్నిటినో అనుసరించినారు. జానపదుల వ్యవహారమునందున్న ఫణితుల కన్నిటికిని వారు తమరచనలలో సాహిత్యతఁ గల్పించినారు. పూర్వపుమట్టులను తాళ్ళపాకవారు గ్రహించినట్లే వారి మట్టులను పెక్కింటిని తరువాతికాలమువా రనుసరించిరి. మన సంగీతసంప్రదాయ మిట్లే తరతరముల సాగివచ్చుచు నెప్పటికప్పుడు క్రొంగ్రొత్తను వెలయించుకొనుచున్నది. రేవణూరివెంకటాచార్యుఁడు తన శ్రీపాదరేణుమాహాత్మ్యము చతుర్థోల్లాసమున " రహసినామితా"- అనే శ్లోకాలరీతి అనిపేర్కొని మఱియు

"అమరసేవ్యమై అమితభవ్యమై । ప్రమదముఖ్యమై భక్తసౌఖ్యమై"

మున్నగుపంక్తులను రచించినాఁడు. ప్రాచీనపుమట్టులను వారెట్లు గ్రహించుచుండినది పై యుదాహరణము స్పష్టపఱచుచునే యున్నది. "ఈ రచనలనే-ఈ వరుస

లనే-యెవ్వరు దలఁచిన ఇహపరమంత్రము లిందరికి" (11-3-126) అని తాళ్ళపాకవారు తరువాతివారికి మార్గము చూపియున్నారు.

ఇప్పు డిఁక వా రనుసరించిన దేశిరచనాప్రక్రియలను గూర్చి యించుక వివరింతును. వానిలో స్త్రీలపాటలు, బాలగేయములు, పామరగేయములు మున్నగు రీతుల వింగడింపఁదగినరచన లున్నవి. వ్యష్టిగానములు, సంవాదములు, గోష్ఠి గానములు, సంబుద్ధి పదములు, పారమార్థిక గేయములు మున్నగురీతులఁ గూడ వానిని మరల వేరుపరుపవచ్చును.

ప్రస్తుత మిచట ఆ విభాగముల జోలికి పోక ఆయా పదరచనా ప్రక్రియ లనుగూర్చి మాత్రమే సంగ్రహముగ వ్రాయుదును.

## బాలగేయములు

**జోలపాటలు - లాలిపాటలు :**

దేశిసారస్వతమున పై గేయముల పుట్టుపూర్వోత్తరము లెట్టివో చెప్పుట కష్టము. పాల్కురికి సోమనాథుఁడే జోసఱచుచుఁ బాడు "జోలపాటలను పేర్కొని నాఁడు. కాలము కర్తృత్వము తెలియఁగరాని ప్రసిద్ధగేయము లిట్టి వెన్నియో ఉన్నవి. తాళ్లపాకవారు తమకుఁ బూర్వ ముండిన యీ గేయములను గూర్చి కొంత ప్రస్తావించియున్నారు. కొన్ని తాము రచించినారు. అన్నమాచార్య చరిత్ర ద్విపదలో :

"ఆడుచుఁ బతకమా కన్నల(లు?) జోల
పాడఁగ నాఁడెల్లఁ బసిబిడ్డ నైతి
నల కృష్ణమాచార్యు నధ్యాత్మవినుతి
రాకఁ గొన్నాళ్లు విరక్తుండ నైతి ॥" (చూ పుట 41)

అని కొన్ని పంక్తు లున్నవి. ఇందలి "పతకమా కన్నల జోల"నుగూర్చి వ్రాయుచు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు "అది పతకమాకో, లేక పతకమూరో లేక పొతకమూరో, ఇంకేదో ఆ యూరివాఁడయిన అన్నల అను గేయకవి జోలపాట రచించి యాడుచు నొండె స్వామి బాలుఁడై యాడఁగా నొండెఁ బాడెడివాఁడని యర్థము కాఁబోలును" అని వ్రాసియున్నారు. (చూ. పీఠిక పు. 61) కృష్ణమా చార్యునిసమకాలికులు పొతకమూరిసోదరు లారుగురుండినట్లు వారుపాడఁగా స్వామి

యాడుచుండినట్లును కృష్ణమాచార్యునిగూర్చి వ్రాసినచోట వివరించితిని. ఆ పౌతక మూరిఅన్నలు(సోదరులు)జోలపాడుటయే పైపంక్తులందు స్మరింపఁబడినయంశము కాఁదగును. "పతకమాకన్నలు జోల పాడఁగ" అని వాక్యముండఁ దగు నేమో. ఈ జోలపాట యేదోమన కీనాఁడు తెలియదు. ఇట్లే తాళ్లపాకవారు "బలసోదరుని మీఁది (లాలి)పాటనుగూర్చియు (చూ. చిన్నన్న పరమయోగివిలాసము పు.314) ప్రస్తావించినారు. ఇదియు నెట్టిదో తెలియదు. లభ్యములై సుప్రసిద్ధములై యున్న వారి పదము లివి తిలకింపుఁడు.

అన్నమయ్యా లాలి :

శ్రీరాగం — జంపెతాళం

"లాలనుచు నూచేరు లలన లిరుగడల
బాలగండవరపుగోపాల నినుఁ జాల ॥

ఉదుటు గుబ్బలసరము లుయ్యాల లూగ
పదిరి కంకణరవము బహుగతుల మ్రోగ
వొదిఁగి చెంపల కొప్పు లొక్కింత వీఁగ
ముదురుచెమటల నళికములు తొప్పఁదోఁగ॥"

(అన్న. చ. పీ. పు. 63)

ఈ లాలిపాట ఖండగతిలో రమ్యముగ నున్నది. ఇది (తాళ్ళపాకవారికే అగ్రహారముగ చెల్లుబడియైన) గండవరమునందలి గోపాలుని నామాంకముతో నున్నది.

అన్నమయ్యా జోలపాట :

రాగం — అటతాళం

"జోవచ్యుతానంద జోజో ముకుంద
రావె పరమానంద రామగోవింద ॥

అంగజునిగన్న మాయన్న యిటు రారా
బంగారు గిన్నెలో పాలు పోసేరా
దొంగ నీవని సతులు పొంగుచున్నారా
ముంగిట నాడరా మోహనాకారా॥

అంగుగాఁ దాళ్ళపా కన్నయ్యా చాల
శృంగార రచనగాఁ జెప్పె నీజోల
సంగతిగ సకలసంపదలు నీవేళ
మంగళము తిరుపట్ల మదనగోపాల ॥" (అ.చ.పీ.పు. 62)

సుప్రసిద్ధమగు నీ జోల శ్రీ విస్సా అప్పారావుపంతులుగారియింట వారి పూర్వులు వ్రాసి యుంచుకొన్న మంచి సంకీర్తనముల సంచయమునుండి సేకరించి శ్రీ ప్రభాకరశాస్త్రిగారే తొలుత నది అన్నమాచార్యునిపేర నుండుటను గుర్తించిరి. (చూ. అన్నమా. చరిత్ర పీఠిక పు. 61) ఖండగతిలోనున్న యీ పదము తిరుపట్ల మదనగోపాలుని నామాంకముతో నున్నది. వీరి "జోజో యని మీరు జోల పాడరో" (9-172) అనునదికూడ జోలపాటయే.

**ఉయ్యాలలు—డోలలు :**

ఈ ఉయ్యాలపాటలలో తాళ్ళపాకవారు పెక్కు పోకడలు పోయినారు. పసిబిడ్డలను తొట్టెలలోఁ బెట్టి యూచునపుడు పాడు పాట లివి. అన్నమాచార్యుని పద మిది చూడుఁడు.

శంకరాభరణం

"ఉయ్యాల బాల నూచెదరు కడు
నొయ్య నొయ్య నొయ్యనుచు ॥

బాలయవ్వనులు పసిఁడి వుయ్యాల
బాలుని వద్దం బాడేరు
లాలి లాలి లాలి లాలెమ్మ యెల్ల
లాలి లాలి లాలెనుచు ॥" (3-514)

హాయీ, ఓయీ అనుచు, లాలి పాడుచు నుయ్యాల లూపు విషయ మిందు వర్ణితమైనది. శ్రీరంగ శిశువుమీఁది యీ పాటను తిలకింపుఁడు.

అహిరి

"తొల్లియును మర్రాకు తొట్టెలనె వూగీ గన
చెల్లుబడి నూగీని శ్రీరంగ శిశువూ ॥

అదివో కమలజుని తిరువారాధనం బనఁగ
అదనఁ గమలభవాండ మను తొట్టెలన్
ఉదధులు తరంగములనూచఁగా నూగీని
చెదరని సిరులతోడ శ్రీరంగ శిశువూ ॥

వేదములే చేరులై వెలయంగ శేషుఁడే
పాదుకొను తొట్టెలై పరగఁగాను
శ్రీదేవితో గూడి శ్రీవేంకటేశుఁడై
నేదదేరెడివాఁడె శ్రీరంగ శిశువూ ॥" (3–474)

ఇందలిభావము "జో వచ్యుతానంద జోజో ముకుందా" అనుపాటలో నేఁడు మనము ప్రసిద్ధముగాఁ బాడుకొను,

"తొలుత బ్రహ్మాండంబు తొట్టె గావించి
నాలుగూ వేదముల గొలుసు లమరించి
బలువైన ఫణిరాజు పాను పమరించి
చెలియ డోలికలోన జేర్చి లాలించి ॥"

అను చరణభావమును తలపించుచున్నది. రెండును అన్నమాచార్యుని రచనలే. ఇవికాక చంచలమై డోలాయమాన మగు నుయ్యాలను బట్టి "ఉయ్యాలా" అనుసంబుద్ధితో నున్న వారి పారమార్థికగేయ మిది చూడుఁడు.

ఆహిరి

"అలర జంచలమైన ఆత్మలం దుండని అలవాటు సేసెనీ వుయ్యాలా
పలుమారు నుచ్ఛ్వాస పవనమం దుండనీ భావంబు దెలిపెనీ
వుయ్యాలా ॥" (2-68)

ఇందును ఉదయాస్త గిరులు కంబములై యుడుమండలమును మోచుటయు, వేదములు చేరులై వెలయుటయు మున్నగువిషయములు వర్ణితములైనవి.

ఉయ్యాలకే డోల యనియు పేరు. తాళ్ళపాకవారికాలమున తిరుమలమీఁద స్వామివారికి "డోలోత్సవము" మహావైభవముగా సాగెడిది. ఆసందర్భమునందు రచించినదేమో వారి యీడోలపదమును గాంచుఁడు.

వరాళి

"డోలాయాం చల డోలాయాం హరె డోలాయాం
మీనకూర్మ వరాహ మృగపతి యవతారా
దానవారే గుణశౌరే ధరణీధర మరుజనకా
వామన రామ రామ వరకృష్ణ అవతారా
శ్యామలాంగా రంగరంగా సామజవరదా మురహరణా ॥"
(7-140)

ఇందు క్రమమున దశావతారములు వర్ణితము లైనవి. ఈ శిఖాపదము నందలి "డోలాయాం చల డోలాయాం" అనువరుసనుబట్టి దీనిని "డోలాపదము"గా నేను గుర్తించుచున్నాను. శార్ఙ్గదేవుడు పేర్కొన్న ప్రబంధ ప్రకీర్ణక జాతులు ముప్పదియారింటిలోని "ఢోల్లరీ" అను గేయరచనా ప్రక్రియ యిదియే కావచ్చును. అతడు దీనివెంటనే పేర్కొన్న "లోలీ" అను వేరొకప్రక్రియ కూడ మన "లాలి" యే కావచ్చును. 1

*ఉగ్గుపాటలు :*

భైరవి

"ఉగ్గు పెట్టరే వోయమ్మా —చె
య్యొగ్గె నిదే శిశువోయమ్మా ॥"
కడుపులోని లోకమ్ములు కదలీ
నొడ లొంచకురే వో యమ్మా
తొడికెడి సరుగున దొలఁగఁదియ్యరే
వుడికెటి పాలివి వోయమ్మా॥
చప్పలువట్టుక సన్నపు బాలుని
నుప్పర మెత్తకు రోయమ్మా
అప్పుడె సకలము నడిమీ నోరనె
వొప్పదు తియ్యరె వోయమ్మా॥" (3-483)

1. "ఓలీ, ఢోల్లరీ, ఊయలపాట లనిగాని, జోల లనిగాని, లోలీ లాలి పాటలని గాని ఊహిస్తే ఆ ఊహ సరికావచ్చునా ? పరిశోధన యింకా జరగవలసినవిషయ మిది. సరియైన దృష్టాంతాలూ సమగ్రమైన లక్షణమూ దొరికితే సరిపోల్చవచ్చు." అని శ్రీ రజనిగారు తమ వాగ్గేయకారచరిత్ర పుట 73లో వ్రాసి యున్నారు.

ఇది పసిబిడ్డల కుగ్గువెట్టునప్పటి పాట - ఉగ్గువెట్టినపిదప తల్లులు బిడ్డలచేతులు, కాళ్లు కుడియెడమలుగా వంచి "జీర్ణం జీర్ణం" అని పాడి, పొట్టనిమిరి, జబ్బలుపట్టి పైకెత్తి యొడిలోఁ గూర్చుండబెట్టుకొందురు. లేదా ఉయ్యాలలోనికిఁ జేర్తురు. తాళ్ళపాకవారి పై "యుగ్గుపాట"లో పైచేష్ట లన్నియు వర్ణితములైనవి. చతురస్ర గతిలో సాగునీపదము సంప్రదాయాగతమగు నుగ్గుపాటలవరుసలోనే యున్నది

*బాలక్రీడాగానము- దోబూచులు : కూగూగులు :*

పసిబిడ్డలను లాలించునపుడు, ఆడించునప్పుడును పెద్దలు గేయముల నాలపించుట పరిపాటియే. అట్టివానినిగూడ తాళ్ళపాకవారు కొన్ని రచించిరి. చూడుఁడు.

మంగళకౌశికి

"అబ్బురంపు శిశువు ఆకుమీఁది శిశువు
దొబ్బుదురోలి శిశువు త్రుప్వి త్రుప్వి త్రుప్వి ॥"(3-288)

చతురస్రగతిలో సాగునీపదము, ప్రసిద్ధమగు "చందమామ రావే జాబిల్లి రావే" అనుబాలగేయమువరుసలో నున్నది. ఈపదమందలిగతి మాత్రమే కాక తుద నున్న "త్రుప్వి త్రుప్వి త్రుప్వి" యనుచమత్కారజల్పము బిడ్డల నాకర్షించునదిగా నున్నది. తెనాలిరామలింగనిరచనగా తలంపఁబడు "త్రుప్వటబాబా" పద్యము నిట స్మరింపఁదగును. ఇట్టిదే మఱియొకపదము.

ధన్యాసి

"బండి విరిచి పిన్నపాపలతో నాడి
దుండగీడు వచ్చె దోబూచీ ॥

పెరుగు వెన్నలును ప్రియమున వే
మరు మ్రుచ్చలించు మాయకాఁడు
వెరవున్నఁ దనవిధము దాచుకొని
దొరదొంగ వచ్చె దోబూచీ॥

గొల్లపల్లెలో యిల్లిల్లు జొచ్చి
కొల్లలాడిన కోడెకాఁడు

యెల్ల యినా వేంకటేశుం డిదే
తొల్లిటి దొంగవచ్చె దోబూచీ ॥" (3-295)

"దోబూచి"యను బాలక్రీడావిశేషమునే మకుటముగా దీసికొని తాళ్ళపాకవారి "దోబూచిపదము"లు రచించిరి. తల్లులు సాధారణముగా తమకళ్లకు చేతు లడ్డముగాఁ బెట్టుకొని 'దోబూచీ' యనుచు గప్పునతెరచి బిడ్డలను విస్మయపరచు చుందురు. ఇట్టి క్రీడయే "దాగిలిముచ్చు"లాటయగును. తల్లి దొరదొంగకళ్లు మూయఁగా తోడి-దొంగలు దాగికొందురు. దొరదొంగ వారిని వెదకి బట్టుకొనుట క్రీడ. ఈ దాగిలిముచ్చులపై కీర్తనమున వారు "దోబూచి"యాటగా ప్రశంసించినట్లున్నారు. తాళ్ళపాకవారి "కూగూగుపదము"కూడనిట్టి బాలక్రీడావిశేషమును వర్ణించునదే. చూ. కీర్తనము-

శంకరాభరణము

"గుఱుతెఱిఁగిన దొంగ కూగూగు- వీఁడె
గుడిలోన దాగీని కూగూగు ॥

నెలఁతల దోఁచేని నీళ్లాడగానే
కొలనిదరిని దొంగ కూగూగు
బలులైన వుట్లపా లారగించేని
కొలఁది మీరిన దొంగ కూగూగు ॥

తావుకొన్న దొంగఁ దగిలిపట్టుఁ డిదె
గోవులలో దొంగ కూగూగు
శ్రీ వేంకటగిరి చెలువుండొ యేమొ
కోవిదుఁ డగుదొంగ కూగూగు ॥" (4-56)

ఇది కూగూగుపదము [1]. ఇదియు చతురస్రగతిలో సాగునదే; బాలక్రీడల సందర్భమున వెనుకటికీర్తనలో 'దోబూచీ' అను పద మూతగా వచ్చినట్లే ఈ సంకీర్తనమున 'కూగూగూ' అను పదము వచ్చిచేరినది. కోతికొమ్మచ్చులాడుకొనునప్పుడు బాలురు నేఁటికిని "గుగ్గుగూ కొమ్మంచు" ఇత్యాదిగా కొన్ని

---

1. ఈ కూగూగు పదమునుగూర్చి పరిశోధన – ఆగష్టు 1954 సంచికలోని "జానపదసాహిత్యోద్ధారకులు" అను నా వ్యాసమునఁ గొంత వివరించియుంటిని.

యాతపదములను బలుకుచుండుట గలదు. ఆ యాతపదముల కర్థము "అదు గడుగో కొమ్మంచున న్నాఁడు" అనియే.

అడుగడుగో అను పదమే "గోగోగో గొగ్గోగో, గుగ్గూగూ, కూగూగూగా కాలాంతరమున నేర్పడినట్లున్నది. ఆటలలో దొంగ లితరులను బట్టబోవునపుడు తక్కిమి తకిమి 'అగ్గో' అని చూపవలసినపుడు ''గూగూగూ'' అను నూతపద మును ప్రయోగించుచుండుట పరిపాటియే అని శ్రీ విస్సా అప్పారావు పంతులు గారు నాకు తెలిపియుండినవిషయము నీవఱకే పరిశోధన పత్రికలో వ్రాసియు న్నాను. ఈ పదమున దొరదొంగ యైనవాఁడు గుడిలో దాఁగిన బాలకృష్ణుని ''అడుగడుగో" అని రెట్టించి పట్టఁబోవు సందర్భమునసే పలికినట్లుగా 'కూగూగు' అను నూతపదము చేరియున్నది. కనుక "దోబూచీ" వంటిదే ఈ "కూగూగు" పదమును.

## స్త్రీలపాటలు :

తాళ్ళపాకవారి సంకీర్తనములలో స్త్రీలపాటలుగాఁ జెప్పఁదగిన పెండ్లి పాటలు, శోభనములు, మంగళాలు, గొబ్బిళ్లు, సువ్విసువ్వాలలు, నివాళులు, సోది పాటలు మున్నగువృత్తులపాటలు, మున్నగునవి కొన్నియున్నవి. సోదాహరణ ముగా వివరింతును.

## పెండ్లి పాటలు:

దేవునిపెండ్లిసందర్భమున తాళ్ళపాకవా రెన్నియో పాటలుపాడి వినిపించి యున్నారు. వారిపెండ్లిపాటలలోని నాయికానాయకులును, పరివారమువారును, దివ్యులే యగుటచేత నందలిప్రశంసలందో, పరిహాసమునందో అలౌకికతయే అధి కముగ బ్రస్ఫుటమగుచుండును. అయినను గొంత లౌకికపువినోదముకూడ లేక పోలేదు. పెండ్లికూతురుమీఁదను, పెండ్లికొడుకుమీఁదను తోడియువతులు పాడిన చమత్కారపుపాటలను గనుఁడు.

శ్రీరాగం

"పిడికిట తలఁబాల పెండ్లికూతురు కొంత
పెడమరలి నవ్వీనె పెండ్లి కూతురు ॥

పేరుకల జవరాలె పెండ్లి కూతురు పెద్ద
పేరులముత్యాలమెడ పెండ్లి కూతురు
పేరంటాండ్ల నడిమి పెండ్లి కూతురు విభుఁ
బేరుగుచ్చ సిగ్గువడేఁ బెండ్లి కూతురు ॥" (12–184)

సిగ్గుపడుచున్న పెండ్లికూతురును మగనిపేరు చెప్పుమని యడికించు టిందు వర్ణితమైనది. పెండ్లికొడుకును ప్రశంసించినవిధము గనుఁడు.

బౌళి

"పెట్టనికోటిందటికిఁ బెండ్లి కొడుకు బొమ్మఁ
బెట్టె నసురులకెల్లఁ బెండ్లి కొడుకు ॥
పెల్లగించి భూమెత్తి బెండ్లి కొడుకు వాఁడె
పిల్లఁ గ్రోవిరాగాలఁ బెండ్లి కొడుకు
పెల్లైనయావుల పెండ్లి కొడుకు వీఁడె
పిల్లదీపు పెన్నుద్ది పెండ్లి కొడుకు ॥
పేంట పెరుగులదొంగ పెండ్లికొడుకు భూమిఁ
బెంటిపోతులఁగూరిచెఁ బెండ్లి కొడుకు
గెంటులేని వెంకటగిరిమీఁదను వాఁడె
పేంట పెట్టుకున్నవాఁడు పెండ్లి కొడుకు॥" (12-185)

ఈవర్ణనము నర్మగర్భముఁగా నున్నది. ఇఁక వైవాహికక్రమమును వివరించు కీర్తనము లున్నవి. చిన్నన్న తన ద్విపదకావ్య ములలో నప్పటిపెండ్లిండ్లనుగూర్చి విపులముగా వ్రాయుచు పురోహితుఁడు మంగ ళాష్టకములుచదువుటయు, ముత్తైదువలు శోభనములుపాడుచు కోలాహల మొనరిం చుటయుఁ జక్కఁగా వర్ణించియున్నాఁడు. పెండ్లిపాటలలోఁ జేరినవే శోభన ములును మంగళములును-

**శోభానలు:**

పెండ్లిండ్లయందు పెద్దముత్తైదువలు 'సొక్కుచు పాడరమ్మ శోభనపా టలు" అని హెచ్చరించుకొనెడివారు. దేవునిపెండ్లికి భారతియు, గిరిజయు శోభ నాలు పాడిరట ।

వసంతం

"శోభనమే శోభనమే
వైభవముల పావనమూర్తికి॥ " (3-18)

అను అన్నమయ్యగారిశోభనపుపాట నీవఱకే యుదాహరించియుంటిని. ఈపాట చతురస్రగతిలోనడచి చరణాంతములందు "శోభనమే శోభనమే" అను పల్లవి వచ్చునదిగా నున్నది. తాళ్ళపాకవారి ఈ శోభనపదమునే నేఁటికిని భజనపరులు సంప్రదాయమననుసరించి పాడుచున్నారు.

**ధవళాలు—మంగళాలు :**

నివాళులు, ధవళములు, మంగళములు, సుప్రసిద్ధదేశిరచనాప్రభేదములుగా ప్రాచీనలాక్షణికు లందరును జెప్పినవిషయమే. చాళుక్యజగదేకమల్లుని సంగీతచూడామణిలో (క్రీ॥ 920 ప్రాంతము)

"ధవళాదిపదైః పాదై రాశీర్వాద సమన్వితైః
ఛందసాయేనకేనాపి కర్తవ్యో ధవళాభిధః" అని గలదు.

ఆశీర్వాదాత్మకమైనదే ధవళము. ఈ లక్షణమునుబట్టియే ధవళములకు వివాహాది శుభకార్యములందు ప్రయోగ మధికమై యుండును. అందుకే చాళుక్యసోమేశ్వరుని అభిలషితార్థచింతామణిలో (క్రీ॥ 1174)

"కథాసు షట్పదీ యోజ్యావివాహే ధవళా స్తథా
ఉత్సవే మంగళోగేయ శ్చర్యా యోగిజనై స్తథా॥"

అని గలదు. వివాహములందు ధవళములును, ఉత్సవములందు మంగళములును ప్రయుక్తములు కాఁదగునని భావము.

ఆ పిదప శార్ఙ్గదేవాదు లందరును ధవళములను, మంగళములను విడివిడి గేయరచనలుగాఁ బేర్కొన్నవారే. తెలుఁగున గౌరనాదులు కూడ నిట్లే పైమధుర కవితాశాఖారచనల నెన్నిరి. ఆ తరువాతి తెలుఁగుకవులును, లక్షణకారులును, పరిపాటి చొప్పున ధవళములు, మంగళములు, శోభానలు, సువాలలు, మున్నగు వాని నన్నిటిని ప్రత్యేకములగు గేయరీతులుగనే యుదాహరింపసాగిరి.

కాని వాస్తవమునకుఁ జూడగా నక్షతలు చల్లుచు శుభకార్యములందు

పాడఁదగిన పైగేయరచన లన్నియు ఛందోభేదము లెట్లున్నను ఆశీర్వాదాత్మక ములే యగుటచేత ధవళములే యని పేర్కొనఁదగును. ఆదృష్టితోడనే కావచ్చు నేమో సుగ్రీవవిజయమున రుద్రకవి శ్రీ రామచంద్రునిమీఁద శోభనపాటను ధవళముగానే పేర్కొనినాఁడు.[1] తాళ్ళపాకచిన్నన్న ఉషాకల్యాణము (పుట 89)న "పాడవే యొకపెండ్లిపాట సొంపార। పాడవేధవళంబు పాడరే యనిన''। అని ధవళమును ఆశీర్వాదాత్మకములైన పెండ్లి పాటలకుఁ బర్యాయముగనే ప్రయోగించి యున్నాఁడు. తరువాత తంజావూరి యక్షగానములం దీగేయరచనా ప్రక్రియలలో భేదసాంకర్యములు రెండును పాటింపఁబడుచు వచ్చినవి. పూర్వులు జయదేవుని "ప్రళయపయోధిజలే- జయజగదీశహరే" పదమును 'కీర్తిధవళము'గా ప్రస్తుతించుటచేతకాఁబోలును జయారంభమును, అంత్యానుప్రాసమును గల రచనలను తరువాతివారు ధవళము లనియు, శోభానే అని ముగియువానిని శోభానగేయము లనియు, మంగళముతో ముగియువానిని మంగళములనియు, వైభవ వైభోగ పదములతో ముగియువానిని వైభోగపదము లనియు, సువ్విసువ్వాలలతో ముగియు వానిని సువ్వాల పదములనియుఁ బలుదెఱఁగులుగఁ బిలువసాగిరి. ఇంతేకాదు జయము మంగళము రెండును మేళవించిన వానిని జయమంగళాలనియుఁ బేర్కొనిరి. యక్షగానరచనలలో శోభానలును మంగళములును విడిగానే పేర్కొనఁబడినను, శోభనములను గూర్చి వ్రాయునపుడు "మంగళము పాదేమార్గం పరాకు" అని వ్రాసిన పట్టులు కూడ లేకపోలేదు. అనఁగా షష్ఠ్యంతములతో సాగు నా శోభనములను మంగళములను వారు తుల్యముగనే భావించినారని చెప్పవచ్చును.

చిన్నన్న ద్విపదలలో ధవళముల ప్రశంస పెండ్లిపాటలరూపమున దెచ్చెను. తాళ్ళపాకవారి గేయములలో శోభానలు, మంగళాలు, జయమంగళాలు, సువ్వాలలు, వైభోగములు, మున్నగురీతులేకాని 'ధవళ' మని విడిగా వారు పేర్కొన్న గేయరచనలేవియు నేజూచినంతవరకుఁ గానరాలేదు. దీనిని బట్టియు చిన్నన్న పేర్కొన్నయంశములనుబట్టియు, నాకుఁ జూడఁగా పైవివాహ ఉత్సవాది శుభ సమయములందు పాడఁబడుగేయముల నన్నిటిని వారు ధవళము లనియే వ్యవహరించినారేమో యనిపించుచున్నది. వారి యీపదమును జూడుఁడు.

---

1. చూ. సుగ్రీవవిజయము - పుట-40.

గుండక్రియ

"జయజయ రామా సమరవిజయరామా
భయహర నిజభక్తపారీణరామా॥

జలధి బంధించిన సౌమిత్రరామా
సెలవిల్లు విరచిన సీతారామా
అల సుగ్రీవు నేలిన అయోధ్యరామా
కలిగి యజ్ఞముగాచే కౌసల్యరామా ॥" (9–11)

ఇది జయారంభముతో పాదాంత్యానుప్రాసలతో నొప్పి తరువాతికాలపు యక్షగానములందలి ధవళములతోఁ బోల్పఁదగినదిగా నున్నదిగావున దీనిని ధవళమనిపేర్కొందమా? (చూ. అలమేలుమంగా విలాసమునందలి "జయ రవి కోటి సంకాశా- జయజయ కారుణ్యనివాసా" ఇత్యాదిగానున్న ధవళము.)

బౌళి

"విదురునివిందా విజయీభవ
హృదయేశ్వర విజయీభవ ॥" (2-165) అని

కేవల ఆశీర్వాదాత్మకమగు కీర్తనము వేరొకటియున్నది. ఇదియు ధవళమే యగునా? ఏమో! కాని నాకు వీనికన్న నీదిగువపేర్కొన్నకీర్తనములవంటివే తాళ్ళపాకచిన్నన్న పేర్కొన్న ధవళము లైయుండునని తోఁచును. చూడుఁడు.

గుండక్రియ

"జయమంగళము నీకు సర్వేశ్వరా
జయమంగళము నీకు జలజవాసినికి ॥

కొలచినవారికి కొంగుపైఁడి
ములిగినవారికి మొనవాఁడి
కలిగిన శ్రీ వేంకటరాయా
మలసి దాసులమైన మాకు విధేయా ॥" (7–197)

ఇందు ధవళమువలె జయాంక మున్నది. చరణములందు పాదాంతానుప్రాస మున్నది. మంగళమువలె షష్ఠిలో మంగళాశాసన మున్నది. ఇట్టి 'జయమంగళా'లే

తాళ్ళపాకవారి ధవళములగు నని నాభావము. ఈధవళముల నానాఁడు ఆడువారు పాడుచుండినతెఱఁగును చిన్నన్న చాల చక్కఁగ వర్ణించి యున్నాఁడు. చూడుఁడు.

"పాడరే యొకపెండ్లిపాట సొంపార
పాడరే ధవళంబు పాడరే యనిన
కవగూడి యిద్దరు గబ్బి గుబ్బెతలు
ధవళంబు వాడి చిత్తరముగా నిలువ
దొమ్మి పేరంటాండ్లు తోడనే వేడ్క
ఘుమ్మని పల్లవుల్ గూడి పాడంగ
నాగమోక్తముగా నావధూవరుల
యీగతి పరిణయం బిందిరావిభుఁడు (గావించి)"
(ఉషా కల్యాణము— పుట· 89)

ఇందు చరణముల నిరువురు కోడుగూడి పాడుటయు, పల్లవిని పలువురు గోష్ఠిగా నందుకొనుటయు వర్ణింపఁబడినది· ఇట్లు పెండ్లిండ్లలో ఆనాఁడు స్త్రీలుగోష్ఠిగాన ముగా నాలాపించుచుండిన జయమంగళాలే నాఁటి ధవళములేమో ; 3-227 5-46; 273; మున్నగు 'మంగళ' 'జయమంగళ' 'శుభమంగళ' కీర్తన లన్నియు నిట్టివే.

ఈమంగళములు పాడునపుడే కర్పూరహారతు లిచ్చుటయు, పారాణి పళ్లెము లెత్తుటయుఁ బరిపాటి— అందుకే అట్టిసందర్భములందు పాడుపాటలకు 'మంగళారతు' లనియుఁ బేరైనది. ఉత్సవసందర్భలందు తాళ్ళపాకవారు పాడిన మంగళములన్నియు"మంగళారతులే ; "

**నివ్వాళిపాటలు:**

దిష్టితీయుటకై పారాణిపళ్లెము నెత్తుచు పాడుపాటలే "నివాళిపాటలు" ఈనివాళిపదములను సోమనాథుఁడు పేర్కొనియున్నాఁడు. శ్రీహస్నాబాద నాగ లింగశివయోగి యనువారు ప్రాచీనమగు "నివాళిపాట" నొకదానిని సేకరించి భారతి డిశంబరు- 1963 సంచికలో ( పుట 77 ) లో ప్రకటించియున్నారు.

"నివ్వాళి ప్రభురాయ నివ్వాళి బసవ
నివ్వాళి గురుమూర్తి నీకు నివ్వాళి

అఖిలేశ లోకేశ అమితప్రకాశ
నిఖిలలోకారాధ్య నీకు నివ్వాళి"

ఇత్యాదిగా పదమూడుచరణములుగల నివాళిపాట నుదహరించుచు వారు "మంగళహారతికి నివాళి పర్యాయపదము. పాల్కురికి సోమనాథుని కాలమున శుభసమయములందు "నివాళి" పాడుట యాచారమై యున్నట్లుగా తోచుచున్నది. రానురాను "నివ్వాళి"యే మంగళముగా మారినదా? అన్నమయ్య కాలమునుండి మంగళములు పాడుట యాచారమయ్యేనేమో!" అని వ్రాసియున్నారు. అన్నమయ్యనాఁటికి "నివాళి" మంగళముగా మారినదేమో అనుకొనుట సరికాదు. తాళ్ల పాకవారి నివాళిపదములు వేరుగా నున్నవి. వివాహోత్సవాది శుభసమయములందు పాడఁబడు శోభన, మంగళ, వైభోగ, నివాళి పదము లన్నిటిని తాళ్ళపాకవారు "ధవళము" లనియే పేర్కొనియుండుటను ముందే వివరించితిని. "దిష్టితాకీ మాయయ్యకు తెర వేయరే" అని తాళ్ళపాకవారు పాడియున్నారు. అట్టి దిష్టి తాకకుండ కాఁబోలును అన్నమాచార్యుఁడు పాడినయీపాటను నివాళిపాటగా గుర్తించుచున్నాను.

శంకరాభరణము

"వలపులు వలపులు వయ్యాళి
చలమిరి మరుఁడును సమేళి

నెలఁత మోమునకు నీకనుచూపులు
నిలువున ముత్తెపునివాళి
కొలఁదికి మీరిన గురుకుచములకును
తొలకునీమనసు దువాళి॥" (13-292)

ఇందు అమ్మవారిమోమునకు స్వామివారి కనుచూపులు "ముత్తెపునివాళి"గా వర్ణితము లైనవి. పాదాంతముల తీరునుబట్టి యిది నివాళిపదమే కాఁదగునని తోఁచుచున్నది.

**సువ్విపాటలు :**

సువ్వి సువ్వాలలు ప్రధానముగా దంపుళ్లపాటలే. ఇవే రోఁకటిపాటలు. వడ్లుదంపునపుడు శ్రమాపనయార్థము అనుకొను "ఇస్" అను ధ్వన్యనుకరణ

శబ్దమే పోటువేయునూపులో "సువ్వి"యని యేర్పడినట్లున్నది. ఈ ధ్వన్యను కరణశబ్ద మూతగాఁగల పాటలే సువ్విపాటలు.నన్నిచోడుఁడు కుమారసంభవమున శబరకామినులు "పటికపురోల ముత్యాలు ద్రొక్కుచు గౌరుకొమ్మురోఁకట గొనిదంచు"చు రసోత్కటముగఁ బాడినట్లు వర్ణించియున్నాఁడు. "రోఁకటిపాట లట్లు వేదము" లని పాల్కురికి సోమనాథుఁడును వానిప్రాచుర్యమును పలుకుబడి రూపమున ప్రశంసించెను. ఈ సువ్విపాటలలో రచనావిషయ మేదోయుండ వలెను గావున శైవులు శైవసంబంధిరచనలు గావింపఁగా వైష్ణవులు విష్ణుసంబంధిరచనలు గావించినారు. పల్లెప్రజలుమాత్రము వడ్లమీఁదను, రోలురోకండ్ల మీఁదను తమమీఁదను పాడుకొన్నారు. విన్నకోట పెద్దన రోఁకటిపాటలు తరువోజ ఛందమునకు సంబంధించిన వని తెల్పియున్నాఁడు. సువ్విపాటలన్నియు, ద్విపద తరువోజల ఛందములకు సన్నిహితమగు గతులు గలిగియే యున్నవి. సువ్వి పాట లన్నియుఁ బ్రధానముగా తొలినాళుల నుండియు ఖండగతిలోనే సాగు చున్నవి. "సువ్వి సువ్వి రామచంద్ర సువ్వి సువ్వి కీర్తిచంద్ర" వంటి రచన లొకకొన్ని త్ర్యస్రగతిలోఁగూడ నడచినవి లేకపోలేదు. దంపుళ్ళ సువ్విపాటలకు ఖండగతియే ప్రసిద్ధముగావున తాళ్ళపాకవారును అట్లే సువ్వులను రచించినారు. చూ. కీర్తనములు.

భూపాలం

"సువ్వీ సువ్వీ సువ్వాలమ్మా
నవ్వుచు దేవకి నందను గనియె॥

శశి వొడిచె అలసంబులు గడచె
దిశల దేవతల దిగుళ్లు విడిచె
కావిరి విరిసె కంసుఁడు గినిసె
వావిరిఁ బువ్వుల వానలు కురిసె ॥" (3-427)

ఇందలి గతి స్పష్టముగ తరువోజలందలి ఖండగతియే.

"నవ్వూచు- దేవాకి- నందాను- గనియే- దిశాలాదే, వాతాల దీగూళ్లి విడిచే...—కావిరి విరిసే—, కంసూఁడూ, కినిసే—" ఇత్యాదిగా పాడునపుడు మాత్రాకాలమును ఖండగతికే సరిపుచ్చుకొని పాడుట పరిపాటి-ఇట్టిదే వారి-

కేదారగౌళ

"సువ్వి, సువ్వి, సువ్వాని
సుదతులు దంచెద రోలాల॥

ఘల్లు ఘల్లు మని కంకణరవముల
పల్లవపాణుల కోలాల
అల్లననడుములు అసియాడుచు సతు
లొల్లనె దంచెద రోలాల॥" (3-419)

అనుపదమును.

ఇది స్థూలదృష్టికి "తకతక" అనుచతురస్రగతిలో సాగునట్లు తోఁచునే గాని వాస్తవమున కిది "ఘల్లూఘ- ల్లూమాని- కంకాణ- రవమూల- పల్లావా- పాణూల-కోలాలా-ఆ..." అని ఖండగతిలో పాడవలసినదే. త్ర్యస్ర చతురస్ర గతు లీపాటల కంతప్రసిద్ధములుగావు కనుకనే వానినివిడిచి తాళ్ళపాకవా రీసువ్వి పాటలకుఁ బ్రఖ్యాతమగు ఖండగతినే వాడుకొనినారు. సువ్విపాటల మట్టులో వారు ప్రదర్శించిన తాత్త్వికతను గనుఁడు:

కేదారగౌళ

"పరమాత్ముని నోరఁ బాడుచును నిరు
దరులు గూడఁగఁ దోసి దంచీ మాయ॥

కొలఁది బ్రహ్మాండపుఁ గుంచెనలోన
కులికి జీవులను కొలుచు నించీ
కలికి దుర్మోహపురోఁకలి వేసీ
తలఁచి తనువులను దంచీ మాయ॥" (5-72)

**గొబ్బిళ్ళపాటలు:**

తెలుఁగునాట ప్రాచీనములైన గేయరచనలలో "గొబ్బిళ్ళు" పేర్కొనఁ దగినవి. పాల్కురికిసోమనాథుఁ డీపదములనుఁ బేర్కొనియున్నాఁడు. అంతే కాదు. చుట్టును చప్పటులుపెట్టి, గునిసి గునిసి యాడుటనుగూడ వర్ణించి యున్నాఁడు. మార్గశిరమాసమున స్త్రీలు, బాలికలు గుమ్మాలముందు గుంపులు

చుట్టి వలయాకారముగ తిరిగి చప్పట్లుచఱచుచు నీగొబ్బిపాటలఁ బాడుదురు. తాళ్ళ పాకవారి ప్రసిద్ధమగు నీగొబ్బిపదమును జూతఁచగును.

దేసాళం

"కొలనిదోపరికి గొబ్బిళ్లో యదు
కులస్వామికిని గొబ్బిళ్లో॥
కొండగొడుగుగా గోవులఁగాచిన
కొండుకశిశువుకు గొబ్బిళ్ళో
దుండగంపుదై త్యుల కెల్లను తల
గొండుగండనికి గొబ్బిళ్లో॥" (3-484)

చతురస్రగతిలో సాగునీగొబ్బిపదము కరతాళగతుల కనుకూలమగు లయవిన్యాసముగల చక్కనిరచన. గొబ్బిపదముల కీపేరు వానిపాదాంతచరణాంతములం దావృత్తములగు గొబ్బి, గొబ్బిళ్లో, గొబ్బియళ్లో, యను పదములను బట్టి యేర్పడినది. గొబ్బియలు, గొబ్బిళ్లు అనుపదము గోపికలు అనుపదము నుండి పుట్టినదనియు, గొబ్బిళ్ళయాట రాసక్రీడా నృత్యమే యనియు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు అభిప్రాయపడియున్నారు. కాని యిది గొండ్లియనఁబడు కుండలాకారనృత్యము (గర్బనృత్యము) సంప్రదాయము నుండి గర్బ, గబ్బొ, గొబ్బి అనువిధమున రూపాంతరమందిన నృత్యరచన యని మఱికొందరు విమర్శకులు తలఁచిరి. ఈ గొబ్బిపదస్వరూపమునుగూర్చి తిరుపతిదేవస్థానమువారు పునర్ముద్రించిన "తిరుప్పావై-సప్తపదులు" పీఠికలో శ్రీ శాస్త్రిగా రిట్లు వ్రాసియున్నారు.

"దక్షిణభారతదేశమందెల్ల నీవ్రతము కొన్ని మార్పులతో నిప్పటికిని గలదని నేననుకొనుచున్నాను. ధనుర్మాసమునఁ దెలుఁగుదేశమున బాలికలు తెల్లవారు జాముననే నిద్రలేచి గొబ్బెమ్మ లనుపేర గోమయముతో (ముద్దలు) బొమ్మలుగాఁ జేసి ముంగిళ్ళ ముగ్గులుబెట్టి పూలతో నలంకరించి పూజింతురు.

"సుబ్బి గొబ్బెమ్మా సుఖమూ లియ్యవే
తామరపువ్వంటి తమ్మున్నియ్యావే
చేమంతిపువ్వంటి చెల్లెల్నియ్యావే."

ఇత్యాదిగాఁ బాటపాడుచు ప్రార్థింతురు. ఇట్టి ప్రార్థనము తిరుప్పావైలోను గొంతిగలదు. దక్షిణభారతమందంతటను సామాన్యమైన యొకవ్రతము ననుస

రించి ద్రావిడశైవులు శివసంప్రార్థనార్థకమగు తిరువెంబావైని, ద్రావిడ వైష్ణవులు విష్ణుసంప్రార్థనార్థకమగు తిరుప్పావైని గల్పించుకొని యుందురు. "గొబ్బెమ్మ" పదము "గోపెమ్మ" పదభవము. అరవమున "గొబ్బియళ్లో" "గోపిగళ్" పదభవము".

మనవారి గొబ్బిళ్ళయాట ఔత్తరాహుల "గర్బ" నృత్యసంప్రదాయము నుండి రూపొందిన దనుటకన్న శ్రీ శాస్త్రిగారు భావించినతెఱంగున నేర్పడిన దను కొనుటయే సమంజస మగునని తలఁపవచ్చును. ఏలన

"ద్వారవతీయాదవకుల భర్తకుఁ
దాళహస్తములు దప్పకకొట్టుచు
వ్రజపురిని దావలమై చిక్కిన
గోపప్రియునకు గొబ్బిళ్ళనుచును"

అను హంసవింశతికారుని పాఠముకూడ పైభావముననకే తోడగుచున్నది[1]

తాళ్ళపాకవారు పైగొబ్బిళ్ళపదము వరుసలోనే

భైరవి

"గోళ్ల మీటుచుండె కొన్నాళ్ల - గొల్ల
వీళ్ళ పాలారగించెఁ గొన్నాళ్ళు॥

కొండగొడుగుగా పట్టెఁ గొన్నాళ్ళు తాఁ
గొండముచ్చుల నేలె గొన్నాళ్ళు-" 3-480 అనియు

"పొదలినవీడెపుఁ బుక్కిళ్లో తమ
చొదుకుల చెమటల చొక్కిళ్లో॥

ఆముకొనిన యధరామృత వేళల
మోముల మోముల మొక్కిళ్లో॥ (3-31)

అనియు పలువిధములగు పదములను రచించియున్నారు.

---

1. చూ. నా వ్యాసము. 'జానపదసాహిత్యోద్ధారకుఁడు' పరిశోధన-ఆగస్టు సెప్టెంబరు- 1954-పుట 39-40.

**జాజరపాటలు :**

నాచనసోమన వసంతవిలాసములోనిదిగా లక్షణకారులు పేర్కొన్న
"వీణాగానము వెన్నెలతేట
రాణమీరగా రమణులపాట
ప్రాణమైన పిన బ్రాహ్మణువీట
జాణలు మెత్తురు జాజరపాట ॥ "

అను తాళచౌపదమును శ్రీప్రభాకరశాస్త్రిగారు ఉత్తరహరివంశపీఠికలో వెల్లడించి యున్నారు. అందీజాజరపాటలనుగూర్చినప్రసక్తి గోచరించుచున్నది. శ్రీనాథుని భీమఖండమున "జాదర జాదరంచు మృదుచర్చరిగీతులు వారుణీ రసాస్వాదమదాతిరేకమునఁ జంద్రిక గాయఁగ దక్షవాటిలో వీధులవీధులం గనకవీణలు మీటుచుఁ బాడి రంగనల్ " ( 5–102 ) అని గలదు. పైప్రశంసలనుబట్టి యీజాజరపాటలు వెన్నెలరాత్రులందు వీణలుమీటుచు వెలదులు పాడుకొనుపాట లని తెలియనగుచున్నది–

''రాగో హిందోళకస్తాళః చర్చరీ బహవోంఘ్రయః
యస్యాం షోడశమాత్రాస్స్యు ర్ద్వాద్వౌచ ప్రాససంయుతా
సా వసంతోత్సవేగేయాచర్చరీ ప్రాకృతైః పదైః"

అని ప్రాచీనసంగీతలక్షణకారులు ' చర్చరీ ' యనఁబడు నొక దేశిగేయరచనావిశేషమునకు లక్షణము రచించిరి. సంగీతరత్నాకరవ్యాఖ్యాతయగు సింహభూపాలుఁడు ఆంధ్రాదిదేశభాషలందున్న ' చర్చరీ ' పదములను బ్రశంసించియున్నాఁడు. తాళ్ళపాకవారిపదములలో పైచర్చరీలక్షణమునకు లక్ష్యము లనఁదగిన పదములెన్నో ' జాజర ' లనుపేర నున్నవి. కనుక "చర్చరీ" "జాజర" పదములు తుల్యములు. ఈజాజరరలు ప్రసిద్ధములగు దేశిగేయరచనాప్రభేదములే యగుటచేత నవియే సంస్కృతలక్షణమున ' చర్చరీ ' యనుపేరఁ బరగియుండునని శ్రీప్రభాకరశాస్త్రిగారు వ్రాసియున్నారు. తాళ్ళపాకవారి యీజాజరపాటను తిలకింపుఁడు.

హిందోళవసంతం

"జగడపు జనవుల జాజర
సగినల మంచపు జాజర ॥

మొల్లలు దురుముల ముడిచినబరవున
మొల్లపు సరసపు మురిపెమునా
జల్లనఁ బుప్పొడి జారఁగఁ బతిపై
చల్లే రతివలు జాజర ॥" (3-343)

పాదమునకు పదునారుమాత్రలుండిఁ బహుపాదములు గలిగి, ప్రాససంయుతమై హిందోళరాగమున ప్రసిద్ధమై వసంతోత్సవగేయ మనఁదగినట్టి పై జాజరపాట "చర్చరీ" గీతమే. పాదాంతములందు "జాజర" పదము ప్రయుక్త మగుటచేత "జాజరపాట" యైనది. తాళ్ళపాకవారి ( 3-343, 398 ) జాజరపాటలను బరికించి చూడఁగా వసంతోత్సవములందు స్త్రీలు వేడుకతో పుప్పొడిగందవొడులను సంకుమదపుపరిమళపంకములను తమప్రియులమేనిపై చిమ్ముగా చల్లుచు నాడుకొనునప్పటిపాటలే యివి యని తెలియనగుచున్నది. తెలంగాణమున కాముని పున్నమసందర్భమున జాజరాట యాపట పరిపాటి యగుటచేతను, తాళ్ళపాకవారిపదములందు జాజరపాడునప్పు డేదోచల్లుకొనుట వర్ణింపఁబడుటచేతను "పుప్పొడి మున్నగువానిపొడి జాజరయనియు దానిని చల్లుకొనుచు ఆడునట్టి యాట జాజరాట యనియు" శ్రీరామరాజుగారు వ్రాసియున్నారు[1]. నాచనసోమనయు, శ్రీనాథుఁడును పేర్కొన్నయంశములనుబట్టి వెలదులు వీణాగానముతో వెన్నెలవేళల పాడుకొనునప్పటి,"జాజర"పల్లవి పదముగాగలపాటలే, జాజరపాటలని తెలియుచున్నది. సంగీతలక్షణకారుఁడుకూడ వానిని వసంతోత్సవగేయములనినాఁడేగాని పుప్పొడిచల్లుకొనుటను ప్రసంసించి యుండలేదు. మఱియీ "జాజరపాట" "జాజరఆటగా" పూర్వమే యుండినదో లేక తాళ్ళపాకవారి తరువాతనే యేర్పడినదో తెలియరాదు. ఈజాజర అట పాటలు తెలుఁగున నొక పలుకుబడికి దారితీసినట్లున్నది. 'చల్ల లమ్మేచోట జాజరసుద్దు' లని వెన్నెలవేళలందే తప్ప నితరత్ర వాని కౌచిత్యములే దనుకర్థమున అన్నమాచార్యుఁ డాపల్కుబడిని ప్రయోగించియున్నాఁడు.

**అల్లోనేరేళ్లు:**

స్త్రీలపాటలలో 'అల్లోనేరేళ్ళపాటలు' ప్రసిద్ధములైనవి. 'వెలఁది రుక్మిణి సమర్త వేడుకలాయే-అల్లోనేరేళ్లల్లో' అనుపాతపాటఫణితిలో నీఅల్లోనేరేళ్ళపాటలు

1. చూ. జానపదగేయసాహిత్యము. పు. 799.

దేశమున పెక్కులు ప్రచారమున నున్నవి. ' నీకేవచ్చు సువాలలున్ ధవళ మింతీ అల్లోనేరేళ్లు గౌరీకల్యాణము ' అని పాంచాలీపరిణయమునందు ఈగేయరీతుల ప్రశంస యున్నది. తాళ్ళపాకవారి ' అల్లోనేరేళ్ళ ' పద మిది చూడుఁడు:-

దేసాళం

"నెయ్యము లల్లోనేరేళ్లో
వొయ్యన నూరెడి వువ్విళ్లో ॥

పలుచని చమటల బాహుమూలముల
చెలమలలోనాఁ జెలువములె
దళదళ మనుముత్యపుఁ జెఱఁగు సురటి
దులిపెటి నీళ్ల తుంపెళ్లో ॥ (3-247)

ఈ అల్లోనేరేళ్ళపాటలను స్త్రీలు రాత్రిపూట వెన్నెలవేళలఁ బాడుకొందురు. వెన్నెలవేళలకును, అల్లోనేరేళ్ళపాటలకును గల సంబంధమే ప్రాచుర్యముచేత భాషలో నొకపలుకుబడిగా రూపొందినది. 'వెన్నెలదినముల నల్లోనేరేళ్ళుగాక యావల గలవే' అని రామాయణసుందరకాండమునను, "గారాబు వెన్నెలగల నాడే యల్లో-నేరేళ్ళుగాక యోసిలాహివేణి" అని పరమయోగివిలాసము (పు.248) నను "ఆపల వెన్నెలలో అల్లునేరేళ్ళంతే" అని అన్నమాచార్యకీర్తనము (5-274) నను ఆ పలుకుబడికి ప్రయోగములున్నవి. ఈ పదమును తాళ్ళపాకవారు "అల్లో నేరే"ళ్ళనియు 'అల్లునేరే'ళ్ళనియు ప్రయోగించియున్నారు. ఈ అల్లో-అల్లు నేరేళ్ళు పెద్దనేరేడుపండ్లు. ఈపండుపేరు వెన్నెలవేళ పాడుకొనుపాటకు పల్లవిగా యేర్పడి రూఢినందుట కొంత వింతగానే కన్పడును. కాని వైష్ణవ సంప్రదాయ మున దీనికొక చక్కని సమన్వయ మున్నది. అదియిది.. అన్నమాచార్యుఁడే 'అంటుకొన్న మేనిచాయ అల్లునేరేడుపండు' అని (13-284) యొకకీర్తనమున, 'తినరాని కొనరాని దేవలోకపుఁబం' డగు వేంకటేశ్వరుని వర్ణించినాఁడు. అతఁడే వేరొకకీర్తనమున

'తనివొంద గిన్నెలతోఁ దట్టుపునుఁగులు దెచ్చి
పొలుపొంద దిరుమేనఁ బుయ్యగాను

పనివడి గొప్ప నిడుపాటి నేరేడుఁబండు

కనుపట్టు పురుషాకార మైనట్టుండె' అని స్వామిని వర్ణించియున్నాఁడు.

ఇట్లే "కొండా కొండా ఏపూరికొండా" అను నొక ప్రాతపాటలో 'నేరేడుపండు వలె నిగనిగలవాఁడే-ఈ రేడు లోకాల నేలుచున్నాఁడే" అనియు వర్ణనమున్నది. నల్లనిమేని నగవు జూపులవాని మేనినిగనిగలు చూచినపుడు వాస్తవమునకు అల్లోనేరేడుపండు నెరిగినవారి కెల్లరకు నదిస్ఫురణకు రాకమానదు. ఆపండువలెనే స్వామివారియాకారముకూడ మనోజ్ఞ మైనదియును, చవు లూరింపఁ జేయునది యును. ద్రావిడప్రబంధకారు లగునాళ్వారులు స్వామిమూర్తిని ఉజ్జ్వలనీలమణి తోడఁ బోల్చియున్నారు. ఆనీలమణిని బోలినదే యీ 'అల్లోనేరేడుపండు'ను. కనుక స్వామివారి యాకృతిసౌభాగ్యమును బ్రస్తుతించు నుపమానపదమే 'అల్లో నేరళ్ళు' పాటలకు పల్లవిగా నేర్పడినదేమో యనిపించును. ఈ అల్లోనేరేళ్ళపాటలు శైవసంబంధము గలవికూడ లేకపోలేదు. అట సమన్వయ మెట్లన-శివలింగాకార మును బోలినదే అల్లోనేరేడుపండు. అంతేకాదు. "హాలాహలం బనునల్లోనేరేడు బండు మిసిమింతుఁడునుగాక మ్రింగినాఁడు" అని శ్రీనాథుఁ డన్నవిధమున శివునికంఠముకూడ నేరేడుపండును దలపింపఁజేయునదే. ఈ పదప్రక్రియ యొక్క పుట్టుపూర్వోత్తరము లెట్టివైనప్పటికిని, తాళ్ళపాకవారి వర్ణములనుబట్టి వారిద్దానిని కేవలవైష్ణవసంబంధిరచనగానే భావించినారేమో అనితోచును.

## చల్లఅమ్మకపుపాటలు - సోదిపాటలు :

స్త్రీలపాటలలో తాళ్ళపాకవారివి కొన్ని వృత్తులకు సంబంధించినవి కూడ గలవు. చల్లఅమ్మకపుపాటలును సోదిపాటలును అట్టివే. ఈ పాటలను తిలకింపుఁడు.

### పాడి

"పిల్లగ్రోవి పట్టు మంటా బెరరేఁచీని మా
గొల్లవారి పిల్లఁ గ్రోవి కోరో చల్లా ॥

పాడుమంటా దండెమీటెఁ బలుమారునుం దా
వేడుక నెవ్వతె పాట వినవచ్చెనో

వాడలోఁ జల్లలమ్మే వనిత నింతే ప్రతి
గూడి నేఁ బాడేటి చల్ల కోరో చల్లా॥" (4-109)

ఇట్టిదే

"మూలమూల నమ్ముదుఁ జల్లయిది
రేలుఁబగలు గొనరే చల్ల ॥" (3-297)

అని పాడిరాగమునగల మరియొకకీర్తనముకూడ !

స్త్రీలపాటలలో తాళ్లపాకవారివి సోదిపాటలుకూడ నున్నవి. ఎరుకత ఎరుకచెప్పెడివైఖరిని పుణికిపుచ్చుకొన్న తాళ్ళపాకవారి "తెలుగుకాంభోది" పదమిది చూడుఁడు.

"ఎరుకచెప్పే నీయిచ్చ యెల్లా నెరుఁగుదు
మెరుఁగైన సొమ్ము లిచ్చి మెచ్చవయ్యా నన్ను॥
చేతికి కలపలము చెప్పే రావయ్య నీకు
ఘాతలఁ బరాంగనలఁ గాఁగిలింతువు
ఈతలఁ గన్నులమే లిటు చెప్పే రావయ్యా
సూతకపుమానములు చూడఁ గలదిఁకను॥" (13-312)

వేంకటాచలమాహాత్మ్యమున శ్రీనివాసకల్యాణమున పద్మావతికి ఎరుకకత్తె జోస్యముచెప్పుట ప్రసిద్ధమైనవిషయమే. పైపదమున నెరుకకత్తె స్వామివారికే చేయిచూచి ఫలము చెప్పుచున్నది.

## పారమార్థిక గేయములు

తాళ్ళపాకవారిపదములలో స్త్రీబాలగేయములేకాక భక్తులును, పామరులును పాడి యాడుకొనుటకువీలగు పారమార్థికగేయములుకూడ నెన్నోయున్నవి. వానిలో తత్త్వమును సులభముగ బోధించుగేయములేకాక, గోష్ఠిగా పదిమంది కూడి పాడుకొనఁదగు చాగుభళాలు, హెచ్చరికపదములు, భజనలు, చిందులు, కోలాటపుపాటలు, చాల నున్నవి. కొన్నిటినుదాహరింతును-

**తత్త్వములు : భజనకీర్తనలు :**

కర్మజ్ఞానభక్తిమార్గములను ప్రబోధించుచు పామరజనుల కర్థమగురీతిని వ్రాయఁబడిన పారమార్థికగేయములనే మనవారు వైరాగ్యతత్త్వము లనియు, భజనసంకీర్తనము లనియు సామాన్యముగ వ్యవహరించుచుందురు. వీనిలో నీవైరాగ్యతత్త్వము లేకతారను మీటుకొనుచు నొంటరిగా పాడుకొనఁ దగినవిగాను భజనసంకీర్తనములు పదిమందితోఁగూడి చిరుతలతో, చిటితాళములతో పాడుకొనఁ దగినవిగాను స్థూలముగ గోచరించును. చూడుఁడు.

గుండక్రియ

"తెలియఁ జీఁకటికి దీప మెత్తక పెద్ద
వెలుఁగులోపలికి వెలుఁగేలా॥

అరయ నాపన్నుని కభయ మీవలెఁ గాక
ఇరవైనసుఖిఁ గావ నేలా
వఱతఁ బోయెడివాని వడిఁ దీయవలెఁగాక
దరివానిఁ దివియఁగఁ దా నేలా॥" (5-18)

పాడి

"శ్రీహరి చేసిన చిహ్నాలివి యీ
మోహము విడుచుట మోక్ష మది॥

మలినం బేది మణుఁ గన నేది
కలుషపుమలముల కాయ మిది
కలిగిన దేది కడు లేందేది
చలనపుమాయల జన్మమిది॥", (5-21)

పైవైరాగ్యపదములలో తాళ్లపాకవారు తాత్త్వికవిషయములను సులువుగ పామర జనుల కర్థమగురీతిని పొందుపరచియున్నారు. వారికీర్తన లిట్టివి వందలకొలఁదిగ నున్నవి. ఇట్టివేకాక హరిభక్తులు భక్తితత్త్వమును ప్రచారదృష్టితో బహిరంగముగా పదిమందితోఁగూడి పాడుకొనుటకు వీలగుభజనసంకీర్తనములుగూడ వీరి వెన్నో

యున్నవి. తాళ్ళపాకవారు స్వయముగ నట్టి భజనకూటముల నిర్వహించి వైష్ణవ భక్తితత్త్వమును ప్రచారముచేసినవారే కదా ! ఈ పదములు తిలకింపుఁడు.

రామక్రియ

"చాటెద నిదియే సత్యము సుండో
చేటులే దితని సేవించినను॥

హరి నొల్లనివా రసురులు సుండో
సుర లీతని దాసులు సుండో
పరమాత్ముఁ డితఁడే ప్రాణము సుండో
మరుగక మఱచిన మఱి లేదిఁకను॥

యిహపర మొసఁగను యీతఁడె సుండో
మహి నుతించెఁ బార్వతి సుండో
రహస్య మిదివో రహి శ్రీవెంకట
మహీధరంబున మనికై నిలిచె॥" (6-164)

సాళంగనాట

"జపియించరే సర్వజనులు యీనామము- తమ
రపమువో పుణ్యులకు రామనామము॥

శాంతికరము రామచంద్రనామము
భ్రాంతు లణంచు రామభద్రనామము
వింత సుఖమిచ్చు రఘువీరనామము-భూమి
చింతఁ దీర్చు నదిగో శ్రీరామనామము॥" (2-49)

పందలకొలదిగా నున్న వారిపదము లిట్టివి భజనకీర్తనములే. "నారాయణ తేనమో నమో భవ నారద సన్నుత నమో నమో" (11-2-32) అనుసుప్రసిద్ధమగు వీరి భజనకీర్తనము నేఁటికిని దక్షిణదేశమున విష్ణ్వాలయములలో భజనపరుల గోష్ఠులలో వినవచ్చుచునే యున్నది.

'తోదయమంగళముగా' ప్రసిద్ధిగాంచినట్టి కీర్తన మది.

**చిందులు - కోలాటపుపాటలు - చాగు భళాలు:**

భజనపరు లిట్టికీర్తనములను బాడునపుడు భక్తిపారవశ్యమున సాధారణముగా నాలపించుటయేగాక యెడనెడ చిఱతల చేతులఁ బైకెత్తియు, మేనులు వంచియు, నడుగులు మార్చియు, వలచుట్టియు, పలుగతుల నాడుచుండుటయుఁ గలదు. గతిభేదము గలిగి యభినయానుకూలము లగునిట్టి కీర్తనములను 'చిందు' లనియు వ్యవహరించుట గలదు. 'వేడుకతోఁ జిందు వాడంగ నుబ్బి కోణంగియాటల గునిసెడివారు' అని పాల్కురికి సోమనాథుఁడు కోణంగియాటలతో గునిసియాడఁదగు చిందులను పేర్కొనియున్నాఁడు. 'వాఁడు చిందులు త్రొక్కుతున్నాఁడు' అనునొక నానుడియే పైగేయరచనాప్రభేదమునుబట్టి యేర్పడి యున్నది. 'గీతార్థాభినయోపేతై ర్ద్విపదై శ్చిందుసంజ్ఞకైః' అని జాయసేనాపతి లక్షణ మున్నది. తాళ్ళపాకవా రిట్టిచిందులను బలుతావుల ప్రశంసించుటయే కాక పెక్కులు రచించియున్నారు. వారి యీ "చిందును" చూడుఁడు.

శ్రీరాగం

"చిత్తగించు మామాటలు శ్రీనారసింహ
చిత్తజజనక వో శ్రీనారసింహా॥

చెలరేగి యున్నాఁడవు శ్రీనారసింహ నీకు
చెలులెల్లా మ్రొక్కేరు శ్రీనారసింహా॥
సెలవుల నవ్వేరిట్టే శ్రీనారసింహ నీకె
సెలవు మా వలపు శ్రీనారసింహా॥

చిందిన చెమటలు శ్రీనారసింహ నిన్నుఁ
జెందినది కడు జాణ శ్రీనారసింహ
చెందమ్మిరేకుగోళ్ల శ్రీనారసింహ నీపై
చిందు లెల్ల బాడేము శ్రీనారసింహ ॥" (2-236)

ఈమట్టునగల చిందుపాటలు తాళ్లపాకవారి వింక నెన్నోయున్నవి. చతురస్రగతిలో సాగునీపాటలును కోలాటపుపాటల గతిలో నున్నవే. కాని కోలాటపుపాటలు కోలాటగౌడియలతో నాడుచు పాడఁదగినట్టివి. చిందు లట్లుకాక అభినయ



తిరుమల మందిరములోని శిలాకుడ్యములమీఁద నున్న
"మంగళహారతి" - పదాభినయము. (పుట 54)



సంకీర్తనభండారము ప్రక్కన గల మందిరములోని శిలాకుడ్యములమీఁద
నున్న కోలాట పదాభినయ దృశ్యము. (పుట 54)



తిరుమలమీఁది ఆలయమునఁగల సంకీర్తన భాండాగారము "తాళ్ళపాకవారి అర"
(చూ. పుట 54)



ఒంటిమిట్ట రామాలయమునఁ గల భక్త సుకవి (?)

పూర్వకముగ నాడుచు పాడఁదగినట్టివి. సోమనాథునిచిందువివరణము విస్పష్టముగ లేకున్నను జాయసేనాపతిలక్షణమును, తాళ్ళపాకవారి వివరణమును పరిశీలించి చూడఁగా చిందులు వెన్నెలవేళల స్త్రీలు అభినయపూర్వకముగ నాడుచుతిరుగుచు పాడునట్టిపాట లని తెలియ నగును. తాళ్ళపాకవారు 'చల్లనై కాయగదొ చంద మామ' (3-296) అనుపాటలో "చిందులకు నాడేటి సీమంతినీమణుల చెలఁగి యురుగడ గొలువగాను" అని వర్ణించినారు. అలమేల్మంగ యొక్క నృత్యమును వర్ణించుచు వారే మరియొకపదమున.

"చిందుపాటల సిరిపొలయాటల
అందెల మోతల నాడె నదే
కందువ తిరువేంకటపతి మెచ్చగ
నందపుతిరుపుల నలమేల్మంగ" (3-24)

అనియు వర్ణించియున్నారు. వీనినిబట్టి చిందులు స్త్రీలపాటలే అని తోచును. పైన దాహరింపఁబడిన చిందుపాటకూడ నృసింహస్వామిని నాయకునిగా తలపోసిస్త్రీలు పాడుకొన్న భావమునే సూచించుచున్నది. ఇదేకాదు. చిందుపాటలుగా గుర్తింప దగిన మిగిలినపాటలుకూడ నిట్లే స్త్రీలు పాడుచున్నట్టివిగానే యున్నవి చూ. 3-174,175 మొదలగునవి.

ధన్యాసి

"గోవింద నందనందన గోపాలకృష్ణ నీ
భావము మాకుఁ జిక్కె గోపాలకృష్ణ॥
కొంగు వట్టిన దేమోయి గోపాలకృష్ణ మా
పంగెన కోపుదువా గోపాలకృష్ణ ॥" (3—174)

మొదలగు పాటలిట్టివే. ఈ చిందులలోని గతిమాధుర్యమునకుఁ జొక్కికావచ్చును భక్తిపారవశ్యమున భజనపరులైనపురుషులు కూడ వానిని ప్రయోగింపసాగిరి. పురుషులు చిందులుత్రొక్కుట తర్వాతకాలమున నేర్పడిన దేమో! కోలాటముల వలెనే చిందులుకూడ స్త్రీపురుషు లందఱును పాడి యాడఁదగిన గేయరచనలేమో! శ్రీ ప్రభాకరశాస్త్రిగారు చిందులను గూర్చి పేర్కొనుచు "నివి రెండేసి పదములు గలవిగా జాయసేనాపతి చెప్పినాఁడు. యక్షగానములలో కొన్నింట చిందురచనలు

కానవచ్చును.అవి ఆంధ్రదేశమునుండి అరవదేశమునకుకూడా ఎగబ్రాకి అక్కడ లక్ష్యలక్షణప్రయోగసిద్ధిని బడసియున్నవి. కావడిచిందు, నొండి-కుంటి -చిందు లిత్యాదు లక్కడి ప్రభేదములు" అని వ్రాసియున్నారు. ఈ చిందులను గేయ రచనావిశేషములుగ చిన్నన్న పేర్కొనినాఁడు. ఉషాకన్య వీణవాయించుచు "సంకీర్తనము చిందు, జక్కిణి, గీత, మంకించి శుద్ధంబు లలరమీటుచును" నిదుర పోయినదట! (ఉషాప.పు-21). వెన్నెలకంటి సూరనయు 'మదనగోపాలమూర్తి యమ్మాధవుండు - గీతంబు దరువు జక్కిణి చిందు మొదలుగా నొక్కొక్క వర్ణంబు నుగ్గడించి' (విష్ణుపురాణము 7-279) వేణునాదంబు మెరయించిన విషయమును వర్ణించినాఁడు. చిందుపాటయే గతిమాధుర్యమునుబట్టి చిందులాట యైనట్లున్నది.

పాల్కురికి సోమనాథుఁడు చిందులతోపాటు కోలాటపాటలను, చాగు భళాలనుగూడ పేర్కొనినాఁడు. వీని నాతఁడు 'ఆనందపదము' లనినాఁడు. కోలాటమును బాత్రగొండ్లి, పేరణియు, గేళిక, జోకయు, లీల నటింపగాఁ బాయక చాఁగుభళా యనుశబ్ద మాకసం బందిఘూర్ణిల్ల వేణు వీణా వాద్యవితతులు లియగా నానందగీతంబు లగ్గించు వారిసిగూర్చి యాతఁడు వివరించినయంశములను బట్టి చాగుభళాయనుచు పై యైదువిధములగు నాట్యముల కనుకూలముగ పాడు పాటలే ఆనందపదము లని తెలియవచ్చుచున్నది. మిగిలినవానిమాట యెటులున్నను మనకు తెలిసిన కోలాటపు పాటలును చాగుభళాలును ఆనందపదములే యని తలపవచ్చును. సోమనాథుఁడే మఱియొకతావున 'చాగుభళాయంచు నేగు నంది కోలల' వారినిగూర్చియు, 'వేడుక కొలాట మాడెడు కూడలి త్రిపురాంతకుని కొలు' వారిని గూర్చియు బ్రశంసించియున్నాఁడు. దీనినిబట్టియు కోలాటపుపాటలును, చాగుభళాలును కోలాటగోడియలతో నాడుచు నానందసందర్భములందు పాడుకోఁదగినపాటలని తెలియుచున్నది. పైనిపేర్కొన్న చిందులుకూడ నీ ఆనంద పదములలో జేరునట్టివే యని తలఁపవచ్చును. ఈ ఆనందపదము లన్నియుఁ గోలలతో పదిమందికూడి తాళము ననుసరించి తట్టుకొనుచు పాడుకొనఁదగిన లయవిన్యాసముగల రచనలే. తాళ్ళపాకవారి సంకీర్తనములలో చిందులవలెనే, కోలాటపుపాటలుగ గుర్తింపఁదగిన గతిగల రచన లెన్నో యున్నవి. అట్లే "చాగు భళా" యను పాదాంతములు గల గేయరచనలుగూడ నున్నవి. "రాగె జతనము పరా కెచ్చరికె" "లంకెలఁ జాఁగుభళా యెచ్చరికె" (11-2-30) అని

తాళ్ళపాకవారే వేరొక్కతావునఁగూడ నీపదమును ప్రయోగించిన వైఖరినిబట్టి "చాగు భళా" యను నూతపదము "పరాకు-హెచ్చరిక" అను నర్థమున నున్నట్లుగ నున్నది. తాళ్ళపాకవారి యీ "చాగు భళా"పదమును జూడుఁడు.

పాడి

"చక్కనితల్లికి చాఁగుభళా తన
చక్కెర మోవికి చాఁగుభళా॥

జందెపు ముత్యపు సరులహారముల
చందనగంధికి చాఁగుభళా
విందయి వెంకటవిభుఁ బెనఁచిన తన
సందిదండలకు చాఁగుభళా॥" (12-107)

ఇట్టిదే చతురశ్రగతిలోసాగు వారిపాట యింకొకటి కోలాటపుపాటగా స్మరింపఁదగినది చూడుఁడు.

దేవగాంధారి

"సదానందము సర్వేశ్వరా నీ
పదారవిందముపై భక్తి

నయనానందము నరులకు సురలకు
జయమగు హరి నీసాకారము
నయమగు శ్రవణానందము వినినను
క్రియగలిగిన నీకీర్తనము॥" (7-135)

ఇట్టివే వీరిపాటలు వివిధపాదాంపదతములతో సంబుద్ధులతో కోలాటములకుఁ బాడుకొనఁదగిన వెన్నోయున్నవి.

**సంబుద్ధిపదములు: సంవాదపదములు:**

తాళ్ళపాకవారి పారమార్థికగేయములలో సంబుద్ధిపదములు పెక్కులున్నవి. వీనిలో పాదాంత, చరణాంతములం దాయాపదముల భావసంపదనుబట్టి తుమ్మెదా, తుమ్మెదరో, వెన్నెలరో, చందమామా, హంసా, చిలుకా, మనసా,

చిత్తమా, జీవుఁడా, చీచీ, విజయీభవ, సాసముఖా, హరిహరీ, గోవిందా, అయ్యా, శినకాచే, మున్నగున వింకనెన్నోవిధము లుగుసంబుద్ధులు వచ్చి చేరుచుండును. పాల్కురికి సోమనాథుఁడు తుమ్మెదపదములు వెన్నెలపదములు మున్నగువానిని పేర్కొనినాఁడు. ఇఁక మనసా, జీవుఁడా, హరిహరీ మున్నగుసంబుద్ధులు గల పదము లెన్నో జానపదులవ్యవహారమున నుండనే యున్నవి. అవేవరుసలలో నట్లే ఇంక ననేకసంబుద్ధులనుగూర్చి తాళ్ళపాకవారును పాడియున్నారు. ఈ సంబుద్ధిపదములందు వీరు వాచ్యముగను, సూచ్యముగనుకూడ పామరజనులకు తత్త్వహితముల నుపదేశించిరి. మచ్చున కొకటిరెండుపదము లుదాహరింతును.

లలిత

"దొరకినయప్పుడె తుదగాక
మరుగకు మెన్నఁడు మరి మనసా!

తిరమగునాసలు దీరిన పిమ్మట
తెరలి విరతిఁ బొందే నంటే
మరలని యాశామయ మీచిత్తము
విరతి యెన్నఁడిఁక వెదమనసా॥" (11-26)

శ్రీరాగం

"వేడుకకాడవై విడివడి తిరిగేవు తుమ్మెదరో
చూడఁజూడఁగఁ దొంటిచూపు దప్పకువయ్య తుమ్మెదరో
తిరువెంకటాద్రిపై తిరమై నిలచినట్టి తుమ్మెదరో
పరమయోగుల పూలఁబరిమళములు గొన్న తుమ్మెదరో॥"
(4-132)

వీనిలో తొలిపదమున వారు భక్తునిమనస్సునే ప్రత్యక్షముగ సంబోధించి హితము నుపదేశించిరి. ఇక రెండవపదమున తుమ్మెద మామూలుతుమ్మెద కాదు. శ్రీవేంకటేశ్వరుఁడే! వీరి హంసా, చిలుకా, వంటిసంబుద్ధులుకూడ నిట్లే స్వామికిఁ జెందునవే। స్వామిని అల్లోనేరెడుపండుతో నుపమించినట్లే పైపదమునందు వారు "తుమ్మెద"గా సంభావించిరి.

తాళ్ళపాకవారి పదములలో నిట్లు వ్యష్టి గోష్ఠి గానముల కుద్దేశింపఁబడిన పదములే కాక సంవాద (యుగళ) గానమున కనుకూలములగు సంవాదపదములు కూడ నెన్నో యున్నవి. అసలు వీరిసంకీర్తనవాఙ్మయ మంతయు జీవాత్మపరమాత్మలనడుమసాగు సంవాదరూపమే. కనుక వీరిరచనలలో సంవాదపదము లుండుట వింతకాదు. శృంగార, భక్తిశృంగారభావములు నిండార్లుగాగల వీరి సంవాదపదములు పలుతెఱఁగులైనవి కలవు. వీనిలో చెలులిరువురు నాయికావస్థనుగూర్చి సంవాదరూపమున ముచ్చటించుకొనునవి కొన్ని, భావమఱఁదులసంవాదములు, అత్తాకోడళ్ళసంవాదము, గోపీగోపకులసంవాదములు, చెంచువాండ్లసంవాదములు మున్నగున వెన్నియో గలవు. మచ్చునకు గొన్నిటి నుదాహరింతును. నాయికాసంభోగశృంగారానంతరావస్థను జిత్రించునీక్రిందిసంవాదమును తిలకింపుఁడు—

నాదనామక్రియ

"ఏమొకొ చిగురుటధరమున యెడనెడఁ గస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా॥

కలికి చకోరాక్షికిఁ గడకన్నులు కెంపై తోఁచిన
చెలువం బిప్పు డిదేమో చింతింపరె చెలులు
నలువునఁ బ్రాణేశ్వరుపై నాటినయాకొనచూపులు
నిలువునఁ బెరుకఁగ నంటిననెత్తురు కాదుగదా॥

ముద్దియచెక్కులకెఁలకుల ముత్యపుజల్లుల చేర్పుల
వొద్దికలాగు లివేమో వూహింపరె చెలులు
గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున
అద్దినసురతపుఁజెమటలఅందము కాదుగదా॥" (12-82)

ఇందు చెలులిరువురు నాయికయొక్క శృగారావస్థను సంవాదరూపమున ముచ్చటించుకొనుట వర్ణితమైనది. ఈసంవాదపదమునే విజయనగరప్రభు వగుసాళువ నరసింగరాయఁడు " పలుమారుఁ బాడించి పాడించి చొక్కి తలయూచి 'యిది కవిత్వం' బని మెచ్చి " యుండినట్లుగా అన్నమాచార్యచరిత్రమున చిన్నన్న ప్రశంసించియున్నాఁడు. ఇట్టి సంవాదము లింక నెన్నియో గలవు.

స్త్రీసంవాద పదములలో దానితర్వాత పేర్కొనఁ దగినవి అత్తాకోడళ్ళ సంవాదములు. మచ్చున కొకటి.

**పాడి**

"రావే కోడల రట్టడికోడల
పోవే పోవే అత్తయ్యా పొందులు నీతో జాలును॥

రంకెలు వేయుచు రాజు నెదుట నీవు
కొంకుగొసరు లేనికోడల
పంకజముఖి నీవు పలుదొడ్డవారిండ్ల
అంకెలఁ దిరిగేవు అత్తయ్యా॥

బొడ్డునపుట్టినపూపనికె నిన్ను
గొడ్డేరి తెస్తినె కోడలా
గుడ్డముపయినున్న కోనేటిరాయని
అడ్డగించుకొంటి వత్తయ్యా॥" (3-379)

జారస్వభావము గల అత్తాకోడండ్లిరువురుపరస్పరమునిందించుకొను తెఱఁగున నిందు లక్ష్మీసరస్వతుల సంవాదము వర్ణితమైనది.

ఇఁక స్త్రీపురుష సంవాదపదములలో గోపీ గోపకులయు, బావమఱదళ్ళయు సంవాదములు పెక్కులున్నవి. వానిలో నుక్తిచమత్కారము, నర్మప్రసంగము, భావసౌకుమార్యము గుర్తింపనగును. మృదుపదములతో వలపు తియ్యందనమును చిత్రించు నీ పదమును తిలకింపుఁడు

**రామప్రియ**

"వద్దే గొల్లెత వదలకువే-నీ
ముద్దుముద్దుమాటలకు మొక్కేమయా॥

ఏలే యాలే యాలే గొల్లెత
నా లా గెఱఁగవా నన్ను నేఁచేవు

చాలుచాలు నీకఁ జాలు నీరచనలు
పోలవు బొంకులు పోవయ్యా॥

రావా రావా రావా గొల్లెత
శ్రీవెంకటగిరి చెలువుఁడను
నీవె నీవె నను నించితి కౌఁగిట
కైవసమైతిని గదవయ్యా॥" (12–61)

**ఏలపదములు :**

ఆంధ్రుల దేశిగాన మంతయుఁ దొలుత 'ఏలపాట'యను వ్యవహారముననే సాగుచుండినట్లు పూర్వమే గుర్తించితిమి. కాని దైశైలావిభాగములోని "ఆంధ్ర-ఏలలు" నలువదింటిలోను నానావిధప్రయోగములు, గమకములు, రాగాంశలు, రసభావములు కలిగి మిక్కిలి ప్రచారము గాంచిన యొకా నొక ప్రక్రియాభేదమే "ఏలపద"మను పేరున నేఁడు ప్రఖ్యాతముగ ప్రయోగమున నున్నది. దానికే సంకీర్తన లక్షణమున తాళ్ళపాక అన్నమయ్య సంస్కృతముననను,చినతిరుమలయ్య తెల్గునను లక్షణము విరచించినారు. తద్విధం బెట్టి దనిన :-

గీ॥ నాయకాహ్వానపూర్వమై నయము గలిగి
మ్లేచ్ఛసంభాషఁ దగి రాగమిళిత మైన
యేలపాట పదంబుగా నిలఁ జెలంగు
మహిత నాయకసంబుద్ధి మధ్య మగుచు.
(సంకీ॥ లక్షణము 65 పద్యము)

రాధామాధవమున విలాసవతినిగూర్చిన వర్ణనమునందు "ఏలపాటల నల్ల నించు కించుక పాడుఁ దగవుమాటల జాణతనములాడు" అనియు, శుకసప్తతిలో "వీధి నేగెడు ప్రౌఢవిటుఁడు పాడెడు వింత యేలపదా లిట్టె ఆలకించె" ననియు నున్న వివరణమునుబట్టియు, పై సంకీర్తన లక్షణమునుబట్టియు నేలపాటలు శృంగార హాస్య చమత్కార గర్భితము లనియు, మ్లేచ్ఛపరిభాష గల్గి మహితనాయక సంబుద్ధి మధ్యమగుచు నొప్పునట్టి వనియుఁ దలఁప నగుచున్నది.

నేఁడు మన కుపలభ్యములగు నిట్టి యేలపాటలనుబట్టి యవి త్రిశ్రగతిలో సాగునట్టి వనియు, "తకిట తకిట" ఆవృత్తములు గాని, గతి భేదమున 'తక కిట

తక' అవృత్తములు గాని, పాదమునకు రెండేసి చొప్పునఁ గల పాదములు కూడుండి, పిదప సంబుద్ధి వచ్చి, యా వెనుక మఱియొకపాదము పైతీరుననే సాగిముగియునట్టి వనియు తెలియుచున్నది.

తాళ్ళపాక అన్నమాచార్యుఁ డిట్టి యేలలను శృంగార రసభరితము లగు వానిని 'శ్రీవేంకటేశ'సంబుద్ధితోఁ గొన్నిటిని రచించెను. సంగీత రత్నాకరమున ఏలా లక్షణమును వివరించుచు శార్ఙ్గదేవుఁడు ఏలాపదమున ఔదార్యము, లోకానురాగము, ధార్మికత ప్రదర్శితము కావలె ననియు, నందు పదునారుపదము లుండు ననియుఁ బేర్కొనినాఁడు. ఇందు ఔదార్య లోకానురాగాది లక్షణ మున్నదిగాని తాళ్ళపాకవారి యేల పదమున పదునారుగాక ఇరువదియైదు పదము లున్నవి ఇఁక వారి శృంగార సంకీర్తనలలోనెల్ల తప్పకుండ నుండు భోగపరిణతియు నం దొకపదమున నిబద్ధమై యున్నది. మన కీనాఁడు లభ్యములగు నేలపదములలో ప్రాచీనములును, ప్రశస్తములును నగునవి తాళ్ళపాకవారి యేలలే. అన్నమాచార్యుని యేల పద మిది గుర్తింపుఁడు.[1] రమ్యమైన దగుటచేత లభ్యమైనంత సంపూర్ణముగ నుదాహరించుచున్నాను.

ఏలపదాలు-దేసాళం

"మేడలెక్కి నిన్నుఁ జూచి
కూడే ననే యాసతోడ
వాడుదేరి వున్నరందురా - వేంకటేశ!
యాడనుంటి విందాఁకానురా॥

బొండుమల్లె పానుపుపై
నుండి నిన్నుఁ బాడిపాడి
నిందు జాగరము లుంటిరా - వేంకటేశ!
యెండలాయె వెన్నెలలురా॥

1. డా॥ బిరుదురాజు రామరాజుగారు తమ "తెలుఁగు జానపద గేయసాహిత్య" మను గ్రంథమున (పు. 801 ప్ర. 1958) "ఏలలనిర్మాణము అన్నమయ్య అభిమానించిన నిబంధ పదముల నిర్మాణమున కందకపోవుటచేతనే కాఁబోలు ఏల లాతని రచనములందు లేవు. ఐనను ఈ విషయ మింకను సూక్ష్మముగా పరిశీలింపఁదగినదే" అని వ్రాసియున్నారు. లభ్యములగు అన్నమాచార్యుని ఏలపదములనుబట్టి పై యభిప్రాయము సరిదిద్దవలసి యున్నది.

పిక్కటిల్లు చన్నులపై
చొక్కపు నీ వుంగరము
గక్కన నేనద్దుకొందురా-వేంకటేశ
లక్కవలె ముద్రలంటెరా ॥

దప్పిగొంటివని నీకు
గప్పుర ముపారమిచ్చి
ముప్పిరి నీ విరహాననుు-వేంకటేశ
నిప్పనుచు భ్రమసితిరా॥

నిండఁ బూచిన మానిపై
గండుఁగోవిల గూయఁగా
నిండిన నీ యెలుఁగంటానుు-వేంకటేశ
అండకు నిన్ను రమ్మంటిరా ॥

వుదయ చందురుఁ జూచి
ఆదె నీ పంజని సవి
యెదురుకో నేవచ్చితిరా-వేంకటేశ
బెదరి మారు మోమైతిరా॥

మిన్నక కేళాకూళిలో
వున్న తమ్మివిరులు నీ
కన్నులంటాఁ జేరఁబోఁగాను-వేంకటేశ
పన్ని మరునమ్ములాయరా॥

ఆనిన తుమ్మిదలు నీ
మేనికాంతిఁబోలునని
పూనిచేతఁబట్టఁబోఁగాను-వేంకటేశ
సూనాస్త్రిని వేగులాయరా॥

కందువమై చమరించి
గందవొడి చల్లుకొని
పొంద నిన్నుఁదలఁచితిరా-వేంకటేశ
అంది చొక్కుమందు లాయరా॥

నిద్దిరించి నీవు నాకు
వొద్దనుండఁ గలగంటి
చద్ది వేఁడి వలపాయరా-వేంకటేశ
సుద్దులింకా నేమి సేసేవో॥

మల్లెపూవు కొనదాఁకి
ఝల్లనను బులకించి
వుల్లము నీ కొప్పించితిరా - వేంకటేశ!
కల్లగాదు మమ్ముఁ గావరా ॥

జోడుగూడి నీవు నేను
నాడుకొన్న మాటలెల్లా
గోడలేని చిత్తరువులై - వేంకటేశ।
యీడా నామతిఁ బాయవురా ॥

అద్దమునీడలు చూచి
ముద్దుమోవి గంటుండఁగా
కొద్దిలేని కాఁకతోడను-వేంకటేశ
పొద్దువోక తమకింతురా॥

పావురము రెక్కఁజీటి
నీ వొద్దికిఁ గట్టియంపి
దేవరకే మొక్కుకొందురా-వేంకటేశ
నీవిందు రావలెనంటాను॥

బంగారు పీఁటపై నుండి
ముంగిటికి నీవురాఁగా
తొంగిచూచి నిలుచుండఁగా—వేంకటేశ
యెంగిలిమోవే లడిగేవు॥

దంతపుఁ బావాలుమెట్టి
సంతాననేను రాఁగాను
యింతలో బలిమిఁ బట్టేవు-వేంకటేశ
అంత నీకుఁ బ్రియమైతినా॥

పట్టుచీర కొంగుజారి
గుట్టుతో నేనుండఁగాను
వట్టి నవ్వులేల నవ్వేవు-వేంకటేశ
దిట్టపు నీయంత వారమా॥

కొప్పువట్టి తేసి నీవు
చెప్పరాని సేఁత సేసి
తప్పక నేఁజూచినంతలో—వేంకటేశ
చిప్పిలేల చెమరించేవు॥

బొమ్మల జంకించి నిన్ను
తమ్మిపూవున వేసితే
కమ్మియేల తిట్టుదిట్టేవు-వేంకటేశ
నిమ్మపంట వేతునటరా॥

నెత్తమాడే వంటారతి
పొత్తుల పందేలు వేసి
వొత్తినీవే వోడే వేలరా-వేంకటేశ
కొత్తవైన జాణ వౌదువు॥

చిలుకలు మనలోన
కలసిన యట్టివేళ
పలుకు రతిరహస్యాలు-వేంకటేశ
తలఁచి నేఁ దలవూఁతురా॥

నీకు వలచిన వలపు
లాకలొత్తె నామతిని
వాకున నేఁ జెప్పఁజాలరా-వేంకటేశ
లోకమెల్లా నెరిఁగినదే॥

పాయము నీ కొక్కనికే
చాయగా మీఁదెత్తితిని
యీయెడఁ గైవాల కుండను-వేంకటేశ
మాయింటనే పాయకుండరా॥

ముమ్మాటికి నీ బాసలే
నమ్మి వున్నదాన నేను
కుమ్మరించరా నీ కరుణ - వేంకటేశ !
చిమ్ముఁజీఁక టెల్లఁ బాయను ॥

వున్నతి శ్రీవేంకటేశ
మన్నించి కూడితి విదే
నన్ను నెంత మెచ్చుమెచ్చేవు - వేంకటేశ !
కన్నులపండువు లాయరా॥" (13-223)

ఇందు మొత్తము 25 పదము లున్నవి. "తకిట తకిట" ఆవృత్తములు పాదమునకు రెండేసిచొప్పునగలపాదములు నాల్గింటితో నొక్కపద మగుచున్నది. తృతీయపాదాంతమున వేంకటేశ ! సంబుద్ధి గలదు. ఇందు నాయకుఁడగు శ్రీ వేంకటేశుని యౌదార్య లోకానురాగాదిగుణములు ప్రపంచితములు. శృంగార ప్రధానమైనది. భావము లాలంకారికములై, భాష పామరజనోపయోగ్య మగు వ్యావహారికమున నున్నది.

కందుకూరి రుద్రకవి సుగ్రీవవిజయము నందలి యేలయుఁ, దరువాతి యక్షగానములందలి యేలలును, ఏగంటివారి యేలలును, పై అన్నమాచార్యుని యేలపదములను బోలియే యున్నవి. అంతేకాదు, పై తాళ్ళపాకవారి యేలలను తరువాతికాలపుకవులు కొంద రనుకరించినట్లును తెలియుచున్నది. క్రీస్తుశకము 18వ శతాబ్దికిఁ జెందిన దళవాయి తిమ్మభూపాలుఁడు రచించిన "ప్రసన్న వేంకటేశ్వర విలాసము"నందలి "కాంభోజి-ఏలపద" మిది తాళ్ళపాకవారి యేలలను దలపించునదిగానే యున్నది-చూడుఁడు.

"వలచి నిన్నివేళ మదిని
దలచి మరుబారి సొలసి
చెలువ మిగుల మరులు చెందెరా - శ్రీవేంకటేశా !
కలికివగలాచే లాలించరా॥

నెలత మేలుచెందెనాని
చులకసేయ మేలుగాదు

వలపుదెలిసి కౌగిలించరా - శ్రీవేంకటేశా।
పొలతిమీఁద నెనరుంచరా॥"

వేంకటేశసంబుద్ధితోఁ గలపైయేలపదము తాళ్ళపాకవారి యేలపదములకు దేశమున నుండినప్రాచుర్యమునే వెల్లడించుచున్నది.

తాళ్ళపాకకవు లిట్లు పలుగతులలో పలుతెలుఁగుల పదములను రచించి దేశిపరుసలకును శిష్టులసాహిత్యమున సముచితస్థానమును గల్పించినారు. 'సంకీర్తనాపరిశుద్ధి'ని గావింప యత్నించిన వారి గేయ సాహిత్యమున దేశిమార్గ సంగీత పద్ధతుల రెంటి సమన్వయమును చక్కఁగా జరిగినది.

నాగవరాళి

"మేలము లమరెఁగా మీకు మీకును
కోలుముందుగా పొందుగూడె వినవయ్యా ॥

పేరడిగా సొళగపు పెద్దయెలుఁగులతోడ
కోరికెఁ జల్లలమ్మేరు గొల్లెతలు
బీరానఁ బెక్కురాగాలు పిల్లఁగోవిఁ గురిసేవు
కూరిమి రెంటికి సుతిగూడె వినవయ్యా ॥

మించిన బంగారపుమెట్టెల మోఁతలతోడ
కొంచక నడచే రదే గొల్లెతలు
వుంచాన గతి గతుల నూదేవు తుత్తురుఁగొమ్ము
అంచలఁ దాళముగూడె నదె వినవయ్యా ॥

వొత్తి పెరుగుదచ్చేటి వూరుపుమోఁతలతోడ
కొత్తగాఁ బేరుకొనేరు గొల్లెతలు
హత్తుకొంటివి శ్రీవేంకటాద్రి చెన్నుఁడవై
గుత్తపు గొబ్బిళ్లపాట గూడె వినవయ్యా॥"

★

పంచమాధ్యాయము

# తాళ్లపాక కవుల భాషాప్రయోగ విశేషములు

( పుటలు. 367 - 460 )

# తాళ్ళపాకకవుల
# భాషాప్రయోగవిశేషములు

తాళ్ళపాకకవులు పండితులు, బహుభాషావేత్తలు, సుకవిశేఖరులును. వాఙ్మయప్రపంచమును మథించి భాషాతత్త్వము నవగాహనజేసికొన్న శబ్దశాస్త్రవేత్తలు. అందుకే వారు వారి కవితారచనలలో భాషాప్రయోజనమును జక్కగా సాధించుకొనినారు. వారికి భాషావిషయమున సంప్రదాయమునం దెంతమక్కువయో సంఘమునం దంతప్రత్యయము. సంకీర్తనలక్షణమున చినతిరుమలాచార్యులు వ్రాసినవిషయములే దానికి నిదర్శనములు.

"సంప్రదాయాగతజ్ఞాన సహితుఁ డైన
మనుజు సత్కవితయుఁ వేద మంత్ర సమము[1]" (23)

అని యాతఁడనినాఁడు. అట్లని లోకవ్యవహారమును వారు విస్మరింపను లేదు. చూడుఁడు.

'పదములు శృంగార వధూ
మృదుమధుర మనోజ్ఞ వాక్య మిశ్రము లైనన్
విదితార్థ గ్రామ్యోక్తులు
పదిలముగా బొంక మెరిఁగి పలుకఁగఁ జెల్లున్ (56)

పల్లవ నారీ మ్లేచ్ఛా
ద్యుల్లాస మనోజ్ఞబంధురోక్తులు చవియై
చెల్లును గ్రామ్యములైనను
హల్లీసక ముఖ్య నాటకాదికఫణితిన్ (57)

---

1. ఇట్టి భావమే నన్నయభట్టకృతముగా చెప్పఁబడు నొకశ్లోకమున గలదు. చూ. ఆంధ్రశబ్దచింతామణి సంజ్ఞా - 11
"శాస్త్ర మపౌరుష మాద్యం, ప్రాయిక నిత్యప్రయోగ లక్ష్యైతత్
దృశ్య మతిస్థవిరం, యద్జ్ఞాత్వా శబ్దః ప్రయుక్త అర్ష సమః"

జగతి గల చెల్లుబళ్లై
నగినగి భాషించునట్టి నానుడి పలుకుల్
తగదన రహిచెడుఁ బువ్వులు
సొగసుడుగం బిసికి కంపు చూచిన భంగిన్' (58)

అందుకే 'చాటూక్తిపదబంధకవితా రక్తుండై' అన్నమాచార్యుఁ 'డితరవాగ్విరక్తుం డయ్యె' నట. వాగనుశాసనుని 'విశ్వశ్రేయః కావ్యమ్' 'సావాగ్యారసవృత్తిః' 'సిద్ధిర్లోకాద్వృశ్యా లోకో నన్యాదృశశ్చ నిత్యశ్చ' మున్నగుసూత్రముల నిట ననుసంధించుకొనఁదగును. లోకవ్యవహారమున సలిగినట్టి నానుడిపలుకుల నట్లే సుకవి చెల్లుబడిచేసికొన వలెననియు, అపభ్రంశము లని త్రోసిపుచ్చుటయో వానిని పరిష్కరింప బూనుటయో తగ దనియు నన్నమాచార్యు డభిప్రాయపడినట్లు తెలియనగును. లోకవ్యవహారమున సిద్ధిపొందిన శబ్దములు సుకుమారములగు కుసుమములవంటివి. వాని నట్లే పరిగ్రహించి యామోద మనుభవింపవలసినదే గాని పిసికి కంపుచూచినభంగినార్థికులు వానిని తమ చేతికివచ్చినట్లు త్రిప్పి చెడగొట్టి కడివోవునట్లు చేయరాదని అన్నమాచార్యుఁడు భావించినట్లుగా పైపద్యమునుబట్టి మనము గ్రహింపవచ్చును. పొంకమెరిగి పలికినప్పుడు గ్రామ్యమైనను సుకవి చేతులలో ప్రయోగార్హతను బడయగల్గును. అట్టియెడ జగతిని జెల్లుబడి గూర్చు కొన్న శబ్దజాలము సుకవి ప్రయోగమూలమున సాధుత్వమును బడయు ననుటలో విప్రతిపత్తిలేదు. కనుక ప్రయోగమూలక మగువ్యాకరణము కవిప్రయోగముల ప్రామాణ్యమును కాదన జాలదు.

ఈ విషయమున లాక్షణికు లేమనుకొన్నను సుకవులు తమ భవ్యకవితా వేశమున వారిమాటలను పాటింపరనుట విదితమగు విషయమే. కవిప్రయోగము లను వారు గ్రామ్యము లని దోషముక్రింద పరిగణించి కొట్టిపారవేసినను, లేదా అనింద్యగ్రామ్యము లని వానికే ప్రతిపత్తిని గల్పింప నెంచినను, ఆకవికిఁగాని, తత్కవితకుఁగాని యొఱగునదో తఱుగునదో యుండదు. కావ్యమున దోషమునకు గుఱియగున దొక్క గ్రామ్యప్రయోగమే కానవసరములేదు, పొంక మెరిగి పలుకఁ బడని శబ్ద మేదేని కావచ్చును. కనుక వస్తుతః శబ్దమునందుకన్న శబ్దప్రయోగౌచిత్యానౌచిత్యములందే గుణదోషము లుండును.

తాళ్ళపాకకవులు పొంక మెరిగి శబ్దప్రయోగమును జేసినవారుగావుననే వారి కృతు "అలంకృతియుఁ జమత్కృతియు" గల్గి రాణించినవి. వారి యీ గేయకృతిని దిలకింపుఁడు.

అహిరి

"జిగురువంటవాఁడె శినకాటి - చింత
శిగురమ్మం బోసిందె శినకాటి ॥

సేతికుత్తుకవాఁడు సెడకుండ దాచిన
పాత పెద్ద విల్లు బలువునా
నాతి కొరకు వచ్చి నడిమికి విరిసిన
సేతలాడు గదే శినకాటి" (3–433

ముగ్ధమధుర మగుజానపదులవాగ్వ్యవహార మిందు రమణీయముగఁ బోషింపఁబడి నది. అనురాగమయుఁడనుటకు 'జిగురువంటివాఁడె' అను ప్రయోగ మెంతయో సాభిప్రాయముగ నున్నది. 'చింతశిగురమ్మ బోసెఁదె' అనుటలో పల్లెసీమల వాతావరణము కనులగట్టి అక్కడి జానపదుల ప్రణయవిలాసము లావిష్కరింపఁబడు చున్నవి.

ఇట్లే "సేతికుత్తుకవాఁడు (శివుఁడు చూ. సేతిమాటలు3-444)" "సెడకుండ" "సేతలాడు"మున్నగు గ్రామ్యప్రయోగములలో నొక సారళ్యము, ప్రసన్నత గోచరించుచున్నవి. మొత్తముమీఁద పాత్రౌచిత్య మెరిగి కావించినభాషాప్రయోగము వలన నిందలి గ్రామ్యోక్తులు సైతము చవులూరింపఁజేయునట్లే యున్నవి.

పలుతావులలో తాళ్ళపాకవారి పదప్రయోగ మిట్లే బంధురముగ నున్నది. వీరి రచన లన్నియుఁ జాలవరకు మధురభక్తిశృంగారమయములే. సంసారసాగరమునబడి తలమున్కలగుచు భక్తినావను చేజిక్కించుకొనుటకై పరితపించెడి జీవునివేదనను వెలిబుచ్చునట్టివే. మరి యాజీవులన్ననో సృష్టికర్తయు, సంస్కారపూర్ణుండును నగుపరమాత్మునితోఁ బోల్చిచూచినపుడు వట్టిపామరులే యనఁదగుదురు. అందుకేకావచ్చును పామరు లనఁదగినట్టి యాజీవుల యావేదనను వ్యక్తీకరించునట్టి వారి గేయకృతులలోని భాషయు, తదనుగుణముగ నున్నట్లు భాసించును. వ్యక్తి యెంతపామరుఁ డెనను భక్తిచేతనే వాని కుత్తమసంస్కార మలవడు

చున్నది. అట్లే తాళ్ళపాకవారి కృతులలోని భాష యెట్టిదైనను అందలి భక్తిభావ గౌరవముచేతనే దాని కొక బరువు గలుగుచున్నది. కనుకనే తాళ్ళపాకకవుల భాష పదకవితలభాషయని తేలికగా నెన్నఁదగినది కాదు. వా రట్టిభాషను సప్రయోజనముగనే ప్రయోగించిరి.

తాళ్ళపాకవారి గేయకవితాసంచయమున ఆనాఁటి చిత్తూరు, కడప మున్నగుమండలములందలి భాషాస్వరూపము సమగ్రముగ ప్రతిబింబించుచున్నది. వ్యాకరణచ్ఛందోలంకారాదులకు సంబంధించి వారు ప్రదర్శించినప్రయోగములును, వా రుదారముగ స్వీకరించి ప్రయోగించిన ఎరవుపదములు (Loan words) ను, ప్రదర్శించిన పారిభాషికపదజాలమును, వింతనిఘంటువులును, అపూర్వపదప్రయోగములును, వా రెన్నుకొన్న నానుళ్ళను, పలుకుబళ్ళను, వాడిన సామెతలును, అదియిది, యననేల భాషాసంబంధ మగుసర్వవిషయములును సమగ్రములై తరువాతికాలపుకవులకును, భాషాపరిశోధకులకును, మార్గదర్శకములుగను, పరిశీలనార్హములుగను వొప్పియున్నవి. వారి పదకవితలే వేలకొలదిగా నున్నవి. ఇఁక నందలిప్రయోగవిశేషములు త్రవ్వితండములు, సమగ్రపరిశీలన కిది సమయముగాదు. కనుక స్థాలీపులాకన్యాయముగ తత్తద్విశేషముల నించుక వివరింతును.

## భాషాప్రయోగవిశేషములు — వ్యాకరణాంశములు :

తాళ్ళపాకకవుల గద్యపద్యకవితావ్యాఖ్యారచనాదులను జాగ్రత్తగాఁ బరిశీలించినపుడు వారు వ్యావహారికాంధ్రమునే అధికముగా నాదరించినట్లును, దానిని ప్రయోగించుటలో వారు కొన్నినియమములను గల్పించుటకుఁ గూడ యత్నించినట్లును తెలియనగుచున్నది. ఆంధ్రలాక్షణికులగు కేతనాదులు గ్రామ్యములని తెగడిన వ్యావహారికప్రయోగములనుబోలినవాని నెన్నిటినో వారు లోకసిద్ధినిబట్టి ప్రయోగించి వానికి గతి కల్పించినారు. వారి వ్యాఖ్యారచనలు వ్యావహారికాంధ్రమున నున్నవిషయ మీవరకే విదితము. ఇఁక వారు తమ గేయకవితయందును, ద్విపదకావ్యాదులయందునుగూడ నట్టి భాషనే చాలావర కాదరించినారు. ఇట్లా నాఁడు వా రాదరించిన వ్యావహారికభాషాస్వరూపము తామ్రశాసనస్థమై కాలాంతరమున మార్పుఁగుదురనిదై నేఁటికిని బ్రత్యక్షముగ నున్నది. ఆతామ్రశాసనములను లిఖించిన లేఖకుల అవ్యుత్పన్నతమూలమున దొరలిన దొసగులను కొన్నిటిని పరిహరించినను, పలుతావులలో నాకవు లుద్దేశపూర్వకముగా నిర్వహించిన

వ్యావహారికభాషాప్రయోగవిశేషములను బెక్కింటిని కాదనజాలము. వా రట్టి ప్రయోగశక్తితో గ్రాంథికవ్యావహారిక భాషాస్వరూపముల కానాఁడుండిన యంత రమును జాలవరకు దగ్గించినా రనియే చెప్పవచ్చును. భాషావిషయమున ఆనాఁడు తాళ్ళపాకకవులు ప్రదర్శించిన సామర్థ్యమును నేఁటి కవిపండితలోకముగూడ ప్రదర్శింపగల్గినచో తద్విషయమై యీనాఁడు చెలరేగుచున్న పెక్కుసమస్యలు పరిష్కరింపఁబడు ననియే విశ్వసింపపచ్చును.

తాళ్ళపాకకవుల లభిమానముతో ప్రయోగించుకొనిన వ్యావహారికభాషా ప్రయోగవిశేషములను, వానియందలి వ్యాకరణాంశములను సీదిగువ నించుక గుర్తింపఁదగును.

*1. వచ్చీని, పోయీని, చేసీని, మానీని, త్రాగీ, అయ్యీని, కలిగీని ఇత్యాది ప్రయోగములు :*

లాట్టు ప్రథమపురుషైకవచనమున దుజ్వర్ణకమున కాదేశమైన సు వర్ణము పరముగా "ఎడు–ఎడి" అనునవి బహుళముగా నాగమములుగా రావలసిన పట్టులందును (బాల. క్రియా - 23). ఆశీస్సంప్రార్థనవిధులందు దుజ్ఞానక ద్రుతాంతములగు నెడు-త వర్ణంబులు (బాల. క్రియా 26) కలుగవలసిన తావు లందును తాళ్ళపాకవారు వచ్చీని, అయ్యీని మున్నగువిధముల ప్రయోగించి యున్నారు. వచ్చెడిని - వచ్చీని, కలిగెడును - కలిగీని

ఉదా : "కలుగక మానీనా" (2-80)

"త్రాగీ త్రాగీ త్రాగీ నయ్యా" - ఇత్యాదులు.

భాషయం దిట్టివిధానము సుపరిచితము. శాస్త్రజ్ఞులు దీనినిఁ లోపదీర్ఘత యను చున్నారు.

"సగము - సాము. మొగము - మోము
వచ్చెడిని – వచ్చేని, లేక వచ్చీని."

*2 ఏగుతా, ఆడుతా, చిముడుతా, నగుతా, నవ్వుతా, ముద్దుగునుతా.* ఇత్యాదులు.

అడుచున్, ఏగుచున్, మున్నగు రీతుల క్రియాన్వయమున ద్రుతాంత ముగ నుండెడి శత్రర్థక చు వర్ణమునకు ( బాల.క్రియా - 43 ) బదులు "తా" ఆదేశమైనది.

ఏగుచున్-ఏగుతా, ఆడుచున్-ఆడుతా, ముద్దుగునియుచున్-గునియుతా గునుసుతా.

ఉదా:- "ఏగుతానే" (4-6)
"నగుతానేనంటి" (2-238)
"నవ్వుతావున్నాఁడవో" (2-302)

కొన్ని మండలములందు తుది "తా" "తూ" అను రూపమున గూడ నున్నది. అది శత్రర్థక చు వర్ణమునకు సన్నిహితమగు నుచ్చారణ కలిగినది. కాని నేఁటికిని రాయలసీమ ప్రాంతములందు తాళ్ళపాకవారి ప్రయోగానుసారమే "తా" అనునంత ముండుటయు, మీఁదుమిక్కిలి "తా" పరమగునప్పు డంతకు ముందున్న క్రియాంతమునందలి ఉత్వ మత్వ మగుటయు గాననగుచున్నది.

**అడుచున్—అడుతా—అడతా**
**ఏగుచున్—ఏగుతా—ఏగతా**(ఊరేగతావున్నాఁడు ఇత్యాదులు గుర్తింపఁ దగును)

శత్రర్థక "చు" వర్ణముయొక్క స్థానమున వ్యవహారమునందు "త" విన బడును. ఇది కన్నడమందును కలదు. హేళతాయిద్దానె, హోగతా యిద్దానె- ఇత్యాదు లుదాహరణములు.

**3**. *అన్నలంటా, తమ్ములంటా, చేయరంటా, ఇతవంటా :*

ఈ రూపములను "అనుచున్" అను శత్రర్థక చు వర్ణమునకుబదులుగా వచ్చినవేగాని, వేరుగాదు. (అంటూ అనియుఁ, గొన్ని మండలములందు గలదు) ఈ "అంటా"- అఁట అను దాని మీఁద (సంధి 22) నుండి వచ్చిన రూపము గాని, భావార్థకట వర్ణము పరమైనపుడు (క్రియ 58) అన్వాదులను స్థానమున వచ్చిన సున్నతోడి రూపమున నేర్పడినదిగాని కాదు.

ఈ రూపము గూడ "అడుతా, పాడుతా"ల వలెనే అనుచున్- (అనుతా)- అంటా అని యైనది.

ఉదా:- "సుదతి నీకితవంటా చూచె గాని" (4-19)
"పందెము వేసేనంటా పాపట దువ్వేనంటా
చిందర వందరచేసి సిగ్గు విడిపించెనే" (3-609)

*4.* అవుత—అవుతా :

"అడుతా పాడుతా" లవలె శత్రర్థమున వచ్చిన రూపము కాదు· ఇది (క్రియ-35) భావార్థక ట ప్రత్యయమునకు మారుగా వచ్చిన "త" ప్రత్యయము తోడిరూపము నేఁటికి నీరూపము కొన్ని మండలములందు "ఎక్కడికీ వెళ్లితా" "అల్లా అవుతా యెరుగవా" మున్నగు వ్యావహారిక ప్రయోగములందున్నది· తాళ్లపాకవారు "అవుట-అవుత" రెండు రూపములును ప్రయోగించినారు.

ఉదా:- "నీవు విరహి వవుట నేనెరగనా,
భావించి యెవ్వరవుతా నేర్పరచలేఁ గాని" (17–352)
'దేవర వవుత యింత తెలియ రానేను' (17-299)
'ఏమౌతా నెఱుగ నీ వేమనేనే' (15–53)

"కొన్ని భావర్థములందు "త" యే కనబడును. చేయు- చేత, మూయు- మూత, కోత, రోత, పెక్కులు· కొన్ని ధాతువులు పూర్ణబిందుపూర్వకదవర్ణాంతములైనవి. వండు, పండు, వంటివి సహజముగనే 'ట' వర్ణమును పొందినవి· వండు-వంట. దంత్యాక్షరము "త" పరుషత్వము నొంది "ట" యైనదిగా తోఁచును. "త" కారము ప్రాచీనము, "ట" కారము అర్వాచీనము కావచ్చును" అని శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు వ్రాసియున్నారు.

*5.* చెప్పేది-పొయ్యేది:

చెప్పుట, పోవుట, మున్నగు భావార్థకరూపములందు ట ప్రత్యయమునకు మారుగా 'అది' అను తచ్ఛబ్దామహదేకవచనరూపము ప్రాప్తించి యేర్పడిన రూపము లివి. 'అ పొయ్యే దెక్కడికో" ఇత్యాది ప్రయోగములందీరూపములు నేఁటికి నున్నవి.[1] అందు పొయ్యేది = పోవుట అను భావార్థక రూపమే. విధియందు లూట్టునకు మారుగా నదియను తచ్ఛబ్దంబును ముందు నుగాగమంబును (బాల·క్రియా-27) నగు నని సూరి వివరించినట్లు 'ఉండినది'(మీ రిక్కడే ఉండేది- వ్యవహారము), "పోవునది" (పొయ్యేది) అను రూపము లేర్పడినట్లే విధ్యర్థమునకాక భావార్థమునను వ్యవహారమున పైరూపము లేర్పడుచున్నవి·

ఉదా : 'ఏమి చెప్పేదమ్మా'.

1. చూ. ౖబౌన్యము (పు. 17) "యెందుకు అరిచేది - మెల్లగా చదవండి" అని బ్రౌను ఉదాహరించిన వాక్యమున - అరచుట ఎందుకు? అనియే భావము.

*6. చేసేటి-చేసెటి, పొంగేటి-పొంగెటి, అనెటి-అనియెటి:*

ఇవి ధాతుజవిశేషణరూపములు. తృ వర్థకార్థంబునం దెడియెడు వన్ని యలగు (క్రియా 44) నను సూత్రమునను సరించి కర్త్రర్థమున పొందు, చేయు మున్నగు ధాతువులకు ఎడి-ఎడు ప్రత్యయములు పరమై పొంగు + ఎడి = పొంగెడి, చేయు + ఎడు = చేసెడు, మున్నగు రూపములేర్పడును. లేదా చేసెడి-తద్ధర్మార్థక క్రియా జన్య విశేషణముండనే యున్నది. "ఎడి" వర్ణకము పరుషత్వమును, పూర్వస్వర దీర్ఘమును పొందినచో "చేసేటి" రూపము సిద్ధించును. ఆరూపములే వ్యవహారమున పొంగెడి - పొంగెటి - పొంగేటి, చేసెడి- చేసెటి- చేసేటి, అను విధముల రూపాంతరమందుచున్నవి. దీనిలో హ్రస్వ యుతములగు చేసెటి, పొంగెటి మున్నగు వ్యావహారిక ప్రయోగములనే అధికముగా తాళ్ళపాకవారు గ్రంథస్థము గావించియున్నారు. ఉదా:-

"పొంగెటి మనసే వెలి పులకమొలకలు" (15-20)
"వెలసెటి విరహాన వేగెటి యింతికి"
"పొదిగొన్న తమకాన బొరలెటి కాంతకు" (16-2-107)

*7. అయ - పాయ :*

అయెను, పోయెను అనుటకు ఆయ,పాయ - అగుపోవుల కడవ్రాల కిద్వ్యక్రంబులు పరమైనపుడు యకారంబగుననియు,అగునకు వక్రంబు గూడుచో దీర్ఘంబగుననియు గల (క్రియా. 99 - 100) సూత్రములనుబట్టి యేర్పడు పోయెను- అయెను- ఆయ్యెను మున్నగు రూపములు వ్యవహారమున అయను, పోయను, పాయను మున్నగు విధముల నున్నవి. వానియందలి ఎత్వము వ్యవహారమున నత్వముగా వినబడుట నేఁటికిని గలదు. అట్లు అత్వోచ్చారణ కలిగినపుడు పోవు లోని 'పో' 'పా'గా మార్పునందుటయు గలదు. తాళ్ళపాకకవులే అత్వోచ్చారణతో విశిష్టములగు క్రియా రూపములనే అభిమానముతోఁ బ్రయోగించుకొనిరి.

ఉదా : "మంచిదాయ నిఁక నిది మానబొయ్యేనా" (8-108)
"నడుమాయ నవ్వులకు నా బ్రతుకు" (8-110)

*8. పోవుంద్రోవ, చెప్పుంబలుకులు :*

పోవుత్రోవ, చెప్పుబలుకులు అనుటకు తెలుఁగున నుదంతంబగు తద్ధర్మార్థవిశేషణమున కచ్చు పరంబగునప్పుడు నుగాగమంబగుట (బాల.సంధి-33)

గలదు. చేయునతఁడు, చేసెడునతఁడు-ఇత్యాదు లుదాహరణములు. కాని ఇట సమాసమున నుదంతతద్ధర్మార్థకక్రియాజన్యవిశేషణమునకును ద్రుతము చేరినది. తమిళభాషాసంప్రదాయమున "ఆహుం, పోహుం" ఇత్యాదిరూపములందు ద్రుతము బిందురూపమున గాన వచ్చునట్లే ఇటను "పోవుంద్రోవ" "చెప్పంబలుకులు" అనుటయందు సమాసమున ద్రుతము బిందురూపమున చేరినది. ద్రుతము బిందురూపమున నుండుట తెలుఁగునకు సహజము.

## *9.* అమ్మలాల, అయ్యలాల, మనుజులాల :

సంబోధనంబునందు బహువచనమున కారగాగమంబగుటయు (తత్సమ-36) దాని తుదియకారమునకు వికల్పముగ దీర్ఘమగుటయుఁ, దత్సమములకేకాదు ఆచ్ఛికములకును గలదు. కాని ఇట తాళ్ళపాకవారు "ఆరక్" ఆగమముగాక. "అల" ఆగమముచేర్చి అమ్మలాల, అయ్యలాల ఇత్యాదిగా ప్రయోగించిరి.

ఉదా : "తక్కక మనుజులాల, తలచి బ్రతుకరో" (2-395)
"తమ్ములాల", "అన్నలాల", "కొమ్మలాల" (3-485)
"అమ్మలాల" (3-583)

## *10.* ఓహో (వో) రాకాసులారా. దీమసపుబారివార, తుమ్మెదరో-ఏమిరే ఓ చెలులాలా, వచ్చురే, పోవురే:

ఓ యామంత్రణంబునందును, ఓరియోసి మైత్రియందును గలవు. (బాల. తత్సమ. 14-16) సంస్కృతమున అంగ, హే, హై, భో ఇత్యాదులామంత్రణ పదము లున్నట్లే తెలుఁగునను ఓ, ఓయి, ఓరి, ఓసి, ఓహో ఇత్యాదులామంత్రణ పదములు. తాళ్ళపాకవారు "ఓహోరాకాసులారా" అనియు, "ఓవోరాకాసులారా" అనియుఁ బ్రయోగించియున్నారు. సంబోధ్యవాచకము బహువచనాంతంబైనపుడు ఓ యను నామాంత్రణవాచకము ద్విరుక్తమగుట పైప్రయోగమున జూడనగును. 'ఓహో రాకాసులారా', అనుపాఠమున "ఓహో" అమంత్రణవాచకమని తలంపఁదగును.

'దీమసపు బారివార' సంబోధనంబునందు బహువచనమున కారగాగమంబు విధిగా కావలసి యుండఁగా నది లేనట్టి ప్రయోగములును తాళ్లపాకవారివి గలవు. 'దీమసపుబారివారలార' అనుటకు 'దీమసపుబారివార' అని ప్రయోగము. సాచన

సోమనాథుని 'వెట్టివార పిడుగు వైచిన దల టొప్పియాగునే' అను ప్రయోగము కూడ నిట్టిదే.

తుమ్మెదరో - తుమ్మెదారో : 'రో ఇతి స్త్రీ వాచకోభవేత్, పరత్రైవ ప్రయోగః' అని యాథర్వణము. ఈ 'రో' అను నవ్యయమును, దాని హ్రస్వ రూపమగు 'రొ' అనునదియు మహతీవాచకములమీఁదనేకాక శివకవులు వీర భద్రయ్యరో-దేవరో, బసవరో ఇత్యాదివిధముల మహద్వాచకకములపై గూడ జేర్చిరి. తాళ్ళపాకవారు తుమ్మెద + రో, తుమ్మెదా + రో అను విధములఁ బ్రయోగించిరి.

ఏమిరే ఓ చెలులాల : కిమర్థకమగు 'ఏమి' అనుదానిమీఁద 'రే' అనుఁ నామంత్రణవాచకము పరమైన రూపమిది. ('ఏమిరకర్ణ', 'తప్పుసుమ్మర' ఇత్యాది తిక్కన భారత ద్రోణ పర్వ ప్రయోగములు చూడఁదగును) ఇది ఓరీ-ఒరే-అరే-రే అను విధమున వ్యవహారమున నేర్పడిన రూపము. దీనికిని, 'రో' వలె పరమునందే ప్రయోగము. బాపురే, బళిరే ఇత్యాదులందున్న 'రే' ఇట్టిదే.[1] తాళ్ళపాకవారు 'ఏమిరే' వలెనే 'అందనే మరణములు అందరికి సరిరే' మున్నగు విధములను. వచ్చు, పోవు మున్నగు క్రియారూపముల మీఁదజేర్చి వచ్చురే' 'పోవురే' 'విచ్చురే' ఇత్యాది విధములను ప్రయోగించిరి.

ఉదా : "తలఁచి రాగలమేలు తానే వచ్చురే"
'పోగల వెల్ల వడిఁదానే పోవురే',
'తనుఁ దానే చింతింప, తలఁవు నిలుచురే'
'పాపాలు మంచు విచ్చునట్టు విచ్చురే' (6-140)

వచ్చుఁనోరి - పోవునోరి ఇత్యాదివిదముల నిందలి సంబోధనవాచకమున కన్వయము.

## *11. ఇడుకొను, ఉంచుకొను - అడుచుక, వంచుక, కూడుక :*

పడుజి కొను లొకానొకచో స్వార్థయినం దనుప్రయుక్తంబులగు (బాల-క్రియా - 109) నను సూత్రము చొప్పున పండుకొను ఇత్యాదులందు 'కొను'

1. బాపురే, బళిరే, ఇత్యాదులందలి 'రే' ఆశ్చర్యవాచకముగాఁ దోచుచున్నది. ఆశ్చర్యభావప్రకటనమునకును, మరియొకఁడుండుట తప్పరు కావున నిది తొలుత సంబోధనవాచకమై పిదప నాశ్చర్యవాచకముగను బరిణమించినట్లున్నది.

ధాతువుగా కాక స్వార్థమున ననుప్రయుక్తమగును.తాళ్ళపాకవారి 'ఉండుకొన్న రీతి' (3-13) ప్రయోగ మిట్టిదే. ఇఁక 'కొను'ధాతువుగా పరమై ముజ్జుపరంబగునపుడు కొనునకు కో శబ్దము బహుళముగా నైనరూపమే తాళ్ళపాకవారి 'ఇడుకోఁడు'అను ప్రయోగము.

ఇట్లు ఆత్మనేపదార్థకమై యనుప్రయుక్తమగు కొనుధాతు వంతమందుగల ధాతువుల క్త్వార్థక రూపములు కొన్ని తాళ్ళపాకవారి ప్రయోగములలో 'అడుముక' 'వంచుక' 'కూడుక' ఇత్యాది రూపముల నిగాగము (బాల.క్రియ- 53) గాకయు, 'కొని' అనునది 'క' అను రూపము దాల్చియు నగపడుచున్నవి. 'చోరాత్మనే పదార్థే' అను సూత్ర వ్యాఖ్యానమున సహోబలపండితుఁడు 'మరవక యప్పనుల తండమర్చుకవచ్చున్' ఇత్యాదికం వచనం మూలరహితమేవేత్యవధేయమ్' అని తద్రూపములను నిర్మూలములని కొట్టి వేసెను. కాని యట్టిరూపములు మన వాఙ్మయమున పదునైదవ శతాబ్ది నుండి యున్నట్లే పై తాళ్ళపాకవారి ప్రయోగములను బట్టి భావింపవచ్చును. 'అంభోరుహమిత్రు పేరి తలఁబుచ్చుక మ్రింగె విచిత్ర వైఖరిన్' (కవికర్ణ 6-20) అను ప్రయోగ మిట్టిదే.

ఉదా : 'కెదిపి తొడలపై గిరికొన నదుముక' (2-85)
'ఒద్దిక తో మమ్ము గూడుకుండరావోరి' (3-658)
'ఒద్దికతో తలవంచుకున్నది చెలి' (3-636)

వంచుకొన్నది, ఇత్యాది ప్రయోగములు 'వంచుక + ఉన్నది' అను విధమున వంచుకున్నది, అని లోకమున సిద్ధమగుటచేత శ్రవణ సామ్యమునుబట్టి 'కొను' ధాతువే 'కును' అను రీతిని వ్యవహారమున నేఁడు వినబడుచున్నది. (పడుకుని ఆడుకుని-ఇత్యాదు లుదాహరణములు)

## 12. చేసుక - మూసుక :

'ఇకార వక్రంబు లుక్తంబులందలివి పరం బగుచో యా కు సకారంబగు' (బాల.క్రియా - 54) మున్నగు సూత్రములనుబట్టి యు వర్ణాంతధాతువులమీఁద 'కొను' పరమైనప్పుడు చేసికొను, మూసికొను నిత్యాది రూపములే సిద్ధించును గాన చేసుక - మూసుక మున్నగురూపములు రావనియు, నవి యలాక్షణికము లనియు లాక్షణికు లనిరి. కాని వ్యవహారమున నిట్టి రూపములు లేక పోలేదు. తాళ్ళపాకవారు వానిని గ్రంథస్థము గావించినారుకూడ.

ఉదా :–"శుకవాణి తలుపు మూసుక తియ్యదు" (3-8)
"సొగసు కనురెప్పలు మూసుక" (3-404)

చూసేరు, మోసేటివారు, వేసువారు మున్నగుజాతుల వ్యావహారిక పదములు గ్రామ్యములని కేతనాదులు పేర్కొనిరి. తాళ్ళపాకకవు లట్టి వ్యావహారిక పదము లనుగూడ గైకొనిరి.

**చేయు - చేసు :**

ఉదా :–"చేసు నూరకే యైన జెలరేగి కర్మములు"
'లక్ష చేసు - కోటి సేసు -' (3-370)
'పారదోసు గాక' - (5-119)
'ఏమి సేసునో'- (7-228)
'నీ సేవ నేజేసుట కాదు' - (8-60)
'ఆగజేసు నాచూపులటు పోవయ్యా'- (12-40)

తెలియు - తెలుసు, ముదియు - ముదుసు, పాయు - పాసు,
గునియు - గునుసు.

'మోహం బెన్నడు ముదుసునయ్య' (16-1-18)
'తెలుసు నన్నియును' (3-62)
'హితవు తెలుసు కాల మెన్నడు'
'ఎట్టులు దెలుసు ?' (3-7)
"ఈసుల రేసుల నితర దూషణల - బాసుదె అపురూపపు ఫలము
"ఆడుతా పాడుతా నట్టే ముద్దుగును సుతా."

*13. కరఁగుకో :*

'కరఁగుకోవయ్యా లోలో గట్టి మనసు' (13-527) అని తాళ్ళపాకవారి ప్రయోగము. ఇట కరఁగుకోవయ్యా = కరఁగించుకోవయ్యా అనుటకు. ప్రేరణ మున నించుక్కు (క్రియా- 70) వచ్చి "కరఁగించు" అనియో, లేక అడంగ్వాది గణము నందలిది కావున చుక్కుగాగమంబయి కడద్రవాలు లోపించి (బాల. క్రియా. 76) 'కరచు' అనియో నేర్పడి, "కొను" ధాతు వనుప్రయుక్తమై కరఁచు కొను-కరఁగించుకొను అను రూపము లేర్పడవలసి యుండఁగా నిట ధాతు స్వత్వ రూపమే ప్రేరణార్థమున నిలిచియున్నది.

**14.** *జగడించు - గయ్యాళించు:*

"అర్థాదుల కించుక్కు పరంబగునపుడు గుగాగమమం బగు నప్పాదులకు విభాష నగు" (బాల. క్రియా-79) అని సూరి వ్యాకరించెను. అర్థము + ఇంచు అనుటలో మువర్ణ లోపమై గుగాగమము వచ్చి "అర్థగించు" రూప మేర్పడగా జగడము, గయ్యాళము మున్నగు నామధాతువులకు మువర్ణలోపమే గాని, గుగాగమము కానవచ్చుట లేదు.

జగడము + ఇంచు = జగడించు
గయ్యాళము + ఇంచు = గయ్యాళించు.

ఉదా:- "జగడించె వారితోనే" (3-156)
"గయ్యాళించేవు రోరి" (3-310)

"కావరమున వలసినట్లు గయ్యాళింపంగా వెరచి పెద్ద మొఱగా" అని కళాపూర్ణోదయమునం గూడ నిట్టి ప్రయోగము గలదు. జగడించునకు "శాంతి యుడిగి మగుడ వారు జగడింప." (జై. భార. ప్రయోగము) చూ. శ.ర.

ఆసగించు (5-30), ముమ్మరించు (3-306) ఇత్యాది ప్రయోగములకు తాళ్లపాకవారి రచనలలో ప్రయోగము లెన్నియేని గలవు.

**15.** *మెఱవగాను:*

ఇందలి ధాతురూపము "మెఱయు[1]" అగుచో బాల. క్రియా. (115) సూత్రముచేత నుజ్యంతం బగు నగు ధాతురూపము (కాను) వచ్చి, దానికి హ్రస్వంబు విభాష నగుటచే మెఱయఁగాను, మెఱయఁగను అను రూపములేర్పడ వలసియున్నది. కాని తాళ్ళపాకవారు "మెఱచు," "మెఱుచు"అని ధాతు రూపమును గ్రహించినట్లున్నారు. ఆగమాన్యచకారముల కద్విరుక్తములకు ముత్తు పరమైనపుడు వచ్చెడి వపలు వచ్చినట్లు (బాల. క్రియా. 88) "మెఱవఁగా" నను రూపము వచ్చినది. అదియు "మెఱువగ" నని యుండుట విశేషము.

ఉదా:-"తళ తళ మెఱువగ దంతములు."

"కలియు" ధాతువు - 'వాఁడు నన్ను కలపకుండా వెళ్ళిపోయాఁడు' అను విధమున నున్నది. ఇక్కడ సామ్యమే (analogy) ప్రవర్తిల్లుచున్నట్లున్నది.

---

1. "మెఱయునెడన్ మెఱసి మెఱపు మిఱుమిట్లు గొనన్". చూ. తిరుమలయ్య గారి రేఫ రకార పద్యాలు (43 ప.)

**16. చేతు - వ్రాతు :**

చువర్ణంబుతోడి దుగ్గకారంబునకు తకారంబగునని (బాల. క్రియ 108) సూరి వివరించి మీదుమిక్కిలి యుపర్ణాంతధాతువులమీఁద నట్టిరూపములు రావనియు, చేతురు, కోతు రిత్యాదు లసాధువులనియు విశదీకరించెను. ఈ రూపములు శాస్త్రీయములు కాజాలవని కొందరు పరిహరించినను, ప్రాచీనకవిప్రయోగములిట్టి వుండుటబట్టి కొంతమంది లక్షణకర్త లివి సాధువులే యనిరి. నన్నిచోడని కుమారసంభవమున నిట్టి ప్రయోగము లున్నవి. తాళ్ళపాకవారును నిట్టి రూపములను గ్రంథస్థము గావించినారు.

ఉదా : "నీవిపు డింత చేతువని" (4-3)
'వింతచవి సేతుగా' (2-77)
'తనమాటఁ దలపోతునే' (15-78)
'లేకలు వ్రాతు' (15-78)

**17. పోయితే:**

పోవు ధాతువుమీఁది 'పోయినన్' అను చేదర్థక రూపమునకు బదులు 'పోయితే' అని తాళ్లపాకకవులు ప్రయోగించిరి. చేదర్థంబునందు నవర్ణకంబు ద్రుతాంతంబగునని (బాల. క్రియా 41) సూరి సూత్రీకరించెను. నన్నయ కాలమున సమాపకక్రియా రూపముల కేని పదముఁ గూర్చి చేదర్థమును సూచించుచుండినట్లు ప్రయోగములను బట్టి తెలియుచున్నది. పోయితేని - పోయితే-పోతే, చేసితేని - చేసితే - చేస్తే - ఇత్యాదివిధముల నా ప్రాచీనమగు చేదర్థక రూపము నేఁడు వ్యవహారమున నిలచినట్లున్నది. పోయితివి + ఏని = పోయితివేని పోయితేని, పోయితే-అనుక్రమము కనబడుచున్నది. మధ్యమపురుషక్రియ మీఁద ఏర్పడిన రూపము అనుచితవిభాగముచే 'తేని' గా మారి 'తే' అని నిల్చి మధ్యమపురుషేతరక్రియలమీఁదను చేదర్థక ప్రత్యయముగా చెల్లు చున్నది. 'వాఁడు వచ్చితే-నేను చదివితే,' ఇత్యాదులు.

ఉదా : [1] "పట్టబోయితే పస లేదు." 'అడుగకఁ బోయితే నమరునే మనకు.' (10-84)

---

1. 'అన్నిటిలో గూడితే జాలు గాని' (10-128.)
'దొరికితేనే జాలు' (10-128.)

*18. ఉందానను:*

ఉన్నదానను, మహతీవాచక ఉత్తమపురుషైకవచనముతోడి ఉండుధాతు విశేషణ రూపమగు 'ఉండుదానను' అను రూపము తాళ్ళపాకవారి కృతులలో 'ఉందానను' అని పలుతావుల నున్నది. తిఙటలు పరంబగునపుడు ఉండు'డు' లోపంబు విభాషనగునని (బాల. క్రియా. 58) సూరి 'ఉందురు'-'ఉంట' మున్నగు ప్రయోగములను సాధించెను.

కాని యిట తిఙటలు కాక మహతీవాచక ఉత్తమపురుషైకవచనబోధకమగు "దాన" అనునది పరమైనపుడు ఉండు "డు" లోపమై "ఉందాన" అను రూపము వింతగా నేర్పడినట్లున్నది.

ఉండు + అది = ఉన్న + అది = ఉన్నది - ఉన్‌ది – ఉంది అను నిష్పత్తిలో తుది "ఉంది" అను వ్యావహారిక రూపముపలెనే ఉండు + దాన - ఉన్‌దాన - ఉందాన అను రూపము కూడ వ్యవహారమున ప్రాప్తించినట్లున్నది. పదులకొలదిగా నున్న తాళ్ళపాకవారి పై ప్రయోగములే ఈ రూపనిష్పత్తికి మూలములు.

ఉదా:- "తమ్మిరేకురెల్లాదెచ్చి దాచుక వుందానవటే" (13-322)
"సీయాలనై యింటనే ఉందానను" (14-200)
"మోనాన నుందాన వేమే మునివై తివా" (17-254)

*19. కలిగున్న - ఎత్తె త్తి - మొదలగు క్త్వార్థకేకార సంధులు :*

క్త్వార్థంబైన ఇత్తునకు సంధిలే (బాల.సంధి - 8) దని లాక్షణికు లుద్ఘోషించినను, వ్యవహారమున నట్టి సంధి ప్రసిద్ధమగుటను బట్టియు, ప్రాచీనులగు కవులు కొందరు ప్రయోగించి యుండుటను బట్టియు దాని నంగీకరింపక తప్పదు. తిక్కనాదుల ప్రయోగము లీసంధిని సమర్థించునవి గలవు. (చూ. ఏవేళ వెరచుండుముం వెరచిట్లంబుధినాథనందనులు) "కలిగున్నదనుచు" "కలిగుండువాఁడు" మున్నగు రీతుల నీసంధిని శివకవులును బాటించినారు. తాళ్ళపాకవారి సాహిత్యమున నిట్టి సంధి రూపములకు లెక్కలేదు.

ఉదా : 'వడిందేలాడిన' (2-81) 'తిరిగాడు' (తిరిగి + అడు) (5-126)
'కలిగున్న తలపు' (2-341) 'గంధము తీశిత్తువా' (3-65)
'అరసెందు వెదకినా' (5-243) 'ఎత్తెత్తి' (5-331)

'తగిలున్నవి' (2-378) 'ఆకుమడిచియ్యగ' (3-4)
'పవ్వళించున్నా(డు' (3-89) 'పడుండితివిట' (3-115)

మున్నగునవి చూడ(దగును.

## 20. ఇకారసంధులు :

శివకవులు కంచేడువాడలు 'పదతర్ష్యు పణ్యముల్,' మున్నగు రీతుల నికార సంధిని బాటించినారు. తాళ్ళపాకవారు నిట్లే ఇకార సంధిని బాటించిన ప్రయోగములున్నవి.

ఉదా : దృష్టి ఉంచి - దృష్టుంచి (3-182)
'తెప్పగా మఱ్ఱాకు మీ(ద తేలాడు వా(డు.
మఱ్ఱి + ఆకు = మఱ్ఱాకు, ధూళి + ఒత్తి—ధూళొత్తి (12-255)

## 21. విలుకాండ్లు :

కా(ప్రత్యయంబుమీ(ది బహువచనలకారంబునకు లఘ్వలఘు రేఫంబులును, లఘు రేఫంబునకు ముందు బిందుపూర్వకడకారంబును (బాల.ఆచ్ఛిక.7) గలుగ విలుకాండ్రు - లేదా - విలుకాఱు రూపము లేర్పడుట ప్రసిద్ధము. కాని తాళ్ళపాకవారు విలుకాండ్లు అని ప్రయోగించిరి.

ఉదా: 'విలుకాండ్లు, చిగురు మేతకాండ్లు.'
'చిగురు మేతకాండ్లెల్ల చెల(గి మావికొమ్మ లెక్కి.' (3-381)

## 22. వేండ్లు - ఇరుమేల :

వే(డి-వే(డిమి అనుటకు. అచ్ఛిక విశేషణరూపము. "ఇట్టి ఆచ్ఛిక విశేషణములకు కూడ తాళ్ళపాకవారు కొన్నియెడల బహువచనమును విధించి ప్రయోగించినారు. 'వరదలో నీళ్ళు మురుకులు' 'ఏటినీళ్ళు బురదలు' 'ఒడలు చలువలు గ్రమ్మినవి' ఇత్యాది వ్యావహారికప్రయోగములందు విశేషణములకు బహువచనరూపము గలదు. తాళ్ళపాకవారు "చలువలు వేండ్లు" (17-34) అని ప్రయోగించినారు.

ఇరుమెయి - ఇరుమై (= రెండుప్రక్కల) ప్రయోగములు నన్నెచోడుని కుమారసంభవమున గలవు. "ఇరుమైనుచ్చి పోవం బొడిచి" (కుమార. 12-16) ఇత్యాదు లుదాహరణములు. తాళ్ళపాకవారు "ఇరుమేల" నని ప్రయోగించినారు.

ఉదా :- "మును లిరుమేలనుండి మునుకొని నుతియించేరు" (11-74.)

## 23. కృత్తద్ధిత రూపములు :

మగఁటిమ్యాదులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబు (బాల•తద్ధిత-8) లని సూరి వివరించెను. తాళ్ళపాకవారు 'కోమలికము' (16-1-60) 'ఒంటరికము' (2-136) మున్నగు ప్రయోగములు గావించిరి. (త్వార్థమున తన వర్ణకమునకు బదులుగా 'ఇకము' వచ్చి చేరినది.) మానార్థమున 'ముద్దెడు' (2-114), 'చేతెడు, (2-140) అని డు వర్ణకమును జేర్చిన ప్రయోగములు కల్పించినారు. పుంస్త్వం' బునం దీవర్ణకంబు స్వార్థంబున నగుటంజేసి "ఉద్దండీఁడు" మున్నగు ప్రయోగములను గావించినారు.

ఇట్లే కృద్రూపములలో రాకపోక లనుటకు "రావు. పోవు" లని తాళ్ల పాకవారి ప్రయోగ మున్నది. "రావు పోవు లెక్కడికో రంగనాథా." ఇట్లే లోలత, సౌఖ్యత మున్నగు భావార్థకరూపములును వీరి రచనలలో గలవు.

## 24. వైరిపదములు :

వైరిపద మనఁగా సంస్కృతాంధ్ర పదముల విరుద్ధ సమాసము. వైరి పదము దోసమని పలువురు గర్హించిరి. కొందరు ప్రాచీనకవు లిట్టి వైరి పదములను గొన్నింటిని తమ కావ్యములందు లోకమునందలివాడుకనుబట్టి ప్రయోగింపకపోలేదు. తాళ్ళపాకవారి కృతులలోఁ గల వైరిపదము లివి చూడఁదగును. 'ఏకతవేళ' (17-553) 'లోకదొంగవు' (4-55) 'దుర్భాష మాటలు' (10-96) 'దిన వలపులు' (17-526) 'దినదినకోరికెలు' (10-221) 'దినదినకొత్తలు' (6-167) 'నిత్యకొత్తలు' (4-95), 'దినకొత్తలు' (11-11), 'దినసంతలు' (8-170),

## 25. సమాసముల కూర్పునందు వైచిత్రి :

వీర్యము + యజ్ఞము – వీర్యపుటెజ్ఞము. యజ్ఞ శబ్దము నెజ్ఞముగా నుచ్చరించి టు గాగమమును జేసిన రూపమిది. "వీర్యపు టెజ్ఞభాగాల" (7-137) "యజ్ఞము = ఎజ్ఞము = ఇచ్చట సంప్రసారణము ప్రవర్తిల్లినట్లున్నది. యజ్ ధాతువునుండి "ఇష్టి" రూపమున్నది. వలదు-ఒద్దు. "సర్వత్రాజ్యత్కార్యమ్ యస్యద్రుత ప్రకృతికేభ్యః" అను సూత్రమునందు ద్రుతము మీఁది యకారమును అచ్చువలె చూడఁదగునని చెప్పినాఁడుగదా! ద్రుతముమీఁదనేగాక తక్కిన హల్లుల

మీఁదకూడ 'య' కారము అచ్చువంటి దగుట కాన్పించును." అని శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు విశదీకరించియున్నారు.

సింగారము + బొమ్మ - కర్మధారయమున ము వర్ణమునకుంబుంపులు వచ్చి "సింగారపు బొమ్మ" కావలసి యుండఁగా తాళ్ళపాకవారు పుం పులు లేకుండ ము వర్ణమును లోపింపజేసి "సింగార బొమ్మ" (17-432) అనిరి.

"వేంకటేశు కిష్టుఁడై" "కొండుక శిశువుకు గొబ్బిళ్ళో" (3-484) షష్ఠికు వర్ణకము ముందు నగాగము రాలేదు. ఇట్టి రూపములు క్వాచిత్కముగాఁ బ్రాచీన కృతులలోఁగూడ నున్నవి. "గరుడగంభముకాడ" అను ప్రయోగము కూడ నిట్టిదే. గరుడగంభమునకు + అడ-అని విచ్ఛేదము. ఆ కడన్ ఈ కడన్ అనుటకు అడన్-ఈడన్ అనునవి గ్రామ్యరూపము లనియు వానిని పరిహరింపవలె ననియు సహోబలపండితుఁ డనెను. కాని వ్యవహారమున ఆ కడన్-అడన్, ఆకడకు - ఆకాడికి, మున్నగు రూపములు ప్రసిద్ధములు. తాళ్ళపాక కవు లిట్టిప్రయోగములనుగూడ ప్రయోగించిరి.

'ఏడదిరా' (12-221)
గోపురము + ఆడ - 'గోపురమాడ'
'నీడ తిరుగని చింతాడ-' (చింత + ఆడ) (11-3-108)

ఏకడది,గోపురముకడ,చింతకడ అనుటకు-పైప్రయోగము దేవాలయమును జుట్టియుండు వీధులను "మాడవీధు" లనుట ప్రసిద్ధము. మాడవీధు లననేమో! ఉత్తరమాడవీధి, దక్షిణమాడవీధి-ఇత్యాదు లుదాహరణములు. ఇట ఉత్తరము + ఆడ + వీధి = ఉత్తరము కడనున్న వీధి (గోపురమాడ-గోపురముకడ అన్నట్లు) అని అర్థమేమో ! ఉత్తర దక్షిణమాడ వీధులనుబట్టి 'తూర్పుమాడవీధి' అని కూడ నేర్పడినదా ? సందేహమే!

*మఱికొన్ని వ్యావహారిక ప్రయోగవిశేషములు :*

(1) ఈకవులు సంధిగూర్చవలసినచోట్ల సంధిని గూర్పక వ, య ఆగమములు చేర్చిప్రయోగించిరి. యడాగమమునకు బదులు 'వ' అగుటకు -

**ఉదా:-** 'ఏవూరికేవూరు యేనాటి ఋణము' 'ఏమని వుండితివో' (13-316) చిన్నన్న పరమయోగివిలాసమున-

'ఏవూరి కనకాంగి ఏవూరి మౌని

యీవిధి వాటిల్లె' అని ప్రాస స్థానముననే ప్రయోగించెను. తాళ్ళపత్రములం దిట్లేయున్నది. య కారంబును వు వూ వొ వో లును దెలుఁగుమాటలకు మొదటలేవని లాక్షణికులన్నను, వ్యవహారోచ్చారణమున నట్టి రూపములే వినవచ్చుటఁజేసి తాళ్ళపాకవారు వానినట్లే ప్రయత్నముతోఁగోరి ప్రయోగించుకొనినారు[1].

ఏ + ఊరు—ఏ + వూరు (వ్యవహారమున)

కనుకనే యడాగమ ప్రసక్తియే లేకపోయినది. నుగాగమము లేమికి-

'ఇన్నాళ్లను దా యేడ నుండెనమ్మా' (16-%-109)
'ఈల కూరకు వుప్పు చాలదందురు.' (13-50)
'ఒకటి కినుమడాయ వుబిద నీబలగము' (13-289)

(2) సముచ్చయము నందలి 'ను' అను నక్షరమును ఇదంతములమీఁది "యును" నునువియు లోపింపగాఁ దత్పూర్వస్వరమునకు దీర్ఘమగుట వ్యవహారప్రసిద్ధమగుటంజేసి తాళ్ళపాకవా రట్టిప్రయోగములను ప్రయోగించిరి. తల్లియును దండ్రియును- తల్లీదండ్రులు.

ఇట్లే "మానిసీ మెకమూగాని" "ఈసులకే పెనఁగేరు యిప్పుడూగొందరు" "మనసూరోసితి, మరులూ బాసితి" "ఎరిగీ నెరుగరు" 'ఇప్పుడన్నీనాదేవు' తుదిప్రయోగములలో "ఎరిగియును + ఎరుఁగరు"-"ఎరిగీ + ఎరుగరు—" అని యేర్పడిన దీర్ఘము సముచ్చయార్థముననే గావున దానిమీఁది ద్రుత మట్లే నిలచి "ఎరిగీనెరుగరు" అనియైనది.

కొన్నియెడల సముచ్చయార్థమున దీర్ఘము వచ్చియు 'ను' నిలచియున్నది. "ఇందరూ ను మెత్తురా" (17-195) ఇత్యాదులు చూడనగును.

(3) తెలుఁగున పదాదిని య కారమును, వు వూ వొ వో లును వ్యవహారమున ప్రసిద్ధము లగుటచేత తాళ్ళపాకవా రట్లే అభిమానముతో ప్రయోగించుకొనిరి. తమిళమున "యారు" "యానై" ఇత్యాదిపదములు 'యా' అదియం దుచ్చారణ గలవి యున్నవి. తత్సామ్యముననే తెలుఁగునను యారు, యెవరు, యవరు ; యానై, యేనుఁగ - ఇత్యాదిరూపము లుచ్చారణమున నిలచియున్నవి.

---

1. "కాచుకిట్టే వుండగాను' 'ఏలవాడి వచ్చేవు' 'ఆపె వుండగాను' (13-482)

"యౌవన"మను పదమును "యవ్వనము" అనురీతిని ప్రాచీనులు నన్నెచోడకవి ప్రభృతులు ప్రయోగించియున్నారు. తాళ్ళపాక పెదతిరుమలార్యుఁడును "యవ్వని కోమలాంగి మరి యవ్వనితామణి" (శృం. వృ. శ. 37) అని ప్రయోగించి యున్నాఁడు.

ఇఁక - ఏడ, ఏల మున్నగునవి 'యాడ' 'యాల' మున్నగురీతుల ప్రయోగింపఁబడినవి.

ఉదా:- "వెలి యాడ లో నేడ" (2-340)
"యాలే యాలే యాలే గొల్లెత."

"ఎ" ఉచ్చారణమున "య"గా మారినట్లే పదాదిని గల 'య' ఉచ్చారణమున 'ఎ' గా మారినప్రయోగములును వీరి రచనలయందు గలవు.

యవ్వనము - ఎవ్వనము ; యమున - ఎమున ; యశోద - ఎశోద ; యజ్ఞము - ఎజ్ఞము మున్నగునవి.

ఇట్లు ఉచ్చారణమున మార్పు నొందుటేకాక అట్లు మారిన ఎత్వ మచ్చపలెనే తక్కిన వ్యాకరణ ప్రక్రియలను గాంచినది.

ఉదా:- 'రేపల్లె కెమున దాటి రేతిరే తెచ్చి' (రేపల్లెకు + ఎమున)
'కావించు నెజ్ఞాలు' (కావించు + ఎజ్ఞాలు)
'వీర్యపు టెజ్ఞాలు' (వీర్యము + ఎజ్ఞాలు)
'ఏటి బిడ్డ గంటివమ్మ, యెశోదమ్మ' (10-237)

తెలుఁగున పదాదిని వు వూ వొ వో లుండుటకు -
"వొత్తిలి నవ్వులునవ్వి వొడళ్లు వించేవారు" (13-264)
"ఏవూరికే వూరు"
"ఏవూరి కనకాంగి యేవూరి మౌని
యీ విధి వాటిల్లె" (పరమయోగి విలాసము)
"పొందలేని బాధ వోర్వలేము
"ఓవో రాకాసులాలా వొద్దుసుఁడీ వైరము"
"వాచవికి బ్రతిమాలి వడవడ్డ బ్రతుకా" (5-292)

పై ప్రయోగములలో ఒడళ్ళు - వొడళ్ళు, ఒత్తిలి-వొత్తిలి, ఊరు-వూరు, ఒర్వలేము-వోర్వలేము ఇత్యాది విధముల పదములు వకారాదిగ నున్నవి. "వలయు" క్రియకు వ్యతిరేకార్థకరూపము వలవదు- వలదు- వద్దు- అనునది "వొద్దు" అను రీతి నున్నది. పై ప్రయోగములలో ఒ-వో గా మారగా, నిందు వ(ద్దు)- వొ(ద్దు)గా మార్పునందినది. ఇట వ-వోగా అయినట్లే ఒ-వగా మారిన రూపములుగూడ నున్నవి. ఒడబడు-వడబడు అను ప్రయోగమట్టిదే.

(4) అవధారణార్థాదులందు "ఏ" "ఓ"లు వచ్చుటకు :

అవధారణార్థమున "ఆ"కు బదులుగా "ఎ" వచ్చుటకు -

"ఆ జలధియే యొరుగు" (10-121)

"నేలే అధారము" (10-59)

సత్వరార్థమున – "ఉండంగానే, చిందంగానే, అలరంగానే" (4-54)

ఏగుతానే (4-6);

సంభావనాదులందు ఒ-ఓలు వచ్చుటకు -

"ఎక్కడో చూచేను" (10-118)

"ఎమ్మెలు నెరపుచు నెక్కడ తిరిగో" ( 12-68)

నిర్దేశార్థమున - "అదివో అల్లదివో హరివాసము"

'అద్దో నే మెందాకా నైనా' (12-9)

ప్రార్థనార్థమున - "చల్లనై కాయగదో చందమామా"

ప్రశ్నార్థమున - "ఏమని వుండితివో" (13-318)

"హరియేమనెనే అలిగెనో" (13-332)

సందేహార్థమున - "ఇంక నెన్ని కాఁగలవో" (13-453)

"నలుపో తెలుపో"

"నుయ్యో కొండో" (12-192)

(5) దంత్యతాలవ్యోచ్చారణము నందలి విపర్యయమునకు -

జడ-జెడ-"జెడలల్లి జవ్వాది శిరసుపై నంటి" (4-28)

'జెడగట్టి ముంగురులు చెల్లటో చెలికి' (4-35)

"చంచలము—చెంచెలము"

"చలించు-చెలించు"

"చేరితి మతనినే చెంచెలమేల"

"చెంచెలపు దిప్పపెంటఁ జివికిస దీయాత్మ" (11–151)

"చెంచెలుఁడు" (11–66)

"చెలగు దొంతుల సంధి చెలియించుమావు" (ఉషాపరిణయ ద్విపద)

చెలి-చలి, "ఇంద్రియాలకుఁ జర"

(6) "స" కి "శ", "సి" కి "శి" మున్నగు రీతుల వ్రాతలో నుండుటకు.

'గంధము తీశితువా' (3-65)

'ఎలమి యింత సేసేశి' (2-136)

'ధర శింగిణుల'

'రంతుశాయ కిటు రావయ్యా' (15-279)

'చెలువపు సేతల శిన్నెకా' (12-260)

'సొగసు చూచి వాని సొలశినయ్యో' (12-260)

'వే శూరకె' (13-263)

(7) ఉచ్చారణనుబట్టి అత్వవిశిష్టములగు పదము లెత్వవిశిష్టములుగను, ఋ-రు, రి లుగను మార్పు నందుటకు- "మినుకుగా మరుఁడు తామెర లమ్ములనె మేన" (12–123)

తామర — తామెర (17-55?)

నిక్కము — నిక్కెము (17-271)

కుత్తిక — కుత్తికె (15-81)

వాడిక — వాడికె (13-273)

ఏనుగ — యేనిగె (13-239)

రెండు — రండు (14-273) (నేఁటి వ్యవహారమున నిది రొండు

"రూపులేని భోగములెల్లా రుణములే" (10–108)

ఋణము — రుణము

కృష్ణుఁడు — క్రిష్ణుఁడు (17-258)

శృంగారరాయడ — శ్రింగారరాయడ (15-299).

బల్లెము-బల్లము (12-124)

పింఛము-పించెము, పెంచెము (12-185)

ఇవి తెలుఁగున, తమిళకర్ణాటకభాషలసాహచర్యమువలన నేర్పడినట్టి రూపము లనఁదగును.

(8) "ము" ప్రత్యయము బిందు రూపము నందుటకు.

పూర్వకర్మశేషము - పూర్వకర్మశేషం. (2-113)

తాళ్ళపాకవారి వ్యావహారిక వ్యాఖ్యా వచనమున నిట్టి ప్రయోగము లధికము.

(9) వికృతి రూపములందు వికర్ష స్వరాగమములకు -

| | | |
|---|---|---|
| శుక్రవారము - సుక్కురారము | | (14-153) |
| వాయిద్యాలు - వాయిదాలు | | (17-403) |
| బాలకృష్ణ - బాలకిసున | | |
| గోపాలకృష్ణ - గోపాలకిసున | | (3-15) |
| లక్ష్మమ్మ - లకిమమ్మ | | |
| శకునము - సగినము | | (15-73) |
| సరసము - సరుసము | | (15-3) |
| గౌసెన - గవిశన | | (17-550) |

సంయుక్తాక్షరముల విశ్లేషణమునకు —

| | | |
|---|---|---|
| అర్హానర్హము — అరుహనరుహము | | |
| అర్హము - అరుహము | | (8-55) |
| హర్షించు - హరుషించు | | (3-241) |
| తార్కాణ - తారుకాణ | | (3-241, 7-14) |

| | | | |
|---|---|---|---|
| తార్కాణించు | – | తారుకానిణించు | (13-352) |
| రుక్మిణి | - | రుకిమిణి | (7-43) |
| నిర్హేతుకము | - | నిరుహేతుకము | (7-174) |
| ఆశ్చర్యము | - | అశ్చరియము | (8-109) |
| పర్యంకము | - | పరియంకము | |
| చంద్రుడు | – | చందురుడు | (12-70) |

ద్రావిడభాషాతత్త్వము ననుసరించి పదమధ్యమున సంయుక్తాక్షరము లుండవు గాన సంయోగశిథిలత తెలుగునకు సహజమే. ఇట్టి సంయోగశైథిల్యమును పడసిన ప్రయోగములను ప్రాచీన కవులు పలువురు ప్రయోగించిరి. వీనిలో అర్హము-అరహము, హర్షము-హరషము అను శిథిలరూపములకు బదులు అరుహము-హురుషము అను విధముననే తాళ్ళపాక కవులు ప్రయోగించిరి. సత్తువ-అనుటకు 'సత్వ' (10-110) అని ద్విత్వశైథిల్యము నొందినరూపములు కూడ కొన్ని వారిప్రయోగములందు గలవు. ఇంకను నిట్టి ప్రయోగవిశేషముల నెన్నిటినేని సూక్ష్మముగ బరిశీలించి పేర్కొనఁదగును. సమయాభావముచేత మరికొన్నివీని మాత్ర ముటంకించి యూరకొందును.

(1) కౌఁగిలిపదమును "కాఁగిలి" అని వీరు పలుతావుల ప్రయోగించిరి. "కపటాలు చేసే నిన్ను కాగిలించుకొనుకంటె" (17-32) మున్నగునవి చూడఁదగును.

(2) మేంత, ఈంత - ఇత్యాదులందు దీర్ఘముమీఁద పూర్ణబిందువు నుంచిరి. "మేంత, ఈంత, కాంతాళించిన, చెంతల నిండిన" అని ప్రాసస్థానమున (3-360) వీరి ప్రయోగ మున్నది.

(3) "క్వచిద్గకారోవః" అను సూత్రము ననుసరించి ఎలుగు - ఎలువు అని ప్రయోగించిరి. "పులియో యెలువో" (12-192)

(4) "ముత్తియ శబ్దేతరంబులకును దరచుగ నిత్వ లోపము గానంబడియెడు"నని ప్రౌఢవ్యాకరణకర్త గుర్తించినట్లు (12-192) "పళ్యాలు" మున్నగు ప్రయోగములు వీరివి కలవు. ఇట్లే దివ్వియ+అర్పు అనుటకు బదులు దివ్యారుపు, దివ్వారుపు మున్నగు ప్రయోగము లున్నవి.

(5) తెచ్చునకు తే, తేరు లగునని సూరి వివరించెను. తాళ్ళపాకవారు "తెచ్చు" క్రియారూపమును "తెంచు" అని ప్రయోగించిరి.

"తుద లేని పతి నిదే తోడితెంచె నిపుడు" (12-204)

'వెంటఁదెచ్చె, కొంటవచ్చె' - అను రీతిని 'తోడితెంచె' అని రేకులం దన్నిటను నీ పాఠ మిట్లే యున్నది.

(6) ఉచ్చారణభేదమును బట్టి వర్ణవిపర్యాసమునకు -

| | | | |
|---|---|---|---|
| పింఛము | — | పెంచెము | (12-185) |
| పునుగు | — | పుణుగు | (12-197) |
| కుందనము | — | కుందణము | (12-236) |
| చిత్తిని | — | చిత్తిణి | (12-244) |
| హస్తిని | — | హస్తిణి | (12-244) |

తాళ్ళపాకకవు లీ విధముగా నాఁటి సిద్ధవ్యావహారికభాషను స్వతంత్రించి యభిమానముతోఁ గోరి ప్రయోగించుకొనిరి. పూర్వ వీలు గాకుండ రాగిరేకులపైఁ జెక్కించిరి. నేఁటి శిష్టవ్యావహారికమునకు వ్యాకరణమును వ్రాయఁగోరువారు[1] ఆ నాఁడే అట్టిభాష నాదరించి కవితారచన కుపయోగించుకొనిన తాళ్ళపాకవారి సారస్వతమును దుదముట్టఁ బరిశీలించు టెంతేని యవసరము.

## ఛందోలంకారవిశేషములు:

తాళ్ళపాకవారు ద్విపదచ్ఛందమున గల్పించుకొన్న నియమములనుగూర్చి మున్నే వివరించితిని[2]. ఇఁక మాత్రాచ్ఛందమునకు సంబంధించిన గేయసారస్వత మునగూడ వారెన్నో నూతనప్రయోగములను గావించినారు. వారి గేయములు గానయోగ్యము లగుటచేత ప్రధానముగా పాడుటకనుకూలముగనే స్వరముల మాత్రాకాలమును హెచ్చించియో, తగ్గించియో సందర్భమునుబట్టి రచించుచు

1. ఇట్టి యత్నములలో శ్రీ వఝ్ఝల మూడి గోపాలకృష్ణయ్యగారి వ్యావహారికాంధ్ర వ్యాకరణము చూడఁదగినది.
2. చూ. నా గ్రంథము "తాళ్ళపాక కవుల కృతులు-వివిధ సాహిత్యప్రక్రియలు" (పు. 144)

వచ్చినారు. కొన్ని గేయములు వారి వట్టి యుచ్చారణ స్వరములతోనే వ్రాయఁబడి యున్నవికూడను. చూడుఁడు.

లలిత

"చాలా మేలుదిరా యీ బాలామణిపుడు నీ
పాలీట జిక్కెరా గోపాల కృష్ణమ్మా ॥
పంకాజముఖి నీవంకా చూచినపుడే
బొంకాముగా వలచె యింకా నేమందురా ॥
పల్లాదమున నీవు మొల్లామి నందరిలో
మొల్లా పూబంతి వేయ జల్లానఁ గరగెరా" (16-83)

ఇత్యాదులు- స్వరప్రయోగవిషయమట్టుల నటుంచి గేయచ్ఛందో నిర్మాణముననే వారెంతో వైవిధ్యమును సాధించినారు. నాఁటిమార్గదేశిచ్ఛందోరచనాప్రభేదముల నెఱిగి గేయనిర్మాణమున వారు పోయినపోకడలకు అనంతమగు వారిసంకీర్తనసంచయమును, పరిశీలనాత్మకమగు వారి సంకీర్తనలక్షణగ్రంథమును ప్రమాణములు. ఆయా విషయముల నించుక పూర్వ ప్రకరణములందే వివరించితిని. ప్రస్తుతము వారి రచనలలోని ఛందో విశేషములను గూర్చి మాత్రము ముచ్చటింతును.

రెండుపాదముల పల్లవితోడను, నాలుగేసి పాదములుగల చరణములు మూడింటితోడను గూడిన పదములనే వారధికముగా రచించినారు. ఇది సాధారణ విషయము. ఇట్టిపదములందు వారు సంస్కృతాంధ్రభాషలందు రెంటను సమముగానే యతి ప్రాసలను బాటించినారు. ప్రాసయతులు వాడిన పట్టులును- యతిభంగములైనతావులును వారి రచనలందు కొన్ని లేకపోలేదు. సోదాహరణముగా వివరింతును.

తెలుఁగువారు సంస్కృతకవితను జెప్పినపుడు తెలుఁగుకవితాసంప్రదాయము ననుసరించి యతిప్రాసలను పాటించుట ప్రాచీనకాలమునుండి గానవచ్చుచున్న విషయమే. తాళ్ళపాకవారు నట్లే తమ సంస్కృతసంకీర్తనములందును యతిప్రాసలను పాటించినారు. ఉదా :

శుద్ధవసంతం-రచ్చేతాళం

"ప్రలపనవచనైః ఫలమిహ కిం
చలచల కుడ్యక్షాళన యాకిమ్ ॥

ఇతర వధూమోహితం త్వాం ప్రతి
హితవచనై రిహ ఫలమిహ కిమ్
సతతం తవానుసరణమిదం మమ
గతజలసేతూకరణ మిదానీం॥" (3-39)

మున్నగు వారిసంస్కృత కీర్తనములను జూడనగును. ఇఁక వారి తెలుఁగుకీర్త నములందలి యతిప్రాసవిశేషములను గొన్నిటి నెత్తిచూపుదును.

**యతివిశేషములు:**

యతులను బాటించుటలో నీకవులు వ్యవహారమునగల వర్ణముల యుచ్చా రణకే ప్రాముఖ్యమిచ్చిరికాని వాని స్వరూపమునకుగాదు.

(1) రూ - ఋ లకు యతి.

'రూపులేని భోగములెల్లా రుణము ( = ఋణము) లే సుండీ' (10–108)

(2) పో - వో లకు యతి.

'పొందలేనిబాధ వోర్వలేము'

(3) వా - వొ - ఒడుబడు - వొడబడు-వడబడు అనురీతిగల యుచ్చా రణనుబట్టి-

'వాచవికి బతిమాలి వడబడ్డ బ్రతుకా'

(4) ఒ (వో)–వు లకు-

'వోడక వీధులం బరువులు దోలీని'

(5) దై - దే - లకు యతి.

"దైవశిఖామణి తిరుమలదేవుని కృప గలచిత్తము"

"దైవదూషకుండై తిరిగేటివానికి
దైవతంత్రము తెలిసీనా" (2-187)

ఇట దైవమను పదము తమిళమున 'దెయ్వం అనురీతి నుచ్చరింపఁబడును. తదనుగుణముగా యతి చెల్లింపఁబడినది.

(6) ఇ - య - లకు యతి.

'ఇంతలోనే తాను నీ యెవ్వనరాజ్యమెల్ల' (3-649) యవ్వనము-యెవ్వ నము అను రీతిని గల యుచ్చారణను బట్టి. ఇట్టిదే:- 'ఏటి బిడ్డ గంటివమ్మ యశోదమ్మ' అనునది కూడ.

ఇట్లే యుచ్చారణనుబట్టియే-

''చేరితి మతనినే చెంచెల మేల

'చెంచలపు దిప్పపెంట జివికినది యాత్మ' (11-151)

'జెదలల్లి జవ్వాది శిరసుపైనంటి' (4-28)

'చెలగు దొంతుల సంధి చెలియించుమావు' (ఉషా పరిణయము పు. 69)

'చేతనుఁడై సర్వగతుండై చెలియించ దేమిటను'

మున్నగుతావులందును యతి పాటింపఁబడినది.

(7) ము విభక్తిక యతికి.-

"పొడిపొడియై నభమున కెగయ" (2-69)

## ప్రాస విశేషములు:-

ప్రాసమును గూర్చు సందర్భములందును నీ కవు లుచ్చారణకే ప్రాముఖ్య మిచ్చిరి. సిద్ధవ్యవహారమున దీర్ఘముల మీఁది పూర్ణబిందువుల నట్లేయుంచియు, యడాగమము లేక "వ" ఆగమముగాఁ జేర్చియుచ్చరించు పట్టులందు 'వ' కే ప్రాస బాటించియు, సబిందు నిర్బిందు వర్ణములకు ప్రాసను బాటించియు వీరు కొంత వైచిత్రిని ప్రకటించినారు. ఉదా:-

(1) "ఏవూరి కనకాంగి యేవూరిమాని

యీ విధి వాటిల్లె" (పరమ. పు. 53.)

(2) "మేంతల మరగిన మీల పిల్లలకు,

నీంతల నేర్పిన యీ తరుణి,

కాంతాళించిన............

చేంతల............... (3-363)

(3) ''మింటిఁమీది కంటిచూపు,

గుట్టిమీఁది దోడబుట్టు

వొట్టిగాక............

జుంటి తోడ......... (3 363)

ఇట "మింటి-గుంటిమీఁద-వొంటి గాక-జుంటి తోడ"

అను రీతిని ప్రాస చెల్లింపఁబడినదేమో!

(4) 'లజ్జకారవౌదువు -...
ముంజేత...' (9-469)

(5) "రూపింప చక్కెర - వేఁపచే దడుగునే."

(6) "శశి కిరణములకు , విశదముగా, రసికత, వశము" (12-159)

(7) ర - ఱ ల కుచ్చారణను బట్టి–
"చెఱకు విండ్లను బిప్పి సేయు భ్రూలతలు
మురువు దమ్ముల నీట ముంచు కన్నులును"1 (పరమయోగి)
"ఎఱిగి చేసినది - కొఱఁతలు" (2-79)
"రంగైన సతి కోప మెరంగ నా యికను" (3-27)

(8) సంకీర్తనములందు ప్రాస యతులకు :-
"మహిలో పుణ్యులు గారా నహుషాదులు" (2-147)
"పోయెన్ గాలం బడవికిఁ గాయు వెన్నెలల కరణి"
"బూరుగుమ్రాఁకునఁ జేరిన కీరముచందమున" (2-183)
"సడిబడి కుడిచిన కుడుపెల్ల నినుము" (2-124)

(9) యతిభంగమునకు :
"కావరపు సంపదలు కోరేటి జీవుఁడా " (2-139)

## అలంకార విశేషములు :

తాళ్ళపాకకవుల రచనావిశేషములను పరిశీలించు సందర్భమున వారి యాలంకారిక రచనాచమత్కారములు కూడ గుర్తింపఁదగినవి కొన్ని గలవు. వారు భావప్రకటనమునఁ బరిపుష్టిని సంపాదించుకొనుటకై యలంకారమార్గము ననుసరించినారు. అందు వారు పూర్వకవుల కవితాసంప్రదాయములను, సమయములను బాటించుచు తరువాతి కవులకు మార్గదర్శకము లగునట్లుగాఁ దమకుఁ గల ప్రకృతి పరిశీలనాశక్తిని, వైష్ణవమతాభినివేశమును భాషాసౌలభ్యముతో పసందుగా ప్రకటించుకొనినారు. రచనాగౌరవమును బురస్కరించుకొని వారి యాలంకారికోక్తులు కొన్ని లోకోక్తులుగా కూడ రూఢమైపోయినవి.

---

1. చెఱకువిల్లు, అని "చెఱకు"న శకటరేఫమును, "మురిపెము"న సాధు రేఫమును తాళ్ళపాకవారి రేఫ ఱ కార పద్యములందు గలవు.

వా రభిమానించిన యలంకారములలో ఉపమ పేర్కొనఁదగినది. ఉపమా ప్రపంచ మనఁబరగిన తక్కిన యలంకారములనుగూడ వారు వాడియుండక పోలేదు. కొన్నిటి నుదాహరింతును.

చిన్నన్న పరమయోగివిలాసమున (పు. 44) భార్గవముని యాశ్రమమును వర్ణించుచు "అన్యోన్యరాగములతో వైరములు మాని" "పుట్టతొట్టెలలోని భుజగ బాలకులఁ బట్టి యొయ్యేన జోలఁ బాడు నెమళ్ళను, ఎలుకపిల్లలకుఁ జన్నిచ్చు పిల్లులను, కలభసంతతికి ముద్దుగావించు హరులను" చిత్రించిన తెలుఁగు, కాళిదాసుని రఘువంశమునందలి వశిష్ఠాశ్రమవర్ణనమును, నన్నపార్యుని కణ్వాశ్రమవర్ణనమును దలపించునదియై స్వభావసుందరముగ నున్నది. ఇట్లే ప్రథమయోగీశావతార క్రమమును వర్ణించు (పు. 31) సందర్భమునఁ "గాసారలక్ష్మికి గర్భచిహ్నములు" కలిగినవిధమును చిన్నన్న చిత్రించినతీరు రామరాజభూషణుని శుక్తిమతీనదీవర్ణనమును దలపింపఁజేయుచు సహజాతిసహజముగ నున్నది. ఉషాపరిణయమున ఖగనాథుని రెక్కలగాలిచేత "కులగిరు లూఁగాడి - ఘూర్ణిల్లి దిశలు - తారలు తుమురులై ధరణిపై రాలి- ధారాధరాళి చిందరవందరైన" (పు. 57) విధమును చిన్నన్న "పతగ సమ్మూర్ఛత్పత్ర ప్రభంజనముల"నాముక్తమాల్యదాకారుఁడభ్యూహించినట్లె యతిశయించి చిత్రించెను. ఇట్లు వారి రచన చాలవరకుఁ బూర్వకవి సంప్రదాయానుసారమే సాగినది.

ఇఁక సామెతల రూపమునను, లోకోక్తుల రూపమునను వారు వాడిన ఉపమాలంకారాదులకుఁ గొదువయే లేదు; వానినిగూర్చి మున్ముందు విడిగా వివరింతునుగనుక ప్రకృతమునకు వారి యలంకారప్రయోగమందలి వైచిత్రిని మాత్ర మించుక సూచింతును. వారి యుపమాదులు సమర్థములు, సమగ్రములు, ననుభవపూర్వకములు నైనవి. ఎడనెడ నవి యా కవులకుఁ గల వైష్ణవాభిమానమును వెల్లడించునవి కూడను.

"కందిగింజను గాఁపువానిగి వేచ కెవ్వలఁ జవి గా"(పరమ.పు.446) దను దృష్టాంతమునందో లేక "చెఱకు నమలిన పిప్పిగా నఱసె వెంద్రుకలు" (పరమ. పు.88) అను నూహయందో ఆ కవుల యనుభవపరిపాకమును, పరిశీలనాశక్తిని మనము గుర్తింప వీలగును.

"సర్వం విష్ణుమయం జగ" త్తను సూక్తి ననుసరించి వారికి సర్వత్ర వర్ణనములందును, నలంకారప్రయోగమునందును గూడ వైష్ణవచింతనమే భాసిల్లు

చుండును. వారి కెల్లప్పుడును "పద్మరాగ రాగముల, రాజిల్లు వరహీర రత్నాచ యంబు, ఘన శేష భోగసంఘంబుల" (పరమ. పు. 8) ననుకరించునట్లో లేక "యినుఁ డస్తమింపఁగాఁ గన్ను మొగిచిన విరిదామరలు యోగీంద్రవరులు హరి పదధ్యానామృతాహారలహరి నరగన్ను లిడిన సోయగము దీపించు" (పరమ. పు. 251) నట్లో ప్రవ్యక్త మగుచుండును. దృష్టిని బట్టియే కవిత్వసృష్టియుండు ననుటకు పై పంక్తుల నుదాహరణముగాఁ గొనవచ్చును.

రామాయణ భారత భాగవతములు మన ప్రాచీన సంస్కృతీ సరస్వము లగుటనుబట్టియు, విష్ణుమతవికాసమున కాలవాలము లగుటనుబట్టియుఁ దాళ్ళపాక వారును, తమ రచనాసందర్భమున వానిని మిక్కిలి యభిమానించినారు. ఆ గ్రంథ త్రయముయొక్క ప్రభావము వారిపై పలువిధముల ప్రసరించినది. తుదకు అలంకారప్రయోగమునందును వారు రామాయణభారతభాగవతోపమలనే అధికముగ గ్రహించినట్లు తెలియనగును. 'విశ్వరూపముసూపె', "కేలనెత్తె," 'చుప్పనాతికై పడి' ననుటలోనే, భారత భాగవత రామాయణకథా ప్రభావమును గుర్తింపవచ్చును. ఏదేని కథావిషయమును వర్ణింపవలసినప్పుడు వారు చాలవరకు నా గ్రంథత్రయమందలి కథాంశములలోఁ దుల్యములగువానితోనే పోల్చిచెప్పు చుండిరి. ఒకటిరెం డుదాహరణములను గాంచుఁడు.

రామాయణోపమకు:- "రాముని శ్రీ పాద రజముచే రాయి
రామయైనట్లు వారల జిహ్వలందుఁ
బాషాణ తృణ జడప్రాయమైనట్టి
భాష నిజ స్వరూపమున జెన్నొందె" (పరమ.పు.100)

భారతోపమకు:- "మును చేదిభూపాలముఖ్యులు చూడ
వనజాక్షునకు ధర్మ వసుధేశ్వరుండు
సవరించు నగ్రపూజయుఁబోలెనపుడు" (పరమ.పు.109)

భాగవతోపమకు:- "వెలయు ప్రహ్లాద విద్వేషిపై గనలు
నల నరసింహుని యనువున నింగి
శ్రీ వెంకటేశుని శిత ఖడ్గధార" (పరమ. పు. 540)

ఇట్లే తాళ్ళపాకవారు రామాయణ భారత భాగవతోపమలను పదులకొలఁదిగా తమ రచనలందు జొప్పించుకొనిరి.

## మిశ్రమాండలికపదజాలము – నానుడ్లు, పలుకుబళ్ళు, సామెతలు :

తాళ్ళపాకవారి భాషాప్రయోగవిశేషములను గుర్తించుసందర్భమున వారు తెలుఁగుదనమును గల్పించి, సొంతము చేసికొని వాడుకొనిన మిశ్రమాండలిక పద జాలమును గూర్చియు, తెలుఁగుభాషయొక్కయు, జాతియొక్కయు సజీవ తత్త్వము నుట్టిపడఁ జేయునట్లు వారు వాడుకొనిననానుడ్లు, పలుకుబళ్ళు, సామెతలు మున్నగువానినిగూర్చియు మన మించుక పరిశీలింపవలసియున్నది.

తాళ్ళపాకవారు తెలుఁగునకు సన్నిహితములగు ద్రావిడకర్ణాటకాదిభాషల లోని పదజాలమునే గాక ఉర్దూపారశీకాదిభాషలలోని పదజాలమునుకూడ నెడ నెడ గైకొని తెలుగుభాషకు పెంపుసొంపులను వెలయించినారు. వైష్ణవమతవిష యమై ద్రావిడదేశప్రభావము తెలుఁగుదేశమున నధికముగా నుండుటచేత నామతము కారణముగ ద్రవిడభాషాసంప్రదాయాదులకు సంబంధించిన పదజాలముకూడ నెంతయో తెలుఁగున వచ్చి చేరినది. తెలుఁగుపై వైష్ణవప్రభావ మీవిషయమున నెంతగా నున్నదో, దానికి తాళ్ళపాకకవుల దోహద మేరీతినుండినదో మన మీ పరిశీలనమున గుర్తింపనగును.

ఆళ్వారుల నాలాయిర రచనకు ద్రావిడవేద మని ప్రసిద్ధి. ఆద్రావిడ వేదమును తెలుఁగుచేసి తాళ్ళపాకవారు దానిని 'ఆంధ్రవేద' మని పిలచుకొనిరి. వారు 'ద్రావిడాగమసార్వభౌము' లనఁబరగిరి. ఇట్లు ద్రావిడవేదము తెలుఁగగుటే కాదు ద్రావిడవైష్ణవపారిభాషికపదజాలముకూడ తెలుఁగుదనమును గూర్చు కొన్నది. మచ్చునకుఁ గొన్నిపదములను దిలకింపుఁడు.

**అళిపురి:-** అడిపడియనుటకు. ఏడుకొండలలోని మొదటికొండ దిగువనున్న మొదటిమెట్టును అడిపడి (క్రిందనున్నమెట్టు) అందురు. ఈపదమే నేఁడు వ్యవహారమున 'అలిపిరి' యని వినబడుచున్నది. నాఁటి 'అడిపడి'కి భ్రష్టరూపమును, నేఁటి 'అలిపిరి' కి పూర్వరూపమును నగు 'అళిపురి'ని తాళ్ళపాకవారు ప్రయోగించినారు. (చూ. అన్నమా. చరిత్ర. పు. 14)

**అరళుపాడు:-** అరుళప్పాడు (13-473) సంకీర్తనసేవ, కైంకర్యము అనునర్థమున నీపదము తాళ్ళపాకవారిరచనలలోనే గాక నాఁటి శాసనములందును

పలుతావుల కాననగును. అరళ్, అరళు, to expand, to open
అరళిసు- to Cause to expand, open or blossom
(కిట్టెల్· కన్నడ పదకోశము)
సంకీర్తన అరళుపాడు - సంకీర్తనల పూర్ణవికాసమును సూచించు సమయము – తత్సమయమున జరగుసేవను నిర్వహించువారి అరళు పాడుభాగవతు లనియు వారు పేర్కొనిరి.

అలమేల్మంగ;- తాళ్ళపాకవారు 'అలర్ మేల్ మంగై' ( = అలరు మీఁదిమంగ ) అను ద్రావిడనామమును అలమేలుమంగ, అలమేల్మంగ అలర్మేలుమంగ- ( పద్మముమీఁది మంగమ్మ = లక్ష్మి ) మున్నగువిధముల ప్రయోగించి యున్నారు· ఈమె లక్ష్మీదేవిస్వరూపము; శ్రీనివాసుని హృదయసీమ నలంకరించినలోకమాత. 'అలమేలుమంగాపుర' మీమె పేర వెలసిన యగ్రహారమే·

ఆళవందారు : (పరమ. పు. 3) యామునాచార్యులకు 'ఆళవందారు' అని ప్రఖ్యాతి. "ఎన్నై ఆళవందీరో"( = నన్ను పాలింప(గాపాడ) వచ్చితిరో) అను వాక్యమునందలి "కాపాడవచ్చినవారు" అనునర్థము నిచ్చు "ఆళవందారు" పదమే వారికి పర్యాయనామ మైన దను విషయము సంప్రదాయ సిద్ధము. తాళ్ళపాకవా రానామము నట్లే గ్రహించిరి· ఆళ్, ఆళు– to rule, to manage (తమిళ కర్ణాటకములందు. తెలుఁగున-ఏలు- కిట్టెల్ - పదకోశము)

ఆళువారు : (పరమ. పు· 3) ఆళ్వార్ అనుటకు తెలుఁగు· "ఆళువారలను గౌగిలించె"నని తాళ్ళపాకవా రాపదము నట్లే పరిగ్రహించిరి. వినయ శోభితులైన ద్రావిడ వైష్ణవ వేదాంతులు ఈ పదమున సూచితులు.

ఉడయవరు: (పరమ. పు· 228) శ్రీ రామానుజాచార్యుల వారికే 'ఒడయవర్' అని పేరు· ఈ ద్రావిడ పర్యాయ నామమునే తాళ్ళపాకవారు తమ సంకీర్తనములందు గ్రహించిరి·

చూడుకుడుతనాచారి : (పరమ) 'చూట్టికొడుత్త నాచ్చియార్' ( = అముక్తమాల్యద) అని అండాళ్ - గోదాదేవికి ద్రావిడనామము. శ్రీకృష్ణదేవరాయ

డా నామమునే 'అముక్తమాల్యద' అని యనువదించుకొనెను తాళ్ళపాకవా రట్లే 'చూడుకుడుతనాచాగి' అని ప్రయోగించుకొనిరి.

ఇట్లే తాళ్ళపాకవారు ప్రయోగించిన ద్రావిడభాషాపదముల నెన్నిటినేని నిఘంటువులసాయమున వివరించుచుఁ బోవచ్చును. సమయాభావముచేత వివరణ మును మాని యట్టి పదములను మాత్రము మరికొన్నిటిని పేర్కొందును.

ఒట్టిన- (పరమ) = తాకిన, అంటిన. ఒట్టు ధాతువు.

(తమిళ కన్నడములందు)

ఎడము - (2-41) = చోటు. ఇడమ్ (త) ఎడ, ఎడె (క)

ఏకాంగి (పరమ) = వైష్ణవ సన్యాసి, సాంప్రదాయికపదము. Of one member side,or qualification boby - (కిట్టెల్. క. పదకోశము) కిట్టు (క).

కిట్టి (6-142) = సమీపించి.

చండ (3-574) = శండ (త) - పోట్లాట.

చాతు (13-473) నిలువు దండలు చాతి - తీర్చు, అలంకరించు.

Cattu (Ta)- to adorn, wear a caste mark. DED.

చాతుపడి : "చాతుపడి కైంకర్యమిదివో" వైష్ణవ సాంప్రదాయికపదము.

(చూ. అన్నమా. చరిత్ర పీఠిక. పు 37)

తళిగలు : (11-2-9) వైష్ణవ సాంప్రదాయిక పదము.

తళిగై (త) తళిగె (క.)

తళ్ళుకొను : ఒత్తిడి సేయు 'మురిపంబు నొయ్యారమును తళ్ళుకొనగ' (పరమ)-సందడించు. తళ్ళు ద్రావిడ ధాతువు. త్రోయు అని యర్థము.

Tallu-to beat, crush. M. Tallu-a blow, Stroke DED.

తాయితందె : తల్లి + తండ్రి (క)

తాయి మక్కళాలు : తాయి + మక్కళ్ + లు + తల్లి బిడ్డలు (క)

తిరుపు : (2-119-92) తిరుగుట.

తిరు = శ్రీ యనుటకు వికృతి రూపము. మంగళకరమగు ననునర్థ మిచ్చు నీ 'తిరు' అను పదముతోఁగూడిన ద్రావిడవైష్ణవపదబంధము లెన్నియేని గలవు. తిరుపతి, తిరుమల, తిరుమలాచార్య, తిరు వాముడి, (తిరువాయ్ మొళి) తిరువెంగళనాథ, తిరుమంజనము, తిరు

చూర్ణము, తిరునీరు, తిరుమాళిగ, తిరునాళ్ళు, తిరునామము మున్నగు ప్రయోగములు వీరివి చూడనగును.

తెరువు: (2-96) దారి. వీధి-తెరు (త) Teru (Ta) (Ma) - Street Highway. DED.

నంబి: వైష్ణవాలయమునందలి పూజారి. దే. వి. విష్ణుపూజకుఁడు. (శ. ర) Nambi, Namburi - a class of smarta Brahmins in Malayala Country. (చూ. కిట్టెల్ కన్నడ పదకోశము మరియు DED.)

నాచారు: నాచ్చియారనుటకు. "నాంచారు" "నాంచారి" అనియు వీరి ప్రయోగములున్నవి. నాచ్చియార్. (T. నాంచారు)

నెఱుపు : "నెఱు పనలము" అని రేఫ ఱ కారపద్యములందు గలదు.

పరుషలు : పరుసై - పరిషద్ Assembly of villagers. యాత్రికుల గుంపు. (చూ. అన్నమా. చరిత్ర. పీఠిక పు. 65)

పల్లాండు : (3-256)

పిత్తడి కడియాలు : (పరమ)

పెరిమె : (పరమ)

పెరుమాళ్ళు : (చూ. అన్నమా. చరిత్ర పీఠిక పు. 8)

సమ్మాళిగ తొండలు: (పరమ పు. 175)

సేన మొదలారి : (చూ. అన్నమా. చరిత్ర పీఠిక పు. 19)

ఇవేకాక ఇంకను వీరి రచనలందు అడమానము, అడిమె, అడియను, అడిబంటు, అడియాలము, ఆయము, ఊడిగము, ఒప్పణము, కడ్డాయము, చాతాని, జియ్యరు, పరిపట్టము, మండాడు, మాళిగ, రామానుజకూటము, మున్నగు ద్రావిడ పదములు కూడ నున్నవి. తాళ్ళపాకవారి రచనలను, నప్పటి శాసనాదులను సమగ్రముగఁ బరిశీలించినచో పారిభాషికవైష్ణవద్రావిడపదములకోశము నొక దానిని వేరుగ ప్రకటించుటకుఁ దగినంతపదజాలము మన కందు గోచరింప

గలదు. తెలుఁగునిఘంటువులలో బౌ్రిణ్యమునందు మైపదములలోఁగొన్ని పేర్కొనఁబడియున్నవి.

తాళ్ళపాకవారి రచనలో నీద్రావిడపదములతోపాటు మరికొన్ని యితర భాషల పదములుకూడ చేరి యున్నవి. కొన్నిటి నుదాహరింతును.

ఆసోదము : తాళ్ళపాకవారీపదమును ఆసోదము. ఆసోద్యము, ఆసోదాలు, ఆసోదకాడు, ఆసోదకత్తె మున్నగు ప్రయోగములఁ బ్రయోగించిరి. ఈ పదమును తక్కిన తెలుఁగునిఘంటువులు గ్రహింపకున్నను, బ్రౌణ్య మిశ్రమాండలికపదకోశముమాత్రము " ఆసోద for ఆసూదా - N. S. Rest, Repose, Refreshment - విశ్రాంతి, సేదదేర్చు కోవడము" అని వివరించినది. పారశీకభాషాపదము. Contentment, happiness హాయి, పరితృప్తి యని దీని కర్థము. వీరి యీ ప్రయోగములు చూడుఁడు.

"పవ్వళించి సామీఁచ పయ్యెదకుం బెనగేవు - వెదగు
నీ యాసోదాలు విడువిడవోయి." (3-560)

"కానీవయ్యా దానికేమి కలవి కల ట్టయ్యాని
అనుకొని యిఁక నెంత ఆసోదమో." (3-631)

"వాసితోడ సేవలు సేయఁగా
ఆసోదకత్తెని యందువుగా." (3-126)

"ఆసోదకాఁడవు నీ వన్నిటను
ఆ సుద్దు లేమడిగీ నానతీయవయ్యా." (3-622)

పై ప్రయోగములందు ఆసోదా = వాంఛ, కోరిక అను నర్థము భాసించు చున్నది.

ఇనాము : "యెంచఁగ నీ దాస్యము నా కినా మిచ్చితిగాన" (9-177)
ఇనాం = Present, Gratuity. చూ. బ్రౌణ్యము. ఉర్దూ భాషాపదము.

కళాసువాఁడు : ఓడమీఁది పనివాఁడు - కళాసీ. ఉర్దూభాషాపదము.

కుళాయి : (చూ. అన్నమా. చరిత్ర పు. 34) = టోపి, కులాహ్. తురుష్క శబ్దము. చూ. ప్రౌఢ్యము.

గుడ్డము. "గుడ్డము పయినున్న కోనేటిరాయని" - గుడ్డము = కొండ. కర్ణాటక భాషాపదము. గుడ్డ = A mountain, hill. (చూ. కిట్టెల్ కన్నడ పదకోశము.)

జముకాళము : (ఉషా. పు. 14) జముకాళము · A Carpet· జంఖానా - తురుష్కశబ్దము. చూ. ప్రౌఢ్యము.

సెభాసు : "సిగ్గునం దప్పించుకోగా సెభా సంమురు"(3-153) షభాష్-Bravo. చూ. ప్రౌఢ్యము. ఉర్దూభాషాపదము.

హల్లు : (ఉషా. పు. 60) "హల్లు హల్లనుచు" కరులను దోలుట. హల్లు - Gently, Slowly. చూ. ప్రౌఢ్యము. ఉర్దూభాషాపదము.

ఇట్లే టోపి, దీనారము, జబ్బ, లూటి, బరబోకి, హుంబాళే, గద్యాణము, తారము, బండాలము, వంటి పదములకుకూడ వీరిప్రయోగము లున్నవి. ఇవే కాక వీరి రచనలలో వ్యవసాయము, సాలె, వడ్రంగము మున్నగు ననేకవృత్తులకు సంబంధించినపదజాలముకూడ కొంతగలదు. దాగువెట్టుట, అరిగోరులు పెట్టుట, మేరలువెట్టుట, పోడునఱకుట, గంజివోయుట, చరిసేయుట, కపురులు, పైపూతకపురులు, లక్కపూతకపురులు, బారుబడివడ్డి, పత్రము, పూటకాపు పైతరువు, ఆకలు మున్నగుపారిభాషికపదజాల మిట్టిదే.

తాళ్ళపాకవారు బహుభాషాపదజాలమును పుష్కలముగా స్వీకరించి తెలుఁగునకుఁ బుష్టిని జేకూర్చుటయే కాదు జాతీయములగు పల్కుబళ్ళను, నానుళ్ళను, సామెతలను గ్రహించి భాషలోని సజీవతత్త్వము నుట్టిపడఁజేసినారు. ఈ సామెతలు నానుళ్ళు అనునవి జాతియొక్క జీవనమునకును, భాషాప్రాభవమునకును కొలబద్దలవంటివి. అనఁగా నవి జాతియొక్కయు, భాషయొక్కయు సంస్కారమును శక్తిని వెల్లడించున వని భావము. ఇట్టి సామెతలయందును, పల్కుబళ్ళయందును ప్రజలయొక్క అభిరుచులు, అనుభూతులు, పల్కుతీరులు, ఛందస్సందర్భములు, సారస్యవైరస్యములు, ఆశావాసనలు అన్నియు నద్దములోవలె నచ్చముగా ప్రతిఫలించుచుండును. ఇట్టి సజీవమగుభాషాసామగ్రి నధికముగా నాద

రించిన తొల్లింటితెలుఁగుకవులలో నన్నెచోడ నాచనసోమనాథాదులు పేర్కొనఁదగినవారు. వారితరువాత నట్టిదానికి విశేషప్రయోగగౌరవమును గల్పించినవారు తాళ్ళపాకవా రనియే చెప్పవలెను. అందువల్లనే వీరికవిత సజీవమై, వ్యవహారము నందలి మాధుర్యమునుగలిగి యతియతిప్రాసములసంఘటనము ననల్పార్థమును సాధించునదై యుండును. తాళ్ళపాకవారి పలుకుబళ్లు, సామెతలు లెక్కించిన వందలు వేలు కాఁగలవు. వాని నన్నిటి నిట పరిశీలింప నవసులేదు. కావున గొన్నిటినిమాత్ర ముదాహరింతును.

1. *అంగడి* – అంగడుపడు – అంగడిపెట్టు :

> "అంగడిగంధపుపూతలట్టె వుండేనా" (3-26)
>
> "అంగడి నెల్లబెట్టిన యాకెవోయీ కె" (3-102)
>
> "అంగడివారమా" (3-515)
>
> "అపలభయపడ్డవా రంగడిపడితే దొర
> లోవులవిచారించి పూరపెంతు రంతలోనె" (8-70)

పై ప్రయోగములందు అంగడి = బయలు., అంగడిపడు = బయలుపడు, అంగడిపెట్టు = బయటపెట్టు, అల్లరిపెట్టు అనునర్థములు పొసగుచున్నవి. శ. ర. కారు లీయర్థమును గుర్తింపలేదు. కాని గ్రాౌంథ్యమునందుమాత్రము "ఆ సంగతిని అంగట్లో పెట్టినాఁడు = He exposed the matter అనునర్థము వ్యవహారము ననుసరించి యీయఁబడినది. ఆం. ప్ర. సా. అకాడమీవారి పదబంధ పారిజాతము చూడఁదగును.

2. *ఉద్దగళలు*: పొడుగువెడల్పులు - ప్రకరణమునకూడ "అంతటను" అని అర్థము. ఉద్దగల-అగల - Length and breadth, height and breadth.

> "కూలినతలలును గుఱ్ఱపుడొక్కలు
> నేలపైఁబారిన నెత్తురులు
> వోలిఁజూడుఁడిదె వుద్దగళలీరణ
> కేలిని విష్వక్సేనుఁడు గెలిచె" (6-108)

3. *ఉద్దవిడి* : "ఉద్దవిడి లంకఁజొచ్చి ఉంగరము సీతకిచ్చి
అద్దివో రాముఁ మెప్పించి హనుమంతుఁడు" (10-272)

ఇట్టివే మరికొన్ని ప్రయోగములు యిందు పేరి వున్నవి. శ. ర. లో 'ఉద్ద' అను నారోపము క్రింద దే. వి. మున్నగుచో (ఉద్దవడి, ఉద్దవిడి ఇత్యాదులు) అని పేర్కొనబడి భోజరాజీయ వైజయంతీ విలాసములనుండి రెండురూపములకును, రెండు ప్రయోగములు ఎత్తి చూపఁబడినవి. ప్రౌఢ్యము, Rapidity, great celerity, violence, haste అను నర్థము లిచ్చి ప్రయోగములను చూపినది.

ఉద్దవిడి అనురూపమునే తాళ్ళపాకవారు ప్రయోగించిరి. ఉద్దవిడి- ఊర్ధ్వపిడి- కావచ్చునని శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు చెప్పియుండిరి.

ఉద్ద - ఉది, ఉద్దు Tbh of ఊర్ధ్వ - Height, tallness, length, depth (pride).

పిడి - To seize, to grasp - clenching the fist

ఉద్దవిడి - పైకెత్తిన పిడికిలిచేత (ప్రకరణమున) బలప్రదర్శనమున-అని భావము తోఁచెడిని.

ఇట్టిదే తాళ్ళపాకవారి 'నిట్టపిడి' ప్రయోగముకూడ నున్నది. "పొట్టపొరుగునఁ బెచ్చి భూతముల మెదగట్టి నిట్టపిడి నేఁ పేవు నేఁడూను" (11-2-64) తెలుఁగు నిఘంటువు లీపదమును పేర్కొనలేదు. నిట్టపిడి-నిట్టపిడి = నిట్టనిలిపినపిడి అనియే అర్థముకావచ్చును. పదబంధపారిజాతము దీనిని పేర్కొనలేదు.

4. *ఏటిలో పైరు* : నిష్ప్రయోజనము, వ్యర్థము, నిలుకడలేనిది అనుటకు. (చూ. 2-349, 7-1, 11-3-150) ఏటిలోని వాత, వరదగలిపిన చింతపండు నెట్లో ఏటిలోపైరు నట్లే అని భావము. ఇట్టిదే మరియొక పలుకుబడి "నడివీధిపెసర", "తెరవుపెసర" అనునది.

"నడివీధి పెసరాయ నయమైన మనసు" (2-322)
"తెరపలకు నీమోవి తెరువుపెసరాయె" (3-460)

'తెరవుపెసర' యనుదానికి 'నడివీధినున్న పెసరచేనిపంట తెరువరులకే దక్కునదికాని, సొంతదారునకు దక్కునది కా'దనుభావము నిచ్చును.[1] అందు

1. చూ. సాహిత్యసమీక్ష పు. 236. శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు.

బాటులో నున్నదానిని దారిబోవువా రెల్ల రనుభవింతు రనునర్థమున పైప్రయోగములున్నవి. చూ.

"కాన నిక్కంపుగూరిమి గణికయందు
బొరయ దిల బోర్నె నేసది తెరువుపెసర" (కవికర్ణ. 4-122)

(చూ. పదబంధ పారిజాతము)

*5. గజదంత పరీక్ష :* "నిర్మితము సోదించె నెరసులెంచగ నేల
ధర్మమంచు నిక గజదంత పరీక్షేటికే" (5-322)-

అని తాళ్ళపాకవారిప్రయోగము. గజములకు దంతములున్నవా లేవా యని పరిశీలింపబోవుట తగనిపని యనియు భావము. 'కంచములోనికూడు కాలదన్న నేల- సోదించనేల సొట్టలెంచనేల' అనియు వీరాపదమునందు పేర్కొనిసదానిని బట్టి పైయర్థము భాసించుచున్నది. వెలగపండును నమలక మ్రింగెడియేనుగునకు దంతములు లేవేమో అనుభ్రాంతితో పరీక్షింపబోవుట నిరర్థకమగు పనికదా.

*6. చింతకాయ కజ్జము :* చింతకాయ కజ్జమనియు, కజ్జాయమనియు గూడ తాళ్ళపాకవారీపలుకుబడిని ప్రయోగించియున్నారు.

ఈ ప్రయోగమును గాంచుడు :

"ఇందువల్లనేమి గద్దు ఇనుపగుగ్గిళ్ళింతె
యిందిరారమణుసేవే యిరవైన పదవి ॥

సతులతో నవ్వులు చందమామగుటకలు-
మతి తలపోత లెండమావులనీళ్లు
రతులలో మాటలు రావిమానిపువ్వులు
తతి విరహపుకాక తాటిమ్రానినీడ ॥

పడతుల వేడుకలు పచ్చి వడగండ్లగుళ్లు
కడు మోవితీపు చింతకాయకజ్జము
బడి నలమేలుమంగపతి శ్రీ వేంకటేశ్వరు
డదరించిన మాయలు అద్దములో నీడలు॥" (7-34)

ఇందే మరియొకచరణమున లక్కపూతకపురులు, నీటిపైవ్రాత, చేమకూర శైత్యాలు, గోడమీదిసున్నము నను పలుకుబడులను ప్రయోగించినారు.

పైకీ ర్తనమునందలి భావమునుబట్టి యందలి పల్కుబడులకు వట్టిది, హుళక్కి, సారస్యములేనివి, అనుభవమునకుఁదెచ్చుకోఁజాలనివి, క్షణికములు, అస్థిరములు, నయథార్థములు అను నర్థములు పొసగుచున్నవి. ఇందు తుదిని పదతుల వేడుకలు వడగండ్లగుళ్ళవలె క్షణములో రూపుచెడుననియు, కడుమోవి తీపు చింతకాయకజ్జమువలె నిరర్థకము, వ్యర్థము నగునట్టిదనియు భావమని తోచును. తెనాలిరామలింగని 'నేరరుసుమీ, తీవ్రవ్రతాచార శమ్కులై యుండెదు ముండ ధారులు సుముక్తుల్‌డాయగా చింతకాయలకజ్జాయముతోయ, మింత చదరంబా తత్పరిష్వంగముల్' (పాండు. 5-214) అను ప్రయోగమునుగూర్చి పండితులీవరకే కొంతచర్చ గావించియున్నారు.[1] శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు 'తీవ్రవ్రతాచరణమున ముక్తిని సాధింపఁజూచుట చింతకాయలకజ్జాయము చేయఁబూనుట వలె కానిపని' అని 'అసంభవ'మను నర్థము నాలోకోక్తికిఁజెప్పగా, మరియొకరు చింతకాయలతో కజ్జాయముచేయుట కలదని చెప్పుచు 'ముక్తికాంతా పరిష్వంగము చింతకాయల కజ్జాయమంతతేలికా?' అనుటకు 'సమీపించుటసాధ్యమనియు, తేలికగాదనియు తాత్పర్య'మని వ్రాసినారు.

చింతకాయలతో కజ్జాయముచేయుట సంభవమో, అసంభవమో తెలియదు కాని యొకవేళ సంభవమైనను నది ప్రయాసతోగూడి నిరర్థకము వ్యర్థమునగు నట్టి యత్నమని మాత్రము గట్టిగ చెప్పవచ్చును. అది బొగ్గును వజ్రముచేయు నట్టి ప్రయత్నమువంటిది కావగును. కనుక పైపద్యమున చింతకాయల కజ్జాయము చేయఁబూనుటవలె కానిపని యనుటకన్న నిరర్థకము, వ్యర్థము నగునట్టిపని యని యా పల్కుబడి కర్థముగా గ్రహింపఁదగునేమో. తాళ్ళపాకవారి ప్రయోగమునకు పైయర్థమే సరిపడునని తలతును. మోవితీపు చింతకాయకజ్జాయము వలె నిరర్థకము వ్యర్థము ననిభావము కావచ్చును. పదబంధ పారిజాతము 'ఉపయోగించుకొనవీలులేనిది' అని యర్థమిచ్చినది.

7. *చీకటి ద్రవ్వుకొనుట* : ప్రయోగములు - 'కదలేనియాస చీకటిదవ్వుకొనుట' (2-96), 'కలకాలము చీకటి ద్రవ్వుకొనెడి-వలల భ్రమల నెవ్వరుపడరిట్లా' (5-163), 'చీకటిదవ్వగ ముంగిట నిధానమబ్బె' (3-616), చీకటిదవ్వుకొనుట అను నీపల్కుబడి శ. ర. యందును

1. చూ. చింతకాయల కజ్జాయము- భారతి, 1963 మే, జూన్ సంచికలలోని కలగూరగంప, లేఖలు, శీర్షికలు.

ప్రౌఢ్యమునందును గానరాదు. దీనికి అంధకారమున గొట్టుమిట్టాడుట అని యర్థము తోచుచున్నది. 'వ్యర్థప్రయత్నము చేయు'- అని పదబంధపారిజాతము.

*8.* **పిట్టపిడుగగుట** : కడుభారముగుట - మిక్కుటమగుట.

"పుట్టుటోగి సిగ్గులచూపులపువుఁ దీగలపై
పిట్ట పిడుగాయె సతిప్రేమము నేడు" (8-484)

**పిట్ట పిడుగాయె** ననగా నొక్కపెట్టున మిక్కుటమాయెనని భావము. 'హఠాత్సంఘటన'మని పదబంధపారిజాతము.

*9.* **పొదలువెట్టుట** : 'పొత్తులలోపల నేను పొదలువెట్టేనాడు-
యి త్తల జవ్వనమద మెందుండెనో' (2-55)

తెలుఁగునిఘంటువులు పొదగను, పొదవెంచు, పొదసూపు ముప్నగురూపము లిచ్చినవేగాని, పొదలుబెట్టు అనురూపమును బేర్కొనలేదు. పైప్రయోగమునుబట్టి దీనికి పొరలాడు, ప్రాకులాడు, అనునర్థము భాసించుచున్నది. పదబంధపారిజాతము, కాళహస్తిమాహాత్మ్య ప్రయోగమునిచ్చి, 'అయాసపడు'నను నర్థమిచ్చినది.

*9.* **బండి బాటలగు** : నలిగినదారి, తేట తెల్లము- అనుటకు.

"పాటిగంపనీళ్ళు నించేవు పద్మనాభ! బండి
బాటలాయె నీ గుట్టు పద్మనాభ" (2-256)

ఇట 'బండిబాట లాయె' ననుటలో దాపరికము లేక బహిర్గతమై తేట తెల్లమైపోయినదని భావము. పదబంధపారిజాతము దీనిని బేర్కొనలేదు.

*10* **మోరతోపు** : మూతిమూరెడుచేసుకొనుట, మూతివిరచుట, నిర్లక్ష్యము చూపుట.

"మోరతోపుదనముల మోనమే చాలు" (15-61)

తాళ్ళపాకవారీ 'మోరతోపు' పల్కుబడిని పలుతావుల ప్రయోగించిరి. మొక్కలాన నీవు నేను మొరతోపు లాడగాను' అని యచ్చు పడిన దానినిచూచి శ్రీ రజనిగారు 'మొరతోపు = విన్నపమును నిరాకరించుట' అని యర్థమునని వివరించినారు.[1] తాళ్ళపాకవారి ప్రయోగము 'మోరతోపే'గాని 'మొరతోపు'

1. చూ ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము. పు. 239.

గాదు. 'నీ మొహము-నీమోర' అను వ్యవహారమున్నది. పశ్వాదుల దీర్ఘ ముఖమును మోర యందురు. మూతి మోరయగునట్లు త్రోయుటయే- మోరత్రోపున-మూతి మూరెడుచేసికొనుటయో, మూతివిరచుటయో అర్థము కాఁదగును. పదబంధపారిజాతము దీనికి "వెనుక ముందులు చూచుకొనక, గుర్తిగా, సులువుగా" అను నర్థము లిచ్చి యున్నారు.

ఇట్లు విశేషములగు పలుకుబడులకును జాతీయములకును గుర్తింపఁదగిన ప్రయోగము లెన్నియో తాళ్ళపాకవారి రచనలందు గలవు. గ్రంథవిస్తరభీతిచేత వివరణమును వదలి, వారి ప్రయోగములనుమాత్రము, భావి పరిశీలనకై మరికొన్ని పేర్కొందును.

| | |
|---|---|
| అంబారాసులు ● | 8-170 |
| అగ్నిపొంత వెన్న | 5-48, 2-387 |
| అద్దపావఁడు | 4-43 |
| అరచేతిలో నివాఁడు | 2-48, 5-114 |
| అరవిరి బాగులు ● | 12-125 |
| అవుడు గఱచుట | 2-200 |
| ఆపసోపాలు | 4-35 |
| ఆహివెట్టు | 2-103, 10-142 |
| ఇనుపగుగ్గిళ్ళు | 6-49 |
| ఇమ్ముదెప్పరమైతె ● | 3-220 |
| ఇసిళ్ళ పుట్టలు | 9-51 |
| ఇసుక లెక్కవెట్టుట | 9-279 |
| ఉద్దవిడి ● | 10-272 |
| ఉబ్బు సగ్గులు | 8-114 |
| ఉల్లిదిన్న కోమటి | 7-260 |
| ఊరు వాడెడి చలము | 3-460, 563 |
| ఎంగిలిమోపుల బడుట ● | 2-103 |
| ఎండమావుల నీళ్ళు | 7-34 |
| ఎగదిగ జూచుట | 9-24 |
| ఎగదిగ నాడుట | 9-150 |
| ఏటిలో పైరు | 2-349, 7-1, 11-3-150 |
| ఏ నోరుపెట్టుక నిన్ను గావుమందును | 8-60 |
| ఏపూరి కేపూరు ● | 3-1, 11-126 |
| ఒడిగట్టు | 9-158 |
| ఓడగట్టిన దూలము | 3-178 |
| (కూ. సా. సమీక్ష, పు 276) | |
| కంచము కాలదన్నుట | 8-20 |
| కంచములోని కూడు ● | 9-249 |
| కంట వత్తిడుకొని కాచుట | 6-34 |
| కంటిరెప్పవలె కాచుట | 6-96 |
| కంప మోపు ● | 2-186 |
| కొంగుబంగారము | 5-264, 7-197, 233, 8-247, 9-130 |
| కొండ నేతువో | 3-106 |
| కొండ నేసికొంటివా | 3-108 |
| కొండాటము | 10-1 |
| కచ్చుకాయల తిత్తి ● | 3-482 |
| కట్టు వదలిన త్రేవు | 3-560 |
| కత్తులబోను | 5-122 |
| కన్నది కానుపు | 10-113, 3-502 |
| కరతలామలకము | 11-55 |
| కలగంప వలపాయె | 3-620 |
| కాకు నేయుట | 8-90 |
| కాణాచి కాపు | 7-246 |
| కాలు దొక్కుట | 4-112 |
| కూకులు వత్తులు | 5-9 |

కోటికిఁ బడగెత్తుట 10-40, 4-133
కోరుకొటారు ● 9-175
గజదంత పరీక్ష ● 5-322
గజ స్నానములు 7-1
గాదె బోయుట 3-350
గాలి బొయ్యేది 3-598, 8-68
గాలి ముడి గట్టినట్లు 9-267
గుడిమీది తలుపు ● 2-104
గుంత బడు ● 8-68
గుప్పెనలాదేవు ● 2-107
గోడ దిరుగుట 8-196
గోడపై సున్నము 2–104- 7-34
గోనెబట్టిన బంక 2-322
చంకలఁ జేతు లిడి కొల్చుట
పరమ. 1 పు. 17
చంకలెత్తి మొక్కుట ● 2-248
చందమామగుటకలు 2-65, 4-54, 7-34
చక్కెరబొమ్మ 4-33
చమురు దీసిన దివ్వె 2-188
చాపక్రింది నీరు 8-105
చిగురుగొమ్మ ● 4-105
చిగురులో చేగ 8-165
చిలుక చదువులు ● 16-14
చీకటి తప్పు సేయు 10-177, 6-214
(చూ. సాహిత్యసమీక్ష పు.48)
చీకటి దవ్వుకొనుట 2-96, 190, 287,
3-412, 616, 5-163
చీమ తుమ్మట ● 11-2-50
చెఱకు పండిన పంట 12-75
చేపట్టు గుంచము 10-174, 6-173, 191
(చూ. సాహిత్య సమీక్ష పు. 222)
చేమకూర శైత్యాలు 7-34
జగడాల గంప ● 4-105
జలధిలో వానలు 3-128, 9-114
జాజులు పసాదంబు 12-75
జిగురు గండె 2-369, 3-460, 12-74
జిబ్బిటాయ తపము ● 16 14
జుట్టెడు కడుపు ● 11-3-67
జొత్తుపాప 12-28
తంగేటి జున్ను 3-460, 12-75
తండు ముండగుట 16-30
తడ తాకులు ● 5-163
తడిపాత మెడగోత 2-104, 3-583
తలపూవాడని తరుణి 4-105
తలమీఁది మోపు ● 2-324
తాడుపై తపసు ● 11-104
తామరాకు నీరు 7-211
తిప్పదీరాడు 2.343
తీగలు సాగు 8-88
తీలు పరచు ● 11–2–41
తూరుపెత్తుట 5-223
తెగిన గాలిపడగ 3-563
తెరలో బొమ్మలాడుట ● 2-65
తెరువు పెసరు 3-466, 12-75
తేనెలోపలి యీగ 2-322, 11-3-125
తొరలుపోవు ● 9-103
త్రాటిమాని సీద 7-34
దిక్కుమాలిన 8-70
దిక్కుమొక్కు ● 2-82
దొంగల ధర్మాసనము ● 2-73
దొడ్డు కొంచ మెంచనేల 7-203
నట్టింటి వైరము ● 2-72
నడివీధి పెసర 2-322
నడుమంత్రాన 8-17
నల్లెడు నాలిక ● 8-47
నాము మేయుట 2-204
నిట్టతాడు ● 2-70
నిట్టవిడి సేయు ● 11-2-64

పీటముంచు పాలముంచు 10-224
నీటిలో వ్రాత 2-349, 7-34
పీడ వెట్టుట 3-350
నీరుకొలఁది తామర 7-159, 6-157
నీరువంక తుంగ 3-608, 11-122
నీళ్ళ తీగలు ● 2-69
నీళ్ళలో పీడలు ● 2-65
నీళ్ళు నమలుట 4-58, 6-156
నూనె కొల్చిన కుంచము ● 2-374
నేతిబీరకాయ నేయి 7-260
నోరూరుట 2-366
పచ్చిపాలలోని వెన్న ● 5-185
పాటిగంప నీళ్ళు నించుట ● 2-256
పాడూరి బ్రతుకు 11-104
పాతాళ నిధానములు ● 7-1
పిచ్చుకపై బ్రహ్మాస్త్రము 9-285
పిట్ట పిడుగగుట 3-494
పుంగుడయ్యెరు 5-137
పుక్కిటి పురాణము 5-48
పుచ్చిన పోక 11-3-66
పున్నమమాసలు ● 2-177
పులుగడిగిన ముత్యము 8-125
పూచిన సంపెగ ● 8-165
పొద చాటు మృగము ● 5-48
పోకుల బోపుట 4-58
బందె పసురము 2-204
బండి బాటలగు 2-256
బందు బందు సేయు ● 3-29, 8-164
బచ్చెన రూపులు ● 6-180
బట్టబయలు పందిలి వెట్టుట 8-160
బయ లీదించుట 9-4
బహురూప మాడుట ● 5-242
బీరకాయ పీచు 9-24
బూడిదలో హోమము 5-48
బెంబాడి చేతలు ● 6-161
బొమ్మర పరచు ● 12-122
బొమ్మ పెట్టుట 9-22
మంగలాన జాజులు 12-4
మంచము క్రింద నూయి 9-84, 280
మందున కేమి వచ్చు 2-38
మీసాలమీఁది తేనె 2-53, 7-6
ముంగిట నిధానము 3-534, 5-75
ముంచి ముద్దాడుట ● 2-282
ముంజేతి అద్దము 11-2-43
ముంజేతి కంకణమున కద్దము 12-84
ముక్కుననున్న ముంగోపము 2-56
మూసిన ముత్యము 2-307
మేకమెడ పిసికినట్లు ● 11-2-8
మేలు తీలు ● 8-14, 10-37
రాట్నపు గుండ్రలు ● 7-32
రాతిపీచుని బీరము 7-260
రావిమ్రాని పువ్వులు 7-34
రొంపిలోని కంబము 11-122
రొమ్మున గుంపటి 3-181
లక్కపూత కపురులు ● 7-34
వంక లొత్తుట 8-17
వండఁ దరిగిన కూర 2-90
వర్తిమాఁకు లివురు పెట్టుట 3-99, 541, 658.
వత్తిలోపలి నూనె 2-313
వనధి గురిసిన వాన ● 7-1
వరతి పాలగుట 9-75
వలలఁ బెట్టుట 5-41
విచ్చిన విడి 5-218, 9-37
విత్తుమీఁది పొల్లు 2-313
వెనక తీయుట ● 3-64
వెన్నతో గల్లుట ● 11-143
వెన్నలో కలి ● 2-118

| | | | |
|---|---|---|---|
| వెన్నెల మొలక ● | 8-165 | సగ్గడు మగ్గడు | 2-404 |
| వెట్టి దవ్వుట | 6-69 | సన్నము దొడ్డెంచనేల | 10-232 |
| వెట్టివాని చేతి రాయి | 6-157 | సప్పు సారైపోవు ● | 3-25, 12-15 |
| వెల్లిబోవుట | 8-68 | సరికి సరి | 2-367 |
| వేడి విడువని కూడు | 2-313 | సిక్కు సీరైపోవు ● | 3-15, 12-15 |
| వేదు విడువని కూడు (?) | 11-3-116 | సూదివెంట దారము | 3-130, 9-32 |
| సంత తగరు ● | 3-460 | సూదుల మాటలు | 2-82, 6-117 |
| సంతపాక లంజ ● | 5-185, 4-30 | | |

ఇట్టివెన్నో యున్నవి. వీనిలోఁ గొన్ని బహుకవిప్రయుక్తములై ప్రసిద్ధిని బడసియున్నవి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రచురించిన పదబంధ పారిజాతమున తాళ్ళపాకవారి పల్కుబడులు కొన్నిమాత్రమే గుర్తింపబడినవి. వీరి పందింప నెన్నియో చేర్పవలసినవిగలవు.[1] వీనిలో ● గుర్తుగలవి పదబంధ పారిజాతమున కెక్కనిపదబంధములు.

అందు చేరనివాని నటుంచి పదబంధపారిజాతమున వివరింపఁబడిన యర్థములే కొన్ని తాళ్ళపాకవారిప్రయోగములనుబట్టి పునఃపరిశీలనార్హములుగ నున్నవి. ఒండురెం డుదాహరింతును.

*1. కలగంపవలపు :* ఈ పదబంధమునకు ప.బ. పారిజాతము 'అమ్మఁ జూపువలపు, పిలువలేనిప్రేమ అనుట' అని యర్థమిచ్చి, తాళ్ళపాకవారి ప్రయోగమునే 'కలగంప వలపాయె గాదామరి' (3-620) అనుదానిని పేర్కొనినది. కాని యీ పదబంధమునకు 'అనుకొనకుండ భాగ్యవశమున సిద్ధించిన వలపు' అని భావమగునని నేను తలచుచున్నాను.

"కలగన్నచోటికి గంపఁ గొంపోవ
ఫలసిద్ధియగు టెల్ల భాగ్యంబుగాదె"

అని పాల్కురికి సోమనాథుని (కన్నప్పకథలో) ప్రయోగమున్నది.[2] కలగన్న చోటికి గంపనుగొనిపోగా ఫలసిద్ధియైనచో భాగ్యమనియు, కాకున్నచో భ్రాంతి

1. ఆం. సా. అకాడమీవారు 1971 లో ప్రచురించిన "తాళ్ళపాకవారి పలుకుబడులు" (సం॥ శ్రీమతి రామలక్ష్మి ఆరుద్ర) అను గ్రంథ మీకొఱఁతను దీర్చినది.
2. చూ. నా వ్యాసము. 'పాల్కురికి ప్రభావం' పరిశోధన ఆగస్టు, నవంబరు సంచిక. పుట 50.

యనియుఁ గలగంపసామెతకు భావముకాఁదగును. పైతాళ్ళపాకవారి ప్రయోగము గల పదము (3-620) న తన్ను గూడఁదనుకొన్న నాయకుఁడగు శ్రీ వేంకటేశ్వరుఁడు ఎవ్వతెనో మదిలోఁబెట్టుకొని నాయికను గూడినాఁడు. నాయకుని అనురాగప్రదర్శనమునకు హేతువేమియైనను నాయికకు భాగ్యవశమునవే ఫలము సిద్ధించినది. అప్పుడు నాయిక అనుకొనినది - "కలగంప వలపాయె కాదామరి- కలవెచ్చి పైవేసేవుకాదా మరి" అని. పైప్రయోగము నేను వివరించిన యర్థము నిచ్చునదేకాని 'విలువలేనిప్రేమ - అమ్మఁజూపు వలపు' అనునర్థము నిచ్చునదిగాఁ దోపదు. తాళ్ళపాకవారి ప్రయోగము లివికూడ చూడఁదగును.

"కలగన్న చోటికిని గంప యెత్తిన యట్లు
నలవి మీరిన వెల్లైనమ్మా" (3-449)

*2.* **చేమకూర శైత్యాలు** : దీనికి 'అసంభవములు' అని వ. బ. పారిజాత మర్థమిచ్చినది. తాళ్ళపాకవారి 7-34) ప్రయోగ ముదాహృతము. "నెలకొని చేసే బత్తి నీటిపై వ్రాత-చెలువపు వినయాలు చేమకూర శైత్యాలు, కొలఁది లేని నునుపు గోడమీఁది సున్నము" అని వారి ప్రయోగము. అసంభవమనుటకన్న 'చేమకూర శైత్యము' పైకి దోచునదేగాని అనుభవమునకు వచ్చునదికాదు అని యర్థమును జెప్పుట సమంజసమనుకొందును. ఇట్లే - తెరువు పెసర, పిట్ట పిడుగు మున్నగు వాని యర్థములుకూడ పునఃపరిశీలింపఁ దగిన వనితలతును.

తాళ్ళపాకవారి పలుకుబడులను, లోకోక్తులను బోలినవే సామెతలును వారివి వేలకొలఁదిగ నున్నవి. అందువారి అనుభవవిశేషములు, వ్యంగ్యచమత్కారములు చక్కగా ప్రవ్యక్తము లగుచుండును. ఆంధ్రభాషా సాహిత్యముల నవలోడనముచేసిన వారిప్రజ్ఞావైదుష్యము కూడ మనకందు గోచరించును. లోకప్రసిద్ధములగు సామెతలను జాతీయములను వారు పూర్వకవిప్రయోగానుసారము తమ సాహిత్యమున నిబంధించుకొనినారు. నాకుఁ జూడగా, నాంధ్రసాహిత్యమున తాళ్ళపాకకవులరచనలలో నున్నన్ని సామెతలును, జాతీయములును మరి యితరత్రి నెందును గోచరింపవని తోచును. దిఙ్మాత్రముగా గొన్నింటి నిట ప్రదర్శింతును.

"అడబోయినతీర్థ మది యెదురైన" (అష్ట. 2-71 పు.)-అనుకొనకుండ శ్రమలేక ఫలసిద్ధియైనప్పుడీ సామెతను వాడుదురు. పాల్కురికి సోమన (పండితా-

ప్రథ. పు. 387) యు, ధూర్జటి కవి (కాళహస్తి మా. 3-214) యు నీజాతీయమును ప్రయోగించియున్నారు.

"ఎద్దే మెరుగు నడుగుల చవి" 2-87 "ఎద్దుకేం తెలుసు నటుకుల రుచి గాడిదకేం తెలుసు గంధప్పొడి వాసన" అని జాతీయము. అనర్హులకు గొప్ప వస్తువుల యోగ్యత తెలియరానిదని భావము. వేంకటేశశతకకర్త (ప. 74) యు నీజాతీయమును వాడియున్నాడు. "ఓడ విడచి వదరిడుట" (2-104, 126). జక్కనయు, ప్రౌఢ కవి మల్లనయు నీ జాతీయమును బ్రయోగించిరి. చూ. విక్రమా. (4-64), రుక్మాంగద (4-65). గట్టిగా దేని నాశ్రయింపదగునో దానిని విడచి పనికిమాలిన దానిని బట్టుకొనబోవుట నిరర్థకమను భావమును పై జాతీయము వెల్లడించును. 'ఎదిరికి యినుమడచే వారికి తనకు తగరమడువఁ దద వయ్యానా'(8-61)ఘనకార్యములు సాధించువారికి స్వల్ప కార్యము చేయుట తేలిక, ఇనుము కఠినమగులోహము. తగరము మెత్తనిది. ఎవరికో ఇనుము నడిచేవాఁడు తనకు దగరమునేని అడచికొనలేడా? అని భావము. నాచనసోముఁ డీ జాతీయమును ప్రయోగించియున్నాఁడు. సోముఁడు వాడిన జాతీయములనిట్లే కొన్నిటిని తాళ్ళపాకవారును గ్రంథస్థము గావించియున్నారు. చూడుఁడు. "కుమ్మరావమునఁ జెంబుకోరి వెదకనేల' (10-135), 'కుమ్మరావమున రాగి ముంత లేరంగగలవె' ఉ. హ. (3-48), ఒక్క నాచన సోమనయేకాదు పాల్కురికి సోమనాథుఁడు, తిక్కన, శ్రీనాథుఁడు, మొదలగు పూర్వకవులు ప్రయోగించిన జాతీయములను గూడ తాళ్ళపాకవారెన్నిటినో గ్రహించినారు. "బెండ్లు ముంచి గుండ్లు తేలించేటి" (3-213). అసంభవమేదేని సంభవమైనప్పు డీ సామెతను వాడుదురు. దీనికి తిక్కన (భారతము-ద్రోణ-3-67) నాచన సోమన (ఉ. హ. 5-218) పాల్కురికి సోమన ప్రభృతుల ప్రయోగములు మూలములు. 'పెరుగును వడ్లను కలిపిన రీతి' (పరమ-5-పు. 297). పెరుగును వడ్లను గలిపి పిసికినపు డవి కలసి యతుకుకొనక పొందికలేక విడి విడిగ నుండును. అట్లే పొందికలేని వానినొకచో వర్ణింపవలసినపు డీజాతీయమును వాడుదురు. పాల్కురికి సోమనయు (పండితా. అవతారిక), మడికి సింగనయు (వాసిష్ఠ-2-132), పినవీరభద్రకవి (జైమిని భా. 8-120). యు నీజాతీయమును వాడియున్నారు.

"చంకగుదియ నేనిదే శరణార్థినేనిదే" (9-100) 'చంకదుడ్డు శరణార్థి' యను జాతీయము ప్రసిద్ధమైనదే. కొట్టవచ్చినట్లు కర్ర తెచ్చుకొనియుఁ, బైకి

అభయము కోరుచున్నట్లు నటించునట్టి ప్రవర్తననుగూర్చి చెప్పవలసినపు డీజాతీయమును వాడుదురు. దీనికి ఎఱ్ఱన (హరివంశము 2-149), శ్రీనాథుని (హరవిలాస. 7-17) ప్రయోగములు ప్రసిద్ధములు.

ఇట్లే బహుకవిప్రయోగముల ప్రసిద్ధములైన జాతీయముల నెన్నిటినో తాళ్ళపాకవారి సాహిత్యమున మనము గమనింపవచ్చును. 'తప్పకు నూతిలోనే భేతాళాలుపుట్టు' (3-229), 'నొసలుబత్తుండు నోరు తోడేలు' (2-234), 'ఈన గాచినపిదప గుక్కలకిచ్చినట్లు యేటికి పరదపుచ్చేదవు' (పరమ ఆ. 2-పు. 31) మున్నగున విట్టివే. 'కాయపండు సేయబోతే కడుపులుసే' (2-133) 'తినఁడినవే మైన దీపవుసు' (5-542) అను వీరి జాతీయములు వేమనపద్యములందు రూఢమైనవి. ఇట్లే 'ఎండో కోకలుపేసి బలుకొక్కెరాలవెంట పారాడుట' (8-169, 175, 190) అను వీరిజాతీయమే ఆముక్తమాల్యదలో 'తలపక్షచ్ఛటఁగుచ్చు బాతువులఁ' జూచి యారెకులు 'పిండీకృతశాటిక' లని భ్రాంతిఁజెందినట్లున్న వర్ణనగా రూపొందినదని తోచును.

ఇట్లితరకవి ప్రయోగముల బ్రసిద్ధిని గాంచిన జాతీయములేకాక తాళ్ళపాకవారి సాహిత్యమున సుప్రఖ్యాతములైన సామెతలు జాతీయములు నెన్నో యున్నవి. చూడుఁడు.

"అరుతలింగముగట్టి పరువత మేగినబత్తుడ" 5-19
'ఎద్దుదన్నిన గుఱ్ఱము చాటునకేగినట్లు,' 2-192
"ఏరుగుడిచి కాలువ బొగడినట్లు" 8-67, 9-61, 124, 247.
"మారుముద్రకుగాని మంచి మాడకు పట్టములేల" 16-25
'సంతపాకలంజె దెచ్చి సన్యాసిని జేసి' 5-185
'దేవుఁడువరమిచ్చినా పూజారి వరమీడు' 8-220.
'తవుడుతిండి కడబాల లేల్ల' 2-160.
'కొక్కునింట బెట్టికొంచే గోడలుదవ్వకుండునా' 5-301.
'వెంట్రుక పట్టుకబోయి వెస కొండ వాకుట' 6-49.

మున్నగునవి కొన్ని యుదాహరణములు మాత్రమే. అరుతలింగముసామెత 'మెడమీద మేకపిల్లనుబెట్టుకొని ఊరంతా వెదకినాఁ' డను సామెతను బోలినది. మారుముద్రలు దొంగనాణెములు, సంతపాక సామెతలో సంతపాక యూరిపేరో

లేక సంతపేట అను నర్థము నిచ్చునదో! వేశ్యల వాడలను సంతపేటలనుట ప్రసిద్ధమే. ఇట్టి యీ సామెతలందులోకానుభవమో, చమత్కారమో, హాస్యమో నిరంతరము తొణికిసలాడుచుండును. ఇవి ఛందస్సందర్భములు కల్గిన సంగ్రహ వాక్యముల రూపమున నున్నను సందర్భమును బురస్కరించుకొని పదిరెట్లుగా చెప్పఁదగిన భావమును వ్యాఖ్యానించుచున్నట్లే యుండును. కనుకనే సామెతలును, జాతీయములును భాషలోని సజీవతత్వమును నిరూపించు నంశములని యనుట. వేలకొలఁదిగ నున్న తాళ్ళపాకవారి జాతీయములను, పదబంధములను ఒకచో నేర్చి కూర్చవలసిన యవసరమెంతోగలదు. ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వారీవిషయమున గొంత పరిశ్రమగావించి యున్నారు. వారి కృషి సమగ్రము కావలెనన్న తాళ్ళపాకవారి రచనలను, గడముట్ట బరిశీలించవలసి యున్నది. గ్రంథవిస్తర భీతిచేత నధికముగ నుదాహరింప జాలక పోయినను స్వభావసుందరములగు తాళ్ళపాకవారి జాతీయములను గొన్నిటినేని అకారాదిగ నిందు పొందు పరచుటవసరమని యీ పనిచేయుచున్నాను. పట్టిక చూడఁ దగును.

అండజాధిపుతోడ నహిపోరునట్లు (పరమ ఆ 7. పు. 464)
అందనిపండ్లకేల అర్రుచాచేవు (3-67)
అందనిమ్రాని ఫలంబులు (7-1)
అడవికింగాయు వెన్నెల కరణి (2-183, 11-365)
అడవిగాచిన వెన్నెల (6-6)
అడుసుచొరనేపట్టె కాళ్ళు కడుగనేపట్టె (5-14)
అడుసు చొరనేల కాళ్ళు కడుగనేల (5-154)
అద్దములో చంద్రోదయము (10-115)
అద్దము చిలుమబ్బినట్లు (16-15)
అద్దములోపల నీడలు (6-133)
అద్దములో నీడ పొడచూపినట్లు (6-140)
పనియధికంబు నల్పము కూలియగుచు (పదము ఆ. 1-పు. 23)
అరగవిసెన యూడ్చునద్దంబులోలె (అష్టమహిషీ 1-44)
అల్లము బెల్లమౌనా (16-16)
ఆకటికి గ్రుక్కెళ్ళు ఆసయినట్లు (6-93)
ఆడుపుట్టువు హీనము (పరమ. 4-237)

ఇంటఁ బెంచిన యిట్టిఁ జూపి కానలో నిఱ్ఱులఁ గైకొన్న కరణి
(పరమ. 1-21)

ఇంటిపసురమునకుఁ బాలార్చి వెద్దువెట్టవలదా (10-207)

ఇనుము గుడిచిన నీరు (2-214, 5-311)

ఇనుపగుగ్గిళ్ళు నమలుట (6-49)

ఇధ్మములఁ దేఁబచ్చిన కత్తితో అలతోకలు గోసినరీతి (పరమ. 1-20)

ఇరుగింటిలో పని యెరుగ వేమియును
  బొరుగింటిపని దీర్పఁ బోయెదు (అష్ట. 2-116)

ఇల్లుముంగి లొక్కరిడ ఎర వొక్కరిది (2-154)

ఈరు దియ్యం బేను వచ్చె (2-233, 3-497)

ఉట్టిపై చెరలాట మూరబొత్తుల కూడు (2-72)

ఉప్పమ్మేవాడు చిట్లు వే గననట్లు (6-39)

ఉప్పనీరును జొచ్చియున్నట్టి మనుజుఁడు (పరమ. 4-234)

ఉలికి కాలగ గొరవుల జూడినట్లు (4-165)

ఎంగిలి బూరె కడుగనేల (7-260)

ఎదిరికి యినుమడచేవారికి తనకు తగర మడువ దడవయ్యేనా (8-61)

ఎద్దుబట్టిన సివం బెరుకమాలిన ప్రియము (2-96)

ఏటివంకలు దిద్ద వశమా (4-58, అష్ట. 2-92)

ఏనుగు నెక్కి దిడ్డి దూరబోతే (2-234)

ఏనుగుచేతి చెరకు (అష్ట. 4-198)

ఏనుగుతిన్న వెలగపంటి బేసమువలె (6-140)

ఏనుగుమీఁదివానిని సున్న మడుగుట (5-187)

ఒడ్డిన మొగులు నమ్మి దోనెల నీళ్ల దోయుట (9-3-138)

ఓడ విడిచి వదరు పట్టుట (8-196, 9-167)

ఓడ బేర మాదేవాఁడు ఒకదరి చేర్చినట్టు (6-39 )

ఓడినవారల కోపంత కొలది (అష్ట. 4-231)

కంచములోని కూడు కాల దన్నుచురా (5-322)

కందిగింజను కాపువానిని వేచ కెవ్వల చవిగాదు (పరమ. 7-446)

కడనున్న గొడ్డలి కాలిమీఁద వైచుకొన్నట్లు (పరమ. 4-278)

కడలిలో నుప్పు, నడవిలో నుసిరికాయయుఁ గూడినట్లు (పరమ. 2. 52)
కడుపులోపలి చల్ల కదలకి యుండగ (అష్ట. 2-76)
కలగన్న చోటికి గంప నెత్తినట్లు (16-14, 3-449)
కలిదెచ్చు వెన్నాయంగద (3-585)
కామధేనువుపాలు ఘనుఁ డైనయట్టి, సోమయాజికిగాక
శున కార్హ మౌనే (అష్ట. 4-187)
కాలిన పుండ్లలో నుప్పులు చల్లుట (12-33)
కావడిమోచే వాఁడెరుగునా వ్రేగు (2-294)
కుక్కకాటుకు చెప్పుటాట (2-195)
కుట్టిచూడ దోసపండు (3-204)
కుడ్యక్షాళనమ్-గతజల సేతుకరణమ్ (3-59)
కుప్పనురుచుట కసవు కొరకా (2-115)
కుమ్మరపురువు పేడలో పొరలదా (2-207)
కుమ్మరికి నొకయేడు గుదియకొకనాఁడు (5-64)
కూడువండుట గంజికొరకా (2-115)
కొంగిచ్చేను దిబ్బెము గొడికేను (5-267)
కొంచెపు దేవరకు కొండత పత్తిరి (2-235)
కొండంత కనకము పోకకు వెలయిడినట్లు (9-285)
కొండతోఁ దగరు డీకొనిన చందము (పరమ. 7-464)
కొండతల నెత్తుకొన నీకు దరమా (పరమ. 4-256)
కొండ దవ్వట యెలుక కొరకా (2-115)
కొండల నీరు నేలకు పారు, (16-16)
కొండలమీఁద పిడుగు పడ్డట్లు (5-64)
కొండశిలలపలె నోయంటె నోయనేవి (3-500)
కొలుచు దంచుట పొట్టుకొరకా (2-115)
కొల్ల యెద్దు లెప్పటివే గోనెలే వేరైనట్లు (7-284)
కోటికి గంట కట్టి (పరమ. 4-249)
కోటి విద్యలు కూటి కొరకే (11-44)
కోడికిఁ దవ్వ బోయేది తిప్ప పెంటలే (6-33)

కోతి కొమ్మ దప్పఁ బారునా (2-160)
క్రేపు వెన్గను గోవుక్రియ (పరమ. 2-98)
గంగకుఁ బోయి నూతినీరు త్రాగుట (2-335)
గట్టిరాలలో మలిగండ్లేరనేల (7-220)
గడ్డపారమింగితే నాకలి దీరేనా (5-119)
గడ్డబడి యీతగాండ్లౌట (5-133)
గణియంబులోలిఁ బ్రక్కనున్న చెఱకు గణికల
నొత్తిడిగావించు పగిది (పరమ. 1-37)
గద్దమూకలో కోడిపిల్ల (16-33)
గాజుగాజే మాణికము వేరే (3-598)
గారాబువెన్నెలగలనాఁడే యల్లోనేరేళ్ళు (పరమ. 4-248)
గాలి గలనాడె తూర్పెత్తగావలయు (పరమ. 3-248)
గుడి కొంచెమయినా గుడిలోదేవునిమహిమ దొడ్డదే (7-223)
గుడ్డికుక్క సంతకుఁబోయితిరిగిన దుడ్డుపెట్లేకాక దొరికేనా.(11-3-69)
గుమ్మడికాయ లన్నసుద్ది దడవితే పన్నినేఁడు
నీ భుజాలుపట్టి చూచుకోకురా (3-519)
గుమ్మడికాయంత ముత్తైమైతే కట్టవచ్చునా (3-181)
గొరియలలలోన బులి జొచ్చినట్లు (5-64)
గోరఁబోవుట కల్ల గొడ్డలి (అష్ట. 4-178)
గోరుచుట్టుమీఁద రోకటిపోటాయె (3-306)
చందనపువాసనలు సంగడి మ్రాఁకుల కంటును (16-16)
చనవియ్యగా చివురున కెక్క (3-585)
చనువెంతో ననువు నంతె (2-202)
చప్పనయుఁ దీపు చెఱకునందె (16-13)
చానిపిఁ జవి వేడితే జప్పనైనట్లు (5-80)
చానిపిలోపలఁ జవి కలదా (9-141)
చాయలేదని అద్దము సారె దోమినట్లు (8-192)
చింతల చిగురులెక్కి చేగదేరినట్లు (10-80)
చిచ్చు కౌగిలించుకొంటే చిమిడించకుండునా (8-273)

చిడిపిరాయి చింతామణి జేసె (5-185)
చిల్లుల కడవలో దీపమువలె (10-115)
చీకటిద్రవ్వగ ముంగిటనిధాన మబ్బె (3-916)
చీమలపుట్ట చిమ్మిరేగినట్లు (2-369)
చీమలు మైవాకినట్లు (3-390)
చుక్కలు లెక్కించినట్లు (9-267)
చుట్టంబుగతి వచ్చి సూడుబంటయ్యె (అష్ట. 4-199)
చుట్టపు విరోధంబు సూనాస్త్రి చెలిమి (2-104)
చెంబుమీఁద కనకపుఁ బూత (7-1)
చెట్టడిచితే చేటడు ఆవాలు (8-248)
చెదరక వెలుగే చేను మేయఁజొచ్చె (11-3-64)
చెదరవైచిన యొడిసెల వాటులకును
బెదరి వచ్చినయట్టి పెడచల కరణి (అష్ట. 4-198)
చెరకు తీపని వేళ్ళతో దెరలింప దగునే (పరమ 3-157)
చెరకున బందు పండినయట్లు (10-80)
చెరకుపోలికి వెదురు నమలుట (9-151)
చేతులొక్కరి యందు చిత్తమొక్కరియందు (2-154)
జలధి బుర్రకాయ నిండేనా (2-16)
జలములో నున్న చందురు నీడ (11-53)
జల్లెడ నావాలు జారినట్లు (7-260)
జుంటీగ కతవును (6-29)
జుట్టెడు కడుపుకై చొరని చోట్లు చొచ్చి (3-67)
తంగెటిజున్నుకు వడగాలి సోకినది (3)
తనయుని సెగ్గెంబు తండ్రిది కాదే (పరమ. 4-254)
తనుఁ గట్టు త్రాడును దను దానే తెచ్చికొనునట్లు (పరమ. 2-96)
తను నంటుకొనువారు తనయంతవారు (పరమ. 2-83)
తప్పులేని జీతము తారమైన జాలును (2-114)
తలక్రిందేల మేరువు తల నుండగా (16-14)
తల దడిసెను చలి వాసెను (3-610)

తల్లికి లేని ముద్దు దాదికా (8-167)
త్రాటిమా నెక్కిటివానిని తోడ తోడ
నెందాక త్రోయవచ్చును (2-197)
తాపలేక మేడ లెక్కఁ దలచేము నేము (2-94)
తాము చంపము తాడుచంపె ననువారు (పరమ. 4-274)
తాళ్ళకుఁ దలబంటి యెంపలిచెట్లకు నిఁక నెంత బంటి (పరమ. 5-300)
తినదిన వేమైన దీపవును (5-542)
తియ్యబోతే గోడపై నున్నాలు (3-551)
తెలకపిండి కస్తూరి జేసె (5-185)
తేలు తొక్కితే యొద్దించకుండునా (8-273)
తోలుబిల్ల మాద కంటె దొడ్డచేయుట(11-2-44)
దంతి మెసంగు వెలగకాయల గతి (అష్ట. 1-33)
దప్పికి నేయి త్రాగినట్లు (5-1)
దప్పులవాఁడు కొండలంతా నునుపంట (2-94)
దోమను సింహపుఁగొదమ చేసె (5-185)
నాతుల సుద్దులు చింతకాయల వటివి (16-9)
నాలిక కంటని జిడ్డు చేతి కంటును (7-211)
నిజము బలికిన వైరములే యగును (3-497)
నిద్దురించువాని చేతి నిమ్మపండు (5-256)
నిప్పుదెచ్చి యొడిలో బెట్టుకుంటే రాజకుండునా (5-301)
నిప్పుల నెయి బోసినట్లు (2-369)
నిప్పులమీఁద నూనెలు (5-1)
నివురు గప్పినయట్టి నిప్పుక పోల్కి (అష్ట. 1-24)
నీచవాడు కొనబోతే నేరదయ్యేనా (3-124)
నీట బడబాగ్ని యాఱునా (2-16)
నీట మునింగినమీను కది స్నానమా (2-62)
నీఱుగప్పిన యట్టి నిప్పుకమాడ్కి (పరమ 2-60)
నుదుగులు దప్పినా నోము ఫలమిచ్చినట్లు (8-220)
నేయి చల్లిన యనలంబు కరణి (పరమ. 7-536)

నేలనుండి యెగసి మేడమీఁదికేగినట్లాయె (2-192)
పత్తిముదుగూ లేదు చేనిముదుగూ లేదు
పోగెత్తెవాని నేరుపేగాని (6-90)
పనియెంతో కూలి యంతే (2-202)
పరిగలేరేవానిని పట్టపురాజు చేయుట (5-185)
పరుస మంటితే పైడే మినుమేమి (2-60)
పారే బండికి కాలు చాచేవా (16-14)
పాలలోన తోడంటితే పెరుగౌను (16-16)
పాలు తాగిన మీఁద పై కుడుపులా (5-138)
పిఁడికూరలో నలు పెంచుట (10-135)
పిండెంతో నిప్పటి అంతే (2-202)
పిలువక వచ్చిన పేరంటమునకు (అష్ట. 4-206)
పులివాత బడి తప్పిపోవు చందమున (అష్ట. 1-15)
పులులను లేళ్ళను ఒక్క కదుపుగా మేపుదురా (9-180)
పుల్లాకు బండికట్లైనట్లు (9-177)
పువ్వులుముడిచినశిరసున కట్టెలు మోచుట (9-167)
పూరిపుల్ల మేరువుసేయుట (5-124)
పూవువల్ల తుంగ తలకెక్కినట్లు (9-151)
పెంచుదెచ్చి మాణికపుబిల్ల చేసినట్టు (11-2-44)
పెద్ద తెరువుండగా పెడగంతలు తీయుట (9-94)
పెనుగాలికి చింపి చేట లడ్డమా (2-16)
పెన్నిధిగన్నట్టి పేద చందమున (పరమ. 2-56)
పైడితో గురిగింజ సరితూగినట్లు (3-585)
పైడి పక్షి సకినగాడు (16-22)
పైడెంతో తూకమంతే (2-202)
బీద గఱచిన బూరె ప్రియమాయె బ్రదుకు (2-90)
బూరుగపండుకడుపున చూచి (7-260)
పాముగరచినవానికి వేపచేదైనా చప్పన (9-28)
మంచము నీడవలె (16-15)

మంచు గుంచాన కొలిచినట్లు (3-329)
మగడు విడచినా మామ విడువడు. (2-401)
మన్ను దినేటి దూడను కన్నుగట్టి యెందాక
కాయవచ్చును. (2-197)
మయిలవోయి మణుగాయె (3-585)
మానివోడ నమ్మి మహాజలధి దాటినట్లు (10-80)
మాలెమీఁద పరుగు లెందాక. (5-126)
మ్రాఁకుల నీరు మొదల పోసితే
శిఖల కెక్కి చిగిరించినట్లు. (11-45)
మిడుగురుపురువులఁ గడచునే చీకట్లు. (16-15)
మితిలేని మున్నీరు మేరమీరంగ (పరమ. 5-355)
ముందువచ్చిన చెవులకంటే వెనుకవచ్చిన
కొమ్ములే వాడి (3-585)
ముచ్చుగన్నతల్లి మూల కొదిగినట్లు. (7-760)
ముడిచివేసినపువ్వు ముడువ యోగ్యముకాదు. (7-760)
ముడుపు కొంగున బెట్టి మూల వెదకిన రీతి. (5-19)
ములిగినవానికి మొనవాడి (7-197)
ముల్లు ముంట దీసినట్లు. (10-80)
ముసిడికాయను కల్పకఫలము చేయుట. (5-124)
మేకపిల్లఁ జంకబెట్టుక నూతనరయు గొల్లనిరీతి (5-19)
మేనమామగారి వావి చవుకై యుండును (3-511)
మొదలుండగా కొనలకు నీళ్ళు పోయనేల (5-291)
మొల్లపూచిన రీతి (పరమ. 2-113)
మొక్కఁబోయిన యట్టి దేవుఁడెదురుగానయ్యె (పరమ. 2-82)
రత్నము సానబట్టిన గతి (16-15)
రాలుదిఁటా మలిగండ్లేరనేల. (10-223)
లింగము మీఁది ఎలుక (11-3-109)
వంటయింటిలో మెలగు కుందేలు కరణి (ఉషా. 2-59)
వరిచెడ నూదర బలిసినట్లు. (11-3-6)

వహ్నికడనున్న వెన్న (పరమ. 2-53)
వారవనితలవలపు పసిడితోడిద. (పరమ. 4-247)
విత్తుల కొల్చు గలుగ తక్కినవెల్ల కలుగు (పరమ. 7-537)
విత్తొకటి చెట్టొకటి యగునా (7-155)
విత్తొకటి వి త్తితే వేరొకటి మొలచునా (9-189)
విషము మ్రింగితే తలకెక్కకుండునా (8-273)
వెనుక నుయ్యి తగరు ముందు (2-295)
వెన్నకు బండ్లు వచ్చినట్లు (2-73)
వెన్నపట్టుక నేయి వెదుకనేల (2-191)
వెఱ్రి దెలిసి రోకలి చుట్టె (8-6, 8-174)
వ్రతము దక్కినను సుకము దక్కకపోయె (పరమ 4-251)
వ్రాలకు ముదిమీ లేదు వక్కణ ముదిమీలేదు బుద్ధి నేర్పెగాని (6-90)
శిరసుండ మోకాల సేస వెట్టుట (8-175)
సముద్రము గడచి యోడలో నినుము దెచ్చినటు (9-285)
సామజబృందంబు చనుదెంచు త్రోవఁ
  జీమల పంక్తి వచ్చిన విధంబునను (పరమ. 1-5)

**మఱికొన్ని అపూర్వపదప్రయోగములు :**

పైని పేర్కొనబడిన యంశములేకాక తాళ్ళపాకవారి సాహిత్యమునందు అపూర్వములగు పద ప్రయోగములు కూడ ఎన్నియో ఉన్నవి. వానిలోఁ బెక్కు పదములు నేఁటి మన తెలుఁగునిఘంటువులందును జేరియుండలేదు. దేశీయ మగు పదజాలమును జాలవరకు వ్యవహారమునుండి సేకరించి బ్రౌనుదొర తన డిక్షనరీలో చేర్చుకొనెనుగాని అయా పదముల కధికముగా నాతఁడు పూర్వ గ్రంథముల నుండి ప్రయోగముల నిచ్చియుండలేదు. శబ్దరత్నాకరమున శ్రీ సీతారామాచార్యులవారు తాళ్ళపాకకవులను తలఁచినట్లేలేదు. సూర్యరాయాంధ్ర నిఘంటుకారులు అచ్చయిన తాళ్ళపాకవారి కృతులొకటిరెండిటినే తప్ప తక్కిన సంకీర్తనసంచయమును పరిశీలింపలేదు. ఇటీవల ఆం. సా. అకాడమీ వారిచేత ప్రకటితమైన పదబంధపారిజాతముననే తొల్దొల్త తాళ్ళపాకవారి సంకీర్తన సాహిత్య మించుక పరిశీలింపఁబడినది. తెలుఁగునిఘంటుకారుల యత్నము సమ

గ్రము కావలెనన్న తాళ్ళపాకవారి సంకీర్తన సాహిత్య పరిశీలన మెంతేని అవసరము. అది యింతదనుక జరుగలేదు. తాళ్ళపాకకవుల పదప్రయోగసూచిక విడిగా సంధానింపబడుటకూడ భాషాపరిశోధకుల కుపకారకము కాఁగలదు. నేఁటికి వారి సాహిత్యము చాలవరకు ముద్రణ భాగ్యమునంది వెలుగు ముఖము చూచుచున్నది కావున నా ప్రయత్నమిక విరివిగ సాగవచ్చును.

సమగ్రపరిశీలన కిది యదను కాదుకనుక తాళ్ళపాకకవుల పదప్రయోగములను గూర్చి సాలీపులాకన్యాయముగ నిట కొంత ముచ్చటింతును. వారి పదప్రయోగములకుఁ బెక్కింటికి నేఁడు మన కర్థము దురవగాహముగ నున్నది. అట్టివాని నట్లే ప్రయోగములు చూపి విడచుచున్నాను. శక్యమయినవాని కర్థనిర్ణయము చేయుటకు యత్నింతును. కొన్ని పదములకు రూపాంతరములనుఁ గొన్నిటికి నూతనప్రయోగములను గూడ నిం దుదాహరింతును.

1. అంగడి :

అంగడిపడు, అంగడివారు ఇత్యాదిపదబంధములు పీరివి గలవు. "అంగడి నెల్ల బెట్టిన యాకెవో యీకె (3-102),"బయటపెట్టిన-అని, "అంగడివారమా" (3-515), బయటివారమాః పరాయివారమా అని, "అంగడి గంధపుపూత లట్టి వుండెనా" (3-26), బయట పూసిన గంధపుపూతలు, వెలిపూతలు అని. అంగడి-దుకాణము, అంగడివీధి-బజారు అను నర్థమున నేఁటికిని వ్యవహారమున్నది. "అంగడి"లో పెట్టుట, నలుగురికిని తెలియునట్లు చేయుటయే. అనఁగా బహిరంగ పఱచుట. బ్రౌను-"వాఁడు ఆ సంగతిని అంగట్లో పెట్టినాఁడు - he exposed the matter" అని వివరించెను.

2. అందగారి మాటలు :

అందమైన మాటలు లేదా అందగానియొక్క మాటలు అనుటకు. "అందగారి మాటలెల్లనాడి నన్ను నమ్మించి కందువకు తీసితివి గదవయ్యా" (17-14). అందగాఁడు - A Showy man, a handsome man (*Feminine*) అందగాఁతె, అందగా ర్తె. (చూ. కిట్టెల్ కన్నడ పదకోశము)

3. అగ్గువ - చవుక :

"జననాలు మరణాలు సంసార భోగములును
అనిశము భూమిమీఁద నగ్గువలు" (8-170

చూ. బ్రౌను - Cheap - చవుక - అగ్గువగాఁ గొనుట;
కిట్టెల్ cheapness of commodities – తెలుఁగు అగ్గున. తుళు అగ్గ.

**4. అడబాల : వంటకత్తె.**

"పూని వడ్డించమనేవు, హత్తి మీకు నిద్దరకి నడబాలరా" (3-155). "తవుడుతిండి కడబాలలేల (2-160) చూ. కిట్టెల్ అడబళ = అడుపళ A cook అడి–అడె, అడిగె - cooking, అడిగెమాడువవళు–a female cook. వంటవాఁడు అను నర్థమున గూడ "అడబాల" ప్రయోగ మున్నది. చూ. బసవ (7-23 పు.)

**5. అడిబంటు : పాదసేవకుఁడు.**

"ఆమనియింద్రియముల కడిబంటను" (7-246) అడియెన్ (తమిళము)- అడియఁడు, అడియరి - కింకరి, పాదసేవకుఁడు చూ. శ. ర. ఇందు అడిబంటు రూపము కానరాదు. బ్రౌను అడిబంటు N.S. ధూర్తుడు K.B.అని వివరించెను. ఈ యర్థమిట సరిపోదు.

**6. అడిబందడు:**

"చిడిముడి గొల్లెతల చీరలు దొంగిలినట్టి-అడిబందనికి నేఁడే యూదారమే" (15-102). బ్రౌను అడిబంటు = ధూర్తుఁడు అని యిచ్చిన యర్థమిట సరిపోవును. అడి-అడియ-అడిగ- one who is in a low position, slave బందు-బంద (k) వంద (T) - a shameless dishonorable man (చూ. కిట్టెల్-పదకోశము) అడిబందడు-ధూర్తుఁడైన హీనుఁడని యర్థమగును.

**7. అడియాలము : గురుతు.**

"భువి నడియాలమైనట్టి ఆమంచు' (2-2) 'అడియాలపుజీవులు అతని భోగములు' (2-65) చూ. మరియు (2-402, 413) చూ. బ్రౌను A sign, token, లాంఛనము, కిట్టెల్ - అడయాళ - a mark, a sign.

**8. అద్దలింపు · అదలింపు.**

అదలింపు అనుటకు రూపాంతరము. "అద్దలింపు గసరు, మోహంపు గొసరు" (4-104) ప్రాసస్థానమున గలదు.

9. అప్పణ : అప్పణె.

ఆజ్ఞ - అనుజ్ఞ Command, order, permission, leave అను నర్థములొసగి ఆజ్ఞాపనశబ్దభవముగా పేర్కొనెను. అప్పణెకేళు, అప్పణెకొడు, అప్పణెమాడు అని కన్నడమున నున్నట్లే తాళ్ళపాకవారు అప్పణ - అప్పణ దెచ్చు - అప్పణిచ్చు - అప్పణచేయు మున్నగు పదబంధముల ప్రయోగించినారు.

"వమ్మల రాట్నము సెలుపక గుండ్రలు నిల్చునా
పమ్మికనీయప్పణ లేక భవములు మారునా" (6-130)

"అప్పణిచ్చి మిము సమ్మతి సేయుచు నట మముఁగావఁగఁ దానేకర్త"
(7-60)

"నీకడ నిన్నే కొలిచి నీయప్పణదెచ్చి" (7-209). ఆజ్ఞ, అనుజ్ఞ అను నర్థము లిట పొసగుచున్నవి.

10. అరవిరి : సొగసు.

అందము అను నర్థమున వీరు ప్రయోగించినట్లున్నారు. "సగము విరిసిన మొగ్గ, ముకుళము అని. శ. ర. బ్రౌను - Only half blown, half opened అని వివరించెను. సగము విరిసిన పువ్వు ముచ్చట గొల్పుచుండును. కనుక నరవిరిచంద మగునందమునే, సొగసుఁదనమునే 'అర విరి' యని వారు ప్రయోగించిరేమో! చూ.—"అరవిరి బాగుగా నరవిరుల్దురిమి" - (సొగసుగా?)

"అరవిరి విధాన నానతీయరాదా" (3-258)
"అలవోక నగవు నీ అరవిరిసాము" (3-263)
'అందపు రెండుకన్నుల నరవిరి నీ మోము (అందమైన నీమోము)
చెందమ్మి రేకుల బోల జెల్లునయ్య విఠల' (3-269)
"వనిత శ్రీ వేంకటేశ్వరుని కౌగిట జేయు
వినయ వివరంబు లరవిరి ముక్కులాయ" (3-367)
(అందపు ముక్కులు)

'అరవిరి నురమున అలయుచును వీడె
తిరువెంకటపతి దెలుపరమ్మా' (3-404) (సొగసైన ఉరమున)

"ఆరవిరి బాగుల నతివలు ముద్దులు గురియ" (3-419)
"అద్దపు(జెక్కుల కేలే అరవిరి" (12-125) - (అందము?)

11. **అఱుకమ్మ** : మెడపట్టుకొను

"అరు (లు) కమ్మి పెనగేవు అద్దిరానీవు" చూ. శ. ర. అరు(క్రమ్మ = కవియు. అందు రామాయణసుందరకాండ ప్రయోగమొకటే కలదు. ఇది ప్రయోగాంతరము.

12. **అల్లిరము** : పెండ్లి విందు.

"అన్నిచోట్లా నుండి అల్లిరము లారగించ,
వెన్న(డవై వేడుకతో విచ్చేసినట్లు" (9-144)

ఈ పదము నిఘంటువులందు కానరాదు. పదబంధపారిజాత మీ ప్రయోగమును జూపి "అల్లెముతిను" అను నర్థమిచ్చినది. (అల్లెము) అల్లియము-అల్లిరము రూపాంతరములు కా(దగును.

13. అసవాలకు(డు : శక్తిగలవా(డు (?)

'ఎప్పుడు చొచ్చెనో మా యిల్లు చొచ్చి పెట్టెలోని
చెప్పరాని వుంగరాల చేయిపెట్టి
అప్పుడైన వేంకటాద్రి అసవాలకుడు గాన
తప్పకుండ బెట్టెవాని తలకెత్తరే' (11-2-20)

తాళ్లపాకవారి కీర్తనల రేకులలో అసవాలకుడు – అసవాలకుడు అనియు రూపములున్నవి. అసవాలకు(డు = సామర్థ్యము గలవా(డు, శక్తు(డు అని అర్థము భాసించుచున్నది. "వేంకటాద్రి అసవాలకు(డు"-వేంకటాద్రిమీ(ది "మహిమ గలవా(డు" అనియేమో? acaivu - aca - weariness, exhaution, languor, faintness (DED). అస = Slenderness, weaknes-అస వల్లద-not small, అసవల్లదవ-strong, energetic man-(చూ.కిట్టెల్) ఈ పదబంధము అట్టిదేయగునా?

14. **అతుమ** : ఆత్మ.

"ధాత నీ సు(తుడు-అతుమలో నిను ధ్యానము చేయగ" (2-276) "అతు

మలోనుండి" (5-31,) చూ. (8-104,) ఆత్మయనుటకు వీరు పలుతావుల విశ్లేషించి ఆతుమ యని ప్రయోగించియున్నారు.

15. ఆట = రూపకము.

'ఆటలో బ్రాహ్మణుఁడనైతి" – (విదూషకుఁడు) హాస్యగాఁడ నైతినని భావమేమో.

"అన్ని కర్మములఁ జేసి ఆటలో బ్రాహ్మణుఁడనైతి
నన్ని వేదము లనేటి యంగడివీధి" (6-6)

ఇట్టిదే "ఆటవాఁడనింతే నేను అవధారుదేవ" (6-150) ప్రయోగము కూడ. 'నాటకుఁడు' (11-3-17) "నాటకీఁడు" (17-589) – నటుఁడు, నాటకములాడువాఁడు అనునర్థమున వీరివి మఱికొన్ని ప్రయోగములున్నవి.

16. ఆణికాడు : మేలువాఁడు, ఘనుఁడు అనుటకు.

"జాణయ్యా మేలెరిగిన ఆణికాఁడవు
తానకమైన నీ దొరతనమెలాఁగంటిమి" (16-2-98)

(k) ఆణి = excellency, superiority – (చూ. కిట్టెల్ పదకోశము) – పై సంకీర్తనమందే తక్కిన చరణములందు గల 'జాణవు', 'ఘనుఁడవు', 'మేలుకాఁడవు' అను అను పదములు పైయర్థమునే స్ఫురింపజేయుచున్నవి. కిట్టెల్ పదకోశమున ఆణికాఱ = A nailmaker అను పదమున్నది కాని ఆయర్థ మిట సరిపోదు.

17. అయము : జీవస్థానము. మర్మము. అని శ. ర.

"అలుగులు పైబడితే అయాలు తాకకుండునా"
ఆయాలు మోవ నాడితిమి" (8-192)
"ఏయెడ శ్రీ వేంకటేశ యేయే పాతకమైనా
అయమైన నీ శరణాగతి చేనణగు" (9-88) (?)

మున్నగు ప్రయోగములివి పైయర్థము నిచ్చునవే. ఇట (9-88) ప్రయోగమున ఆయము-వంచన, మాయ అను నర్థము తోచును. (k)ఆయ = craftiness, deciept చూ. కిట్టెల్ పదకోశము)

18. **అలజాలము : మీనపదము.**

"అప్రసమైన భ్రమ అలజాలాలకునట్లు." (2-52)

"తటతటన నీటి మీదటనాలజాలంబు

లిటునటు జరింపవా యీదియీది" (2-207), చూ. మరియు 2-306. ఈ పదమునకు "అలజాలమ్ మీనపదమ్" అను సంస్కృత నిఘంటువు నుదాహరించి శ్రీ ప్రభాకరశాస్త్రిగా రర్థము వ్రాసియున్నారు. (చూ. తెలుఁగుమెరుఁగులు పు. 89-99).

19. **ఆసోదము - ఆసోద్యము:**

ఆసోదాలు, ఆసాదాలు, ఆసోదకాడు-ఆసోదక త్తె.

"కానీవయ్యా దానికేమి కలది కలట్టియ్యాని
ఆనుకొని యింక నెంత ఆసోదమో" (3-631)

'వెగటు నాసోదంబు యిది నావెలితో నీ వెలితో' (7-141)

'దిక్కుల నిది చాలక దివ్య భోగము గోర
అక్కర నాకింక ఆసోద్యమా' (2-141)

'వెడగు నీయాసోదాలు విడువిడు మోయి' (3-560)

'తీరని ఆసాదాలు దేహములోనించుకొంటె
వూరూర దిప్పితిప్పి వొరయక మానవు' (5-242)

'వాసి తోడ సేవలు సేయంగా
ఆసోదకత్తెని యందువుగా' (3-126)

'ఆసోదకాడవు నీపన్నిటాను' (3-622)

ఈ పదములకు స్పష్టమగు నర్థమేమో తెలియవచ్చుటలేదు. బ్రౌను మిశ్రమాండలికపదకోశమున ఆసోదా for అసూదా - అను పారశీక పదము నిచ్చి Rest, repose,-విశ్రాంతి, సేదదీర్చుకోవడము అను నర్థము నిచ్చెను. పారశీకవిద్వాంసుల నడుగగా ఆసూద్గీ -ఆసూదా Contentment, happiness, Blissఅని యర్థమగునని వివరించిరి. కాని పైతాళ్ళపాకవారి ప్రయోగములను బరిశీలింపఁగా, ఆసోద్య(ద)ము = కోరిక, పారవశ్యము, ఆసోదాలు = ఆశలు, ఆసోదకాడు = తృప్తుడు, ఆసోదక త్తె = అత్యాశకుపోవునది-అను నర్థములు భాసించుచున్నవి. వ్యవహారమున నీ పదమునకు-ఆసోదాలు = పనికి

మాలినపనులు అను నర్థమున్నట్లు శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు చెప్పినారు. జాతరలలో గ్రామదేవతలను తిట్టుచు తిరుగు నొక తెగవారికి, 'ఆసాది,' 'ఆసోది' అను వ్యవహారమున్నది. ఇంకను బరిశీలింపఁదగును.[1]

20. **ఆహివెట్టు : కుదువబెట్టు**

'అప్పుడే గోవిందునికి ఆహివెట్టితి జిత్తము'
"మొదల కర్మములకు మోసబోయి యీ బ్రతుకు
కుదువ వెట్టితినే గురిగానక
వెదకి కామునికి విషయములకు నే
అదివో నా వయసెల్ల నాహి వెట్టితిని" (10-142)

(విశేషములకు చూ :- తెలుఁగుమెఱుఁగులు పు. 147).

21. **ఇంబు : ఇంపు, ఇమ్ము.**

"బింబాధరుఁడాతఁడు పికవాణిని నేను
యింబడర నిద్దరికి నేటి పోందులే" (15-281)
చూ. కిట్టెల్ పదకోశము. "ఇమ్బు = (Te)ఇమ్ము-ఇమ్పిన పద్మముఖి."

22. **ఇత్తల : ఇవతల, ఈతల అనుటకు.**

"బత్తితోడ తన మీఁద పాటపాడితేను
యిత్తలమోమై తిరిగె నీ విట్టలుఁడు" (6-217)

"ఇత్తల, నెంతైనా మాన వెందునైనా దిరిగేవు." (10-?) 'ఇత్తల' వలెనే 'ఎత్తల' 'అత్తల' ప్రయోగములు కూడ వీరివి గలవు.

23. **ఇనాము = ఈనాం (హిం) చూ. శ.ర.**

"ఎంచగ నీ దాస్యము నాకినా మిచ్చితి గాన" (9-177)

---

1. ఆసోదము- "ఇది అచోద్య భవమా అని మేమనుకొనుచుంటిమి 'రమణీయత' అర్థము కావచ్చు" అని 19వ సంపుటమున పరిష్కర్తలు తమ సందిగ్ధ పదసమీక్షలో పేర్కొనిరి.

**24. ఈటు :** [1] **ఈడు—ఈటు సమనార్థకములు. ఈటు, ఈడు, ఈటాడు,** ఈటువెట్టు మున్నగు ప్రయోగములు తాళ్ళపాకవారి వెన్నో గలవు. **ఈటు** = వ్యరము, శూన్యము అని శ.ర., ప్రయోగము కానరాదు.

"నాటకపు తొంటివారు నడచిన మార్గమని
యీటుకుఁ జేసేఁగాక యిందేమి గలదు" (6-74)

ఈ ప్రయోగమున మాత్రము పైయర్థము సరిపడుచున్నదేకాని తాళ్ళపాక వారి పెక్కు ప్రయోగముల కాయర్థము పొసగకున్నది.

'**ఈటు**నం గాలుతొక్కేది యెన్నదే తాను' (-115) మున్నగు ప్రయోగములను బట్టి ఈటు = వేడ్క, ఉత్సాహము, కుతూహలము అను నర్థము సరి పడునని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు వ్రాసి యున్నారు.

'కూటము గలిగెనంటా కోరిన సంతోషముతో
యీటున నుండిన దెలా నిందుకొరకా" (17-366)

"యీటుతోఁ బెండ్లాడితిని(17-377) అను ప్రయోగములును పైయర్థమునే **తోఁ**పఁజేయుచున్నవి.

(Ta) Intu (inti) to gather, come together, ఈట్టమ్ = Throng, group. (Ma) Collection (K) ఈడు = joining, uniting, inercase, plenty, strength-Idukara, Idugara = a powerfulman. (చూ. DED. 458)

**ఈటు** = బలిమి, దర్పము అతిశయము అను నర్థము కూడ వీరి ప్రయోగములలోఁ గొన్నిట తోఁపఁగలదు, చూ.

"చీటికి మాటికిఁ దొల్లి చేసన్నకె వచ్చేవాఁడ
వీటున రాజసాన నీ వెవ్వరి గైకొనవు" (17-386)
"తేటలుగా నీ నిజాలే తెలిసేఁ జెలులకెల్ల
యీటు తోడి కుచ్చితాలు యిఁక నేలయ్యా" (14-157). అర్థ మింకను విచార్యము.

---

1. **"ఈటు-ఇంత అన్ని కన్నడమం దర్థము. ఈడు అను తమిళ శబ్దమునకు** గౌరవము, తృప్తి, బహుమానము **మొదలగు** అనేకార్థములుగలవు. ఈటు **మీరు** (20-106) కొలదిమీరు:" అని 20 సంపుటము సందిగ్ధ పదసమీక్షలో గలదు.

25· **ఈలకొను : ఈలకరచు, ఇలకరచు.**

"ఈలకొన్న యెముకల యింటిలో కాపురమింతే
యేఁట మాయ వెంట బెట్టే వేమిగద్దు నీకును" (9-45)

బ్రౌను-ఈఁకరచు-ఇలకరచుట to retain life, to set or gnash the teeth పండ్లు గట్టిగా కరుచుకొని,' అని వివరించెను· పదబంధపారిజాతము కూడ పై యర్థమునే వివరించినది. వ్యవహారమున ఇలకరుచుకొనిపోవు అనుదానికి ముడుచుకొనిపోవు, ఎండి శిథిలమగు అను నర్థమున్నది· ఇట 'ఈల కొన్న ఎముకల యింటిలో' ననగా శిథిలమైన శరీరమున అని భావము.

26· **ఉంబళి = పన్నులేనిది (ఉంబళి గ్రామము) చూ· శ·ర· ప్రయోగము లేదు.**

"ఒప్పుగా సరకము మా కుంబళిచ్చి మనమెల్ల కప్పము గొంటిరిగా యంగనలార" (2-103) చూ. బ్రౌను—'Adj. free from taxation అని వివరించెను. ఉంబళి = An enjoyment gift, rent free grant of a plot of ground. (చూ· కిట్టెల్ : పదకోశము.)

27. **ఉంటవిల్లు-ఉంటవింటవేయు:**[1]

కర్పూరపుటుండలను జిమ్ము సాధనము. ఉంటవింట వేయుట-శృంగారమునకుఁ గప్పురపుటుండలను జిమ్ముట.

"ఉవిద చన్నులు నీవు వుంటవింట వేసితేను
తపెలి పూబంతిఁగొప్ప తరుణి వేసె" (13-124)
"వుంటవింట వేయుమనీ నోయమ్మా" (17-170)

"కరకరిఁబెట్టవుగా కప్పురపుటుండలు" (15-7) అనుటలో నీ విషయమే స్మరింపఁబడినది. పూబంతులను, కప్పురపుటుండలను, నిమ్మపండ్లను విసరుకొని శృంగారము నెరపుట, కైరవడినాళ మూదుట వీరి కీర్తనములందు కాననగును·

---

1. "ఉంటలు, ఉంటలవంటి చిన్న రాళ్ళు వేయు విల్లుకావచ్చు. ఈ జాతి దానికి 'ఇంపెలదబ్బ' అని నేటికి వ్యవహారము గలదు". చూ. సందిగ్ధపదసమీక్ష పం॥ 22.

చూ. DED (Ta) ఉంటు (ఉంటి) to pushout, thrust, fling ఇది ఉంట (ఉంటు) విల్లు అనియో, లేక ఉంట (ఉండ) లను జిమ్ము విల్లు అనియో ।

## 28. ఉప్పటించు:

ఓర్వజాలక నిందించు. చూ. శ. ర. లో 'ఉప్పతించు' కలదు, బ్రౌను కూడ ఉప్పతించు = ఓర్వలేక ఆడిపోసుకొను' అని వివరించెను. కాని తాళ్ళపాకవారి ప్రయోగములలో 'ఉప్పటించు' అని యున్నది. "ఉప్పటించి దూరు కంటె నూరకుండుటె మేలు," "ఉప్పటించి యాతండు నన్నొకటే యాడంగ" (3-574).

## 29. ఉప్పవడము:

అవబోధము, మేలుకొనుట అని శ. ర. బ్రౌను కూడ Awaking మెలుకువ" అని వివరించెను. తాళ్ళపాకవారి ప్రయోగము లివి చూడఁదగును. ఉప్పవడము, ఒప్పవడము, ఉప్పడము.

"ఉప్పవడము గావయ్యా ఉయ్యాల మంచము మీఁద
గొప్ప గొప్ప కన్నుల గోవిందరాజా" (4-102)
"ఉప్పవడముగాకున్నా రిందరు
యెప్పుడు రేయి నీ కెప్పుడు పగలు" (5-90)
"వొప్పవడముగ బాదా లొత్తరమ్మా" (3-404)
"వొప్పవడమై రాజు కొలువున్న యపుడె" (పరమ.)
"ఉప్పడమయి దేహమనేవూర బెద్ద చావడి
ఉప్పతిల్లి దేహి కొలువున్నపుడు" (6-124)

ఉప్పవడము-విశ్రాంతి చెందుట, సుఖశయనము అను నర్థమున తాళ్ళపాకవారి ప్రయోగములున్నట్లునదని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు వ్రాసి యున్నారు. ఇది నిద్రకును, లేచి యుండుటకును నడిమి దశ కావచ్చు. పరుండి మేల్కొని యుండుట-వెన్నువాల్చి-అనఁగా సుఖశయనమున విశ్రాంతి గొనుట।

## 30. ఉలివెచ్చ - నులివెచ్చ :

"ఒగ్గిన పొత్తుల వల పులివెచ్చలై యుండు"

31. **ఊకొను—ఊఁకొట్టు :**

"వద్ద నుండి వూకొనేటివారు గలిగితే నీవు
సుద్దు లెన్నైనా జెప్పేవు సూటి వడను" (3-164)

చూ. బ్రౌను 'ఊకొనుట-To hum or make an undistinct sound denoting that he is listening'.

32. ఎక్కసక్కెము-ఎగసక్కెము :

ఎక్కసక్కిడు-ఎగసక్కిఁడు :

ఎగతాళి, పరిహాసము., విపరీతస్వభావము గలవాఁడు అను నర్థము లందు ఈ పదములను తాళ్ళపాక వారు ప్రయోగించిరి.

"యెక్కసక్యాలకుఁబాద మేల పట్టేవయ్యా" (13-31)
"యెగసక్కెలాడ మాకు నేలయ్యా నిన్నును" (10-164)
"యెకసక్కిడు వీనితో నేటి చుట్టరికమే" (15-102)
"యెగసక్కిఁడవు తోల్లె యేమీ నన నోపము" (13-59)

ఎక్కసక్క - Rediculc, mockery, a joke ఎక్కసక్కె- a perverse female-(చూ. కిట్టెల్ పదకోశము) కన్నడమున ఎక్కసక్కె ఉన్నట్లే తెలుఁగున 'ఎక్కసక్కిడు' - A perverse male అని అర్థము (చూ. 15-102)

33. ఎరపరికము :

అవజ్ఞ తిరస్కారము. చూ. శ.ర. ఈ పదమందు 'ఎఱబఱికము' శకట రేఫతో గలదు. ఉత్తరరామయణప్రయోగి మొక్కటి యీయఁబడినది. రోఁత అని అర్థమున్నది. రోఁత అని అనుట కన్న అవజ్ఞ అనుటయే తగు ననుకొందును. చూ. బ్రౌను. ఎరపరికము = dislike, reluctance. తాళ్ళపాకవారి ప్రయోగము కూడ సాధురేఫతోనే గలదు. "శరణని బ్రతికేర సరినేడు వైష్ణవులు-యెరపరికానబోయ్యే రిప్పుడూ గొందరు" (8-5)

34. **ఏకతాలు : రహస్యములు.**

"చెప్పరాని యేకతాలు చెప్పితి వింతటిలోన" (3-506) చూ. బ్రౌను-ఏకతము-ఏకతమాడిరి They talked in secret.

35. ఏఁటవేయు-ఏఁట వెట్టు

చూపు నిగిడించు. ఏట (ము) = పక్షము అని శ. ర.లో గలదు. పద బంధపారిజాతమున ఏటవేయు - (తాళ్ళపాకవారి ప్రయోగమునకే) బలియిచ్చు, భారమువేయు అను నర్థములిచ్చి, 'అర్థమింకనూ విచార్యము' అని సంపాదకు లనిరి.

మా. తాళ్ళపాకవారి ప్రయోగములు-
"వేగి లేచి సంసార విధులకే వొడిగట్టి
యేగతి గొసరి నీపై నేఁట వేసేము" (10-2)
"గూటిలో దవ్వులవాఁడు కొండ లెల్లానును పంట
యేటవెట్టి యేగిన ట్లిహిహీ నేము" (2-94)

ఏఁటవేయు - ఏఁటవెట్టు అను పదబంధములకు "భారమువేయు" అని కాక చూపునిగుడ్చు, దృష్టిని సారించు, గుఱిపెట్టు అని యర్థము కాఁదగునని తలంచుచున్నాను.

36. ఒట్టు : తాకు, అంటుకొనియుండు.
"ఒట్టి నానాలుకపై నుంటేచాలు" (2-30)
ఒట్టుకొని నామీఁద నీవు వోలవేసేవు"

37. ఒణికె : ?

"గొణగి గొణగి లోలోగుంపించినా మానదే
వొణికె వేసుక నే నూరకున్నా మానదే
సణుగు లాడగ వేరే సొకరి వెట్టినే (15-146)

వొణికె వేయుటనగా నర్థమేమో తెలియరాకున్నది. Kittle 'ఒణ' అను నారోపముక్రింద ఒణమోర. A dejected sad Countenance (S.Mhr) a face that indicates fasting అని యిచ్చి యున్నాఁడు. పై ప్రయోగ మది "వొణికె చేసుక" యో "వొణికె వేసుక" యో; ఒణికెవేసుక-మొగము ప్రేలాడవేసికొని అని యర్థమగునా?

38. ఒ(వ)లపతము : పక్షపాతము
"ఒలపక్షము లే నొక్కదేవుండవు
నలినాక్ష హరి నమో నమో"

"అతని నన్ను నట్టే యనరాదా
తో తో వలవక్షము దోసముకాదా" (3-574)

39. **ఓహరిసాహరి :**

తండోపతండముగా అని. శ. ర. బౌ్రిను Backwards and forwards - అని యర్థమిచ్చెను.

"అకట యీ జగతి నోహరిని సాహరిని
యొకఁడు నాతోఁ బోర నోపునే పోర"

ముందుగా వెనుకగా అను నర్థమే యిచట పొసగుచున్నది.

40. **కంకిగా:**

మొత్తముగా-ఏకముగా-చివరగా-అను నర్థములు భాసించుచున్నవి. కంకి = కంకు = An ear of chola or sojje, the grains of which have been removed. (చూ. కిట్టెల్. పదకోశము)

"కంకిగ బహునరకంబుల చొచ్చితి
నింకాభయము మది యెరఁగను" (9-28)
'కంకిగారతులలో ఘాతసేసునా' (14-112)

41. కంపు : సుగంధము

"సంపదగలాపె గూడి సరసము లాడుచు
కంపులే పూసేవు గానియ్యరా" (3-51)
"సొగసుడుగం బిసికి కంపు చూపిన భంగిన్" సం. లక్షణము

42. **కంభారూళ్ళుసేయు :** త్రిప్పులబెట్టు, కొలికికిఁదెచ్చు (?)

"పగగాని లోన నప్పటి నుండి సొంపు
డిగి కంట కంట పుట్టెడు నీళ్లు కార
మమ్ము నిందొక కంభారూళ్లు సేసి
లెమ్మన్న లేవక......" (పరమ. పుట 258)

ఈ పదమున కర్థమేమో తెలియరాదు. బౌ్రిను 'కంబారులు' అను నారోప మునకు servants, labourers - పనివాండ్లు అని యర్థమిచ్చియున్నాఁడు.

సంబంధ మేదేనికలదో! విప్రనారాయణుని కథలో వృద్ధవేశ్యమాత దేవదేవిని గూర్చి కాంతోపయంతునితో చెప్పు సందర్భమునుబట్టి కంభారూళ్ళచేసి యను పై పదబంధమునకు త్రిప్పలబెట్టి, ఒక్క కొలికికిఁదెచ్చి అను భావము స్ఫురించు చున్నది. అర్థమింకను విచార్యము.

43 కంగనాడు: బొంకులాడు, కోపగించి పలుకు (?)

"బంగారు మెరుగు చాయ పతతి నొక్కతె గూడి
కంగనాడేవు నాతోఁ గానీయరా" (3-51)

ఈ కీర్తనమునవే "కదవ బొంకేవు నాతోఁ గానీయరా" అని వేరొక చరణ మున గలదు. కనుక నాపదబంధమునకు బొంకులాడు, అబద్ధమాడు అను ర్థములు పొసగునట్లున్నవి. పదబంధపారిజాత మీ యర్థమునే సూచించినది. Kittle-కంగు = displeasure, anger, కంగాగు = to become angry or annoyed అని పేర్కొని యున్నాఁడు. దానిని బట్టి చూడఁగా కంగనాడు = గట్టిగా పలుకు, ఆగ్రహించిపలుకు అను నర్థములు కూడ పై ప్రయోగమున సరిపడునని తోచుచున్నది.

44. కగ్గు[1] - కగ్గు దేరు - కాఠిన్యము, గట్టితనము-గట్టిపడు.

"కగ్గులేక గుల్ల గుల్లేగాక మరి రాయవునా" (2-160)
"కగ్గులేని వారినేల కాక సేసేవు" (3-110)
"కగ్గుదేరినందుమీఁద కపటము చెల్లునా" (17-340).

Kittle-కగ్ = Hardness, strength—అని యర్థమిచ్చెను. బ్రౌను కగ్గుట = To shrink జంకుట, కగ్గించుట To Contract, కగ్గున - suddenly అని వివరించెను. సూర్యరాయాంధ్ర నిఘంటువున "కగ్గు" ఉన్నది కాని "కగ్గుదేరు" లేదు.

45. కట్టణము, కట్టడము, వస్త్రము (?).

"కట్టణములు పాలించి (పరమ) చూ. Kittle కట్టణ-౨ building. "భృత్యులు నంబుల కావికట్టణము లొలిపించి" (పరమ) - ఇందు కావికట్టణ ములు = కాషాయ వస్త్రములు-అని తోచుచున్నది.

1. "కగ్గు - వివర్ణమగు అని సూ. ని. దాని ఛాయార్థముగ 'సంకోచింపక' కావచ్చు." (చూ. సందిగ్ధపద సమీక్ష నం. 20)

46. కపురు: **రూపు, ఆకృతి.** ఈ పదమును పదకోశము లేవియుఁ బేర్కొనలేదు

"ఉపమింపగ నిందొకఁడగాను, కపురుల నీ డింగరీడను నేను" (5-324)

"యిపుడు శ్రీ వేంకటేశ యిన్నిటా నన్నేలితివి, కపురైనమానుతులు ఘనము గాదయ్యా" (2-176) "విపరీత భోగాలు వెలలేని పుణ్యాలు, కపురులు స్వర్గలోకము కాడివే." (10-235)

మరికొన్ని తావుల లాక్షణికముగా "పైకి మాత్రమే తోచనట్టి" "కపట మైన" అను నర్థము భాసించునట్టి ప్రయోగములు నున్నవి. "కపురు మొకదాకిరి గడించి నీకు వచ్చునా (17-577) "కపటాన నీమీఁద గబ్బి చూపు చూచితిని- కపురుల నీ మనసు గలఁచితిని" (17-559)

47. కపురుమాయు : **రూపునశించు.**

"అపుడు వకావకలై పాశిమెల్ల

గపురుమాయుచు హల్లకల్లోలమైన" (అష్టమహిషీ.పు. 161)

"అరిపుల కపురుమాపెదనని గమకించు విధము" (అష్ట. పు. 259)

"కపురు" ప్రయుక్తమైన పదబంధ మిట్టిదే మరియొకటి—

లక్కపూతకపురులు : లక్కపూయఁబడిన బొమ్మలు - పైకి లక్క పూతతో గోచరించునవి. "పైని పటారము లోన లొటారము" అను సామెతలోని భావమిందు కలదు.

'వెక్కసపు ప్రియమది విరిగితే రోఁతలౌ

లక్కపూతకపురు లీలాగు లిటువంటివి" (2-178)

48. కమ్మటి : **క్రమ్మర, తిరిగి అనుటకు.**

"కలికి నీకాలు దొక్కి కమ్మటి నీకు మొక్కి" (17-298)

"కాలు దొక్కకుర నీవు కమ్మటి నవ్వకు నాతో" (17-165)

"పలికేవు కమ్మటిని పరాకు నయ్యేవు" (17-159)

49. కరికరించు : **ఇబ్బందిపెట్టు. బాధపెట్టు (?)**

కరికరఁబెట్టు, కరకరఁబెట్టు - ఇత్యాదిగా వీరి ప్రయోగములున్నవి.

"కరికరించగ రోట గట్టితే నప్పుడు మా

హరిగాఁడు కదా అడనున్న బిడ్డఁడు" (6-65)

'కరకరిఁబెట్టవుగా కప్పురపుటుండలు' (15-7)

బ్రౌను 'కరికరి - Anger, passion - చిరచిర, కరికరి పెట్టుట - To plague, harass' అని వివరించెను.

50. కవడువాయు : చీలిపోవు, వేరుగా నగు, జంట వాయు

"భావము సంసారపు బందెల దొడ్డిఁ బెట్టించె
తవి లింద్రియపు దాళ్ళు దామెనఁ గట్టె
యివల శ్రీ వేంకటేశుఁడింతలో దిక్కయి కాచె
కవడువాసె జీవుఁడు కన్నవారి చేతను"

తెలుఁగు నిఘంటువులం దీపదము కానరాదు. పదబంధపారిజాతము దీనిని పేర్కొనినది. కాని అందీయఁబడిన 'బాధానివర్తియగు' అను నర్థము గౌణమే కాని ముఖ్యార్థముకాదు. కవడు + పాయు - కవడు - కవలు - జంట అని, చూ. Kittle 'కవడు-కవల్-కవలు-a bifurcation, devided state' రెండుగా వేరుపడినవారే కవలు. ఇట జీవుఁడు పరమాత్మని యనుగ్రహమున కన్నవారిచేత కవడువాసెననఁగా వేరుపడి-ముక్తుఁడయ్యెనని భావము.

కవడువాయు పంటిదే 'కవలుపోవు' రూపము కూడ. చూ. పాండు. 2-19 "పాత మొనరించు తఱిఁ దోడుపడుగురునకుఁ, గవలువోకుండఁ బుత్తుఁ దోకలుప కంటి" పదబంధపారిజాతమీ రూపము నుదాహరించినది.

51. కసవు : గడ్డి

"కసవు కట్టలు వేసికదా గోవుల చేత
కొసరుచుఁ బాలు పిండుకొనేది" (2-290)
చూ. బ్రౌను- కసవు-grass, straw-sweepings

52. కూఁగు ; క్రుంగు

"పొద్దు పొడచుటయును పొరిఁ గూఁగుటయెకాని (7-37)

చూ. బ్రౌను-కూకులు an affix thus used పొద్దుగూకులు, కుంకులు.

53. కూగు-కూగూగు.

గోగో అని యరచు-కూగూగులు తాళ్ళపాకవారి గేయరచనారీతి

"కూగు = to cry aloud, to cryout కూగాడు, కూగ్యాడు. కూగు-కూకు - a cry, a clamour, a shout. తెలుఁగున నిది కూక అను రూపమున నున్నది. కూకపెట్టు. (చూ. కిట్టెల్ పదకోశము)

54. కెళవులు దొక్కు = నీచపడు (?) క్రిందికి దిగు. అవినీతికి పాల్పడు.

"పరకాంతల భంగపరచకుంటే మేలు
దొరకొని కెళవులు దొక్కకుంటే మేలు" (9-158)

శ. ర. లో కెళవు (= మూరము) అను రూపమున్నదే కాని 'కెళవులు ద్రొక్కు' లేదు. చూ. kittle "కెళగు" The State of being under, below, down or inferior.

55. కెలవాడి : (?)

ఈ పద స్వరూపమేమో స్పష్టముగ దెలియరాలేదు.
"రాగదే చూతఁడిదె రసికుఁడగు కెలవాడి
కౌగిటరమణి తోడ కనకగిరివాని-"
"దప్పిదేరంగ సైఁదపుఁగుడుములును వడలు
బప్పులును బన్నిటి పానకములు
అప్పుడగు కెలవాడి అదె కనక రాయఁడె
కప్పురము చల్లి చక్కని సతులపైని" (12-14)

పై కీర్తన మందలి పాఠభేదములు కొన్నిటిని పరిష్కర్తలు సూచించి యున్నారు. అందు పల్లవిలో 'రాగదవె సూతమ్మ రసికుఁడతఁడు' అని మాత్రమే కలదు. చరణమున 'అప్పు - కెలవాడి నదే - కప్పురము గురిసె వెంకట రాయఁడు' అని గలదు. పదబంధపారిజాతసంపాదకులు దానిని 'కెలవాడి' అనుపదముగా గ్రహించి 'కిలాడి - టక్కరి' అని యర్థమిచ్చిరి. ఖిలాడి - ఆటకాడు అను పదమున్నది. అందుండి 'కిలాడి' అను వ్యవహార మేర్పడి యుండును. మరి 'కెలవాడి' పదస్వరూపమెట్టిదో - అది నామవాచక రూపమో (కెల - వాడి ?) లేక క్రియావాచకమో (కెలవు - అడి ?) తెలియకున్నది. ఇంకను పరిశీలింపవలెను.

56. కెల్లురేగు : విస్తారమగు, వ్యాపించు, అధికమగు.

"అల్లుకొనె గర్మములు అక్కడికి నిక్కడికి
వెల్లివిరాయను మాయ వెనకా ముందు

కెల్లురేగి దేహమందె కిమ్ముల చుట్టరికాలు" (7-256) చూ. 'విజృంభించు' అని పదబంధపారిజాతము. ఈ 'కెల్లురేగు' వంటిదే 'కెల్లొత్తు' అనుపద బంధముకూడ. చూ. కిట్టెల్ - కెల్లయిసు = To Splinter, to be troubled, to be vexed.

"బయలుపందిరి కర్మబంధములు నీమాయ
నియమపుఁ బెనుగాలి నీమాయ
క్రియ నిసుకపాతర కెల్లొత్తు నీమాయ" (9-58)

పదబంధపారిజాతము దీనిని పేర్కొనలేదు. బ్రౌను 'కెల్లువారుట = to rush, to rejoice అను రూపము నిచ్చియున్నాఁడు. అతఁడిచ్చిన ప్రయోగములను బట్టి కెల్లువారు = విజృంభించు అను నర్థము పొసగుచున్నది.

**57. కేనము : అసూయ.**

"కేనమేటికిని" పరమయోగి విలాసము.

చూ. Kittle కేణ = Envy, grudge-నన్నెచోడకవి యీ పదము నీ యర్థమున ప్రయోగించి యున్నాఁడు. విశేషములకు చూ. తెలుఁగు మెరుఁగులు (పు. 110-)

**58. కొత్తలు :** నాణెములు.

"ముడుపులు జాళెలు మొగి దలమూటలు
కడలేని ధనము కొత్తలును" (?) (2-331)

బ్రౌను విశేషణముగా మాత్రమే 'కొత్త' శబ్దమును బేర్కొనెను. రూకలు మాడలు రువ్వలు మున్నగు వానివలెనే కొత్తలును నాణెములే.

**59. కొచ్చు :** తొలఁగు, తొలగజేయు ?

"మెచ్చరో మనుజులార మీరే హరికథలు
పుచ్చరో మీ మదిలోని పొరలెల్లను
కొచ్చరో మనుజులారా కోరికె లెల్లను-మీకు" (2-323)
'కోపమెల్ల గలిగిన-కొచ్చి శాంతమిచ్చుటకు' (7-196)

ఇట కొచ్చరో - తొలగఁజేసికొనరో అను నర్థము భాసించుచున్నది. కొచ్చి- తొలగించి.

"ఇచ్చకము నాతోనాడి యెంత నోరు నొచ్చెనో
కొచ్చియుండవయ్యా నీ చెక్కులు నొక్కెను"

ఇచట కొచ్చి = తొలఁగి అని తోచుచున్నది. ఈ ధాతువు శ. ర. లో కానరాదు. బ్రౌను గ్రొచ్చుట-గొచ్చుట, = త్రవ్వుట అను నర్థమున నారోపము లిచ్చెను. కాని దానికిని దీనికిని సంబంధమున్నట్టు కానరాదు. గ్రొచ్చు-గొచ్చు వేరుగను, కొచ్చు వేరుగను తోచుచున్నది. చూ. కిట్టెల్. కొచ్చు = to cut away, up or to pieces.

60. **కొలికి** : కంఠస్వరము ?

"నిలువు బులఁకలచేత నిలువెల్లఁ బూజించె
నెలత చనుదోయి క్రొన్నెలలఁ బూజించె
మనసు గోరికల కళ మర్మములఁబూజించె
గొనకొన్నరతుల చేఁ గొలికి పూజించె" (4–80)

చూ. బ్రౌను 'కొలికి - In poetry కొలికి means voice as Kark and ABA declare that చిలుకలకొలికి is the same as శుకవాణి Sweet voiced.

61. **కోగిలి** : కోయిల

"వనము కోగిలి వైతి వామనా నీకు, వనితలు బాగింతే వామనా", (2-253)

62. **కోడతిరునాళ్ళు** : కోడై, కోడె = వేసఁగికాలము.

కోడ తిరునాళ్ళు = గ్రీష్మోత్సవము. తిరుపతి శాసనములందీ ప్రయోగము కలదు.

63. **కోడె వయసు** : యౌవనము. పడుచుదనము.

"కోడెవయసు కొమిర లేమల, వాడికకు దేను పసమా" (14-28)
"కోడె వయసున నింతి కోరికల నందినది"

కోడెకాడు కోడెవిటులు మున్నగు ప్రయోగములు పురుషపరముగ ప్రసిద్ధములే. క్రీడాభిరామమున "కామాంధల్"అని గలదు. స్త్రీ పరముగ తాళ్ళ పాకవా రీపదమును ప్రయోగించి యున్నారు "కోడె కత్తె" రూపము గూడ వీరికభిమానమే.

64. గచ్చు–గచ్చులు :

పైపూతలు-గోడమీఁది పూతలు-లాక్షణికముగా పనికిమాలినవి, యథార్థముగానివి అని అర్థము తోచును.

"గచ్చువంటి యిహమింతే గని వంటి పరమింతే
ముచ్చట కిందుకు తుదమొదిలున్నదా" (11-158)

గచ్చు = గోడమీదిగార. ఇహము పనికిమాలినది. నిస్సారమైన దనియు-పరము గనివంటిదనియు భావమగును.

65. గజరు : ఉమటు, మదము.

"మానైననాటి నీ మదమెల్ల దిగవలె-
కలికైన నాటి నీ గజరెల్ల విగవలె" (6-345)

గదరు = గదడు = The fetid smell of cattle urine, the smell of sheep-disagreeable smell (చూ. కిట్టెల్-పదకోశము)

66. గరివడు : చిక్కుపడు-తగుల్కొను ?

"తెలిసియుఁ దెలియను తెగదీ చిక్కేమిటాను
కలికాలమిందుననే గరివడె బ్రదుకు" (9-109)
"కన్నులనీ చూపులకే గరివడఁబులకించె" (14-192).
"తిరువేంకటాద్రిపై దేవుని గొలువక-
గరివడే భవమెల్ల కర్మశేషం" (11-347)

ఈ ప్రయోగములందు తగుల్కొను చిక్కుపడు అనునర్థములు సరిపడునని తోచును

పదబంధపారిజాత మిదే ప్రయోగము నుదాహరించి "నిలచిపోవు, గడ్డకట్టు" అని యర్థము లిచ్చినది. చూ. గరవడు = గడ్డకట్టు. శ. ర.

67. **గుడికొను** : పరివేష్టించు, చుట్టుకొను.

"గుడిగొనె నీ బ్రతుకు గోవిందరాజా" (7-130) "గుడిగొన్న యేరెంత కొంకరవంకరలైనా, పుడమిని లోఁ గొనకపోవు నటయ్యా" (7-273) వ్యాపించు అని పదబంధపారిజాతము యీ పదమున కర్థమిచ్చినది.

68. **గుడ్డము** : కొండ.

"గుడ్డముపైనున్న కోనేటిరాయుని" (3-379) శ. ర. ఈ యర్థమును పేర్కొనలేదు. గుడ్డము = A plot of land, part of a field-కాని తాళ్ళపాకవారి ప్రయోగము కొండ అను నర్థమున గలదు. చూ. Kittle గుడ్డ = A mountain-గుడ్డగాడుజన-Jungle people.

69. **గుల్ల సేయు** : పొడిసేయునిరుత్సాహపరచు? బాధించు ?

"మంచి మాటలేకావా మక్కువలు పుట్టించేవి
పొంచిన సిగ్గులె కావా పొడిసేసేవి
మించుమురిపాలె కావా మిగులం జొక్కించేవి
కొంచని బీరాలె కావా గుల్ల సేసేవి" (3-132)
పదకోశము లీ పదమును పేర్కొన్నట్లు కానరాదు.

70. **గొంజె గొడుగులు** : దేవుని గొడుగులు.

"విఁజామరులను విసనకర్రలును, గొంజె గొడుగులే కొండెల్ల" (2-119)

ఆతపత్రమని పదబంధపారిజాత మర్థమిచ్చినది. గొంజె గొడుగులు చిన్నవికాక పొడుగాటి స్తంభములపై నిలచినవి. ఆ గొడుగు కంబమును ఆలయ పరిచారకులు నడుమునకుఁ జుట్టిన గుడ్డల మోవున బొడ్డుకడ నానించుకొని నిలుపుదురు. గుంజగలగొడుగు గుంజగొడుగు. అదే గొంజె గొడుగయినదా ?

71. **గొడ్డేరు-గొడ్డేరగు** : వ్యర్థము, దండుగ, నిరుపయోగమగు.

"గొడ్డేరే చిన్న దిడ్డి తెరువువొక
దొడ్డతెరువు వంక తొలఁగుమీ" (2-89)
"జడ్డులేని హరికథ చవిలేకుండిన నిట్టే
గొడ్డేరే గొడ్డేరే గొడ్డేరే సుండి
"వడ్డివాతె వలపుల వన్నె వెట్టి నేరనే
గొడ్డేరే గొడ్డేరే గొడ్డేరే సుమ్మీ" (3-439)

"బొడ్డున బుట్టిన పూపనికె నిన్ను

గొడ్డేరి తెస్తినే కోడల" (3-379) తుది యుదాహరణము లక్ష్మీసరస్వతుల సంవాదమందలిది. లక్ష్మి సరస్వతితో ననినది. గొడ్డేరి తెస్తినే = దండుగగా తెచ్చితినే, అని తోచుచున్నది. పదబంధపారిజాతకారులు "గొడ్డేరితెచ్చు = ఒక నిర్దిష్ట లక్ష్యముతో తెచ్చు, అని పై ప్రయోగమునే యుదాహరించి వివరించినారు. ఇట నిర్దిష్ట లక్ష్యముతోఁ దెచ్చు అనుటకన్న వ్యర్థముగా, దండుగగా, మోసపోయి అను నర్థములే చక్కగా పొసగును.

చూ. చాటువు- "బొడ్డుపల్లెను గొడ్డేరి మోసపోతి,
నెట్టు చెల్లింతు టంకంబు లేదు నూర్లు"
గొడ్డేరి = దండుగై, వ్యర్థమై అని యర్థమగునని తోచుచున్నది.
"ఏలా బిడ్డలులేని యీ బ్రతుకు గొడ్డేరయ్యె జింతింపఁగన్"
(కవికర్ణ 1-38) వ్యర్థమయ్యె ననుటకు.

పై చాటు పద్యమునే యుదాహరించి "గొడ్డేరుట = to rent or farm గుత్త చేసుట, అని బ్రౌను వివరించుట పరిశీలింపఁదగి యున్నది. చూ. కిట్టెల్ పదకోశము. గొడ్డు = sterile, being sapless, Nonsense, vain. గొడ్డు మాతు = a vain word.

72, గొరబు[1] - వింత ; వికారము.

"కొత్తలాయ నీ బ్రతుకు గోవింద రాజా,
గొరబాయ నీ బ్రదుకు గోవిందరాజా" (7-130).
"గొరబై మొదలుండగ గొనలకు నీరేల" (7-172)
"యిరుగు వారెరుగరు పొరుగు వారెరుగరు
గొరబైన మాటలు గొణగుచు నుందురు" (7-260)
నీ గొరబైన వెడబుద్ధి' (10-110)
"గొరబుగ నన్ను నేల కొంగువట్టేవయ్యా" (13-161)

---

1. "గొరబు = గోరబు, గొరగు అని కన్నడము a cloak made of leaves of grass అని కిట్టెల్. వికారవిశేషము వేషము ఇత్యాదికావచ్చు". (-సందిగ్ధ పదసమీక్ష 22 సం॥).

'మంతనాన నీతో మనవి చెప్పేవేళ
వింతసేయ వద్దుగాని పేనులొగ్గవచ్చును' (13-142)
'గుదికొని కామిని గొరబుసేతురా' (15-239)
గొరబుసేయు = వింతసేయు, వింతగ ప్రవర్తించు (?)

73. **గోదిలి** :

పశువులశాలలో నటునిటు పశువులను గట్టుట కనుకూలముగా నడుమ నుండు గాడి.

"గోదిలికడు నుంగుటకు నెక్కుటకు
యీదెస కడు విజ్ఞానమే కలది" (10-7)

ఈ పదము తెలుఁగు నిఘంటువులందు కానరాదు కర్ణాటక నిఘంటు కారుఁడీ పదము నిట్లు రూపాంతరములతో వివరించెను. గోద్లి, గోదిలి, గోదలి. గోదలె, గోదలు, గోదణ - (go - tana = tanavu ?) గోదలి, గోదలు, గోదిలి, గోద్లి "A sort of long crib made of planks (occasionally of mud) along which on bothsides cattle are tied" చూ. kittle.

తాళ్ళపాకవారి ప్రయోగ మీ కర్ణాటకకోశార్థమునే స్ఫురింపఁ జేయు నదిగా నున్నది. ఇటు క్రుంగుటకు, నటు యెక్కుటకు నడుమ విజ్ఞానమే గోదిలి - యని భావమగునేమో.

74. **గోరుపదము** : కంబళి (నల్లనిది)

'కొత్తకోక నల్లనైతే గోరుపదమన లేవు' (3-100)

75. **గోరుపోవు** : తప్పిపోవు, పొల్లుపోవు.

"మాట గోరుపోయీనంటా మౌనాన నుందువుగాని
నీటున ముచ్చటాడకు నేమానరా' (3-518)

పదబంధపారిజాతమునందుకూడ నీ పదబంధము కానరాదు. శ. ర. బౌ్రఢ్యము లందులేదు.

76. **చండ** : పోట్లాట, (శండై అని తమిళము)

'చలము సాధించి వాఁడె చండకు వచ్చి యుండఁగా,

తలవంచుకొమ్మనేవు తగునే నీకు' (3-574)

77. చప్పుచారుసేయు - సప్పుసారైపోవు [1]:

సారముపీల్చి పిప్పిసేయు, చప్పనిపిప్పియగు - నిస్సారమగు.
'పూరకైన పట్టి తేనెలూరు మాటలాడి చప్పు
చారుసేయవద్దు గాని చపిగొనవచ్చును' (13-142)
"కవకవ నవ్వినవ్వి కన్నులు తేలగిలగ
సవరన్నియాట దెల్ల సప్పుసారైపోయను" (12-15)

78. చదురుఁడు - చదురాలు : నేర్పరి (పుం), జాణ (స్త్రీ)

"చదురుఁడవు నిను బాయజాల వొకమారు" (12-70)
'సాహసములేదురా చదురాలికిపుడు' (12-71)

చూ. 'జగముల గలిగించు చదురులాఁడు' భోజసుతా. 1-25. పద బంధ. పా.

79. చాగతగొను : అదుము, గట్టిగా నొక్కు ?

'మెదిచి—చాగతగొని మెడవల్లె వైచి (అష్టమహి పు. 2-57) పదబంధ పారిజాతము చాగరగొను : చంపు' అను పదబంధము నిచ్చినదే కాని దీనిని పేర్కొనలేదు. చూ. బౌ్రను చాగ = దృఢత్వము.

80. చింతాయకుఁడు : చింతలను బావువాఁడు, ఆపన్నివారకుడు.

'శ్రీరమణుఁడే చింతాయకుఁడేని
వూరకవుండుట వొక సుఖము.' (9-256)
'శ్రీవేంకటేశుఁడ నీవే చింతాయకుండవు
కావించేటి నా వుద్యోగము లేమి బాఁతి' (9-98)
'చింతాయకుఁడగు హరి చిత్తములో నుండఁగాను' (8-190)
ఈ పదమును పదకోశము లేవియుఁ బేర్కొనినట్లు కానరాదు.

---

1. "చప్పుచాడు - శప్పుచ్చవట్ = నిస్సారము, నిస్సారభూమి అని తమిళము. చప్పుచాడు - దాని వికారము కావచ్చు - 'సన్నలఁబరచి చప్పుచాడు సేసితివి' (20-94)" సంద్గపదసమీక్ష 20 సం.

81. **చిందువందురు** : చిందరవందర యనుటకు.

"అట్టునిట్టుం జిందువందురై యుండంగా"
'చిందరవందరగాక చేతికి లోనయ్యీనా' (2-159)

82. **చేముంచి**[1] :

చేముంచి = నిజముగా, ప్రమాణముగా, యథార్థముగా అనునర్థమున ప్రయోగించినట్లున్నది.

'చేముంచి గుత్తిలోవెలసిన రఘురామా' (9-210)
'చేముంచి నీమోముచూడ సిగ్గయ్యీ నాకుఁ' (17-519)
"చేయించి యిందరిలోన జితేంద్రియుఁడఁగాను" (8-181)
"చేముంచి ఆకారణము చెప్పఁగలవా ?" (14-249)

సత్యమును ప్రమాణపూర్వకముగా వాక్రుచ్చ వలసినప్పుడు సలసల క్రాఁగునూనెలో చేతిని ముంచియు విషసర్పాదులున్న కుఁడలలో చేతి నుంచియు, ఎఱ్ఱగాకాల్చిన యినుప కడ్డీలను చేతితో ముట్టియు ప్రమాణము చేయుట ఆనాటి ఆచారముగ తెలియుచున్నది. దాని మీఁద చేముంచి = ప్రమాణముచేసి, సత్యముగా అను నర్థమున నీ ప్రయోగ మేర్పడినట్లున్నది.

83. **జంగిలివాఁడు** : పసులకాపరి.

"పూరెపసులను మేపి వొప్పగించి యిండ్లకు
చేరి జంగిలివాఁడు నిశ్చింతుఁడై వుండు"

శ. ర. లో జంగిలి = గోసమూహము' అను పదము గలదు. కాని 'జంగిలిఁవాడు' లేదు.

84. **జవళి** : జమలి, జంట.

"చెపులార వినెంగాని చెప్పుమా నాకీ సుద్ది
జవళి వలపులిట్టె చల్లుదురా" (3-94)

---

2. "చేముంచి-'తలమున్కలు' వలె పూర్తిగ పనిలోదిగి అనునర్థమున ప్రయోగించినట్లున్నది" (సందిగ్ధ పదసమీక్ష. సం. 22)

'జవళి నిమ్మపండ్లు సరిం గానుకియ్యవే
అవి నా చన్నులఁ బోలునని తలంపయ్యోగాని' (8-177)

ఇట జవళి వలపు = రెట్టించినమిక్కుటమగు వలపు. పదకోశములు జవిళి-కొత్తవస్త్రము Cloth అని యర్థమిచ్చినవి. జమలి అను పదమునకు రూపాంతరముగా 'జవళి' అని తాళ్ళపాకవారు ప్రయోగించియున్నారు. ప్రయోగములు ప్రాసస్థానమున గలవు.

85. **జిగురుఁగండె :** జిగురుపూసిన నూలిచుట్ట, జిగురుపూసిన కట్టెపుల్ల.

'కులధనములతో జిగుఁరుగండె నీ మాయ
నిలువని పూరగాయ నీమాయ' (9-58)

చూ. బ్రౌను - జిగురుగండె - n. s. bird lime జిగురుగండెలు- limed twigs to catch birds.

86. **జూటరి :** మోసగాడు, వంచకుఁడు

'జూటరై వొకడు నన్ను సోకనాడితేను'
శ. ర. జూటు = మోసము అను పదమునుమాత్రమే పేర్కొనినది.
'సొలసి కపటమైతే జూటుదానను' (15-3)

అని వీరిదే మరియొక ప్రయోగమున్నది. చూ. బ్రౌను జూటి-Cunning. kittle- జూటుతనము-(K) Cunning craft.

87. **జోతాలు :** దండాలు, పరమయోగివిలాసమున ప్రయోగమున్నది.
చూ. బ్రౌను జోదిల్లు - A Kind of Salutation.

88. **తరువలి :**

''ఘనయాచకునకు కనకమే బ్రహ్మము
తనువే బ్రహ్మము తరువలికి'' (5-282)

యాచకునకు కనకమే సర్వస్వము. అట్లే తరుణవయస్కునకు తనువే సరస్వమని యర్థము కాఁబోలును. చూ. కిట్టెల్ పదకోశము. తరువలి A boy,

a girl - తరళ, తరుళ - తరువలితన Childishness. బ్రౌను-తరువలి-
a lathe ? sword అని అర్థమిచ్చెను.

89. **తాయిమక్కళాలు :**

(తాయి) తల్లి + (మక్కళ్) బిడ్డలు. తల్లీబిడ్డలాట.
దోబూచులు, దాగుడుమూతలు అను నర్థమున.
'ఆయలేరే యేమిచెప్పిరాతని సుద్దులునాకూ
తాయిమక్కళాలెకాక దయగద్దా తనకు'. (4-115)

90. **తీలు** : కీడు, చెఱుపు, తక్కువ (దనము.)

"మేలెల్ల నొక్కటే మిఁచు తీలూ నొకటే (10-37)
'తెట్టలై మేలొకటికి తీలొకటి కాయ' (8-14)
'అయ్యో నేనేఁ అన్నింటికంటెఁ దీలు (6-80)
"కొలుపుచు దినమూ నీ కొండ మీది నాయకులు
తీలుపరచేరు గాదే తిమ్మినాయుఁడా" (11-2-41)

మేలునకు వ్యతిరేకార్థమున తీలు ప్రయోగమున్నది. తీలుపడు క్రిందపడు (7-16) తీలు పరచు = క్రిందు పరచు.

91. **తెంకి** : **స్థానము, చోటు** "తెంకికి నుప్పరిగెమీఁదికి రమ్మ నేవు"

చూ. బ్రౌను - తెంకి dwelling place సూర్యరాయాంధ్ర నిఘంటువున తెంకి - స్థానము కలదు.

92. **తోదోపు : తోదోపులాడు.**

తోపు + తోపు - తోదోపు.
"దూపయు నాఁకటికిఁగా తోదోపు మాకిఁక వద్దు" (9-197) - ఒత్తిడి అనుటకు.
"తోదోపులాడుచుఁ దొలఁగక నంత" (పరమ) - త్రోపులు త్రోసి కొనుచు.

ఇట్టివే వీరి పదబంధములు"తో తొక్కులాడు".(తొక్కులాడు + తొక్క

లాడు. "తో తో", 'తోడ తోడ', "తో తోయ"(తోయ+తోయ)[1] మున్నగునవి గలవు.

**93. దావతి - దావతిపడు :**

తొందర, శ్రమ - తొందరపడు, ఆరాటపడు - శ్రమపడు.

"దావతి అతని యాజ్ఞ దాటనియ్యఁడు" (2-160)
"దావతి లేని యట్టి తన జన్మము" (5-255)
"వరుస దావతిపడి వచ్చేవట" (2-31)
"దావతివడక నీ దాసులకు (2-356)
"దావతివడి వారి తిరువగను" (3-18)
"ఏవీ నుపాయాలు గావు యెక్కువ భక్తెకాని
దావతి బడక యిది దక్కితే సులభము" (6-49)

పై ప్రయోగములందలి దావతి - దావతిపడు అను పదములకు త్వర-త్వరపడు, ఆరాటపడు, ఆయాసపడు అను నర్థములు పొసగుచున్నవి. సంస్కృతమున ధావనం - గమనమ్ అను దానిపై నేర్పడిన రూపముగాఁ దోచుచున్నది. చూ. సూ. ని. ధావిత, ధావకుఁడు, ధావత్-నేఁటి వ్యవహారమున "ధావంతంపడు" అని పై ప్రయోగ రూపము కాననగుచున్న దని పదబంధపారిజాతమున గలదు. అందు దావతిపడు - అత్యాసక్తిచెందు అని యున్నయర్థము గౌణార్థమేకాని ముఖ్యార్థము కాదు. (చూ. కిట్టెల్ పదకోశము - దావతి = దావన్త Labour, toil, Pains, exertion, trouble, grief - దావతిపడిసు = to Cause or give trouble, దావతిమాడు = to exert ones self, to take pains.

**94. దాయిదండ : దాపుదండ.**

దాయి (క) = తాయి (త) = తల్లి. దండ = ప్రాపు, రక్ష

---

1. "తోయము = తడవ అని శ-ర. దానికి ద్విరుక్త రూపము - మాటి మాటికి అని అర్థము- ఉదా: "నీతిలేని మంకుదాన నీవు చెప్పిన పనులు - తోతోయ నీ పాదమునఁదోసితిఁగా నేను"(22-120) (సందిగ్ధ పదసమీక్ష. సం. 22)ఇచ్చటను "తోతోయ" = ఒక్కతోపు తోయునట్లు అనునర్థమే భాసించుచున్నది.
చూ. "తోపునఁబాదాన నిన్నుఁదోయఁగాను" (22-120)

దిక్కు, తోడు, దాయిదండయి = తల్లి తోడు అయి.

"తలినెవ్వరికెవ్వరు దాయిదండయ్యేరయ్యా
అతివ నీకుఁగాఁగ నాయఁగాక" (14-284)

దాపు = సమీపము, దండ = రక్ష - దాపుదండ = దగ్గరి దిక్కు

"అల దాపుదండకు నీ యర్చనే చాలు" (7-248)

"సమర విజయమైన శార్ జ్గాది శరములు
తమితోడ మాకు దాపుదండై వుండుఁగాక" (6-101)

దాపుదండకు = వెన్నంటి కాపాడుటకు.

95. దుత్తెడు - దుబ్బెడు:

దుత్త = చిన్నబుంగ అని శ.ర

దుబ్బి (క) = an earthen oil vessel with a capacious body and a long, narrow neck (చూ. కిట్టెల్ పదకోశము.)

తాళ్ళపాకకవులు పాలదుత్తలను, చల్లదుబ్బ - వెన్నదుబ్బలను పేర్కొన్నారు.

"అలదొడ్డివారము నే మంతేసి యెఱఁగము
పాలదుత్త దుత్తెఁడేసి పట్టవయ్య వలపు" (13-180)

పాలదుత్త దుత్తెఁడేసి = పాల దుత్తతో ఒక దుత్తెడు అనుటకు.

"గొల్లెతల మెఱఁగము గొప్ప జాణతనములు
చల్లదుబ్బ దుబ్బెఁడేసి చల్లేము వలపు" (13-180)

చల్లదుబ్బ దుబ్బెఁడేసి = 'చల్ల దుబ్బితో దుబ్బెడు' అనుటకు.

ఇట్లే ఇందు "వెన్నచిట్టిఁ జిట్టెఁడేసి", "పెరుగుచిప్పఁ జిప్పెఁడేసి" అని యున్నది.

96. దేహారము : దేవగృహము.

"లింగములేని దేహరములు లెక్కలేని ప్రియములు" ప్రయోగాంతరములకు హరవిలాస, కాశీఖండములు చూడఁదగును. ప్రౌఢ్యమునందుకాని సూ ని. యందు గాని యీ పదము కానరాదు. Kittle దేహర-దేహలి Threshold of a door అని పేర్కొనినాఁడు.

చూ. దేగల(=దేగుల-దేవకుల అనుటకు తద్భవరూపము-A temple). దేవగేహ(=a temple) రూపములు గలవు.

97. **దొండి(త)** : రంధ్రము.

"దొండ్లు వొడిచి" (10-161)

98. **దోమటి, దోమట్లు**[1]: **దోమటిదొడుకు.**

"దోమటి రతులలో" (3-120)
"గొల్ల దోమటి చేసిరి గొల్లెతలందరును" (3-135)
"దోమటి నింతెరగరా" (7-181)
"దోమటి మరుబలము దొమ్మె మ్రొనట్లున్నది"
"దోమటి కర్మలు చేసి తుదకెక్కేవాఁడనుగాను" (8-181)
"మటి యేటి సుద్దులు మమ్మడిగేవు నీవు
మొఅసి మీ యిక్కువలు మించెను దోమటై" (14-174)

సూ.ని.లో "దోమటి=అన్నము. చి. ని., శ.ర. ఈ క్రింది ప్రయోగము లనుబట్టి ఔపవిభక్తికముగాఁ దోఁచుచున్నది. కాని ప్రథమాంత రూపమునకు ప్రయోగములు కానరావు"అని వివరింపఁబడినది.

కాని, తాళ్ళపాకవారి ప్రయోగమునుబట్టి 'దోమటి'పదమునకు అన్నము అను నర్థము పొసగదు. అర్థ మింకను విచార్యము.

99. **ననుచు** : ప్రియమగు.

'ఎనలేక శ్రీ వేంకటేశ నన్ను గూడితివి
ననిచితి నిది నీకు నయమే కదా' (17-197)
'ననుచని వొట్లకు నవ్వినదే మోహము' చూ. సూ. ని.

'ననుచు-అనురాగమొందు, అనురక్తుఁడగు' అనుటకు ప్రయోగములు చూపఁబడినవి.

---

1. "దోమటి దొడుకు అను ప్రయోగము శబ్దపల్లవమువలె పలుచోట్ల నిందు కాన వచ్చుచున్నది." (సందిగ్ధపద సమీక్ష సం. 19.)

100. **నాము-నామెక్కు** : మాత్సర్యము, చలము వహించు.

"వెసఁ దెరమరుగైతే వేగమె నామెక్కఁగాక" (7-56)
"నాములెక్కఁ బంతములు నాలిసేయ నిక నేల"(15-237)

బ్రౌను నాగ్నజితీ పరిణయమునుండి "నిండారు నాముతో బండి రక్కసుఁడు" అను ప్రయోగమిచ్చి 'నాము అనఁగా Malice చలము అని తోఁచినది' అని వివరించినాఁడు. మిగిలిన పదకోశములం దీయర్థ మెచ్చటను వివరింపఁబడి యుండలేదు. తాళ్ళపాకవారి ప్రయోగము పై యర్థమునే స్ఫురింపఁ జేయునదిగా నున్నది.

101. **నిట్టపిడి** : పైకెత్తి నిట్టనిలువుగ పట్టిన పిడి.
'నిట్టపిడి సేసేపు నేడూను' (11-2-54)

ఉద్దవిడి-ఊర్ధ్వపిడి-వలెనే నిట్టపిడి ప్రయోగముకూడను. పదకోశము లీ పదబంధమును పేర్కొనలేదు.

102. **నీలములు, నీలాలు** : (తల) వెంట్రుకలు.
"తల నీలములు దించి తగువారి సిరులు
తలకెత్తియనుచు వింతలయెమ్మెకాడు"
పదకోశము లీ యర్థమును వివరించియుండలేదు.

103. **నుసికిలు** : జారు-అంటియు నంటనియట్లుండు ?
"చెనటి యే పుణ్యమైనజేయని యోగీశ్వరుఁడు
నూనెగొల్పిన కుంచమై నుసికిలును" (8-375)

పదకోశము లీ పదమును పేర్కొనినట్లు కానరాదు. నూనెకొల్చిన కుంచము నూనె నంటించుకొనకుండుగతి నంటియు నంటని యట్లుండునని భావమేమో.

104. **పంగించు** : ఎత్తిపొడుచు నిందించు.
"యెంగిలి మోవితోడ నేమి మాటలాడినాను
పంగించె యెంతైనానంటు పాయదంటాఁజుమ్మీ" (14-249)
"చెలిమినీతోనింకా జేయవచ్చితేఁ గనక
పలుమారు నీ వపుడు పంగించరాదా" (17-234)

"జాటుదనాల వాఁడవు సుగ్రీవ నారసింహా
పాటించి నిన్ను నేము పంగించె వారమా" (10-164)

పంగించే వారమా. నిందించేవారమా, అని యర్థము. పదబంధ పారిజాతమున "అని పఁగించిన వాని నప్పటికి నిష్టాలాపముల్వల్కి నేర్పున గోపంబుడిగించి' (దశమ - 10-90 ?) అను పద్యపాదముదాహృతమై, "వెనుక చేసిన పొరపాట్ల నెత్తిచూపి యేడిపించు" అని యర్థము వ్రాయఁబడి యున్నది. [1]

105. పంగెము : స్వాధీనము, సంబంధము అనుటకు. వీరినే మరికొన్ని ప్రయోగములు చూడఁదగును.

"పొలుమాలె ఇంద్రియాల పంగెమాయ బదుకు" (7-163)
'భావము చంచల మనసు పంగెమె యెపుడు' (7-174)
పంగెమను పదమే 'పాంగెము' అనియు కానగుచున్నది. అర్థమదే.
'బచ్చెనల నతడు నీ పాంగెములోవాఁడై
నెచ్చెలి నీకు గొంకితేనే నీకు నెలతునా' (17-194)

106. పంగమైనవాఁడు: లోఁబడినవాఁడు, సంబంధించినవాఁడు.

"పాయని సంసారానకు బడిపనివాఁడను
కాయపు భోగాల పూడిగపువాఁడను
పాయపు మదములకు పంగమైనవాడను' (7-246)

పంగెము - స్వాధీనము సంబంధము అను నర్థమున నున్నట్లున్నది. చూ. బ్రౌను పాంగెము - పాంగ్యము = Connection, relationship. heirship బాధ్యత, పాంగ్యస్థుఁడు = Cousin, hier - బాధ్యస్థుడు, చూ. శ. ర. పాంగెము = సంబంధము.

---

1. 'పంగించు = కోపగించు అని సూని. పంగెన = ఓదము అని శ ర. చెప్పి పొడుచు అను నర్థముగ దోచుచున్నది. 'బలే పంగిస్తాడు' 'నీపంగెనలు నాకెందుకు' ఇత్యాది. ''భంగించి' శబ్ద భవముకావచ్చు' (సందిగ్ధ పదసమీక్షసం20).

107. పన్నారు[1] : కుండ.

"పన్నారు వొంతుల పాలుం బెరుగులు" (10-288)

చూ. బ్రౌను - పన్నారు. A pot or vase.

108. పఱచ : ధూర్త.

'పఱచైన జవరాలు పరులెల్ల మగలంట
వొఱపు నిలిపిన ట్లో హో నేము' (2-94)

చూ. పాండురంగమాహాత్మ్య ప్రయోగము "పఱచనై సంతోషపరచనైతి".

109. పల్లించు : ఆయత్తముచేయు - సాధించు, దిద్దు.

"పల్లించిన నీ పసిడి గరుడనిని - కెల్లున నీ వెక్కిన యపుడు" (11-3-20)

"తొల్లిటి జన్మములగాని నరరూపు - పల్లించుకొన్న యీ బ్రదుకు"

బ్రౌను "అత్తరిన్ తత్తరంబున తత్తడిన్ పల్లింపక అనగా గుఱ్ఱానికి జీను కట్టింపక" అని అర్థమిచ్చెను. పై ప్రయోగమున నరరూపు పల్లించుకొన్న = నరరూపమును సిద్ధింపజేసికొన్న - సాధించుకొన్న అను నర్థముతోచుచున్నది. అట్లె తత్తడిన్ పల్లింపక - గుఱ్ఱమును ఆయత్తముచేసికొనక అని భావము కాదగును.

110. పాగు - పాగిన : [2] అనురూపమగు, యోగ్యమగు.

'ఇంతకాలమిట్టైనింద్రియముల పాగిన తలపు' (10-77)
"పాగిన జాణద నాతోఁబలికి మెప్పించరా" (17-217)
'పాగిన తమకములు పట్టఁగలేక'

పాంగు = Manner, form, shape, fitnes, propriety, agreement, beauty, resemblance — (చూ. కిట్టెల్ పదకోశము)

---

1. "పన్నారు కాగులలో పన్నరులు = చిన్న పాత్రలు కాగులు పెద్దవి" (సందిగ్ధ పద సమీక్ష సం. 20)
2. 'పాగిన - పాంగు అని తమిళశబ్దము. క్షేమము అని అర్థము; ఇక్కడ క్షేమంకరమైన అని అర్థము కావచ్చు. తెలుగు 'బాగు' కూడ నిదియే కావచ్చు. అరసున్న లేకుండుట విచార్యము'. (సందిగ్ధ పదసమీక్ష. సం. 22).

ఈ పదమును పదకోశములు పేర్కొన్నట్లు కాసరాదు. పాగు - అనగా ఇంగితమని తోచుచున్నదని బ్రౌను వివరించెను. పాగిచిక్కు = పల్లచిక్కు అని పదబంధపారిజాతము.

**111. పాటము — పాటమగు :** వల్లెవేయు పాఠము - నోటికివచ్చు.

"పంచల నీ మున్ననలు పాటమూయెగదరా" (14-122)

**112. పానిపట్టి - పేనిపట్టి[1] :**

పేని - పురియెక్కించి - పట్టి అని యర్థమేమో. పేనిపట్టి-చిక్కగాఅల్లి దృఢముగా పట్టి. లేక 'పనిపట్టి' అనియో. ఈ రెండు రూపములును వీరు ప్రయోగించిరి.

'పానిపట్టి హరి యది పరిహరించనివాఁడా
అనుక హరిదాసుల కంతటనే భంగమా' (8-245)
"పానిపట్టి సర్వవిధబంధుండు విష్ణుఁడుండఁగా" (16-1-55)
"పేనిపట్టి యిందుకేల పిలచేవు నీవు" (13-128)
"పేనిపట్టి వచ్చిగాని పిల్వరేవాని" (17-188)

**113. పాలార్చుట[2] :** చన్నిచ్చుట — ఉగ్గుపెట్టుట. హితమైన ఆహారమొసగి పరిరక్షించుట.

"పాలార్చి తొట్టెలలోఁ బండబెట్టి యశోద
నీలవర్ణుఁ దొంగిచూచె నిద్దురోయని" (10-258)

ఇట పాలార్చి = పాలిచ్చి, చన్నిచ్చి, అని యర్థమగుచున్నది. వ్యవహారమున పట్టిపాలార్చుట - నాశముచేయుట, ఇబ్బందిపెట్టుట అను నర్థమున నొక

---

1. "పానిపట్టి - పనిపట్టి అను శబ్దమునకు జారుగ వాడిన వ్యావహారిక రూపమా? అనిపించుచున్నది." (సందిగ్ధ పదసమీక్ష, సం. 22)

2. "ఇంతిబెట్టుకొని మమ్ము పాలార్చవయ్యా (10-112)
"బిగివాయనెట్టువచ్చు పాలార్చగాను" (19-475)
"పట్టముగట్టి నన్నెంత పాలార్చినా మంచిదే" (19-498)

"పాలు+ఆడించు=పాలార్చు. తన పాలిదిగాచేయు అను అర్థము సరిపడును" చూ. సందిగ్ధ పద సమీక్ష 19 సం॥

పదబంధమున్నది. ఉగ్గు త్రాగక మారాముచేయు పసిబిడ్డను కాలుచేతులు పట్టి బలవంతమున త్రాగించుటయే తరువాత ఇబ్బందిపెట్టుటగా మారినదేమో! పద బంధ పారిజాతమున పాలార్చు - పోషించు అను నర్థమున్నది.

పాలార్చి వెడ్డువెట్టుట : హితమైన ఆహారమిచ్చి పోషించుట.

"మతిలో శ్రీ వేంకటేశమని కైన వాఁడ నింతే
తతి నా పాటుకు దయదలఁచవయ్యా
యితవై పనిసేసేటి యింటిపసురమునకు
వెతదీరఁ బాలార్చి వెడ్డువెట్టుఁదగదా!" (5-237)

పై ప్రయోగమునే చూపి పదబంధపారిజాతకారులు "పోషించు" అను నర్థ మిచ్చియున్నారు. "పాలార్చి వెడ్డువెట్టుట" అను జాతీయమునకు కేవలము "పోషించు"అని కాక "ఆహారమిచ్చి రక్షించు" అని యర్థము గాఁదగును. ఇట వెడ్డువెట్టుట-కాపాడుట అను నర్థమున ప్రయోగమున్నది. చూ. "వెడ్డువెట్టి పెంచే వాఁడు వీరితోవాఁడా" (9-56)

"చీమ గుట్టెనని తన చెక్కిటఁ గన్నీరు జార
వేమరు వాపోయేవాని వెడ్డువెట్టరే" (11-2-20)

పదబంధపారిజాతము "వెడ్డువెట్టు" అను పదబంధము నీ యర్థమున సూచింపలేదు. వెడ్డువెట్టు-వంచించు అని బౌర్భిణ్యమునగల యర్థమును మాత్రమే పేర్కొన్నది. ఈ యర్థమునను వీరి ప్రయోగము లున్నవి.

'అడ్డపు దెరువుల నటునిటు చుట్టాలు
వెడ్డువెట్టుచు నిన్ను వేఁచేరు' (11-3-23)

114 పిన్నలి : కత్తి ?

"పిన్నలి మెడకుఁ దగిల్చి" (పరమ.)

115 పీరుచు : పీల్చు.

'లోభము జలగవలెఁ బీరుచగా' (8-208)

'పిచ్చిలఁ బూతకిచన్నుఁ బీరిచినాఁడు' (8-235) చూ. బౌర్భిను.

పీర్చుట-To suck on.

116. **పుంగుడగు** : తడమాడు, తగులుకొను, మోసపోవు.

"పెద్దతెరువుండగాను వెడగంతలు చేసుక
పొద్దువోక యదవులఁ బుంగుడయ్యేరు" (9-94)

"అలరి బంగారు గంటే అందరి మనసులూను
పోలిమి నా పసఁ జిక్కి పుంగుడు కాకుండునా" (10-66)

"మృదువైన తరుణుల మెఱుగు బాహులతల
పొదలెల్లఁ దూరిదూరి పుంగు డయ్యేరయ్యా" (5-137)

"పాపపుణ్యములు సేసి పరుల గొలిచి తొల్లి
తాపముల బొందితిని దానికేమి
పూపసంసారము నమ్మి పుంగుడై యున్నాళ్ళదాకా
దాపులేక బ్రదికితి దానికేమి" (9-42)

పదబంధపారిజాత మీ తుది ప్రయోగమునే జూపి వంచితుఁ డగు అని యర్థ మిచ్చినది.

117. **పుక్కట**[1] : ఊరకనే, సునాయాసముగా?

"పుక్కట దొరకే పొట్ట పొరుగునను"
"పుక్కట కావుల గాచంబోయియున్నాఁడో"
"కాగిలి పుక్కట దొరకె"

చూ. Kittle. పుక్కటె = పుకనాటె for nothing, gratis without remuneration, worthless.

118. **పేరడి** : పేర్ + అడి-పేరడి. అడి = పాదము The foot అడి = Maturity (చూ. కిట్టెల్ పదకోశము)

పెద్దగా, అతిశయముగా, ప్రౌఢముగా అని అర్థమగునేమో.

"పేరడిఁదల్లి దండ్రులు బిడ్డలేమి చేసినాను

---

1. "పుక్కట-వ్యర్థముగా అని అర్థము; పుక్కిటపురాణములోని తొలిపద మిదియే కావచ్చును. అసందర్భమైన ప్రసంగమని యర్థము".
(సందిగ్ధపద సమీక్ష. సం. 19)

2. "పేరడిగా సొగపు పెద్ద మెలుఁగంటతోడ కోరికె జల్లలమ్మేరు గొల్లెతలు" 19-207 'పేరడి-పెద్ద అడుగు - ఎక్కువ అని అర్థము' చూ. (సందిగ్ధ పద సమీక్ష 19 సం.)

నోరుచుక ముద్దుసేసుకుందురు లోకమున" (8-97)
"నేరక లంపటములు నేనే కొన్ని గట్టుకొని
పేరడిఁబరుల నందుఁబెట్టేరంటాను" (8-98)
"అరయ రాజసపువాఁ డాన లెన్ని పెట్టినాను,
పేరడి నుండుబెకాని పెనగరాదు" (17-342)
"పేరత్తై వొక్క చోటనె పెంటలయ్యాఁ జుమ్మీ" (15-26)

119. **పొదలు వెట్టు** : ప్రకరణమున ప్రాకులాడు, పొరలాడు అను నర్థము తోచుచున్నది.

"పొత్తుల లోపల నేను పొదలు వెట్టేనాడు" (2-55)
"పొదలు వెట్టుచునున్న పొలఁతి భావము చెప్పఁ
దడబడె నాలిక తమకాన" (4-106)
"పొదలు వెట్టెడి పొగులు పొందు వాసిన దిగులు
పదఁతికి నిదియెల్ల బరికించ దిగులు (4-20)

120. బచ్చెన - బచ్చన :

పై పూత. శ. ర. యీ యర్థ మిచ్చినది. చూ. బౌ9ను. బచ్చెన - painted, బచ్చెన బొమ్మ painted doll. తాళ్ళపాకవారు బచ్చెనతో చేరిన పదబంధముల నెన్నో ప్రయోగించిరి. చూ. 'బచ్చెన ప్రియాలు' (2-259) = పై పై పసలు గల ప్రేమలు. 'బచ్చన బంధాలు' (11-65), 'బచ్చన రూపులు' (5-24), 'బచ్చన మాటలు' (4-103) 'బచ్చన చేతలు' (2-344) = పై పై పూత పనులు, "బచ్చెన కవితలు" (7-260) = పూత మెరుగుల కవితలు, రస పరిపాకములేని కవితలు, 'బచ్చెన దేహము' (8-47) = పై పై వేషముల శరీరము. బచ్చెనకు వ్యస్తముగా ప్రయోగము లివి చూడుఁడు.

"యిచ్చలఁ బుణ్యము లెన్ని సేసినా బచ్చెన లింతే ఫలమే లేదు"(2-151)
"యిచ్చకము నాకుఁజేసి యెంత నే నలిగినాను
బచ్చనల నా వద్దఁ బాయఁడే వీఁడు" (17-367)
"బచ్చెన దేహపు పై పొర సుఖమే
యిచ్చఁ బ్రపంచం బీనెడిని" (8-47)

చూ. DED. 3171 (Ta) Paccai-skin, hide, Covering as of the body of a yar. Br. Packh, natural outer sheath or covering.

121. **బడకరము** = రక్ష, కావలి?

"జతనము జతనము సర్వేశునగ రిది
బతుకు దోపయిదె బడకరము
హృదయము లోపల నీశ్వరుఁడున్నాఁడు
పదిలము మనసా బడకరము — " (7-84)

హెచ్చరిక! హెచ్చరిక! అను విధమున బడకరము అను పదమును తాళ్ల పాకవారు చరణాంతములందు ప్రయోగించినట్లున్నారు. పై పదమునందలి సందర్భమును బట్టి బడకరము = రక్షకము అని తోచుచున్నది. బ్రౌను, "బళకరము" పేర్కొని "n.s A guard or watch" అని వివరించెను. ఆ యర్థమే ఇటను పొందు పడుచున్నది. బళకరమే బడకరము.

చూ. శ. ర. బలకరము = కావలి.

122. **బతిమి** : వ్రతము?

"వ్రతినైన యతినైన వలల మాటలఁబెట్టి
బతిమి చెరుతురుగా బంధువులాల" (16-1-28)
"బతిమి సుఖము దక్కె బంతమిచ్చేటోరా"
చూ. బ్రౌను బతము = వ్రతము

123. **బయకారించు** : అభినయించు, లేనిది పైకి నటించు.

"నయము చాలనిచోట నవ్వులు నవ్వంగఁ బోతే
బయకారించె ననవా పక్కన నీవే" (17-553)
"నయమున నేఁ గొంత నవ్వులు నవ్వఁగఁ బోతే
బయకారించె ననవా పక్కన నీవే" (17-533)

బయకార శబ్దము ఉభయకార (గీతార్థోభయకార) శబ్దమునకు భ్రష్ట రూపముగా సంగీతలక్షణకారులు పేర్కొనిరి. బయకారము = సంగీతము

బయకా(రి)డు = సంగీతవిద్వాంసుఁడు, మున్నగు రూపములు ప్రసిద్ధములే. కాని తాళ్ళపాకవారీ బయకారశబ్దమును వింత యర్థమున పల్కుబడిగా నొనరించిరి. చూ మరియొక ప్రయోగము

"నయమున నేఁ గొంత నవ్వులు నవ్వఁగఁ బోతే
బయకారాలని వారే పచ్చి సేతురు." (17-534)
ఇట బయికారాలు = నటనలు.
చూ. పీరిదే ప్రయోగము - "బయకాఁడు" (13-134).

124. బరుబోకి : వ్యర్థుఁడు?

"పుట్టుమాలిన బరుబోకివి నన్ను - విద్దెవదేమోసి దిమ్మరిమాయ" (11-3-41) చూ. గౌరన - బరుబాకి, బడబాకి అని ప్రయోగించెను. వ్యర్థుఁడా అనుటకు వ్యవహారమున "పోరా పోరంబోకా" అనుట నేఁడును గలదు.

బఱు-బఱ-బఱె - Bareness, worthlessness, uselessness.
బోకి - బోంకి - బొంకి - A Potsherd, a bit of a skull
చూ. కిట్టెల్ పదకోశము.

125. బాలకి : బాలిక

"బాలకియై లకిమ్మమ్మ పై పై సిగ్గుపడగా" (16-119)
"బాలకి నన్నిట్టే చేపట్టుదువు గాక" (14-17)

126. బెళకు : ఒయ్యారము, విలాసము చూపు.

"మీరమాడి బెళకేవు పెనఁగి తలవంచేవు, ఔరా నీ పొందు లెందుకైనా వచ్చును" (15-268) శ. ర. లో "బెళకు" 'బెదకు' పదములకు చలించు, ఒరయు అని గలదు. చూ. - బొ౧ను. బెదకు - n. s(ad) grace, prettiness, విలాసము. ఇట బెళకేవు = విలాసముచూపేవు అని.

127. బేసబెల్లి - బేసబెల్లితనము : వేషాలమారి, వగలాడి.

"బేసబెల్లితనమున ప్రియాన నిచ్చకమాడి" (7-250)
"అసలేలమానుఁ దన ఆకలి లోనుండఁగాను
బేసబెల్లి దేహముతోఁ బెరుగుఁగాక" (10-61)

'బేసబెల్లితనమున పెనఁగులాడఁగ మిమ్ము' (13-128)

చూ. బ్రౌను. బెల్లి = వగలాడి, a coquette అని వివరించెను. బేసబెల్లి -వేషాలమారి, వగలాడి అని యర్థము కాఁదగునని తలంతును. పదబంధపారిజాతము పై తాళ్ళపాకవారి ప్రయోగములనే యుదాహరించి 'సంగనాచిపంటిది' 'సంగనాచితనము' అని వివరించినది. ఇంకను విచార్యము.

128. బొడుక : బాలుఁడు.

"సరిఁ గర్మముల కెల్ల చనవరి బొడుకను" (7-246)
'లెక్కించ నితనికైన లెంకలకు బొడుకల
కొక్కట విధి నిషేధా లూహింప లేవు'. (7-277)
బొడిగ = బాలుఁడు చూ. శ. ర. బ్రౌను. బొడిగె = child.

129. బొమ్మవెట్టుట : తిరస్కరించుట.

'మహి నా పుట్టుగులకే షురి బొమ్మఁబెట్టినాఁడ
విహిత మిందుకునేది విధి చెప్పవయ్యా' (10-22)

"బొమ్మవెట్టు" అనుటకు చూ. ఉషాపరిణయము -'భావజునకు మారుపడి బొమ్మవెట్టి-లే వెండ(?)కాల పెండెయము ధరించి' (పుట. 12) "మృత్యువునకు బొమ్మవెట్టు" (పరమ) జయసూచకముగా నరివీరుల బొమ్మలను కాలియందెలపై జెక్కించుటయే బొమ్మ పెట్టుట = గౌణార్థము - తిరస్కరించుట.

130. మంక - మంకు[1] :

దుడుకుతనము గల యాఁడుది. మొండితనము.
"మలగితే నంతకంటె మంకను నేను"(15-8)
చూ. శ. ర. మంకు = మూర్ఖుఁడు. బ్రౌను - మంకు = adj. vile abominable. N. దుర్జనుఁడు, దుష్టస్త్రీయు.

---

1. 'మక్కువ నేర్చితిఁగాని మంకు నేరనైతి - (548) 'మంకు' పదమునకు అవివేకము, మొండితనము మొదలైన అర్థము లిక్కడ పనికిరావు, తాత్పర్యముచేత ఆర్జవము, మంచితనము అనఁదగును.' (చూ. సందిగ్ధపదసమీక్ష, సం. 20). సందర్భమునుబట్టి ఇచ్చటను 'ప్రేమింప నేర్చితినే గాని ప్రణయ కలహపు తెఱఁగు నెఱుఁగనైతి' నని యర్థమగునేమో।

"మక్కువ మంకుల తోడ మాటలాడకున్న పతి
చెక్కునొక్కి జలజాక్షి సేదదేర్చఁగా" (15-30).

'మక్కువ మంకులతోడ' అను వీరి యీ ప్రయోగమునకు ప్రీతితోఁ గూడిన మొండితనము - పొలయలుక అని అర్థమగునేమో.

131. **మలఁగు** : మెత్త, దిండు, బాలీసు :

"మురిపెంపు నటనతో ముత్యాల మలఁగుపై
వరవశంబునఁ దరుణి పవళించెను"
"తెలువ శశికాంత వేదిక మీఁద మలఁగుపై
నొఱగి పరితాపాగ్ని నుడకఁగాను"
"మంచముపై నుండరాదు మలఁగుపై బొద్దువోదు
నించిన వుయ్యాలలోన నిద్దుర రాదు"
"ఒనరఁ గుచభారమున నొరగి యీ మలఁగుపై
నెనసి నే శాకు మడి బియ్యఁగాను"

శ. ర. లో మలఁగు = తిరుగు అని క్రియా రూపమే గాని విశేష్య రూపము కానరాదు. చూ. Kittle మలగు = మలంగు (Smd. Da) a pillow, a cushion ఉపధాన, అని కలదు. తాళ్ళపాకవారి పై ప్రయోగము లను బట్టి మలఁగు మంచముకన్న నుయ్యాలకన్న భిన్నమైనదనియు, శశికాంత వేదిక మీఁద నుంపఁ దగినదనియు దోచుచున్నది. సుఖ శయనమున నడుము నాన్చియొరగి కూర్చుండఁదగిన యుపధానమిది కాఁదగును. "ముత్యాల మలఁదు" అనుటను బట్టి ముత్యాలకుచ్చు లటునిటు వ్రేలాడెడి గుండ్రని దిండు - ఒరుగు దిండు - బాలీసు అని తోచుచున్నది. చూ. పద. పారిజాతము - మలఁగు టొఱగు - "నెరయ గుంకుమ పువ్వు నించిన మలఁగుటొఱగుపై నొయ్యార మొలయంగ నొరిగి" (ద్వి. పరమ. 3 పు. 193) (?)

132. **మాఁకుపడు** : శోభ తఱుగు (?)

"సోకంగ శ్రీ వేంకటేశు జూచి నేనె కలసితి
మాకుపడి కమ్మటి నీ మంచమెక్కె నీతడు (?) (8-584)
"మానినుల పొందులేల మాఁకుపడి వుండనేల" (15-159)

"అఁకట నాశేల మాను అన్నిటను యిందరికి
మాఁకుపడి తత్తరము మరచుటే గాక" (2-193)

శ. ర. లో మాఁగుపడు రూపము కలదు. "సురచిర కిరణ విస్ఫురణంబు డింది యెంతయు మాఁగుపడిన మార్తాండు పగిది" (మార్క౦. 1-169) అను ప్రయోగమీయఁబడినది. పదబంధపారిజాతకారు లదే ప్రయోగము నిచ్చి, "పరిణతి చెందు" అను నర్థమిచ్చిరి. అట 'శోభతరుగు' అను నర్థమే పొసగునని తోచును. చూ. బౌ్రను-మాగుడుపోరిన dimmed, dull. తాళ్ళపాకవారు 'మాఁకుపడు' అని ప్రయోగించియున్నారు. కన్నడమున 'మాంకరిసు' "మాక రిసు" రూపములున్నవి. చూ. Kittle-మాంకరిసు-మాకరిసు - To disregard, to Condemn, to put to shame, or into shade, to surpass మాఁగుపడు — మాఁకుపడు సమానార్థకములగునా ?

133. మానావతి :[1] మానవతి అనుటకు

"మరువరానియట్టి మానావతి సుమ్మీ" (15-248)
"ఉమ్మడి మానావతులు వోరుచుకుందురుగాక" (17-398)

134. మాసు : మావి

"పొంచి గర్భమున మాసు పొదిగి ఉండిననాఁడు
ఎంచుకొని ముచ్చటాడ నెవ్వరున్నారు."

శ. ర. లో ఈ రూపము కానరాదు. "తలమాసించుకువోవఁగ" "తల మాసుపోని" మున్నగు నన్నిచోడ కవి ప్రయోగములు చూడఁదగును. kittle మాసు = మావి The afterbirth, Placenta అని ఇచ్చియున్నాఁడు.

135. ముంజీతము :

పనికి ముందుగా నిచ్చు జీతము (advance Pay)
"కొలిచినవారి ముంజీతమవు" (9-219)

శాసనాదులలో 'కైకూలి' 'కైజీతము' మున్నగు ప్రయోగములున్నవి.

1. "మానావతులము - మానవతులము అనుటకు వ్యావహారిక రూపము. నేఁటికిని కడపమండలములో గలదు" (సందిగ్ధపద సమీక్ష - సం. 19)

ఏ దినమున కాదినము **చేతికిచ్చుకూలి** (Daily wages) అను నర్థమున. అట్లే ముని + జీతము - ముంజీతము కాఁబోలును.

136. **మెకురు :**

'మకురు' అనుటకు - మొండితనము.

'మెల్లనెమాటాడరాదా మెకురేల చేసేరు'

137. **మెలుఁత :**

మెఁలత, స్త్రీ. 'లోకమునను మెలుఁతలు లేరా' (4-60)

'మెలుంత' అను రూపమిది యతిస్థానమున నుండుట గమనింపఁదగినది.

138. **మేకు (లు) :**[1] గొప్ప., వినోదము(లు) ? పరిహాసము (?) స్పర్థ-పోటీ. అను నర్థములు భాసించుచున్నవి.

"పైకొన్న చిత్తంబు పట్టరానిది కొంత
మేకులకుఁ జెలఁలాడు మేల మొక కొంత" (3-378)

'మేసవారిపిన్నదాని మేకుసేసి యింటిలోన దోసుకొంటి వెరుఁగవాదుండ గిడ' (12-284)-మేకుసేసి = గొప్పచేసి, "మేటియైన విభునితో మేకులు చూప కువే" (13-103) - మేకుఁచూపు = పోటీపడకుము. (చూ. కిట్టెల్ పదకోశము) మేకు = (Superiority)., rivalry.

139. **మైలసంత :** మత్స్య మాంసాదులు విక్రయించు బజారు.

"మచ్చిక కర్మ మనేటి మైలసంతలోన
వెచ్చపు కర్మధనము విలువచేసి
పచ్చడాలుగా గుట్టి బలు వేంకటపతి
ఇచ్చకొలదుల నమ్మే ఇంటి బేహారి"

మైలసంత — మడిసంత - వివరణమునకు చూ. క్రీడాభిరామపీఠిక.

140. **మొకరి :** దిట్ట. చతురుఁడు (?)

"మొకరివై యుండి నన్ను మోహింపఁజేసితివి"

---

1. 'మేలిమివాఁడవు నీకు మేకులు లాఁతే' (19-18)
మేకు = పెద్దతికము అని కన్నడమున' (చూ. సంధర్గ పదసమీక్ష సం. 19)

శ.ర.లో మొకరి-ప్రోగునది, అసంబద్ధవచనములాడునది అని వివర ణము గలదు. బ్రౌను. మొకరితుమ్మెద-గండుతుమ్మెద అని యర్థ మిచ్చెను. తాళ్ళపాకవారి ప్రయోగమున మొకరి-చతురుఁడు, దిట్ట అను నర్థము భాసించు చున్నది.

141. మోనము : మౌనము.

"మోనాన నుందానవేమే మునివైతివా" (17-254)
"మొక్కలపు వెరగుతో మోనమేటికే" (15-8)
"ఇద్దరు మోనాన నున్నా రిది యేమయ్యా" (15-23)

"మౌనము" అను పదమును తాళ్ళపాకవారు "మోనము"అను విధము ననే అభిమానముతో ప్రయోగించుకొనినారు. కౌగిలిని "కాగిలి"అనియు, మౌన మును "మోనము"అనియు ప్రయోగించుట వారి కభిమతముగాఁ దోఁచును.

142. మోరతోపు : మూతివిరుపు-మూతిమూరెడుచేయు, నిర్లక్ష్యముచేయు.

"మోరతోపుదనముల మోనమే చాలు" (15-61)
"మోరతోపుఁదనములు మొగములో నుండఁగాను" (17-517)

పశ్వాదుల దీర్ఘముఖమును మోర యందురు. 'నీ మోహము - నీ మోర' అని వ్యవహారము. మూతిని విరిచియు, మూరెడు చేసికొనియు తిరస్కారమును ప్రకటించుటయే మోరతోపుచేయుట. ఇది మోరతోపే గాని "మొరతోపు" కాదను కొందును. చూ. బ్రౌను - "మోరతోపు = aversion, turning away or averting the face, మూతులు తిప్పడము."

143. రండు : రెండు.

"రెండు" అను నర్థమున తాళ్ళపాకవారి ప్రయోగమిది యతి సానమున గలదు.

"వుండేది వొక్కతె యింట పండేది వొక్కతె వద్ద
రండూను నడపేవు నీ రాజసమున" (14-38)
"రవ్వల నాడు బుద్ధులు రండూ రెండే (14-273)

144. **రాఁగు** : రేగు, కోపమున మండిపడు.

"వీఁగక శ్రీ వేంకటేశ వేడుక గూడితి నన్ను
రాఁగినా కోపముడిపి రక్షించనే కాదా"

ఇట రాగినా, = రేగినా, విజృంభించినా అని యర్థమగును. చూ. బ్రౌను. to be enraged, perhaps this should be రేగుట.

**రాగుట** : "రాగిన వేళల రంకెలు వేయు" బ్రౌను వివరించిన యర్థముననే తాళ్ళపాకవారి ప్రయోగమున్నది.

145. **రాసికెక్కు** : వన్నెకెక్కు

"రాసికెక్కి నీ వింతటి రాజసపు దైవమవు
దాసులము మాకెట్లు దక్కితివయ్య" (8-76)

146. **రుత్త** : రిత్త ?

"వొత్తినారాయణ నామ ముచ్చరించే నోరను
రుత్తయధరపుఁ దోలు రుచి గానేదా" (6-115)
'రుత్తవోని వేడుకల రుచిగన్నవారికి' (16-2-66)

యతి స్థానమునగల రుత్త పదమిది పై ప్రయోగమున రిత్త అను నర్థమున నున్నట్లున్నది. బ్రౌను - రిత్త = adj. empty. ఉత్త, శూన్యమైన అను నర్థము లిచ్చియు, విడిగా "రుత్త = (n. s,) నాశనము" అని వివరించెను. చూ. శ. ర. రుత్త = నాశము (వానిరూపు రుత్తాయెనుపో). రుత్తవోని (వేడుకలు) = అంతులేని, నాశములేని.

147. రెంబు · రాల్చు, కోయు, దూయు ?

'రేగు లెక్కి పూపలెల్లా - రెంబి మాఁగ వేయఁజొచ్చె' పదకోశము ఈ పదము నీ యర్థమున నిచ్చినట్లు కానరాదు.

148. రేకబడు : గిటుపడు ?

'బలువు కొండలు రేకబడ నింతమలచి' (పరమ. పు. 432)

శిల్పులు వలసిన యాకృతికి రాతిపై గీట్లు గీచికొని శిలలను మలచుట పరిపాటి. ఇట పెద్దపెద్ద కొండరాళ్ళను రేకబడునట్లుగా - గీటుపడునట్లుగాఁ జేసి మలచికొని రనిభావము. పదబంధపారిజాతము రేకఅగు - రేకమోయు అను పదబంధముల నిచ్చి 'గీసుకొనిపోయి నెత్తురు చిందు, గాయపడు' అను నర్థము లిచ్చినది. 'రేకబడు' రూపమును పేర్కొనలేదు. 'రేకయగు'టయే 'రేకబడుట' కూడ.

149. **లచ్చనలు** : లాంఛనములు - గుర్తులు.

'కందువగు నీమేను కౌగిలించఁగానె నామై
చందముగ నీమేని లచ్చనలంటెను' (14-163)
"లచ్చన గుఱుతు మాన్పలాగుల వశమా' (15-60)
(చూ. కిట్టెల్ పదకోశము. లచ్చణ - లాంఛ్ఛన పదభవము).

150. **లచ్చిగొండి** : అహంకారముగలది, దుడుకుదనము గల వ్యక్తి (?)

"లచ్చిగొండి నీవంటి నెలంతనా నేను
పెచ్చు పెరిగే వదేమే పిన్నదానవా" (4-105)

ఈ పదమున కర్థమేమో స్పష్టముగా తెలియరాలేదు. కీర్తనమునందలి భావమునుబట్టి లచ్చిగొండి దుడుకుతనముగలది అని యర్థము స్ఫురించు చున్నది. సౌభాగ్యాతిశయమున నహంకరించు వ్యక్తి "లచ్చిగొండి" యగునా ?

151. **లాకలు** : పడుగున కడ్డముగా గ్రుచ్చెడి వెదురు పుల్లలు.

"నాకారకే గీర్తించెనో నగి యీ లోకము హరి
లాకలై యెటు చూచినా లంపటా లిట్లున్నవి." (2-235)

శ.ర.లో 'లాక' ( = పక్షియాక)అను పదము కలదేగాని, యీ యర్థమున లేదు. బ్రౌను 'లాక' పేర్కొని-"a slip of bamboo used by weavers సాలెవాఁడు పడుగుకు గ్రుచ్చెడి వెదురుబద్ద" అని వివరించెను. తాళ్ళపాక వారి ప్రయోగము బ్రౌను వివరించిన యర్థమునే స్ఫురింపఁజేయునట్లున్నది. పడుగున గ్రుచ్చెడి వెదురుపుల్లలు ఆల్లికను చిక్కగా చేయునట్టివి. అట్లే లంపటాలు జీవితమును క్లిష్టతర మొనర్చునట్టి లాకలవంటివని భావమేమో.

152. **లూటి**: దుడుకుదనము-ఔద్ధత్యము-దోపిడి

"లోకములోపల లూటిబెట్టు - ఇది
కైకొని హరి యెరగవుగా నీవు" (11-2-22)
"రమణ గంసాది యసురలు లూటి సేయఁగాఁగా
తమిఁ గృష్ణావతారమిందరి కైతివి" (6-160)

"ఉపద్రవము" అని శ. ర. లూటిబెట్టు, లూటిసేయు - ఉపద్రవము గల్పించు, దుడుకుదనమును ప్రదర్శించు అని యర్థము. బ్రౌను లూటి = దుడుకు ఔద్ధత్యము - Misbehaviour అని వివరించెను లూటీ, లటానా, అను తురుష్కపదమును బ్రౌను పేర్కొని దోపిడిచేయు అను నర్థమిచ్చెను. దోపిడి సేయుటయే దుడుకుదనముసూపుట. ఇది తురుష్కపదమనియే భావింప వచ్చును.

153. **లోకదొంగ** : లోకమున ప్రసిద్ధుఁడగు దొంగ (?)

"లోనివారి మొఱఁగేటి లోక దొంగవు" (4-55)
ఇట్టివే వీరి ప్రయోగములు "లోక దిమ్మరి" (13-10)
"లోక బంటడు" (2-19), "లోక శరీరి" (7-110) చూడనగును.

154. **వంగుడు** : బొట్లు రాలుట, చినుకులు పడుట.

"వరుస వాన కంటె వంగుడే ఘనము"
చూ. బ్రౌను - వంగుడు బొట్లు రాలుట.

155. **వయ్యము** : శుష్కము, వట్టిది (?)

"తియ్యపుఁ జేఁతలఁ ద్రవ్విన చోటు
వయ్యమై హృదయము వాడీనె" (4-86)

శ. ర. లో 'వయ్యము' రూపమున్నది. వాయమునకు రూపాంతరమని ఇచ్చి వ్యర్థము అని వ్రాయబడి యున్నది. చూ. 'ఎయ్యది కర్తవ్యమొకో యియ్యెడ నాలోచనమున కెప్పండొకో తోడయ్యెడువాఁడీ కార్యము, వయ్యము గాకుండఁ జేయవలయు వెరవుతోన్' "భోజ. 4 అ" "వాయపురజ్జులాడు" అను భారత ప్రయోగమునుగూడ "రజ్జులాడు" అను నారోపము క్రింద శ. ర. కారు లుదాహరించిరి. రజ్జులు + అడు - వ్యర్థభాషణుఁడు అని యట నర్థ మిచ్చిరి.

వయ్యము = వ్యర్థము అనుటతోపాటు శుష్కము అనికూడ నర్థమీయఁదగు ననుకొందును. 'వాయపురజ్జులాడు' వట్టివ్యర్థాలాపములాడువాఁడు అని: పైతాళ్ళ పాకవారి ప్రయోగము- 'శుష్కము' అను నర్థమునే సూచించుచున్నది.

(చూ. కిట్టెల్ పదకోశము. వాయ - వ్యాజశబ్దభవము. Deceit, lie, vainness, pretext.)

156. **వల్లడివలపుకాడు** : వలపు నటించువాడు, వలపు దోచుకొనువాడు :

"వల్లడివలపుకాఁడ వచ్చేనో రానో" (చూ. బ్రౌను - వల్లడికాఁడు = a thief, a robber - తస్కరుఁడు.

157. **సాటికిబేటికి** : అయినదానికిని కానిదానికిని, చీటికిమాటికి వలె.

"మాటలాడేనంటేఁ గాక మంకు దెలుపవచ్చునా
సాటికిబేటికి నిన్ను సాదించెగాక" (15-241)
"పోటిదొరలతోఁ బొందులునేసితే
సాటికిబేటికి జంపులె కావా" (15-258)

బ్రౌను 'సాటికిపోటికి' అనురూపము నిచ్చి 'in rivalry-ఎదటికి జతగ వుండవలె నని' అని వివరించెను. సాటి = సామ్యము, బేటి వైషమ్యము (పోటీ, భేటీలనుపోలిన రూపము) పదబంధపారిజాతము సాటికిబేటికి = సాటికి అని యర్థమిచ్చుట విచార్యము.

158. **సావివోవు** : విధముతప్పు, క్రమముతప్పు, భ్రాంతితప్పు (?)

"దైవికము మా స్వతంత్రముతోఁగూడె
సావివోదెన్నడు సంసారము" (8-105)

సావి = కాలము అని శ. ర. లో గలదు. బ్రౌను 'సావి - ఇత్యర్థమున' అని వివరించెను. నన్నిచోడని ప్రయోగము లన్నియు భ్రాంతి అనునర్థమున నున్నవి. ఈ కీర్తనముననే మరియొకచరణమున 'మాయ కొంత నిజమూర్గమును గొంత-చాయదప్పదిద సంసారము' అని గలదు. అట్లే ఇటను సావివోవు = క్రమముతప్పుదు అనియో లేక నన్నిచోడని ప్రయోగానుసారము భ్రాంతితప్పుదు అనియో అర్థము కాఁదగును. పదబంధపారిజాతము పైతాళ్ళపాకవారి ప్రయోగ

మునే యుదాహరించి, సావివోవు = సాటియగు అని యర్థమును వివరించుట సరికా దనుకొందును.

159. **వలుము** : తగాదా (?)

"వారించి లేదని వలుముచేసి," తమిళమున "వంబు" అని యిదే యర్థమున గలదు.

160. **వళకు** : వణకు, కంపము, భయము.

''శ్రీ వేంకటేశుఁడే చిత్తగించి నన్నేలెఁగా
వావాత నింద్రియాలు వళకాడినా'' (9-128)
''పైకొని శ్రీ వేంకటేశు బంటుకు వళకు లేదు" (7-54)
"ఇందుకు సంచుకుఁ బోని రిహలోకమందువారు
దిందుపడని వళకు తీరుచవయ్యా" (9-41)
''కొందరు నరకమందు కొంత వళకు వేసేరు
కొందరు స్వర్గమువారు కొంత వళకు వేసేరు" (9-41)

ఇట వళకాడినా = కంపించినా, భయపెట్టినా అనియు, వళకులేదు = భయములేదు అనియు నర్థము కాఁదగును.

161. **వళుకు** : నింద (?)

"వళుకు కోపనివాఁడు వచ్చి పూటవడనేల
వొలసినట్టు తనంత నుండరాదా" (16-30)

వళుకు = మిథ్యాభియోగము అని బ్రౌను వివరించెను. తాళ్ళపాకవారి పై ప్రయోగము మిథ్యాభియోగము - నింద అను నర్థమునే స్ఫురింపఁజేయుచున్నది. చూ. శ. ర. వళుకు = తగవు.

162. **వళుకువేయు** : భారమువేయు ? నిందమోపు ?

"వట్టిభక్తి నీమీఁద వళుకువేసి నిన్ను
బట్టితెచ్చి మతిలోనఁ బెట్టుకొంటిని'' (8-49)

'వళుకువేయు' అననేమో అర్థము స్పష్టముగాలేదు. 'వట్టి భక్తిచేతనే

నీమీఁద వళుకువేసి = భారముమోపి నిన్నుబట్టి మతిలోననిలుపుకొంటి' మని భావ మగునేమో ; లేక 'భక్తిచేత (నీవు మమ్ము గుర్తింపకున్నావని) నీమీఁద నిందమోపి తెచ్చి మతిలోన బెట్టుకొంటి' మనియో ; (చూ. కీర్తనము మొదలు.)

"నీవే నేరవుగాని నిన్ను బండించేము నేము,
దైవమా నీకంటె నీ దాసులే నేర్పరులు"

ఈ ప్రయోగమునకే పదబంధపారిజాతకారులు 'వళుకుసేసి' అను పాఠమును జూపి వళుకుసేయు = లగ్నముచేయు అని యర్థమిచ్చిరి. తాళ్ళపాక వారి ప్రయోగము 'వళుకువేసి' అని యచ్చులోనున్నది. 'వళుకుసేసి' పాఠమెక్కడిదో ?

163. విత్తరాలు : తెలివిగల యాడుది.

"యిప్పుడే శ్రీ వేంకటేశ యెనసి నిన్ను గుట్టున
విప్పుచు రట్టు సేసునా విత్తరాలు" (13-454)

బ్రౌను. 'విత్త = Skilfulness తెలిసిఉండడము, విత్తు Wisdom జ్ఞానము' అని వివరించెను. తాళ్ళపాకవారి పైకీర్తనమున జవరాలు, చదురాలు, ఘనురాలు, విత్తరాలు అను రీతిని ప్రయోగములున్నవి. ఇట విత్తరాలు, అనఁగా, అన్నియుఁ దెలిసినది అని యర్థమేమో, శ. ర. ఈ రూపమును బేర్కొనలేదు.

164. వెగ్గళించు : వెక్కిరించు, మితిమీఱు.

"సిగ్గుపడ కింటిపని చేసే నేను
వెగ్గలింపఁ దగునా వెర్రి నింతేకాక"
"వెగ్గళించి తెగు కంటే"

బ్రౌను వెగ్గళించు రూపము నిచ్చి "To jeer, laugh at వెక్కిరించుట అని తోఁచినది" అని వివరించుచు, 'పదాతులు గూడి కడఁగి పెల్లునం బరచిరి పట్టణంబుదెస పౌరజనంబులు వెగ్గళింపఁగన్' అను ప్రయోగమును జూపెను. పై నిచ్చిన తాళ్ళపాకవారి ప్రయోగములలో తొలిదాన 'వెక్కిరించు' అను నర్థము సరిపడుచున్నది. రెండవప్రయోగమున 'మితిమీరు' అను నర్థము స్ఫురించుచున్నది. విచార్యము.

165. వెచ్చమగు : అమ్ముడుపోవు. 'నీకు వెచ్చమైతి' (12-91)

166. వ్రేఁతె : గోపిక.

'తెలఁగున శౌరి వ్రేఁతెల యెడ యెడను' (అష్టమహిషీ 2)

వ్రేఁతె - యతిస్థానమున ప్రయోగముండుట గమనార్హము.

167. సంకె : శంక - అనుమానము, భయము.

'అంకించి నే వారివాఁడ నని దుష్టుఁడనైనా, నా
సంకెదీరఁ గావవయ్యా సర్వేశ్వరా' (8-127)

ఇట నా సంకెదీర-నా అనుమానము పోవునట్లు అని అర్థము కాఁదగును. ఇదే ప్రయోగమును జూపి పదబంధపారిజాతకారులు 'సంకెదీర - నిస్సంశయముగా' అని వివరించిరి.

168. సంతతగరు : బిత్తరగొడ్డు, అను నానుడి వంటిది.

'జడియు నీ తమకంబు సంతతగరు,
కడగంటి నీ చూపు కటు వదలిన క్రేపు' (12-75)

సంతలోఁ బెట్టిన తగరు బిత్తరిచూపులు చూచుచుండును. అట్లే బిత్తరి చూపులు గలవారిని గూర్చి చెప్పవలసినపుడు 'బిత్తరగొడ్డు' అనియు, 'సంత తగరు' అనియు వ్యవహరించుట గలదు.

169. సంబళము : జీతము.

'తెచ్చినసంబళమెల్లఁ దీరుఁబో లోలోనె' (5-143)
"పాపము లే సంబళ మెపుడు యీ
యాపదంబడి నే నలసేనా' (2-83)

చూ. బ్రౌను. సంబళను = wages అని వివరించెను.

770. సటలబెట్టు : చిక్కులబెట్టు.

'సంతకూటపు బ్రతుకు సటల బెట్టీని'
'సానబట్టిన వయసు సటల బెట్టీనీ' (9-194)

**171. సటవటలు** : దండుగమారి పనులు? వ్యర్థపుఁ బనులు.

కటకటా జీవుండా కాలము దోలుకరాగా
సటవటలనే పొద్దు జరపేవుగా' (2-335)

చూ. బ్రౌను. 'సటవట మాటలు - అనఁగా జల్లి మాటలు-boasting lies or idle talk.'

**172. సదచేయు** : నుగ్గుసేయు, సదమదము చేయు, గజిబిజి చేయు.

'సదచేసి జగడాలు చల్లెఁటో యిఁకను' (12-50)
'ఉదుటుమీరి తిరిగీ నొదిగి వీని మదము
సదసేసి వడినణఁచఁ గదె వో చెలియా' (12-104)
సదకు, సదె — to strike, to beat చూ. కిట్టెల్ పదకోశము.

**173. సదరము** ; తేలిక— చులకన (?)

'కొంత కోక నల్లనైతే గోరుపడ మనలేవు
అంతనేను సదరమైతినా నీకు' (3-100)
'పొదల పూఁదూపు లేద భూమిఁ జెఱకువిల్లేద
సదరమీయింతి బొమ్మజంకెనలె కాక' (3-209)
'కందువ సదరము కైవల్య పదము' (11-39)
'సదరముగా హరి చాటీ నిదివో' (10-71)

**174. సదరుకొను** : సర్దుకొను.

'ఒండొరులకు మన మొద్దికై సదరు
కొందము రమ్మంచు' (పరమ. పు. 37)

**175. సప్పుసారై పోవు** : చప్పబడిపోవు. సప్పె - చప్పె - flatnes, insipidness, dull. సవర్ - to perish చూ. కిట్టెల్ పదకోశము

'కవకవ నవ్వి కన్నులు దేల గిలఁగ, సవరన్ని యాటదెల్ల సప్పుసారై పోయెను'. (12-157)

'సిన్నెన్నన యాటవెల్ల సిక్కు సిరైపోయెను' వంటి ప్రయోగమే యిదికూడ.

(చూ. వివరణమునకు – ఇందే 77 లో పేర్కొన్న 'చప్పుడారు సేయు అను పదబంధము)

176. సయించు : హితమగు, అంగీకారమగు. సహించు.

"ఒద్దికి రా సయించదు ఓ యమ్మ" (132-83)
"నిలువ సయించదు నిలుచున్న చోట" (పరమ.)

ఈ పదము నేఁటి వ్యవహారమున కేవలము రుచికి సంబంధించి మాత్రమే కలదు. ('కాకరకాయ సయించదు' ఇత్యాది)

177. సలిగ - సలిగె : ఆశ్రయము, ప్రాపు (?) చనవు.

"చలము సాధించే చోట సలిగెలు చెప్పఁబోతే"
'సలిగ గల దంటాను సభలోన నవ్వఁ దగదు' (3-200)
'సలిగెగల ఆలవై తివి' (3-137)
"చక్కని యశోద తన్ను సలిగతో మొత్తరాగా"
"నిన్ను గొల్చిన సలిగె నేడు నాకు గద్దుగాని
నీ కొకరి సలిగున్నదా" (10-57)
"హరి నీకు నే దాసుండ ననే దొక సలిగె" (2-364)
"సలిగె మాటాడితేను సాధించేవారు గలరా" (14-98)

ఇత్యాది ప్రయోగము లెన్నియో తాళ్ళపాకవారివి గలవు. సలిగె = ప్రాపు, ఆశ్రయము అని శ. ర. సలిగ or సలిగె patronage, protection, interest, influence బలము, అండ అని బ్రౌను.

శ. ర. ప్రయోగ మీయలేదు. బ్రౌను UH 4-152 "చూతము యాచెలి సలిగె తియంబేలరమ్మ" అను ప్రయోగము నుదాహరించెను. ప్రాపు, ఆశ్రయము అను నర్థము తాళ్ళపాకవారి ప్రయోగములలో నొకటి రెండు తావుల సరిపడును గాని పెక్కుచోట్ల "చనువు" అను నర్థమే పొసగును. సలిగెతో మొత్తరాగా, సలిగెమాటాడితే, సలిగెలుచెప్పఁబోతే మున్నగు ప్రయోగములు చూడఁదగును. తెనుఁగు పదకోశము లీ యర్థమును పేర్కొనకున్నను, కన్నడ పదకోశమున నీ యరము గలదు. చూ. Kittle "సలిగె = familiar intercourse, familiarity, indulgence, (Mhr), intimacy

fmiliarity - probably is taken from K." సలిగె = చనవు అను నర్థమే ప్రఖ్యాతముగా నున్నది.

178. **సాసముఖా** : పరాకు, హెచ్చరిక, వంటి పదబంధము

"సాసముఖా నదె సాసముఖా,
అసల పరివారము అవధారు దేవా" (9-97)
'సంగడి దేలేటి మీకు సాసముఖా,
సరవి నోలాడు మీకు సాసముఖా' (7-237)

ఇది సంబుద్ధి పదముగాఁ దోపదు. 'సాసముఖా' అనునంతముగల పద రచనలే సాసముఖాలు.

179. **సుంకు** (ల) : సోకు (?)

'ఇంకా నేటికి జోలి యేల సేసేవిటు నాతో
సుంకుల యెంతటి జాణో చూపరా నాకు' (3-538)

సుంకు = ప్రతిబంధమని శ. ర. చూ. Kittle-సుంకు = సోకు, Touch.

180. **సుక్కురారము** : శుక్రవారము.

181. **సువ్రతము** : నోము - నోమినమ్మ.

'శత సహస్రయోజనవాసులు సు
వ్రతములతోడనే వత్తురు గదలి' (2-33)

సువ్రతము = సులభముగాఁ బిదుకఁ దగిన యావు అని శ. ర., నోము అని బ్రౌను వివరించెను. చూ. kittle సువ్రత - సుబ్రత - strict in observing a religious vow or obligation, virtuous సువ్రతె a virtuous wife.

182. **సుపరము** : తేలిక, సులభము (?)

'వసగాని పెక్కు దేవతలఁ గొలుచుకంటె
సుసరాన హరివారై సుఖియించరో' (9-279)

సుసరాన-తేలికగా అని యర్థమేమో. చూ. బ్రౌను - easy, clear-సుసరమార్గము–సుసర — Going or passing easily or without trouble చూ. కిట్టెల్ పదకోశము.

183. **సూరియుఁడు** : సూర్యుఁడు 'చుక్కల రాజే సూరియుఁడై' (3-660)

184. **సూడువట్టు** : మాత్సర్యము వహించు.

"పరగ నాపె మీఁద పందెము మోచెనంట
సొరది నీ వేల వచ్చి సూడువటే విపుడు" (3-163)

185. **సూడుంబాడు** ; పగ (లు) వగ (లు) అనుటకు :

"వాడిక నిందాక నీవు వచ్చిన నేరమికి
సూడుఁబాడుఁ జెనకీఁటో సొలపుఁ జేతలనే" (12-50)
'సురలకసురులకు సూడునుఁబాడునేగాని
పోరసి సుఖించగఁ బొద్దులేదు' (6-89)
'కోపగించఁబనిలేదు కూడతి మిద్దరమీద
చూపులఁ జూడుమనవె సూడుఁబాడేల' (17-802).
సూడు = పగ (శ. ర.). పాడు = suffering, trouble (కిట్టెల్)

186. **సూర్యవీధి** : తూర్పున నున్న వీధి.

"అల సూర్య వీధి నేగీ నాదిత్యుని తేరిమీఁద" (5-249)

సూర్య వీధి - తూర్పు వీధి, సోమవీధి = ఉత్తరమున నుండు వీధి, 'సోమసూర్య వీధులు తిరుగుట అనఁగా' ప్రదక్షిణ మాచరించుట అని యర్థమగును.

187. **సూసరి** (?) :

"విసరే గాలియు విశ్వముల లోపలి
పస శ్రీ వేంకటపతి యెఱుఁగు
సూసరివై శరణము జొచ్చుట యతనికి
యొసగిన దేహుల మే మెరుగుదుము." (2-144)

ఈ పదమందు "సూసరమై" అని యుండునేమో; నూసరివై అని మధ్యమ పురుష వ కార రూపమునకు కీర్తనమున సందర్భము లేదు. 'సూస

రమై = సులభముగా నతనికి శరణు జొచ్చుటయే మే మెరుగుదు' మని భావము కావచ్చును.

188. సెలవు : అర్పణము.

"ధారుణిలోపల బుట్టించితివి - తరువాతి పనులు నీకే సెలవు"(9-103)
"కలిగిన దినములు కాపురానకే శెలవు." (8-86)

189. సోవ (లు) : ఎదుట, ప్రత్యక్షముగ (?)

'దేవుఁ డెట్టివాఁడంటా తెగని చదువులందు
సోవలుగా నింకా నేమి సోదించేవయ్యా' (8-16)

'దేవుఁడు శ్రీ విష్ణుఁడని తెలియ
సోవల ననంతునిఁ జూడరె' (16-2)
'దీవులను కొండలెక్కి తిరుగాడనే వద్దు
సోవల బిలములోనఁ జొరవద్దు' (16-4)

190. హరుసము :

'నెరతనములు చూపి నిరంతరము నాథుని
హరుషించంగఁ జేసితొ గదమ్మా' (3-658)
'తావులు చల్లెడి దేహము
తలఁపులు మీరిన హరుషము' (3-662)

ఈ రీతిని తాళ్ళపాకకవుల రచనలలో నపూర్వములగు పద ప్రయోగము లెన్నియో వందలకొలఁదిగా భాషాపరిశోధకులు పరిశీలింపఁదగినవి కలవు.

★

షష్ఠాధ్యాయము

# తాళ్లపాకవారి వాఙ్మయమున ప్రతిబింబించిన రాజకీయ మత సాంఘిక పరిస్థితులు

( పుటలు. 481 - 550 )

రాజ్యమును ఆక్రమించుకొనెను. అంత నీ ప్రథమవంశ మంతరించెను (1487). తర్వాత సాళువ నరసింహరాజు 1487 నుండి 1490 దాకా రాజ్యమేలెను''.[1]

రాజ్యలబ్ధికై యానాఁటి రాజులు చేసిన పితృ భ్రాతృ పుత్ర హత్యాదులను ప్రత్యక్షముగ నెఱిఁగియుండినవాఁ డగుటచేత నన్నమాచార్యుఁ డట్టి కురుచ బుద్ధులఁ గూడుటకు వెఱచి విషాదమును బ్రకటించినాఁడు.

చిన్నన్న కృతమగు అన్నమాచార్య చరిత్రమునుబట్టి సాళ్వ నరసింహ రాయని సామ్రాజ్య ప్రాప్తి వైభవములను గూర్చియు, అన్నమాచార్యులకును నరసింహరాయలకును గల పరిచయాదులను గూర్చియు మన కెన్నో విషయము లీవరకు చారిత్రకులు గుర్తింపనివి తెలియనైనవి. ఆయా విషయములను గూర్చి కొంత యిదివరకే వివరించి యుంటిని గావున నిట మరలఁ దడవను.[2] ఈ కీర్త నముఁ దిలకింపుఁడు. తన చిన్ననాటనో, యెప్పుడో కలిగినరాజ్యోపప్లవము సందర్భమున దురుష్కులు కాఁబోలును జరిపిన దౌర్జన్యమును, హింసాకాండను అన్నమాచార్యుఁడు కన్నులారఁ గాంచియో, చెవులార వినియో ఖేదము నంది ఇట్లు పొగిలినాఁడు.

రా మ క్రి య

"తతిగాని యీ పాటు దైవమా విచారించవే
కతలాయ చెప్ప నేఁడు కలికాల మహిమ ॥

తుటుములై భూసురుల తుండెములు మొండెములు
యిటువలె భూతములు యెట్టు మోచేనో
అటు బాలుల రొదలు ఆకాశ మెట్టోరిచెనో
కటకటా యిట్లాయ గలికాల మహిమ॥

అంగలార్చే కామినుల యంగ భంగపు దోపు
లింగితాన మింట సూర్యుఁ డెట్టు చూచెనో
పొంగు నానా జాతి చేత భువన మెట్లానెనో
కంగి లోక మిట్లాయఁ గలికాల మహిమ॥

1. చూ. అన్నమా. చరిత్ర పీఠిక పుట 43 - మహమ్మదీయయుగము నుండి యుద్ధృతము.
2. చూ. నా గ్రంథము "తాళ్ళపాక కవుల కృతులు-వివిధ సాహితీ ప్రక్రియలు"

అరుదుగ గోహత్యలు సేయఁగ దూడ లంగలార్చ
సరి ధర్మదేవ తెట్టు సమ్మతించెనో
పరధనచూర కెట్టు పట్టాయెనో లక్ష్మి
కరుణ యెందణఁగెనో కలికాల మహిమ॥

దేవాలయాలు నానా దేశము లెల్లా, జొచ్చి
దేవగా నెట్లుండిరో దేవతలు
తావులేక రాజులకు దయ గొంత పుట్టదాయ
కావరమే ఘనమాయ కలికాల మహిమ ॥

నిరపరాధుల జంపి నెత్తురు వారించగను
తెరల కెట్టుండిరో దిక్పాలులు
విరసవర్తనులుండే విపరీతకాలమున
గరువాలుంగపటాలె కలికాల మహిమ ॥

వుపమించి దంపతులు వొకరొకరినిఁ జూడ
చపలదుఃఖములతో సమయఁ గాను
తపములు జపములు ధర్మము లెందణఁగెనో
కపురుంబాపాలు నిండె కలికాల మహిమ॥

తలలు వట్టీడువఁగా తల్లులు బిడ్డలలేయ
తలపెట్టుండెనో యంతర్యామికి
మలసి ముక్కులుగోయ మరుఁడెట్టు వోరిచెనో
కలఁకలే ఘనమాయఁ గలికాల మహిమ॥

దీనతలోఁబడి గుండె దిగు లసురుసురులు
వానినెట్లు లోఁగొ(నె)నో వాయుదేవుఁడు
గూనువంచి తల్చి చూడఁ గొడుకుఁ గుత్తిక గోయ
గానఁబడె నిందేసి కలికాల మహిమ॥

పలుమారు నమ్మించి ప్రాణములు గొనఁగాను
యిలఁ దమలోఁ బ్రాణా లెట్లుండెనో
నెలవై శ్రీ వేంకటేశ నీవే మెరుగుదువు
కలుషమే ఘనమాయఁ గలికాలమహిమ॥" (11-133)

ఆ నాళ్ళలో దండయాత్రల సందర్భమున తురుష్కులు గావించుచుండిన దౌర్జన్యము నిట్టే యంతకుఁ బూర్వము కంపరాయల భార్యయగు గంగాదేవి 'మధురావిజయము'న కనుల గట్టించియుండినది. ఇబన్‌బతుతా అను అరబ్బు యాత్రీకుఁడు కూడ నీ విషయములనిట్టే వ్రాసియున్నాఁడు.[1] అప్పుడే కాదు, అన్నమాచార్యుని కాలమున గూడ వారి ప్రవర్తనమట్టే దుడుకుగా నుండినది.

ఇట్టి దౌర్జన్యమును దలఁచుకొనియే తాళ్ళపాకవారు రాజకీయములన్న విసుగుఁజెంది కలికాలమును దూయబట్టినారు.

ఆ హి రి

'కటకటా మీరితివి కలికాల మహిమా - పుణ్య
ఘటన కరవై పోయెఁ గలికాల మహిమ॥

భూసురుల కామినులు బోయనాయకుల
జేసుకొని యాండ్లై చిచ్చురికిరి
యీసునను నీవలన నెక్కువకులము లెల్ల
కాసునేయకపోయెఁ గలికాలమా॥

అన్నలును చెల్లెండ్లు నాండ్లు మగలును నైరి
వన్నె చెడి యతులు ధనవంతులైరి
ఇన్నియునుఁ జేసితివి యింకనైనా నీకు
కన్నీరు రాదుగా కలికాలమా॥

అరుదగు పతివ్రతలు అభిమానవతులు పలు
దొరల కమ్ముడువోయి తొత్తులైరి
చిరకాల సుకృ...చిత్తమునఁ గొంతైన
కరుణ మాలితివిగా కలికాలమహిమా॥

కోవిదుల మను దొరల కులరాణివాసములు
త్రోవలనె లంజెలై తుది మీరిరి
ఏవంక జూచినా యిట్లనే ధర్మంబు
గావు వట్టితివిగా కలికాలమా॥

1. చూ. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. కీ. శే. సురవరం ప్రతాపరెడ్డిగారు పు. 177-181.

పట్టభద్రుల సతులు పలుమారు నింద...
......రిపెంబులై దీను లైరి
దిట్టైన తిరు వేంకటేశు దాసులు నిన్ను
గట్టివేతురు సుమీ కలికాలమా॥

ఇట్లే మఱియొక కీర్తనము (5-163) నఁ గూడ తాళ్ళపాకవారు కలికాల వర్తనమును నిరసించియున్నారు. కాని పై కీర్తనమున ప్రజాసామాన్యమును గూర్చి మాత్రమే కాక లౌకికవర్తనమున నాదర్శప్రాయులుగ నుండవలసిన ప్రభువులే పెడదారులఁబట్టి చెడిపోయిన విషయమునుగూర్చి కూడ నుక్తమైనది. అందుకే అలౌకిక జీవనమును గడపిన తాళ్ళపాక వంశీకులకు రాచరిక మన్న నంత వెగటు పుట్టినది. ఇంకను జూడుఁడు.

"మేదరింటి లంజెవోయి మేదినీశుఁ దగులంగ
గోదిలికువిటులెల్ల గుల్లిన యట్లు"
" కాపుటూరి మంగలోజు గడిమీఁది రాజుకాఁగా
కాపులెల్లా పని మాని కందినయట్లు" (11-2-31) అనినారు.

కనుకనే ప్రమత్తులగు ప్రభువులను తాళ్ళపాకవారు నిరసించిరి. "కోపుల రాజులనెల్ల కొలిచి కొన్నాళ్ల మేను చూపుడుఁ బూఁటవెట్టి" సొగసినందులకై వా రెంతయో పశ్చాత్తాపపడిరి. "బ్రతికేనంటాఁ బోయి పయిడి పుచ్చుక తన పతియవ సరమునఁ బ్రాణ మిచ్చుటకును, దొడ్డవాఁడ నయ్యేనని దొరలఁ గొలిచి, వారి కడ్డము నిడుపు మ్రొక్కు" దైన్యమునకును ఖేద మంది "వినవే వివేకమా చిత్తపు వికారమా" అని తమ్ముఁ దామే నిందించుకొనిరి.

గజపతులు విద్యానగరముపైఁ బ్రాభవమును జూపినప్పుడు అన్న మాచార్యుఁడు ఒడ్డెభాష నేర్చుకొవలసినవాఁడయినాఁడు. ఇట్లు చెప్పుకొనినాఁడు.

"వొగి నొడ్డె భాషలాడి నొడ్డెవాఁడ నైతిని
తెగి తెలుంగాడనేర్చి తెలుఁగువాఁడ నైతి
అగడై శ్రీ వేంకటేశ అన్నియు విడిచి నేను
తగు నీ దాసుండనై దాసరినైతి" (9-90)

గజపతులను తురుష్కులను తరుమఁ గొట్టిన విజయనగర ప్రభువులును వారి సామంతులును పరాక్రమోపేతులు. అప్పటి ప్రభు సామంతాదుల దండ యాత్రలనే కాఁబోలును స్ఫురింపఁజేయుచు చిన్నన్న యిట్లు రచించెను. "డాకాల గండ పెండారంబు పూని చంద్రికదట్టికట్టి, గీరునామముఁ దీర్చి, కంకణ హార ములు, మకర కుండలములు, బాహుపురులు, ముద్దుటుంగరము ధరించి, వలిపె పేరణి యెప్పుదొడగి, మావుచాయల చొక్కమవు కుళ్ళాయి ధరియించి, బంగారు వలువ వలెవాటుగా వైచికొని, పుడమివేలుపులు గోవిందాష్టకములు చదువఁగా గొడుగులవారు గొడుగులు పట్టగా, నెచ్చరికల వారెచ్చరికలు పలుకఁగా వందిమా గధులు వినుతింప, 'దేవ యెచ్చరిక పరాకు జితనిశాచరవీర చిత్రేశ కృష్ణా' యనుచు వేత్రహస్తులు కదలనేతేర, నూడిగంబులవారు వెంట నడువ, వాద్య ఘోషంబులు జగమెల్లనిండ.

"దళముగా నిరుమేల దళము గాన్పింప
బలిమియై యాదవ ప్రముఖులు గొల్వ
బారైయలో తమ్మ బందను కృష్ణ
తారోయాహరిగె సాధనమాడబేకు
అనుచు గర్ణాట దేశాగతానేక
ఘన వీరభటులు చెంగట శౌరి కొలువ
అయిత్తమాఘ వందలిమున్నిబన్ని
ఆయుధంగొండునీయంగె వా యనుచు
వివిధ వాక్యములచే వేర్వేరఁ బిలచి
ద్రవిడ సద్భటులు చెంతలఁ జేరి కొలువ
ఆసో ఆడె ఆగె హరిజగన్నాథ
దాసు హేబలుఖండ దారురేయటంచు
నంతంత దాటి సాహసము చూపుచును
వింతగాఁ గాళింగ వీరు లేతేర
వాహినీపతిపోలె వాహినీసమితి
వాహినీవిభుఁడు భూవర యొప్ప మిగిలి
యుండెనట" (చూ. అష్టమహిషీ కల్యాణము పుటలు 188-192)

ఇందలి కృష్ణుఁడెవరో! ఈ వర్ణనము చాల వరకు పింగళి సూరన చిత్రిం చిన నంద్యాల కృష్ణ భూపాలుని వర్ణనముతో సంవదించుచున్నది. ఈ కృష్ణుఁడా

కృష్ణ భూపాలుఁడేయగునేమో! రత్నరుచిరకూటంబగు శ్రీ కృష్ణుని కొల్వుకూట మిట్లున్నది.

"హితులు మంత్రులు పురోహితులు బాంధవులు - యతులును దండ నాయకులు మల్లులును

దివిజులు కిన్నరు ల్ద్విజేంద్ర ముఖులు-కవులు గాయక పాఠక వ్రాతము లును కనుపట్టు పేరోలగంబు గన్గొనుచు" (పు. 183)

విజయనగరాధీశుని దండయాత్రలనే కాఁబోలును తాళ్ళపాకవారిట్లు ప్రశంసించిరి.

నాట

"విఱిగి పారెడియట్టి వీరిడి యోరిపులాల
తఱి శరణు చొరరో దండాలు వెట్టరో ॥

వీఁడెవచ్చె గృష్ణుఁడిదె వేయరో కైదువులు
కాఁగిన పోట్లు రాఁగి కదియకురో
పొడిమితో భీతివాయ పూరి నోళ్ళఁ గరవరో
ఆడువార మనుకోరో అతఁడు దడవఁడు॥

గోవిందుఁడు దాడివచ్చె గునుకుచుఁ బారరో
కావుమని మెడల పాగలు వేయరో
వేవేగ బిడ్డలకు విభుని పేర్లు బెట్టరో
వో వో యెంగిలి చేతు లొగ్గరో రక్షించీని॥ " (7-11)

ఈ కీర్తనము పెదతిరుమలాచార్యుని దగునా! ఆ కృష్ణుఁడు కృష్ణరాయఁడే యగునా! యని సందేహము. పెదతిరుమలయ్య శ్రీ కృష్ణరాయని యనుగ్రహ మును పొందుటకు తొలుత కొంత యత్నించినట్లున్నది. కాని యా యత్నము ఫల ప్రదమైనట్టు కానరాదు. ఏలనో అన్నమాచార్యుని పుత్రులకును, వీర నర సింహ కృష్ణరాయాదులకును పొంది పొసగినట్లు తోచదు. మరల అచ్యుత దేవ రాయలు ప్రాభవమునకు వచ్చిననాఁటికిగాని పెదతిరుమలయ్య విద్యానగర ప్రభు వులతో ప్రమేయము గల్పించుకొనలేదు. కృష్ణరాయఁడు క్రీ. శ. 1514 లో తాళ్ళపాకవారి యగ్రహారమగు తాళ్ళపాక గ్రామమును రొఖ ధాన్యాలతోఁ గూడ

శ్రీ భాండారానికి రూపు చేయించినాఁడు. దాతకు చెందవలసిన పాతిక భాగమగు ప్రసాదమునుగూడ రాయలు తసవారగు రంగదీక్షిత, శివదీక్షితులకే యిప్పించి నాఁడు [1] మరల క్రీ. శ. 1524 లో తాళ్ళపాక గ్రామముతో కూడుకొని మరి యైదు గ్రామముల మీఁది యాదాయమును స్వామివారి శ్రీ భండారానికి సమర్పించి ప్రసాదభాగములను వ్యాస తీర్థులవారి కిప్పించినాఁడు. తాళ్ళపాకవా రందులకు కినిసినట్లున్నారు. "పుట్టు భోగులము నేము భువి హరిదాసులము నట్టనడిమి దొరలు నాకియ్యవలెనా" అనియు,

"గ్రామములు రత్నములు గజముఖ్య వస్తువులు
ఆమని భూకాంతకు నంగభేదాలు
భామిని యాకె మగని ప్రాణధారి లెంకలము
కోమి నూకాతఁడే యిచ్చీ దొరలియ్యవలెనా"

అనియు ధిక్కరించి తెగఁ బలికిరి. అందుకే "కల్లలాడుట నరకము త్రోవ యనక మనోస్మృత్తులో భూమిపతులకు సత్యమెప్పట్టునంగలదె' అని చిన్నన్న వాపోయినాఁడు. పరకాలయోగి కథలో రాజున కాగ్రహము కలిగి, 'యితనికిచ్చిన సీమలెల్లఁ గైకొనుడు - ఇతనిఁ పత్తురినుండనీక మీరరిగి, యతివేగమున నెట కైనఁ బొమ్మనుఁడు'అని యాజ్ఞాపింపఁగా,నాతఁడు 'కొదుకక మీతోడి కుసుగింపు చాలు, బదివేలు వచ్చె మీ పట్టణంబదియే' అని చెప్పి వీడి చనెనట. 'మనుజాధి నాథుడు మాటపట్టుడిగె, తన సీమ యంతయుఁ దానె గైకొనె' నట. (చూ. పరమ. పుటలు 397-404) ఇందు తుళువరాజుల ప్రవర్తన మేమేని సూచితమై యున్న దేమో ; చిన్నన్న పరమయోగివిలాసమున కథాకథనమును బురస్కరించుకొని తాత తండ్రుల వృత్తాంతములను గొన్ని కొన్ని తావుల సూచించినాఁడు. ఇదియు నట్టి యుదాహరణము కాఁదగును.

పెద తిరుమలాచార్యుని నీతి సీస శతకమున సమకాలిక రాజనీతి విషయ ములనేకములు చర్చింపఁబడినవి. 'పట్టిన ముద్రుంగరపు ప్రధాని కెదురు లే' (7-3)దని అన్నమాచార్యుఁడు పల్కినాఁడు. రాజుల దినచర్యనుగూర్చి యాముక్త మాల్యదలో నున్నట్లే తాళ్ళపాకవారి నీతి సీస శతకమున గూడ నున్నది. చిన్నన్న పరమయోగివిలాసమున రాజుల దినచర్యనిట్లు ప్రత్యక్షీకరించినాఁడు.

1. చూ. సం. 68 - తి. తి. దే. శా. సం.

"రాజవై దేవర రాజ చిహ్నముల
నోజమై క్రమమున నొక కొంత తడవు
నామతీర్థము రామనామ సంస్మరణ
మా మీఁద హరిపూజయది కొంతతడవు
నంతట శ్రీ వైష్ణవానుభాషణము
లంతనారోగణమైన మీఁదటను
నకలంక రామాయణాదిసంశ్రవణ
మొకకొంత తడవుమై నుచితకృత్యములు
సలుపుచు సకల రాజ్యంబు పాలింప
వలయుగాక" (పరమ-పు. 164)

మహారాజు ఏకాంతమున నున్నప్పుడు అపసరంబులవారి నడిగిగాని, లోని కెవరికిని ప్రవేశింప వలనుపడదు. అనుమతిలేనిదే ద్వారపాలకులు లోనికిఁ బోనివ్వరు. ఉప్పవడమై రాజు కొలువైన యపుడే దర్శన మిచ్చును నెరయఁ గుంకుమ పువ్వునించిన మలఁగుటొరగుపై నొయ్యార మొలయంగ నొరగి కువల యేక్షణలు వీవనలు వీవంగ ముప్పిడిహడపంబుఁ దాల్చి యొకతె నిలువ, నొక్కతె కుంచియ వైచుచుండ, కలికి గుబ్బెత లూడిగంబులు సేయ ప్రభువు కొంత తడ వుండును. విన్నపము లాలించును.

రాజు లాంఛనముల నలకరించుకొని సభామంటపాంతరస్థలి కేతెంచును. సింహాసనాసీనుఁడగును. "ఒక చోట రాజన్యు లొక చక్రి మంత్రు, లొకదెస విద్వాంసు లొకయెడ గవులు, నొకవంక గాయకు లొక చాయ మిత్రు, లొక భాగమున నటు లొకపార్శ్వసీమ సుకుమారులగు చేర చోళ పాండ్యులును నొక దిక్కునను సారసోత్పలేక్షణలు, సకలదేశాధీశజనము సేవింప మంత్రి వర్గం బొకచాయఁ గొలువ, గట్టుకవారు బరాబరి సేయుచుండ, నిరుమేల పట్టభద్రులూ డిగములు పట్టి కొల్వంగ, కొలువుండును. పిదప మానవేశ్వరుఁడు మధ్యాహ్న వేళ మజ్జనమున కాయత్తమగుచు జలకమువార లెచ్చరికలు సేయ సభాసదుల నుచితరీతిని సంభావించి నిజ నివాసముల కనిపి తొడవులు సడలించి హేమ పీఠంబునందు తాళి గోణంబుతోడ నాసీనుఁడై జగజెట్టులు పెనుప్రేలిసందులఁ బెనుప్రేలిసంధు లెనయుంచి నివురుచు సొగసుగా నెటుకలు విరచి జవ్వాది మెరుగు హస్తముల డాలించి మైమర్దనము గావింప వైష్ణవులతో సంభాషించును.

# తాళ్లపాకవారి వాఙ్మయమున ప్రతిబింబించు రాజకీయ మత సాంఘిక పరిస్థితులు

వాఙ్మయము ప్రజా జీవితమును ప్రతిబింబించునను విషయ మెల్ల రెరిగినదే. తాళ్లపాకవారి వాఙ్మయము ప్రజా శ్రేయస్సును దృష్టిలో నిడుకొని సృజింపఁ బడిన దగుటచేత నందు వారి కాలపు ప్రజాజీవనవిధానము ప్రద్యోతమగుటలో నాశ్చర్యములేదు. అందును తాళ్ళపాకవారి వాఙ్మయము విజయనగర యుగమునందలి ప్రజల జీవితమును పలుకోణములలో పరిశీలించి ప్రదర్శించిన దన వచ్చును. వాఙ్మయము నాధారముగా చేసికొని నాఁటి ప్రజాజీవితమును గుర్తించుపట్టున తాళ్ళపాకవారిని విస్మరింప వీలులేదు. ఈ విషయమున వారి కావ్యములును, సంకీర్తనములును, శాసనములును సాంఘికచరిత్రకారుల కెనలేని దోహదము చేయఁగలవు.

పై వాఙ్మయాధారములనుబట్టి మన మానాఁటి రాజకీయములు, రాచరికము, ప్రభుత్వ పరిపాలనవిధానము, యుద్ధము, నేరము, శిక్ష, ఆర్థిక వ్యవస్థ, టొక్కనాణెములు - మున్నగు వానిని గూర్చియు; మత పరిస్థితులు, సంఘర్షణలు - సామరస్యములు, మతపోషకసంస్థలు, ఆలయోత్సవములు, సేవలు, పండుగ పబ్బములు - మున్నగు నంశములను గూర్చియు; సమాజము, సామాజిక పరిస్థితులు, పెండ్లి పేరంటములు, సాంఘికాచారములు, విశ్వాసములు, కుల గోత్రములు, వృత్తి వ్యాపారములు, పరిశ్రమలు, కళలు, ఆటలు పాటలు మున్నగు విశేషములను గూర్చియు అనేక విషయములు గుర్తింపనగును. క్లుప్తముగ విశదీకరింతును.

## రాజకీయ పరిస్థితులు :

విజయనగరసామ్రాజ్యమును పరిపాలించిన సంగమ సాళువ తుళువ ఆరవీటి వంశముల నాల్గింటి రాజకీయవృత్తాంతములను తాళ్ళపాకవారు ప్రత్య

క్షముగ నెరిగినవారు. సామ్రాజ్యము సంగమ వంశీకుల చేతినుండి సాళువరాజుల యేలుబడిలోనికి వచ్చిన వైనమును అన్నమాచార్యుఁ డెరిగి యున్నాఁడు. పెద తిరుమలయ్యయుఁ, దత్పుత్ర పౌత్రులును తుళువ ఆరవీటి వంశ వృత్తాంతములను ప్రత్యక్షముగ నెరిగియుండినవారే. ఆనాఁడీ కుటుంబమువారు సామాన్య పౌరులుగా మాత్రమే కాక మత ప్రపంచమున నాచార్య స్థానమును వహించినవారై, కళాకారులై, నాఁటి రాజుల తోడను, రాజకీయములతోడను గొంతకుఁ గొంత ప్రత్యక్షముగనో, పరోక్షముగనో సంబంధము కల్పించుకొన్నవారుగనే కన్పింతురు. కనుకనే వారి వాఙ్మయమున తచ్ఛాయ లించుక గోచరించుచుండును. చూ.

శ్రీ రా గం

"వెరతు వెరతు నిందు వేడుకపడ నిట్టి
కురుచబుద్ధుల నెట్లు కూడుదునయ్యా॥
దేహ మిచ్చినవానిఁ దివిరి చంపెడివాఁడు
ద్రోహి గాక నేఁడు దొర యఁటా
అహికముగ నిట్టి యధమవృత్తికి నే
సాహసమున నెట్టు చాలుదునయ్యా॥
తోడఁబుట్టినవానిఁ దొడరి చంపెడివాఁడు
చూడ దుష్టుఁడు గాక సుకృతి యఁట
పాడైన యిటువంటి పాపబుద్ధులు నేసీ
నీడ నిలువ నెట్టు నేరుతునయ్యా॥
యింటివేలుపు వేంకటేశ్వరుఁ దనవెంట
వెంటఁ దిప్పెడువాఁడు విభుఁ డటా
దంటనై యాతని దాసానుదాసినై
వొంటి నుండెద నేమి నొల్లనోయయ్య॥" (5-138)

సంగమవంశపు తుదిపాలకులలో "విషయాసక్తుఁడగు విరూపాక్షరాయని నాతని పెద్దకొమారుఁడగు రాజశేఖరరాయలు చంపించెను (1478). ఇతనిని ఈతనితమ్ముఁడగు రెండవవిరూపాక్షరాయలు చంపించెను. కాని యీ భ్రాతృహంత పరిపాలనము ప్రజల కిష్టమైనది కాదయ్యెను. ఆతని దండనాయకుఁ డగు సాళువ నరసింహరాజు సర్వజనులు తన కనుకూలురుకాఁగా రాజును వెడలఁగొట్టి

మజ్జన భోజనాదులను ముగించికొని నగరిలో నొక కొంత తడవు పవళించి యుండి యుప్పవడమై వేళ యెరిగి మరల కొలువుకూటమును జేరుకొనును" (చూ. పరమ. పు. 164-171)

ఈ రీతిని చిన్నన్న ప్రభువుల దినచర్యను గూర్చి కొంత ముచ్చటించెను. "భూపతియే బొక్కస భాండారములు, వాని లెక్కపొక్కలు-మన్నీలు చెల్లింప వలసిన నిల్వసల్వలు విరాడములు సరవి గానుక దేవసంబు ధాన్యంబు నరసి యుగాది దీపావళులందు పగిది జెల్లించు సప్పగిది రాహుతుల నగరిబంటుల జీత నాతంబు లరసి పారుపత్తెము సేయుచుండవలె" ననియు చిన్నన్న వివరించెను.

ఆ నాళ్ళలో మతవ్యవస్థయు, రాజకీయవ్యవస్థయు స్వతంత్ర ప్రతిపత్తి గల్గి భిన్నములుగా నుండెడివి. శ్రీ భాండారము, రాజభాండారము వేరుగ నుండె డివి. ఆలయమునకు, మతమునకు సంబంధించిన వ్యవహారములను స్థానిక స్థాన పతులతోఁ గూడిన పంచాయతీసంస్థలవంటి సభలే పరిష్కరించుచుండినవి. వారి సూచనలు ప్రభుత్వమువారు పాలించుచుండిరి. అత్యవసర మయినపుడుతప్ప ప్రభుత్వమువారు ఆలయ మత వ్యవహారములందు ప్రత్యక్షజోక్యము కల్పించు కొనెడివారు కారు. అట్టి సందర్భములందు మాత్రము ప్రభువులు దయాదాక్షిణ్య ములు చూపెడివారు కారు. తిరుమలలోని యాలయమున స్వామియాభరణములను దొంగిలించిన నేరమున నక్కడిపూజారులను సాళ్వ నరసింగరాయఁడు కఠినముగ శిక్షించెను. వారియాస్తిపాస్తులను వశపరచుకొని రాయఁడు వారికి మరణశిక్ష విధించినట్లు తెలియుచున్నది. పై విషయములకు విజయనగరకాలమునందలి శాసనములే ప్రమాణములు. చిన్నన్న పరమయోగివిలాసమున విప్రనారాయణుని కథలోను, పరకాలయోగికథలోను నిట్టి 'సభ'ల నిర్వహణమును గూర్చి కొంత ముచ్చటించెను. రెండుపక్షములవారి కేదేని విషయముపై వ్యాజ్య మేర్పడి నపుడు వారు తొలుత వాదోపవాదములకు దిగి 'వాదడచి యామీఁదఁ దగవున కొప్పి యిద్దరు నేగుదెంచి తగవువారలతోడ తమ పను ల్మానిడివి'కొనెడివారు. 'తగవువారలు' న్యాయమును విచారించెడి తీర్పరులే. వారాయా గ్రామములందలి పెద్దలో, రాజప్రతినిధులో అయి యుందురు. అట్టి 'తగవువారల'నే 'సభవా' రనియు పిలచెడివారు. సభలో విచారణ జరపించుకొనుట కర్థి ప్రత్యర్థులు కట్న కానుక లర్పించుకొనవలసి యుండెడిది. అట్లు

"తగవువారలతోడఁ దమపను ల్నొడివి
కట్టకానుక లిడి కడపట నిలువ
గట్టిగా నా కార్యగతి విచారించి
యలయున్న సభవార లా యిరువురను" - బిలచి ...

సాక్షి సంబంధములను, పత్రములను విచారించి న్యాయసమ్మతమగు తీర్పు నిచ్చు చుండిరి (చూ. పరమ. పుటలు. 446-447). పత్రములు తాటియాకుల మీఁదనో, తామ్రశాసనముల రూపముననోగూడ నుండెడివి. ఈ పూట పత్రములను వ్రాయుటలోను, వ్రాయించుటలోను బుద్ధి సూక్ష్మతయు, న్యాయతర్కములును నాఁటి ప్రజలు ప్రదర్శించెడివారు.

పరకాలునికథలో పరకాలునకును, జైనులకును వాదమేర్పడి నప్పుడు సభవారుకూడి వాద ప్రతివాదములను విని సాక్షిపత్రములను జదివి 'చిటుకన వ్రేలు గడమకాకుండ మీ కొప్పుగావింతు' ననుచు నున్న వాక్యసరణిఁబట్టి పరకాలుని వాదమును సమర్థించుచు "నాకు లోనున్నది యంతియేకాని యా కాంచనాకృతి యంతయు మీకు నొప్పింతుననుట లేకుండుటం జేసి తప్పుగైకొని పట్టతగ వేది మీకు" అని అభియోగమును ద్రోసిపుచ్చిరి.[1] ఇట్టి పత్రములలో ప్రధాన విషయముతోపాటు వారు గడువు దినములను, సమమాసతిథివార సరణులను స్పష్టముగఁ బేర్కొని "యొడబడి సవరించు పత్ర" మను గుర్తునకై "పత్రహస్తు నొప్పము" ( = అంగీకారము) ను, సాక్షులగు వారియొప్పమును గూడ క్రింద వ్రాయించెడివారు.

ఇట్టి సాక్షిపత్రముల యాధారమున సభవారిచ్చిన తీర్పు ఉభయ పక్షములలో నెవరికి నచ్చక పోయినను వారు మరల ప్రభుసన్నిధానమున విషయమును నివేదించు (aPpeal) కొనెడివారు, ప్రభువు స్వయముగా విషయమును బరిశీలించెడివాఁడు. (చూ. పు. 460). పరకాలునికథలోనే "అనవిని తగవున హైన్యంబు నొంది చని సౌగతులు చోళజననాథుగాఁచి తమ హేమగురుఁ బరాంతకుఁడుగై కొన్న క్రమమెరిగించి" న్యాయము నర్థించిరట!

లౌకికములగు వాద వివాదముల నిట్టి సభవారే పరిష్కరించుచుండినను స్వామి ద్రోహమని చెప్పఁదగిన 'దొడ్డతప్పిదము' అను మాత్రము సభవారో,

1. చూ. పరమయోగి విలాసము. పు. 460.

అచ్చటి రాజకీయాధికారియో కాక ప్రభువునకే నివేదించి దోషవిచారణ జరిపించెడివారు. విప్రనారాయణుని కథలో చిన్నన్న శ్రీ రంగాలయము నందలి బంగారు గిన్నె యపహరింపఁబడిన సందర్భమున నేరారోపణము మొదలుకొని శిక్షావిధి వరకును జరిగిన దోష విచారణ క్రమమును కనులగట్టినట్లు వర్ణించెను. (చూ. పరమ. పు. 265-283).

కోవెలకుఁ గర్త 'పెద్ద జియ్యరు' 'నంబులు', వారియాజమాన్యమున స్వామిసేవ గావించెడివారు. గుడిలో బంగారు గిన్నె పోయినది. నంబులు జియ్యరు పాదముల కెరగి విన్నవించుకొనినారు. సభయుఁడై జియ్యరు అచ్చట రాజకీయ "అధికారి" (ముద్రకర్త)ని, సభికులందఱ్ఱక్కన స్థానంబు వారిని వెంటనే సమావేశపరచి విషయము నివేదించెను. నంబులకుఁ దెలియక గుడిలోని గిన్నె బయటికి పోజాలదు కావునను, కోవెలకు, నంబుల వర్తనమునకుఁ గర్త తానే కావునను జియ్యరు "కడువాడి యేకాంగి కత్తి దెమల్చి - యడలుచు మెడబూని" ప్రాయశ్చిత్తము చేసికోఁబోయెను. అంతలో నంబులు నచటి స్థానంబువారుఁ "బిన్నలి దప్పించియే వెరవులకు దామిందరుండంగ దేవర యిటు సేయఁదివురనే మిటికి"నని యధికారి యయ్యతిని లాలించెను. భృత్య సమితిచేత నధికారి తొలుత నంబుల నడ్డపెట్టించెను. నంబులు "దృష్టిశోధన మమ్ముఁ దెలిసివకోయ్యా" అని మొరలిడిరి. ముద్రకర్తయగు నధికారి యనుభవజ్ఞుఁడగుటచేత దృష్టిశోధన చేయఁ జాలినవాఁడని తలఁప నగుచున్నది. అట్లేయని యాతఁడు వారి నడ్డపెట్టించెను. "అడ్డపెట్టుట" (Remand) లో "భృత్యసమితి (Police) నంబుల కావి కట్టణము ( = కాషాయవస్త్రము ?) లొలిచి "వేడి యెండలో మిగుల జడియ వీపులమీఁదఁ జాపరాలెత్తి పొగడదండలు వైచి పోనీక యెదుట బెగడ దిట్టుచు" నుండిరి. వేశ్యమూలమున దొంగసొమ్ము దొరికిన పిదప నంబులకు పెట్టిన "యడ్డపెట్టుచాలించి"నారు. వేశ్యను, తద్బంధుజనమును, విప్రనారాయణుని అధికారి సమక్షమున సభవారు శోధనవిచారము (cross examination) జరపి పురవీధులలో దోషులను దిప్పి తీసికొని పోయిరి.

"గాసించి వీరినిక్కడ నాకునేన
చేసెత బట్టి శిక్షించితినేని
ఈ జాడ తనకేల యెరిగింపవనుచు
రాజు విన్నను నపరాధంబువచ్చు"

నని ముద్రకర్తయగు నధికారి యభియోగమును నిందితులను పట్టుబడిన

సొమ్ముతోఁ గూడ మహారాజు ముందుంచెను. రాజు మరల వారినందరను విచారించి బంగారు గిన్నెను ఆలయమున కంపవలసినదిగా తీర్పరిం బిలచి చేతికి నిచ్చి కనలి-

"యీ చోరునకు నాజ్ఞయేది శాస్త్రంబు చూచి సేయింపు దచ్చుగ మీరటంచు

దెలియ విద్వాంసుల దిక్కు వీక్షించి" పలికెను. శిక్ష విధించెను. ఈ విధమున నా నాఁటి న్యాయవిచారణమును, దోష విచారణమును సాగుచుండినవి.

భృత్య సమితి (Police) వారు "ఘల్లు ఘల్లన గిలకలతోడి గుదియ ఙల్లనల్లన భూమి యదర నూదుచును" వెడలి దొంగలను, దొంగసొమ్మును పట్టుకొనెడివారు. ఈ భృత్యసమితి వారికిఁ దోడుగ దోషజ్ఞులును, దోషాన్వేషణ సమర్థులును నగు తలవరులు (Spies) గూడ పనిచేయు చుండిరి. వారు 'నీటిలో జాడ లెత్తంగ జాలు తలవరు' లట! పరకాలునికథలో నాగపురజైన విగ్రహము దొంగతనముపోయిన పిమ్మట తలవరులు దొంగలయడుగుల పొడను (foot prints) కొలిచి గుర్తించి యా జాడలను బట్టి శ్రీరంగమును జేరుకొన్న పరకాలుని బంధింపగలిగినట్లు చిన్నన్న వివరించెను.

ఇట్లా దినములలో న్యాయ దోష విచారణము చాల సమర్థముగ సాగుచుండినట్లు తెలియనగును. న్యాయ విచారణ సందర్భమున గుత్సితులు గొందరు 'కూటసాక్ష్యములకుఁ బాల్పడువారును, లంచముల్ పట్టి రహస్యముల్ వెలిపుచ్చువారును గూడ నాఁడు లేకపోలేదు. [1] సాక్షులచేత అధికారులు 'మాటపట్టు' తీసికొని సత్యము చేయించెడివారు. అట్లు ప్రమాణము చేయుటకు నిదర్శనముగా వారిచేత నధికారులు కొన్ని భీకరకార్యములు గూడ చేయించెడివారు. కులశేఖరుని కథలో వైష్ణవులు చోరులు కారని బాస చేసినందుకు నిదర్శనముగా రాజుకూౄర సర్పంబు నారూఢిఁ బట్టెదనని 'కుంభ మధ్యమున గర్కోటక నామ కుంభీనసము' నుంచి కృతస్నానుఁడై వచ్చి యందలి హేమపుఘుటికను బైకెత్తెను (చూ. పు. 179.) బాసచేయువిషయమున ప్రజలు జాగరూకులై యుండెడివారు. అప్రమాణములు చేసెడివారుకారు.

## దొంగలు - దొంగతనములు :

చిన్నన్న దొంగల నిట్లు చిత్రించెను. వారు-

1. చూ. నీతి సీస శతకము ప. 13

"యెగదారి హరిగయు యెడమెట్టి గుదియ
చిగురులువెడల గీల్చిన కోరసిగయుఁ (?)
జేయమ్ము, నెకవారు చెప్పులు, రాగి
చాయలు దేరునచ్చపు నీలి దట్టి,
మొలవంకియును, కొనముక్కుతో నారయ
బలువుగాఁ బెట్టిన పట్టె నామములు
నిసుముఁ, గన్నపుగత్తి, యెడ దట్టిలోనఁ
బొసగిన దివ్వార్చుబుర్వల కోవి,
తలముళ్ళు, చొక్కు, నిద్దపు గదగోరు
బలపంబు, బదనికల్ బంతికత్తెరయుఁ" (?)
(పరమ. పు. 406)

గల్గియుందురు. ఉషాపరిణయమున చిన్నన్న చిత్రరేఖకుగూడ నిట్టి వేషమునే కట్టపెట్టెను.

"మంచి నీలములు కమ్మల రావి రేక
ముంచగస్తురియుంట ముఁగరవెట్టి
కనకంపుగత్తి, భృంగంబుల క్రోవి
చిన్నారి సెలగోల చిప్పచేయమ్ము
తిలకంపు నిసుము, కత్తెర, సొక్కుమందు,
బలపంపు బలముళ్ళు బంతికొంకియును"

మొదలైన సాధనంబులు దాల్చి చిత్రరేఖ వెడలినదట.

ఇట్టి సాధనములతో దొంగలను జిత్రించుట నాఁటి కవులకుఁ బరిపాటియే. ఈ దొంగలు చీకటి వేళలందును, వానలు కురిసిన దినములందును ఇండ్ల గోడలకు తేలికగా కన్నమువేసి దొంగతనములు జరుపుచుండిరి. దారి దోపిడి గాండ్రను గూర్చి అముక్తమాల్యదలోని మాలదాసరి కథలో విపులముగా నున్నది. రేవుల యోడల నుండి సరకులు దించుకొని బేహారులు పోవుచుండగాఁ, "బోసీక మీఁద కాపులుపెట్టి తెరువడ్డగించి గద్దించి ధైర్యంబు దెరలంగఁ గొట్టి చేతిని యాఁచి కొనెడి" వారిని గూర్చియుఁ, 'దెరువరుల చందమున నరుగుచు గనుమసంగి మొగ మెరిగిన" వారిఁ జేరి పొదిలిపట్టుచుఁ దొలఁగదోకొనిపోయి చెట్టు గబ్బు పీలగఁ గట్టుకాసెలం గట్టియదయులై కలవెల్ల నపహరించువారిని(అముక్తమాల్యద లోవలె) గూర్చియు, పరదేశమున సెట్లపగిది దిండుగను బెల్లుచుట్టిన పెద

పెదముడాసులు గల వారిని గూర్చియు చిన్నన్న విపులీకరించెను. దొంగలు దొంగతనమున కదను పదను లెరుగుటయేకాక తమ తమ శక్తియుక్తులతో దొంగతనము చేయఁదలచిన యిండ్లను గూర్చియు, వాని పరిసరములను గూర్చియు ముందుగానే వివరములు సేకరించి యుంచుకొనెడివారు. పరకాలుఁ డట్లు చేసియే నాగపురమునందలి జైన విగ్రహము నపహరింపఁ గల్గెను.

## యుద్ధములు-యుద్ధ సాధనములు, విన్నాణములు :

చిన్నన్నతన కావ్యము లన్నిటియందును గొంత యుద్ధ వర్ణనము గావించెను. ఆ కావ్య కథలు పౌరాణికము లగుటచేత కవి సమయముల ననుసరించి సాంప్రదాయికమగురీతినే రథగజ తురగ పదాతి సైన్యములయు వ్యూహములయు కూర్పు తోడి రణమునే వర్ణించెను. కాని యాతని కావ్యములందెడనెడ సమకాలిక వృత్తాంతము కొంత ఆవర్ణనములందు ప్రవేశింపక పోలేదు శ్రీకృష్ణుఁడు జరాసంధునితోఁ బోరు సందర్భమున "ఖోవని నాల్గు దిక్కులు జుట్టి పెటులు కోవులు, జబురు జంగులు, ఫిరంగులును, బుసకోవులును" గసాబులు, తుపాకులును ప్రయోగించినట్లాతఁడు వర్ణించెను. వీనిలో తొలి మూడు నాలుగింటి ప్రస్తావన కృష్ణరాయవిజయము మున్నగు గ్రంథములందు గలదు. పలకయు వాలునీటెలు విల్లమ్ములు మున్నగు సాంప్రదాయిక సాధనములే (Conventional arms) కాక తుపాకులు, ఫిరంగులు మున్నగు నాధునిక సాధనముల (Modern weapons) ను గూడ వారు వాడుచుండినట్లు వర్ణింపఁబడుట గుర్తింపఁదగినది. అష్టమహిషీ కల్యాణమున చాణూరునికథలో మల్ల యుద్ధ విన్నాణములను చిన్నన్న యభిమానముతో చిత్రించెను. ఆనాళ్ళలో స్త్రీలు పురుషులు కూడ సాము నేర్చిన జగజెట్లుగా నుండెడివారు. నాఁడు వీరపురుషులు వలువురు సాము, కుస్తీ నేర్చిన ధీరులుగా తెలియవత్తురు.[1] చిన్నన్న ముష్టి యుద్ధ వర్ణనమున శౌలము, ఉల్లాంగము, జఠరము, డొక్కరము మున్నగు చిత్ర గతులను పరిచితరీతిని చిత్రించెను. నాచన సోమన్నయు, పోతన్నయు నిట్లే మల్లయుద్ధ విన్నాణములను వర్ణించి యుండిరి.

## నాణెములు :

విజయనగరకాలపు నాణెములను గూర్చియు, వాని విలువను

---

1. చూ. శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారి "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" పు. 136

గూర్చియు తాళ్లపాకవారివాఙ్మయమున మనకు గొన్ని వివరములు తెలియు చున్నవి. అప్పటి నాణెములలో రూక, మాడ, రువ్వ. చిన్నము, తారము, కొత్త, మినుకు, కాసు మున్నగునవి కలవు. చూ. 'రూకలై మాడలై రువ్వలై తిరిగిని - దాకొని వున్నచోట దానుండ దదివో............ప్రకటించి కనకమే భ్రమయించీని' (5-283).

ఈ రూకలు, మాడలు – రువ్వలు[1] బంగారు నాణెములు. 'రూకైత్తుపైడి లేదు' అని చిన్నన్న వ్రాసెను (పరమ-పు. 270) అప్పటి శాసనములలో పణములు, నార్పణములు, సువర్ణ రేఖలు, గట్టి వరహాలు, అపరంజి రూకలు వర్ణితము లైనవి.

చూ. సం. 80 - సం. III. తి. తి. దే. శా. (1518) 'విమానానకుపైకి పూసేందుకు వరహాలు గ-30,000'. సువర్ణరేఖలే 'రేఖై పొన్' అనియు 'నార్పణము' లనియు నాఁటి తమిళశాసనములందు వ్యవహరింపఁబడినవి. (చూ. తి. తి. దే. శా. సం. 47 - సంపు. 5 - 1545). బహుశః నాఁటి సువర్ణరేఖలే తాళ్ళపాక వారు పేర్కొన్న 'రూక' లై యుండును. లభించిన నాఁటి నాణెములను, నాటి శాసనములను, సాహిత్యమును బరిశీలింపఁగా మనకీ క్రింది విషయము తెలియ నగును.

**బంగారు నాణెములు :**

గద్యాణము, పొన్, రేఖై పొన్, నార్పణం, అపరంజిరూక, రూక, పగోడా, సౌర్ణాటంకము - అను నామములతో వరహాలు వ్యవహరింపఁబడు చుండెడివి. ఈ వరహాలు దొడ్డవరహా, గట్టివరహా, శుద్ధవరహా అని మూడు విధముల నుండెడివి. వరహా నాఁటి బంగారునాణెములలో పెద్దది.

దీనితర్వాత మాడ, మాడై, ప్రతాప, ప్రతాపమాడై అను నామములతో వ్యవహరింపఁబడిన నాణెము లుండినవి. ఇంకను కాటి, హొగ, పణము అను మరికొన్ని బంగారునాణెములు కూడ నుండినవి.

1. రాగి దమ్మిడీకి 'రవ్వ' అను వ్యవహారము కొంతకాలము క్రితము వరకును మన దేశమున నుండెడిది. కాని తాళ్ళపాకవారు పేర్కొన్న 'రవ్వ బంగారు నాణెముగా, రూక కన్న మాడ కన్న తక్కువ విలువ కలదిగా తెలియ నగుదు.

**వెండినాణెములు :**

చిన్నము, తారము అనునవి నాఁటి వెండినాణెములు. 'నీవొక చిన్న మొసఁగవు' (పరమ. పు. 250) అని చిన్నన్న దీనిని పేర్కొనెను. 'న్యాయార్జితము తార మైనలెస్స' (నీతి సీస. ప. 79) అనియు, 'తప్పులేని జీత మొక్క తారమైన లెస్స' అనియు తాళ్ళపాకవారు 'తారము' నొక్క నానుడిలో చేర్చి చెప్పిరి.

**రాగి నాణెములు :**

పణము కాసు, జీతల్ మున్నగునవి నాఁటి రాగినాణెములు.

"కాసు సేయకపోయె కలికాలమా" (11-2-77) అనియు,
"కాసు చెల్లింపకున్నాఁడు" (చిన్నన్న-పరమ.) అనియు
తాళ్ళపాకవారు "కాసు"ను పేర్కొనిరి.

ఇవికాక కొత్తలు, మినుకులు మున్నగు నాణెములనుకూడ తాళ్ళపాకవారు పేర్కొనిరి. 'కొత్త లిచ్చెదో పుచ్చుకొనియెదో' అని చిన్నన్న (పరమ.పు.250). ఇవి యే నాణెములో తెలియవు. కాని తాళ్లపాకవారు వర్ణించిన తెఱఁగునుబట్టి యివియు బంగారునాణెము లని తలఁతును.

ఆ నాణెములను బరిశీలించి శ్రీ ఆర్. యస్. పంచముఖిగారు "The Coinage of Vijayanagara Dynasties" అను వ్యాసమున (చూ. Vijayanagar Sexcentenary Commemoration Vol. P. 101) వాని విలువల నిట్లు పేర్కొన్నారు.

| | | |
|---|---|---|
| 4 హాగలు | - | 1 పణము |
| 2 పణములు | - | 1 కాటి |
| 2 కాటీలు | - | 1 మాడ (ప్రతాప) |
| 2 మాడలు | - | 1 పగోడా (వరహా) |

ఈ విలువనే కాక

| | | |
|---|---|---|
| 3 (నాణెములు) ? | - | 1 తారము |
| 6 తారములు | - | 1 పణము |
| 10 పణములు | - | 1 ప్రతాప. |

అను వేరొక వ్యవహారమును గూడ వీరే అందు సూచించిరి.

వరహాకు ఆ దినములలో మూడువిలువ లుండినట్లు వారు పేర్కొనిరి.

| | | | |
|---|---|---|---|
| 1 శుద్ధ వరహా | - | 5 | పణములు. |
| 1 గట్టి వరహా | - | 10 | పణములు. |
| 1 దొడ్డ వరహా | - | 20 | పణములు. |

వీనిలో 'దొడ్డవరహా' నూతనముగా కృష్ణరాయని కాలమున వెలువడినట్లు ఒకే ఒక అధారమువలన సూచితమగుచున్నదని వారు వ్రాసిరి. విజయనగరకాలపు శాసనములందన్నిటను 10 పణములు-1 గట్టివరహా అను లెక్కయే తెలియవచ్చు చున్నది. తాళ్ళపాకవారు పేర్కొన్న కొత్తలు-ఈ దొడ్డవరహాయగు నా యని నా యూహ; కాదేని గట్టి వరహాలకే" కొత్త"లనియు వ్యవహారముండి యుండవచ్చును. ఏలన అచ్యుతదేవరాయడు ప్రత్యేకముగా చక్రాంకితములగు వరహాలను చక్రగద్యాణములను పేర ముద్రించినాడని శ్రీ పంచముఖిగారు వ్రాసియున్నారు. కనుక ఈ కొత్త చక్రగద్యాణములే (వరహాలే) "క్రొత్త" లైనను అయి యుండ వచ్చును. ఒక గట్టివరహా విలువ 4 రూపాయలుండెనని శ్రీ పంచముఖిగారు వ్రాసినారు. ఈ విలువను బట్టి నాటి శాసనములలో గుర్తింపనగు వస్తు ధన మారకపు విలువను మనము కొంత తెలిసికొనవచ్చును. చూ.తి.తి.దే.శా. 5-47 (క్రీ. 1545).

3 పణములకు - 3 నాళుల వెన్న లభించెడిది. (నాళి-ద్రవ పదార్థపు కొలమానము)

| | | | |
|---|---|---|---|
| 2 | ,, | - 2 | ,, తేనె |
| 2 | ,, | - 1 | నాళి పాలు |
| 2 | ,, | - 2 | కుండల పెరుగు |
| 2 | ,, | - 2 | నాళుల పంచదార |
| 2 | ,, | - 10 | కొబ్బరి కాయలు. |
| 4 | పణములకు | - 4 | వీశల బెల్లము. |
| 1 | ,, | - 100 | కెల్లె (కొండపండ్లు) |
| 2 | ,, | - | రెండేసి మరక్కాల్ అటుకులు, పేలాలు, పెసలు, శనగలు లభించెడివి. |

10 రేఖలకు (100 పణములకు) వందపట్టు గుడ్డలు, వంద నూలు గుడ్డలు కొని ఉట్లపండుగనాఁడు స్తంభముల నలంకరించెడివారట. నాఁడు నిత్య జీవితమున కవసరములగు వస్తువులెట్లు లభించుచుండినవో పై వివరణమును బట్టి తెలియనగును.

ఆనాళ్ళలో దాతలు శ్రీ భాండారమునకు కొన్ని వందలో, వేలో, నార్స ణములను మూల ధనముగా సమర్పించెడివారు. శ్రీ భాండారమువారు ఆ మూల ధనమును వ్యవసాయము మున్నగు ప్రజోపయోగకార్యములందు వినియోగించి దానిమీఁద లంభించు నాదాయముతో నేవేని కైంకర్యములు స్వామికి జరపించు టయో, లేక ఆ మూలధనమునకు వడ్డీ లెక్కకట్టి ఆ వడ్డీ రాబడితో నేదేని కైంక ర్యము జరపించుటయో దాతల యభీష్టమును బట్టి చేయుచుండెడివారు. నాఁడు వడ్డీ వ్యాపారములు బాగుగా జరుగుచుండినవి. ధనికులు ఋణము లిచ్చి బారువడ్డీ (Simple intrest) రాబట్టుచుండెడివారు. "ముందటి జన్మములెల్లా ముంచె బారుబడి వడ్డీ - యెందు చొచ్చినాను, బోనియ్య దీరుణము" (5-294) అని తాళ్ళపాకవారు చెప్పుకొనినారు.

ఆ దినములలో నాణెములు ముద్రింపఁబడుచుండినవి. బంగారుతోనటు ముద్రించిన నాణెములే 'టంకసాలవాటు' లనియు, 'సౌర్ణాటంకము' లనియు వ్యవహరింపఁబడుచుండినవి. లోహనాణెముల ప్రశంసయే కాక, నాఁడు తాళ్ళపాక వారు తోలు బిళ్ళలతోఁ జేసిన నాణెములను గూడ పేర్కొనినారు. చూ:-

"తోలు బిళ్ల మాఠ కంటె దొడ్డసేసె" (11-2-44)
యెన్నగ సౌర్ణాటంక మింతటాను జెల్లినట్లు
సన్నపుఁ దోలుబిళ్ళలు సరిగాఁ జెల్లునా" (6-170)

అని. వెర్రితలలు వేసిన తురుష్కప్రభువొకఁడు తోలు బిళ్ళల నాణెముల నచ్చొత్తి ప్రచారమునకు దే ప్రయత్నించెనని చరిత్ర కారులు చెప్పుదురు. ఈ తోలు బిళ్ళ లవే నేమో?

ఆనాళ్ళలో ప్రభువులేకాక వారి సామంతులును నాణెములను ముద్రించు ననుజ్ఞపొందుచుండెడివారని చరిత్రజ్ఞులు వ్రాసియున్నారు. అదే యదనుగాఁగొని కావచ్చును నాఁడు ద్రోహులు కొందరు దొంగ నాణెములను గూడ ముద్రించు చుండిరి. అందుకే తాళ్ళపాక వారు "మారు ముద్రకు గాని మంచిమాడకు వట్ట

మేల" అన్నారు. మూరు ముద్రలే = (Counterfict coins) వట్టము (Commission) నాణెమును చిల్లరలోనికి మార్చుకొనునప్పుడు వడ్డీ వ్యాపారస్థులు కొంత వట్టము పట్టుకొనెడివారు.

ఈ విధముగా తాళ్లపాకవారి కాలపు వాఙ్మయమును బట్టి నాఁటి యార్థిక వ్యవస్థను గూర్చిన వివరములెన్నియో తెలియవచ్చుచున్నవి.

**మత పరిస్థితులు :** విజయనగర సాళువ, తుళువ వంశపురాజులు వైష్ణవ మతాభిమానులగుటచేత నాఁడు వైష్ణవమునకు వ్యాప్తి హెచ్చినది. తిరుమల భూలోక వైకుంఠముగాఁ బ్రఖ్యాతిగాంచినది. "నానాదిక్కుల నరులెల్ల" స్వామి సందర్శనమునకు వచ్చిపోవుచుండిరి. శ్రీ కృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయలు ప్రభృతులు తిరుమలమీఁదికి చేసిన యాత్రలసంఖ్యను బట్టియే ఆ స్వామి మాహాత్మ్యమెంతగా వారి నాకర్షించుచుండినదో తెలియనగును. ప్రభువులే యట్లు ఆకర్షింపఁబడిరనఁగా నిక ప్రజలమాట చెప్పఁబనియేలేదు. కాని తిరుమలలో స్థానికులు కొందరు అతి పరిచయముకారణమున స్వామివారి మాహాత్మ్యమును గుర్తింపరైరి కాఁబోలును. తాళ్ళపాకవారిట్లు విచారించినారు.

"పెద్ది తెరువుండఁగాను పెడగంతలు తీసుక
పొద్దువోక యడవులఁ బుంగు డయ్యేరు
నానాభూములవారు నమ్మి శ్రీ వేంకటపతి
గాన వచ్చి యేటనేట ఘనులయ్యేరు
యీ నిజ మిక్కడివారు యిన్నియుఁ దెలుసుండియు
మానక చలాలఁ బోయి మాయల బొందేరు" (9-94)

"కాలవిశేషమో లోకముగతియోకాని కీలువదలె సౌజన్యము క్రిందయి పోయినది" (6-68) అని వారు చింతించినారు. ధర్మము కిందయి విజ్ఞానము వివేకము లోపించినవట. నిజము కొలఁబమాలి సత్యము కొండనెక్కెనట. ఆచారములు తదబడెననియు, జాతి విడంబములు సమమైపోయినవనియు వారు వ్రాసినారు.

శ్రీ రామానుజులవారు తిరుమలకు విచ్చేసి యచ్చటి దైవము విష్ణుస్వామి యని చాటి చెప్పియుండినను, నాఁటి ప్రజలలో ఆదైవ మెవరను చర్చ ముగిసినట్టు కానరాదు. "తొల్లిటి పెద్దలెంచి దొడ్డవాఁడు హరియంటా' పలికినను

'యిల్లిదె నేఁటి పెద్దలు యెవ్వరో దైవములంటా వెల్లివిరిగా నింకా వెదకేరు' అని తాళ్ళపాకవారు వ్రాసినారు. అద్వైవమును బలువురు పలు విధముల సంభావన సేయుచుండిరట. చూ.

"బ్రువంతి బౌద్ధా బుద్ధయితి స్తువంతి భక్తా సులభమితి"
వదంతి కిల సాంఖ్యాస్త్వాం పురుషం - పదవాక్యజ్ఞా: పద మితిచ
విదంతిత్వా వేదాంతిన - స్సదా బ్రహ్మలసత్పద మితిచ"
జపంతి మీ మాంస కాస్త్వాంచ - విపుల కర్మణో ఫిభవయితి
లపంతి నయన కలా స్సతతం - కృపాళు కర్తా కేవల మితిచ" (5 106)

అయినను వైష్ణవులు ఆదైవమును విష్ణువుగానే సంభావించి భక్తి సలుపు చుండిరి. ప్రజలనుద్బోధించుచుండిరి. పరమతస్థులతో వాదులకు దిగుచుండిరి. హరి దైవమని నమ్మనివారికి వీరి యుద్బోధ మిది:-

"పాపము పాపము ప్రజలాలా
పై పై నిటువలె పలుకకురో ॥
హరియందుఁ బుట్టినజుఁడును శివుఁడును
హరితో సరి వీ రనుబెట్లు
పౌరి గొండలందు బుట్టిన శిలలివి
సరుస బెట్టితే సరియౌనా ॥
శ్రీ వేంకట పతి సేవకులకు మరి
ఆవల మరి కలరను బెట్లు
కావించిన యల కామధేనువుల
కేవి యూరఁబసు లీడవునా" (9-61)

"ఆరుశాస్త్రముల నారుమతంబుల నారు గర్మముల నైనాను - యీ రీతిల మిము గొలువక యెవ్వరి కుపాయము లేదు. సోహమ్మనియు. దాసోహమ్మనియు సగుణం బనియు, నిర్గుణమనియు బలుతెఱఁగుల వాదించు వారికి సమాధాన మిచ్చుచు, "సకలోపాసకులకు నందును సగుణంబే ప్రమాణము. సకల మునీంద్రులు పూజించే సాకారమే ప్రమాణము. (7-178)"అని విశదించిరి.

అద్వైతులతో వా రిట్లు చర్చించినారు-

"ఏదెస మోక్షము లేదు యెవ్వరికి ననేరు
వేదాంతశ్రవణము వెట్టికిఁ జేసిరా॥
అంతా బ్రహ్మమైతే నాతుమా వొక్కటియైతే
చింతింప గురుఁడు లేఁడు శిష్యుఁడూ లేఁడు
బంతి నే ముక్తుఁడూ లేఁడు బద్ధుఁడూ లేఁ డిట్లయితే
వంతుల సత్కర్మలెల్ల వఱతపాలాయఁ బో ॥
మహి మీకు బోధించిన మహాత్మ శంకరాచార్యుఁ
డహరహ మేమై యున్నా నాతని కేది గతి ॥
కొందరికి సుఖ మిది కొందరికి దుఃఖ మది
యిందుఁ జిక్కి బ్రహ్మమున కీ ఘోరమేలా
అందిన శ్రీ వేంకటేశుఁ డంతరాత్ముఁ డొక్కఁ డింతే
మందలించి కొలువరు మంటికా మీ జ్ఞానము" (8-65)

ఇట్టి మతవిశ్వాసము గలవారిని "నాస్తిక" లనుచు పేరు నిశితముగ విమర్శించిరి.

"ఇట్టి నాస్తికులమాట నేమని నమ్మేది దంక
పట్టి సమూల మంటానే భక్తుల దూషింతురు॥
వేదములు చదువుతా విశ్వమెల్లాఁ గల్లనేరు
ఆ దెస తాము పుట్టుంది అదియును మాయనేరు
పాదగు విష్ణుఁ డుండఁగ బయలు తత్వ మనేరు
లేదు జీవతత్త్వమంటా లేమలఁ బొందుదురు॥" (8-33)

భిన్నమతవిశ్వాసములు గలవారి యాదర్శములను వారివారి మతసంకేతములను బట్టి తెలియనగునని తాళ్ళపాకవా రిట్లు చమత్కరించిరి.

"వారివారి భాగ్యములు వ్రాసివున్నవి నొసళ్ళ
ధరలో నేది మేలో తెలుసుకోరా॥
అట్టె కొందరు మతము లన్నియు నేక మని
పట్టవర్ధనము నెత్తిఁ బెట్టి చూపిరి
జట్టి గొందరు జీవులు జంగమే లింగముగాని
పుట్టుగెల్లా భస్మమని పూసుక చూపిరి ॥

కొందరేమియును లేదు కొట్ట గొన లయమని
అందిపట్టి లలాటశూన్యము చూపిరి
కందువ గొందరు లక్ష్మీకాంతుఁ డంతరాత్మ యని
ముందే నామము శ్రీ చూర్ణమును బెట్టి చూపిరి॥" (7-36)

కాని తాళ్ళపాకవారు మాత్రము 'మాకెల్ల రామానుజమతోధర్మమిది నీ యీ కడఁగలుగుట కేమరుదు' అని నమ్మియుండిరి. హరిభక్తియే ముఖ్యముగాని యాచారాలు వృధాయని వారిట్లు వివరించిరి.

"హరిభక్తి గలిగితే అన్నియు ముఖ్యముగాక
విరహాచారములెల్ల వృధా వృధా॥
పులులు గుహలనుండె పోలింప ఋషులా
యెలుగు గడ్డము వెంచు నింతలోనే యోగ్యుఁడా
యిలం బక్షు లాకాశాన కేగితే దేవతలా
వొలసి కోతి యడవినుండే వనవాసమా॥
మాఁకులు మాటలాడవు మౌనవ్రతములా
కోకగట్టరు బాలులు కోరి దిగంబరులా॥" (2-62)

దిగంబరుల ప్రశంస యిందు గలదు. అట్లే వైష్ణవము, యోగము మున్నగు విషయములనుగూర్చి కూడ వీరి కీర్తనము లనేకములున్నవి. తారక బ్రహ్మమంత్రమునుగూర్చి (6-178, 207) యు వీరు ప్రస్తావించినారు. ఏమైనను వీరికి హరిభక్తియే సర్వస్వము. హరిభక్తికలవాఁ డేకులజుఁడైనను చిక్కులేదు. పన్నిద్దరాళ్వారులు పలుకులములకుఁ జెందినవారేగదా! వారి భక్తికేమి కొరత గలిగినది ? అందుకే తాళ్ళపాకవారు "ఏ కులజుఁడైననేమి యెవ్వడైన నేమి ఆ కడ నాతఁడే హరి నెరిగినవాఁడు" (5-195) అని చాటినారు. "సహజ వైష్ణవాచారవర్తనుల సహవాసమె మా సంధ్య" అనియు చాటుకొనినారు. నాఁడు వైష్ణవమతమున కుండిన ప్రఖ్యాతిని బురస్కరించుకొనియే పలువురు, పలు విశ్వాసములకుఁ జెందినవారు వైష్ణవాభిమానులై వైష్ణవమును బుచ్చుకొని, వైష్ణవులే యైనారు. స్మార్త బ్రాహ్మణులగు తాళ్ళపాకవారు వైష్ణవులగుటయేకాదు-నాఁటి వైష్ణవ ఆచార్య పురుషులతో సమానమగు ప్రతిపత్తినిగూడ కల్పించుకొని గౌరవమును బడయఁగలిగినారు. అల్లసాని పెద్దనామాత్యుఁడు, వైష్ణవాభిమానియగు

ఓయు నిట్టిదే. ఇక తెనాలి రామలింగఁడు వైష్ణవమును స్వీకరించి రామకృష్ణుఁడగుట ప్రఖ్యాతమగు విషయమే.

ఆనాఁడు వైష్ణవసంబంధము గలవారు పలువురు కూడి కలసికట్టుగ వ్యవహరించుచుండిరి. తాళ్ళపాక వైష్ణవులకు సమకాలపు మతసమాజములతో నెంతయో సంబంధముండెడిది. సాళువ నరసింగరాయని కాలమునుండియు తిరుమల మీఁద రామానుజకూటములు ప్రబలినట్లు అక్కడి శాసనములవలన తెలియనగును. సాత్తాద, సాత్తిన శ్రీవైష్ణవు లభ్యుదయము గాంచినారు. యతిరాజ, వనమామలయ్య మఠము, అహోబలమఠము తిరుమల తిరుపతులలో మిక్కిలి ప్రాభవమును జూపసాగినవి. తాళ్ళపాక పెదతిరుమలార్యునకు శ్రీపతి తొన్నడయ్య అనియు, కులశేఖరపురవాస్తవ్యుఁడగు పళ్ళిపట్టురయ్య అనియు, సాతాని వైష్ణవు లిరువురు శిష్యులుండిరి. వీరి ప్రోత్సాహమున వారు కూడా స్వామికిఁ బెక్కు కైంకర్యములు గావించిరి. పెదతిరుమలాచార్యునకుఁగల వైష్ణవస్నేహబృందమును గూర్చి (5-47 A, క్రీ.శ. 1545) తిరుపతి శాసనమున నీక్రింది వివరములు తెలియవచ్చుచున్నవి. కార్తికమున పీను జరపించిన వనభోజనోత్సవసందర్భమున ప్రసాదభాగము లందుకొన్నవారిలో నీ క్రిందివారు గలరు.

"1. తాళ్ళపాక తిరుమలయ్య, 2. కుమార తాతాచార్య, 3. చక్రవర్తి అప్పయ్యంగార్, 4. కందాడై అప్పయ్యంగార్, 5. ఆనందం పిళ్ళయ్యంగార్, 6. తిరుమలయ్యంగార్, 7. దొడ్డయ్యంగార్ అప్పా (దొడ్డాచార్య), 8. శుకవస్తు లణ్ణన్, 9. అప్ప అణ్ణన్ అప్ప, 10. అప్ప తిరువెంకటయ్యంగార్, 11. అణ్ణన్ నయనార్, 12. తిరువెంకటత్తురైవర్, 13. అప్పాచ్చి అణ్ణన్ అప్పన్, 14. పళ్ళిభట్టర్ మలయణ్ణన్. 15. నారాయణసెట్టి, 16. తిరుపణిపిళ్ళ, రామానుజకూటం కార్యకర్తలు - ఇంకను - కుమ్మరులు మున్నగు వృత్తులవారు, తిరుపతి పర్తకులు, పాళెయం పర్తకులు, పరదేశీయులు" పేర్కొనఁబడినారు. వీరిలో పలువురు ప్రసిద్ధులు. నాఁటి వైష్ణవకుటుంబములలో కందాళవారు ప్రఖ్యాతి గాంచినవారు. ఆలయమున శుభకార్యములకు పంచాంగముజూచి ముహూర్తములు నిర్ణయించుచుండినవారు "ఈయుణ్ణి"వారు. నాఁటి మంత్రి సామంతుల కుటుంబములవారు సాళువవారు, నాదెళ్ళవారు, నంద్యాలవారు, రాయసంవారు, ఆరవీటివారు, సిద్ధిరాజువారు, పలువురు వైష్ణవాభిమానులు. నాఁటి శాసనములను బట్టి తాళ్ళపాక తిరుమలయ్యంగారును, తిరువెంగళనాథయ్యంగారును గొప్ప వైష్ణవాచార్యులుగను, వేదమార్గప్రతిష్ఠాపనాచార్యులుగను కీర్తింపఁబడినారు.

వైష్ణవముతోపాటు భక్తిమతమగు మాధ్వ ద్వైతముకూడ నాఁడు ప్రచారము గాంచినది. వ్యాసతీర్థపురందరదాసాదు లా మతమునకు వ్యాప్తిని గల్గించిరి. తాళ్ళపాకవారును పురందరదాసాదులును కలసి మెలసి ఆనాఁడు లోకమున భక్తి తత్వమునకుఁ బట్టము గట్టినారు. ఇరువర్గముల వారును భజన కూటములను నిర్వహించి ప్రజలలో భక్తి చైతన్యమును కల్గించినారు. తాళ్ళపాకవారి శాసనములును, కావ్యములును, సంకీర్తనములును పై విషయములను వెల్లడించుచున్నవి.

నాఁడు తిరుమలతిరుపతులందు జరుగుచుండిన వర్షోత్సవ, మాసోత్సవ, నిత్యోత్సవములకును ఇతర కైంకర్యములకును సంబంధించిన యంశములను వెల్లడించు తాళ్ళపాకవారి వాఙ్మయ మెంతయో గలదు. ఆయా విషయముల నించుక ఆధ్యాత్మకీర్తలనుగూర్చి వ్రాసినతావుననే వివరించియుండుటచేత నిట విడచుచున్నాను. ఈ పట్టున నాఁడు వారు జరుపుకొనుచుండిన పండుగ పబ్బము లనుగూర్చి మాత్రము కొంత ముచ్చటింతును.

## పండుగ పబ్బములు-ఉట్లపండుగ, తాళ్ళపాకవారు:

పండుగలు పబ్బములు మానవజాతిజీవనమున తొణికిసలాడు చైతన్య విలాసములు. అనుభవ విశేషములు. అవి నవోత్సాహదీపికలు, ప్రకృతిపరిణామ సూచికలు. అవి మన జాతి బ్రతుకునకు బలమునకు మూలకందకములు. మతమునకు హితమునకుఁ బట్టుగొమ్మలు. ఒక్కమాటలో అవి మన సంస్కృతీ సర్వస్వములు-సంప్రదాయ పోషకములు.

హిందువులపండుగ లనేక వర్గములుగా విభజింపఁదగినవి కలవు వానిలో లోకహితార్థ మవతరించు పుణ్యపురుషుల జన్మోత్సవముల జరుపుకొను వేడుక లొకవర్గమునకుఁ జెందినవి. వానినే నిత్య వ్యవహారమున జయంతు[1] లనియు

1. భాద్రపదమాసమున కృష్ణ పక్షమున వచ్చు అష్టమి రోహిణీ నక్షత్రయుక్త మైనచో "జయంతి" యని నిత్యవ్యవహారమగునని వహ్నిపురాణమున గలదు. "కృష్ణాష్టమ్యాం భవేద్యత్ర కలైకా రోహిణీయది, జయంతీనామ సాప్రోక్తా ఉపోష్యా సాప్రయత్నతః" 'జయంతి' యనునది జ్యోతిశ్శాస్త్ర పరిభాష-క్రముగ నిదియే ప్రతి మహాపురుషుని జన్మదినమునకు వ్యవహృతమైనట్లు తోచుచున్నది. (చూ. హిందువుల పండగలు, పర్వములు - పు. 100 శ్రీ రామచంద్ర. ప్రకటితము 1960)

పేర్కొనుచున్నాము. శ్రీ కృష్ణాష్టమి, హనుమజ్జయంతి, దత్తాత్రేయ కూర్మ నృసింహ వామన పరశురామ బుద్ధ జయంతులు, శ్రీరామనవమి మున్నగు నుత్సవము లీవర్గమునకు చెందినవే. ఈ జయంత్యుత్సవము లన్నిటిలోను శ్రీకృష్ణాష్టమి, శ్రీరామనవమి - ఈ రెండును భారతీయులకు ముఖ్యముగా నాంధ్రులకు మిక్కిలి ముఖ్యములు. వీరి పండుగలను వైయక్తికముగనే కాక సామూహికోత్సవముగ కూడ నేడు జరుపుకొనుచున్నారు. శ్రీరామునిచరితము హితమునకును, శ్రీకృష్ణునిచరితము తత్త్వమునకును ప్రతీకము లగుటచేత తత్త్వహితము లుపదేశించు నీ యవతారపురుషు లిరువురి జన్మోత్సవములను మనవా రానందోత్సాహములతో చేసికొనుచున్నారు. ఈ యుత్సవములు మన దేశమందేకాక ఆ యవతార పురుషుల కథ లేయే దేశములందు వ్యాప్తిం గాంచినవో ఆయా దేశములందును జరుపుకొనఁబడుచున్నవి.[1] చైత్ర శుద్ధ నవమినాఁడు శ్రీరాములవారును, శ్రావణ బహుళ అష్టమిదివసమున శ్రీకృష్ణులవారును జన్మించిరి. కనుక నా యా దివసములు పవిత్రములు. శ్రీరామనవమి యుత్సవములు చైత్ర శుద్ధ పాడ్యమి మొదలుకొని నవమివరకును నవరాత్రము లమితానందముతో మనవారు జరుపుకొందురు. ఈ తొమ్మిదిదినములందును జనులు రామాయణపారాయణ కథాకాలక్షేపములతో ప్రొద్దుపుచ్చి నవమినాఁడు రామజననఘట్టమును, దశమినాఁడు పట్టాభిషేక ఘట్టమును పఠించి - అది వసంతర్తువు, ఎండాకాలము నగుటచేత-వడపప్పు పానకము లారగింపుచేసి విసనకర్రలను పంచిపెట్టి, శ్రీరామజననోత్సవమును సామూహికోత్సవముగ జరుపుకొందురు.

ఇవి వసంతనవరాత్రములు. ఇట్లే శరన్నవరాత్రము (దసరా పండుగ) లందును ఆ యవతారపురుషునకు సంబంధించి రావణవధానంతర విజయసూచకముగా వేడుకలు చేసికొందురు. నాఁడు ఉత్తరభారతమున నేఁటికిని రావణ కుంభకర్ణాదుల ప్రతికృతులను తగులబెట్టి "రామలీల"ల నుత్సాహముతో జరుపుకొందురు. ఇట్లే శ్రీకృష్ణాష్టమినాఁడును ప్రజలు జయంత్యుత్సవము నంతకన్న వైభవముగ జరిపి వేడుకలు చేసికొందురు. (వివరణము ముందు గలదు)

---

1. దక్షిణ అమెరికాలోని రెడ్-ఇండియనులు ఏడాదికొకమారు సీతారామోత్సవము జరుపుటయు, వారి సాహిత్యమున సీతారామగాథలకు సంబంధించిన పాటలుండుటయు ప్రబలమగు నిదర్శనమని పరిశోధకులు తలచుచున్నారు. దీనిని దయానంద సరస్వతియే తెలిపిరి. (చూ. పూర్వోదాహృత గ్రంథము పు. 61)

వర్షము పొడవున హిందువులు చేసికొను పండుగలలో నీ కృష్ణాష్టమియే ముఖ్యమగు తొలిపండుగనియు, శ్రీరామ నవమియేతుది ముఖ్యమగు పండుగనియు దెలియవచ్చును. ఈ రెండింటికిని నడుమనే మిగిలిన పండుగలన్నియు వచ్చును. ఎట్లన చైత్ర వైశాఖములలో కూడిన వసంతర్తువే సంవత్సరమున కారంభమగుట యీనాటి యాచారమయినను- వర్షమునకు మూడు ఋతువులే యుండి, ఋతువునకు నాలుగు మాసములు చొప్పున పరిగణింపబడుచుండిన యాచారమింకొకటి ప్రాచీన కాలమున కన్పట్టుచున్నది. వానకారుతోనే వత్సరారంభమగునను పరిగణనము నాడుండెను. కనుకనే సంవత్సరమునకు వర్షమనియు పేరు వచ్చెను. వర్షర్తువే వర్షమున కారంభము. ప్రతి ఋతువు ప్రారంభమగుటతోపాటు ప్రత్యేకమైన యజ్ఞయాగాదులు ఆరంభింపబడుచుండెను. ఈ పద్ధతి ప్రకారము "ఫాల్గుణ పూర్ణిమనుండి వైశ్వదేవ యజ్ఞమును, ఆషాఢ పూర్ణిమనుండి వరుణ ప్రఘాస యజ్ఞమును, కార్తిక పూర్ణిమనుండి సాకమేంధ యజ్ఞమును జరుపవలెనని శతపథ బ్రాహ్మణమునగలదు."[1] ఇట్లు నాల్గేసి నెలల కృత్యమును నడుపుటకే చాతుర్మాస్యమని పేరు. వీనిలో హేమంత వసంతముల కన్నను వర్షర్తు చాతుర్మాసమును నడపుటే మన కాచారమైనది. ఈ చాతుర్మాస్యము ఆషాఢ శుక్ల ఏకాదశితో ప్రారంభమై కార్తీక శుద్ధ ద్వాదశితో సమాప్తమగును. ఈ ఆషాఢ శుక్ల ఏకాదశియే ప్రథమైకాదశి. దీనినే మనవారు "తొలి యేకాదశి" అనియు నందురు. దీనితోనే వర్షమారంభమగుటయు పండుగలు వచ్చుటయు జరుగును. దీని తర్వాత వచ్చు ప్రసిద్ధమగు పండుగ శ్రీ కృష్ణాష్టమియే. అటుపై స్వల్ప వ్యవధులలోనే పండుగలనేకములు వచ్చును. తుదకు చైత్రశుద్ధ నవమినాడు శ్రీరామ నవమి పండుగ.[2] దానితో నాఖరు. ఇక చైత్రము తర్వాత వచ్చు మూడు మాసముల వ్యవధిలో నే పండుగలు నుండవు. అందుకే ప్రాచీనమగు వైదిక కాలమునాటి యాచారము చొప్పున వర్షారంభమును చాతుర్మాస్యారంభమును నగు నీ "తొలి యేకాదశి" తోడనే పండుగ లారంభ మనియు చైత్రమున శ్రీరామ నవమితో నాఖరనియు వాడుక యేర్పడినది. అందుకే మనము జరుపుకొను ప్రసిద్ధమగు

---

1. చూ. పూ. గ్రం. పు. 108.

2. వాల్మీకి రామాయణము ననుసరించియు నీ సమయము సంవత్సరాంతమే 'తతశ్చద్వాదశే మాసేచైత్రే నావమికేతిథౌ' అని రామా. అప్పుడు చైత్రము సంవత్సరమున 12 వ మాసముగా పరిగణింపబడెడిది.

పండుగలలో కృష్ణాష్టమి తొలి పండుగనియు, శ్రీరామనవమి తుది పండుగనియు చెప్పనగును.

రామకృష్ణులు ఆదర్శపురుషులు. వారి దివ్యచరితములగు రామాయణ భాగవతములు భారతీయులకు నిత్యపారాయణ గ్రంథములు. ఆంధ్రులకు మరియును, శ్రీరాముడిక్ష్వాకు వసుటయు, శ్రీమదాంధ్ర భాగవతము పోతన విరచితమగుటయు దానికి హేతువులు. ఆ యవతారములను వారి చరితములను ఆంధ్రజాతి తలపులో నిలుపుకొని తనువులో నేకము చేసికొన్నది.

శ్రీకృష్ణపూజ ఆంధ్రదేశమున నతిప్రాచీన కాలమునుండియు గలదు. ఆయర్చామూర్తి కాలయములుకూడ నెన్నియో వెలసినవి. అందందు బాలకృష్ణ, వెన్నముద్ద గోపాలకృష్ణ, కాళీయమర్దన, మురళీకృష్ణ, గోపికృష్ణ విగ్రహములు ప్రతిష్ఠాపితములు. అన్నిభంగులుగా నాయర్చామూర్తి యారాధింపబడుటకు ఆ యవతారము సంపూర్ణమగుటయు, నాతని లీలావిలాసములు హృదయావర్జకములగుటయు ముఖ్య హేతువులు. శ్రీ కృష్ణావతారము దశావతారములలో నెనిమిదవది. ఈ కృష్ణచరితము హరివంశ భాగవత విష్ణుపురాణాదులలో విపులముగానున్నది. అది యాబాలగోపాల మెరిగినదే. ఈ పురాణముల ననుసరించి శ్రీకృష్ణుడు, శ్రావణ బహుళాష్టమీ తిథియందు రోహిణీ నక్షత్రమున జన్మించెను. దేవకీ వసుదేవులకే కలిగినను యశోదానందులపట్టియై పెరిగి పిన్ననాడే పెక్కు దుస్సాధ్యములగు కార్యములొనర్చి మహిమలు ప్రదర్శించెను. తన చిలిపి చేతల చేత గరితల విసిగించియు ముద్దులు కురిపించెను. పెరిగి పెద్దవాడై దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించి, రాజనీతి విశారదుడై, తత్త్వవేత్తయై గీతోపదేశము గావించెను, పూర్ణాయుష్యముతో నుండెను. అతడు సత్యతపోదానార్జవాహింసల నెడి దక్షిణలను పొంది పురుషయజ్ఞవిద్యను తెలిసికొనినవాడని ఛాందోగ్యమున ప్రశంసగలదు.[1] దానిననుసరించి పురుషుడను ఋషివద్ద ఈ విద్యను నేర్చిన దేవకీపుత్రుడగు కృష్ణుడు భాగవత కృష్ణుడే యగుట సహేతుకమేయని పరిశోధకులు తలచిరి. దీనినిబట్టి వారు శ్రీ కృష్ణుడు నూటపదునారేండ్లకు పైబడి నూటఇరువది యైదేండ్లవరకును లీలామానుష విగ్రహమును దాల్చి యుండునని భావించిరి. ఇట్టి లోకోత్తరపురుషుడుగా చిత్రితుడైన శ్రీ కృష్ణుడు జారుడును, చోరుడునునై యుండడనియు పరిశోధకుల విశ్వాసము. శ్రీ కృష్ణుని శృంగార

1. చూ. పూ. గ్రం. పుట 105.

జీవితమునకు సంబంధించిన కథలనేకములు తత్త్వజ్యోతిశ్శాస్త్రములకు సంబంధించిన సాంకేతికతగల గాథలగుట తరచినమీదట తెలియనగునంశములే.[1] కావున వారి విశ్వాసములు నభిప్రాయములు సరియైనవియే కాఁదగును. ఇక నా మహనీయుని యాకృతి విశేషములను గూర్చి పలువురు పలుతెరగుల భావించిరి. వానినెల్ల సవిమర్శముగ సమీక్షించి కీ. శే. సురవరం ప్రతాపరెడ్డిగారు ఇట్లు నిర్ణయించిరి.

"శ్రీకృష్ణుఁడు నీలవర్ణుఁడు, నూనూగు మీసాలవాడు, మంచిజెట్టీలతో బోరి కర్కశకాయుడైనవాడు. పరిపూర్ణవయః పరిపాకమున నానారాజులతో యుద్ధము చేసి వారిని నిర్జించి యసామాన్యుడని యనిపించుకొనినవాడు ఆజానుబాహువు. అవతారపురుషుల లక్షణములలో నిదియొక ముఖ్య లక్షణమై యున్నది. కావున నితడు పొట్టివాడు కాక యెత్తయిన విగ్రహమై యుండి యుండును ఇతడు మీసములు కలవాడుగా నుండి యుండును. భారత యుద్ధమునాటికి (భగవద్గీతను బోధించునప్పటికి) 80 ఏండ్ల వృద్ధుడు" (చూ. శ్రీ సురవరం ప్రతాప రెడ్డిగారి "హిందువుల పండుగలు' పు. 64-69 ప్రకటితము 1953) ఈ పై యభిప్రాయములు సరియైనవే యనిపించును. కృష్ణునకు మీసములున్నట్లే తాళ్ళపాకవారు వర్ణించిరి.

ఇట్లు అవతారపురుషుఁడై పరిపూర్ణమానవుఁ డగుటచేతనే అతని జన్మదినస మగు శ్రావణ బహుళాష్టమిని శ్రీకృష్ణ జయంతిగా దేశమెల్ల వేడుకలు చేసికొను చున్నది. శ్రావణమాసమున కృష్ణపక్షమున రోహిణీనక్షత్రయుక్తమగు నష్టమినాఁ డుపవసించి శ్రీకృష్ణుని పూజింపవలెననియు అట్లు చేసిన చతుర్వర్గ ప్రాప్తియు, మహాజయము కలుగుననియు, అట్లు కాక జయంతివ్రత మాచ

---

1. శ్రీకృష్ణుఁడు నరకుని వధించి పదునారువేల కన్యలను పరిగ్రహించిన కథ జ్యోతిశ్శాస్త్రమునకు సంబంధించినదనివిజ్ఞులందురు. అందు కృష్ణుఁడుసూర్యుఁడే-సత్యభామ చంద్రుఁడు - నరకుఁడు భౌమునిరాశి-కన్యారాశియే కన్యల గుంపు. ఈ జ్యోతిశ్శాస్త్ర విషయమే పురాణకథగా మారినది. ఇట్లే గోపికా వస్త్రాపహరణ కథ-జీవుల మాయావరణమును తొలగించి వారికి మోక్షప్రాప్తి నుపదేశించిన తాత్త్వికమైన సాంకేతికతగల కథ. గోవర్ధనోద్ధరణ వృత్తాంతము పశువృద్ధికిని వర్షప్రాప్తికిని పర్వతారణ్యములపోషణ మవసర మను ప్రకృతి విషయమును వెల్లడించునట్టిది.

రింపనిచో మహాపాపము కలిగి రాక్షస జన్మ లభించుననియు స్కాందాది పురాణములు వాకొనుచున్నవి.

"శ్రావణే బహులే పక్షే కృష్ణ జన్మాష్టమీ వ్రతం
నకరోతి నరోయస్తు భవతి క్రూర రాక్షసః"

ఆనాఁడు చంద్రునకర్ఘ్యమిచ్చి వెండితోగాని,బంగారుతోగాని ద్వాదశాంగుల విస్తారమగు చంద్రబింబమును సిద్ధపరచి, బంగారుపాత్రలోనుంచి పూజించి యర్ఘ్యమిచ్చిన సర్వ కామములు తీరుననియు భవిష్యోత్తరమున గలదు.[1]

అందుకే ఈ జయంత్యుత్సవమును ప్రజలు అనాదిగా జరపుకొనుచున్నారు. శ్రీకృష్ణాష్టమినాఁడు పగలంతయు, నుపవసించి సాయంకాలము కృష్ణ విగ్రహము నూరేగింతురు. జనన సూచకముగా నుయ్యాలలు కట్టి యూగింతురు. బాలకృష్ణుఁడు దేవకీస్తన్యమును గ్రోలుచున్నట్లు విగ్రహముల నలంకరించి పూజింతురు.

అనూచానముగా వచ్చుచున్న ఈ సంప్రదాయమును 15 వ శతాబ్దిలో తాళ్ళపాకవారును పోషించినారు. విష్ణ్వాలయములలో నీ దినమున వారు విశేష పూజాదికము జరపించిరి. పలు కీర్తనములు రచించి జయంత్యుత్సవము పుత్రోత్సవముగాఁ బేర్కొని వేడుకలు జరిపిరి. వారి సంకీర్తనము లివి పరికింపుఁడు.[2]

సాళంగ నాట

జగములెల్లా నీదేరె జయ వెట్టిరిందరును
తగనేఁడు కృష్ణావతార మాయ నిదివో ॥

అచ్యుతుఁడు జనించె నద్దమరేతిరికాడ
ముచ్చిమి రాకాసులు ముట్టు పడిరి
పచ్చిగాను లోకులాల పండుగ సేయరో నేఁడు
అచ్చపుఁ గృష్ణావతార మాయ నిదివో ॥

1. చూ. హిందువుల పండుగలు పర్వములు. పు. 101. శ్రీ రామచంద్ర.

2. చూ. తాళ్ళపాకవారి ఆధ్యాత్మ సంకీర్తనల సంపుటములు. ప్రచురణము, తి తి. దేవస్థానము.

గోవిందుఁడు జనించె గోకులాష్ట మిదే నేఁడు
కావరపు కంసుని గర్వమణఁగె
భావించి ప్రజలాల పారణ సేయరో నేఁడు
ఆవేళఁ గృష్ణావతార మాఁయ నిదివో ॥ (అన్నమా : 10-20)

ఉపవసించి పారణసేయు జయంతీవ్రతమును సూచించు సంకీర్తనమిది.

సాళంగ నాట

దేవతలు గెలువరో తెగి దైత్యులు పారరో
భావించ నింతటిలో భూభారమెల్ల నణఁగె ॥
ఇప్పుడిదే గోవుల నిచ్చెను పుత్రోత్సవము
యిప్పుడు తొట్టెల నిడి రింతు లెల్లాను-
(అన్నమా : 7-244)

బాలకృష్ణుని తొట్టెలలో నిడినవేళ పాడిన పాట యిది.

దేసాళం

జో జో యని మీరు జోల పాడరో
సాజపు జయంతి నేఁడే సఫల మిందరికి ॥
అదె చంద్రోదయ మాయ హరి యవతారమందె
మొదల జాతకర్మములు సేయరో
అదన పుత్రోత్సవమటు పుణ్యాహము చేసి
కదిసి యిట్టె నామకరణముఁ జేయరో ॥
(అన్నమా : 9-172)

రామక్రియ

ఉయ్యాలలోఁ గొత్తలాయఁ బుత్రోత్సవ మిది వో
నేమపు కృష్ణజయంతి నేఁడే యమ్మా॥
(అన్నమా : 8-71)

మాతృస్తన్యమును గ్రోలుచున్న గోపాలబాలుఁ డిందు వర్ణితుఁడు. ఇట్టివే మరికొన్ని కీర్తనములు (8--253, 112, 10-32) చూడనగును.

ఈ విధమున తాళ్ళపాకకవీశ్వరులు - అన్నమాచార్య పెదతిరుమలాచార్య చినతిరుమలాచార్యాదులు పదులకొలఁదిగా పదముల నీ కృష్ణాష్టమి సందర్భమున రచించి పుత్రోత్సవపువేడుకను గానరూపమున లోకమునకుఁ జాటిరి. తిరుపతిలో తాళ్లపాకవారి పుత్రోత్సవమును బురస్కరించుకొని కృష్ణస్వామికి ప్రత్యేకముగా జరిపించిన సేవలను దెల్పు శాసనములు కూడ లెక్కకు మిక్కిలిగా నున్నవి.

గొల్లల యిండ్లలో పెరిగియు, తిరిగియు పాల్వెన్న మీగడలు దొంగిలించిన బాలకృష్ణుని దుందుడుకుచేతలకు నిదర్శనముగా నీ జన్మాష్టమి సందర్భమున వీధులలో నుట్లుకట్టి గడలతోఁ గొట్టించి చేసికొనెడి వేడుక యొకటి మనమందర మెరిగినదే. ఈ వేడుక ఆంధ్ర దేశమందంతటను విరివిగా నున్నది. నేఁడది మన దేశమందేకాక కొన్ని ఇతర ప్రాంతములకును ప్రాకినది. ఆంధ్రదేశమున నాల యోత్సవముల కనుబంధముగా నీ వేడుకను మొట్టమొదట ప్రారంభించినవారు తాళ్ళపాకవారే.[1] అది మొదలుగా జన్మాష్టమినాఁడు ఉట్లు కొట్టు వేడుక దేశమం

1. క్రీ. శే. 17వ శతాబ్దిలో నారాయణతీర్థులవారు తమ తరంగములలో నీ యుట్లు గొట్టు వేడుకను ప్రశంసించుటను బట్టియు, నీ 'శిక్యోత్సవము' ద్రవిడ దేశమందలి వరహూరు గ్రామమున నేఁటికిని జరుపుచుండుటను బట్టియు ఆచార్య శ్రీ సాంబమూర్తిగారు నారాయణతీర్థులవారే ఈ శిక్యోత్సవమును ప్రారంభించినట్లు తెలిపిన విషయమును శ్రీ రజని ఇట్లు పేర్కొనిరి.

'వరహూరు వేంకటేశ్వరాలయంలో తీర్థులవారి చిత్తరువు నేటికీ ఉన్నదనీ, తీర్థులవారు ఆనాడు అక్కడ ప్రారంభించిన శిక్యోత్సవం (ఉట్లపండుగ) ఈనాటికీ భాద్రపద మాసంలో ఆ గ్రామంలో జరుపుకుంటారనీకూడా వ్రాశారు సాంబమూర్తిగారు. ఈ ఉట్లపండుగ ఆంధ్ర జిల్లాలలో కృష్ణాష్టమికి ప్రతి యేడూ జరుపుతూంటారు. (చూ. వాగ్గేయకారుల చరిత్ర, పు. 181)

ఆంధ్ర జిల్లాలలో జరుపుచుండుటయే కాక, అప్పటికి రెండువందలేండ్లకు పూర్వమే ఆ యుత్సవ మాంధ్రదేశమున నారంభమైన దనువిషయము ముందు తెలియగలదు. ఆ వేడుకలనే బహుశః తీర్థులవారు తమ కాలమున వరహూరు దేవాలయమున కూడ వెలయింపఁజేసియుందురు. ద్రావిడదేశమున నాయూర మొదట నీ యుత్సవముల నారంభింపఁజేసినవారు తీర్థులవారై యుండవచ్చును గాని యప్పటికి చాలా కాలమునకుఁ బూర్వమే ఆ వేడుకలు మనదేశమున నుండినవి. మనము ఆపండుగను శ్రావణ బహుళాష్టమీ నవములలో జరుపుకొందుము బహుశః వరహూరున భాద్రపద బహుళాష్టమీనవములలో జరుపుదురేమో! దురేమో! ఎట్లైనను నొక్కటియే-ఏలన శ్రీకృష్ణుఁడు అష్టమినాఁడు రోహిణీ నక్షత్రమున జన్మించెనని యైతి

దెల్ల నతిశయించి కృష్ణాష్టమి – ఉట్లపండుగగా రూపొంది ప్రజలకది యొక సామూహికోత్సవ మైపోయినది. ఉపవాసములతోడను, వ్రతాచారములతోడను కూడి శ్రీ కృష్ణపూజతో మాత్రమే యుండుచుండిన కృష్ణజయంత్యుత్సవ సంప్రదాయము 15 వ శతాబ్దమున తాళ్ళపాకవారి మూలమున ఉట్లపండుగగా రూపొంది వేడుక నించినది.[1] ఆ పండుగవేడుక ఈనాఁడు మనమందర

---

హ్యము. రోహిణీయుతముగా అష్టమి శ్రావణ భాద్రపద మాసములలో నెప్పు డైనను వచ్చును. ఒకవేళ శ్రావణమున గాకున్నను, భాద్రపదమున తప్పదని వశిష్ఠ సంహిత చెప్పుచున్నది. బహుశః దాక్షిణాత్యులు నక్షత్రమునకు ప్రాముఖ్య మిచ్చి భాద్రపదమున యుత్సవము జరుపుచుండవచ్చును. ఏమైనను ఈ "శిక్యోత్సవము" ఆంధ్రదేశమున దేశీయమగు నుత్సవము-దీనిని ఆంధ్రులేయగు తీర్థుల వారు ద్రవిడ దేశమునకును బ్రాకించి, తమ తరంగములతోఁ బోషించి, క్రొత్త వేడుకల పూలు పూయించినారు.

1. మన ప్రాచీనములగు పండుగలలో కొన్నిటిని సామూహికోత్సవములుగ రూపొందించి ప్రజా బాహుళ్యమున నూతన చైతన్యము గల్పించుటకై ప్రయత్నములు ఆయా కాలములలో జరిగినవి. శ్రీకృష్ణాష్టమి ఉట్ల పండుగగా రూపొందుట యిట్టిదే. జయంత్యుత్సవములు వ్రతాచారములతో నుపవాసములతో క్లేశమును గూర్చునవి. కాని వాని నాధారము చేసికొని గావించు వేడుకలు మాత్రము ప్రజలకు వినోదము గూర్చునట్టివి. కావున ఆయా యుత్సవముల ప్రాముఖ్యము అప్పటి వేడుకలమీఁదనే అధికముగా ప్రజలదృష్టిలో నాధారపడి యుండును. బాణసంచాలు, టపాకాయలు లేని దీపావళి నేఁడు మనకు దీపావళియే కాజాలదుకదా! అన్నియునట్లే. అందుకే ఈ యుత్సవముల పురస్కరించుకొని యెట్లో వేడుకలకు తావు కల్పింపవలెను. వ్రతాచారములతోపాటు శ్రీజయంతి వేడుకలతో ఉట్ల పండుగగా రూపొందించుటయు నిట్టి పరిణామమునే సూచించును. శ్రీకృష్ణుని బాలక్రీడ లందు కనువైనవి. అందుకే జన్మాష్టమి ఉట్ల పండుగైనది. ఇట్లే రామకథను పురస్కరించుకొని రామలీల లేర్పాటైనవి. శ్రీరాముని విషయమున బాల్యముకన్న పదితలల రావణుని వధించి విజయమును గొను సందర్భమే వేడుకి గూర్చునది కావున ఆరామలీలలు శ్రీరామనవమినాఁడు కాక విజయదశమి (దశరా) సరదాగా రూపొందినవి. విశేషమేమన ఈ రెండు ఉత్సవముల సందర్భముునను జరుగు నీ వేడుకలు ప్రాయికముగా 15, 16 శతాబ్దములలోనే ఆరంభమైనవి. దక్షిణ భారతమున జన్మాష్టమిని ఉట్ల పండుగగా రూపొందించిన వారు తాళ్ళపాకవారు. అట్లే ఉత్తర భారతమున విజయదశమిని రామలీలా ప్రదర్శనోత్సవముగ తీర్చినవారు తులశీదాసు. వీరి మూలముననే దేశమున నీ యుత్సవములకు విశేష ప్రాచుర్యము కలిగినది.

మెరిగినదే కాని దానిని ఎవరు ఎప్పుడు మొదలు పెట్టి రనువిషయము మాత్రము మరుగున పడిపోయినది. దాని యారంభవికాసములు ఈ క్రింది పరిశీలనమున వెల్లడి కాగలవు.

ఉట్లుగొట్టు నీ వేడుక 15వ శతాబ్దికి తరువాతనే కాని అంతకుపూర్వము మనదేశమున నున్నట్లు తెలియరాదు ఈ వేడుకను తమిళమున "ఉరియడి" అందురు.[1] దీని ప్రశంస తిరుపతిశాసనములందు పలుతావులఁ గలదు. క్రీ. శ. 1545 సం.న తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు వేయించిన శాసనమున తిరుమలమీఁది శ్రీకృష్ణస్వామికి జరుగు జయంత్యుత్సవమును గూర్చియు, నచ్చటి ఉట్ల వేడుకను గూర్చియు వివరణము గలదు. క్రీ. శ. 1547లో దిగువ తిరుపతిలో తాళ్ళపాక చినతిరుమలాచార్యులు స్థాపించిన ఉరియడి వేడుకలను గూర్చియు, కొండమీఁద తత్పుత్రుఁడు తిరువేంగళప్ప స్థాపించిన ఉరియడి వినోదమును గూర్చియు వివరణము గలదు. ఈ శాసనములం దచ్చటచ్చట తాళ్ళపాకవారు ఆ యుత్సవముల సందర్భమున వేరువేరుగా పలు సమయములలో ఉరియడి వేడుకలకును, కైంకర్యములకును దానధర్మములు చేసియుండినట్లు తెలియుచున్నది. ఆ యా కైంకర్యముల ప్రశంస వచ్చినపుడు వారిపేరనే "చినతిరుమలయ్యంగారి ఉరియడి" అనియు, "తిరువేంకటయ్యగారి ఉరియడి" అనియు శాసనములందు ప్రశంసింపఁబడినది. పై యిరువురును ఈ ఉరియడివేడుకల నినుమడింపఁజేసి వానికిఁ దగిన కట్టుదిట్టములు చేసినవారిలో ముఖ్యులు. వీరే తదుత్సవములకు వ్యవస్థాపకు లన్నట్లు తిరుపతిశాసనములందున్నను, వారికాలమునకన్న నించుక పూర్వమే ఆ వేడుకలప్రశంస మన కచట కన్పించుచున్నది. పరిశీలింపఁగా శ్రీ జయంతినాఁడు ఉరియడివేడుకనుగూర్చిన మొట్టమొదటి ప్రస్తావన క్రీ. శ. 1485 సం.పు శాసనమందే కానవచ్చుచున్నది. నేను చూచినంతవరకు అంతకు పూర్వ మీ ప్రశంస అక్కడిశాసనములందు కానరాలేదు. ఆ తర్వాతకాలపు శాసనములలో క్రమముగా నా వేడుకనుగూర్చిన వివరణ మధికముగా తెలియనగును. క్రీ.శ. 1545-47 సం.ల నాఁటికి ఆ యుత్సవవ్యవస్థ ఎట్టి కట్టుదిట్టములు కలదై

1. ఉరి-ఉట్టి, అడి: కొట్టు (ట)
ఉట్టి-దే.వి. విడతలు లోనగునని యుంచుటకై దారముతో నల్లి వ్రేలగట్టెడి యంత్ర విశేషము.శిక్యము (శ.ర.) తిరుపతి శాసనములన్నియు చాల వరకు తమిళముననే యున్నవి. అది యచటి సంప్రదాయము. అందుకే పరిభాష తమిళమున నున్నది.

నదో విశద మగుచున్నది. ఈ క్రింద నుదాహరింపఁబడిన శాసనభాగములలో నా వేడుకల యారంభ క్రమవికాసములతీరు పరికింపఁదగును. (చూ. తిరుమల తిరుపతి దేవస్థానమువారి శాసనసంపుటములు.)

(1) క్రీ.శ. 1485 (2-63) నల్లార్ అంగాండై ఉఱి కట్టికొరకు మంటపమునకు వచ్చుట.

(2) క్రీ.శ. 1491 (2 సంపుటము - 96) దాత-అప్పయ్యన్ అనువారు శ్రీ జయంతినాఁటి ఉరియడి సందర్భమున 1 అతిరసపడి. తమ ఉభయముగా సమర్పించిరి.

(3) క్రీ.శ. 1494 (2 సం. 127) సరస్వతీ మనోభండార చూరకార నరసరాజు ఒడయర్-తిరుపతిలోని గోవిందరాజ స్వామివారు శ్రీ కృష్ణుని ఉరియడివేడుకను జూచి వచ్చునపుడు సమర్పించు అప్పాపడి కైంకర్యము.

(4) క్రీ.శ. 1516 (3 సం. 107) కోయిల్ కెళ్వి తిరువేంకట జియ్యర్-తిరుపతిలోని గోవిందరాజాలయములోని ఉరియడినాఁడు 1 అతిరసప్పడి సమర్పణ.

(5) క్రీ.శ. 1519 (3 సం. 132) కందాడై దొడ్డయ్యంగార్ అప్ప - తిరుమలస్వామికి శ్రీ జయంతినాఁడు 1 శీడైపడి కైంకర్యము. ఉరియడి దినమున తిరుపతి గోవిందరాజ స్వామికి 1 శీడైపడి సమర్పణ.

(6) క్రీ. 15-30 (4-సం. 6) తాళ్ళపాక తిరుమలయ్యంగారు-తిరుమలలో స్వామికి శ్రీ జయంతి - "ఉరియడి పండుగలు రెండు దినములందును 2 పడులు సమర్పణ.

(7) క్రీ. 1531 (4-సం. 12) సారణు సెట్టి తిరుపతిలో గోవిందరాజ స్వామికి శ్రీ జయంతినాఁడు 1 దోసెపడి - ఉరియడి పండుగ నాఁడు 1 దోసెపడి సమర్పణము.

(8) క్రీ. 1533- (4సం. 26) ఎల్లప్పాపిళ్ళ తిరుమలమీఁద శ్రీ కృష్ణ స్వామికి ఉరియడి పండుగనాఁడు ఆలయపు ఖర్చులతో జరుగు ఉరియడి వేడుకల సందర్భమున 1 దోసెపడి సమర్పణము.

(9) క్రీ. 1535- (4 సం-46) కోయిల్ కెళ్వి తిరువేంకట జియ్యర్-తిరుమలమీఁది కృష్ణస్వామికి ఉరియడి దినమున ఎణ్ణైఆడల్ (తలంటుకొనుట)కై ఉరేగిఁపు వెళ్ళి వచ్చిన తర్వాత తిరుమణి మంటపమున ఉయ్యాలలోనున్నప్పుడు 1 ఇడ్డలిపడి సమర్పణ

(10) క్రీ. 1545 - (5-సం. 47)

(i) తాళ్ళపాక పెద తిరుమలయ్యంగారు - తిరుమలమీఁద వేటాడు కృష్ణుడు ఉరియడి దినమున తలంటునకై యూరేగి పోవునపుడు రామానుజకూటము ముందు 1 నాళివెన్నకై 1 పణము సమర్పణము.

(ii) తిరువెంగళప్ప స్థాపించిన ఉరియడి వేడుకలను దర్శించు సందర్భమున కృష్ణస్వామికి 1 నాళి వెన్నకై 1 పణము సమర్పణ.

**దిగువ తిరుపతిలో :**

లక్ష్మీదేవి మంటపమున వేంచేసిన గోవిందరాజునకు, శ్రీకృష్ణునకు నాచ్చిమార్, గోదాదేవులకు జరుగు నుభయ్యములకై ఉరియడి పండుగ సందర్భమున సమర్పించిన 561½ పణము (56 సువర్ణ రేఖలు 1½ పణము) లకు జరుగవలసిన కైంకర్యములు ; అందు 40 పణములు పలు విధములైన వగ్గెపడులకు మిగిలిన సొమ్ములో-

పణములు

| | | |
|---|---|---|
| 3 | 3 | నాళుల వెన్న |
| 2 | 2 | ,, తేనె |
| 2 | 1 | నాళి పాలు |
| 2 | 2 | కుండల పెరుగు |
| 2 | 2 | నాళుల పంచదార |
| 1 | 1 | మరక్కాల్ పొరి (కొరుగులు) |
| 2 | 10 | కొబ్బరికాయలు |
| 4 | 4 | వీశల బెల్లము. |
| 1 | 100 | కెల్లె (కొండపండ్లు) |
| 1 | 100 | బుట్టలు. |
| 2 | 2 | మరక్కాల్ అవల్ (అటుకులు) |

2—2 ,, పొరి (పేలాలు)
2—2 ,, పెసలు
2—2 ,, శనగలు
2—50 చెరకు గడలు
1 —100 వెలగపండ్లు
6—30 కొబ్బరికాయలు.

ఇవికాక ఇతరములైన వెచ్చములు. 1 పణము పరిచారకులకు (కసవూర్చు వారికి).

6 పణములు. 'తిరుమలయ్యంగారి ఉరియడి వేడుకలో వాడునట్టి వెదుళ్ళను, గడలను చెడకుండ బాగుచేయు మేదరులకు.

1 పణము - ఉరియడి మంటపము నలంకరించు కైక్కోలర్‌కు అలంకరణార్థము.

1/2 పణము శిల్పికి,
1/2 పణముకట్టు త్రాళ్ళకు, నారలకు.
2 పణములు పూవులకు,

4 పణములు రెండేసి నాళుల నేయి, తేనె, వెన్న, పాలు, పెరుగు, పంచదారలతో కలిపిచేయు పంచామృతమును కుండలలో నింపి రెండు ఉట్ల స్తంభములమీఁదను,పండ్లతోడను,కొబ్బరికాయలతోడను అలంకరించి నిలుపుటకు,

1 రేఖ (10 పణములు) ఉరియడి వేడుకలలో నియుక్తులగు సేవకులకు కైజీతము (ఈ శాసనమందు కొన్ని అంకెలు వివరణము లోపించియున్నవి).

(11) క్రీ. 1547 - (5 సం. 99) తాళ్ళపాక చినతిరుమలయ్యంగారు తాము స్వామికి సమర్పించిన వేదుమపాకం గ్రామముమీఁద వచ్చు నాదాయము 200 సువర్ణరేఖలతో నాలయాధికారులు నిర్వహించిన పలు కైంకర్యములలో 6 పణములు వెచ్చించి తిరుపతిలోని చినతిరుమలయ్యంగారి ఇంటిముందు గోవిందరాజస్వామి వారికి తాము వ్యవస్థాపించిన ఉరియడివేడుకల దినమున 1 ఇడ్డలిపడి సమర్పించుట. దానికి వలసిన వెన్న, పూలు, కొబ్బరికాయలు, అరటిపండ్లు కొని ఉట్టి స్తంభము నిలుపుటకు ఏర్పాటు చేసెను.

ఈ శాసనమందే చినతిరుమలాచార్యుని కుమారుడు తిరువెంగళప్ప అధికముగా 41 సువర్ణరేఖల సొమ్ము తిరుమలలోని శ్రీ భండారమున కర్పించెను. ఆ ద్రవ్యములో-

స్వామివారి యుత్సవమూర్తి తిరుమలలోని ఉత్తరమాడవీధిలో తమ తండ్రిగారగు చినతిరుమలాచార్యులు స్థాపించిన ఉరియడివేడుకలను దర్శించు సందర్భమున 6 రేఖల విలువగల

1 మనోహరపడియు,

2 నాళుల వెన్నయు సమర్పితము కావలెను. 11 సువర్ణరేఖలను వెచ్చించి ఉరియడి పండుగవేడుకల జరిపించు ఖర్చు నీ క్రిందివిధమున భరింపవలెను.

| | |
|---|---|
| 3 1/2 పణములు— | ఈ వేడుకలకు వలసిన వెదుళ్ళను ఇతర వస్తువులను సమకూర్చుటకై తిరుప్పణి పిళ్ళకు. |
| 1/2 ,, | 100 పట్టుగుడ్డలను, 100 నూలుగుడ్డలకు ఉరియడి వృక్షము (స్తంభము) నలంకరించుటకు.) |
| 1 పణము ,, | ఆ వస్తువులను స్తంభములపై నలంకరించి నిలుపుటకు, |
| 2 ,, | శిల్పికి, |
| 3 ,, | పంచామృతము, పండ్లు, కొబ్బరికాయలు సమకూర్చుటకు (ఇత్యాదిగా వివరింపబడినవి). |

పైని పేర్కొన్న శాసనమునందలి విషయవివరణమును బట్టి పరిశీలింపగా, ఈ ఉట్లపండుగ విషయమున తాళ్ళపాకవారే విశేషమగు శ్రద్ధవహించినట్లు తెలియుచున్నది. క్రీ. శ. 1485–91 ప్రాంతములందో అంతకు కొన్ని వత్సరములు పూర్వమో ఈ ఉరియడి వేడుకలు జరపుకొనునాచారమారంభమై యుండును. అనగా అది సాళువ నరసింగరాయని పరిపాలనాకాల మగును. తాళ్ళపాకవారి వంశవిఖ్యాతికి మూలపురుషుడగు అన్నమాచార్యులవారుచ్చదశలోనుండి సంకీర్తనరచన గావించుకొనుచు శ్రీవేంకటేశ్వరుల మహిమను స్వయమనుభవించి లోకమునకు వెల్లడిచేయుచుండిన దినములవి (1424–1503). వారి

కాలముననే తిరుమలమీఁద స్వామివారికెన్నో నూతనోత్సవము లారంభమైనవి.[1] వానిలో కొన్నిటిని అన్నమాచార్యాదులే యారంభించి కలకాలము సాగునేర్పాటు కూడ గావించియుండిరి. అందుకే బహుశః అట్టివానిలోని ఉరియడి పండుగ వేడుకకూడ నొకటియైయుండి యుండదనగునని నేను భావించుచున్నాను.

అన్నమాచార్యుని సంకీర్తనము లీ పండుగనుగూర్చిన విందులకు సాక్ష్యము బలుకుచున్నవి. వారికాలమునకన్న పూర్వ మీ వేడుకలు మన దేశమున లేవనుటకు అంతకుపూర్వము శాసనములందుకాని, సాహిత్యమునందుకాని ఈ ఉట్లు కొట్టుపండుగ వేడుకను గూర్చిన ప్రస్తావన కానరాకుండుటయే నిదర్శనము. అన్నమాచార్యుని కాలముననే ఆరంభమైన యీ వేడుక క్రీ. శ. 1500 ప్రాంతమునకు ప్రత్యేకమగు నొక పండుగగానే రూపొందెననియు, దాని యారంభవి... సములకు తాళ్ళపాకవారే కారణభూతులనియు పై శాసన పరిశీలనమున తెలియఁ గలదు. అన్నమాచార్యుని సంకీర్తనములలో శ్రీజయంతిని ప్రస్తావించు కీర్తనలే అధికముగ నున్నవి. వానిలోఁ గొన్నిట శ్రీ జయంతినాఁడే పుత్రోత్సవ సందర్భమున నుట్లపండుగ ప్రస్తావనయుఁ గలదు. చూడుఁడు.

రామక్రియ

భూమిలోన క్రొత్త లాయఁ బుత్రోత్సవ మిదివో
నేమపు కృష్ణ జయంతి నేఁడే యమ్మా ॥
పాలజలధి యల్లుండై పాయకుండే యతనికి
పాలవుట్ల పండుగ బ్రాఁతాయ నదే——

సాళంగ నాట

పైకొని చూడరో వుట్ల పండుగ నేఁడు
అకడ గొల్లెతలకు నా నందము నేఁడు

1. సాళువ నరసింహరాయని ధర్మమున తిరుమల మీఁద స్వామివారిని తెప్పోత్సవము, డోలామహోత్సవము నూతనముగా నారంభమైనవి. ఆ కాలముననే సాళువ మల్లయ దేవుని ధర్మమున పవిత్రోత్సవ మారంభమైనది. అట్లే వనభోజనోత్సవ, అధ్యయనోత్సవ, వసంత గ్రీష్మోత్సవాదులును ఆ దినములందే యారంభమైనవి. ఇవికాక ఉట్ల పండుగవలెనే తాళ్ళపాకవారి ధర్మమున తిరుమల మీఁదను తిరుపతిలోను స్వామివారికి వైవాహికోత్సవము, నూతనముగా నేర్పాటైనది. తిరుమలాచార్య తిరువెంగళప్పలే యీ యుత్సవముల నిర్వాహమునకును తగిన యేర్పాటులు గావించినారు.

ఆదికాలమునఁ గృష్ణుఁ డవతరించిన యట్టి
ఆదట శ్రావణ బహుళాష్టమాయను
దాదాత రోహిణి నక్షత్రము గూడిన రేయి
సాదించ లోకులకెల్ల జయంతి యాయను॥

(అన్నమా : 8-161)

ఇట్లే యీ వేడుకల ప్రస్తావనగల తొలి శాసనములందును "శ్రీ జయంతి నాఁటి ఉరియడి" అని యుండుటనుబట్టి యా నాళ్ళలో నీ వేడుక లొక్క దినము ననే జరుగుచుండిన వేమో యనిపించును. కాని క్రీ.శ. 1519 తర్వాత శాసనము లలో విస్పష్టముగ "శ్రీజయంతి నాఁడును-ఉరియడి దినమునను" అని రెండు దిన ములలో జరుగు పండుగలు ప్రస్తావింపఁబడుటనుబట్టి యప్పటికి జన్మాష్టమి తర్వాత నవమినాఁడు ఉట్లపండుగ ప్రత్యేకముగ నేర్పాటై యుండు ననిపించును. నేఁటికిని అట్లే జన్మాష్టమినాఁడే రాత్రి వీధులలో నుట్లు కట్టియుంచి మరునాఁడు వానిని ప్రజలచేత గొట్టించుట ఆచారమై యున్నది.

ఆనాళ్ళలో తాళ్ళపాకవారే తాము వ్యవస్థాపించిన ఈ ఉట్ల పండుగ వేడు కలకగు ఖర్చులకై తిరుమలలోని శ్రీ భండారమునకు కొంత ద్రవ్యమును, కొన్ని గ్రామముల మీఁది యాదాయమును సమర్పించి యేర్పాటు చేసి యుండిరి. ఆ ద్రవ్యముతో నాలయాధికారు లీవేడుకలను ఆలయోత్సవముల కనుబంధముగా నిర్వహించుచుండిరి. అందుకే ఎల్లప్పొపిళ్ళ ప్రభృతులు వేయించిన శాసనము లలో "ఆలయపు ఖర్చులతో జరుగు ఉరియడి వేడుక సందర్భమున" తమ కైంకర్యములు కూడ చెల్లునట్లు ఏర్పాటు గావించిరి.

లభ్యమగు నాధారములను బట్టి నాఁటి యుట్ల పండుగ యీ తీరున జరుగు చుండెడిదని తలపవచ్చును.[1] తిరుమల మీఁద ఉరియడి దినమున కృష్ణస్వామి

---

1. కర్ణాటక పదకోశకారుఁడు కిట్టెల్ ఈ వేడుకల నిట్లు వివరించెను. ఉట్లు- i. e. plural of ఉట్టి-ఉట్లాటె-ఆటె—ఉఅడి. A play in which Coconuts Sugar etc.. are suspended and swung, when persons dressed like herdsmen attempt to strike and obtain them, especially on the day after Krishna's birthday (Mysore) - ఉట్లబడి - A play (on the same day) in which a net work containing vessels filled with fruits etc., is sus-

యుత్సవ విగ్రహము ఎన్నై ఆడల్ (తలఁటుకొనుట) కై యూరేగింపుతో బయలు దేరెడిది. అప్పుడు మార్గమధ్యమున రామానుజకూటము వద్ద వెన్న నేయి సమర్పితములయ్యెడివి.

తలంటుకొని మరల వచ్చిన పిదప తిరుమామణి మంటపమును నుయ్యాలలో స్వామి యున్నప్పుడు ఇద్దలి పడులు మున్నగునవి సమర్పితములయ్యెడివి. పిదప స్వామివారి సమక్షముననే వీధులలో గట్టి యుంచిన యుట్లను అందుకొనయత్నులై నవారు కొట్టి కోలాహలము చేసెడివారు. ఈ యుట్లు పలువురు ఏర్పాటుచేసిరి. ఎవరి పేర వారు ప్రత్యేకముగా నుట్లు కట్టించెడివారు. తాళ్ళపాకవారే తమతమ పేళ్ళ ప్రత్యేకముగ నీ యుట్లను గట్టించుచుండిరి. తిరుమలయ్యంగారి ఉరి పేరు. తిరువెంగళప్ప గారి ఉరిపేరు. ఆ యుట్లు గొట్టుటకు ముందు వారువారేర్పాటు చేసిన కైంకర్యములు ఆ వేడుకలు దర్శించెడి స్వామికి జరిగెడివి. పిదప నుట్లు కొట్టుట. ఉట్లు కట్టుటకు ఉరియడి మంటపమును ప్రత్యేకముగ నిర్మించెడివారు. ఉట్లు వ్రేలాడఁదీయుటకు పొడుగుపాటి స్తంభములుండెడివి. వానిని పట్టు, నూలు బట్టల తోడను, పూలతోడను, పండ్లతోను, కొబ్బరికాయలతోను పేర్చి యలంకరించెడివారు. దాని నాధారముగా గొని ఉట్లను, పంచామృత కలశములను గిలకలతో వ్రేలాడఁదీయుదురు. ఆ కలశములను చేతులు చాచియు, నిక్కియు, గడలతో కొట్టియు, నందుకొనుటకు ప్రయత్నించుచు కొట్టఁజాలినవారికి కలశామృతము లభించెడిది. అట్టి యుట్లు అనేకములు, పంచామృతపుటుట్లు, వెన్నపుట్టి, పాలవుట్టి, నేతివుట్టి, పెరుగువుట్టి, చక్కెరవుట్టి, బొరుగువుట్టి, అటుకులవుట్టి లెక్కలేనన్ని. వానినెల్ల ఒకదానితర్వాత ఒకటిగా కొట్టి కైవసము చేసికొనుట యొక వేడుక.

ఉట్లపండుగవేడుకలను కనులగట్టించెడి తాళ్ళపాకవారి యీ కీర్తనలను జూడుఁడు.

సాళంగ నాట

కొమ్మలు చూడరే గోవిందుఁడు
కుమ్మరించీ ముద్దు గోవిందుఁడు... (అన్నమా : 8-142)

---

pended from a pole and while the so called herdsmen are trying to strike at it for the purpose of obtaining the fruits etc., the owner of it draws it up beyond their reach (Mysore - Tamil ఉరియడి).

— *F. Kittel's Dictionary*

ఆ యుట్లను కోలలతో కొట్టువారు గోవిందునివలెనే పీతాంబరము లలంకరించుకొని కూత లిడుచు కొల కొల మని కోలహలాము సేయుచురట.

దేసాళం

పచ్చి దేరుచు నుట్ల పండుగాయను
గచ్చులకు గొల్లెతలు కౌఁగిలించి పట్టగా

సొరిది సొమ్ముల మీఁది సోయగపు చెక్కులపై
పెరుగులు మీఁగడలు పేరు కొనెను.
అరుదుగ వీధులను అందరివుట్లు గొట్టి
దొరతనముల తోడ దొమ్మి సేయఁగను॥

పలువురి పేర గట్టబడిన యుట్లను పదుఁలకొలఁదిగా కొట్టుట నాఁటి వేడుక.

శంకరాభరణం

అక్కలార చూడుఁ డందరును
నిక్కి వారవట్టీ నేఁడు గృష్ణుఁడు

ఆనవాల వుట్టి అడుకుల వుట్టి
పానకపు టుట్టి బలిమినే
ఆనుక కోలల నందియంది కొట్టి
తేనెవుట్టి గొట్టీ దేవకి సుతుఁడు॥

పెరుగు వుట్టి మంచి పేరిన నేతి వుట్టి
సరివెన్న వుట్టి చక్కెర వుట్టి
వెరపుతో గొట్టి వెసబాలులతో
బొరుగు వుట్టి గొట్టీ పొంచి రాముఁడు॥

మక్కువ నలమేలుమంగఁ గూడి నేఁడు
చొక్కి శ్రీ వేంకటేశుఁడు వీధుల
నిక్కి వుట్లెల్లా నిండాఁ గొట్టి వుట్టి
చక్కిలాలు గొట్టీ జగతీశుఁడు॥. (అన్నమా : 8-149)

పాడి

బాలులతో వీధులలోఁ బారాడువాఁడు
కోల లెత్తుక వుట్టి గొట్టీఁ జూండీ॥

నారికడపు వక్కాలు నానిన సనగలు
చారపప్పుఁ దేనెలు చక్కెరలును
పేరిన నేతులు నానబియ్యాలు నుట్లనవే॥

చక్కిలాలు నడుకులు సనిగె పప్పులును
చెక్కిన మెత్తని తూఁట చెఱకులును
వెక్కవగా నుట్లలో బింందెల నించిన వవే
చక్క యశోద బిడ్డకుఁ జూచేరు సుండీ॥

నువ్వులు చిటి బెల్లాలు నున్నని చిమ్మిలులు
నువ్వుటిడియునుఁ జిన్ని నురుగులును
ఎవ్వరు వెంకటపతి కెరుగించ నారగించి
కివ్వ కివ్వనవ్వ నణకించీఁ జూండీ॥

నాఁడు ఎన్నిరకముల యుట్లు కట్టఁబడినవో, అందలి వస్తువు లెట్టివో, వానిలో నెన్ని రహస్య చమత్కారములో పై కీర్తనములలో వెల్లడి యగుచున్నవి. ఈ వేడుకలో నుట్లుకొట్టువారే గోపాలకృష్ణులు. వారట్లే యలంకరించుకొందురు. వారు కొట్టి కైవసము చేసికొనునవి పాల్వెన్నమీఁగడలే కావు. పంచామృతములు. ఈ వినోదములెల్ల బాలకృష్ణుని చిలిపిచేష్టలకు నిదర్శనములు. చిన్నికృష్ణుని చర్యలవి చౌర్యక్రియలు కావు. ముద్దులొలికించు పసివాని చిద్విలాసములు. తోడివారి నుడికించి యూరించుటలు, సాధనాంతర మంత్రాంతరముల నర్థించు జీవుల ననుగ్రహించి పరమపురుషుఁడు తానై యమృతత్వమును సిద్ధింపఁజేయుటలు. అందుకే బాలకృష్ణుని చేష్ట లీనాఁటికి పండుగ లై పోయినవి, భాషలో సామెత లయిపోయినవి. 1

---

1. అట్టి సామెతలు తెలుఁగులో చాలనున్నవి. ఉట్టిమీఁద: ఉట్లూడిపడి వచ్చినది- కలిబోసిన వెనుక నుట్లు కనగొన నేలా? ఊరకొనకున్న నుట్టికట్టుకొని యూరేగుము. ఉట్టి కెక్కలేనమ్మ స్వర్గమున కేమెక్కును? ఇత్యాదులు కొన్నిమాత్రమే.

కొట్టుకుబారి తినుట : బాలురు యువకులు భుజించునప్పుడు పెద్దలు 'ఈ వయసున కొట్టుకుబారి తినవలెనుగాని యిదేమితిండి పిట్టతిండి' అందురు. అనఁగా

ఆనాఁడు తాళ్ళపాకవారే వ్యవస్థాపించిన ఉట్లపండుగల వేడుకను మనోజ్ఞముగా మన కనులముందును, చెవులయందును నేఁటికిని నిలుపుచున్న వారి యీ కీర్తనము నరసి యానందింపుఁడు.

**ముఖారి**

పలుమరు వుట్ల పండుగను
చిలుకు చిడుక్కని చిందగను పల్లవి.

ఊళ్ల వీధుల వుట్లు కృష్ణుఁడు
తాళ్ళు దెగిపడఁ దన్నుచును (నఁగను)
పెళ్ళు కఠిల్లు పెఠిల్లు చిఠిల్లని
పెళ్ళగ మోసె పెనురవము ॥ పలు

బంగరు బిందెలఁ బాలుఁ బెరుగులు
ముంగిట నెగయుచు మోఁదఁగను
కంగు కళింగు కఠింగు ఖణింగని
రంగు మీరు పెనురవములై ॥ పలు.

నిగ్గుగ వేంకటనిలయుఁ డుట్టి పా
లగ్గలికఁ బగుల నడువఁగను
భగ్గు భగిల్లని పరమామృతములు
గుగ్గిలి పదనుగఁ గురియగను ॥ పలు.

(అన్నమా : 12–57)

ఇదేకాక తాళ్ళపాకవారి కీర్తనములందు నారసింహ జయంతి, విజయ దశమి, మున్నగు పండుగలను గూర్చిన ప్రశంసలు కూడ పదులు కొలఁదిగా నున్నవి. నారసింహ జయంతికి చూ. కీర్తనలు.

"నరులార నేడు వో నారసింహ జయంతి
సురలకు నానందమై శుభము లొసఁగెను ॥

---

నోటికిని చేతికిని పనిగల్పించి తెగగొట్టుకు తినవలెననికాదు. బాలకృష్ణుఁడు చీటికి మాటికి వెన్నకొట్టుకు (గదికి) మజ్జిగ కొట్టునకు పారివెళ్ళి అందినదెల్ల నారగించి వచ్చినట్లు పుష్టికరమగునట్టి యాహారమును కడుపునిండ తినవలెననియే. నేఁడును మన యిండ్లలో వెన్న, మజ్జిగ కొట్లుండుట ప్రసిద్ధమే.

సందించి వైశాఖ శుద్ధ చతుర్దశి శనివార
మందు సంధ్యాకాలమున నౌభలేశుఁడు
పొందుగాఁ గంభములోఁ బొడమి కదపమీఁద
కందువ గోళ్ళఁ జించె గనకకశిపుని॥ " (11-14)

మరి యొకటి —

"జగతి వైశాఖశుద్ధ చతుర్దశి మందవార
మగణితముగఁ గూడినది స్వాతి యోగము " (10-285)

నేఁటికిని శ్రీ వైష్ణవులీ జయంతిని భక్తి శ్రద్ధలతోఁ బాటించుట గలదు. నృసింహ పురాణోక్తమగు రీతి నీ దినమున వ్రతము చేయువారెట్టివారైనను ముక్తులయి ఉత్తమ గతులందుదురని భక్తుల విశ్వాసము. తాళ్ళపాకవారీ జయంతినేకాక విజయదశమినికూడ వేడుకలో జరుపుకొనినారు.

ఈ కీర్తన చిలకింపుఁడు : విజయదశమి.

''విజయ పుటమ్ము వేసె వేంకటేశుఁడు
విజయుని సఖుఁడు యీ వేదమూరితి ॥
పాజి తెంచి దశకంఠు పది శిరసులమీఁద
ఆజికి నమ్ము వేసె నాది దేవుఁడు
ఆఱడి సేనల తోడ నంబుధి మీఁద వేసె
వేఱొక యమ్ము దొడిగి విష్ణుదేవుఁడు" (9-183)

కాళికాపురాణమున విజయదశమికి రామాయణ కథతో సంబంధమున్నట్లు వర్ణితమైనది. [1] "మహానవమినాఁడు రావణుఁడు నిహతుఁడయ్యెను. దేవతలు రామునియెడ తమ కృతజ్ఞత ప్రకటించుకొనుటకు విశేష పూజ జరిపిరి." తాళ్ళ పాకవారు నిట్లే వర్ణించియున్నారు. విజయ సూచకమగు నీ పండుగ ప్రాచీన కాలమునుండియు విజయోత్సవముగ నున్నట్లు తెలియుచున్నది. విజయనగర యుగమున శ్రీకృష్ణదేవరాయని కాలమున నీ విజయదశమి - దసరా ఉత్సవ ములు చాల వేడుకతో జరుపబడు చుండినట్లు చారిత్రకాధారములను బట్టి తెలియు చున్నది. తాళ్ళపాకవారీ పండుగను కూడ గ్రంథస్థముగాపించినారు. ఇట్లువారి

---

1. చూ హిందువుల పండుగలు - శ్రీ తిరుమల రామచంద్ర. ప్రకటితము 1960. పుట. 185.

వాఙ్మయమున మత సంబంధములగు విషయములెన్నియో ప్రత్యక్షములై నిలిచి యున్నవి.

## సాంఘిక పరిస్థితులు :

తాళ్ళపాకవారి వాఙ్మయమున సమకాలపు రాజకీయ మత పరిస్థితులేకాక సామాజిక పరిస్థితులుకూడ చాలవరకు మనకు తెలియ వచ్చుచున్నవి. కొన్ని యంశములను సంగ్రహముగ వివరింతును.

## పెండ్లి పేరంటములు :

చిన్నన్న ఉషాపరిణయాష్టమహిషీ కళ్యాణద్విపదలలో పెండ్లి పేరంటములను గూర్చియు, నప్పటి వేడుకలనుగూర్చియు, కోలాహలమునుగూర్చియుఁ జాల విపులముగ చిత్రించెను. తిరుమల మీఁద స్వామివారి కల్యాణోత్సవము నారంభించి, దాని నతి వైభవముగ జరిపించినవారు తాళ్ళపాకవారే. (5-71., 153) తిరుపతి శాసనములనుబట్టి స్వామివారు అయిదు దినముల పెండ్లివేడుకలు ఊరేగింపులు, తొలిదినమున ఎదురుకోలు-పూదండల మార్పు, మధుపర్క సమర్పణము, నాలుగవ దినమున సుమంగళులకు పసుపు కుంకుమల పంపకము మున్నగు విశేషము లన్నియు వర్ణితములైనవి. తాళ్ళపాకవారి పెండ్లి తిరునాళ పాటలుకూడ పైవివరములఁగొన్నిటి నిరూపించుచు గలవు. ఇక చిన్నన్న కృతులు ఆనాటి పెండ్లిండ్లవేడుకలను కనులగట్టించునట్లే యున్నవి. అష్టమహిషీకల్యాణమున చిన్నన్నరుక్మిణీ జాంబవతీసాత్రాజితుల పరిణయము వర్ణించిన తెలుఁగువిపులముగనున్నది. ఆ వివాహములు ఆగమోక్తముగ జరగినవి. తెలుఁగునాఁటి యాచారములు పాటింపఁబడినవి. బాసికాలు కట్టుట, మధుపర్కము లిచ్చుట, పేరంటాండ్లు ధవళంబులు పాడుట, గడియారముచూచి జేగంటనాదింపఁగా నగుడ జీరకము లుంచుట (ముహూర్త సమయమిదియే), మంగళ సూత్రములు కట్టుట, తలంబ్రాలు పోయుట, మున్నగు నాచారములన్నియు వర్ణితములైనవి. ఇట్లే సాత్రాజితీ పరిణయమున పైవివరములేకాక పురోహితుఁడు మంగళాష్టకములు చదువుటయు, ముత్తైదువలు శోభనలు పాడుటయుఁ గూడ వర్ణితములైనవి. ఆ పెండ్లిలో పెండ్లి వర్ణనముకన్న పెండ్లికి వచ్చువారి కోలాహలమును, విందుల వేడుకలును విపులముగా వర్ణింపఁబడినవి. సంభావనలకు వచ్చెడి వైదికులను, "చాపట్టులును, బాయసము సొజ్జి బూరెలు" భుజింపవలెననెడి కుతూహలముతో "పాలముల్ పచ్చగాఁ బసుపులు పూసి, బయలుదేరెడి వైదికుల యింటి యాడపడుచులను,

విందు భోజనమున 'కలవంటకములు, నప్పడములు, సూపములు, శాక పాకములు, రాజాన్నములు, కమ్మని నేతులు, జీరక కొత్తుమిరి, మిరియముల మెఱయుచు రుచులచే మించు చేరులును(?) పరమాన్నములును, రసావళ్ళు నంబళ్ళు చవి నోట నిడినంతతోన కరగునోయననొప్పు కజ్జాయములును, మీఁగడ పెరుగులును, రవరవగా నుప్పు రవగూడి సొంటిలవయుక్తమైన చల్లని మజ్జిగయును, ఎడనీరును కుడినీరును" మున్నగు సంభారములతో పెండ్లివారు వడ్డించిన విధానమును చిన్నన్న చక్కఁగా వ్రాసెను ఇట్లే ఉషాపరిణయ ఘట్టమునఁ గూడ నాతఁడు ప్రత్యక్ష వర్ణనమును గావించుటతోపాటు పెద్ద ముత్తైదువలందరును "పాడరే యొక పెండ్లిపాట సొంపార" అని హెచ్చరించుకొని, పల్లవి చరణముల విడచి విడచి యందుకొని గోష్ఠిగా గానము చేసిన వైఖరిని గూడ చక్కఁగా జిత్రించెను.

చిన్నన్న కృతములగు వర్ణనములెల్ల నిట్లే ప్రత్యక్షము లనఁ దగినట్లుండును. అష్టమహిషీకల్యాణమున రేపల్లె వాతావరణము నాతఁడు కల్పించిన తెఱఁగు విడ్డూరము గొల్పునంత సహజముగనున్నది. గొల్లలు, వానియాస్తిపాస్తులు, చల్లలమ్మువారి ముచ్చటలు, గొల్లసుద్దులు, చక్కఁగా వర్ణితములైనవి (చూ. పు. 78-80) వారి సుద్దులలో కాటమరాజాదుల కథలకు సంబంధించిన పదములఁ గొన్నిటిని చిన్నన్న యుదాహరించిన విషయ మీవరకే పేర్కొంటిని.[1]

తాళ్ళపాకకవులు తాము చూచి భావించిన అంశములను పరులు చూడనవసరము లేకయే భావింపఁదగునంత స్పష్టముగఁ జిత్రింతురు. మఱికొన్ని యుదాహరణములను గాంచుఁడు.

మే ద ర వా రి వే ష ము :

"మలయంగ నెడ దుప్పిమై నోరగాఁగ
మొలత్రాటఁ జెక్కిన మోటకత్తియును
గొనసిగతోఁ గూడి కురు లొకయింత
గనుపట్టఁ జెరివిన గన్నెరాకమ్మఁ
గొనల వెల్వాడు పుట్టగోచియు నెరులు
బెనగొన్న నునుదబ్బ పీచు నాకేల
వెడవెడ జవ్వాడు వెదురు సలాక
యెడమ చే బొటవ్రేలి యినుప యుంగరము" (పు. 55)-

1. చూ. నా గ్రంథము 'తాళ్ళపాక కవుల కృతులు-వివిధ సాహితీ ప్రక్రియలు.' పు. 179.

గలవారట. వారు ఒక పిల్లవానియేడ్పు విని "మార్జాలమని సంశయించి పొక్క-పొక్కని తమ భాష, చెప్పు"కొనిరట. దీనినిబట్టి వారిభాష చెడిపోయిన తమిళ మగునేమో యని శ్రీ సురవరంవారు వ్రాసిరి.

వైద్యునివేష మిది తిలకింపుఁడు.

"చంక మందులసంచి జగజంపు వలువ
పొంకమై నిజకర్ణముల నొప్పు దూది
కునిపడ జుట్టిన కురుమాపు పాగ
అనువంద పంచలోహపు టుంగరము
ఉరుతరం బైనట్టి యూర్ధ్వ పుండ్రంబు
కరమొప్పు వలకేలి కరకకాయలును
బెరయ పచ్చడముతోఁబెనుపడ సంది
నర గనుపట్టు బాహాట పుస్తకము
జనుపడ లో గుణపాఠంబు చదివి
కొనుచు మూలికలు దిక్కులు చూచికొనుచు"-

నుండురట. ఇందలి 'బాహాటము" ఆయుర్వేదవైద్య గ్రంథము. వైష్ణవులు కొందరాయుర్వేదవైద్యమును వృత్తిగాకలవారుకలరు. పైనిఁవర్ణితుడైన వైద్యుఁడట్టివాఁడే

ఇట్లే ఇంకను తాళ్లపాకవారు రెడ్డి, కరణము,(పు.383)వైష్ణవ భాగవతుఁడు భోగపుసాని మున్నగువారి నెందరినో చక్కగా వర్ణించినారు. ఆయా విశేషముల నెల్ల శ్రీసురవరంవారు తమ 'సాంఘిక చరిత్రలో నుదాహరించినారు.[1] విపరణమున కాగ్రంథము చూడఁదగును. తాళ్ళపాకవారు చెంచువారి వేషమును వర్ణించినతెఱఁగుఁ గనుఁడు.(యా.కీర్తనములు12-103;121)వారు "అంచుల తొగరుఁజీర,సందిఁబెట్టిన మొలవంక పెద్దగాజు, కంచు మట్టెలు, మాసిన తురుము, చెమరు కంపు, వెండి కుప్పె, చెంపల యేరుముండ్లు తాల్చియుందురట. ఏపె నారలే పట్టు చీరలట. నెమలీకలే గేదగులట. గురిగింజలే ముత్యాలు. తెల్లమన్నే కప్పురము. నుదుటికి జేగురు బొడియే కుంకుమ. తిట్లే ప్రియములు. తలమీఁద టోపి-కులాయిని ధరించుట ఆ నాఁటి ప్రజలకు పరిపాటి కాఁబోలును. తిరుమలమీఁది కృష్ణరాయని రాగివిగ్ర

1. ఆంధ్రుల సాంఘిక చరిత్ర (పు. 225-228).

హమున నెత్తిమీఁద టోపీ గలదు. తాళ్ళపాకవారి విగ్రహములుకూడ 'కుళ్లాయి'తో నున్నవి. చిన్నన్నయు నట్లే వర్ణించినాఁడు.

**విశ్వాసములు :**

భూతాలు సోకిన వారికి మంత్రించి నయము చేయు విషయములు వారు వర్ణించినారు. "నారాయణుఁడ నీ నామము మంత్రించి వేసి, పారేటి యీ జంతువుల భ్రమ విడిపించవే" (9-205) అను కీర్తనమున నీ విషయముగలదు. అన్నమాచార్యుని మహిమలను చిన్నన్న వర్ణించినాఁడు. వానిని నిరూపించు కీర్తనములు కూడ కొన్ని గలవు. మరులుంకు అగ్రహారమున అన్నమయ్య జీడికంపు పుల్లమామిడిని తియ్యమామిడిగా మార్చెనట. ఎవరో పెండ్లియాడఁ గాసువీసము గల్గ దీవింపుఁడని కోరఁగా అన్నమయ్య అట్లే దీవించెనట. ఆ దీవెన ఫలించెను. (చూ. అన్నమా. చరిత్ర. పు. 43, 44). ఇట్లే మహిమలను విని ప్రజలు తమ తమ కోరికలను దీర్చుకొనుటకై అన్నమాచార్యు నొత్తిడి చేయసాగిరట. వారి దీనతకు అన్నమాచార్యుఁడే యిట్లు చింతించెను.

"మగఁడు విడిచినా మాను విడువని యట్లు
నగినా మనసు రోసినా లోకులు మానరు
తగిలేరు పొగిలేరు దైన్యమే చూపేరు
మొగ మోటలను నేను మోసపోవ నోపను" అని.

స్త్రీలు వ్రతములు నోములు చేసికొనెడివారు. అప్పటి నోములలో గొంతి దామెర నోము, గౌరినోము, ముచ్చింతనోము, చిట్టిబొట్లనోము, మొలకులనోము, మోనదాగెలునోము, (12-127) ప్రశంసింపఁబడినవి.

నిజము నిరూపించుకొనుటకు "నాలికతో ముక్కంటుకొనుట. తప్పక మోముచూచి నగకుండుట, ఉమి మింగక యేడడుగులు మెట్టుట" (3-142) మున్నగుచేష్ట లానాఁటి చిన్నవారు. చేసెడివారు అట్లుచేయఁగలుగుట నిజమునకు నిరూపకమని వారి విశ్వాసము.

ఆనాఁటి ప్రజల లౌకికవిజ్ఞానమునకిది నిదర్శనము. తేనెయు నేయి., కప్పురము నిమ్మపండు., సంపగెనూనె గన్నేరులు., నేరేడుబండ్లు ద్రాలు - కలిపి నపుడు ప్రసుతత్త్వము వికటించునని తాళ్ళపాకవారు వర్ణించినారు. (12-87)

మంత్రసానులే పురుడుపోసెడివారు. 'చాలి మంత్రసానులచే జలకమా డేని' (10-234) అని అన్నమయ్య వర్ణించెను. కాళహస్తిమాహాత్మ్యమున ధూర్జటియు చెలువకు బిడ్డకుట్టువచ్చినపుడు 'పిలువరే మంత్రసాని'నని (3-26) వారి ప్రశంసను దెచ్చెను.

విజయనగర యుగమున క్రీ. శ. 1472-74లో పెద్ద కరవు వచ్చెనట.[1] ఆ కరువులో పలువురు బలియైనట్లు తెలియుచున్నది. ఆ కాలముననే కాఁబోలున తాళ్ళపాకవా రిట్లు వర్ణించినారు.

"కడు నజ్ఞానపు కరువు కాలమిదె
వెడల దొబ్బి మా వెరపు దీర్పవె" (8-19) అని.

అప్పుడు ఎండలు తీవ్రముగా కాయగా చెరువు లింకిపోయినవట. వడగాడ్పులువీచినవి.

తాళ్ళపాకవారు "గడియారము"లను ప్రశంసించినారు. చిన్నన్న రుక్మిణీ పరిణయ కథలో నాయితంబుగ 'గడియారంబు చూచి యాయత్తమున-మంగళంబ నుచు ఘనంగ వైచె జేగంట రావంబు'(అష్టమహిషి. పు. 209). అప్పుడు గడియారమును జూచి జేగంటలు కొట్టి కాలము తెలిపెడివారు కాఁబోలును. ఆ గడియారములు నీటిగడియారములో లేక యిసుకగడియారములో కాఁబోలును. ఆ నాళ్ళలో గాజుటద్దములు ప్రచారమున లేకుండెనేమో; అద్దములకు చిలుము పట్టుటయు, మెరుగు బెట్టుటయు, తాళ్ళపాక కవులు వర్ణించుటనుబట్టి యవి కంచుటద్దములై యుండెడివేమో అనుపించును. (చూ. 16-15) ఆ అద్దములకు గౌసెనలు తొడిగెడివారు. చూ. "అరగవిసిన యూడ్పు నద్దంబుపోలె" (అష్ట. 1-44)

ఇట్లు తాళ్ళపాకవారి వర్ణనములను బట్టి నాఁటి ప్రజల వేష భాషాదికమునే గాక సూక్ష్మములగు విషయముల వింక నెన్నిటినో గుర్తింపనగుచున్నది.

## వ్యవసాయము :

నాఁడు ప్రజలలో ముఖ్యవృత్తి వ్యవసాయముగ నుండెడిది. తిరుమల తిరుపతి ప్రాంతయులలో వ్యవసాయాభివృద్ధికి జరిగిన ప్రయత్నములను గూర్చి యప్పటి శాసనము లెన్నియో విశేషములను వెల్లడించుచున్నవి. పలువురు

---

1 చూ. శ్రీ బి. వెంకోబరావుగారి వ్యాసయోగి చరిత పీఠిక, పు.C X IV

పూదోటలను (నందనవనములను) బెంచి స్వామికి పుష్పకైంకర్యమును గావించు చుండిరి. అనంతాళ్వారు లట్లే పూదోటలను బెంచి పుష్పకైంకర్యములొనరించి ముక్తులైనారు.నాఁటి భక్తులు పలువురు పూదోటల పెంపకమునకై వలయు మూల ధనమును శ్రీ భండారమున కర్పించుచుండిరి. ఇట్లే వ్యవసాయాభివృద్ధికిని మంచి దోహదము కల్గినది. దాతలు శ్రీ భండారమునకు సమర్పించిన మూల ధనమును వెచ్చించి ఆలయాధికారులు గ్రామములలో నీటి పారుదల వసతులు గల్పించి, వ్యవసాయము నభివృద్ధి గావించెడివారు. తన్మూలమున వచ్చెడి యాదాయముతో స్వామి కైంకర్యములు నిర్వహించెడివారు. వ్యవసాయాభివృద్ధి కొరకై విజయనగర చక్రవర్తులు చెరువుల నెన్నిటినో త్రవ్వించిరి. అప్పటి శాసన చారిత్రకాధారములనుబట్టి నాఁడు వ్యవసాయమునకుండిన ప్రాధాన్య మెట్టిదో గుర్తింపనగును. కాపులే ప్రధానముగా వ్యవసాయము చేయుచుండిరి. బ్రాహ్మణ వ్యవసాయము కూడ లేకపోలేదు. తాళ్ళపాకవారు వ్యవసాయ వృత్తి మీఁద నాధారపడినవారే. వారే యిట్లు చెప్పుకొనినారు.

"కాపులము నేము నీకు కర్తవు నీవు మాకు
దాపు దండై బ్రదికించి దయ చూడవయ్యా" (2-134) అని.

"పోడు నఱకి, చేనుదున్ని, మంచివానపదనున విత్తి, కలుపు దవ్వి. వెలుగువెట్టి యెరువులు వేసి, పంటలు పండించి" అందిన పంటల ననుభవించెడి వారు (9-70). పెదతిరుమలాచార్యుఁడు వేంకటేశ్వర వచనములలో నిట్లు చెప్పు కొనినాడు. 'నేఁజేయుచున్న కృషి గోరక్షణ, వాణిజ్యాదులు, నీ లీల కుపయోగంబుగావునన నిన్ని నీ పూజలే'(వచనము 19),"పరాత్పరుఁడే క్షేత్రజ్ఞుఁడనియు జీవులే యాతని కమతీ లనియు'-(వచన-69) మరియొక వచనమున చెప్పు కొనెను. తాళ్ళపాకవారు స్వార్థమున గాకున్నను, పారమార్థిక దృష్టితో వ్యవసాయము, పశుపోషణము, వాణిజ్యము, చేయుచు స్వామి కైంకర్యములు చేయుచుండిరి కాఁబోలును. 'ఏత మెత్తునపుడు పాటలు పాడుకొనుటనుగూడ ప్రశంసించినారు.

## వర్తక వ్యాపారములు :

ఆ నాళ్ళలో దేశీయ అంతర్దేశీయ వర్తక వ్యాపారములు సాగుచుండినవి.

తాళ్ళపాకవారి కృతులలో నౌకలను, వర్తకమును, వ్యాపార విధానములను సూచించు నంశములున్నవి. వారు జీవితము నోడతోఁ బోల్చి,

> "కాంతలమాన మనే కరపట్నాల దిగె
> మంతనాన జీవుఁడనే మరకాఁడు". (9-99)

అను కీర్తనమున నోడపై సరకులను వేసికొని మరకాఁడు దరిచేరుటను గూర్చియు, తుఫాను గాలులు వీవఁగా తెరచాపలెత్తి అడిబరువుగ సరకు నింపుకొని జాగ్రత్తగా నోడను నడుపుకొను టను గూర్చియు వివరించినాఁడు. కరపట్నములు రేవుపట్టణములే, పరదేశి వ్యాపారమును గూర్చియు, పరదేశిసెట్లను గూర్చియు చిన్నన్న వివరించెను. (చూ. పరకాలుని కథ - పరమ - 6, 7 ఆశ్వాసములు). పరకాలుఁడు సముద్ర తీరమునందలి యడవులలో దాగియుండి కరపట్టణములలో సరకులను దించుకొని వర్తకులు లోదేశమునకు వానిని గొంపోవునప్పుడు దారికాచి వారి తెరువడ్డగించి గద్దించి ధైర్యంబు తెరలంగ గొట్టి చేతిని నాచికొనుచు, సందినఁ బెల్లఁ బట్టుకొని పోయెడివాఁడట (పు. 4-8) పరదేశి వ్యాపారమును జేయు "సెట్లు"

> "అరుదైన నగరంబు లందు వెండియును
> పరదేశముల సెట్ల పగిది దిండుగను
> బెల్లు చుట్టిన పెదపెద ముడాసులును
> డొల్లుబొంగులును నీటుగ బొందుపఱచి
> పొడిగల్లు నసిపల భుజములఁ బూని
> వదలుగా రెంటెముల్ వలెవాటువైచి" (పు. 408)

యుండెడి వారు.

ఆ నాఁటి విదేశవర్తకమును గూర్చి పాశ్చాత్య యాత్రికులు ఘనముగా వ్రాసియున్నారు. (చూ. ఆంధ్రుల సాంఘిక చరిత్ర పు. 203, 204) చిన్నన్న యిట్లు చిత్రించెను. "కొంకక జీని పైగో వరకొంగు, లంక యయోధ్య మల్గాకా యీడము మొదలైన దీవులు మునుకొనివచ్చి - యదన బేహారంబు లాడంగ జూచి మంచి రత్నములు, హేమములున్న యట్టి సంచులుచూచి–"(పు. 408), పైని పేర్కొన్న దేశములలో గొన్నిటిని శ్రీ సురవరంవారు గుర్తించినారు. చీని-చైనా, అనియు, పైగోవరకొంగులు పెగూ, అరకాన్ లనియు వారు గుర్తించిరి. లంక-సింహళము, మలాకా మలయా లోనిది. ఈడాము "ఆ ప్రాంతముల దేమో?

లేక యానాం, అయి యుండునో" అని సందేహము వెలిబుచ్చిరి. (చూ. ఆం. సా. చ. పు. 210).

వీనిలో పైగో రంగూన్ సమీపమున గల పెగూ కాని, లేక సుమత్రా దీవులకు పశ్చిమ తీరమున గల 'పైగా' దీవులు కాని కాదగుననుకొందును. అయోధ్యను శ్రీ సురవరంవారు గుర్తిపలేదు. అది నేటి "బేంకాక్" సమీపమునగల "అయుధ్య" కాఁదగును. యీ డాము-యాడాములు తూర్పు దీవులో (అండమాన్ దీవులో?) కాక ఏడెన్ రేవును సూచించునవియో!

వైదేశికులు చేసెడి బేహార మెట్టిదో తిలకింపుఁడు. 'అటకు మిక్కిలి చేరువగు పయోరాశి- తట నమీపమున నిత్యంబు నోడలును పచ్చకప్పురము, పట్టుబట్టలును, పచ్చికస్తూరి, మేల్మి పసిడిఇట్టికలు, మణులుచంద్రానవామణులు, పటీర కణములు, మొదలుగా గల వస్తువులును నిరవొంద నెన్నికకెక్కు బేహారులు హరుల రంతుల తోరహత్తుగాఁ దెచ్చి ఆనించి బేహార మాడంగ నటకు - వాని కైచనుదెంచువారల వాని బూని బేహార మాడి పోవు వారలును" (పు. 507)

ఇక లోదేశపు వర్తకమునకై నగరములందును, గ్రామములందును దిన సంతలు, మైలసంతలు (5-178) నుండెడివి. తాళ్ళపాకవారు వర్ణించిన "సంతల" వర్ణనమిది చూడుఁడు.

"కొలది పుణ్య పాపాలె కొంగు రొక్కములు వెట్టి
వెలదెంచి బేరమాడ వేగిరమే రారో
జననాలు మరణాలు సంసార భోగములును
అనిశము భూమి మీఁద నగ్గువలు
కొనేవారు దినేవారు కూడి కూడి మూకలై
దిన సంత లెక్కెనిదే దేహులాల రారో" (8-170)

ఈ సంతలలో చింతల క్రింద నంగళ్లు పెట్టి, సంచుల నింపుకొని వర్తకులు లాభములు సంపాదించెడివారలు.

నాఁడు కోమట్లు వడ్డీ వ్యాపారమును జేయుచుండెడివారు. మూల ధనము మీఁద వారు బారువడ్డీ లెక్కల గట్టి, పత్రములు వ్రాయించుకొని, సాక్షుల సంతకములు తీయించుకొని, పూటకాపుల బెట్టించుకొని ఋణము లిచ్చుచుండెడి

వారు. (చూ. కీర్తనము 5-294) చిన్నన్న పరకాలుని కథలో ఋణ పత్రముం వ్యవహారమును చక్కగా వర్ణించియున్నాఁడు.)

ఆ నాళ్ళలో చక్కని నేత బేహారము విరివిగానుండెడిది. సాలెవారు తాళ్ళపాక వారి శిష్యులట. లక్ష్మీదేవి పుట్టింటివారు తాము అని ఆంధ్రవారును, తాము అని పద్మసాలీలును వివాదపడగా తాళ్ళపాక తిరువేంగళనాథయ్యగారు మంగతాయిని ప్రార్థనసేసి, పలువురు వినేటట్లుగా అమ్మవారిచేత తన పుట్టినింటివారు పద్మసాలెవారే యని పలికించి వాదమున వారికి జయము కల్గించిరట. తదాది పద్మసాలెవారు తాళ్ళపాకవారి శిష్యులై ప్రవర్తిల్లిరి. తాళ్ళపాకవారికి కానుకగా పది వేల వరహాలు వారు చదివించిరి. అదేకాక ప్రతివత్సరము మగ్గమునకొక అపరంజి రూక చొప్పునను, తమ కుటుంబములలో పెండ్లింతైనప్పుడెల్ల నొక్కొకరూక చొప్పునను తాళ్ళపాకవారికిఁ దాము చదివించుకొనునట్లుగ వాగ్దానము గావించుకొనినారు. ఈ విషయమును నిరూపించు శాసనమొకటి తాళ్ళపాకవారికి సంబంధించినది గలదు.[1] ఈ పద్మసాలెల వృత్తి నేతయే.

చీరలమ్మే నేతబేహారులను తాళ్ళపాకవారు వర్ణించిన తెఱఁగు గనుఁడు.

"వాడల వాడల వెంట వాఁడెవో వాఁడెవో
నీడ నుండి చీరలమ్మే నేత బేహారి॥
పంచ భూతములనెడి పలు వన్నెనూలు
చంచలపు గంజి వోసి చరినేసి
కొంచెపు కండెల నూలి గుణముల నేసి
మంచి మంచి చీరలమ్మే మారు బేహారి॥
మటుమాయములఁ దన మగువ పసిడి నీరు
చిటిపొటియలుకలజిలికించఁగా
కుటిలంపుఁ జేఁతలు కుచ్చులుగాఁ గట్టి
పటవాళి చీరలమ్మే బలు బేహారి॥

1. శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారీ శాసనమును T. T. D. Oriental Institute Annals Vol. I Part I (1940) pages 89-106 లో ప్రకటించి యున్నారు.

మచ్చిక కర్మ మనేటి మైల సంతలలోన
వెచ్చపు కర్మ ధనము విలువ చేసి
పచ్చడాలుగాఁ గుట్టి బలు వెంకటపతి
ఇచ్చకొలఁదుల నమ్మె ఇంటి బేహారి ॥" (5-177)

ఇందు చీరలనేఁత, వర్తకము-మున్నగువాని వివరములున్నవి. అమ్మవారు కట్టుకొన్న నేఁతచీరయంచు మీఁద కోలాటపు బొమ్మలు ముద్రితములై యున్న ట్లొకకీర్తనమునకలదు.

అప్పటి చేతి పృత్తులలో (బచ్చెన బొమ్మలు) లక్కపూత బొమ్మల తయారీ ప్రసిద్ధము. ఈ బచ్చెన బొమ్మలే పై పూత బొమ్మలు. అవియే లక్కపూత బొమ్మలు. చూ. "లక్కపూత కపురులు' (7-34), ఇట్లే 'చెంబు మీఁది కనకపు పూత' లనుగూడ తాళ్ళపాకవారు పేర్కొనిరి. (7-1) తిరుమల మీఁది ఆనందనిలయ విమానమునకు బంగారు పూతలు అప్పటికే పలుతూరులు పూయఁబడినవి. రాతిబొమ్మలు (శిలావిగ్రహములు), మ్రానిబొమ్మలు, (చెక్కబొమ్మలు), తోలి బొమ్మలు (తోలుతోఁ జేసిన బొమ్మలు) (5-189) నాఁడు చేయుచుండిరి. ఈ తోలు బొమ్మలను సూత్రములతో గట్టి యాడించుటకు నిర్మించెడివారు. తోలు బొమ్మలాటలను (5-105) కీలు బొమ్మలాటలను (7-273) తాళ్ళపాకవారు వర్ణించినారు పెదతిరుమలయ్య "నే నెప్పుడును నీ సూత్రంబున నాడెడు బొమ్మను" (5-19) అని చెప్పుకొనెను.

అద్దములు గాజుతోఁగాక లోహముతోఁ జేసెడివారు. "నిక్కి అద్దము తోమితే నీడ గానవచ్చును గాక - ముక్కమూకుడు దోమితే మోము గానవచ్చునా" (2-173) అని తాళ్ళపాకవారు వ్రాసినారు. మూకుళ్ళు ఇనుముతోఁ జేయునవి. అద్దాలు కంచువంటి మిశ్రలోహముతోఁ జేయఁబడునవి. విష్ణుచిత్తుల వారి కథలో చిన్నన్న పంచలోహములతోఁ (Alloy) జేయఁబడిన ఘంటలను ప్రస్తావించినాఁడు. నాఁడు కంచు రాగి విరివిగా వాడఁబడినవి. అన్నమాచార్యుల విగ్రహములు రాగిరేకులమీఁదనే ముద్రింపఁబడినవి. కొండమీఁద కృష్ణదేవరాయాదుల విగ్రహములుకూడ నా లోహముతోడనే చేయఁబడినవి. వ్రాతపనులకుఁగూడ వారు రాగినే వాడుచుండిరి. తాళ్ళపాకవారి సాహిత్యము చాలవరకు రాగిరేకులమీఁదనే గలదు. శిలాశాసనములను, రాగిశాసనములను చెక్కుటకు

వ్రాయసగాండ్రు ప్రత్యేకముగ నుండెడివారు శ్రీకృష్ణదేవరాయని వ్రాయసగాఁడు పెద్దయ్యాచారికొడుకు శ్రీపతి ప్రత్యేకముగ నుండెను.[1] తాళ్ళపాకవారు తమ సాహిత్యమును రాగిరేకులపై చెక్కించుకొనుటకు ప్రత్యేకముగ కొందరు వ్రాయస గాండ్రను నియమించుకొనిరి. వారిలో "అన్నమరాజు తిమ్మయ్య" పేరే మన కీనాఁడు తెలియవచ్చుచున్నది. లిపిలేఖనము ( Calligraphy ) గూడనొక విద్యగా నానాఁటివారు సాధించుచుండిరి. తాళ్ళపాకవారు నేలవ్రాలు, పలకవ్రాలు, గంటమువ్రాలు పేర్కొనినారు. (3-385)

**ఆటపాటలు-వేడుకలు, వినోదములు :**

వేట అప్పటి రాజపురుషుల కొక ముఖ్య వినోదముగ నుండెడిది. చిన్నన్న అష్టమహిషీ కల్యాణమున ప్రసేనుని వేటను విపులముగ వర్ణించెను.
(పు. 216-219)

"బాగైన యపరంజి పట్టెడల్నిగుడ
సాగి గుజ్జను గాఁగ జాగిలంబులును
గిరి గొన్నకైదు కక్కెరలఁ గొక్కెరల
జరగనీయక పట్టఁ జాలుడేగలును-
...తోచి గాడులును, సాళ్వములు
పెనుబండి పులులు, వెంటదీసికొని-
సిలకట్టియలు గొప్ప జేవడంబులును
సిలకట్టియలు పెక్కు చిక్కుల వలలు
పెనువిండ్లు సగము జాబిల్లియమ్ములును
ఘనము లౌకత్తులు కడిది తిత్తులును
బూని వేటరులు గబ్బులుమీరి కదల
యేనాదులకు మున్నె యేగె నా రాజు"

ఆ వేటలో పందులనేసి, పట్టెడ లెడలించి కుక్కల నుసి గొల్పుటయు, నవి పోయి వానిసె గొని వచ్చుటయు, డేగలు, సాళువంబులు మున్నగు వాని చేత నిట్టి పని గొనుటయు విపులముగా చిన్నన్న వివరించెను. తాళ్ళపాకవారి కీర్తనము

1. చూ. తి. తి. దే. శా. సం. 3-80.

(9-6) నందుకూడ వేటకు వలయు సాధనములు 'గాలపు చిలుకులు, వెలి తెరలు, మోహన ఘంటలు మచ్చులు, కట్టువగట్లు,' మున్నగునవి వర్ణితములైనవి.

ఇక పల్లె సీమల యందలి ప్రజల వినోదములను, బాలకుల క్రీడలను తాళ్ళపాకవారు విపులముగ వర్ణించిరి. నాడు బొమ్మలాట వారు ప్రజలకు వినోదము గల్పించుచుండిరి. (2-74) గడాటలు, పాములవాని యాటలు, తోలు బొమ్మలాటలు, కీలుబొమ్మలాటలు కూడ వారి కీర్తనములందు ప్రస్తావింపఁబడినవి.

"గడాటాడెవానిఁగంటె కన్న వారికి వేడుక
అడుగిడుగు ప్రయాస మటు వానికి
పాముల వానిఁగంటె పడుచుల కానందము
వోముచుఁ బ్రాణముకట్టు కుండు నాతఁడు" (2-294)

ఇందు బొమ్మరుల, పాముల వాండ్ల వేడుకలు గుర్తింపఁబడినవి.

తోలు బొమ్మలాటను వర్ణించిన తెలుఁగు గనుఁడు :

"ఆట వారి గూడి తౌరా
ఆటవారి గూడి అన్ని చోట్ల బొమ్మ
లాట లాడించ నధికుండ వైతివి॥
గురుతరమగు పెద్ద కొట్టాము లోపల
తిరమైన పెను మాయఁ దెర గట్టి
అరయ సుజ్ఞానములవి యద్దముఁ జేసి
పరగ సుజ్ఞాన దీపములు ముట్టించి॥
తోలు బొమ్మల దొరకొని గడియించి
గాలిచేత వాని గదలించి
తూలేటి రసములు తొమ్మిది గడియించి
నాలుగు ముఖముల నలువున నాడించ ॥" (5-105)

ఈ తోలుబొమ్మలే కీలుబొమ్మలు కాఁదగును. "ఆవటించి కీలు బొమ్మ అచేతనమై యుండినా - ఆవేళ సూత్రధారుఁడాడించు గదవయ్యా" (7-273) అని వారే వేరొక కీర్తనమున వాని ప్రస్తావనను గూడఁ దెచ్చిరి ఇట్లే ఇంద్ర

జాల విద్యలను, బహురూపవిద్యలను, నాటకాలను, కనుకట్టు విద్యలను, బారి విద్యలను, కోపుల నాటలను తాళ్ళపాకవారు పేర్కొనినారు (10–190). ఇట్టి వృత్తులవారు ప్రజల కొరకై ప్రదర్శించు వినోదముల మీఁద నా నాఁడుకొన్ని సుంకములు (entertainment tax) ఉండెడివి.[1] పైని ప్రస్తుతములైన నాటకాలు తోలుబొమ్మల నాటకములే కాఁబోలును. ఏలన-చూ-కీర్తనము "నాటక మాడించినతఁడు నయమునఁ గదలింపఁగా నాటకమందలి బొమ్మలు నానాగతిఁ జెలగున్" (16-17). గాలిపటముల యాటను పెద తిరుమలయ్య 'శృంగార దండకము'న (పు. 90) ప్రస్తావించెను.

ఈ యాటలేకాక తాళ్లపాకవారు బాలురయు, బాలికలయు నాట లొకకొన్ని వివరించిరి. చూ. కీర్తనము.

"కొల్చిన బొడ్డు దమ్మిని గుంత పోకలాడెనట-వామన గుంటలు.
రచ్చనా చన్నులు బొమ్మరాలు తానాడేనంట-బొంగరాలాట.
ఆరసి నా పేరు దిద్ది ఆడె చక్రపు బిళ్ళంట-గిల్లిదండె.
గరిమం దొడలు మొట్టి కంబాలాట లాడెనంట-నాలుగు స్తంభాలాట
అల నా కౌఁగిట నప్పలప్ప లాడెనంట-అప్పాలాట.[2]
అలమి శ్రీ వేంకటేశుఁ డాలిమగ నాటలంట-పెండ్లియాట.

ఇట్లే రేపల్లెలోని బాలకృష్ణుని ఆలరియాటలను వర్ణించుచు తాళ్ళపాకవారు బొమ్మపెండ్లి–గురుగులయాటలను (4-63) బేర్కొనిరి. మాడుపూరి చెన్న కేశవస్వామి యాడిన యాటలను వివరించుచుఁ "బిల్లదీపులు, రాసక్రీడలు, చెట్టాపట్టాలు, దాగిలిముచ్చులు, బండివిరిచాటలు (8-179) వారు ప్రస్తావించిరి. ఇట్లే ఉద్దగిరి కృష్ణుని బాల్యక్రీడలను వర్ణించుచుఁ "బిల్లగోట్లాట, పుట్ట చెండ్లాట సముద్రబిల్లలాట, సిరిసింగనవత్తి, ఉద్ద గచ్చనకాయలాట," మున్నగు నాటలను వివరించిరి. ఆ యుగమున సమకాలపుకవులు పలువు రిట్టిబాల్యక్రీడలను వర్ణించినవారు కలరు. కాళహస్తిమాహాత్మ్యమున తిన్ననియాటలను వర్ణించిన "చిట్లబొట్లకాయ సిరిసింగనావత్తి" (3-33) అను ధూర్జటి పద్యమును చూడఁదగును. వీనిలోఁ బెక్కు ఆటలు నేఁడును మనకు సుపరిచితములే. సిరిసింగ

1. దొమ్మరుల వృత్తిమీఁద దొమ్మరి పన్నుండెడిది. (చూ. శాసనము 393 of 1938-39 క్రీ॥ 1536).

2. చూ. హంసవింశతి.

నావత్తియాట శ్రమోపేతము కాఁబోలును. "చెమటలుగార సిరసింగనవత్తియాడే" నని తాళ్ళపాకవారు వర్ణించినారు.

ఆ నాళ్ళలో నీ యాటలేకాక- ఉట్ల పండగ, ధనుర్మాసము, పెండ్లి తిరునాళ్ళు, తెప్పోత్సవము, రథోత్సవము మున్నగు సందర్భములలోఁ బ్రజలు చేసికొనెడి కోలహలములు కూడ వినోదప్రదములుగనే యుండెడివి. ఇట్లే దాసరి కూటములవారి భజనలు, విందులు, కోలాటాలు, మున్నగు దేశీయ నృత్యగీత విలాసములు కూడ ప్రజలకు భక్తితోపాటు విజ్ఞాన వినోదములను కూడ గల్పించుచుండినవి. ఆ నాఁటి వినోదములిట్లు చాలవరకు పరమార్థముతో ముడివైచికొని ప్రజల కుల్లాసము నుద్బోధమును గొల్పునట్టివిగా నుండినవి.

**లలిత కళలు - ప్రయోజక కళలు :**

చిన్నన్న వాస్తు శిల్పమును గూర్చియు, వాస్తుశిల్పకారులగు కాసె (ఇండ్లు కట్టెడి) వారిని గూర్చియుఁ గొంత ముచ్చటించెను. కాసెవారి వేషమిట్టిది-''పెను జన్నిదములు, చంకల శిల్పశాస్త్రముల పుస్తకములు, వంకవోఁ జుట్టిన వలువ పాగలును, గొలది రేఖలువడిఁగోసిన యట్టియెలమించి వలకేలి యినుపకమ్మలును నలవడ శిల్ప శాస్త్రాగమవేత్త" లుండెడివారు. (పరమ. పు. 452). వారు "చప్పటి కుముదంబు, చదరపానంబు. కప్పుచూరులు, కంబకాళ్ళు పద్మకము, నొగి మహాజగతియు నుపజగతియును, దగిన గట్టను, గపోతము, సంతనమును (పు. 453) మొదలైన తమ పనులు చేయుచుండెడివారు. సౌధ శిఖరములందు చిత్ర గతిని సూత్రమును నిలిపి "యేదేడు మారులు తిరమెందఁ ద్రిప్పినగాని దివియంగ' రాని విధమున నిర్మాణములు గావించెడివారు. తలుపుగడియలం దినుపబీగములు బిగింపబడి యుండెడివి. ఈ వివరములనేకాక చిన్నన్న ఆ నాఁటి వాస్తు శిల్పకారుల పనితనమును సమగ్రముగ చిత్రించెను. (చూ. పరమ. పు. 432-435) శిల్పులు "బలువు కొండలు రేకబడనింతమలచి - ఉలులునాటి పసలు మించగ సూత్రపట్టిన పగిది విసువక గసివోటు వేయు"వారట. కొందరు గూటంబు నులులుఁ జేకొని యవలీల గాటంపు కొండ లొక్కట పీఠ్రవాలఁ జేసెడివారు. 'కప్పుల దూలముల్ కంచాలు, వలుద చవ్వటిరాలు నచ్చంబు జోదియలు, కదరికాద్వారశాఖలు, కొణంగెలును, మొదలైన సంపాదములు చిత్రగతుల పనివాండ్రు బడియల బూని'' బండ్లమీఁది కెత్తించెడివారు. ఆరీతిఁ దోవసియట్టి దూలములు చేరి మూకలు గట్టి చిట్టెలు గట్టి

యెగదిగరవముల హేలల్లయనుచు-మోచి యరుదెంచి-ధర జలాంతముశిలాంతముగ శోధించి- వరుసలోపల గుండ్ర వక్త్రింబుసేసి, యిసుము జల్లియు వైచి యెనయ గట్టించి, వసిబారి మాకున వడిఁ గూరుకొనుచుఁ జప్పటిగావించి, చదుర పానంబు నొప్పుగావించి, పై నొక్కొక్క రాయి వరుస నిల్పుచు – రసవర్గంబుతోడ బెరయించి యిట్టికె పెట్ట జల్లియును - బొక్కలో సందు సందులను బెండక్ వేయువారు - పొందికలగు రాయి పొందించి - సూత్రంతబులు నాయశుద్ధులు నెఱిగి - చిత్రంబుగాఁ బనిచేయించువారు" నగుచుండినట్లు చిన్నన్న వర్ణించెను. ఇందు శిల్పకారవిద్య పారిభాషికముగా వర్ణితమైనది. పెక్కు పదముల కింపు సాంకేతిక మగు నర్థము తెలియవచ్చుట లేదు.

ఇట్లే చిన్నన్న ఉషా పరిణయమున చిత్ర రచనను గూర్చి కూడ చాల విపులముగ రచించెను. నన్నిచోడకవి తరువాత చిత్రరచనావిధానమును గూర్చి యింత వివరముగా వ్రాసిన కవి చిన్నన్నయే యని చెప్పవలెను.

"కొలఁదిగా వన్నియల్ గూర్చి బంగారు
చిప్పల లోనుంచి చెలువొందుచున్న
కొప్పున ముంగురుల్ గూడ దువ్వుచును
డాకేలు వజ్ర పట్టంబుపై నూది
తూకొని వలకేల తూలిక దాల్చి......
వంచి ముఖ్యము దోయ వలనొప్ప చిప్ప
యంచున దీడి చయ్యన దిట్ట వెట్టి
రూపరేఖలు వ్రాసి రుచిర భావములు
దీపింప నొరపులు దీర్చె నూహింప
తూలిక వన్నియందోచి యొక్కటికి
లీల వన్నువ లిడ లేమ కే లెత్తి
చూపులు, మెయికాంతి సొంపు లే నవ్వు
ప్రాపైన కెమ్మోవి పవడంపు చాయ
మరకత తాటంక మహనీయ రుచులు
వరుస నచ్చటి పంచవర్ణంబులగుచు"

నిండగా - చయ్యన చిత్రరేఖ చరాచరము ప్రాచుర్యముగ చిత్రపటముపై లిఖించెను. పై పారిభాషికపదముల నన్నిటిని నన్నిచోడఁడును ప్రయోగించి

యున్నాఁడు. ఇట్టి చిత్రములను పలకలమీఁదనే కాక గోడలమీఁదను చిత్రించెడి వారు. "గోడలేని పెనుచిత్రము" (7-1) లని తాళ్ళపాకవారు పెను చిత్రరచనకు గోడ లెట్లు ఆధారము లగునో సూచించినారు.

తాళ్ళపాకవారు "తెరనాటకము"ల ప్రసక్తిని గూడఁ దెచ్చియున్నారు. "ఒకటితరువాత వేరొకటై కాచుకుండు చక్కఁ దెరనాటకము సంగతి సంసారము" (8-111) అని వారి కీర్తన యున్నది. ఆ దినములలో తెరనాటకము లాడుటకు విజయనగరమున ప్రత్యేకముగ "నాటకశాల"లుండెడివి. సాళువ నరసింహ, శ్రీకృష్ణదేవరాయాదులు సంగీత, నాట్య, నాటక కళల ప్రదర్శనమునకై ప్రత్యేకములగు మందిరములను నిర్మించియుండినట్లు చారిత్రకాధారములను బట్టి తెలిసిన విషయమే.

"వాలుక చూపులు వాడంగ నాటక
శాలలోన నిను జవరాలు
చాలగ మురియుచు సరగున జివుకున
కాల జిమ్మినను కలగితి విపుడు" (3-392)

అని తాళ్ళపాకవారు నాఁటి నాటకశాలలోని నాట్యభంగిమలను ప్రదర్శించినారు.

ఈ విధమున సమకాలిక రాజకీయ, మత, సాంఘిక విషయములనుగూర్చి సమగ్రముగ తెలియుటలో విజయనగరయుగమున తాళ్ళపాకవారి వాఙ్మయము వెల గట్టఁజాలని విలువగల సామగ్రి నందించుచున్నది.

# సింహావలోకనము

ఆంధ్ర సాహిత్య నందనోద్యానమున తాళ్లపాకవారి దొకసుందర బృందావనము. అందలి సాహితీప్రక్రియానికుంజ పుంజముల సొంపున, సరస కవితాశాఖాశైత్యంపుమంపున, మధుర భక్తిరసప్రవాహముల ముంపున, మనోజ్ఞ రసభావభావనాకుసుమ సౌరభముల గుబాళింపున శ్రీ దేవీ శ్రీనివాసుల ప్రణయలీలావిలాసములే క్రమములై కనులకింపును గూర్చినవి వీనులకు విందొన గూర్చినవి.

ఆంధ్రకావ్య పథమున భారతకవిత్రయము వారెట్లో మన పదకవితా మార్గమున తాళ్ళపాక పద కవిత్రయము నట్లే. అన్నమాచార్య, పెదతిరుమలాచార్య, చిన తిరుమలాచార్యులు—మువ్వురే మన పదకవిత్రయమువారు. బహుళాంధ్రోక్తిమయప్రపంచమున ఆ భారతకవిత్రయమువారి ప్రాగల్భ్యము వలెనే మధురకవితాప్రపంచమున మన తాళ్ళపాకపదకవిత్రయమువారి ప్రాశస్త్యము నున్నది.

ద్విపదకవి చిన్నన్న చెప్పిన సాక్ష్యమునుబట్టి పదకవితాపితామహుడగు అన్నమాచార్యుడు తానొక్కడే తన పదునారవయేట నుండి తుదిదాక, దినమున కొక్కటికేని తక్కువ గాకుండ, "సారసనేత్రుపై సంకీర్తనసలు సరసత్వమున దాసముఖముల్గాగ పరమతంత్రములు ముప్పదిరెండువేలు" పైపడి చెప్పినట్లు దెలియు చున్నది. అట్లే ఆయన కుమారుడును, మనుమడును గూడ తమ పదునారవ యేటనుండే సంకీర్తన రచన ప్రారంభించినట్లు భావింపనగు చున్నది. అనగా వారును విడి విడిగా పదకవితాపితామహుని వలెనే ముప్పది వేలకు పైబడియో లేక నించుక తక్కువగనో పదములు చెప్పియుందురనుటలో సందేహము లేదు. ఆ పదములన్నియు దమ జీవిత కాలముననే- అనగా క్రీ॥ 1525-1545 సంవత్సరములనడుమనే రాగిరేకులమీద జెక్కబడినవి. ద్రావిడ దేశమునందలి వైష్ణవాలయములలో సంకీర్తనవాఙ్పూజలు జరగుటయు. నేల నాలుగు చెఱగుల నవి ప్రచారము నందుటయు గూడ జరిగినవి. కాని కాలపురుషుని రూక్షవీక్షణమున ఆ రేకులలో కరగినవి కరగిపోగా, చెరిగినవి చెరిగిపోగా

ఒక కొన్నిమాత్రమే నేఁటికి మిగిలియున్నవి. ఆనాటి పాట సంప్రదాయమును నేఁటికి చాల భాగము లుప్తమై పోయినది. తిరుపతిలోస్వరశిలాశాసన ఫలకములలో కొంతయు, సంగీత సంప్రదాయ ప్రదర్శనిలో నొకింతయు, భజనపరుల గోష్ఠులలో నొక కొంతయు, వైష్ణవాలయములలో మఱి కొంతయు, లేశమాత్రమే నిలచియు న్నది. సుబ్బరామదీక్షితులవారు తమసంగీతసంప్రదాయప్రదర్శనలో వీరి సంగీత వైభవమును గూర్చి స్మరించుట జరుగకపోయి యుండినను, తిరుపతి దేవస్థానమువారు రాగిరేకులను భద్రపరుచుటయో లేక ముద్రించుటయో చేయకపోయి యుండినను, పితృపాదులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్న మాచార్యచరిత్రద్విపదను వెలికిదీసి అమూల్యమైన పీఠికతో ప్రకటించి, వారిజీవిత రచనలపై వెలుగు ప్రసరింపజేసి యుండకపోయినను, సంగీత సాహిత్యపరిపుష్టులని కీర్తింపఁబడిన శ్రీ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారు దానికి జీవము పోయకపోయియుండినను మనకా వారసత్వ మీమాత్ర మేని గుర్తింప వీలయ్యేడిది కాదేమో!

ఏమైతేనేమి- ఆసంగీత సంప్రదాయనిధి చాలవరకు లుప్తమై పోయినను ఉన్న కొలదిపాటియేని ఎక్కడున్నదో, ఎంతయున్నదో, దానిరూపురేఖ లెట్టివో మనకీనాడు తెలిసిన విషయమే. దానిని పరిశీలించి పరిరక్షించుకొనుట నేటి మన కర్తవ్యము.

వీరి అన్నివేల పదములలోను మనకీనాడు దొరికినవన్నియు వెరసి పదునారువేలకన్న నధికముగా లేవు అనఁగా వీరి గేయకృతులలో మనకిపుడు లభించినవి యేపాతిక శాతమో మాత్రమేనన్నమాట. అయినను అవియే మన పాలిటికి పెన్నిధులై యున్నవి!

ఈపదకవిత్రయములోని భక్తియే తరువాత రామదాసాదుల భజన సంప్రదాయమునకును, శృంగారమే క్షేత్రజ్ఞాదుల పదసంప్రదాయమునకును, గానమే త్యాగరాజాదుల స్వరరాగ రక్తి సంప్రదాయమునకును పునాదులు వేసిన వనుటలో అతిశయోక్తి లేదు. మన కర్నాటకసంగీతసంప్రదాయ పద్ధతికి లక్షణ సమన్వయ పూర్వకముగా చక్కని రూపుదిద్దినది కూడ తొలుత వీరే అనుకొనవచ్చును. కవిత్రయమున నన్నయకున్న స్థానము పదకవిత్రయమున అన్నమయ్యకున్నది. తిక్కనకున్న స్థానము పెదతిరుమలయ్యకున్నది. ఎఱ్ఱన కున్న స్థానము చినతిరుమలయ్యకున్నది.

"జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః"

# తాళ్ళపాకవారి లఘుకృతులు గల రేకుల లెక్క

| కర్త | రచనావిషయము | ముద్రణము | సంవత్సరము | లభించిన రేకులు | వివరణము |
|---|---|---|---|---|---|
| అన్నమయ్య | శృంగారమంజరి | సంపుటము-1 | 1935 | 5 | |
| పెదతిరుమలయ్య | నీతిసీసశతకము | ,, | ,, | 10 | తాళ్ళపాకవారి లఘుకృతులు గల రేకులలో కొన్ని కానవచ్చుట లేదని ఎపిగ్రాఫికల్ రిపోర్టులో పేర్కొనుట జరిగినది. |
| | చక్రవాళమంజరి | ,, | ,, | 2 | |
| | సుదర్శన రగడ | ,, | ,, | 1 | |
| | శృంగార దండకము | ,, | ,, | 3 | |
| | రేఫఱకార పద్యములు | ,, | ,, | 4 | సంకీర్తనల సంపుటము IVలో శ్రీ ప్రభాకరశాస్త్రిగారు తాళ్ళపాకవారి లఘుకృతులు గల రేకుల వివరణము ప్రసక్తి లేమి, నిచ్చి యుండలేదు. కాని యీ రేకులలో "కొన్ని మాత్రమే అగపడినవి" అని పేర్కొనినారు. |
| | వేంకటేశ్వరోదాహరణము | ,, | ,, | 3 | |
| | వృత్తపద్య శతకము | ,, | ,, | 7 | |
| | వైరాగ్యవచనమాలికాగీతములు | ,, | ,, | 10 | |
| చిన తిరుమలయ్య | అష్టభాషాదండకము | ,, | ,, | 3 | సంకీర్తనల సంపుటము XXII లో శ్రీ రామ సుబ్బశర్మ గారు ఇందు పేర్కొన్న 52 రేకులు ఇప్పుడున్నట్లు వివరించినారు. |
| | సంకీర్తన లక్షణము | ,, | ,, | 4 | |
| | | | | 52 | |

# ఇప్పుడు మొత్తమున్న తాళ్ళపాకవారి రేకుల లెక్క

| కర్త | రచనావిషయము | లభించిన రేకులు | మొత్తము | వివరణము |
|---|---|---|---|---|
| అన్నమయ్య | అధ్యాత్మ కీర్తనలు | 363 | | |
| | శృంగార కీర్తనలు | 1921 | 2284 | సాధారణ రేకులు |
| పెద తిరుమలయ్య | అధ్యాత్మకీర్తనలు | 76 (?) | | |
| | శృంగారకీర్తనలు | 89 (?) | 165 | ,, |
| చిన తిరుమలయ్య | అధ్యాత్మకీర్తనలు | 10 | | |
| | శృంగారకీర్తనలు | 20 | 30 | ,, |
| | | | 36 | పెద్దరేకులు (అందరివి) |
| | | | 10 | శాసనరేకులు ,, |
| | | | 119 | నిడురేకులు ,, |
| | | | 5 | ,, (తుంటలు) |
| అన్నమయ్య | లఘుకృతులు | 5 | 5 | |
| పెద తిరుమలయ్య | ,, | 40 | 40 | |
| చిన తిరుమలయ్య | ,, | 7 | 7 | |
| | | | 2701 (?) | మొత్తము |

| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) | (9) |
|---|---|---|---|---|---|---|---|---|
| పెదతిరుమలయ్య | అధ్యాత్మకీర్తనలు | 1-100 | 76 | 1,30 | 2 | | | ఱేకు 98 |
| | | | | 78-97 | 20 | | | ఉన్నట్లు — R |
| | | | | 99-100 | 2 | | | లేనట్లు — P |
| | | | | | | | | XXI సం. లో |
| | | | 76 | | 24 | | | ప్రకటింపబడలేదు - J |
| | | | | | | | | (1975) |
| పెదతిరుమలయ్య | శృంగార కీర్తనలు | 1-100 | 89 | 51-60 | 10 | XXI | 1975 | |
| | | | | 98 | 1 | | | |
| | | | 89 | | 11 | | | |
| చిన తిరుమలయ్య | అధ్యాత్మకీర్తనలు | 1-100(?) | 10 | ... | ... | XVI-1 | 1962 | |
| | | | 10 | ... | | | | |
| చిన తివమలయ్య | శృంగారకీర్తనలు | 1-100(?) | 20 | ... | ... | XVI-2 | 1962 | |
| | | | 20 | ... | ... | | | |

P — ప్రభాకరశాస్త్రిగారు

R — రామసుబ్బశర్మగారు

J — జగన్నాథరావుగారు

# తాళ్ళపాకవారి సాధారణరేకుల లెక్క

| కర్త. | రచనావిషయము. | రేకుల సంఖ్య. (వందల వరుసలో) | లభించినరేకుల సంఖ్య. | కానరాని రేకుల వివరణము. | కానరాని రేకులసంఖ్య. | ప్రకటితములైన సంపుటములు. | ప్రకటింపబడిన సంవత్సరము. | వివరణము. |
|---|---|---|---|---|---|---|---|---|
| అన్నమయ్య | ఆధ్యాత్మకీర్తనలు | 1- 100 | 83 | 51- 60<br>71- 77 | 10<br>7 | IV, V | 1947, 1950 | |
| | | 101- 200 | 90 | 121-130 | 10 | VI, VII | 1951, 1951 | |
| | | 201- 300 | 99 | 216- - | 1 | VIII, IX | 1952, 1952 | |
| | | 301- 400 | 91 | 392-400 | 9 | X, XI | 1952, 1955 | |
| | | | 363 | | 37 | | | |
| అన్నమయ్య | శృంగారకీర్తనలు | 1- 100 | 94 | 19<br>96-100 | 1<br>5 | XII | 1956 | |
| | | 101- 200 | 100 | ... | ... | XIII | 1960 | |
| | | 201- 300 | 100 | ... | ... | XIV, XV | 1961, 1961 | |
| | | 301- 400 | 100 | ... | ... | XVII | 1963 | |
| | | 401- 500 | 90 | 451-460 | 10 | XVIII | 1964 | |
| | | 501- 600 | 90 | 521-530 | 10 | XIX | 1965 | |
| | | 601- 700 | 100 | ... | ... | XX | 1970 | |
| | | 701- 800 | 99 | 706 | 1 | XXII | 1975 | |
| | | 801- 900 | 99 | 889 | 1 | | | |
| | | 901-1000 | 98 | 912, 915 | 2 | | | |
| | | 1001-1100 | 100 | ... | ... | | | |
| | | 1101-1200 | 89 | 1105<br>1151-1160 | 1<br>10 | | | |
| | | 1201-1300 | 90 | 1271-1280 | 10 | | | |
| | | 1301-1400 | 100 | .... | ... | | | |
| | | 1401-1500 | 100 | ... | ... | | | |
| | | 1501-1600 | 80 | 1521-1530<br>1581-1590 | 10<br>10 | | | |
| | | 1601-1700 | 100 | ... | ... | | | |
| | | 1701-1800 | 100 | ... | ... | | | |
| | | 1801-1900 | 100 | ... | ... | | | |
| | | 1901-2000 | 90 | 1911-1920 | 10 | | | |
| | | 2001-2100 (?) | 2 | 2003-2100(?) | 98(?) | | | |
| | | | 1921 | | 179 | | | |

## 2. తాళ్లపాక కవుల పదకవితలు

[గానవిధానము ననుసరించి]

### పదరచనలు

- **వ్యక్తి గానము**
  1. స్త్రీలు పాడునవి
  2. పురుషులు పాడునవి
- **సంవాద గానము**
  1. స్త్రీ సంవాదము
  2. పురుష సంవాదము
  3. స్త్రీ పురుష సంవాదము
- **సమూహ (బృంద) గానము**
  1. స్త్రీలు పాడునవి
  2. పురుషులు పాడునవి
  3. స్త్రీలు పురుషులు కలిసి పాడునవి
- **ప్రక్రియా గానము**
  1. స్త్రీలు పాడునవి
  2. పురుషులు పాడునవి
  3. స్త్రీలు పురుషులు కలిసి పాడునవి

## 3. తాళ్లపాక కవుల పదకవితలు

[భాషాభేదము ననుసరించి]

### పదరచనలు

- ఆంధ్రభాషా పదములు
- సంస్కృత భాషాపదములు

# 1. తాళ్లపాక కవుల పదకవితలు

[వస్తుభేదము ననుసరించి]

## సంకీర్తన పదరచనలు

- శిష్టరచనలు (భావభేదము ననుసరించి)
  - శృంగార సంకీర్తనలు (అవస్థా భేదమునుబట్టి)
    - విప్రలంభ శృంగారము
    - సంయోగశృంగారము.
      - రతి - స్థాయి
        - విభావానుభావ సంచారీభావ సామగ్రి

          స్వీయానాయిక: 1. దివ్యాదిభేదములు
          2 అవాంతరభేదములు
          3. ప్రకారాంతరభేదములు
          4. మానవతీభేదములు

          అష్టవిధ నాయికలు
          చతుర్విధ అంగనలు
          శృంగారము-ఆభాస
          విప్రలంభావస్థలు
          శృంగార సహకారిణులు –
          సఖి - దూతి
          అభినయానుకూల్యము గల పదములు
  - ఆధ్యాత్మ సంకీర్తనములు (అవస్థా భేదమునుబట్టి)
    - తాత్త్వికములు
      - ముఖ్యభక్తి
      - గౌణభక్తి
        - భక్తి - స్థాయి

          ఏకాదశాధిక భక్తిభేదములు.
          శరణాగతి
          ప్రపత్తి
          నామ సంకీర్తనములు
          స్వామివారిఅనంతకల్యాణగుణములు
          అవతారములు - అంశలు
          ఆలయోత్సవములు
          సేవలు
          పండుగలు - పబ్బములు
          కీర్తించిన వేల్పులు
    - లౌకికములు
      - రాజకీయములు
      - సాంఘికములు
        - సమకాలిక పరిస్థితులు

          వ్యక్తిగతవిషయములు
          మతవిశ్వాసములు
          ఆచారవ్యవహారములు
          నీతినియమములు
- దేశిరచనలు (వ్యవహారమునగల గేయరచనారీతి ననుసరించి)

  ఏలలు - జాజఱలు - వెన్నెల,
  చందమామ పదాలు -
  లాలి, ఉయ్యాల, డోల,
  లాల, జోల, జోజో, జేజే,
  జయజయ, విజయీభవ, సువ్వి,
  శోభన, మంగళ, వైభోగములు-
  మేలుకొలుపులు, పవళింపులు -
  కూగూగులు, నలుగులు -
  దంపుళ్లు-కొట్నాలు-గుజ్జనగూళ్లు-
  చందమామ గుటకలు-నివాళులు-
  ఆరతులు - మంగళారతులు -
  జయమంగళాలు- అల్లోనేరేళ్ళు-
  చాగు భళాలు - సాసముఖాలు-
  అవధానములు - తందానలు -
  చిత్తమా, మనసా,
  బుద్ధి సంబోధనలు -
  మొదలగునవి పలుతెఱగులు.

# ప రి శి ష్ట ము

# చరిత్ర సంప్రదాయము

## పట్టికలు

(పుటలు. 551 - 574)

# పరిశిష్టము

# తాళ్లపాక కవులనుగూర్చిన

## చరిత్ర–సంప్రదాయము

తాళ్ళపాక కవులను గూర్చిన మన యెఱుకకు తిరుపతి శాసనములును రాగిరేకులలోని వారి సంకీర్తనలును, వారి ఇతర కృతులును, ఇటీవల (1949లో) లభ్యమై ప్రకటింపబడిన అన్నమాచార్య చరిత్ర ద్విపదయు ప్రధానసాధనములు ఇక గ్రంథస్థములైన విషయములు కొన్ని, అనుశ్రుతముగ వినవచ్చుచున్న ఇతిహాసములు మరికొన్ని. ఇతర సాధనములు.

సమీక్షించి సత్యమరయు నుద్దేశ్యముతో గొన్నింటి నిట నుదాహరించు చున్నాను.

## 1. సంప్రదాయ కథనము

పుదుక్కోటలో నుండిన పుణ్యపురుషులు శ్రీ గోపాలకృష్ణభాగవతారుగారి శిష్యకోటిలో నొకరగు శ్రీ ఏ. ఎల్. కృష్ణమూర్తి (హైదరాబాదు) గారు గురు ముఖమునతాము విన్నవార్తలు వివరించుచు 1 చెప్పిన విషయములోని ముఖ్యాంశము విని కొన్ని.

1.1 : తాము అనుసరించుచున్న భజనసంప్రదాయపద్ధతి తొలుత రూపుదిద్దుకొన్నది తాళ్ళపాకలోనే – తాళ్ళపాకవారిమూలముననే.

1.2 : తాళ్ళపాకవారిలో అన్నమయ్య చిన్నమయ్య అని ఇరువురు ప్రసిద్ధులు. వీరిలో చిన్నమయ్య అనువారే భజన పద్ధతికి మూలపురుషులు.

---

1. 1974-75 సంవత్సరములలో హైదరాబాదు తిరువనంతపురము నగరములలో శ్రీగోపాలకృష్ణభాగవతారుగారిశిష్యులు నిర్వహించుభజన సమావేశములు పెక్కింట పాల్గొని వారు భక్తిశ్రద్ధలతో పోషించుచున్న సంప్రదాయమును జూచి సంతసించి తిని. అప్పుడు శ్రీకృష్ణమూర్తి, శ్రీ సంజీవిభాగవతారుగార్లను కలిసి ముచ్చటించి నపుడు వెల్లడియైన అంశములను నాడైరీలో గుర్తించుకొంటిని.

1 3 : చిన్నమయ్యకు కడుపులో శూలబాధ యుండెడిది. అది యాత్రనికి తిరుమలమీఁది యాలయమున గరుడగంభమువద్ద పొర్లుదండము వెట్టుటతో తొలఁగిపోయినది ఆతఁడు గొప్ప భక్తుఁడై సంకీర్తన రచన గావించెను.

శ్రీ గోపాలకృష్ణభాగవతారుగారి కుమారులును, తండ్రిగారివలెనే భక్తిమయ జీవితమును గడుపుచు సంప్రదాయము ననువర్తించి పోషించుచున్నవారును, పుదుక్కోటవాసియునగు శ్రీ సంజీవిభాగవతారుగారి మూలమున విశదమైన విశేషములివి.

1.4 : అన్నమయ్యగారు తనకీర్తనలలో శృంగారము నతిశయించి వర్ణించిన కారణమున అమ్మవారికి ఆగ్రహము కల్గినది. ఆ కారణమున శృంగార పదకవియగు అన్నమయ్యను అనుగ్రహించుచున్న స్వామివారియెడ నమ్మవారు పరాఙ్ముఖి యాయెను. అప్పుడు స్వామివారు అమ్మవారికి ఆ భక్తుని తన్మయ భావము నెరుక పఱచుటకై ఒక ఉపాయము పన్నిరి. అన్నమయ్య తిరుమల నధిరోహించు తరి మార్గమధ్యమున పండ్రెండడుగుల నిడివిగల పులి యొకటి అడ్డువచ్చి నిలిచినది. ఈపులి యెవరోకాదు. శ్రీనివాసుడే. శ్రీనివాసుని భక్తుడగు నన్నమయ్య తన్మయుడై యున్నకారణమున నాతనికామూర్తిలో నొక క్రూరజంతువుకాక అనుగ్రహార్థను గై కొన్న దశావతారమూర్తులే దర్శనమైనవి పరవశమున అన్నమయ.

"వీఁడె నెలకొన్నాఁడు శ్రీ వేంకటగిరిమీఁద

అడుగో కోలువైయున్నాఁడు..." అను కీర్తనను పాడిరి. ఆ భక్తుని ఆలౌకిక భావనకు, తన్మయజీవమునకు నచ్చెరువొందిన అమ్మవారు అలుకతీరి, చేరవచ్చి, భక్తుని దీవించినది.

1.5 : వంశపారంపర్యముగా తామనుసరించుచున్న భజన సంప్రదాయమున డోలోత్సవమున, పవళింపుసేవ సందర్భమున పాడునట్టి పాటలలో నధిక భాగము తాళ్ళపాకవారివే.

'శరణాగత వత్సల
'గద్దెమీఁద వేంచేసి'
'ఎంతలేదు వైభవంబు యిప్పుడు నీకు

చింతదీర పవ్వళించు శ్రీ వేంకటాద్రిరాయ'
దాచుకొన్నాఁడదుగో కాంతు డేకాంతముగ'
'నా మొఱాలకింపవే వేంకటరమణా' (రాగం- యదుకుల కాంభోజి)
'పిఁడె నెలకొన్నాఁడు శ్రీ వేంకటగిరిమీఁద'

మొదలైనవి ప్రచారములోనున్న వీరి కీర్తనములలో కొన్ని.

'దీని భావము నీకే తెలుసురా- ఓ వేంకటేశ' అను నిగూఢార్థముగల కీర్తనమొకటి కలదని కొన్ని పంక్తులుదాహరించిరి. అది వారి యేలపదమగు నని అందలి గతినిబట్టి గుర్తించితిని.

1.6: మే, నెల 23-29 తేదులలో పుదుకోట్టలో జరుగు కల్యాణోత్సవ సందర్భమున తాళ్ళపాకవారి పవళింపుపాటలు 30 సంపూర్ణముగ గానముచేయుట జరుగును. (1975 మే నెల నేనటు వెళ్ళదలఁచితినిగాని పరిస్థితు లనుకూలపడని కారణమున వెళ్ళలేకపోయితిని.)

1.7: శ్రీ గోపాలకృష్ణ భాగవతారుగారు సంప్రదాయముననుసరించి పాడునీపాటల నన్నిటిని మధురలోని ఆచార్య యస్. రామనాథన్ అను వారు స్వరసహితముగ లిఖించియున్నారు. (వానిని సేకరించి ప్రకటించుయత్నము చేయఁదగును.)

1.8: శ్రీ గోపాలకృష్ణభాగవతారుగారు ఉద్ధవవారు. ములకనాటి తెలుఁగు బ్రాహ్మణులు. తల్లి వైపువారు త్యాగరాజస్వామి వారి వంశముతోడి బాంధవ్యము గలవారు. వీరి మేనమామ వంశమువారు గొప్ప భాగవతులు. శ్రీ వేంకట కృష్ణయ్య భాగవతారుగారు శ్రీ గోపాలకృష్ణభాగవతారుగారి మేనబావ (మేనత్తకుమారుడు, అక్కగారి భర్తయు). గొప్ప భజన పరులు. వీరిపూర్వులు దాదాపు 350 సంవత్సరములకు పూర్వము గుంటూరు సీమ నుండి మేలట్టూరు చేరినట్లు వారి వంశకథనము.

## 2. గ్రంథస్థ-చారిత్రక విషయము

2.1: శ్రీ సుబ్బరామదీక్షితులవారు తమసంగీతసంప్రదాయప్రదర్శినిలో తాళపాకము చిన్నయ్యను గూర్చి యిట్లు వ్రాసిరి." ఇతడు తెలుగు బ్రాహ్మణుడు.

వేంకటాచలపతి భక్తుడు. తిరుపతిలో నుండినవాడు. వెంకటరమణ విషయమై భాగవత సంప్రదాయముగా వాడుకలో గల ఉత్సవ పద్ధతి నేర్పరిచిన పుణ్య పురుషుడు. దానిలో తోడయము, మంగళము, శరణు, హెచ్చిరిక, కీర్తనములు ధూపదీపాలంకార నైవేద్యాద్యుపచారముల కీర్తనములు. పవ్వళింపు, దివ్యనామ సంకీర్తనము, వసంతోత్సవముల కీర్తనములు, స్వామిని మేలుకొలుపుటకై కీర్తనములు, ఇవి మొదలైనవి యణగి యున్నవి. ఇవిగాక విడి కీర్తనములు గలవు. ఇతని భక్త్యతిశయము వలన మాటిమాటికి వెంకటరమణుడు ఇతనికి సాక్షాద్దర్శన మిచ్చిమాట్లాడినట్లు పెద్దలు జెప్పుచున్నారు. భజన పద్ధతికి యితడే మూల పురుషుడు. రామామాత్యులకు ముందటి వాడని జెప్పుచున్నారు. (పు.8.సం 1)

2. 2: ప్రథమాభ్యాసపుస్తకమున పుట 101 లో శంకరాభరణము- అట తాళ కీర్తన- "శ్రీహరి పాదతీర్థమె చెడని మందు" అనుదానిని సంగీత సంప్రదాయ ప్రదర్శని-అనుబంధము B పుట 57 లో కాంభోజిరాగం ఝంప తాళమున 'నా మొరాలింపవే అయ్య వేంకట రమణ' అను మరియొక కీర్తనమును తాళ్ళపాకం చిన్నయ రచనలుగా సుబ్బరామదీక్షితుల వారు వివరించిరి.

2.3: తాళ్ళపాకవారి కీర్తనము లందలి శృంగార మతిమనోజ్ఞమని మురిసి సాళ్వనరసింగరాయడు "కవులు విద్వాంసులు గాయకుల్ భూమిధవులు సామంతులు, దనుc జుట్టికొలువసంగజగురుమీద నభినవంబైన శృంగారయుత పదశ్రేణిc బాడించి" దనిసినాడట! (చూ. అన్నమా. చ. ద్విపద. 36)

"2.4: అన్నమాచార్యుని శృంగార భావనకు అమ్మవారు తొలుత నొచ్చుకొన్నట్లునుc పిదప నాదని భక్తితాత్పర్యములు నచ్చి మెచ్చుకొన్నట్లును సంప్రదాయ కథనముకదా! ఇవి యథార్థమే అనదగినట్లును, అమ్మవారిమాట ఎట్లున్నను, సమకాలమువారలు కొందరు వీరి శృంగారము నీసడించినట్లు చారిత్రిక గ్రంథస్థాధారములున్నవి!

"లక్ష్మ భక్తను తాళ్లపాకం అన్నమాచార్యర సమకాల (క్రీ: 15వ శతక) దవనెందు,అవను హాడుగళన్ను బరెదిరె[1]రువనెందు తెళిదు బరువదు.గురురాజ చరిత్ర" 13 = 74-86) దల్లి ఇవనసంబంధవాగి కెలవు వివరగళు సిగువవు.

1. శ్రీ బసవరాజుగారుదాహరించిన విషయమునకును గురురాజచరిత్ర యందలి కథనమునకును గొంత వ్యత్యాసమున్నట్లుతోచెడిని. మాసహాధ్యాపకులు శ్రీ మహంతయ్య గారి తోడ్పాటుతో గురురాజ చరిత్ర యందలి విషయము నిశ్చైరిగితిని :

ఇవనుగారలదిన్నెయంబ ఊరినవ, గురు లింగజంగమారాధక, తత్వజ్ఞాని, వేదశాస్త్ర పురాణపారంగత, పాంచాళకాయక (అక్క సాలికె) దవను. ఇవనొందుసల శివాధిక్యవన్ను స్థాపిసుత్త, క్షేత్రగళన్ను నోడ త్త, రాచ పట్టిగె బందు అల్లి అంగడిహాకి, అల్లె స్వల్పకాల విద్దు, గంగాధర నెంబ శైవ రాజనన్ను వీరశైవనన్నాగి మాడిద. ముందెహోరటాగ వైష్ణవాచార్యనాద తాళ్ళ పాక మన్నమయ్య నెంబవన తన్న ఇష్టదైవ వాద యాగంటి యీశ్వర ( వేంక టేశ్వర) నె అధిక ఇన్నొళిదదైవగళు అనిత్యయందు హాడుగళను కట్టి హాడు త్తిద్ద దన్ను కండను. ఆగ అన్నమాచార్యను లక్ష్మభక్తన, హాడుగళల్లి శృంగార విల్లదుదన్ను ప్రస్తాపిశి టీకమాడలు లక్ష్మభక్తను తన్న తాయితందెగళ శృంగారవన్ను కురితు హేళువాతను సత్పుత్రనల్ల వెందు ఉత్తరిసిదనంతె

---

"లక్ష్మభక్తుడు కంసాలి. ఆ వీరశైవుఁడు ఒక పర్యాయము శ్రీశైలమునకేగుచు గారలదిన్నెలో కమ్మరులతో వివాదమునకుదిగి కాల్చిన యినుమును మూటగట్టి భుజాన వేసికొని మహిమను ప్రదర్శించెను. రాచవట్టిగలోని వణిక్ శ్రేష్ఠులతో చర్చకుదిగి తన శక్తి నెరిగించెను. విల్లూరునందు గవిలింగమునకు నైవేద్యమొసగి శివభక్తులకు తన మహిమను చూపెను. శైవుఁడగు గంగాధరుఁ డనురాజును వీరశైవునిగా మార్చి వాని శరీరమునుండి ప్రణవనాదమును వినిపింపజేసెను. పిదప నొకతావున తాళ్ళపాక అన్నమయ్యను, మఱికొందరు వైష్ణవులను చూచుట తటస్థించెను. తన గురువగు యాగంటీశ్వరుఁడే అత్యధికుఁడనియు నితర దైవము లనిత్యులనియు లక్ష్మప్ప సుందర గీతములను చెప్పుచుండఁగా, పన్నగారిధ్వజాచార్యుఁడగు తాళ్ళపాకన్నమయ్య శివుఁడె దైవతములందు కడువృద్ధుఁడని పొగడు లక్ష్మప్పగీతములలో సమున్నతమైన శృంగార రసము కానరాదని పలుకగా మాతాపితరుల విటశృంగారమును రచ్చకెక్కించు నాతఁడు సత్పుత్రుఁడుకాడని వెల్లడించి, తిరుపతి తిమ్మప్పనిచేతనే సత్యము పలికింతునని చెప్పి, అచ్యుతునిగుడియందట్లు శివుఁడధికుఁడని పలికించి, అచటకూడిన వైష్ణవుల కచ్చెరువు గొలిపి వారి మన్నన లందుకొనెను."

శ్రీ సం. శి. భూసనూర మఠ ఎం. ఏ. గారు గురురాజ చరిత్ర (1950) పీఠికలో 'అక్షేపిశిద వైష్ణవాచార్య కన్నమయ్యనిగె' అని అన్నమయను కన్నమయ్యగా పేర్కొనుటయు, శ్రీ బసవరాజుగారు అన్నమాచార్యులే యాగంటీశ్వరుని (శ్రీ వేంక టేశ్వరుని) పేర పదములు రచించెనన్నట్లు పేర్కొనుటయు సరికాదని గురురాజ చరిత్రనుబట్టి తెలియుచున్నది.

ఆ తిరుపతియతిమ్మప్ప నింద శివాధిక్యవన్ను హేళిసిదనంతె." (చూ. శివదాస గీతాంజలి- సంపాదకరు డా॥ ఎల్. బసవరాజు. పీఠికాభాగము. హాడుగళ సాహిత్య చరిత్రలో పుట 114-115. ప్ర. 1963 మైసూరు)

ఈ లక్ష్మభక్తుఁడు శైవసంకీర్తనములు చెప్పినట్లు తెలియుచున్నది. ఏగంటి పదాలకర్తగా ప్రస్తుతుఁ డీతఁడే యగుచో వీరికిఁ గల స్పర్థను సూచించు నీ వృత్తాంతమును బట్టి తాళ్ళపాకవారు ఛాయాపహారుల నిసడించి చెప్పిన పదము వీరికే అన్వయించునేమో? (చూ. ఈ గ్రంథమునందలి పుటలు 40-42)

25: అన్నమయ్యయు, వయసున చిన్న వారైన పురందరదాసులును కలసికొని పరస్పరము సంభావించుకొనిన చారిత్రకవిషయమును చిన్నన్న అన్నమాచార్య చరిత్ర ద్విపదలో పేర్కొనెను. భక్తిమత ప్రచారమునకును కర్ణాటకసంగీతపద్ధతి రూపుదిద్దుకొనుటకును- తదుపరి దాస దాసరి కూటముల వారు గావించిన సమన్వయకృషిని గూర్చి పూర్వమే కొంత భావించితిమి. (చూ. ఇందలి పుటలు 44-51) మరియొక ఉదాహరణము:

పురందర దాసుల రచనగా ప్రసిద్ధి వడసిన, "కెరయనీరను కెరగెజల్లి అను (ఎలసారి- త్రిపుట) ప్రారంభగీతమును చదివి తాళ్ళపాకవారి 'నీవేనే రవుకాని' అను కీర్తనను చదువుఁడు.

దేశాక్షి: నీవే నేరవు గాని నిన్ను, బంధించేమునేము
దైవమా నీకంటె నీ దాసులే నేర్పరులు ॥

వట్టిభక్తి నీఁమీద వలుకు వేసి నిన్ను
బట్టితెచ్చి మదిలోన, బెట్టుకొంటిని
పుట్టెడు దులసి నీపాదములపైఁ బెట్టి
జట్టికొనిరి మోక్షము జాణలు నీదాసులు॥

నీవు నిర్మించినవె నీకే సమర్పణ సేసి
సోవల నీకృపయెల్లఁ జూరగొంటిమి
భావించొక మ్రొక్కు మ్రొక్కి భారము నీపైవేసిరి
పావనపు నీదాసులే పంతపు చతురులు॥

చెరువుల నీళ్లుదెచ్చి చేరెడు నీపై జల్లి
వరము వడసితిమి వలసినట్టు
యిరవై శ్రీ వేంకటేశ ! యిటువంటి విద్యలనే
దరిచేరి మించిరి నీదాసులేపోషకులు॥

(అన్నమా. సం. 8-49)

మలహరి-త్రిపుట

కెరయ = సరస్సు యొక్క
నీరను = నీటిని
కెరెగె = సరస్సులోనే
జల్లి = చల్లి
వరవపడెదవరంతె = వరములందిన వారివలె
కాణిరొ = కానిపించండి.
హరియ = శ్రీ హరి యొక్క
కరుణదొళ = కరుణవల్ల
ఆదభాగ్యవ = కల్గిన భాగ్యమును
హరిసమర్పణె = ఆ హరికె సమర్పణ
మాడి = చేసి
బదుకిరొ = బ్రతుకండి.
నోడిబదుకిరొ = చూచి బ్రతుకండి.

(పురందరదాసు రచన చూ. గానకళాబోధిని)

సమన్వయ దృక్పథము భజన పద్ధతిలోని జీవముగాఁ దోచుచున్నది నేటికిని భజన గోష్ఠులలో పలుభాషలలోని కీర్తనలను పలువురి రచనలను కూర్చుకొని ఒక క్రమమున పాడుచుండుట పద్ధతిగా కానవచ్చుచున్నది. ఆనాటి సమన్వయబీజమే నేటికిట్లంకురించి విస్తరిల్లినదని తలఁపవచ్చును.

2.6: సంకీర్తనలక్షణమును ఆంధ్రీకరించినవాఁడు చినతిరుమలాచార్యుఁడు.

## 3. సంప్రదాయ ప్రదర్శనము

3.1: తిరుమల తిరుపతులందు కల్యాణోత్సవములను, జయంతి ఉత్సవము (నరసింహజయంతి, ఉట్లపండుగలు ప్రఖ్యాతములు) లను ఆరభించి యినుమడింపచేసిన వారు తాళ్ళపాకవారే.

3.2: దక్షిణభారతమున ఇటు తెలుగునాడు మొదలుకొని అటు తిరువనంతపురము కొనదాకను ప్రచారమునున్న భజన కూటములవారి గోష్ఠికలాపములలో నృసింహకృష్ణ జయంతులు, ఆంజనేయోత్సవములు

రాధాకల్యాణాదులు పలుపురుభక్తుల నాకర్షించునవిగను, మన సంస్కృతిని సంగీత సాహిత్య నృత్యవిశేషములను ఆవిష్కరించునవిగను తోచుచున్నవి. ఇచ్చట (హైదరాబాదులో) రాధాకల్యాణ కథాగానప్రదర్శనమును శ్రీ ఏ. ఎల్. కృష్ణమూర్తిగారు నిర్వహింపగను, తిరువనంతపురమున అంజనేయోత్సవమును శ్రీరామస్వామి అయ్యంగారు శ్రీకల్యాణకృష్ణన్‌గారలు నిర్వహింపగను దర్శించి యానందించితిని. (వీరందరును శ్రీ గోపాలకృష్ణభాగవతారుగారి శిష్యులే). అందు వారు జయదేవుని అష్టపదులతోపాటు తాళ్ళపాకవారికీర్తనములను కూడ నాలపించినారు. భజనగోష్ఠులలోనిట్టి కల్యాణకథా ప్రదర్శనమునకును తాళ్ళపాకవారే ఆద్యులనియు స్ఫూర్తినిచ్చినవారనియు నాకుతోచినది. తిరుమల తిరుపతులందు తాళ్ళపాకవారే కల్యాణోత్సవములారంభించి నిర్వహించిన వారనుట శాసనోక్తి. కల్యాణ కథాసంబంధము గల కీర్తనములను, మంజరులను వారెన్నో రచించిరి అన్నమయ్యగారికి తిరుమల శ్రీనివాసుడు అల్లునివరుస-నేటి భజనగోష్ఠులందలి సీతాకల్యాణ రాధాకల్యాణ శ్రీనివాస కల్యాణాదికథా ప్రదర్శనకును తాళ్ళపాకవారి కాలముననే బీజావాపము జరిగినట్లు తలతును.

## 4. సమన్వయము :

4. 1 : తాళ్ళపాక పదకవిత్రయమున అన్నమయ్య ఆద్యుఁడు. సుప్రసిద్ధుఁడు. ఆటుపిదప పెదతిరుమలయ్యదే ఆస్థానము. అతఁడు రెండవవాఁడగుటయు, సంకీర్తన భండారము నెలకొల్పి రేకులను జెక్కించియు, తండ్రిగారి తరువాత బహుళసంకీర్తనరచన గావించినవాఁడీతఁడే అగుటయు నందుకు హేతువులు. క్రీ. శ. 1525-45 సం.ల నడుమ రేకులను జెక్కించునాటికిని వీరిరువురే ప్రసిద్ధులు. అందుకే 'అ. చా'- తి. చా' సంకేతములు వారి రేకులలో కానవచ్చినవి. చిన తిరుమలయ్య రచనలు (క్రీ. శ. 1537 ప్రాంతములందు రేకుల కెక్కిననాటికి ఈ తిరుమలాచార్యు లిరువురి రచనలను వేర్పరచి చూపుటకు "పె. తి. చా" "చి తి. చా." సంకేతము లేర్పడినవి. చినతిరుమలాచార్యునిది రచనాబాహుళ్యమునుబట్టియు, కాలమునుబట్టియు తృతీయస్థానమగును. ఇది యొకదృష్టి.

4. 2 : మఱియొకదృష్టి - అన్నమయ్యతర్వాత అతని కుమారుఁడగు పెదతిరుమలయ్యయు, మనుమఁడగు చినతిరుమలయ్యయు బహుకాలము జీవించి సంకీర్తన ప్రచారము, మత ప్రచారము గావించినవారే. పెదతిరుమలయ్య

(క్రీ. శ. 1458-1554 ?) నిండుగా నూరేండ్లు జీవించినట్లున్నాడు. చిన తిరుమలయ్యయు (క్రీ.శ. 1489-1562 ?) దాదాపు 75 యేండ్లు జీవించెను. క్రీ. శ. 1553-54 ప్రాంతములందు పెద, చిన తిరుమలయ్యా లిరువురును చిన కంజీవరమున కొన్ని కైంకర్యములు జరపినట్లు తెలియుచున్నది.

4·3 : కనుక తాళ్ళపాకవారిలో నానాట తండ్రి-కుమారు లిరువురు ఏ దృష్టిలోనైనను, ప్రసిద్ధివహించినవారని తెలియనగును. ఒక దృష్టిలో అన్నమయ్య 'పెద్దయ్య' కాగా, కుమారుఁడగు 'పెదతిరుమలయ్య' 'చిన్నయ' కానోపును మఱియొకదృష్టిలో తిరుమలయ్య లిరువురిలో తండ్రి 'పెద్దయ్య' కాగా, కుమారుఁడు 'చిన్నయ్య' కానోపును.

4·4 : అందుకేనేమో సంప్రదాయమున అన్నమయ్య-చిన్నమయ్య అని వాడుక కలిగియుండుట. లభించిన రాగిరేకులమీఁద మూర్తులందును ఇరువురే కానవచ్చుచున్నారు.

వీరిలో 'చిన్నయ్య'యే 'చిన్నమయ్య'యే దీక్షితులవారు పేర్కొన్న 'చిన్నయ్య' కాఁదగును. అనఁగా తిరుమలాచార్యు లిరువురిలో ఒకరు కాఁదగు నన్నమాట. ఇప్పటి నాతలఁపు చిన్నతిరుమలయ్యయే 'చిన్నయ్య' అని !

## 5. చిన్నన్న-చిన్నయ్య లొకరగుదురా ?

పెదతిరుమలాచార్యుని కుమారులైదుగురిలో ద్విపదకవిగా ప్రసిద్ధివడసిన చినతిరువేంగళనాథుఁడు 'చిన్నన్న' నామకుఁడొకఁడు కలఁడుగాని పదకర్తగా నుదాహరింపఁబడిన 'చిన్నయ్య' అతడు కాఁడేమో అనిపించుచున్నది. శ్రీ ప్రభాకర శాస్త్రిగారిట్లు వ్రాసిరి. "చిన్నన్న గాయకుఁడనుటకిక్కడి రాగిరేకులందుగాని గ్రంథములలోగాని యాధారములు గానరావు. చిన్నన్నకు అన్న, తండ్రి, తాత గొప్పగాయకులుగాన యిటీవలివారు గ్రంథములను బట్టి చిన్నన్ననే యెఱిగిన వారుగాన వారియోగ్యత నీతనికి జేర్చిచెప్పి యుండవచ్చును. కాక యితఁడును గాయకుఁడేమో ("చూ. అ. చ. పీఠిక - పుట 95).

పోతే-శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారిట్లువ్రాసిరి. "చిన్నన్న సంకీర్తన రచన చేసినాఁడని నేను భావించుటకు అతని వని గాయకసంప్రదాయమున నిలచి నేటికి లభించు రెండుకృతు లాధారములని వెనుక సూచించితిని. (తాళ్ళ

పాక పాటలు ! సం. పీఠిక. పు. 2) అవి యీ శతాబ్దిలో సుబ్బరామదీక్షితులు రచించిన సంగీతసంప్రదాయప్రదర్శనియం దున్నీతములైనవి. శ్రీహరి పాదతీర్థమే చెడని మందు. 2. నా మొఱాలింపవే అయ్య వెంకటరమణా ఈ సందర్భమున తాళ్ళపాకవారి పదములు మరి రెండు నా దృష్టికందినవి. కర్తనిర్దేశములేదు. చెన్నపురి వీణ రామానుజయ్య అను పండితుఁడు 1912వ సంవత్సరమున రచించి మద్రాసులో ప్రకటించిన సంగీతసర్వార్థసారసంగ్రహమునందు ఇవి కలవు (పు. ౧౪౭) ఆపుస్తకమిపుడు దుర్లభము గనుక అ పాటలు నశించిపోకుండుటకై యుద్ధరించుచున్నాను యథామూలముగా.

1. గౌళిపంతురాగం ఆటచాపుతాళం. తాళ్ళపాక వారి పదము. "ఏరీతి బొంకేవురా నా సామి ...వేణంగిరాయా ! రారాయేటికి సిగ్గులు నాసామి" ...

2. కేదార గౌళరాగము. ఝంపెతాళము
"భామశృగారించు భావమే యందము"
కాముని రతిపాట కాంతకీలాగు ॥
పూవొకటి వికసించె పున్నమచంద్రునివలె
పూమీద మరిరెండు పూలుబూసె
రెండుపూవులనడుమ పూసెనొక పువ్వు
పూవుకింద ముప్పదిరెండు పూమొగ్గ లెత్తె"

3. 'ఎటువంటి రాజీకమే చెలియనేడు
కటకటా యెందైనకంటిరామీరు'...

(ఈ కృతులలో మొదటిది తాళ్ళపాకవారిది కాదేమో ! వేంకటేశముద్రదానికి లేదు. వేణంగినిలయుని పేరున్నది. మరి తాళ్ళపాకవారి పాటలలో గౌళిపంతు రాగము కానరాదు. తక్కినవి రెండును తాళ్ళపాకవారివి కావచ్చును).

## 6. సమాధానము

తాళ్ళపాకవారందరును గాయకులనుటకు గ్రంథస్థాధారములును శిలా కుడ్య చిత్రములును సాక్ష్యమిచ్చుచున్నవి. కాని ద్విపదకవిగా ప్రసిద్ధుఁడగు 'చిన్నన్న' పదములు చెప్పెననుటకు తిరుపతిలో ఆధారములు లేవు. ఇక దీక్షితులవారు పేర్కొనిన 'చిన్నయ' విషయమందుమా- అది 'చిన్నన్న' కు

గాక 'చిన తిరుమలాచార్యునికే అన్వయించునని నేనిపుడు తలంచుచున్నాను.

6. 1 : చిన తిరుమలయ్యయే 'చిన్నయ' అనుటకు హేతువులు 1.2., 4.4., లలో పేర్కొన్నవే.

6.2: చినతిరుమలయ్య మంగళగిరిలో సంకీర్తన 'అరుళప్పాడు'న కేర్పాటు చేసినాడు. గుంటూరుమండలముతో నాతనికి సంబంధమండినది. ద్రవిడదేశమునకు పలసివెళ్ళిన నేటి భాగవతులు పూర్వము గుంటూరుసీమకు చెందినవారే. (1.8.,)

కనుక గాయకసంప్రదాయమున చిన్నయ్యపేర నిలచిన రెండు కీర్తనము లును చిన తిరుమలయ్యవే కాదగునని నా తలపు. అయితే నేడు లభించిన చిన తిరుమలాచార్యుని కీర్తనల (16 సంపుటము) లో ఈ రెండు పాటలును కాన రావు. పోతే 'శ్రీహరిపాదతీర్థమే' అను కీర్తనము అన్నమయ్య రచనగా అ. చ. పీఠికయం (పు. 34) దుదాహృతము. పదకవిత్రయమువారి రచనలు పరస్పరము తారుమారుగా రేకులందే కానవచ్చుట మనమెరిగిన విషయమే. కనుక ఆ రెండు కీర్తనలును 16 వ సంపుటము చి॥తి॥ కీర్తనలందు కానరానంతమాత్రమున అవి అతనివి కావని తలపనవసరములేదు.

6. 3: 'శ్రీహరిపాదతీర్థమే వెదనిమందు' అనుకీర్తనను బోలినదే మాళవి రాగమున "నూరవద్దు తాగవద్దు నోరు చేదుగావద్దు చేరువ నొకచోట సంజీవి వున్నదిదవో" (16-1-54) చినతిరుమలాచార్యుని కీర్తనగలదు.

6.4 : ఇక గాయకసంప్రదాయమున నిలచినవియు శ్రీ శర్మగా రుదాహ రించినవియునగు కీర్తనలు రెండు కర్తనిర్దేశము లేకున్నను చినతిరుమలయ్య రచనలే అనిపించును. ఏలన రామాయణ భారత భాగవతకథావిషయముల నుపమించి సంకీర్తనలు రచించుటయు, సమస్యాపదములను, పొడుపుకథలను పొడుచుటయు చినతిరుమలాచార్యుని రచనలలో గానవచ్చు నంశములే.

(చూ. 16-౦-1.. 29, 43)

'కానీలేరా పొడుపుగతలు పొడవుమని
ఆనవెట్టి నన్నేల అడ్డగించేవు

పూనినాకతలు నీకుఁ బొందుగాఁ దెలియకుండే
పానిపట్టి నీవె నాబంటవయ్యేవా' (16-౨-88).
చూ. మఱియు (16-౨-117)

'భామ శృంగారించు' కీర్తనముకూడ నిట్టిదే. క్షేత్రజ్ఞాదులిట్టివి కొన్ని తర్వాతి కాలమున రచించినారు.

'ఎటువంటి రాజీకమే' అను కీర్తనము నేను 1958 లో కాపీ చేయించి తెచ్చుకొన్న తంజావూరు తాళపత్ర ప్రతిలో నానావిధపదములు (వేంకటేశ్వర పదములు) అనుగ్రంథమున తాళ్ళపాకవారి రచనగా కలదు- కాని అది శ్రీరాగం- జంపెతాళమున గలదు.

6. 5: అన్నమయ్యగారి శృంగారకీర్తనములందలి శృంగారమును గూర్చిన చర్చ సమకాలమున జరిగిన దనుటకు సాంప్రదాయికచారిత్రకాధారములు సంవదించుచున్నవి. చూ. 1.4; మరియు 2. 3., 2. 4.

## 7. చర్చాసారము

7.1 : తాళపాకం చిన్నయ - చినతిరుమలాచార్యుడే.

7.2: అతడే ఉత్సవపద్ధతికి జీవముపోసి భజనపద్ధతికిమూలపురుషుడైనాడు.

7.3 : మంగళగిరిలో సంకీర్తన అరుళప్పాడునకు కేర్పాటుచేసి కీర్తనలప్రచారమునకు పాటుపడినవాఁడితఁడే.

7.4 : మంగాపురమున కల్యాణవేంకటేశ్వరాలయమున జీర్ణోద్ధారణము గావించియు, తాతగారి (అన్నమయ్య) విగ్రహమునచట ప్రతిష్ఠించియు, జయంత్యుత్సవములను కల్యాణోత్సవములను పర్యవేక్షించి వానికిఁ ప్రచారముగల్పించియు స్వరరసహితమైన సంకీర్తన శిలాఫలకములను చెక్కించియు, సంకీర్తన లక్షణము నాంధ్రీకరించియు ఘనతవహించిన చిన తిరుమలచార్యుడే గాయకసంప్రదాయమున చిరకీర్తి నార్జించుకొన్న 'తాళపాకం చిన్నయ్య'.

7.5 : తండ్రి తాతలు పోషించిన సమన్వయ మార్గమునే చినతిరుమలాచార్యుడును పోషించెను. తాళ్ళపాకవారి దృక్పథము సమన్వయసామరస్య మార్గముల ననుగమించినది.

# ప్రసిద్ధపదానుక్రమణిక


అక్బర్‌షా 84
అచ్యుతదేవమహారాయలు -53,55
అచ్యుతయ్య - 19
అణ్ణన్ నయనార్ 505
అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి - 13, 61, 62, 544, 559, 561
అనంతయ్య-19
అన్నమాచార్య చరిత్ర - 43, 56, 208, 237, 239, 254, 274, 277, 483, 551
అన్నమాచార్యుడు - 5, 6, 35, 43, 127, 193, 202, 360
అప్పాచ్చి అణ్ణన్ అప్పు. 505
అప్పారావుగారు - విస్సా 137, 295 329, 334
అప్పు అణ్ణన్ అప్పు 505
అప్పు తిరువెంకటయ్యంగార్ 505
అభిలషితార్థచింతామణి 336·
అలమేల్మంగావిలాసము - 338
అహోబలపండితుడు - 377
ఆంధ్ర ప్రదేశ అవతరణ సంచిక-17
ఆంధ్ర శబ్దచింతామణి - 367
ఆంధ్రుల సాంఘిక చరిత్ర 485, 496, 529, 533
ఆదినారాయణ. జి - 61
ఆనందం పిళ్ళయ్యంగార్ 505
ఆనందమూర్తి వేటూరి 333, 344 391, 412, 483, 528
ఆముక్తమాల్యద - 123, 195, 415
ఆరవీటివారు 505
ఆళ్వారులు - 202
ఈయుణ్ణివారు 505
ఉదయవరు - 194
ఉదాహరణ వాఙ్మయ చరిత్ర - 7
ఉషాపరిణయము 70, 337, 339
ఎప్రిగ్రాఫికల్ రిపోర్ట్ తి. తి. దే. 235, 247, 248, 249
ఎఱ్ఱాప్రెగ్గడ-38
ఏకశిలానగర వృత్తాంతము-16
ఏగంటివారి పదములు-13
ఏగంటివారు-41
ఏలపాటలు-314, 316, 359
ఔబళయ్య - 19
కందాడై అప్పయ్యంగార్ 505
కన్నాయి జక్కుల 52
కర్ణాటదహరిదాస సాహిత్య 44
కల్యాణకృష్ణన్ 558
కవికర్ణ రసాయనము 446
కావ్యాలంకారసంగ్రహము 83

కాళహస్తి మాహాత్మ్యము 414
కిట్టెల్ కన్నడ పదకోశము
425, 426, 429, 431, 433, 434, 435, 436, 437, 438, 440, 441, 442, 443, 444, 445, 447, 452, 453, 457, 465, 467, 468, 472, 476, 477, 478, 479, 521, 522
కుమార తాతాచార్య 505
కులశేఖరరావు ఎం. 17, 24
కులశేఖరాళ్వారు 215
కృష్ణకర్ణామృతము 5
కృష్ణదేవర 37
కృష్ణదేవరాయడు 277, 488
కృష్ణమాచార్య 12, 14, 15, 16, 36, 38, 327
కృష్ణమూర్తి ఏ. ఎల్. 551
కోదండరామయ్య తిమ్మావజ్ఝల 295
క్రీడాభిరామము 444
గంగాధరయ్య 15, 555
గాన కళాబోధిని 9, 5, 57
గీతగోవిందము 5
గురురాజ చరిత్ర 554, 555
గేయము 2
గోపాలకృష్ణభాగవతారు 67, 551, 552, 553
గోపాలకృష్ణయ్య వడ్లమూడి 391
గోవిందరాజీయ వ్యాఖ్య 308
గౌరన 463
గ్రీష్మోత్సవము 55, 57
చక్రత్తాళ్వార్ 156, 157
చక్రవర్తి అప్పయ్యంగార్ 505
చాటుపద్య మణిమంజరి 88
చాళుక్య జగదేకమల్ల 336
చాళుక్య సోమేశ్వర 336
చిన తిరుమలాచార్యుడు 50, 51
చెన్నమయ్య 19
జగన్నాథరావు పి. టి. 63
జయదేవుడు 5
జిల్లా గెజిటీర్లు 311
తాళ్లపాక కవుఁకృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు 211, 213
తాళ్లపాకవారి పలుకుబళ్లు 412
తిప్పనాయకుఁడు 52
తిప్పలూరు 7
తిమ్మభూపాలుఁడు దళవాయి 364
తిరుపతి చరిత్ర 235, 270
తిరుప్పావై 262, 343, 344
తిరుమలయ్యంగార్ 505
తిరువెంకటత్తురైవర్ 505
తులసీమాహాత్మ్యము 28
తెలుఁగు జానపద గేయ సాహిత్యము 346, 360
తెలుఁగు మెఱుఁగులు 9, 430, 431
తెలుఁగు విజ్ఞాన సర్వస్వము 303
తోడయ మంగళమ్ 164, 351
తోడరమల్ల 49
ద్రవిడియన్ ఎటిమలాజికల్ డిక్షనరీ

(DED) 428, 432, 434, 462
దాసకూటము 46
దొడ్డయ్యంగార్ అప్పా 505
ధర్మదాసజియ్యన 37
నంద్యాలవారు 505
నన్నయభట్టు 367, 396
నన్నిచోడకవి 382, 472
నమ్మాళ్వారు 193, 205, 210
నరసింగరాయడు సాళ్వ 52, 129, 357, 482, 520, 554
నాగలింగ శివయోగి, హస్నాబాద్ 15, 339
నాదెళ్లవారు 505
నారద భక్తి సూత్రములు 142, 176, 192, 194, 198
నారాయణ తీర్థులవారు 513
నారాయణయ్య 19
నిబంధ కవితాపద్ధతి 40
నీతి సీస శతకము 489, 494
నీలకంఠశాస్త్రి కె. ఏ. 7
నృసింహనామములు 12, 31
నృసింహ భారతీశ్రీపాదులు 37
పంచముఖి ఆర్. యస్. 44, 45, 498, 499
పండితారాధ్య చరిత్ర 10, 413, 414
పదము 2
పదబంధ పారిజాతము 428, 441, 442, 444, 445, 446, 447, 456, 459, 460, 472
పరమయోగి విలాసము 70
పరాశ్రయ కవిత 1
పరిశోధన 8, 12, 333, 344, 412
పళ్ళిపట్టురయ్య 505
పళ్ళిభట్టర్ మలయణ్ణన్ 505
ప్రతాప చరిత్ర 16, 20
ప్రతాపరెడ్డి సురవరం 485, 496, 510, 529, 533, 534
ప్రబంధరత్నావళి 123
ప్రభాకరశాస్త్రి వేటూరి 9, 12, 13, 15, 56, 61, 62, 64, 66, 254, 277, 295, 313, 314, 324, 327, 329, 343, 345, 358, 430, 432, 434, 544, 559
ప్రసన్న వేంకటేశ్వరవిలాసము 364
పాంచాలీ పరిణయము 347
పాండురంగ మాహాత్మ్యము 457
ప్రాబోధిక స్తవము 210
పిచ్చయ్యశాస్త్రి దీపాల 405, 407, 431
పురందరదాసు 43, 44, 46, 316, 323
పెండ్లి తిరునాళ్ల 55, 254, 257
పెద తిరుమలాచార్య 56, 278, 379, 386
పోతకమూరి భాగవతులు 19, 327
ప్రౌఢవ్యాకరణము 390
బసవపురాణము 10, 11

బసవరాజు 554, 555
బాలవ్యాకరణము 371, 372, 373
బృహద్దేశి 315
బ్రౌనుపదకోశము (బ్రౌణ్యము) 373
425, 426, 430, 433, 434
437, 440, 443, 450, 451,
455, 456, 459, 463, 464,
471, 474, 475, 476, 477,
478, 479
భగవద్గీత 199
భానుదత్త 124
భూసనూరమఠ 555
భారతి 7, 407
మహంతయ్య 554
ముద్దుకుప్పాయి 53
యామునాచార్య స్తోత్రరత్నము 169
రంగ దీక్షితులు 489
రజనీకాంతరావు 3, 4, 41, 331,
513
రసమంజరి 124, 126,
రాఘవన్ 84
రామకృష్ణకవి మానవల్లి 80, 535,
రామచంద్ర తిరుమల 506,
511, 526,
రామనామ కీర్తనము 32,
రామనామములు 12, 32,
రామభూషణుడు 396,
రామరాజు బి. 346, 360,
రామలక్ష్మి ఆరుద్ర 412
రామసుబ్బశర్మ గౌరిపెద్ది 63,
రామస్వామి అయ్యంగార్ 558
రామానుజస్వామి పరవస్తు 254,
రామానుజాచార్యులు కొండ్రపేట
205,
రామామాత్యుడు బయకార 49,
రామాయణ తీర్థీయవ్యాఖ్య 308
రాయసంవారు 505
రుక్మాంగద చరిత్ర 414,
రేఫఱకారపద్యములు 379, 395,
లక్షణ శిరోమణి 325,
లక్ష్మణకవి. ఏనుగు 316,
లక్ష్మయ్య 19,
లక్ష్మయ్య గార్లపాటి 12, 40,
554, 555, 556
లక్ష్మీరంజనం ఖండవల్లి 373,
లింగకవి. పోసెట్టి 12
లీలాశుకుడు 5,
వచనసంకీర్తనములు 21
వరదన ప్రెగడ 37
వలంది 52,
వస్త్వాశ్రయ కవిత 1,
వాగ్గేయకారచరిత్ర 2, 42,
408, 513
వాగ్గేయకారుడు 2, 3,
విక్రమార్క చరిత్ర 414
విజయనగర సెక్సెంటినరీ కమ్మె
మొరేషన్ వాల్యూం 498,
విజయరాఘవాచార్య 61
విరూపాక్షరాయలు 482
వీరరాఘవాచార్య టి.కె.టి. 235,

265, 269, 271, 273,
వేంకటకృష్ణయ్య భగవాతార్ 553
వెంకటాచలమాహాత్మ్యము 349,
వేంకటేశ్వరశర్మ చిలకలపూడి 316
వెంకోబరావు 45, 531
వేంకట కృష్ణారెడ్డి దేవరపల్లి 7, 8,
వేంకటరావు, నిడుదవోలు 7, 17.
వేంకట శేషాచార్యులు, తాళ్ళపాక 67,
వెంకటార్య, రేవణూరి, 69, 258, 276, 326,
వేంకటేశ్వర వచనములు 15, 324,
వేదాంత దేశికులు 274
వైరాగ్యవచనమాలికాగీతములు 39, 65,
వ్యాసయోగి చరిత్ర 531
వ్యాసరాయలు 44, 46, 489
శబ్దరత్నాకరము - 427, 428, 429, 431, 434, 436, 437, 441, 449, 461, 463, 464, 466, 467, 468, 471, 477, 479
శరభయ్య, మల్లంపల్లి - 13, 40,
శార్ఙ్గదేవుఁడు - 2, 336.
శివదీక్షితులు 489
శుకవస్తుఅణ్ణన్ 505
శ్రీనాథుఁడు - 18, 346, 348, 414, 415
శ్రీనివాసాచార్యులు ఎ. వి 51, 62, 63, 64, 66, 67,
శ్రీపతితొన్నదయ్య 505,
శ్రీపాదరేణుమాహాత్మ్యము 69, 258
శ్రీముఖసూక్తి - 216
శ్రీరంగరాజ — విద్వత్సభారాయరంజక - 53,
శృంగార రసమంజరి - 84
సంకీర్తన అరుళప్పాడు - 56, 78,
సంకీర్తనభండారము - 54, 57,
సంకీర్తనలక్షణము - 14, 16, 50, 75, 324, 359, 367.
సంగీత చూడామణి - 336
సంగీతరత్నాకరము - 2
సంజీవి భగవతార్ 551, 552
సంతూరు - 17
సందిగ్ధపదసమీక్ష - 431, 432, 433, 438, 446, 448, 449, 452, 454, 456, 457, 458, 460, 464, 465,
సాంబమూర్తి - 71, 513
సాళువవారు - 505
సాహిత్యసమీక్ష - 405,
సిద్ధిరాజువారు 505
సిద్దయ్య, ఏగంటి - 13, 42
స్వీయానాయిక - 85, 86, 87,
సుందరశర్మ - 31,
సుగ్రీవవిజయము - 337
సుబ్బరామదీక్షితులు - 71, 553, 554
సుబ్బారావు. వంగూరి - 65
సుబ్రహ్మణ్యశాస్త్రి. సాధు - 247, 248

**సూర్యనారాయణశాస్త్రి. సన్నిధానం-** 83
సోమన, నాచన-13, 345, 414,
**సోమనాథుఁడు, పాల్కురికి -**5·10, 11, 12, 352, 354, 412, 414,
**హంసవింశతి - 539.**
**హతీరామ్‌జీ -** 60
హనుమసాని - 53
**హరిదాసకూటము - 46,**
**హిందువుల పండుగలు 506, 507,** 508, 509, 510,
క్షేత్రజ్ఞ - 132, 133, 134, 136, 140, 141,
క్షేత్రయ్య పదములు - 137.

# కొన్ని ముఖ్యసవరణలు

| తప్పు | పుట-పంక్తి | | ఒప్పు |
|---|---|---|---|
| సు ప్తిజ్గ న్తమై | 3 | 4 | సుప్తిజ న్తమై |
| పదంత్యవభ్రంశ | 3 | 15 | వదత్యవభ్రంశ |
| వేదిత్యమ్ | 3 | 26 | వేదిత్వమ్ |
| బిరాన | 28 | 7 | బీరాన |
| కృష్ణమాచారుఁడా | 29 | 5 | కృష్ణమాచార్యుఁడా |
| మహాత్మ్య | 30 | 8 | మాహాత్మ్య |
| తకధిమితక | 35 | 11 | తకధిమితకధిమి |
| ఆడవారి | 36 | 19 | అడవివారి |
| జయింతి | 37 | 25 | జయంతి |
| శపిచి | 38 | 19 | శపించి |
| కౄష్ణ | | 39 | కృష్ణ |
| రామప్రియ | 39 | 13 | రామక్రియ |
| కీ ర్తనముయి | 47 | 29 | కీ ర్తనములు |
| సిద్ధినాయక | 48 | 12 | సిద్ధివినాయక |
| పురందర దాసులవారి | 50 | 23 | తాళ్ళపాకంచిన్నయ గారి,పురందర దాసుల వారి |
| శ్రీ కృష్ణభాగవతారు | 68 | 23 | శ్రీగోపాలకృష్ణ భాగవతారు |
| సంచులెరిగి | 70 | 23 | సంచెరిగి |
| తాళ్ళపాకవారి వాగ్గేయ కారులు | 73 | | తాళ్ళపాకవాగ్గేయ కారులు |
| సంకీ ర్తన | 73 | | సంకీ ర్తనల |
| తిరుమాలాచార్యు | 74 | 17 | తిరుమలాచార్యు |
| సంకి ర్తన | 76 | 21 | సంకీ ర్తన |
| శరీరానస్థలు | 81 | 21 | శరీరావస్థలు |

| తప్పు | పుట-పంక్తి | | ఒప్పు |
|---|---|---|---|
| పంతువరాలి | 78 | 2 | పంతువరాళి |
| సామాజ్యము | 82 | 8 | సామ్రాజ్యము |
| మోహణ | 78 | 9 | మోహన |
| దివ్యశృంగార | 83 | 2 | దివ్యశృంగార |
| బిరాన | 88 | 5 | బీరాన |
| జక్కె | 91 | 7 | జంకె ? |
| లొదవని మీద | 91 | 7 | లొదవనీమీఁద |
| గర గరనీ | 91 | 8 | గర గరని |
| చూపె | 91 | 22 | చూపి? |
| తామరలనె | 94 | 6 | తామరలెనీ |
| బొట్లాడె | 94 | 22 | బోట్లాడే |
| సాక్షారించు | 95 | 8 | సాక్షాత్కరించు |
| అవసా | 95 | 15 | ఆవస్థా |
| పూనిన | 96 | 22 | పూనిన? |
| మాటలేల్లా | 97 | 17 | మాటలెల్లా |
| పెట్టోరిచే | 97 | 20 | లెట్టోరిచే |
| గొర్లెత | 103 | 6 | గొల్లెత |
| గార | 106 | 25 | గాక |
| చేతుల | 107 | 8 | చెంత? |
| వొందితి | 108 | 4 | బొందితి |
| నిద్దురెలుగదు | 110 | 17 | నిద్దురెఱుగదు |
| పూర్వా | 110 | 21 | పూర్వ |
| నేర్పు | 119 | 26 | నెప్పు |
| చేసినత | 120 | 3 | చేసిన చేత |
| అపుడు | 126 | 14 | అప్పుడు |
| తేటల | 128 | 13 | తెగువ |
| కెంపైం | 129 | 20 | కెంపై |
| జంపై | 141 | 14 | జంపె |

| తప్పు | పుట-పంక్తి | | ఒప్పు |
| --- | --- | --- | --- |
| మూడుగముల | 162 | 14 | మూడుయుగముల |
| శృంగారస | 146 | 7 | శృంగారరస |
| నారీపేర | 169 | 19 | నారపేర |
| కంచాన | 147 | 4 | కంబాన |
| పరా | 147 | 10 | పర |
| అరయ | 156 | 25 | ఆరయ |
| నీ చెయి | 160 | 8 | నీచేయి |
| కౌమోదకకీయ | 160 | 12 | కౌమోదక |
| భక్తి బ్తేదములు | 161 | 1 | భక్తి భేదములు |
| పలుపిముదల | 161 | 4 | పలువిధముల |
| దెలుపనయ్యా | 167 | 12 | దెలుపవయ్యా |
| దప్పఁదోయ | 17Z | 6 | దప్పఁదోయ |
| సరివీదను | 173 | 6 | సరివీరను |
| ఏన | 176 | 6 | యేన |
| ఉపాయా | 177 | 5 | ఉపాయి |
| బ్రహ్మ | 177 | 7 | బ్రహ్మ |
| స్వసంల్పము | 178 | 12 | సంకల్పము |
| వర్ణనము | 178 | 13 | వర్జనము |
| నిరంతపు | 179 | 9 | నిరతంపు |
| నెంచేటి | 180 | 10 | నేఁచెటి |
| కొలవుల | 180 | 13 | కోవుల |
| అంతశ్శుకిది | 180 | 20 | అంతశ్శుద్ధికిది |
| ప్రవృత్తి | 184 | 26 | ప్రపత్తి |
| తెరవు | 184 | 26 | తెరువు |
| నరస | 185 | 13 | సరస |
| ఆనుకూల్య స్వసంకల్పము | 185 | 25 | ఆనుకూల్య సంకల్పము |
| నుదుట | 196 | 3 | నుదుటు |
| భ్రాగ్యము | 186 | 9 | భాగ్యము |

| తప్పు | పుట-పంక్తి | | ఒప్పు |
|---|---|---|---|
| భాగవద | 186 | 19 | భాగవతా |
| ప్రణస్యతి | 187 | 5 | ప్రణశ్యతి |
| వెండి వెండి | 187 | 18 | వేఁడి వేఁడి |
| శవమా | 190 | 22 | వశమా |
| దేహానక | 191 | 8 | దేహనక |
| ఆడుమాటనక | 191 | 10 | ఆడుమాటలనక |
| దాన్యము | 193 | 26 | ధ్యానము |
| గురువుల్తై | 193 | 23 | గురువులై |
| బాఁపు | 197 | 13 | చాఁపు |
| నాచేత | 199 | 18 | నాచేఁత |
| రామప్రియ | 201 | 21 | రామక్రియ |
| పూని | 202 | 2 | పూని |
| ప్రాబోధకి | 211 | 23 | ప్రాబోధిక |
| వేంగటాద్రి | 212 | 19 | వేంకటాద్రి |
| మజ్జన | 213 | 4 | మజ్జన |
| నెచ్చెరి | 213 | 16 | నెచ్చెలి |
| దోసిటి | 213 | 17 | దోసిట |
| యళ్వారు | 218 | 23 | యాళ్వారు |
| నిన్నము | 214 | 7 | నన్నము |
| దాపుదండ - దాటలె | 213 | 24 | దాపుదండ - దాటవే |
| సమాన | 215 | 8 | సామాన |
| దేవునికి దేవునికీ | 227 | 2 | దేవునికి దేవికిని |
| బెనుద్దైన | 234 | 3 | బెన్నుద్దైన |
| చనవు | 239 | 12 | చవు |
| వొలయగ | 242 | 4 | వెలయగ |
| జ్యేష్ఠ | 247 | 18 | జ్యేష్ఠ |
| అవ్యభృధము | 248 | 18 | అవభృథము |
| స్మానాసన | 126 | 56 | స్నానాసన |

| తప్పు | పుట-పంక్తి | | ఒప్పు |
|---|---|---|---|
| నిటుతా | 275 | 4 | నీటితో |
| ఉగ్రనరసింహ | 281 | 15 | ఉగ్రలక్ష్మి (?) |
| తర | 284 | 10 | తీర |
| కొమకుంట్ల | 292 | 14 | కోవిలకుంట్ల |
| యైన దేయో | 292 | 17 | యైనదేమో |
| హోప్పేట | 296 | 17 | హోస్పేట |
| సర్వసము | 303 | 5 | సర్వస్వము |
| పైడిగొంఠ | 304 | 22 | పైడిగోడ |
| అవిస్థలము | 314 | 8 | అవిస్థములు |
| చూమామణి | 314 | 29 | చూడామణి |
| ద్విత్ర్యస్ర | 320 | 10 | ద్విత్ర్యస్ర |
| తాళలము | 320 | 17 | తాళము |
| గుణమెల్ల | 322 | 12 | గణమెల్ల |
| గండవరపు | 328 | 11 | గండవర |
| నడిమీ | 331 | 24 | నడిమీ |
| పేంట | 334 | 14 | పెంట? |
| పేంట | 335 | 17 | పింట ? |
| సౌమిత్ర | 338 | 5 | సౌమిత్రి |
| వయాళి | 340 | 16 | వయ్యాళి |
| సమేళి | 340 | 17 | సమ్మేళి |
| నివాళి | 340 | 19 | నీవాళి ? |
| దువాళి | 340 | 21 | దూవాళి ? |
| ముప్వేదురు | 341 | 3 | ముల్వేదురు |
| జాజ్వరరలు | 340 | 22 | జాజరలు |
| వర్ణము | 348 | 16 | వర్ణనము |
| చింలదు | 353 | 8 | చిందుల |
| యును | 3F4 | 14 | యను |
| సదావీందము | 355 | 14 | సదానందము |

| తప్పు | పుట-పంక్తి | | ఒప్పు |
|---|---|---|---|
| వ్యషి | -357 | 1 | వ్యష్టి |
| దై శైలా | 359 | 9 | దేశైలా |
| విశ్వశ్శ్రేయః | 368 | 6 | విశ్వశ్రేయః |
| వంట | 369 | 5 | వంటి |
| రూపములదు | 389 | 11 | రూపములందు |
| లజ్జకాడ | 395 | 1 | లంజకాడ? |
| వారి | 399 | 5 | వారిని |
| గొరియలల | 419 | 18 | గొరియల |
| సాలీపులాక | 425 | 7 | స్థాలీపులాక |
| పొగసు | 427 | 12 | సొగసు |
| విధనై | 427 | 19 | విధమైన |
| అతుమ | 428 | 25 | ఆతుమ |
| కిట్టెర్ | 428 | 25 | కిట్టెల్ |
| రామయణ | 435 | 20 | రామాయణ |
| Kittle | 436 | 20 | Kittel |
| తోచనట్టి | 439 | 6 | తోచునట్టి |
| గుల్ను | 445 | 14 | గుల్లు? |
| చేయించి | 449 | 9 | చేముంచి |
| సని | 449 | 24 | పని |
| కానగు | 456 | 11 | కాననగు |
| సాంగెము | 456 | 12 | పాంగెము |
| పఱచ | 457 | 4 | పఱచు? |
| వెడ్డువెట్టు | 459 | 8 | వెడ్డు వెట్ట |
| మానావతి | 466 | 12 | మానాపతి |
| సానము | 468 | 21 | స్తానము |
| కటు | 475 | 13 | కట్టు |
| యరము | 477 | 26 | యర్థము |
| సూడువటే | 479 | 7 | సూడువట్టె |





శుభమస్తు॥ శ్రీమతే రామానుజాయ నమః॥ స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబ్బు
లు ౧౩౨౪ అగునేటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించినవారు యిందు
కుతిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతే సంకీర్తనలు మొదలుగాను శాలివాహన శకవరుషంబ్బులు ౧౪౨౪
అగునేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ [illegible] నిర్యాణానకు తిరువేంగళనాథుని యందను అంకితము
గాను తాళ్ళపాక అన్నమాచార్యులు ఆధ్యాత్మ శృంగార సంకీర్తనలు॥ -శ్రీ-॥ శ్రీ వేంకటేశాయ నమః॥ శ్రీ॥
శ్రీరాగం॥ పల్లవి॥ యెవ్వారి కెవ్వారు యెక్కడి కెక్కడి నెవ్వరు మాకు దింక సేసి జన్మినాం జెప్పరా॥ ——॥
అద్దమ [illegible] తరిదాంకా నుండునిందు నుండి వచ్చి| వాడ్డువారాని పునిందువాల [illegible] సు ళ్లములు [illegible]
గండ్లపొకని సుండ్రవారము| వాడ్డికధాలోనివారము పెద్దినాం సుండ్రెతమి॥౧॥ వెంకమ్మ న[illegible]తాప వెడనం
బారిలతేకాంకవుడ్లి [illegible] ఆరిగివుకన్నుగాన లేక| యింకదడిరంగనిపని [illegible] ండ్లరుగల [illegible]
వుపులు గుకలువులంబు [illegible] వతెనా॥౨॥ అండ్లగాండతిరు వేంకటద్రి పెక్కిండ్ల| దిండ్లవైనివారతప్పక చుండన
మున్నదాయమండ్రమెత మున నితామందలాడితిమి గాక| కండ్లు వడు న్నవచాలుకలకాలమెల్లనా॥౩॥ -శ్రీ-॥
భైరవి॥ పల్లవి॥ గండ్లముపూ శివెతికమ్మని మినయియా| గండము ని చెనితాదికండ్లెనెర్కడా॥ ——॥ అడ్లదు చుట్టు చ
వెలుపుడ పుడకిని| అద్దము ని మొము కండ్లినపు చూచేమా| వాడ్లిక్తతామె రవిరిని తెత్తివు కన్నులు౯| గప్పరికం



తాళ్లపాకకివుల సాహిత్య సమీక్షలో

ప్రథమ భాగం

"తాళ్లపాకకవుల కృతులు-
వివిధ సాహితీప్రక్రియలు"

( 1974, మే - ఆనంద, వసంతము )

ముద్రణ

ద్వితీయభాగం ఇప్పుడే వెలువడింది

'తాళ్లపాకకవుల పదకవితలు-
భాషాప్రయోగ విశేషాలు"

( 1976, మే-నల, వసంతము )

శ్రీ ప్రభాకర ప్రచురణము

రచన:- డా॥ వేటూరి ఆనందమూర్తి
ఎం. ఏ., పిహెచ్. డి.,

ప్రాప్తిస్థానము:

**SRI-NIVAS**
6/2 RT. (New) Vijayanagar Colony
HYDERABAD-500028.





## వేటూరి ఆనందమూర్తి

జననం - అక్టోబర్, 28, 1930 మద్రాసులో. తిరుపతిలోను, మద్రాసులోను చదువు ప్రెసిడెన్సీ కళాశాల, మద్రాసునుండి 1953 బి.యే. ఆనర్సు ఎం. ఏ. 1955. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పి. హెచ్. డి. 1966. "విజయనగర యుగంలోని వైష్ణవాంధ్రవాఙ్మయం తాళ్లపాకకవుల సాహిత్యంపై ప్రత్యేక పరిశీలన" అన్నది పరిశోధన విషయం.

గత ఇరవై మూడేండ్లుగా అధ్యాపకవృత్తి. ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో రీడర్‌గా ఉద్యోగం. 1966-71 లో తెలుగు ఎడ్యుకేషన్ ఆఫీసరుగా మారిషస్‌లో భాషాసేవ. 1976 లో భారత ప్రభుత్వ డెప్యుటేషనుమీద తిరిగి రెండేండ్లపాటు మారిషస్‌కి ప్రయాణం.

అధ్యయనం, అధ్యాపనం అభిలాషలు.

---

Printing paper for this book has been made available by the kind courtesy of the Convenor, State level committee for distribution of paper, A.P.